# దేవుడు చేసిన అద్భుతములు

(రక్షణ, స్వస్థత, అద్భుత సాక్ష్యాలు)



శ్రీమతి గ్రేస్ విజయ



Praise and Thanksgiving for
40
Years of His abundant Grace

# దేవుడు చేసిన అద్భుతములు

(రక్షణ, స్వస్థత, అద్భుత సాక్ష్యాలు)

సేకరణ

శ్రీమతి గ్రేస్ విజయ

# INDEX

1. విగ్రహాలను పూజించే నన్ను క్రీస్తును ఆరాధించే విశ్వాసిగా ప్రభువు రక్షించారు
**– మోజేస్ చౌదరి** (హైదరాబాదు)

2. నా సాక్ష్యం మీ కోసం **– బ్రదర్ జడ్సన్ అబ్రహాం**

3. నేను రోషముగల మహమ్మదీయుడనై యుంటిని
**– సహో.పీటర్ ఇక్బాల్**

4. క్రీస్తు ప్రభువు తన సేవ చేయుటకై ప్రత్యేక ప్రణాళికతో నన్ను పిలిచారు
**– పాస్టరు నెహెమ్యా ప్రసాద్** (ఆంధ్రప్రదేశ్)

5. హానికరుడను హింసకరుడనైన నన్ను రక్షించిన క్రీస్తు స్తుతి పాత్రుడు
**– సాల్మన్ రాజు. దారా** (హైదరాబాదు)

6. సజీవుడైన క్రీస్తు సవివరంగా బోధించి నన్ను నడిపిస్తున్నారు
**– సిరాజుద్దీన్** (మచిలీపట్నము)

7. బాధపడు వారిని ఆదరించే దేవుడు యేసేనని నేను నమ్ముకున్నాను
**– శాంతమ్మ** (విశాఖపట్నము)

8. వెదకని నాకు దొరికిన దేవుడు
**– రెవ. బోలెం పాల్ రామబ్రహ్మం గారు** (విజయవాడ)

9. పబ్ నుండి ప్రభువు నొద్దకు... **– భరద్వాజ నాయుడు**

10. క్రీస్తు అందరికీ ప్రభువు. ఆయన సేవ చేయుటలో ఆనందమిచ్చారు
**– టి.పి. వరప్రసాద్ రెడ్డి** (అనంతపురము/అమెరికా)

11. బుద్ధి జ్ఞాన వాక్య సంపద వరముగా నిచ్చిన ప్రభువు నా రక్షకుడు
**– శ్రీమతి రూత్ జెర్మియ** (హైదరాబాద్/న్యూయార్క్, అమెరికా)

12. విగ్రహాలు తయారుచేయు వంశములో నుండి నన్ను ఎన్నుకొన్న నా క్రీస్తు నా రక్షకుడు **– రిబ్కా జాన్సన్** (అమెరికా)

13. క్రీస్తు సాక్షిగా నన్ను నిలిపి అనేకుల ఆత్మల పోషణార్థం జీవింపజేస్తున్న క్రీస్తుకే మహిమ. **– పెర్సిస్ సుకుమారి** (న్యూజెర్సీ /అమెరికా)

14. చావునుండి తప్పించి పరలోకము చూపిన ప్రభువు స్తోత్రార్హుడు
**– రేతా** (అమెరికా)

15. ఆశ్చర్యకార్యాలు అద్భుతాలు చేయు దేవుడు నా రక్షకుడు
**– జాన్‌వెస్లీ** (ఎడ్లపాడు)

16. క్రీస్తు జవాబు ఇచ్చే దేవుడని రక్షకునిగా స్వీకరించాను
**– జి.ఎస్. చంద్రమణి** (హైదరాబాద్/అమెరికా)

17. క్రీస్తు తన సిలువను మోయుట ఎట్లో నేర్పించారు
**– దివ్య ప్రసాద్** (చెరుకువాడ/మణుగూరు)

18. సత్యము తెలుసుకొనే ఆశగలవారికి దేవుడు దగ్గరగా వుంటాడు అని తెలుసుకొన్నాను
**– నగేష్ ఇనోష్ పాల్**

19. యేసులోనే నెమ్మది, మనశ్శాంతి లభిస్తుందని తెలుసుకొన్నాను
**– కోన అబ్రహాము** (ఉయ్యూరు)

20. అసాధ్యమైనవి సుసాధ్యము చేయగల్గి ఎంతైనా నమ్మదగిన దేవుడు నా ప్రభువు
**– స్మిత** (అమృతలూరు/ తెనాలి)

21. శ్రమల కొలిమిలో స్వర్ణకాంతులను నా ప్రభువు నాకు చూపించారు
**– శ్రీమతి గోపాళం కోటేశ్వరమ్మ** (ఎస్తేరుగారు)

22 అగ్ని శ్రమలలో పరిశుద్ధాత్మ నన్ను నడిపించుట నా భాగ్యము
**– ఆర్. పద్మామణి** (పులిమేరు/ ఈస్ట్‌గోదావరి జిల్లా)

23. క్రీసు సాక్షిగా నుండుటకు అంధుడనైన నన్ను ప్రభువు ఎన్నుకున్నారు
**– రవి శంకర్** (విశాఖపట్నం)

24. ఉన్నత విద్యాభ్యాసము ద్వారా ధన సంపాదన కన్న ఆధ్యాత్మిక అత్యవసరమని తెలుసుకున్నాను **– డాక్టరు జయశీల** (అమెరికా)

25. మాట తప్పని సజీవుడైన క్రీస్తు నా రక్షకుడు (ఎ)
**– జీవరత్నం రెడ్డి** (మియాపూర్/హైదరాబాద్)

ప్రతి వ్యక్తిని ప్రేమించుచు మేలుచేయు యేసు నా రక్షకుడు (బి)
**– దేవి రెడ్డి** (రామకృష్ణాపురము)

26. క్రీస్తే నిజదేవుడని తెలుసుకున్నాను
**– జీవరామచంద్రారెడ్డి** (కడప)

27. నటిగా రాణించిన నన్ను నమ్మదగిన క్రీస్తు నేడు నడిపిస్తున్నాడు
**– నగ్మా** (సినీనటి / మద్రాసు)

28. క్రీస్తుతో అనుబంధమే స్థిరమైనదని నా జీవితంలో తెలుసుకొన్నాను
**– సత్యవాణి** (విశాఖపట్నము)

29. స్వస్థత నిచ్చిన రక్షకున్ని సదా స్తుతిస్తున్నాను
**– సత్యవతి** (హైదరాబాద్)

30. సర్వశక్తి మంతుడగు క్రీస్తు నా కుటుంబములో అద్భుతాలు చేసారు
**– శాలిని లీజు** (కేరళ)

31. ఎంతో రక్షణనిచ్చి నన్ను నా సంతానాన్ని వింతైన తన జనముగా చేసిన క్రీస్తు వందనీయుడు **– లలిత** (హైదరాబాదు/అమెరికా)

32. స్వస్థతనిచ్చి రక్షించిన దేవుడు దర్శనము ద్వారా ప్రేమను చూపారు
**– రాజేశ్వరి** (రాజి) (అమెరికా)

33. నిరాశ నుండి నిరీక్షణలోనికి నన్ను నడిపించిన రక్షకుడు నా యేసు
**– ప్రశాంతి** (అమెరికా)

34. నమ్మదగిన నా రక్షకుడు నాకెన్నో మేలులు చేసారు
**– సోనియా** (అమెరికా)

35. ప్రత్యేక ప్రణాళిక ద్వారా నాజీవితాన్ని రక్షణ మార్గంలో నా క్రీస్తు నడిపించారు.
**– పూర్ణిమ** (అమెరికా)

36. అమెరికా జీవితంలో కష్టాలను భరించే కృపనిచ్చి దీవించారు
**– పరిమళ** (అమెరికా)

37 మరణ పాత్రుడనైయున్న నన్ను రక్షించి క్రీస్తు రాయబారిగా మార్చారు
**– సుధీర్ కొండ్రు** (విజయవాడ/అమెరికా, న్యూజెర్సీ)

38. శూన్యంలో సృష్టిని చేసిన దేవుడే నన్ను లేమినుండి లేవనెత్తాడు
**– శ్యామ్** (సత్యవేడు/చిత్తూరుజిల్లా)

39. బాధపడితే గాని బోధపడలేదు
**– నిరీక్షణపాల్** (మానిసెట్టి లక్ష్మణరావు) (కొవ్వూరు)

40. కన్నీటి లోయలో కీర్తించి పాడి ప్రభుని స్తుతించు ధన్యత నిచ్చారు
**– దయామణి** (నాగేశ్వరమ్మ) (చీరాల)

41. తరతరాలనుండి క్రీస్తే నిజరక్షకుడని తెలుసుకొని వెంబడించు ధన్యతనిచ్చారు
**– విజయమ్మ** (కాకినాడ)

42. త్రాగుబోతు ఉపాధ్యాయుని గాధ
**– సహో. శ్రీ. డి.దేవసహాయం**

----------------

# మంచి మాట - సాక్షుల పరిచయం

ప్రభుని పాదాలకు వినయంగా నమస్కరించి కృతజ్ఞతతో మరొక పుస్తకాన్ని అందించే ధన్యతకై నా ప్రభుని స్తుతిస్తున్నాను. సాక్ష్యమిచ్చెదా నా స్వామి యేసు దేవుడంచు సాక్ష్యమిచ్చెదా అని మల్లెల భక్తుడు వ్రాసిన పాట ఎంతో విలువైనది. సాక్షి అనగా కన్నది, విన్నది, యధావిధిగా నిజాన్ని ఋజువుచేయువాడు.

1యోహాను 1:1,2 "జీవ వాక్యము గూర్చినది ఆదినుండి ఏదియుండెనో, మేమేది వింటిమో, కన్నులారా చూచితిమో ఏది నిదానించి కనుగొంటిమో, మా చేతులు దేనిని తాకి చూచెనో అది మీకు తెలియజేయుచున్నాను" క్రీస్తు రొమ్ముపై ఆనుకొన్న యోహాను మాటలు అక్షర సత్యాలు. వివిధ వ్యక్తులు, వివిధ ప్రాంతాలవారు, వారి జీవిత గమనములో క్రీస్తు ప్రభోదించిన సత్యమును మీరు భూ దిగంతముల వరకు సాక్ష్యులై యుండాలన్న మంచి మాటను పాటించిన భక్తుల ఈతరం నిజ గాధలు, వివరణ ఆశీర్వాదకరం కాగలవు.

మొదటిగా యేసు శిష్యులు సాక్షులు అయ్యారు. యేసును బాగా ఎరిగినవారే యేసును గూర్చి బాగా సాక్ష్యమివ్వగలరు. ఆయన ప్రేమను రుచిచూచి ఎరిగిన వారు, క్రీస్తు ప్రేమ బలవంతం చేయగా ఆయనను నమ్మినందుకు శ్రమలనెదుర్కొన్నవారు, ఆత్మల జాలరులుగా రాణించిన వారి విశ్వాస వీరగాథలు చదువరులకు మేలుకరం కాగలవనే ఆకాంక్షతో నేనందించే వివరాలన్నీ నన్ను గొప్పగా ప్రభావితం చేసాయి. ప్రభువు మహిమార్థం ప్రతివ్యక్తి జీవితము ఆత్మీయ స్థితికి మేల్కొలుపు కావాలని నా ప్రార్ధన.

1. మొదటిగా వ్రాయబడిన మోజెస్ గారి జీవితములో బాల్యంలో దేవుని గూర్చిన సువార్త బోధించువారిని హాస్యాస్పదంగా అవమానించిన వ్యక్తిగా వ్యాధిగ్రస్తుడైన పెద్దమ్మ సాక్ష్యము ప్రభావితం చేయగా క్రీస్తునందు స్వస్థత రక్షణ పొందారు. గొప్ప సాక్షిగా సువార్త పరిచర్యలో కొనసాగుట నా భాగ్యమని తెల్పుచున్నారు.

   వీరి ఫోను : 9440456771

2. రెవ. జడ్సన్ అబ్రహాము గారు వీరి సతీమణి ప్రీతీ జడ్సన్ గారు వరంగల్లు ప్రాంతములో ఆరంభించిన సేవ దేశ విదేశాలలో కొనసాగించుట ఆంధ్రప్రజలకు సుపరిచితాలు.
3. పీటరుగారు బాల్యంలో క్రీస్తు అనుచరులను ద్వేషించి, క్రీస్తును గూర్చి తెలియని స్థితిలో వ్యర్థ జీవితం జీవించగా క్రీస్తు ప్రేమతో అతనిని స్వీకరించగా గొప్ప సాక్షిగా క్రీస్తు ప్రేమను బోధించే బోధకునిగా మతము కాదు మార్పు శ్రేష్టమని తెల్పుచున్నారు.
4. నెహెమ్యా ప్రసాద్ గారు బాల్యంలో తల్లి అచంచల విశ్వాసము ద్వారా ప్రభావితం చేయబడ్డారు. ట్రాక్టరు ప్రమాదము ద్వారా ప్రభువు సంధించి రక్షించారు. గొప్పగా క్రీస్తును ప్రేమించి వెంబడించి ఆత్మల జాలరిగా నిలిపారు.
5. సాల్మన్ రాజుగారు బాల్యంలో క్రీస్తును ఆయన ప్రేమను గ్రహించుకోలేదు. వ్యర్ధ జీవితాన్ని దేవుడు దర్శించగా శ్రమలను భరించి ఒంటరిగా దేవుని వెంబడించి పౌలువలె సాక్ష్యమిచ్చు ధైర్యము పొంది ధన్యుడిగా జీవిస్తున్నారు.

   ఫోను నెంబరు: 9440594575, 9160777471

6. సిరాజుద్దీన్ గారు క్రైస్తవ సంస్థలో చదువుకున్న ఫలితంగా క్రీస్తు సువార్తను దృఢంగా నమ్మిన అక్క విశ్వాసము తమ్ముడిని విశ్వాస జీవితానికి అంచెలంచెలుగా నడిపించింది. క్రీస్తు మెల్లని స్వరానికి లోబడి క్రీస్తు పరిచర్య భారంతో అనేకులకు ఆదర్శంగా జీవిస్తున్నారు. సెల్ నంబరు : యేసయ్య ప్రేయర్ సెల్.
7. శాంతమ్మగారు విశాఖలో ప్రార్ధనా సెల్‌లో ఘనమైన సాక్షిగా నిలుచుట కాధారమైన దీన శ్రమల గాధ కదిలించేదిగా నిలిచింది. ఎన్నో కన్నీటిలోయలలో క్రీస్తు స్వరం విన్నారు.

క్యాన్సర్ వ్యాధిని ఎదుర్కొన్నారు. మరణాలననుభవించారు. నిరీక్షణలో జీవించే ఆమె పాట, మాట గొప్ప విలువగలది.

8. పాల్ రామ బ్రహ్మంగారు – విజయవాడ గాయత్రినగర్‌లో మరనాతా సహవాసంలో పెద్దగా నిలిచి సాక్షిగానున్నారు. ఉపాధ్యాయ వృత్తిలో వ్యసనాలకు గురైనప్పుడు భార్య ప్రేమ కన్నీటి ప్రార్ధనల ద్వారా రక్షింపబడ్డారు. గొప్ప సాక్షిగా అనారోగ్యంలో స్వస్థత నిచ్చు సాక్ష్యం తెలిపారు.

9 భరధ్వాజ నాయుడు – పలువిధ పధములరసి ఫలితమేమీ కానలేక సిలువయెదుట నిలుచుట తప్పదని తెల్పు సాక్ష్యము. అసాధ్యాలను సుసాధ్యము చేస్తూ మానసిక క్షోభనుండి విడుదల చేయువాడు క్రీస్తేనని తెలుపు అద్భుత సాక్ష్యము.

10. క్రీస్తు అందరికి ప్రభువని తెలుపు వరప్రసాద్ గారి సాక్ష్యము ద్వారా దేవుని దీవెన అపారమైనదనియు ఆయన సేవ చేయుటలో గొప్ప శాంతి సంతోషాలు లభించగలవనియు తల్లి నేర్పిన భక్తిని ఆశ్రయించిన ప్రసాద్‌గారి అనుభవాలు ఆదర్శనీయాలు.

11. రూత్ జెర్మియా సిస్టరు గారి అద్భుత జీవితానుభవాలు ఆశ్చర్యం కల్గిస్తాయి. భర్త ఆకస్మిక మరణంతో ఐదుమంది బిడ్డల పెంపకంలో క్రీస్తు పిలుపునందుకొని ఆధునిక కంప్యూటరు కంటే వేగంగా బైబిలు వాక్యాలనుపయోగించి బోధించే వర్తమానాలు ఆంధ్ర, అమెరికా తెలుగు వారికి ఆత్మీయ మేల్కొలుపునిస్తున్నాయి. వీరు బెరాకా మందిరము వ్యవస్థాపకులు హైదరాబాదులో సేవచేస్తూ అమెరికాలో కుమార్తె వద్దచేరి రోజులో 5 ప్రసంగాలను ఫోనుద్వారా అందించుట విశేషము. వీరు యేసయ్య ప్రార్ధనా సెల్ ద్వారా సాక్ష్యము నందించారు.

12. రిబ్కా జానన్ గారు సెల్‌ఫోను పరిచర్య అమెరికాలో గుర్తింపు పొందింది. అబ్రహామును పిలిచిన దేవుడు విగ్రహాలు తయారుచేయు వంశంలో శాపము ద్వారా కృంగిన జీవితాన్ని మార్చి ఆత్మల జాలరిగా మార్చి భర్తతో అమెరికాలో పరిచర్యలోనున్నారు.

ఫోను నెంబరు :

13. డాక్టరు పెర్సిస్ సుకుమారి గారు (వరంగల్ /కాజీపేట) వాస్తవ్యులు. విద్యావంతులైన హెబ్రోను విశ్వాసుల గృహంలో మంచి భక్తిలో పెంపకం పొందారు. పెర్సిస్ పేరు సార్ధకమైన రీతిగా నేడు భర్త క్రిష్టోఫర్ ఇంజనీరు గారితో కుటుంబంతో సహా గొప్ప కార్యక్రమాలకు అధినేతగా కిప్స్ ఫర్ క్రీస్ట్, పెనూయేలు ప్రార్ధనా సెల్ నిర్వహిస్తూ విశ్వాసులకు ఆదర్శంగా నిలిచి సేవచేస్తున్నారు. భర్త నిర్వహించే రాత్రి ప్రార్ధనా సెల్‌కు సహకరిస్తూ న్యూ జెర్సీలో క్రీస్తుకు సాక్ష్యులుగా జీవిస్తున్నారు.

ఫోను నెంబరు :

14. రేతా జీవితములో తన బిడ్డ యాక్సిడెంట్ సమయంలో దేవుడు నేర్పిన అద్భుత పాఠాలు నమ్మలేని నిజాలు. బాబు అసహాయస్థితిలో దైవదర్శనాన్ని కాగితంలో గీచి చూపాడు. ఆ బిడ్డను సమర్పించు రీతి గొప్ప అనుభవం విలువైన ఈ సాక్ష్యం ద్వారా విశ్వాసులు ధైర్యపడగలరు.

15. జాన్ వెస్లీ విశ్వాసము ద్వారా నీతిమంతులు జీవిస్తారన్న సత్యము నిరూపించదగినదని నమ్మగలము. నానమ్మ విగ్రహారాధనలో అన్యాచారాలతో నుండగా దేవుని మాట కలద్వారా నమ్మి దైవజనుని ఆహ్వానించి క్రీస్తును నమ్మిన స్ఫూర్తి ద్వారా జాన్ వెస్లీ సేవకుడై క్రీస్తుసేవ కొనసాగిస్తున్నారు.

16. శ్రీమతి చంద్రమణి గారు విద్యావంతురాలై, ఉన్నత స్థాయిలో ప్రభువు పిలుపునందుకొని హెబ్రోను సహవాసంలో రక్షణ స్థిరత నొందినందున వాక్యోపదేశమందు నేర్పరియై

శ్రమలకొలిమిలో విలువైన పాఠాలు నేర్చుకోగల్గారు. అమెరికాలో, ఆంధ్రలో బోధచేయుటలో నిమగ్నమయి ఘనముగ సేవచేయు భాగ్యాన్ని పొందుచున్నారు.

17. దివ్యప్రసాద్ జీవితంలో నాన్న నిరాదరణ తీవ్రంగా బాధించింది. నానమ్మ విశ్వాసము, ఆమె దర్శనము అతనిలో విశ్వాసానికి అంకురార్పణ కావించబడింది. క్రీస్తును అంగీకరించిన తర్వాత చాలా శ్రమలు, యిబ్బందులలో క్రీస్తే చాలిన దేవుడిగానున్నాడని సాక్ష్యము తెల్పాడు

18. నగేష్ ఇనోష్‌పాల్ – మతాచారాలతో బాల్యం గడిపాడు. చిన్న ఉద్యోగిగా స్వతంత్రంగా జీవించే రోజుల్లో యింటివారే విరోధులయ్యారు. సినిమా ప్రభావము వింత అలవాట్లు నేర్పాయి. పుస్తక పఠనము అలవాటు చొప్పున ఒకసారి బైబిలు చదువగానే శక్తిగల వాక్యము ద్వారా నిజ సత్యాలను గ్రహించి గొప్ప విశ్వాసిగా మారి, రక్షణ స్థిరతతో సాక్షిగా జీవించు ధన్యకరమైన జీవితాన్ని పొందాడు.

19. కోన అబ్రహాము గారు పూజారుల వంశంలో జన్మించినందునను సైతాను శక్తుల ప్రభావం బాధించగా యింటి ప్రక్క క్రైస్తవుల సలహా పాటించి బైబిలును ఆశ్రయించారు. జ్యోతి శాస్త్రమును ఆశ్రయించినను మనశ్శాంతిలేదు. ప్రభువును ఆశ్రయించు అనే స్వరం విన్నారు. దేవుని భక్తుల సహవాసం లభించగా మాంత్రిక శక్తులనుండి విడుదల పొందగా భార్య కూడా హెబ్రోను విశ్వాసిగా మారింది. బాప్తీస్మము ద్వారా పేర్లు మార్చుకొని చివరకు దైవసేవకులై మందిరము నడిపంచు భాగ్యం కల్గింది.

20. స్మిత (అమెరికా) ఉన్నత విద్యాభ్యాసం చేసిన యవ్వనంలో క్రీస్తును తల్లి ద్వారా, స్నేహితుల ద్వారా నమ్ముకొని గొప్ప విశ్వాసంతో భవిష్యత్తుకై ప్రార్థించింది. విశ్వాసములో సవాళ్ళు ఎదుర్కొన్నది. విశ్వాసిగల భర్తకై నిరీక్షించి వంశీని పొందింది. అడుగడుగున అద్భుతాలు నెదుర్కొని వాగ్దానాలపై జీవించిన ఉత్తమ మహిళా జీవితం నేటి యువతీ యువకులకు గొప్ప కనువిప్పు కల్గిస్తుంది.

21. శ్రీమతి కోటేశ్వరమ్మ గారు (ఎస్తేరు) సజీవ సాక్షిగా శ్రమలలో నిరీక్షణతో క్రీస్తును ప్రేమించి మంచి భక్తితో, ఓర్పుతో, భర్తను, బిడ్డలను రక్షణానుభవంలో తీర్చిదిద్దిన ధీర వనిత. ఈ తరానికే గొప్ప సాక్షిగా నిలిచారు. సుదీర్ఘమైన పుస్తకంలో అనుభవాల నుండి సేకరించిన ఆణిముత్యాల అనుభవాలు ప్రతి విశ్వాసి తెలుసుకోగల గొప్ప జీవిత పాఠాలు.

22. పద్మా మణి గారు రచించిన స్వీయానుభవం నుండి సేకరించిన సేవానుభవాలు శ్రమలలో ప్రతి స్త్రీకి భర్తపట్ల ఎంత ఓర్పు అవసరమో నేర్పించగలదు. ప్రతికూల పరిస్థితులలో ప్రతిచోట కూడా సాక్షిగా నుండుటెట్లు? అనే అనుభవ పాఠాల్ని ఆమె జీవితం విలువైన పాఠాలు ఆదర్శము కాగలవు.

23. రవి శంఖర్ జీవితం చీకటి మయమైన అంధుడుగా పుట్టిననూ దేవుని చిత్తంలో క్రైస్తవుల ఆదరణతో విద్వావంతుడై బలమైన క్రీస్తు సాక్షిగా గాయకుడై తలాంతులను ఉపయోగించి దేశ విదేశాలను దర్శించు సాక్షిగా మారాడు.

24. డాక్టరు జయశీల – ఎన్ని విద్యలు అభ్యసించిననూ క్రీస్తును గూర్చిన జ్ఞానము గొప్పదని అనుభవం ద్వారా తెలుసుకొన్నది. ఆత్మలను సంపాదించుటలో ఆనందమనుభవిస్తుంది.

25. జీవరత్నం రెడ్డిగారు వారి సతీమణి దేవిరెడ్డిగారు హైదరాబాద్‌లో 7 సార్లు స్తుతి ఆరాధనలు నిర్వహించు భారము కల్గి సేవ చేయుట దేవుని సంకల్పమని చెప్పగలరు. దేవుని ప్రేరణ ద్వారా ఆరంభించిన యీ సేవ ఫలభరిత మెట్లు కాగలదో వీరి అనుదిన అనుభవాలు నేర్పగలవు. అమెరికాలో బిడ్డల ప్రగతి చూచుటకై వచ్చి అనేక ప్రాంతాలలో సాక్ష్యమిచ్చి దేవుని మహిమపర్చారు.

26. జీవరామ చంద్రారెడ్డి గారు బాల్యంలో పాము పుట్టలో పాలుపోస్తూ నాగదేవతలను ఆరాధించే వాడు. గంగరాజు గారనే విశ్వాసి హెచ్చరికల వల్ల క్రీస్తును నమ్మి ఉన్నత విద్య ద్వారా ఉపాధ్యాయుడయ్యాడు. ఒక బంధువు మరణంలో క్రీస్తును నమ్ము రీతిని బట్టి ప్రభువుపై విశ్వాసము బలపడింది. క్రీస్తు సాక్షిగా జీవించారు.

27. నగ్మా నటి – నటిగా రాణించిననూ, ఆంటీ హెచ్చరికల ద్వారా క్రీస్తును నమ్మి గొప్ప సాక్షిగా మారింది. ఎన్నో బైబిలు వాక్యాలతో సందేశాలనందించే ధన్యత పొంది అనేకులను ఆశ్చర్యపర్చు ఆమె నోటివాక్కులు మధురంగా ప్రభువు మార్చారు.

28. సత్యవాణి గారు – క్రీస్తు తెలియని స్థితిలో పూజలు చేసింది. భక్తుల జీవితాలు చదివి ఆనందించే రోజుల్లో క్రీస్తును గూర్చిన కరపత్రాలు, గొప్ప భక్తుల జీవితాలు చదివి ప్రభావితం కాగా క్రీస్తు ప్రత్యేకత గుర్తించింది. భర్త మరణం, కుమారుని మరణం కృంగదీసిననూ దేవునిపై నిరీక్షణతో సాక్షిగా జీవించిన గొప్ప జీవితం అనేకులకు ఆదర్శము కాగలదు.

29. సత్యవతి గారు (హైదరాబాదు/అమెరికా) ఉదయాన్నే గోవిందా అని స్మరించే కుటుంబములో సత్యవతి గారు పాస్టరు గారి సందేశం విని నమ్మింది బొట్టు తీసివేసింది. కలల ద్వారా ఆమె అమ్మతో ప్రభువు మాట్లాడేవారు. ఆర్థికంగా ఏమీ లేని స్థితి నుండి దేవుడు ఆమె స్థితి గతిని మార్చి సాక్షిగా నిలిపారు.

30. శాలిని – నామకార్థ క్రైస్తవ కుటుంబములో పెరిగి క్రీస్తు ప్రేమను గుర్తించని రోజుల్లో క్యాన్సరు వ్యాధి 3వ స్టేజిలో నుండగా గుండె చెదిరింది. ఆమె శ్రమలో క్రీస్తు తాకారు. వివాహము జరిగి ముగ్గురు బిడ్డలు చనిపోయారు. ఆ తర్వాత మరలా బిడ్డలను పొందగా ఆరోగ్యంగా నిలిచారు. భర్త మంచి విశ్వాసి. శ్రమలో దేవుని ప్రేమను చూచిన సాక్ష్యం ఆశ్చర్యం కల్గిస్తుంది.

31. లలిత – దొరల కుటుంబంలో జన్మించి వ్యసనాల ఫలితంగా చితికిపోయి భర్త పెట్టిన బాధలు భరించే రోజుల్లో 5 మంది ఆడపిల్లలతో కష్టాల జీవితంలో దేవుడు గొప్పగా ఆదుకొని బిడ్డ అమెరికాలో స్థిరపడగా ప్రేయర్ సెల్‌లో గొప్ప సాక్ష్యానుభవాన్ని వివరించి ఏ అనుభవానికైనా క్రీస్తు చాలు అని చాటిన గొప్ప సాక్షి లలితగారు.

32. రాజేశ్వరి – కళ్ళు ఎఱ్ఱబడినప్పుడు ప్రార్థించి స్వస్థత పొందింది. వివాహము, బిడ్డలు పొందుటలో దైవ దర్శనాలు పొందిన విశ్వాసిగా గొప్ప సాక్ష్య జీవితం జీవిస్తూ అడిగితే దేవుడిస్తాడని దృఢంగా చెప్పు సందేశం ప్రతి విశ్వాసిని బలపర్చగలదు.

33. ప్రశాంతి – దుష్ట శక్తులపై విజయము నిచ్చేది సహవాస ప్రార్థనలేనని అనుభవంతో చాటిచెప్పిన ప్రశాంతి మంచి విశ్వాసము గల యువతి. డిప్రెషన్ ద్వారా కృంగినప్పుడు ప్రార్థన గొప్ప విజయమిచ్చిందని తెలియజేసింది. క్రీస్తునందు బలవంతుడవు కమ్ము అనే వాగ్దానాన్ని స్వతింత్రించుకోవాలని అందరికీ నేర్పు విశ్వాసి ప్రశాంతి.

34. సోనియా – నమ్మిన వారికి ఎన్నో మేళ్ళు దేవుడు దాచివుంచగలరనియు, బిడ్డలను పొందుటలో దేవుని హస్తము అద్భుతము చేయునని అనుభవంతో తెల్పింది. అనుక్షణం దేవుని నడిపింపును తల్లి పెంపకంలో భక్తి తోడుకాగా ప్రేమించే భర్త సహకారంతో విశ్వాసయాత్ర నిర్విఘ్నంగా కొనసాగించే గొప్ప విశ్వాసి సాక్ష్యం.

ఫోను నెంబరు : 9652506470, **USA NO:** 001410-980-4188

35. జీవితమంతా అద్భుత స్వస్థతతో నిండినదే. నాన్న ప్రేమతో ఉన్నత విద్యను పొందింది. నాన్న అకాల మరణము ద్వారా కృంగినను మంచి క్లాస్‌మేటు ప్రేమ, ఆదరణ చివరకు ప్రేమగా మారి భక్తితో ప్రార్థనలో కనిపెట్టి కలిసి అద్భుతాలు నెదుర్కొ గలిగారు. భర్తగా అమెరికా చేరి ఆదరించిన రీతి అపురూపమైన అనుభవం. భయాలను ఆర్థిక ఇబ్బందులను

తట్టుకొను భక్తి జీవితం ఆమెను సాక్షిగా నిలిపింది.

యేసయ్య ప్రేయర్ సెల్

36. పరిమళ – సామాన్య భక్తిగల తల్లిదండ్రుల పెంపకంలో అమాయకంగా పెరిగి అమెరికా చేరాక ఎదుర్కొన్న సమస్యలన్నిటినీ ప్రార్థనలో నిత్య సన్నిధి ద్వారా విజయాన్ని సాధించిన అనుభవాలు అమెరికాలో తెలుగువారికి స్ఫూర్తినిస్తాయి.

యేసయ్య ప్రేయర్ సెల్

37. సుధీర్ కొండ్రు – పరిచయము – మధ్యతరగతి కుటుంబంలో జన్మించి నామకార్థ భక్తితో నిర్లక్ష్య జీవితాన్ని కొనసాగించే రోజుల్లో సముద్ర స్నానం సమయంలో ప్రాణాపాయము సంభవించగా యోనావలె నిబంధన చేసుకొని రక్షించమని ప్రార్థించాడు. దేవుడు రక్షించాడనే కృతజ్ఞతతో నానమ్మ భక్తిగల నడిపింపులో దైవసేవకై జీవితాన్ని అంకితము చేసుకొని నేడు అమెరికాలో న్యూయార్క్‌లో వేదాంత విద్య నేర్చుకుంటూ వివిధ సంఘ ఆరాధనలో చురుకుగా పాల్గొని అందరి అభిమానానికి పాత్రుడగు యువకుడిగా విశ్వాసయాత్ర కొనసాగిస్తున్నాడు. ఆంధ్రప్రదేశ్‌లో తండ్రి సేవ కొనసాగిస్తున్నారు.

ఫోను నెంబరు : 9440592417, 949050505

38. శ్యామ్ – పెద్ద వ్యాపారాన్ని కోల్పోయి చివరకు బ్రతికే దారిలేక మంగళ సూత్రాలు అమ్ముకొనే స్థితికి చేరిని కుటుంబము స్నేహితులు క్రీస్తు ప్రేమను చూపగా క్రీస్తును నమ్మారు. స్వకీయుల అవమానాలన్నీ భరించారు. ప్రభువుపై ఆధారపడి ఆరంభించిన వ్యాపారము సత్ఫలితాలనిచ్చి గొప్ప సాక్షులుగా సేవచేయు ధన్యత నిచ్చి నందున దేవుని ఘనపర్చు చున్నారు.

39. నిరీక్షణ పాల్ – బాధపడితే గాని దేవుని ప్రేమ బోధపడలేదని సాక్ష్యమిచ్చు నిరీక్షణ పాల్ హిందువుగా జన్మించి ఆర్థికంగా దీన స్థితికి దిగజారి కప్పులు కడిగే స్థితి నుండి మంచి స్థాయికి చేరుటకు క్రీస్తును వెంబడించుట కారణమని సాక్ష్యమిస్తున్నారు. క్రీస్తు దర్శనాలు ద్వారా ఆదరించబడ్డాడు. కుమార్తెను కోల్పోయినను సేవలో స్థిరపడ్డాడు. ఒక్క కుమారిని సేవకు సమర్పించిన గొప్ప విశ్వాసి సాక్ష్యము చాలా విలువైనదిగా నిలిచి అనేకుల విశ్వాసాన్ని అభివృద్ధి పర్చుననుటలో సందేహము లేదు.

ఫోను నెంబరు : 9701167024

40. దయామణి (నాగేశ్వరమ్మ గారు) – ఆదరణ లేని బాల్యంలో కట్టుకున్న భర్త పెండ్లికి ముందుగానే వివామము చేసుకొని తండ్రిగా నుండగా ఓర్పుతో కలిసి సంసారము చేసి భర్తను ప్రేమతో రక్షణానుభవంలోనికి మార్చిన సాధ్వి జీవిత గాథ చాలా వింతైన ఓర్పును కనపర్చగలదు. తాను నమ్మిన క్రీసస్తు తన బిడ్డను అమెరికాకు చేర్చగా నేడు సమృద్ధిగల ఆత్మీయ, శారీరక ఆశీర్వాదాలతో అనేకుల మధ్య గొప్ప సాక్షిగా నిలిచిన దయామణి ధన్యజీవి.

ఫోను నెంబరు : 9951849278

41 విజయమ్మ గారు – క్రీస్తును ఎరుగని అన్యుల జీవితంలో ఎన్నో ఆటు పోటులను సహించి క్రీస్తును కనుగొని అనేకులకు ఆదర్శంగా ఆత్మ జాలరిగా తన జీవితంతో ఓర్పు ద్వారా తోటికోడలను రక్షించుకోగల్గింది. అందరూ క్రీస్తును వెంబడించు ధన్యత పొందింది. క్రియాత్మకంగా మంచి క్రైస్తవునిగా జీవించు మెళకువలను స్త్రీలకు బోధించుటలో నేర్పు పొందారు. అమెరికాలో ప్రేమర్ సెల్‌లో ఉపన్యసించు స్థాయికి ఎదిగి అందరి మన్ననలు పొందిన గొప్ప సాక్షి విజయమ్మ గారు.

ఫోను నెంబరు : 9949855540

# 1. విగ్రహాలను పూజించే నన్ను క్రీస్తును ఆరాధించే విశ్వాసిగా ప్రభువు రక్షించారు

**మోజెస్ చౌదరి (హైదరాబాదు)**

**యెషయ 41:14 "పురుగు వంటి యాకోబు భయపడకు. నేను నీకు సహాయము చేయుచున్నాను".**



**పరిచయము:-** ప్రభువు కృప నాపై నుండుటను బట్టి నేడు నేనేమై యున్నానో అది దేవుని చిత్తము నెరవేర్చుట వలనని నమ్మి స్తుతించుచున్నాను. సంపూర్ణముగా దేవుని దయకు పాత్రులైయుండు ధన్యత సమర్పణ జీవితము వల్ల లభిస్తుందని గ్రహించాను.

నేను పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురము సమీపాన తడపరి గ్రామ వాస్తవ్యుడను. నా అసలు పేరు పరుషరాము చౌదరి. మా గ్రామములో క్రైస్తవులెవరూ లేరు. పూర్తిగా విగ్రహారాధన నిండిన గ్రామస్తులతో నిత్య పూజలు చేసేవారము. కుటుంబములో విగ్రహపూజ రోజూ చేసేవారము. మా అమ్మమ్మ వేదాంత సారాంశాన్ని గ్రామస్తులకు వివరించే వివేకము గలది. గొప్ప పండితురాలు.

నాన్న కమ్మ బ్రాహ్మణుడైనందున వివాహాలు జరిపించేవారు. భక్తి భావాలు బాల్యములోనే అలవాటయ్యాయి. మా ఊరిలో రామాలయము వుంది. ఆంజనేయుడిపై గొప్ప భక్తి భావముండేది. నా పేరుమీద మకర తోరణమును చేయించారు. శాస్త్రాలు, పుస్తకాలు బాగా చదివేవాడిని. మతగ్రంధాలు, భక్తి పద్ధతులన్నీ మా గృహములో వుండేవి.

ఆ రోజుల్లో 1984వ సంవత్సరములో ప్రప్రధమంగా సువార్త ప్రకటించడానికి పాస్టరుగారు వచ్చారు. ఆయన ఆకారము చాలా వింతగా నుండేది. నల్లగా, పొట్టిగా నుండేవారు. పెద్ద తల వుండేది. అంతేకాదు బట్టతలతో నవ్వు పుట్టించే ఆకారంతో నుండేవారు.

సువార్త బోధించే సమయంలో వీధిలో యాక్షన్‌చేస్తూ పాస్టర్ల భాషతో కాస్త సాగదీసి మాట్లాడేవారు. వారు మాట్లాడే పద్ధతి ఆసక్తికరంగా గమనించేవాడిని. ఆయన మాటలన్నీ తిరిగి అనుకరిస్తూ తోటి స్నేహితులకు చెప్పి హాస్యాస్పదంగా అవమానిస్తూ తోటివారికి నవ్వు పుట్టించేవాడిని. ఆయన మాటలన్నీ దూరంగా నిలిచి వినేవాడిని.

మా మేనత్త కుమార్తె నేను చేస్తున్న పని గమనించి ఆసక్తితో వింటున్నానని భ్రమపడి నాతో చర్చికి వస్తావా అని అడిగింది. అప్పటికి నాకు సరిగ్గా 10 సంవత్సరాలు. చర్చిలో మరెక్కువ గమనించి ఎగతాళి చేయవచ్చునని తలంచాను. పాస్టరుగారు సందేశము చెప్పుటకారంభించారు.

**కీర్తనలు 116** " "

ఒక చిన్నగదిని చర్చిగా మార్చి బోధ చెప్పుట కారంభించారు. కదలలేని విగ్రహాలను పూజించేవారు అట్టివారేనని చెప్పగా విని చాలా బాధపడ్డాను. నా రక్తము కోపంతో ఉడికిపోయింది. నా చిన్న హృదయము గాయపడింది. క్రైస్తవులు వారి దేవుడ్ని గూర్చి చెప్పుకోవాలి గాని మా దేవుళ్ళను గూర్చి ఎందుకు చెప్పుచున్నారు? అని ఆవేశంతో బయటకు వచ్చేసాను.

చదువు బాగా రావాలంటే పాస్టరు గారితో ప్రార్ధన చేయించుకోమని చెప్పారు. నాకు పాస్టరు గార్లంటే చులకన భావముంది. ఏమనగా బియ్యము, కోడి మాంసము మొదలగు బహుమానాల కోసం ఆశపడేవారిగా కబుర్లు చెప్పుకుంటారని తలంచాను. నాలో కుల గర్వము, ధన గర్వము ఎక్కువగా వుండేది.

నేను ఆయనను విమర్శించగా చిన్నగా నవ్వాడు. పెద్దవారు చిన్న పిల్లల మాటలకు సర్దాగా ముచ్చటపడి నవ్వుకుంటారు. నాలోనున్న అసహనాన్ని గమనించిన పాస్టరుగారు నన్ను పిలిచి, బాబూ, నిన్ను ఒక ప్రశ్న అడగనా అన్నారు. సరేనని తలూపాను. మనల్ని చేసినవాడు మనకు దేవుడా? లేక మనము చేసినవాళ్ళు దేవుళ్ళా? అని అడిగారు. మనల్ని చేసిన వాడేనని తెల్పాను. మనలను చేసిన వాడిని సృష్టికర్త అంటాము. మనం చేసినది సృష్టి అని వివరించారు.

నేనారోజుల్లో 3వ తరగతిలో చందమామ, బాలమిత్ర చదివేవాడిని. యింటికి వెళ్ళి మా అమ్మతో జరిగిన సంభాషణను గూర్చి వివరించాను. నాలో కాస్త ఆసక్తి పెరిగింది. పాస్టరుగారు బోధచేసే చిన్నగది ఊరికి కాస్త దూరంగా ఉండేది.

ఆ తర్వాత మా ఊరిలో ప్రార్ధనలు, ఆరాధన బోధ చేయుటకు స్థలము కావాలని ఆ పాస్టరుగారు కోరారు. కొందరు సమ్మతించి మీటింగు పెట్టుకోమని అనుమతినిచ్చారు. నేను ఆయన చెప్పిన మంచి సువార్త విని క్రీస్తుఎడల కొంత ప్రేమను హృదయంలో దాచుకొని వాక్యం శ్రద్ధగా విన్నాను.

ఆ తర్వాత నేను ఎలిమెంటరీ స్కూలువరకు మా ఊరిలోనే చదివిన తర్వాత హైస్కూలు చదువులకు ప్రక్కవూరు వెళ్ళవలసి వచ్చింది. అది నర్సాపురము గనుక అద్దెకు యిల్లు తీసుకొని మా చదువు కొనసాగించాను. సహవాసం లేక సువార్త విననందున మరలా విగ్రహపూజ ఆరంభించాను. క్రైస్తవులు నాకు దగ్గరగా లేరు.

మాకు దగ్గరగా వెంకటేశ్వరుని దేవాలయముండేది. ఆ విగ్రహాలను ఘుభ్రపర్చుట, లైట్లు వెలిగించుట, ఆంజనేయులు, సాయి బాబాలను పూజించుచూ వారమంతా చాలా బిజీగా గడిపేవాడిని. ఒక స్త్రీకి పూనకం వచ్చి ఏదో మాట్లాడుతూ వుండేది. చందాలు ప్రోగుచేసి వింతలు చూస్తూ గడిపేవాడిని.

అది 1993వ సంవత్సరములో నాకు 13 సంవత్సరాల వయస్సులో నా తల్లికి బోదకాలు వల్ల ఎడమ భాగం కాలువాచి బాధించింది. భీమవరంలో వైద్యం చేయించగా బ్యాండేజీ కట్టాలి అన్నారు. నా తల్లి అనారోగ్యమును గూర్చిన వార్తవిని మా పెద్దమ్మ మా అమ్మను పరామర్శించుటకు మా యింటికి వచ్చింది. ఆమె ఎవరో క్రీస్తును గూర్చి చెప్పగా విని రక్షణానుభవాన్ని పొందింది. సాక్ష్యమిచ్చుటలో విశ్వాసి ఎల్లప్పుడూ సంసిద్ధంగా నుంటాడు గనుక ఆమె నా తల్లికి క్రీస్తును గూర్చి చెప్పింది. ఆయన సర్వశక్తి మంతుడు, స్వస్థతనిచ్చు దేవుడు గనుక ఆయనను నమ్మితే బోదకాలు స్వస్థత పొందవచ్చును అన్న మాట మాలో విశ్వాసము కల్గించింది. అమ్మ వినయముతో నమ్మి ప్రార్థించసాగింది. పెద్దమ్మ నన్ను ఆరాధనా స్థలానికి తీసుకొని వెళ్తానంది.

క్రీస్తును నమ్ముట వలన మాకు తెలిసినవారి మధ్య అవమానమగునని ఆమెను దూరంగా నడువమని ఆదేశించాను. ఆమె చేతిలో బైబిలు ఉండేది. నా మానసిక స్థితి ఆరీతిగా నుండగా నా కాలిపై ముదురు గోధుమరంగుతో మచ్చ కన్పించింది. చిన్న గాయముగా నుండి అది మానింది గాని మచ్చ పెరుగుతూ వచ్చింది. అది గాయము మచ్చగా లేదు. వింతగా నుంది. యింటిగలామె కూడా చూచారు. డాక్టర్లు గమనించి చూస్తే మంచిదని సలహాయిచ్చారు.

ఇది చర్మవ్యాధికి సంబంధించినదని డాక్టర్లు పరీక్ష చేసారు. స్పర్శ వున్నదో లేదోనని గమనించారు. నిజానికి స్పర్శలేదని నిర్ధారణ చేసి వెంటనే తలుపులు మూసి గమనించగా చమట పట్టలేదు. అది కూడా పరీక్షలో ఒక భాగమేనన్నారు. “మీ కుటుంబములో ఎవరికైనా భయంకర కుష్టువ్యాధి వున్నదా? అని అడిగారు. దురదృష్టవశాత్తు మీ అబ్బాయికీ ఈ వ్యాధి, లక్షణాలున్నాయి. చాలా మందులు వాడాలి.

ఓర్పుతో రోజుకు 7 రకాల మందులు 5 సంవత్సరలుగా వాడాలి అన్నారు. ఈ మచ్చ పోయేది కాదని కూడా చెప్పారు. నా తల్లిదండ్రులు చాలా దు:ఖపడుటచూచి నా స్థితికై చాలా ఏడ్చాను. వీధుల్లో తిరిగే కుష్టువారు డబ్బా పట్టుకొని పాటలు పాడచూ అడుక్కొంటూ వుండేవారు జ్ఞాపకము వచ్చారు. వారి స్థితి నాకు రాబోతుందా? అని భయపడ్డాను. చావు తప్పదనిపించింది. రైలుపట్టాల చెంత చేరి తలపెట్టదలచాను. ఆ సమయానికి రైలు హోరు శబ్ధము భయము కల్గించింది. లేచిపోయి రక్షించుకున్నాను.

ఒకరోజు మా అన్నయ్య నేను కలిసి ఒక బెడ్‌మీద పడుకొనగా, నా వ్యాధిని బట్టి నన్ను తృణీకరిస్తూ వేరే పడకపై నిద్రపో అన్నాడు. చాలా దు:ఖము కల్గింది. చాలా ఏడ్చాను. గదిలో విగ్రహాలన్నీ ఎదురుగానున్నాయి. వాటికి మ్రొక్కి పూజించి, మీరైనా నన్ను రక్షించండి అని మొఱ్ఱపెట్టాను. మా పెద్దమ్మ శ్రమతో దేవునికి ప్రార్ధిస్తే జవాబు లభిస్తుందని మా అమ్మతో చెప్పింది కద! అమ్మకాలు స్వస్థత పొందింది గనుక నా తల్లి నాకోసం ప్రార్ధించింది.

“అక్క ప్రార్ధించే దేవుడా! నా బిడ్డను రక్షించు. ఈ భయంకర వ్యాధి నుండి స్వస్థత కావాలి అని ఏడుస్తూ అడిగింది. ఆకస్మికంగా అద్భుతము చూచాను. ప్రార్ధనలను ఆలకించే యేసు వెనువెంటనే మా ప్రార్ధనకు జవాబుగా ప్రత్యక్షమయ్యారు. ఆయన హస్తము మెరుస్తూ కన్పించింది. అదే హస్తము నా కాలి మచ్చను తాకింది. ఆ తర్వాత నా తలను ఆప్యాయంగా, మృధువుగా తాకింది. అభిషేకించి, దీవించిన భావం కల్గింది. ఆ దివ్య వెలుగులో క్రీస్తు ప్రభువు ఆకారము కన్పించగా పరమానందం కల్గింది.

ఆ తర్వాత నన్ను స్వస్థపర్చు సమర్ధత సజీవునిగా కన్పించే కృప కేవలము క్రైస్తవులారాధించే క్రీస్తుకే వున్నదని నమ్మాను. నర్సాపూర్‌లో కోమానపల్లి స్టీవెన్‌గారి చర్చి వుందని తెలుసుకొని ఆ ప్రార్ధనలకు వెళ్ళాలని నిర్ణయించుకున్నాను. ఒక ఆదివారము ఆరాధనకై వెళ్ళి మోకరించాను. చాలా దు:ఖము వచ్చింది. గతంలో పాస్టరు గారిని ఎగతాళిచేయుట, క్రైస్తవుల మతాన్ని ద్వేషించిన రీతి జ్ఞాపకము రాగా కన్నీటితో దేవున్ని క్షమాపణ కోరాను. మా అన్నయ్యతో కలిసి కొన్ని పొరపాట్లు చేసిన నేరాలన్నీ జ్ఞాపకము వచ్చాయి. దయతో క్షమించమని ప్రార్ధించాను. మనస్సునిండా శాంతి, నెమ్మది కల్గింది.

మా అమ్మకు కూడా క్రీస్తుపట్ల చాలా నమ్మకము కుదిరింది. విగ్రహాలను ప్రక్కకుపెట్టి పూజలన్నీ మానివేసింది. నేను మా అమ్మతో ఏకీభవించాను. కొద్దిరోజులకే కాలిమీదనున్న మచ్చ రంగుమారింది. నా మందులు 5 సంవత్సరాలుగా వాడమని డాక్టర్లు చెప్పగా,

ప్రార్థన ద్వారా 3 రోజులలో తగ్గిపోయింది. యేసు అద్భుతాలు చేయు మహనీయుడని గ్రహించి, మరింత శ్రద్ధతో ప్రార్థించుట కారంభించాను. అయిననూ పాత జీవితాన్ని పూర్తిగా మర్చిపోలేక సినిమాలు మానలేదు. పండుగ క్రైస్తవునిగా జీవించాను.

1986వ సంవత్సరములో నా జీవితంలో మరొక మంచి మార్పు కల్గింది. కోమానపల్లి వారి కోడలు చర్చిలో పాడిన పాట నా హృదయాన్ని తాకింది. ఆ సీడిని కూడా నేను చెవిదగ్గర పెట్టుకొని విన్నాను. ఈరోజే రక్షణ దినమని అర్థము తెలిపే పాటలో రేపని వాయిదా వేస్తావా? ఈరోజే ప్రాణము పోతే ఏమవుతావు, ఎక్కడికి వెళ్తావు? నీవు మరణాన్ని తప్పించుకోగలవా? సరిగ్గా ఆ మాట నన్ను కలవరపర్చగా ప్రభువు చెంతకు తిరిగి చేరాను. సంపూర్ణంగా సమర్పించుకున్నాను.

1986 అక్టోబరు నా 16వ ఏట నా నిర్ణయము ప్రభువునకు తెలియజేసాను. ఆ తర్వాత బాప్తీస్మము తీసుకున్నాను. మాంసము తింటే ఎముకలు మెడలో వేసుకుంటామా? ఈ మతపిచ్చి ఏమని మా నాన్నకు చాలా కోపము వచ్చింది. బాప్తీస్మము తీసుకొను రోజు నా స్నేహితులిద్దరు, మా అమ్మ కూడా నాతో వున్నారు. అందరము మా పొలము దగ్గరనున్న కాలువలో బాప్తీస్మం తీసుకొని తడి బట్టలతో నుండగా మా నాన్న గమనించారు. ఉపవాసంతో మూడు రోజులుగా సిద్ధపడి ప్రభువు ప్రేమలో బలంగా నున్నాము.

ఆ రోజుల్లో ప్రభువు నాకు మరలా దర్శనమిచ్చారు. నూనె నా తలపై వుంచి అభిషేకమిచ్చి నా సేవ చేయాలని తెల్పారు. నా చదువు మధ్యలో విడిచి పెట్టినచో అవమానము పాలగుట తప్పదని ఎంచి చదువు పూర్తిచేసాను. రెండుసార్లు లెక్కల సబ్జక్టులో అపజయము కల్గింది. ప్రభువు నాతో సూటిగా మాట్లాడారు.

1988వ సంవత్సరము ఏప్రిల్‌లో నేను సేవ చేయుటకు నిర్ణయించుకున్నాను. నాకు వేరుగా నుండి మీరేమి చేయలేరని ప్రభువు తిరిగి మాట్లాడారు. నా బాప్తీస్మము గూర్చి, నా సేవా నిర్ణయము, నా ప్రభుని వెంబడించి జీవించు నిర్ణయము తెలుసుకొని మా నాన్న చాలా కోపంతో మండిపడ్డారు. "నా ఆస్థిలో నీకు వాటా లేదన్నారు". "సరే నాన్నా, ఎవరైనా పొలము పనిచేస్తే కూలి యిస్తారు కద! నేను సేవచేస్తే ప్రభువు నా అవసరాలన్నీ తీర్చగలరనే నా నమ్మిక" అని తెల్పాను. అంతేకాదు, నా ఆస్తి అంతా కలిసి నాఒక్క ఆత్మయొక్క విలువకు సరిపోదు అన్నాను. నా జీవితంలో నా అవసరాల కోసము ఎవరినీ అడగదలంచలేదు. అట్టి తీర్మానంతో సేవలో అడుగుపెట్టాను. వారానికి మూడు రోజులు ఉపవాసముండి ప్రార్థించుట నేర్చుకున్నాను.

మా పాస్టరుగారు విశ్వాసిగా నున్న ఒక పేద యువతితో నాకు వివాహము చేసారు. నా మేనమామ చాలా ధనికుడు గనుక వారి కుమార్తెను నన్ను పెండ్లిచేసుకోవాలని కోరాడు. నేను నిరాకరించాను. నా భార్యతో ముందుగానే చెప్పాను. మన శ్రమలన్నీ మనమే భరించాలి. ఎవరితో చెప్పుకోరాదు. ఆమె సంతోషముతో సమ్మతించింది.

మొదటి వారము 8 రూపాయిల 75 పైసలు చందా, రెండవ వారము 11 రూపాయిల 25 పైసలు చందాసొమ్ము నా చేతికి వచ్చాయి. బియ్యము తెచ్చి చందాగా యిచ్చేవారు. యిద్దరమూ ఒక్కపూట మాత్రమే భోజనము చేసేవారము. నా భార్య అయినా కనీసం బాగా తినాలని నేను బయట తిని వచ్చానని తెల్పేవాడిని. సేవ ఆరంభించిన తర్వాత రెండు సంవత్సరాలు చాలా భారంతో గడిచాయి. అది మాకు పరీక్షాకాలము.

ఒకసారి అన్నం తినేసిన తర్వాత నేను తినేసానని నా భార్య చెప్పిందని నమ్మాను. నిజానికి అన్నం లేదు. చివరి మెతుకులు ఏరితింటున్న నా భార్య స్థితికై కన్నీరు కార్చాను. ప్రభువు కొరకై అన్నీ భరించాము. మేము దిగులుపడక, సణుగక ప్రభువును స్తుతిస్తూ, ఆనందంగా ప్రార్థించి సేవలో కొనసాగుటను బట్టి ఆ తర్వాత రోజుల్లో మంచి సమృద్ధినిచ్చి మమ్ములను ఘనంగా పోషించారు. పరీక్షా కాలంలో వెంటనే జవాబులు రానప్పటికినీ, ఓర్పు పరీక్ష నిరీక్షణనిస్తుందని, శ్రమలు సహిస్తే దేవుని కృపపొందగలమని సరిగ్గా నేర్చుకోగల్గాను.

సరిగ్గా ఒక ఉపాధ్యాయుడు పాఠాలు నేర్పే రోజుల్లో ఎన్ని ప్రశ్నలడిగినా ఓర్పుగా జవాబియ్యగలరు. అయితే పరీక్షా హాలులో నుండగా ఏ ప్రశ్నకూ జవాబివ్వరు. పరీక్షించే సమయం దాటి క్రొత్త విజయాలతో ప్రమోషన్ పొంది ఆనందించగలరు. మౌనం వల్ల దేవునిదయ లేదని భ్రమపడరాదు. మా సేవా జీవితంలో 10 సంవత్సరాలలో గొప్ప విజయాలను పొందాము.

2002వ సంవత్సరము వరకు 10 సంఘాలు ప్రారంభించాము. ఒక ప్రార్థనా కూటానికి విచ్చేసిన దైవజనుడు ప్రవచనాత్మకంగా నాతో చెప్పిన సందేశము ఆశ్చర్యం కల్గించింది. ఈ దేశం వదలి విదేశాలలో సేవకు సిద్ధపడాలి. ప్రభువు సెలవిస్తున్నారని తెల్పారు. ప్రభువు మాటను బట్టి మలేషియా, సింగపూర్‌లోని తెలుగువారు ఆహ్వానించగా వెళ్ళు అవకాశం కల్గింది. నేనెవరికొరకు వెళ్తున్నానో ఎరిగివున్నాను. 3 నెలలకై వెళ్ళాను. విసా పొందు కాలంలో ముందుగా మా అన్నయ్య స్నేహితునికి స్నేహితుని ద్వారా సహకారం లభించింది. మాకు పరిచయము లేని వ్యక్తి సరిగ్గా ఒక్క వారం క్రితమే క్రీస్తును నమ్మినందున

నన్ను ప్రేమతో ఆహ్వానించి నా ద్వారా క్రీస్తును గూర్చి మరింత ఎక్కువ తెలుసుకొనే అవకాశం కల్గిందని ఆనందించాడు.

ఆ తర్వాత సౌత్ ఆఫ్రికాలో పేదవారు వీధి దీపాల దగ్గర ప్రార్థించే వారికి పాస్టరు సహాయం కావాలని కోరారు. దాదాపు 20 దేశాలలో సువార్త ప్రకటించాను. నేనేమయి వున్నానో అది దేవుని కృప వల్లనేనని నమ్మి స్తుతించుచున్నాను. ఉజ్జీవము కొరకు ఆశించే విశ్వాసులు 25 మంది వివిధ రాష్ట్రాలలో నుండగా అనేక సదస్సులు నిర్వహించు ధన్యతనిస్తున్నారు.

2011వ సంవత్సరము జనవరి 15వ తేదీన అమెరికాలో నార్త్ కారోలినా ప్రాంతంను దర్శించాలని ప్రభువు స్పష్టంగా చూపారు. టెన్నెసీలో క్రమంగా సేవచేయసాగాను. ప్రార్ధనలు ఉజ్జీవ ఫలితంగా సేవ జరిగిన ప్రాంతాలలో నేరచరిత్ర మారింది. ప్రార్ధనలకు సెనేటర్స్ ప్రముఖులు విచ్చేసేవారు. ఎంతో ఫలభరిత సేవ కొనసాగించు ధన్యత ప్రభువు నాకిచ్చారు.

నా తండ్రి నన్ను తూలనాడిన తర్వాత నేను నా ఒంటరి జీవితంలో సేవలో నుండిపోయిన రోజుల్లో చాలా ఆస్తిని కోల్పోయారు. నా సేవా ఫలితాలను గూర్చి విని నన్ను నిజముగా నా దేవుడు దీవిస్తున్నాడని గ్రహించారు. చివరకు నన్ను చూచినప్పుడు "బాబూ నేను నిన్ను వదిలిపెట్టాను గాని నీ దేవుడు నన్ను వదిలిపెట్టలేదు అని ఒప్పుకున్నారు. నా భార్య దెబొరాను, నన్ను గమనించి చివరకు ప్రభువును రక్షకునిగా స్వీకరించారు.

మా అమ్మ నాతోపాటే ప్రభువును నమ్మింది. నా బిడ్డలను దేవుడు దీవించి విదేశాలలో స్థిరపరిచారు. మిగిలిన కుటుంబము నర్సాపురంలోనే ఉంటుంది. దేవుడిచ్చిన రక్షణ సాక్ష్యాన్ని మీతో వివరించే ధన్యత నిచ్చినందున దేవునికి ఎంతగానో స్తుతి చెల్లిస్తున్నాను. నా జీవితంలో శూన్యమైన స్థితినుండి సమృద్ధి జీవితమిచ్చి దైవసేవలో ఘనంగా ఉపయోగించుకొంటూ ఆత్మల జాలరిగా నన్ను ఉపయోగించు కొనుచున్న ప్రభువుకే మహిమ. యేసయ్య ప్రార్ధనా సెల్‌వారు నా సాక్ష్యాన్ని రికార్డు చేయుటను బట్టి అనేకులు దీవించబడు ధన్యతనిచ్చారు. వారికి నా నిండు కృతజ్ఞతలు. నన్ను రక్షించి నడిపిస్తున్న ప్రభువుకే స్తుతి మహిమ కల్గును గాక. ఆమెన్.

---------

# ౭. నా సాక్ష్యం మీ కోసం

-బ్రదర్ జడ్సన్ అబ్రహాం



కనికరపడే కరుణామయుడైన క్రీస్తు నా జీవితాన్ని ఏ విధంగా కరుణించి కృప చూపాడో ఆ నా సాక్ష్యాన్ని ఇప్పుడు మీతో చెప్పబోతున్నాను. ఎన్నో సంవత్సరాల క్రితం వరంగల్ పట్టణంలో ఒక పరిశ్రమను స్థాపించాను. అందులో ప్రతి రోజు కొన్ని వందల మందికి ఉపాధి కల్గించగలిగాను. నేను ఇలా ఒక ప్రక్కన పరిశ్రమ పనులు చూస్తూనే సువార్త పనిలో అలుపెరగకుండా ఉండేవాడిని. అది 1994వ సంవత్సరం. అనుకోని అనర్థాలు ఒకటి కాదు రెండు ఆ సంవత్సరంలోనే నాకు జరిగాయి. ఆ సంవత్సరం నాకు జరిగిన నష్టం మాటల్లో వివరించడం కష్టం. నా పరిశ్రమ తీవ్ర నష్టాలను చవిచూసింది. ఆర్థికంగా ఇక నేను జీవితంలో నిలదొక్కుకోలేను, జీవితంలో ఓడిపోయాను అనుకుంటూ మనసులో ఎంతో వేదన అనుభవించాను.

అక్షరాలా 25 లక్షల అప్పుల ఊబిలో కూరుకుపోయాను. ప్రతి నెలకు 74 వేల రూపాయలు బ్యాంకు వారికి నేను వడ్డీ కట్టాలి. అదే విధంగా ప్రతినెల 35 వేల రూపాయలు చీటీపాట కట్టాలి. మొత్తం కలిపి నేను తిన్నా, తినకపోయినా ప్రతినెల లక్షా తొమ్మిది వేలు వడ్డీగా కట్టేవాడిని. అసలు సంగతి తరువాత పీకలలోతు అప్పుల్లో కూరుకుపోయాను.

“వ్యాపారంలో తలమునకలయ్యే మనిషి తన విలువైన సమయాన్ని ఇలా సువార్త పేరు మీద వ్యర్థపరిస్తే నష్టాలు రాక ఏమొస్తాయి”. “రెండు పడవల మీద కాళ్ళుపెట్టి నట్టేట్లో మునిగిపోవడమంటే ఇదే మరి”.

“ఇలా ఎన్నో విమర్శలు నామీద వచ్చాయి. నేను ఎవరికి ఏ సమాధానం చెప్పలేదు. నా పరిశ్రమలో ఉత్పత్తి తగ్గడం వల్ల నాకు నష్టం వచ్చింది. అది అసలు జరిగింది. అయితే ఇప్పుడు నేను ఎవరితో వాదించి ఏమి ప్రయోజనము. మౌనంగా ఉ ండిపోయాను. అయితే ఒకటి మాత్రం చేసేవాడిని. ప్రతిరోజు క్రమం తప్పకుండా ఏదైన ఏకాంత ప్రదేశానికి వెళ్ళి ప్రార్థనలో గడిపేవాడిని. అయ్యో ప్రభువా నా కష్టాన్ని ఒక్కసారి చూడు. సిలువలో నువ్వు చనిపోయింది నా కోసమే కదా.

నీ మీద పడ్డ ప్రతి నింద, ప్రతి దెబ్బ నా కోసమే కదా తండ్రి. మరి నాకు వచ్చిన ఈ కష్టాన్ని ఒక్కసారి చూడు ప్రభువా అని ఏడుస్తూ గంటల కొద్దీ సమయం ఆయన వద్ద గడిపేవాడిని.

ఆ రోజుల్లో నా పరిస్థితి మరి ఘోరంగా ఉండేది. ఎవరూ నన్ను కనికరించలేదు, ఆదరించలేదు. బ్యాంకు వారు కనికరపడలేదు. అప్పుల వారు కనికరపడలేదు. బంధువులు, స్నేహితులు ఎవరు నా మీద కనికరపడలేదు. కాని నా కోసం సిలువలో చనిపోయిన నా యేసయ్య ప్రార్ధనలో నన్ను తన అక్కున చేర్చుకున్నాడు. నా వెన్నంటి నిలిచారు.

భయపడకు జడ్సన్ నేను నీకు ఉన్నాను అంటు ధైర్యపరిచారు. నేను ఏడుస్తుంటే నాతో కలిసి నా యేసు కూడా ఏడుస్తున్నట్టుగా అనిపించేది నాకు. గొప్ప నిశ్చయత నన్ను ఆవరించేది. అయితే ఇదే క్లిష్ట సమయమంలో అదే 1994వ సంవత్సరంలో నా జీవితంలో మరో ఘోర విపత్తు జరిగింది. నా కుమారుడు చనిపోయాడు. తట్టుకోలేక పోయాను. భోరున ఏడ్చేవాడిని.

ఒక ప్రక్కన 25 లక్షల అప్పులబాధ, మరో ప్రక్క నా కుమారుడి మరణం. ఒక బాధకి మరొక బాధ తోడైనట్లుంది. గంటల సమయం ప్రభువు పాదాల వద్ద పడి విపరీతంగా మౌనంగా రోధించేవాడిని. ఆ రోజులు ఇప్పటికీ నాకు బాగా గుర్తే. బాధ, కష్టం, దిగులు, చింత, వేదన, నిరాశ, నిస్పృహ. ఇది అప్పటి నా పరిస్థితి.

అయితే నాకు ఒక్కటి బాగా గుర్తు ఆ బాధల్లో నేను నా యేసు వద్దకు ప్రార్ధనకు వెళ్ళిన ప్రతిసారి ఆయన నన్ను తన కౌగిలిలోనికి తీసుకునేవాడు. మరుక్షణం నాలో గొప్ప నెమ్మది ప్రవేశించేది. ఏ ప్రాంతంలోనైతే నేను గంటల కొద్దీ ఏకాంతంగా ప్రార్ధించేవాడినో అదే ప్రాంతంలో నా కుమారుడ్ని పాతిపెట్టడానికి నా సహోదరులు నాకు తెలియకుండానే సమాధి కార్యక్రమం కోసం ఏర్పాటు చేశారు. నా కుమారుడ్ని నా స్వంత చేతులతో మోసుకొని వెళ్ళాను. కన్నీళ్ళతో సమాధి కార్యక్రమం పూర్తిచేశాను. ఇంత బాధలలో సహితం నేను నా ఏకాంత సన్నిధిని మర్చిపోలేదు. ప్రార్ధనలోకి వెళ్ళిన ప్రతిసారి గొప్ప నెమ్మది, మనోనిదానం నన్ను ఆవరించేవి.

"భయపడకు జడ్సన్ ఈ కష్టాన్ని నేను నీకు రాబోయే రోజుల్లో ఒక కిరీటంగా మార్చబోతున్నాను. ఎన్నటికి నేను నీ చేయి విడువను" అంటు ధైర్యపరిచేవారు. ఇది జరిగిన తరువాత అదే 1994వ సంవత్సరంలో నేను వరంగల్ పట్టణాన్ని విడిచి తమిళనాడులోని నా స్వగ్రామానికి వెళ్ళాను. దాదాపు 1300 కిలో మీటర్ల ప్రయాణం. ట్రైన్‌లో ఏడ్చుకుంటూ వెళ్ళాను. నా ఊరికి వెళ్ళాక ప్రతిరోజు సాయంత్రం ఏకాంతంగా

సమీపంలోని కొండ ప్రాంతానికి వెళ్ళి గంటల సమయం ప్రార్ధనలో గడిపేవాడ్ని. ఆ పిదప కాలం నెమ్మదిగా ముందుకు కదిలింది. 5 సంవత్సరాలు గడిచాయి. కాని నా యేసుతో నేను గడిపే నా దినచర్య మారలేదు. ఆయన సన్నిధిలోకి నేను ప్రవేశించిన ప్రతిసారి కన్నీళ్ళు ధారాపాతంగా కారేవి. మనసు బాధతో మూలిగేది.

"ఏంటి ప్రభువా ఒక ప్రక్క అప్పుల బాధ, మరొక ప్రక్క నా కుమారుడి మరణం. మాట్లాడు ప్రభువా... దయచేసి నాతో మాట్లాడు క్రీస్తు అంటు ఎంతో పట్టుదలగా ప్రార్ధించేవాడిని. ఇలా జరుగుతుండగా ఒకరోజు నా యేసు వద్ద నుండి నాకు జవాబు వచ్చింది. ఆ రోజు ఇప్పటికి నాకు బాగా గుర్తు. గదిలో నిశ్శబ్ధం ఆవరించింది. అందులో నుండి ఒక స్వరం మెల్లగా నాతో మాట్లాడింది. "నీకు ఏమి కావాలి జడ్సన్. 5 సంవత్సరాలు నమ్మకంగా నన్ను అంటిపెట్టుకొని ఉన్నావు కదా! నీకు ఏమి కావాలో ఇప్పుడు అడుగు" అప్పుడు నేను నా ప్రభువుతో నా కోరికలు మూడు చెప్పాను.

అందులో ముఖ్యమైనది "ప్రభువా ఇక నుండి నేను నీ సేవ కోసం ఎక్కడికి వెళ్ళినా నువ్వు నాతో కలిసిరావాలి తండ్రి. నీ సన్నిధి శక్తి ఆ ప్రాంతాన్ని కమ్ముకోవాలి. ఒక బలమైన సాధనంగా నన్ను వాడుకో ప్రభువా". ఆ సమయంలో నా మహోన్నతుడైన క్రీస్తు పలికిన మాటలు నేను ఎప్పటికి మరువలేను.

"నీతో నిబంధన చేస్తున్నాను జడ్సన్. నువ్వు వెళ్ళే ప్రతిచోటికి నేను నీతో కలిసివస్తాను" అంటూ నా యేసు నాకు వాగ్ధానం చేశాడు. ఇది జరిగిన కొన్ని నెలల తరువాత సింగపూర్ దేశానికి సువార్త నిమిత్తం వెళ్ళాను. సింగపూర్‌ను తన దైవిక శక్తితో నా యేసు కదిలించాడు. ఆ తరువాత వరుసగా మలేషియా, దుబాయ్, మస్కట్, షార్జా, ఇండోనేషియా, అబుదాభి దేశాలకు వెళ్ళాను. వెళ్ళిన ప్రతిచోట ఇదే తీరు కొనసాగింది. ఇక అప్పటి నుండి ఇప్పటి వరకు నేను సువార్త పని నిమిత్తం ఏ దేశానికి వెళ్ళిన, ఏ రాష్ట్రానికి వెళ్ళినా, ఏ ప్రాంతానికి వెళ్ళినా నాతో ఆ నాడు నిబంధన చేసిన నా యేసు నాతో కలిసి వస్తున్నాడు.

నేను ఏ ప్రాంతానికి వెళ్ళినా ఆ ప్రాంతాన్ని యేసు తన అద్భుత శక్తితో కదిలిస్తున్నాడు. నాతో నిబంధన చేసిన నా యేసు, ఆ నింబంధనను నెరవేరుస్తున్న నా క్రీస్తు స్తుతించబడును గాక. నాకు ఉన్న 25 లక్షల అప్పు పోవడమే కాదు, ఇప్పుడు నా ఆర్ధిక స్థితి ఎంతో మెరుగుపడింది. ఈ రోజున కొన్ని వందల మంది నా పరిశ్రమలో పనిచేస్తున్నారు. ఈ రోజున నేను దేవుని మహాకృపను బట్టి కొందరికైనా ఎంతో కొంత పెట్టగలిగేవాడిగానే నా స్థితిని పెంచినందుకు నా యేసుకు స్తోత్రం.

---------

# 3. నేను రోషముగల మహమ్మదీయుడనై యుంటిని

–సహో. పీటర్ ఇక్బాల్



నేను మద్రాసులోని సాంప్రదాయ మహమ్మదీయ కుటుంబములో జన్మించితిని. నేను చిన్న తరగతిలో నుండగానే నా ప్రవర్తన సరిగా లేనందున పాఠశాలనుండి పంపివేయబడితిని. నా పాఠశాలలో అబ్బాయిలు అమ్మాయిలు ఉండేవారు. 'బాలుర పాఠశాలలో చేర్పించమని' నేను చిన్న వానిగా నుండగానే మా ప్రిన్సిపాల్ నా తండ్రికి సలహానిచ్చెను. కావున నేను మద్రాసు క్రిస్టియన్ కళాశాలలోని ఉన్నత పాఠశాలలో చేరితిని.

ఆ పాఠశాలలో హాస్టలులో ఉండి నేను చదువుచుంటిని. నేను నా స్నేహితులతో ఇతర విద్యార్థులతో కలిసి తిరుగుచున్నప్పుడు నాలోని దుష్ట స్వభావము అనేకమైన అసభ్యకరమైన రీతులలో ప్రదర్శించ బడుచుండెడిది. చిన్న చిన్న తగాదాలతో తీవ్రముగా కోపము తెచ్చుకొని ముష్టి యుద్ధమునకు దిగుచుండేవాడను. ఆదివారము క్రికెట్ ఆడి మా వార్డెన్ చర్చినుండి తిరిగి వచ్చే సమయమునకు పరుగెత్తి హాస్టలుకు చేరేవాడిని. నా ఉన్నత పాఠశాల చదువు సమయములో సాయంకాలము జరుగు క్రైస్తవ ప్రార్థనలకు వెళ్ళుటకు ప్రతిఘటించేవాడిని. ఆ ప్రార్థనలకు హాజరు కాకుండుటకు మా వార్డెను నుండి ప్రత్యేక అనుమతి పొందితిని.

నా స్వంత విధానములో భక్తిని ఆచరించేవాడను. "అల్లా తప్ప దేవుడు లేడు. మహమ్మద్ అల్లాచే పంపబడిన ప్రవక్త" అని కల్మ అను ఇస్లాము విశ్వాసమును లెక్క లేనన్ని సార్లు అరబిక్ భాషలో వల్లించెడి వాడను. మతముల మధ్యనున్న మత వ్యత్యాసాలను గూర్చి తీవ్రముగా వాదించుచుంటిని.

కళాశాల ఆవరణములో ప్రతి శుక్రవారము సహవాసము తరుపున జరుగుచున్న కూటములకు విద్యార్థులు ఆహ్వానించబడుచుండిరి. వాక్యము వినిన తరువాత నా పాపక్రియలను బట్టి తిరుగుబాటును బట్టి ప్రభువును నేను సిలువ వేయుచున్నానని గ్రహించితిని. నా పాపములను బట్టి నా హృదయము విరిగిపోగా, కన్నీటితో నా పాపములన్నియు ఒప్పుకొనుటకు ఆరంభించితిని. నేను ఎవరికి విరోధముగా పాపము

చేశానో వారితో సమాధానపడేందుకు దేవుని ఆత్మ నన్ను నడిపించాడు. తదుపరి దేవుడు "...నేను నీ దోషమును పరిహరించి ప్రశస్తమైన వస్త్రములతో నిన్ను అలంకరించుచున్నాను" (జెకర్యా 3:5) అను వాక్యము ద్వారా నాతో మాట్లాడినాడు.

మానవ జ్ఞానమునకు అతీతమైన తన మధురమైన సమాధానమును దేవుడు నా హృదయమునకు అనుగ్రహించగా నా జీవితము మారిపోయినది. ఇతరులతో కలహించి పోట్లాడే సంగతులను ఇక ఏమాత్రము ఆలోచించలేకపోయాను. దేవుని బిడ్డల సాంగత్యములో జీవించాలనే ఆశ నాలో అధికమయ్యింది. నాలో కలిగిన మార్పును నా బంధుమిత్రులు గుర్తించారు.

ఒక సందర్భములో నేను ఇటర్మీడియట్ పరీక్ష వ్రాస్తున్నప్పుడు నా హైందవ స్నేహితుడు ఒకరు పరీక్షకు సంబంధించిన పటమును కాపీ కొట్టేందుకు నాకు ఇవ్వబోగా నేను తిరస్కరించాను. ఆ సమయములో నేను ఆ పరీక్షను తప్పే ప్రమాదములో ఉన్నాను. కాని పరీక్షలో పాసవ్వడం కంటే నా మనస్సాక్షిని కాపాడుకోవడమే మేలని బలముగా విశ్వసించాను. తరువాత నేను బి.ఎ. పరీక్షలు వ్రాసినప్పుడు ఆర్థిక శాస్త్రములో నేను విశ్వవిద్యాలయములో అగ్రగామిగా నిలిచేందుకు ప్రభువు కృప చూపించాడు. లేఖనములలో నా ప్రావీణ్యతను బట్టి కళాశాల బహుమతిని గెల్చుకోవడానికి కూడా ప్రభువు సహాయము చేశాడు.

నా కళాశాల విద్య ముగించిన తరువాత నేను చదివిన స్కూలులోనే ఒక సంవత్సరము పాటు ఉపాధ్యాయునిగా పనిచేసిన తరువాత ప్రభువు నన్ను ఆయన సేవకై పిలిచాడు. దేవుడు తన రాజ్యములో నన్ను వాడుకోవాలని కోరడం నా హృదయమును ఎంతో సంతోషముతో నింపినది. నన్ను నేను ఎంతో అయోగ్యునిగా ఎంచుకొనుచున్నప్పటికీ, దేవునికి విధేయత చూపించి ఆయన సేవ కొరకు నా జీవితమును సమర్పించుకోవాలని నిశ్చయించుకున్నాను.

"మీరు యెహోవాకు యాజకులనబడుదురు, వారు మా దేవుని పరిచారకులని మనుష్యులు మిమ్మును గూర్చి చెప్పుదురు..." (యెషయా 61:6) అను వాగ్దానమును ప్రభువు నాకు అనుగ్రహించాడు. నా నిర్ణయమును వృద్ధుడైన నా తండ్రికి తెలిపినప్పుడు, నా పట్ల ఆయన కలిగియుండిన లోక సంబంధమైన అపేక్షలన్నియు కూలిపోయినట్లుగా భావించారు. అయినను నన్ను నడిపించుచున్నది దేవుడేయని ఆయన గుర్తించి అట్టి పరిస్థితులలో నన్ను అడ్డగించుట హానికరమైన సంగతిగా అర్థము చేసుకున్నారు.

అద్వితీయుడైన నా రక్షకుని యొక్క శక్తిని గురించి నేను ధైర్యముగా సాక్ష్యము చెప్పడము ఆరంభించగా, ఇస్లాం పట్ల ఎంతో నిష్ట కలిగిన నా బంధువుడొకరు కోపోద్రిక్తుడయ్యాడు. నా వంటి మనుష్యులు చంపబడాలని అతడు పలికాడు. అతడు ఎంతో ఉన్మాదములోనున్నను సజీవుడైన రక్షకుడు అద్భుతమైన రీతిగా అతని హృదయములో క్రియ చేయనారంభించగా అతడు ఎంతో మహిమాన్వితముగా రక్షకుని చేత మార్చబడ్డాడు. కాలక్రమములో అతడు కూడా దేవుని కొరకు ప్రభావాత్మకమైన సాక్షిగా మారి ఒక జీవము కలిగిన పరిచర్యలో ఫాదరుగా దేవుని సేవ చేశాడు. నేను ఆయననకు లోబడిన దినము నుండి తన పరిచర్యలో దేవుడు నాకు ఎంతో సంతోషమును సంతృప్తిని అనుగ్రహించాడు. మానవులందరి కొరకు మరణించిన క్రీస్తును బహుగా ద్వేషించిన నేను రక్షకున్ని కలుసుకొని యుండగా మీరు కూడా ఆయనను తప్పక కలుసుకొనగలరు. ప్రియ చదువరీ! ఆయనవైపు తిరుగుము!

**సంకలన కర్త వ్యాఖ్య :-** "సహోదరుడు పీటర్ ఇక్బాల్ మద్రాసులోని మన సాధారణ సువార్తిక సహవాసము నడిపించుచున్న బైబిలు కళాశాలలోని విద్యార్ధులకు బోధించుటయే గాక గొప్ప సమూహములకు ప్రసంగించుచున్నారు. శారీరకముగా బలహీనుడైనప్పటికిని దేవుని కొరకు రెండవ మైలు వెళ్ళుటను కొనసాగించుచున్నారు".

---------

# 4. క్రీస్తు ప్రభువు తన సేవ చేయుటకై ప్రత్యేక ప్రణాళికతో నన్ను పిలిచారు

పాస్టర్ నెహెమ్యా ప్రసాద్ (ఆంధ్రప్రదేశ్)



**గలతి 1:15, 16 "తల్లి గర్భమునందు పడినది మొదలుకొని నన్ను ప్రత్యేక పరచి తన కృపచేత నన్ను పిలిచిన దేవుడు, నేను అన్యజనులలో తన కుమారుని ప్రకటింపవలెనని ఆయనను నాయందు బయలు పరుచనను గ్రహించినపుడు మనుష్య మాత్రులతో నేను సంప్రదింపలేదు".**

**పరిచయము:-** యేసు ప్రభుని పరిశుద్ధ నామానికి స్తుతి కలుగును గాక. ప్రభుని మహిమార్థమై ఆయన పరిచర్యలో నన్ను నిలుపుటకు ఆయన చేసి ఏర్పాటును బట్టి దేవున్ని స్తుతించి ఘనపరచుచున్నాను. గతంలో నేను అన్యుల కుటుంబములో 1974వ సంవత్సరము అక్టోబరు 24వ తేదీన ఆంధ్రప్రదేశ్‌లో ఒక కుగ్రామములో జన్మించాను.

మా తల్లిదండ్రులు విగ్రహారాధికులు గనుక ఆ సాంప్రదాయాలనే అనుసరించాను. నాల తల్లి అనుకోనిరీతిగా క్రైస్తవుని సువార్త సందేశాలన నమ్మి క్రీస్తును అంగీకరించింది. పాస్టరు డానియేలు గారు క్రీస్తు కొరకు ఆత్మలను సంపాదించే ప్రయాసలో మా అమ్మ క్రీస్తు ప్రేమకు ఆకర్షించబడి రక్షణానుభవాన్ని పొందింది. దేవుడామెతో మాట్లాడినందున జీవము గల దేవుని మార్గములో నడవాలని తెల్పారు. జీవము, మార్గము, సత్యమైన విషయాలు మా అమ్మకు సరిగ్గా తెలియదు. దైవజనుడైన దానియేలు గారితో సంప్రదించి దేవున్ని గూర్చి తెలుసుకోవాలని ఆశించింది.

దేవుడే సూటిగా మాట్లాడినపుడు "ప్రభువా, నేను నా భర్త సమాజంలో గుర్తింపు గల వారిమధ్య నున్నాము. నా భర్త నా విశ్వాసానికి సహకరిస్తే గాని నేను నిన్ను వెంబడించలేను అని సూటిగా జవాబిచ్చింది. ప్రభువు యిచ్చిన క్లుప్తమైన సందేశము ఏదనగా "అమ్మా, నీవు నా పనిచేయి. నేను చేయవలసిన పని నేను చేస్తాను గనుక నన్ను వెంబడించు" అన్నారు. వినయంతో నా తల్లి ప్రభుని సందేశాన్ని అంగీకరించి, దగ్గరగా నున్న ఒకగ్రామములో నున్న దేవుని మందిరములో ఆరాధించుటకు ప్రతి ఆదివారము క్రమముగా వెళ్ళి స్తుతించేది.

నేను 1974వ సంవస్సరములో జన్మించిన తర్వాతనే నా తల్లి రక్షణానుభవాన్ని పొంది విగ్రహారాధన మానివేసి ప్రభువునే వెంబడించింది. తన భర్త, బిడ్డలు తన విశ్వాసాన్ని స్వీకరించక పోయిననూ, తన అనుభవాల్ని క్రీస్తు ఔనత్యాన్ని, ప్రేమను మాతో పంచుకొనిననూ, ఆమె ఓర్పుతో ఒంటరిగా క్రీస్తునే నమ్మి సాగిపోయింది.

మేము ముగ్గురము మగపిల్లలమే గనుక మమ్ములను ప్రోత్సహించి ప్రత్యేక వేడుకలకు, మీటింగులకు మాత్రమే మేము ఆమెతో పొరుగు గ్రామము దర్శించి ఆరాధనలలో పాల్గొనేవారము. నేను హైస్కూలు విద్య ముగించి కాలేజీలో ప్రవేశించాను. 1996వ సంవత్సరములో రెండు ప్రాముఖ్యమైన సంఘటనలను ఎదుర్కొన్నాను. ఆ వయస్సులో విద్యార్థులు లోకంలో అన్ని వ్యసనాలను చవిచూచిన రీతిగా నేను వ్యర్ధజీవితాన్ని ఆరంభించాను. మాకొక ట్రాక్టరు ఉండేది. ముగ్గురు వ్యక్తులతో కలిసి నేను ప్రయాణం చేయు సమయంలో అకస్మాత్తుగా ఒకలారీ మా ట్రాక్టరును బలంగా గుద్దింది. ట్రాక్టరు ప్రక్కకు ఒరిగిపోయింది. లారీ డ్రైవరు మేమంతా మరణించామనే భయంతో పారిపోయాడు. నిజానికి మేమంతా క్షేమంగా నున్నాము.

**కీర్తనలు 34:13 "ఆయన యందు భయభక్తులు గలవారికి దూత కావలియుండి రక్షించును".** మా తల్లి నిత్య ప్రార్ధనలే మమ్ములను మరణమునుండి సంరక్షించాయి. మాలో ఒక వ్యక్తి పరుగెత్తుకొని వెళ్ళి డ్రైవరును కలిసి "అయ్యా, భయపడకు అంతా క్షేమంగా వున్నామని తెలిపాడు. ఆ డ్రైవరు ఆశ్చర్యపడి తర్వాత ఆనందించాడు. మా నాన్న గారి పలుకుబడి ద్వారా స్థానికి ఎమ్.ఎల్.ఎ. గారి సహకారంతో ఆ ప్రమాదము పెద్దగా కేస్‌గా నమోదు కాకుండా ప్రభువే కాపాడారు. మొదటి సమస్య సమసిపోయింది.

ఆ గ్రామములోని వారు మాత్రం ప్రమాదంలో అందరూ మరణించగా సాంబశివ రావు గారైన మా నాన్నగారి అబ్బాయి బ్రతికి బయటపడ్డాడని వింతగా చెప్పుకున్నారు. నా విద్యను పూర్తిచేసుకొని ఐ.టి.ఐ. కాలేజీలో ఉపాధ్యాయునిగా 1996 నుండి పనిచేసాను.

ఒక రాత్రివేళ ప్రభువు నన్ను కలలో దర్శించారు. గతంలో ప్రమాద సమయంలో రక్షించినది నేనేనని స్పష్టంగా చూచించారు. ఆ దివ్య దర్శనాన్ని నేను మరువలేను. నేను ఎడమ భాగం ట్రాక్టరునుండి దిగుట, కుడి ప్రక్క రోడ్డుపై నిలుచుటకు ఒక అద్భుత హస్తము నన్ను తాకి, పట్టుకొని నిలబెట్టుటతో గాయపడిన ఆ అమృత హస్తాన్ని చూచాను.

నేను ప్రక్కనే రహదారిలో దూసుకుపోతున్న వాహనం క్రిందపడిపోవు ప్రమాదం నుండి ఆ హస్తము ఏ రీతిగా రక్షించినదో స్వయంగా స్పష్టంగా చూచాను. అహ! నేను ప్రభువును ఆయన హస్తాన్ని, ఆయనే రక్షించానన్న అభయవాక్కులను విన్నతర్వాత ఆ రాత్రి నా పడకమీదనుండగానే తీర్మానము చేసుకోగల్గాను. అది నా రక్షణ స్థిరత, నా నిబంధనను స్థిరపర్చుకొన్న రోజుగా గుర్తించుకున్నాను. గత జీవితంలో క్రీస్తును నిర్లక్ష్యము చేసి, చెడు సహవాసాలతో కాలయాపన చేసిన రీతినిబట్టి పశ్చాత్తాపంతో క్రీస్తు సన్నిదిని ఆశ్రయించాను. నాకొక క్రొత్త జీవితాన్ని ప్రభువు అందించారు. యిప్పుడు జీవించే వ్యక్తి నేను కాదు. ప్రభువే నాలో నుండి నాకాలోచన కర్తగా కాపరిగా నడిపించగా, ఆయన అధికారములోనికి వచ్చాను. ఆయన ప్రియమైన బిడ్డగా జీవిస్తూ, ఇక జీవించే జీవితం ఆయన మహిమకొరకేనని నిశ్చయించుకున్నాను.

మా అమ్మ నాకోసం చేసిన ప్రార్ధనలన్నీ సఫలమయ్యాయని నా అనుభవాన్ని విని చాలా ఆనందించి దేవున్ని స్తుతించింది. అమ్మదగ్గరున్న బైబిలును తీసుకొని చదువుటకారంభించాను. “అమ్మా, నేను క్రీస్తును నీవలె వెంబడిస్తాను. నీవు వెళ్ళే ప్రార్ధనా మందిరానికి నేనుకూడా వస్తానని” తెల్పి ఆదివారం నాడు ఆమెతో వెళ్ళి ప్రార్ధనలో పాల్గొన్నాను. దేవుడు ప్రేరేపించినచో ఎవరైనా ప్రార్ధించండి అని దైవజనుని ప్రోత్సాహం స్వీకరించి నోరుతెరచి ప్రభువును స్తుతించి ఘనరపచి, నా సాక్ష్యాన్ని, నా నిర్ణయాన్ని వివరించగా ప్రభువుతో గడిపిన సహవాసానుభవం ద్వారా మొదటిసారిగా వింత శాంతిని పొందాను.

అది 1996 జూన్ నెలలో సంఘటన ప్రమాదము కాగా, క్రీస్తుతో నా పయనము 1996 జూలై నెలలో ఆరంభమైనది. నమ్మి రక్షణానుభవం గల వారు బాప్తీస్మ అనుభవాన్ని స్వీకరిచాలన్న సత్యాన్ని క్రీస్తే సజీవుడనియు, ప్రతి వ్యక్తితో మాట్లాడి ఆదరించు వాడనియు, కృపద్వారా నన్ను రక్షించాడని చాలా కృతజ్ఞత గలవాడనై బాప్తీస్మం ద్వారా క్రీస్తు సంఘంలో స్థిరపడాలని ఆశించాను. ఎక్కడెక్కడైనా క్రైస్తవ సమావేశాలున్ననూ, ఆసక్తితో వెళ్ళి దేవుని ఆరాధనలలో పాల్గొనేవాడిని. బాప్తీస్మ అనుభవం ద్వారా నూతన ఆత్మీయ అభివృద్ధిని పొంది పరిశుద్ధాత్మ నడిపింపులో సాగిపోయాను. 1999 డిసెంబరు 16వ తేదీన నాకు సాటియైన సహకారిని ప్రభువే నాకు చూపి రక్షణ స్థిరతగల తోడునిచ్చారు.

**వివాహ జీవితారంభము:-** నేను నా భార్యతో ఆరంభించిన విశ్వాసయాత్రలో ఎన్నో అడ్డంకులు ఎదురయ్యాయి. నా భార్య ఆత్మీయతతో నాకు తోడుగా నుండి ప్రార్ధనా సహవాసమిచ్చి ఆదరించింది. నా తండ్రితో నేనొక వ్యాపారాన్ని ఆరంభించగా, 3 లక్షల

రూపాయిలు నష్టము ఎదుర్కొన్నాము. అదే సమయంలో నా భార్య గర్భాన్ని కోల్పోయింది. చాలా దు:ఖపడ్డాము. యీ రెండు శోధన, బాధలు నన్ను చుట్టుముట్టగా దేవుని కప్పగించుకొని ప్రార్థించాము.

ఆ రోజుల్లో మా గ్రామములో దైవ మందిరము లేనందున ప్రక్క గ్రామానికి వెళ్ళుట స్త్రీలకు చాల క్లిష్టంగా తోచింది. సంవత్సరాని కొకసారి మీటింగులు జరిగేవి. మా గ్రామములో రక్షణ పొందిన వారంతా స్త్రీలే వున్నారు. ఒక్క పురుషుడైనా క్రీస్తును నమ్మలేదు. నేను ఆ విషయమై చాలా భారంతో ప్రార్థించాను. పరిస్థితులవైపు చూడక యేసువైపు చూచుచూ, 100 మంది కూర్చొని ఆరాధించగల ఆరాధనా మందిరాన్ని 2 నెలల కాలంలో నిర్మించాలని నేను నిర్ణయించాను. అన్యజనుల మధ్య ఆరాధన జరగాలనే నా తపన కోరిక ప్రభువే తీర్చారు.

2002వ సంవత్సరములో దైవ సేవకుని ద్వారా ప్రవచనాత్మకంగా మాట్లాడారు. నా పేరు బాప్తీస్మము తర్వాత నెహెమ్యా ప్రసాద్‌గా మారింది. ఆయన ప్రవచనము నన్ను ఆత్మీయతతో స్థిరతనిచ్చింది.

“నిశ్చయముగా నెహెమ్యాను బలపరిచిన హస్తము కట్టుదము రండి అనే నినాదముతో విజయాన్ని సాధించిన రీతిగా నీ సేవ ఫలభరితమై అన్యులలో మహిమపర్చు రీతిగా, బలహీన సంసారాలను సరిచేస్తూ, సడలిన మోకాళ్ళను బలపరుస్తూ, మనస్సు అనే నడుములను నేను బలపరచి నీకు తోడుగా నుంటాను. ప్రభుని మాటలు జీవపు ఊటలు.

సరిగ్గా 2002వ సంవత్సరము జూలై 7వ నెల 7వ తారీఖున మేము మా ప్రాంతాల్ని వదలి పోరంకి చేరాము. అది విజయవాడ సమీపములో నున్నది. ప్రభువు మాట విని సాగిపోదాము. భౌతికంగా అప్పుల భారముంది. దేవుని ఏర్పాటును బట్టి 21 రోజులు ఉపవాసముండి ప్రార్థించాము. ఆర్థికముగా చాలా అసహాయ స్థితిలో నున్నాము. ఎన్నో ఉద్యోగ ప్రయత్నాలు చేసాము. అద్దెకట్టలేని స్థితి ఎదుర్కొన్నాము. భోజనమునకేమీ వనరులు లేని స్థితిలో మా దీన పరిస్థితి ఎవరికీ తెలియరాదని ప్రార్థించాము.

దేవుని సేవచేయుటకు అన్యుల మధ్య దేవుని మహిమపర్చాలని నన్ను నేను అప్పగించుకున్నాను. నేను నీపని చేస్తాను, నీవు నాపని చేయాలన్నాను. నేను నీపని చేస్తానని ప్రభువు తెల్పారు. దైవాభిషేకం కలలో ప్రభువు నుండి స్వీకరించి 2003లో పరిచర్య ప్రారంభించాను. నాకొక పని అప్పగించగా 5 రోజులు పనిచేస్తూ రెండురోజులు సువార్త పనికొనసాగించాను. గతంలో నాతండ్రి నా అప్పుల భారం నాకే వదిలివేసారు.

డ్రయివింగు తెలిసినందున ఆ ఉద్యోగము కొరకు రోజంతా కనిపెట్టేవాడిని. పని ఎవ్వరూ యివ్వలేదు. ఆహారము లేక మంచినీళ్ళు త్రాగి పండుకొనేవారము. మాకు ఆహారమ లేని స్థితి యితరులు తెలుసుకోరాదని ప్రార్ధించాము. ఆ స్థితిలో పౌలు సాక్ష్యము జ్ఞాపకము చేసారు.

**గలతి 1:15,16 " "**

మన బాధలు యితరులతో సంప్రదించు పని మంచిది కాదని తెలుసుకోగల్గాను. దేవుడు చూపిన రెండు పనులను నమ్మకంగా కొనసాగించాను. ప్రభువు మమ్ములను ప్రేమించి 2004వ సంవత్సరము మే నెల 11వ రోజు ఒక కుమారుని దయచేసారు. దైవజనుడే నామకరణము చేసారు. నాకు పని యిచ్చినవారు అద్భుతరీతిగా మినిష్టరు పదవి స్వీకరించి, నన్ను ఆదివారం కూడా పనిచేయాలన్నారు. నేను చేయనని తెల్పాను.

"జీవమిచ్చి నడిపించే నా రక్షకుని సేవ వదలి మీ సేవ చేయలేను" అనగా "నీ వంటి వ్యక్తి నాతో వుంటే నాకు ఆశీర్వాదము ఉంటుందని, నీవు కావాలని కోరుకుంటున్నా నన్నారు. పూర్తిగా ఆ జాబ్ మానివేసాను. ప్రభువు నాకప్పగించిన పరిచర్య పడిపోయిన జీవితాలు తిరిగి నిర్మించుట, బలహీనులకు ధైర్యమిచ్చి ఆదుకొనుట, క్రీస్తు నందు నిరీక్షణ నందించు సువార్త సేవా భారం స్వీకరించాను గనుక నమ్మకంగా కొనసాగించాను.

నా సేవను విస్తరింపజేయు అవకాశాలనిచ్చి నాకు ప్రోత్సాహాన్నిచ్చారు. మా పరిచర్య విజయవాడలో కొనసాగించే రోజుల్లో నూజివీడులో నున్న ఒక కుటుంబముతో పరిచయమయింది. వారికి ఆర్ధిక పరిస్థితుల బాధతో మరణించదలచారు. నిత్యము పూజలు, దీపారాధన, అర్చన చేసేవారు. ఈ అప్పుల బాధనుండి ఎవరూ ఆదుకోలేరని తలంచి తల్లిదండ్రులు మరణించ దలచగా, 18,19 సంవత్సరాలున్న బిడ్డలు మేము మీతోపాటు మరణించడానికి సిద్ధంగా నున్నామన్నారు. మాకున్న ఆస్తి ప్రభువు సువార్త సత్యమే వారికందించి మరణములో నుండి నిరీక్షణనిచ్చి బ్రతికించి క్రీస్తులో క్రొత్త జీవితాన్నందించాము.

మరొక విధవరాలు 6 సంవత్సరాలుగా అనాధ ఆశ్రమాన్ని స్థాపించాలనే ఆశయముతో నుండగా 2005వ సంవత్సరములో డిసెంబరు నెలలో ఆశ్రమాన్ని నిర్మించుటకు సహకరించి వృద్ధుల ఆశ్రమాన్ని ఆరంభించగా అనేక అనాధలు ఆదరణ పొంది దేవుని ప్రార్ధించి గడుపుచున్నారు.

2005వ సంవత్సరాలలో ఆరంభమయిన సేవ 2015 వరకు 7 వారాలు 7 మంది ప్రతి శుక్రవారము 7 గంటలకు ప్రార్థించు క్రమాన్ని ఏర్పరచగా అద్భుతాలు, సూచక క్రియలు జరుగుట దేవుని ఉచిత కృపయే. 2006వ సంవత్సరములో హైదరాబాదు వెళ్ళి పరిచర్య చేయాలని తెల్పారు. అన్యజనుల మధ్య సేవాభారముంది. ముగ్గురు యవ్వనస్తులు హైదరాబాదులో ఉద్యోగము చేస్తూ ఒకగదిలో నుండి, యిద్దరు విద్యార్థులను తోడుగా నుంచుకొన్న నూతన విశ్వాసులతో పరిచయం కల్గింది. వారానికొక రోజు వాక్యము చెప్పాలని కోరారు. వారిని ఆత్మీయంగా బలపర్చాము. నూజవీడులో పరిచర్య ఫలభరితంగా కొనసాగింది.

నాకు మరొక కుమార్తెను ప్రభువిచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో వివిధ ప్రాంతాలలో సేవనిచ్చారు. ఖమ్మము, వరంగల్, కొరివి, చుట్టుప్రక్కల ప్రాంతాలలో సువార్తసేవ కొనసాగించాము. నా సేవా భారమును అంచెలంచెలుగా పెంచారు. అన్యులకు బాప్తీస్మమిచ్చు పరిచర్యనిచ్చారు. 2007,2007 నాటికి 3 ఆరాధనలు కొనసాగించు కృపనిచ్చారు. ఆ తర్వాత సంవత్సరము ఒక పెద్ద సంఘానికి అధ్యక్షునిగా పదవీ నిర్వహణ స్వీకరించాను.

నా 40 సంవత్సరాల వయస్సులో 30 సంఘాలలో పరిచర్య చేయు ధన్యతనిచ్చి దీవించారు. నా వయస్సున్నంత సర్వీసు వున్న వృద్ధుల మధ్య పరిచర్యనిచ్చారు. అనేక ప్రాంతాలలో నూతన సంఘస్థాపన చేస్తూ, స్వస్థతా ప్రార్థనలు, గర్భము లేనివారికై ప్రార్థించి ప్రతిఫలము పొందు ఫలితాలను చూడగల్గుచున్నాము.

2010వ సంవత్సరములో మరొక ప్రమాదమెదుర్కొన్నాను. అద్భుత స్వస్థత లభించింది. తరచుగా 21 రోజులు ఉపవాసాలు చేసేవారము. ఒకసారి ఉపవాస సమయంలో నీవులేచి బేతేలుకు వెళ్ళు అని వాక్కు ద్వారా మాట్లాడారు. వాక్యం ద్వారా మరలా మాట్లాడారు.

**యెషయా 58:12 "పూర్వకాలము నుండి పాడైపోయిన స్థలములను నీ జనులు కట్టెదరు. అనేక తరముల క్రిందట పాడైపోయిన పునాదులను నీవు మరలా కట్టెదవు".**

నిరీక్షణకు ఆధారములేని కుటుంబాల పరిచర్యలో నా తలాంతులను యిచ్చిన ప్రభువు కొరకు సేవచేసేవారము. గతంలో నేను గడిపిన ప్రాంతాలకు నన్ను వెళ్ళమని యాకోబును వెళ్ళమన్న రీతిగా బోధించారు. నేను నా కుటుంబములో పెద్ద కుమారుడిగా నా బాధ్యతలను అలక్ష్యము చేసానని నేను గుర్తించాను. ప్రభువు సన్నిధిలో పశ్చాత్తాపపడ్డాను. అప్పటికే నా తమ్ముడికి పెండ్లయి యిద్దరు బిడ్డలు పుట్టి చనిపోయారు. చివరకు మరలా

పుట్టిన బిడ్డ అంగవైకల్యముతో చనిపోవు స్థితికి చేరి దు:ఖంలో నుండగా నేను నా తమ్ముడి కుటుంబమునకై ప్రార్థించగా 2011లో తిరిగి గర్భమిచ్చారు. అమెరికాలో 35 సంవత్సరాలు దాటిన ఒక వ్యక్తి వివాహం కోసం ప్రార్థించగా వివాహము జరిగించారు. బిడ్డలు లేని కుటుంబానికి బిడ్డలు కల్గేలా ప్రార్థించుటలో మంచి ఫలితాలనిచ్చారు.

యీ రీతిగా అనేకుల కొరకు ప్రార్థించుట, నా కుటుంబము కోసం ప్రార్థించగా 7 వాగ్దానాలతో దేవుడు తన ప్రణాళికలను తెలియజేసారు. 7 నెలలుగా ప్రార్థించాము. నా తమ్ముడికి 2008వ సంవత్సరములో అమెరికా వెళ్ళు ధన్యతనిచ్చి అభివృద్ధి చేసారు. విదేశాలకు వెళ్ళు అవకాశాలనిచ్చారు. విదేశంలో మోషేవంటి భక్తునికి అహరోను వలె సహకరించమన్నారు.

ఆ తర్వాత ఒరిస్సాలో ప్రధాన్ తెగవారి మధ్య సువార్త చేయు ధన్యతనిచ్చారు. 2013లో ప్రపంచ పెంతుకొస్తు మహాసభలలో మలేషియా, సింగపూర్, ఇండోనేషియాలో సేవచేయు కృపనియ్యారు. 2014లో నేపాల్‌లో ప్రార్థించి పరిచర్య చేయు ధన్యతనిచ్చారు. ఆ రోజుల్లో లిబియా కోసం ప్రార్థించమన్నారు. అమెరికాలో యేసయ్య ప్రార్థనా ప్రేయర్ సెల్‌ల్లో పరిచర్య నందించారు. (Holy Land temple) హెూలీల్యాండ్ పరిచర్యలనిచ్చి మాటలు యిచ్చి సేవకొనసాగించారు.

**ప్రకటన 21:22 "సర్వాధికారియైన దేవుడగు ప్రభువును గొఱ్ఱెపిల్లయు వారికి దేవాలయమై యున్నారు".**

జీవముగల ఆత్మల రక్షణకై అన్యజనుల మధ్య పరిచర్యలు గ్రామస్థాయి నుండి జిల్లా, రాష్ట్ర, దేశ, విదేశాలలో పరిచర్య విస్తరణ గూర్చి ప్రభువే స్పష్టంగా మాట్లాడి విస్తరింపచేసారు. అన్ని సమయాల్లో దేవుని మహిమపర్చే ధన్యతనిచ్చారు. ఈ లోకానికి నా మాటలు కాదు మహిమగల సజీవుడైన ప్రభుని గుణ లక్షణాలను ప్రచురించుటకై ఈతరం వారందరికీ ఈ సేవాభారాన్ని అందిస్తున్నారు.

దేవునికి కావలసినది జ్ఞానము కాదు. ఆయన చిత్తము భూమిమీద జరిగిస్తూ లోకానికి ఆయన రాకడ సమీపిస్తుందని తెలియజేయాలి. ప్రతి వారిని రక్షణకై సిద్ధపరచాలి. ప్రభుని గుణ లక్షణాలను ప్రచురించుటకై సిద్ధపడి ప్రతి పరిస్థితిలో దేవుని సంపూర్ణ చిత్తము చేయుటకై ప్రయత్నించాలి.

ప్రతి వ్యక్తిని దేవుని శిష్యులుగా మార్చాలి. వారు ప్రతిచోట క్రీస్తుకై సాక్షులుగా జీవించాలి. ఈ జీవిత గమనంలో దేవునిని ఎరుగని నన్ను ప్రేమతో ప్రమాద స్థితి నుండి తప్పించి, దక్షిణహస్తంతో రక్షించి సజీవుడిగా కనపరచుకొని క్రీస్తు నన్ను తన సేవకై పిలిచాడు. పిలిచిన దేవుడు నన్ను ఘనంగా సేవకై సిద్ధపరిచారు.

దైవ వాక్యము ద్వారా నన్ను నడిపించారు. ఎన్నో వ్యక్తిగత సమస్యలకు పరిష్కారాలందిస్తూ, సంఘపరిచర్య, నూతన సంఘాల స్థాపనలో, దైవపరిచర్యలో జీవింపజేసిన ప్రభువునకే స్తుతి మహిమ కల్గుగాక. ఆమెన్.

-------------

# 5. హానికరుడను హింసకరుడనైన నన్ను రక్షించిన క్రీస్తు స్తుతి పాత్రుడు

సాలమన్ రాజు. దారా (హైదరాబాదు)

**కీర్తనలు 46:10 "ఊరకుండుడి నేనే దేవుడనని తెలుసు కొనుడి. అన్యజనులలో నేను మహోన్నతుడ నగుదును".**



**పరిచయము:–** ప్రభువు నామములో మీకు శుభములు. శ్రేష్టమైన ప్రభువు నాకీ అమూల్యమైన అవకాశాన్నిచ్చి నా సాక్ష్యము తెలియజేయు కృప దయను బట్టి వందనములు. నా పేరు దారా శ్రీనివాసరావు. పూజారుల వంశంలో అన్య సాంప్రదాయాలతో విగ్రహ పూజలు ఆచరించే కుటుంబంలో జన్మించాను. మా నాన్నగారు చెన్నకేశ్వర ఆలయంలో భక్తితో నిరంతరము హరినామ స్మరణ చేస్తూ దేవాలయంలో (101) నూట ఒక్క కొబ్బరికాయలు కొట్టి ప్రతిరోజు అర్చన చేసేవారు.

మా నాన్న ఆ గ్రామములో అందరికీ అన్ని సందర్భాల్లో పూజలుచేస్తూ గౌరవ మర్యాద లందుకుంటున్న రోజుల్లో నా జీవితం చీకటిలో గడిచింది. నా స్నేహితుల చెడు అలవాట్లన్నీ నేను అవలంభించి, సిగరెట్లు త్రాగుట, త్రాగుడు, మొదలగు వ్యసనాలకు బానిసనయ్యాను. నా పరిస్థితి గమనించిన ఒక క్రైస్తవ సోదరి వారి మతగ్రంథమైన బైబిలు నాకిచ్చి క్రీస్తు మీ జీవితాలను బాగుచేసి రక్షించగలడని తెల్పింది.

చెడు జీవితము గమ్యములేనిదే గనుక వ్యర్థమైన కోపతాపాలలో ఆరంభమై గొడవలకు దారిచేసి గొప్ప అలజడిని కల్గించే జీవితానికి గుర్తై అందరినీ తృణీకరించి హేళన చేస్తూ తిరిగేవాడిని. బైబిలు తీసుకొని వెళ్ళువారితో వాదించేవాడిని. క్రైస్తవులు హీనజాతి వారనియు, పరదేశస్తుల మతాన్ని అవలంభించగలరని భ్రమపడి క్రైస్తవుల దేవుని ఔనత్యాన్ని గుర్తెరగని ఆత్మీయ గ్రుడ్డితనంతో విర్రవీగాను. నా దగ్గరున్న బైబిలును ముక్కలుచేసి పడవేసాను. దాని విలువ తెలియని దౌర్భాగ్యునిగా కాల్చివేసిన పాపిని. నేను బైబిలు కాల్చివేసిన తర్వాత నాకు మానసిక క్షీణత కల్గి మతిభ్రమించగా ఆత్మహత్యా ప్రయత్నం చేసాను. కన్న తండ్రితో వాదించి చంప ప్రయత్నించిన హానికరుడను.

నా కోపోద్రేకాలను చూచిన గ్రామస్తులంతా చాలా భయపడేవారు. తండ్రి పూజారిగా నుండి అందరిలో భక్తిని పెంచేపని చేస్తున్నాడు గాని కుమారునిలో మంచిని పెంచుట

లేదని చాలా వింతగా మాట్లాడుకొనేవారు. మా తల్లి, తండ్రి నన్ను బాబూ అని పిలువక గాలివాడా, దుర్మార్గుడా అని పిలిచేవారు.

తెలివిగల వంశంలో పుట్టినందున నా చదువు బి.ఎ.బి.యిడి. వరకు నిరాటంకంగా కొనసాగుటను బట్టి గవర్నమెంటులో ఉద్యోగిగా చేరి, 3 సంవత్సరాలుగా పనిచేయగల్గాను. అనుకోని రీతిగా నాకు దురలవాట్ల ప్రభావము వల్ల కామెర్ల రోగము వచ్చింది. శరీరము క్షీణించి మరణస్థితికి చేరాను.

ఆ పడకలో నుండగా నా శారీరకబాధ వల్ల గతంలో నేను చేసిన పాపాలన్నీ జ్ఞాపకం చేసుకొనసాగాను. డాక్టర్లు నన్ను పరీక్షించి, మరణము తప్పదని తెలియజేసారు. చివరకు కోమాస్థితికి చేరాను. నేను పూజించిన విగ్రహాలన్నీ జ్ఞాపకం చేసుకున్నాను. చివరకు నా మనస్సులో ప్రార్థించాలనే కోరిక కల్గింది.

దేవుడా నీవే దిక్కు అనే స్థితి కల్గింది. ఎన్నో దేవుళ్ళున్నారు గాని ఏ దేవుడిని అడగవలెనో తోచక "ఏ దేవుడన్నా నిజముగా ఉన్నచో భగవంతుడా, నేను నిన్నే నా జీవితమంతా సేవిస్తాను. నాకు కనబడు" అని దీనంగా ప్రార్థించి నిద్రపోయాను.

అకస్మాత్తుగా నాకు కల్గిన స్వప్నంలో దివ్యకాంతిని ఒక ఆకారం నన్ను సమీపించింది. తేజస్సు కల్గి ప్రకాశవంతమైన వస్త్రాలు ధరించి ఒక చేతిలో గొర్రెపిల్ల మరొక చేతిలో కొంకె కర్ర గొర్రెల కాపరులు వాడు వంపు తిరిగిన కర్ర చేబూని, ముఖము ప్రకాశవంతంగా నుండగా నాముందు నిలిచి యుండుట చూచాను. ఆశ్చర్యము, ఆనందము ఉక్కిరి బిక్కిరయ్యాను.

ఆ ప్రభువు మెల్లని మృదుమధుర స్వరంతో నాతో మాట్లాడారు. అప్పటికే నా శరీరము వికారముగా ఉబ్బిపోయి వుంది. సజీవునిగా నుండే లక్షణాలన్నీ కోల్పోయాను. ఆ దయామయుని ఉనికి నేను చూడగల్గాను. గిరజాల జుట్టుతో నుండి తన దక్షిణ హస్తము చాచి నన్ను తాకుచున్నట్లుగా భావించాను.

"సొలోమోనూ, సొలోమోనూ" అని పేరుపెట్టి పిలిచారు. నాలో వింతైన శక్తి కల్గింది. నూతన ఉత్సాహంతో నిండిపోయాను. నాకు ఆయన దర్శనము చెదిరిపోకుండా నిలిచి ఉండాలని కోరుకున్నాను. " నా కుమారుడా, సొలోమోను, నేను నిన్ను బాగుచేసి బ్రతికిస్తాను. నీవు నా సాక్షిగా జీవించాలి. నేనే మార్గము, సత్యము, జీవమునై యున్నాను" అన్నారు.

ఆ క్షణం నుండి నాలో క్రొత్తబలము కల్గింది. త్వరలో పూర్తిగా కోలుకొని మామూలు వ్యక్తిగా నిలుచుటకు 15 రోజులు పట్టింది. నేను నడుచుట కారంభించిన వెంటనే స్థానికంగా నున్న క్రైస్తవులను సంప్రదించి ఒక బైబిలును సంపాదించుకున్నాను. సంఘములో ఆరాధన క్రమములో దేవున్ని సేవించుటకు అభ్యాసము చేసుకోగల్గాను. ప్రార్థన, వాక్య పఠనము, సహవాసంలో జీవించుట నేర్చుకున్నాను.

పశ్చాత్తాపము తర్వాత రక్షణానుభవము నుండి బాప్తీస్మము ద్వారా సంఘ సభ్యుడనయ్యాను. నాకు దైవజనులు సొలోమోను రాజు అని ప్రభువు పిలిచిన పేరునే పెట్టారు. శ్రీనివాస్ లోకానికి మరణించంగా క్రీస్తులో నూతన జీవితంలో సాలమన్ రాజుగా మారిపోయాను.

సంపూర్ణ దైవసేవ చేయాలనే కోరిక నన్ను ప్రేరేపించగా ప్రార్థించాను. వాక్యము ద్వారా ఆత్మ జాలరిగా నన్ను జీవించాలన్న ప్రభువు చిత్తాన్ని స్వీకరించి నేను చేస్తున్న ఉపాధ్యాయ వృత్తిని వదిలివేయ దలిచాను. తల్లిదండ్రులు బాధపడి, "ఎలా బ్రతుకుతావురా? పనిచేస్తూ సేవచేయవచ్చు కద! అని బాధపడి నన్ను నిరుత్సాహపర్చారు. తోటి టీచర్లు సన్నిహితులు నన్ను ఉద్యోగము మానుకోవద్దని సలహానిచ్చిననూ, ప్రభువు ప్రేమ నన్ను బలవంతము చేయగా నా ఉద్యోగమునకు రిజైన్‌చేసి, ప్రభుని సేవించుటకై పూర్తిగా సంసిద్ధమయ్యాను.

నా నిర్ణయానికి నా తల్లిదండ్రులు బాధపడిననూ నన్ను క్షమించారు. నా తల్లిదండ్రులకు విరోధముగా పాపము చేసానని ఒప్పుకున్నాను. నా జీవితంలో కల్గిన మార్పును ఒక పత్రికవలె చదువుట కారంభించి ఆశ్చర్యపడేవారు. నేను నిత్య పూజలు చేసే కులదేవుడు వెంకటేశ్వర్లు నన్ను రక్షించలేదు. రోజూ 101 కొబ్బరికాయలు కొట్టి అగరుబత్తీలు వెలిగించి పూజించి నమ్మిన దేవుళ్ళెవరూ నా శ్రమలో ఆదరించలేదు. ఎన్నో తీర్థయాత్రులు, మొక్కుబడులు చేసి తలనీలాలనిచ్చిన వారెవరూ కన్పించలేదు. యేసుప్రభువు నన్ను ప్రేమించి, దర్శించి మరణావస్థలో నున్న నన్ను తాకి మాట్లాడి రక్షించిన నా ప్రియ రక్షకుడు నన్ను తన పరిచర్యకు పిలిచినందున నమ్మకముతో నా సేవ కొనసాగించ గల్గుచున్నాను.

నా తల్లి దండ్రులు నా విశ్వాసాన్ని ఉపేక్షించిననూ, హరినామ స్మరణ చేయక ఉపవాసాలు పూజలలో ఏకీభవించనందున నన్ను వారింటిలో నుండుటకు తగని వాడనని నన్ను పంపివేసారు. నేను హైదరాబాద్ చేరాను. క్రైస్తవులున్న స్థలాన్ని చేరి వారి సంఘములో ఒక దైవజనుని ఆశ్రయించి పరిచర్యలో సహకరించుట కారంభించాను. సేవా కార్యక్రమాల్లో,

ఆరాధనలో పాల్గొనగా దానియేలు గారు అను మరొక దైవజనుడు నాకు చేయూత నిచ్చారు. నా తల్లిదండ్రులు నన్ను విడిచిపెట్టినను నా దేవుడు నాకాశ్రయమై నందున వారి రక్షణకై తీవ్రంగా ప్రార్థించాను. అద్భుత రీతిగా నాలో మార్పువల్ల నేను చెప్పిన సువార్తను వినుట ద్వారా రక్షణానుభవాన్ని పొందారు.

జక్కయ్య క్రీస్తును చేర్చుకొనుట ద్వారా యింటికి రక్షణ వచ్చిన రీతిగా పౌలు సీలలు చెరసాలలో నుండగా జరిగిన అద్భుతాన్ని బట్టి చెరసాల నాయకుడు యింటికి రక్షణ వచ్చిన అనుభవం వలె నా తల్లి దండ్రులు, యిద్దరు తమ్ముళ్ళు, నా చెల్లెళ్ళిద్దరు కూడ ప్రభువు ప్రేమను రుచిచూడగల్గారు. వారికి కూడా ప్రభువు రక్షణనిచ్చిన ప్రేమను బట్టి కృతజ్ఞత చెల్లించాను.

నా తమ్ముడు వేదాంత విద్యను అభ్యసించి బైబిలు కాలేజీలో ప్రొఫెసరుగా పనిచేయుచున్నాడు. సౌలును పౌలుగా మార్చి సువార్త ప్రకటించకపోతే నాకు శ్రమ అన్నరీతిగా బాధ్యతతో ఆయన యిచ్చిన సేవా భారాన్ని యితరులను రక్షించుటకు నా సమయాన్ని, తలాంతులను ఉపయోగించుట దేవుని కృపయే.

అర్థము లేని సనాతనాచారాలతో గడిపిన నన్ను నా వ్యాధి ద్వారా స్వస్థతనిచ్చి దర్శించి రక్షించి ఆత్మాభిషేకాన్నిచ్చారు. అంధకార శక్తులపై అధికారాన్నిచ్చారు. ఆత్మవరాలతో నన్ను నింపారు. స్వదేశము, విదేశాలలో సేవచేయు గొప్ప ధన్యతనిచ్చారు. గతంలో నన్ను ద్వేషించిన నా గ్రామస్తులంతా ఎక్కడ అవమానించారో అదే స్థలములో ఘనతనిచ్చి గౌరవించు భాగ్యాన్నిచ్చారు. పెదబాబు గారు పాస్టరుగారు అని చాలా గౌరవంగా పిలుస్తారు. నా మరణాన్ని కోరుకున్న వారంతా నేడు బాబూ, మా కోసం ప్రార్థించండని ప్రాధేయపడి అడుగుట దేవుని ప్రేమని తలుస్తాను.

ఆత్మ వరాలతో నన్ను ఆయన సేవలో జయకరంగా నడిపించుచున్నారు. ప్రస్తుతము హైదరాబాద్ రామానగర్ ఐ.పి.సి. సంఘములో సంఘ కాపరిగా మహిమ కరముగా నన్ను వాడుకొనుచున్న ప్రభువునకే స్తుతి మహిమ కలుగు గాక.

దేవుని కసాధ్యమైన దేదైనా కలదా? నా వంటి పాపిని తన విలువైన రక్తము ద్వారా రక్షించి, తన బిడ్డగా మార్చుకొన్నారు. తల్లి దండ్రులు విడిచినను నా ప్రభువు నన్ను చేరదీసి ఆదరించారు. సువార్త ప్రకటించే పాదాలు గల వ్యక్తిగా నన్ను సిద్ధపర్చారు. నా సాక్ష్యము మీకు కనువిప్పు కల్గించి క్రీస్తును వెంబడించు ధన్యత నీయాలని నా ప్రార్థన.

# ౬. సజీవుడైన క్రీస్తు సవివరంగా బోధించి నన్ను నడిపిస్తున్నారు

సిరాజుద్దీన్ (మచిలీపట్నము)



**యెహోషువా 1:7 "నీవు నిబ్బరము కలిగి జాగ్రత్తగా నుండి నా సేవకుడైన మోషే నీకు ఆజ్ఞాపించిన ధర్మశాస్త్ర మంతటి చొప్పున చేయవలెను".**

**పరిచయము:-** నేనొక మహమ్మద్దీయ కుటుంబములో జన్మించాను. నేను పుట్టి పెరిగిన స్థానము ఆంధ్రప్రదేశ్‌లో మచిలీపట్నము. నా యింట్లో యిద్దరు అక్కలు, ఒక చెల్లి వుండేవారు. మగపిల్ల వాడిగా నేను ఒక్కడినైనందున చాలా ప్రేమతో పెంచారు. మేమంతా క్రీస్తును ప్రేమించే ఫిన్‌లేండ్ స్త్రీ స్థాపించిన క్రైస్తవ సంస్థ హైయినీ హైస్కూలులోనే విద్యాభ్యాసాన్ని పూర్తి చేసాము. మాతోబుట్టువు లంతా అదే స్కూలులో క్రైస్తవ సిద్ధాంతాలను తెలుసుకొని క్రీస్తు సువార్తను విను అవకాశాన్ని పొందాము.

నా రెండవ అక్క నీలోఫర్ నీలూ అని పిలిచేవారము. ఆమె మొదటిగా క్రీస్తు విశ్వాసిగా మారింది. క్రీస్తు కలల ద్వారా ఆమెతో మాట్లాడేవారు. మా తాతగారు గతంలో రంగూన్‌లో నివసించే రోజుల్లో చేతబడి ప్రభావానికి గురైనారు. మా నాన్న సాయిబాబా పూజలు చేసేవారు. చివరకు మా తాత సైతాను శక్తి ప్రభావం వల్ల రక్తము కక్కుకొని మరణించారు. మా నాన్న అందరి దేవుళ్ళు ఒక్కటేనని నమ్మి అవసరాలలో మాత్రమే ప్రార్థించేవారు. మా చెల్లి మమ్ములను గమనించేది.

నేను మా అక్క 10వ తరగతి తర్వాత ఇంటరు మొదటి సంవత్సరం చదివే రోజుల్లో ఆధ్యాత్మికంగా నాలో చాలా చైతన్యము కల్గింది. క్రీస్తు యెడల అక్క విశ్వాసం అచంచలంగా నుండేది. నేను కాలేజీకి వెళ్ళే దారిలో ఆర్.సి.యం. స్కూలు దాటుకొని వెళ్ళే సమయంలో అక్క చూడకుండా ఆ దేవాలయం ముందు చేతులు జోడించేవాడిని. అక్క వంటి విశ్వాసం కావాలని కోరుకొనేవాడిని. ఎందుకో క్రీస్తు ప్రేమ నన్ను బలవంతం చేస్తుందనే భావన కల్గింది.

ఒకసారి మా అక్క నీలూ నన్ను బైబిలు మిషన్ చర్చికి వెళ్దాం రమ్మని పిలిచింది. "చూడు బాబీ, అక్కడ ఒక భక్తుని ద్వారా దేవుడు నాతో మాట్లాడతాడు. గమనించు" అన్నది. ఆమె చెప్పినట్లే ఒక పాస్టరుగారు అన్యభాషలు మాట్లాడుతూ గతంలో సంఘటనలు,

భవిష్యత్తులో జరుగబోవు విషయాలన్నీ చాలా నిజాయితీగా చెప్పుట చూచి చాలా ఆశ్చర్యపడ్డాను. నా అక్కను సంభోదిస్తూ "నా కుమార్తె నీలిమా" అని పిలిచి చెప్పారు. ఆ సంఘటన నాలో, చెల్లిలో చాలా గొప్ప ప్రభావాన్ని కలుగజేసింది. ఇక క్రీస్తు మాత్రమే సజీవుడగు నిజదేవుడని మనస్సులో నిర్ణయించు కొనగల్గాము.

మాకు సుపరిచితులైన ప్రేమలత ఆంటీ మా దగ్గరకు వచ్చి ప్రతి దినము, సువార్త బోధించి ప్రార్ధించేవారు. ఆ సహవాసం ద్వారా నాలో చాలా ఆసక్తి కల్గింది. నా విద్యాభ్యాసం కోసం ప్రార్ధించుకో అని అడిగేవారు. క్రీస్తు సహాయంతో ప్రార్ధించి విజయం పొందితే నా తలాంతుల ప్రత్యేకత తెలియదనే దురభిప్రాయపడి పరీక్షలలో ప్రార్ధించలేదు. నాకు మాత్రమే చాలా తక్కువ మార్కులు వచ్చాయి. నాతోటి వారికి మంచి మార్కులు వచ్చాయి.

ఆ తర్వాత గ్రహించి తప్పు ఒప్పుకొని రెండవ సంవత్సరము పూర్తిగా ప్రార్ధనపై ఆధారపడి కనిపెట్టాను. ప్రేమలత ఆంటీ కూడా నా కొరకు ప్రార్ధించారు. అద్భుతంగా నా ప్రార్ధనలకు దేవుడు మంచి జవాబునిచ్చి కాలేజీలో రెండవ స్థానాన్నందించారు. దేవున్ని స్తుతించాను. మొదటి రెండు సంవత్సరాల మార్కులను బట్టి కాలేజీలో 3వ స్థానము పొందాను. బి.యస్.సి. మొదటి సంవత్సరములో నా కష్టమును బట్టి, నా ప్రవర్తనను బట్టి గాని నాకు సన్మానము ఏర్పాటు చేసారు. దేవుని వలననే లభించిందని నమ్మి కృతజ్ఞత తెల్పాను.

ఒకసారి ప్రార్ధనా కూడికలో ప్రేమలతా ఆంటీతో నుండగా, బాబీకూడా ప్రభుని నమ్మాడు కద! సాక్ష్యము చెప్పితే బాగుంటుందని సలహాచెప్పారు. నేను సిగ్గుపడి చెప్పలేదు. అదే సమయంలో ప్రవచనాత్మకంగా నా స్థితిని గమనించి ఒక విశ్వాసి "ప్రతిచోట విశ్వాసి సాక్ష్యము చెప్పాలి" అన్నారు. ఆ తర్వాత నేను తప్పక సాక్ష్యము చెప్పుటకు సాహసించాను. నేను, నా స్నేహితుడైన రామకృష్ణతో కలిసి సువార్త తెల్పుట, కరపత్రాలు పంచుట ద్వారా నామకార్ధ క్రైస్తవులు మమ్ములను కించపరచాలని ప్రయత్నించేవారు. ముందున్న వాటికన్న వెనుక వచ్చిన కొమ్ములు వాడి అనేవారు. మేము ఆ మాటలను పట్టించుకోలేదు గాని దేవుడు నాతో మాట్లాడాలని ఆశ వుండేది.

నా పరిస్థితి గమనించి ప్రేమలతాంటీ నాకు మంచి సలహా యిచ్చారు. "ప్రతి పనికి యితరుల ప్రార్ధనపై ఆధారపడతావెందుకు? నీవే స్వయంగా ప్రార్ధించి పొందుకోవాలి" అని తెల్పి ఆమె అనారోగ్య స్థితిలోనుండగా హిజ్కియాకు చెప్పినట్లుగా త్వరలో నీవు మరణమగుదువని ప్రభువు చెప్పగా ప్రార్ధించుకోవాలని ఎందరో దర్శించి సాక్ష్యము

చెప్పేవారట. ఆమె ఎంతో విశ్వాసంతో "ప్రభువా నీవే నిజదేవుడవైతే నాకు కనబడి నన్ను స్వస్థపరచాలి" అని కోరిందట. వెంటనే ఆమె ప్రభుని మెల్లని మృదు మధుర స్వరం విన్నారట. "అమ్మా, నేను స్వస్థపరుస్తాను". ఆమె నాతో తన అనుభవాన్ని చెప్పి, "బాబీ, నీవు స్వయముగా ప్రార్థిస్తే తప్పక మాట్లాడగలరు. క్రీస్తు సజీవుడు. మాట్లాడే దేవుడని చెప్పారు. నాలో క్రీస్తు స్వరం వినాలనే తపనతో ఆ రాత్రి నా గదిలో మోకరించి ప్రార్థించాను. నా ప్రార్థన విని ప్రభువు అతి తెల్లని వస్త్రధారియై నన్ను సమీపించారు. ఆయన వస్త్రాల కదలిక గమనించాను. గొప్ప వెలుగు ఆవరించి వుంది. ఆ తర్వాత సిలువలోనున్న దర్శనము చూచాను.

నేను మరింత ఆసక్తితో క్రీస్తు విశ్వాసులతో సహవాసము చేయునప్పుడు పరిశుద్ధాత్మను పొందాలని తెల్పారు. వారికి భాషలు మాట్లాడు వరముంది. మా అందరిలో పోటీ భావం కల్గింది. ఎవరు ముందుగా పరిశుద్ధాత్మాభిషేకాన్ని, భాషల వరాలు పొందగలరోనని అత్యాసక్తితో ప్రార్థించుటకారంభించాము.

అక్క నీలు, మూడు రోజులు ప్రార్థించగా ఆత్మ రానందున తరువాత రోజు సెలవుపెట్టి కనిపెట్టినప్పుడు ప్రభువు ఆమెతో మాట్లాడి భాషల వరమిచ్చారు. అక్క పొందినది అక్టోబరు నెల అయితే, డిసెంబరు 27వ తేదీ 1995లో మమ్ములను ఆత్మ పొందాలని పరిశుద్ధాత్మాభిషేకముకై స్కూలుమాని ప్రార్థించుటకు నిర్ణయించాము.

అక్క, నేను, చెల్లి మరి యిద్దరు కలిసి గంతులు లేక, అల్లరిలేక ఆత్మపొందదలిచాము. అక్క నాపై, చెల్లిపై సిలువ గుర్తువేసింది. వెంటనే భాషలు మాట్లాడసాగాము. చెల్లి స్పష్టంగా మాట్లాడింది. ఆ తర్వాత ప్రేమలతాంటీ బలహీనమైనప్పుడు ప్రభువు పిలుపునందుకున్నారు. ఆమెకూడా నీ చిత్తము ప్రభూ అని ప్రార్థనలో ఆయన సన్నిధి చేరుటకు సిద్ధపడి ప్రభువును చేరింది. చాలా దు:ఖపడ్డాము. ఆత్మీయ స్థితిలో నేనీస్థితిలో నుండుటకు పునాదిగా ప్రేమలత ఆంటీ, పాస్టరుగారి ప్రేమగల సందేశాలు, ప్రార్థనలే ఆధారమని కృతజ్ఞత కల్గియుంటాము.

మేము ఆత్మీయంగా బలపడి, స్థిరులుగా జీవిస్తూ పేదవారి మధ్యలో క్రీస్తు సువార్త బోధించాలని ఆశించి ఊరికి దూరంగా పూరిగుడిసెలలో నివసించు వారిని చేరాము. అనారోగ్యంతో చర్చికి రానివారిని దర్శించి వాక్యం బోధించి ప్రార్థించేవారము. కొన్నిసార్లు వారివద్ద ఉపవాస ప్రార్థనలు జరిపేవారము. ఒక వ్యక్తికి క్యాన్సరు వ్యాధి వల్ల నీర్సస్థితిలో నుండగా ప్రార్థించాము. ప్రవచనాత్మకంగా ప్రత్యేకమైన ఆకులు తినాలని తెల్పారు. ఆమెకు

ఆకులు తెచ్చి యిచ్చి ఉపవాసముండి ఆసక్తితో రోగికొరకై ప్రార్థించాము.

**యాకోబు 5:16 "ఆసక్తి గల ప్రార్థన రోగికి స్వస్థతనిస్తుందన్న"** వాగ్దానము ఆధారంగా ప్రభువు అద్భుత స్వస్థతనిచ్చినట్లు డాక్టర్ల పరీక్షలో జవాబు పొందింది. ఆమె స్వస్థతను బట్టి అన్యులనేకులు క్రీస్తు ప్రభావాన్ని గుర్తించి క్రీస్తును రక్షకునిగా అంగీకరించారు. విశ్వాసుల సంఖ్య అధికమైనందున ఒక స్థలములో కూడి ప్రార్థించాలని ఆశించాము. మా యిల్లు వాడుకుంటామని మా నాన్నను అడిగితే నిరాకరించారు. అయినా నేను ఒక్కడినే కుమారుడిని గనుక ఆడపిల్లలు పెండ్లయి దూరమయితే నాకే ఆ హక్కువుందని నమ్మి నాన్న కాస్త పట్టుదల తగ్గించుకొని సమ్మతించారు.

చివరకు 11 సంవత్సరాలుగా ఆ యింట్లో ఆరాధనలను కొనసాగించాము. ఆ తర్వాత పెద్దక్కకు పెండ్లి నిర్ణయించారు. ఆమె క్రీస్తును నమ్మిన విశ్వాసి. ఆమె తనకీ సంబంధము దూరము కావాలని ప్రార్థించింది. సరిగ్గా ఆ రోజుల్లో మా పెదనాన్న చనిపోయారు. ఆ పెండ్లి మానుకున్నాము. నేను అక్కను ప్రశ్నించగా నేను ప్రార్థన చేసుకున్నాను. యిది తప్పిపోవాలని. ఎందుకు కోరాననగా నన్ను కాదని నా చెల్లిని ఆశించాడు. యీ మాట ఉత్తరములో నేను చూచానని చెప్పింది. ప్రభువామె కోరికను మన్నించారు. మా మేనత్త కుమారునితో వివాహము జరిగింది. అక్క అత్తవారింట్లో క్రీస్తును నమ్ముట యిష్టములేదు గాని ఆమె విశ్వాసము కాపాడుకున్నారు. తన బిడ్డలను విశ్వాసులుగా పెంచింది.

నేను నా విద్యాభ్యాసాన్ని ముగించాను. డిగ్రీ పూర్తయింది. ఒకసారి దుర్భాషలతో మాట్లాడు స్నేహితున్ని సర్దాగా అనుకరించి బూతులు పల్కాను. ప్రభువు కనుదృష్టి లోకమంతా సంచారము చేస్తుంది. యదార్థవంతులను బలపరుస్తుంది. నా జీవితంలో తెలియక మాట్లాడిన ఆ మాటను కూడా దేవుడు గణనలోనికి తెచ్చారు.

ఒక భక్తుడు ప్రార్థనా సమయంలో ప్రవచనాత్మకంగా నన్నుచూచి గర్జించి "బాబీ, వ్యర్థమైన మాటలు వాడవద్దు. దేవునికిష్టము లేదని" స్పష్టంగా సూటిగా హెచ్చరించాడు. నా కయితే పశ్చాత్తాపంకల్గి ప్రార్థించి క్షమాపణ కోరిన తర్వాత ప్రభువు ప్రతిచిన్న విషయంలో తన బిడ్డలు తప్పుచేయుట సహించలేరని తెలుసుకొని ఆయనపై మరిఎక్కువ ప్రేమ కల్గింది.

వాక్యం ద్వారా పాపము నుండి ఎలా తప్పించుకోవాలో బోధించమని ప్రభువునే అడిగాను. నాకొక కలలో అక్క నేను అడవిలో ప్రార్థిస్తూ యేసయ్యా అని పిలిచానట. అంతలో ఒక చెట్టు మండుచూ కన్పించింది. 'మీ తమ్ముడు నాకు లోబడుటలేదు" అని

స్వరం విన్పించింది. నేను పాస్టరు గారితో కలను చెప్పి "అన్నా, నేను దేవున్ని సంతోష పెట్టలేక పోతున్నాను అని తెల్పాను. ఆయన వెంటనే యోహోషువా 1వ అధ్యాయము ఒకటి నుండి 9వ వచనాలను చదువుకోమన్నారు పదే ధ్యానించమన్నారు.

నేను ఆ సందేశానికి లోబడి వాక్యము ధ్యానించుట, ప్రార్థించుట కలవాటయ్యాను. డిగ్రీ తర్వాత సి.ఎ. (చార్టెడ్ ఎకౌంటు) కోర్సులో చేరాను. మూడేళ్ళు చదివిన పిదప ఎమ్.బి.ఎ లో చేరదలిచాను. ప్రవేటుగా చదువుకోమని స్నేహితులు సలహానిచ్చారు.

ఆ రోజుల్లో మరొక విశ్వాసి పరియమయ్యారు. ఆమె ద్వారా నా ఆలోచనా సరళి మారింది. ఎందుకనో నాలో నిరాశ ఆవరించింది. ఏడ్పు వచ్చేది. ఏ నిర్ణయాలు తీసుకోవాలో అర్థం కాలేదు. ఆలోచనలనుండి విడుదల కావాలని ప్రార్థించి చనిపోవాలి ప్రభువా అని కూడా ప్రార్థించాను. ప్రభువు మరలా స్వరంలో మాట్లాడారు. నీవు బ్రతికి అనేకులను బ్రతికించు అన్నారు. 51వ కీర్తన చదవమన్నారు. 30 నిమిషాలు రోజూ భాషలతో ప్రార్థించమన్నారు.

ఆ రోజుల్లో తిరిగి ఉజ్జీవంతో ప్రార్థించసాగాను. హైదరాబాదు నుండి సరళాంటీ మా ప్రాంతము వచ్చారు. ఆమెతో ప్రభువు మాట్లాడి ప్రవచనము చెప్పారు. "బాబీ, నీవెందుకు మరణించదలిచావు? నిన్ను ప్రభువు ఏర్పాటుచేసుకొన్నారని చెప్పారు. అంతేకాదు ఎమ్.బి.ఎ. విద్య కొనసాగించు, ప్రభువు నీకు జయమిస్తారు అన్నారు. నేను ఆసీటుకై ప్రయత్నించి పరీక్ష వ్రాసాను. గీతం కాలేజీలో సీటు కావాలని ప్రభువును అడిగాను. గీతము కాలేజీలో చేరాలంటే 1000 రేంకు రావాలి. అయితే 200 ప్రశ్నలకు 70 బిట్స్ మాత్రమే జవాబులు వ్రాసాను. నాతోపాటు పరీక్ష వ్రాసినవారు పేపరు చాలా తేలిగ్గా వుందని చెప్పారు. చేతులెత్తి దేవున్ని స్తుతించు అని సరళాంటీ చెప్పారు. ఆ మాటను బట్టి చేతులెత్తి ఒక గంట స్తుతించాను.

నీవు సీటిచ్చావు అని నమ్మి ప్రార్థించాను. జవాబుగా 8000 ర్యాంకు వచ్చింది. నా స్నేహితులకు మరి ఎక్కువ వచ్చింది. నా ర్యాంకును బట్టి భీమవరం, ఏలూరులో సీటు రావచ్చును అనుకున్నాను. ప్రభువును నమ్మినందున అద్భుతంగా గీతము కాలేజీలో సీటు వచ్చింది. ఆ రోజుల్లో విభిన్న సేవకుల  ప్రార్థనలు ప్రవచనాలతో నన్ను ప్రభువు సేవకు పిలుస్తున్నారని స్పష్టంగా చెప్పారు. కాని ఉద్యోగము ద్వారా అక్కకు సహాయపడాలని తలంచాను. ఆ రోజుల్లో విశాఖలో ఆలివ్ గ్రీన్ అనే భక్తుడు ప్రవచనాత్మకంగా అనేక విషయాలు తెలుసుకుంటారని చెప్పారు. ఆయనను కలుసుకోవాలని వెళ్ళగా ఆయన నన్ను

ఆశ్చర్యపరుస్తూ "బాబూ, నిన్ను చూపించి ప్రభువు నిన్ను గురించి చెప్పారు. నీ అనుభవాల్ని నేను తెలుసుకోవాలి. నీవు నా నుండి నేర్చుకోవాలని అన్నారు.

ఒక విశ్వాసి నాతో సేవకు పిలుస్తున్నారని చెప్పగా మరొకరు ఉద్యోగం మంచిదన్నారు. వారంతా స్వంత యిష్టముతో చెప్పివున్నచో నీవు నాకు చెప్పాలి. నీవు చెప్పిన మాట వాక్యానుసారంగా వుండాలని కూడా చెప్పాను. చాలా ఇంటర్వ్యూలు వచ్చాయి. నేను కోరుకోలేదు. ప్రభువు సూటిగా మాట్లాడాలని కోరగా "బాబీ ప్రక్కయింట్లో కుండలో పామువుంది. నా మాటగా చూడు" అన్నారు. వెళ్ళి చూడగా నిజంగానే పాముంది. చంపేసాను. వాక్యం కూడా కావాలన్నారు.

**యిర్మీయా 1:5 "గర్భములో రూపొందక ముందే నిన్నెరిగితిని. నేను ప్రతిష్టించితిని".**

నేను పంపిన దగ్గరకు నీవు వెళ్ళగలవా? అని అడిగారు. ఆలివ్ గారి వద్ద ఒకనెల ఆత్మీయంగా తర్ఫీదు పొందాను. ఆలివ్‌గారు నన్ను ఉద్యోగం చేయమన్నారు. 2007వ సంవత్సరంలో ఆత్మీయంగా బలంతో నిలిచాను. అక్కకు పెండ్లయింది. 2007లోనే ఉద్యోగంలో చేరాను. రెండు సంవత్సరాలు ఉద్యోగం చేసాను. తర్వాత నా వివాహమయింది. అది 2008వ సంవత్సరంలో నన్ను సేవకు పిలిచారు. నేను మా బంధువులలోని మేనరికంలో నున్న అమ్మాయిని వివాహం చేసుకొని నా యిష్టాలన్నీ చాలా వివరంగా వివరించాను. నేను దేవుని సేవ చేయదలచాను. నీవు సమ్మతించాలన్నాను. ఆమె కాస్త సంశయంతో ఎలా బ్రతకాలి? అని భయపడింది.

**హెబ్రీ 10:35 "మీ ధైర్యము విడిచిపెట్టకుడి. దానికి ప్రతిఫలముగా గొప్ప బహుమానము కలుగును. దానికి ఓరిమి అవసరమైయున్నది".**

విశ్వాసమూలంగా నీతిమంతుడు జీవిస్తాడు. క్రియాత్మకంగా ఆలోచించాలన్నారు. ఆ తర్వాత నా భార్య గర్భవతిగా నుండగా ప్రభువే స్వయంగా ఆమెతో మాట్లాడారు. ఆమె సమ్మతించగా నేను ఆనందించాను. నేను ఉద్యోగము మానుకుంటానని చెప్పగా ఆయనకు చాలా కోపము కల్గింది. "నన్ను పిలిచిన నా దేవుడడే నన్ను పోషించు నమ్మదగినవాడని" చెప్పాను. మా అక్క భర్తతో సంప్రదించగా నీ నిర్ణయంలో వెనుకకు తిరుగవద్దనియు, దేవుడు మోషేకు తోడుగా నున్నట్లుగా నాతోడుగా నున్నాడని అభయమిచ్చారు. మా నాన్న బాధపడి నా గొంతుకోసేసాడని అన్నారు. అమ్మ మాత్రము బాబూ దేవునికే లోబడు అని తెల్పింది. నా స్నేహితులంతా ప్రత్యేక ప్రార్థనా మందిరము కావాలని ముందుగా డేరా వేయాలని ప్రయత్నించారు.

**మార్కు 11:24 "ప్రార్థన చేయునప్పుడు మీరు అడుగుచున్న వాటినెల్లను పొందియున్నామని నమ్ముడి. అప్పుడు మీకు అది కలుగును అని మీతో చెప్పుచున్నాను".**

మేమంతా మూడు రోజులు ఉపవాసముండి ప్రార్థించాము. దేవుడిస్తాడని నమ్మాము. చర్చి నిర్మాణమునకై అమావాస్య రోజు ప్రార్థించి శంఖుస్థాపన చేసాము. బోరువేయగా నీరు పనికిరాదన్నారు. ఎన్నో అవరోధాలు ఎదుర్కొన్నాము. ప్రభువు వాక్యమిచ్చి ధైర్యపరిచారు. అందరూ తోచిన రీతిగా డబ్బులిచ్చారు. యిచ్చినదంతా పునాదికే సరిపోయింది. ఎవరినీ డబ్బులు ఇవ్వమని యాచించనన్నాను. నాకు పి.ఎఫ్. డబ్బులందాయి. కొందరు నాపరాళ్ళిచ్చారు. ఆలివ్ అన్నయ్య చాలా ఆత్మీయ సలహాలిచ్చేవారు.

దేవుని రాజ్యం నీవు వెదికితే చాలు. ప్రభువే అన్నీ సమకూర్చగలరని చెప్పారు. కొందరు బంగారం అమ్మి డబ్బులందించారు. గుంటూరు నుండి ఫోను వచ్చింది. అవసరానికి 30 వేలు అందించగా మా నాన్న ఆశ్చర్యపడ్డారు. చివరకు దిగ్విజయముగా చర్చినిర్మాణము పూర్తయింది. 2010 ఫిబ్రవరి 3వ తేదీ చర్చిని ఆరంభించాము. అదే నెల 19వ తేదీ మాకు కుమారుని ప్రభువు యిచ్చారు.

ఒకసారి నేను నా స్నేహితుడు సముద్రస్నానం చేస్తూ మునిగిపోయాము. భాషలతో మాట్లాడి ప్రార్థించు అనే తలంపు కల్గింది. నీవు తీర్పు తీర్చునపుడు నీతిమంతుడవు కద అని దేవునిని అడిగాము. భాషలలో దేవునితో మాట్లాడుచుండగానే ఎవరో వచ్చి రక్షించారు. ఆశ్చర్య రీతిగా ప్రభువు మా పరిచర్యను దీవిస్తున్నారు. మా సేవ ఘనమైన రీతిగా కొనసాగుచూ దేవుని మహిమార్థము ఆత్మల జాలరిగా నన్ను సేవలో వాడుకొనుచున్నారు. మహమ్మద్దీయుడనై నమాజు చేసుకొనవలసిన నన్ను ఎన్నుకొని రక్షించి ఆయన సేవకు పిలిచిన దేవునికి స్తుతి స్తోత్రం కల్గును గాక. ఆమెన్.

---------

# 7. బాధపడు వారిని ఆదరించే దేవుడు యేసేనని నేను నమ్ముకున్నాను

–శాంతమ్మ (విశాఖ)



**కీర్తనలు 9:9 "బాధపడు వారి నిరీక్షణాస్పదము ఎన్నటికి నశించదు".**

**పరిచయము:–** నా జీవిత సాక్ష్యము ద్వారా దేవునికే మహిమ కల్గును గాక. మీకు నా వందనాలు దేవుని సంకల్పము చొప్పున వీడియోద్వారా అనేకులు నా సాక్ష్యము విను ధన్యత లభించుటను బట్టి నా ఆత్మ ఉల్లసిస్తుంది. అనేకులు ఈ క్రీస్తే నిజ దేవుడని నమ్మాలని నా ఆకాంక్ష.

నా తల్లి దండ్రులకు కల్గిన ఐదుగురు సంతానములో రెండవ బిడ్డగా జన్మించాను. నా పేరు శాంతమ్మ. బాగా ఆస్థి వుండేది గాని పరిస్థితుల వల్ల బాగా చితికిపోయి బీదస్థితికి చేరుకున్నాము. గతంలో 10 సంవత్సరాల వయస్సున్నప్పుడు నాకొక స్వరం విన్పించింది. "నీవు పాపివి" అనగా నేను పాపినని గ్రహించాను. మరొక సత్యమేమనగా మేము విగ్రహాలను పూజించేవారము గనుక ఏనాడూ స్వరంతో మాట్లాడలేదు. దేవుడు మాట్లాడితే వినాలన్న ఆశ నాలో కల్గింది.

ఇట్టి ఆలోచనలలో నే నుండగా 15వ యేట అమాయక స్థితిలో నాకు వివాహము జరిగింది. నాకు ఐదుగురు సంతానము కల్గారు. వారిలో యిద్దరు మరణించారు. నా భర్త డార్కు యార్డులో కాంట్రాక్టు పనిలో పూర్తిగా లీనమయ్యేవారు. నాకు చాలా బంగారము, డబ్బు నా భర్త సమకూర్చారు. అనుకోని రీతిగా పనిలో ప్రమాదవశాత్తు, నా భర్తకు గాయాలయినప్పుడు బాధ మరిచిపోవుటకు కొంచము మధ్యము సేవించ వచ్చునని తెల్పారు. ఉన్న ఆస్థి మొత్తము ఖాళీ అయింది. నాకు మనస్సు బాధకల్గి యీ స్థితికి వచ్చామని తలంచి పూజలు మరింత తీవ్రము చేసాను.

గతంలో శివాలయము మెట్లు కడిగి ఉపవాసముండి 70 తులాల బంగారము డబ్బు కట్టలు పెట్టి పూజించిన నేను తిండిలేని స్థితికి చేరాను. తదుపరి క్యాన్సరు వ్యాధి నన్ను చేరింది. డాక్టరు బ్రతుకుట కష్టమని చెప్పారు. ఆ రోజుల్లో అరకులోయ ప్రాంతంలో నివసించవలసి వచ్చింది. నా యింటి ప్రక్కనున్న కుటుంబీకులు క్రీస్తును నమ్మిన విశ్వాసులైనందున నాకు కల్గిన వ్యాధిని బట్టి నాకు బైబిలు యిచ్చి ప్రార్థించారు. క్రైస్తవులు

తక్కువ జాతివారు. విదేశీ మతాన్ని స్వీకరించే వారనే తేలిక భావం వుండుటను బట్టి చాల కోపంతో తృణీకరించాను. వేదాలన్నీ చదువుకొనే నేను ఎందుకో ఒకసారి బైబిలు కూడా చూడాలని ఆశించాను. ఆ క్షణం బైబిలు తెరిచి చూడగా

**యోహాను 19:4 "ఇదిగో ఈయన యందు యే దోషము నాకు కనబడలేదు".**

ఈ మాట చదువగానే నా హృదయంలో వింత ఆలోచనలు చెలరేగాయి. దోషములేని వాడే నా క్రీస్తు. అంత పవిత్రుడా! అని ఎందుకో అకారణంగా దు:ఖము కల్గింది. నా పిల్లలు క్రైస్తవుల పిల్లలతో సహవాసం చేసేవారు. వారితో ఆదివారం సండే స్కూలులో కథలు కూడా వినేవారు. ఆ పరిచయంతో క్రైస్తవుల యింటిలో ఆ స్త్రీ నన్ను ఆదివారం చర్చికి వస్తారా అని అడిగింది.

ఎందుకో ఒకసారి ఆలయాన్ని చూడాలనిపించి ఆమెతో వెళ్ళాను. నేను కూడా నా భర్త మద్యం త్రాగి బాధ మర్చిపోయిన రీతిగా, నా బిడ్డలు మరణించిన బాధ పోగొట్టుకొనుటకు సిగ్గు విడిచి మద్యము సేవించేదానిని. నాలో కూడా మగవారిలో నున్న దురభ్యాసాలు వుండేవి. అబద్ధాలాడుట, పేకాట మీద ఆపేక్ష, త్రాగుట యివన్నీ దేవుడు యిష్టపడని పాపాలు.

ఆ రోజు ఆరాధనలో ఆరాధన తర్వాత వాక్య పరిచర్య సమయంలో చెప్పిన బోధంతా నాకొరకేనా? అని తోచింది. నా బలహీనతలన్నీ ప్రక్కింటి స్త్రీ ఆయనకు చెప్పినట్లుందని తలంచాను. పాస్టరు చెప్పిన మాటలకు చాలా దు:ఖం కల్గింది. ఆయన మాటలు సూటిగా నాకే తాకాయి. వ్యభిచారులారా, విగ్రహారాధికులారా, పాపులారా, మీ కోసమే క్రీస్తు ఈ లోకానికి వచ్చారు. రక్షణ సువార్త అందించుటకు రక్షించిన వారికి నిత్య జీవాన్ని యివ్వాలని వచ్చిన క్రీస్తు సజీవుడు. ఆయనే నిజదేవుడు. ఆయనే మార్గము, సత్యము, జీవమునని చెప్పాడు.

ఆహ్వానించి నీ హృదయములో చేర్చుకొని నెమ్మది పొందు అని తెల్పాడు. అంతేకాదు మాట్లాడే దేవుడు మరియు రోగాలు స్వస్థపర్చే దేవుడు. యీ కబుర్లన్నీ అబద్ధాలే ననుకున్నాను. ఎన్నో పూజలు చేసిన నాకెన్నడూ కనబడలేదు. మాట్లాడలేదు. ఈయన మాటలు సత్యమని నేనెలా నమ్మాలి అని సంశయంతో యింటికి తిరిగి వెళ్ళిపోవాలని కోరుకున్నాను. నాతో వచ్చిన స్త్రీ నన్ను పిలిచి "ఉండమ్మా, నీవు నీ పాపాలు మొకరించి ఒప్పుకో. ఒక్కవారం ప్రార్థించు. ప్రభువా నీవే నాకు స్వయంగా కనబడి మాట్లాడాలి ప్రభువా అని అడుగు. నీకు ఒక్క వారము గడువిస్తున్నాను. సరిగ్గా వారం తర్వాత నీకు నచ్చకపోయినచో మానుకో" అని నచ్చజెప్పింది. నా జబ్బు, నా బాధ నాకు తప్ప ఎవరికీ తెలియదు. ఎందుకింత

ఖచ్చితంగా నీ వ్యాధికి స్వస్థతనిచ్చేది క్రీస్తేనని చెప్పగల్గింది? నాకయితే క్యాన్సరు రోగము నయమయ్యేది కాదు. ఏదో ఒకరోజు మరణము తప్పదని నాలో నేనే దృఢ నిశ్చయతతో కనిపెట్టి చివరి దశలోనే ఉన్నాను. కొద్ది నెలలే నీకు భూమిపై గడిపే సమయం మిగిలిందని డాక్టర్లు స్పష్టంగా తెల్పారు.

“సరే ఆమె మాటలను అంగీకరిస్తూ మోకరించి ప్రార్థించి ప్రభువా నేను పాపిని. చాలా పాపాలు చేసాను. నన్ను కనికరించి, క్షమించి, నాకు జీవమిచ్చి బ్రతికిస్తే నిన్నే నమ్ముకుంటాను. నేను మరణిస్తే నా బిడ్డలనెవరు చూస్తారయ్యా అని చాలా దు:ఖముతో ఏడ్చి ప్రార్థించాను.

నా ప్రక్కింటి స్త్రీ నాకిచ్చిన గడువు సరిగ్గా వారములో 5 రోజులు గడిచాయి. ఒక అద్భుతాన్ని ఆరోజే 2 గంటల సమయంలో ఎదుర్కొన్నాను. అకస్మాత్తుగా పరలోకం తెరువబడుట చూడగల్గాను. వింత దేదీప్య మానమగు వెలుగు నా చుట్టూ ఆవరించింది. ఆ వెలుగు నా కడుపు భాగం మీద, మెడపై ప్రసరించుట వల్ల చాలా నెమ్మది కల్గింది. గొప్ప ప్రశాంతత చేకూరింది.

నేను క్యాన్సరు వ్యాధి బాధ వల్ల నీరసంగా నుండుటచే నాలుగు అడుగులు కూడా నడిచేస్థితి లేనప్పుడు నా చెల్లి యింటికి వచ్చి వంటచేసి నాకు సహాయపడేది. ఆమె నాలోనున్న సంతోషమును గమనించి ఆశ్చర్యపడింది. నా కడుపు భాగాన్ని నొక్కి చూడగా నొప్పి మాయమయింది. కింద భాగం కూడా నొప్పి లేనందున ఎగిరి గంతులు వేయసాగాను. ఈ క్రైస్తవులు సేవించే దేవుడికింత మహిమ వున్నదా! అని ఆశ్చర్యపడ్డాను.

ఒక్కసారిగా గతంలోకి తొంగిచూస్తే క్రైస్తవులను ఎంతో ద్వేషించేదాన్ని. వాళ్ళను బయటకు త్రోసి నీళ్ళు ప్రవహింపజేసి కడిగి పవిత్రపర్చుకొనేదాన్ని. యింత గొప్ప మహాత్యము చేయు దేవుడిని యింత కాలముగా దూరంగా ఉంచానా అని తలంచాను. అంటరాని వారని న్యూనతా భావంగా చూచాను. నేడు క్రీస్తును నమ్మిన తర్వాత వారితో కలిసి భోజనం చేయుటకైనా సంసిద్ధంగా నిలిచాను. గతంలో మీరువస్తే నీళ్ళు విసిరి అవమానించాను. దయతో క్షమించండి. మీతో భోజనము చేయుటకైనను సిద్ధమేనని తెల్పాను. యేసు క్రీస్తు స్వస్థపర్చు వాడని అందరితో చెప్పుటకారంభించాను.

రోజూ 10 గంటలకు పనిపూర్తి చేసుకొనిన వెంటనే ప్రతి యింటిని దర్శించి సువార్త తెల్పుచూ నా పట్ల దేవుని కృపగల దర్శనాలను గూర్చి వివరించుటకు ఆరంభించాను. వేరే ఊరిలో కాంట్రాక్టు ముగించుకొని నా భర్త నన్ను బిడ్డలను చేరారు. నాలో కల్గిన మార్పును స్పష్టంగా గమనించారు.

మన దేవుళ్ళను మరచి క్రొత్త దేవుళ్ళెందుకు? వదులుకో అని తీవ్రంగా కోప పడ్డారు. నాకు యింటి ఖర్చులకు కేవలము నెలకు 100 రూ॥లు మాత్రమే యిచ్చేవారు. బిడ్డలకు మాత్రమే భోజనము పెట్టి నేను పండ్లుతిని గడిపివేసేదానను. నా ప్రాణము కాపాడుకొని దైవరాజ్యం చేరాలని మాత్రమే ఆశ ఉండేది.

ఈ రీతిగా 100 రూపాయలు నా భర్త ఇవ్వటం ఒకటిన్నర సంవత్సరాలుగా కొనసాగించారు. విశాఖ తిరిగి వచ్చినప్పుడు నీటి బాప్తీస్మము ద్వారా విశ్వాసములో స్థిరపడ్డాను. చాలా విమర్శలను, శ్రమలను ఎదుర్కొన్నాను. బంధువులంతా క్రీస్తు పట్ల నా నమ్మకానికి వ్యతిరేఖించారు. బాధించి మానసికంగా హింసించారు.

నా ప్రార్థనలలో దేవుడందించిన శక్తిని బట్టి స్వస్థతలు ఆరంభమయ్యాయి. నా ఆహారము మాత్రము తరచుగా ఉపవాసాలు, పండ్లు తినుట ద్వారా ఏకాగ్రతతో ప్రార్థించేదాన్ని. మామిడికాయలు, జామకాయలు, పనస తొనలు చవకగా లభించేవి. “నీవు క్రీస్తును వదులుకోగల్గినచో నా దగ్గరున్న 10 వేల రూపాయిలు యిస్తాను. లేనిచో 100 రూపాయల సొమ్ముతోనే గడుపుటే నీగతి అని తృణీకరించగా, నేనే మాత్రము సమ్మతింపక క్రీస్తు కొరకు విశ్వాసంతో నమ్మకంగా నా ప్రేమను కనపర్చుకొని శ్రమనే ఎన్నుకున్నాను.

నా విశ్వాసం కాపాడుకొనుటకు చాలా శ్రమ ఎదుర్కొనవలసి వచ్చినందున కొన్నిసార్లు విసిగిపోయి ఏడ్చి “ప్రభువా నీచిత్తమైతే నాకు మరణాన్నివ్వండి” అని అడిగాను. చర్చికి వెళ్ళినరోజు దెబ్బలు కొట్టి గాయపర్చేవారు. కేవలము పిల్లలను బ్రతికించుటకై నేను ధైర్యము తెచ్చుకున్నాను. కాని 3 సంవత్సరాలు మార్పులేని శ్రమల ఫలితంగా నిరుత్సాహము కలిగినందున క్రీస్తు సహవాసం వదలి యింట్లోనే గడుపుచు దేవాలయం దర్శించుట మానివేయాలని తలంచాను. క్రీస్తు ప్రతి వ్యక్తిని వెదకి రక్షించు సమర్థుడే కాదు యదార్థ వంతులను బలపర్చుటకు ఆయన కనుదృష్టి సంచారము చేయును గనుక నేను ఆయన సన్నిధి నుండి దూరమగుట ఇష్టములేక నాకు అద్భుతంగా దర్శనమిచ్చి కాపాడారు.

ఆ రోజు పరలోకము నా ముందర దిగివచ్చింది. మెల్లగా ప్రభువు ప్రకాశ వంతంగా కనిపించారు. నా చెంతకు చేరారు. నాతో మెల్లని స్వరంతో మాట్లాడారు. ఆ మాట బైబిలులో నున్నదని కూడా తెల్పారు. అది ఎక్కడ వున్నది ప్రభువా అని ప్రశ్నించగా అమ్మా కీర్తనలు 9:16-18 వరకు చదువు అని తెల్పారు. అంతే కాదు తిరిగి వెళ్ళునపుడు చాలా విచారంగా వెళ్ళుటను బట్టి “ప్రభువా, ఎందుకంతగా దిగులుగా నున్నారని ప్రశ్నించగా, నీవు నన్ను వదిలిపెట్టే ఆలోచనతో నుండుట బాధించిందమ్మా అన్నారు.

18 సంవత్సరాలుగా శ్రమలు పడ్డాను. దేవుడు ఇక తోడుగా నుంటాను ధైర్యంగా వుండమన్నారు. ఇల్లు కట్టిస్తాము క్రీస్తును వదిలెయ్యమని పదే పదే బంధువులంతా శోధిస్తూనే ఉన్నారు. నేను ప్రభువును వదలను. వదిలితే చనిపోతాను. ప్రభువు నన్ను దర్శించిన తర్వాత చాలా ధైర్యముతో శోధనలన్నీ ఎదుర్కొన్నాను. నాలోని అనారోగ్యమంతా సమసిపోయింది. నాలో క్రీస్తు నిలిపిన శక్తిగల ప్రార్థనా బలము వల్ల ప్రార్థించిన వెంటనే అనేక మంది వ్యాధిగ్రస్తులలో స్వస్థతలెన్నో ఆరంభమయ్యాయి.

క్యాన్సరు వ్యాధి తగ్గిపోవుట, భార్య భర్తలలో విబేధాలు కూడా సమసిపోవుట ఆశ్చర్యం కల్గించింది. ఎయిడ్స్ వ్యాధి గ్రస్తులు స్వస్థత పొందేవారు. రక్తం కారేవరకు నా భర్త నన్ను బాదేవారు. క్రీస్తు నాతో చెప్పిన మాటలన్నీ జ్ఞాపకమొచ్చాయి.

**కీర్తనలు 9:16-18**

16. యెహోవా ప్రత్యక్షమాయెను. ఆయన తీర్పు తీర్చియున్నాడు. దుష్టులు తాము చేసుకొనిన దానిలో చిక్కి యున్నారు.

17. దుష్టులును దేవుని మరచు జనులందరును పాతాళమునకు దిగిపోవుదురు.

18. దరిద్రులు నిత్యము మరువబడరు. బాధ పరచబడు వారి నిరీక్షణాస్పదము ఎన్నటికీ నశించదు. నాలో గతంలో బాధలు, పోరాటాల సమయంలో ఎలుకల మందు తినాలని వెళ్ళాను. తీరా తినాలనుకొనే సరికి పిల్లలు వచ్చి నా ముందున్నారు. ఆపివేసాను. మరొకసారి నిద్ర మాత్రలు కొనుక్కొని మ్రింగుదామని బయలుదేరి ప్రతి కొట్టులో కొన్ని మాత్రమే కొంటూ తగినన్ని మాత్రలు సేకరించాను. కాని వాటిని మ్రింగుటకు నా పిల్లలే ఎదురయ్యారు. ప్రభువే నన్ను రెండుసార్లు మరణించే ప్రయత్నం నుండి తప్పించారు.

నా భర్త ప్రవర్తనలో మార్పు ఏమీలేదు. ప్రభువు నాతో సూటిగా స్వరంతో మాట్లాడి "అమ్మా, నీ భర్త త్వరలో మరణించనై యున్నాడు" అని తెల్పారు. అయ్యా దయతో క్షమించి బ్రతికించండి ప్రభువా అని అడిగాను. నీవు అతనిని క్షమించే పనిలేదు. చాలా కాలము అవకాశం కల్గించాను. ఫరో వంటి కఠినమైన స్థితిలోనున్నాడు. ఫలానా రోజున మరణిస్తాడని చెప్పినట్లే మరణించాడు. అంత్యక్రియలు ముగిసాయి. బంధువులంతా ఎవరి యిళ్ళకు వారు వెళ్ళిపోయారు. ప్రభువు నన్ను చాలా ఆదరించి ఆదుకున్నారు. తీయగా నాతో మాట్లాడేవారు. పరలోక దర్శనాల నిచ్చి క్రొత్త అనుభవాల ధైర్యంతో బిడ్డలను సంరక్షించుకోగల్గాను.

ఒకసారి దర్శనంలో ప్రభు రాత్రి సంస్కారము జరిగించి రొట్టె, ద్రాక్షా రసమందించగా నాకెంతో ఆనందం, మనశ్శాంతి కల్గింది. అందమైన అనుభవం స్వంతము కావాలని ఆశించి, ప్రభువా నీవుండే పరలోకం నాకు కూడా కావాలి అని అడిగాను. ప్రభువు వెంటనే, "నీ పని నీకు నేను అప్పగించి, నీకు ఒక సంఘ పరిచర్యను అందిస్తాను. ధైర్యంగా నుండు అన్నారు.

ప్రభుని మాట బంగారు బాటగా మారి నాకు ఆర్థికంగా గొప్ప స్థితినిచ్చారు. బిడ్డలకు మంచి విద్యను, ఉద్యోగాలనిచ్చి వారి పరిస్థితిలో అధిక అభివృద్ధి కల్గించుటను బట్టి మూడు అంతస్తుల భవనాన్ని నాకిచ్చిన దేవున్ని స్తుతించాను. నా చిన్నమ్మాయి మంచి విశ్వాసి. నేను చేస్తున్న సేవలో సహకారం అందిస్తూనే ఉంది. నాకిచ్చిన

**హెబ్రీ 13:5 "నిన్ను విడువను, ఎడబాయనని"** చెప్పగా, ప్రభువా, ఆ మాట బైబిలో వున్నదా? అని ప్రశ్నించగా హెబ్రీలో నున్నదని తెల్పారు. చాలాసార్లు నాతో స్వయంగా మాట్లాడి ధైర్యపరచి వివేకాన్ని నేర్పించి నడిపిస్తూనే వున్నారు. మంచి పాటలు మాటలుగా యిచ్చేవారు.

నా సాక్ష్యము నావలె శ్రమలో నున్న వారందరికీ ఆదరణ నివ్వాలని నా ఆశయం. నన్ను విశ్వాసంలో బలంగా, శ్రమలలో స్థిరంగా నిలబెట్టారు. అనేకులకు ఆదర్శంగా నా జీవితాన్ని మార్చారు. నన్ను ఏ స్థలంలో ద్వేషించారో అదే స్థలంలో నాకు నా సంఘస్తుల సహకారము ఎక్కువగా నుండగా సంఘపరిచర్య నిరాటంకముగా కొనసాగిస్తున్నాను.

నాకు ప్రభువిచ్చిన పాట యిదే :-
ద్రాక్షా వల్లివి నీవు – నీలో తీగను నేను
నీలాగా జీవించాలనీ – నీలాగ ఫలించాలని
యిదే నా ఆశ – యిదే నా ధ్యాస
నిరాధారమైన జీవితానికి – ఆధారము నీవయ్యావు
విసిగిన బ్రతుకులో – పగిలిన గుండెలో
నీ వెలుగును పంపావయ్యా – నీ సాక్షిగా నేనుండాలయ్యా


నన్ను ఎంతో బలంగా ఆయన సేవలో వాగ్ధానాలనిచ్చి నడిపిస్తున్నారు. ఎన్నో బలహీనతలలో బలమిచ్చారు. కన్నీటి లోయలో, కష్టాల చీకటిలో, శ్రమలో దాగిన సిరులను చూపారు. నా ప్రభువు ప్రేమకు నేను సాక్షిని. దేవుడు మనలను దీవించును గాక. ఆమెన్.

---------

## 8. వెదకని నాకు దొరికిన దేవుడు

-రెవ. బోలెం పాల్ రామబ్రహ్మం గారు(విజయవాడ)

**లూకా 19:10 "నశించిన దానిని వెదకి రక్షించుటకు మనుష్య కుమారుడు వచ్చెను".**



"నశించిన దానిని వెదకి రక్షించడానికి మనుష్య కుమారుడు ఈ లోకములోనికి వచ్చి వెదకని నాకు దొరికిన గొప్ప దేవుడు తన కృపలో కాచి కాపాడుతున్నందుకు కృతజ్ఞతా స్తోత్రాలు తెలియజేస్తూ..." ప్రభువైన యేసుక్రీస్తు ఈ లోకములోనికి రాకుండా, మా కుటుంబాన్ని దర్శించకుండా ఉన్నట్లయితే మా జీవితాలు ఎండిన ఎడారిలా ఉండే వనడంలో ఇసుమంతైనా సందేహం లేదు.

1962 సం॥లో నేను విద్యాభ్యాసం సంపూర్తి చేసిన తరువాత కృష్ణాజిల్లా, పమిడిముక్కల మండలం, మేడూరు గ్రామములోని ఉన్నత పాఠశాలలో నాకొక జాబ్ వచ్చింది. జాబ్ వచ్చిన 2 నెలలకు మా మేనమామ గారమ్మాయితో వివాహం జరిగింది. అప్పటికి మేము విగ్రహారాధికులమే. తరువాత సుమారు 2 సం॥ల తరువాత ప్రస్తుతం మండల కేంద్రముగా ఉన్న ఉంగుటూరు (కృష్ణాజిల్లా) ఉన్నత పాఠశాలకు బదిలీ చేయబడ్డాను. నాకు చిన్నతనం నుండి ఎలాంటి దురలవాట్లు లేవు. (అప్పుడప్పుడు సినిమాలు చూడటం మినహాయించి). నేను చదువుకొనేటప్పుడు వేసవి సెలవుల్లో వ్యవసాయం పనులకు కూలీగా వెళ్ళేవాడిని. మాది మధ్యతరగతి కుటుంబం. ఇంటిలో ప్రధమ సంతానాన్ని. నా తరువాత ముగ్గురు తమ్ముళ్ళు, ఇద్దరు చెల్లెళ్ళు.

కుటుంబం యొక్క కట్టుబాట్లలో చాలా క్రమశిక్షణతో వుండే నేను ఉంగుటూరు గ్రామం బదిలీ అయిన తరువాత ఒక్కసారిగా రెక్కలు వచ్చిన పక్షిలా విహరించనారంభించాను. ఆ పాఠశాలలో వున్న స్టాఫ్ అంతా యవ్వనస్థులు కావడంతో సరదాగా ఆరంభించిన పొగత్రాగడం, పేకాట ఆడటం అలవాటై నేను వాటికి బానిసయ్యాను. రాత్రనక, పగలనక అదే పిచ్చిలో ఉండేవాడను. అలాంటి సమయంలో పెళ్లయిన 4 యేళ్ళ వరకు పిల్లలు లేరు.

నేను నివాసముంటున్న పొరుగున ఒక మామ్మగారు, తాతగారు ప్రార్ధనకెళ్ళేవారు. వారి సలహా మేరకు నా భార్య ప్రభువునందు విశ్వాసముండచడంతో ఆమెను ఒక రాత్రి

ప్రభువు దర్శించి ఆపరేషన్ చేసినట్లుగా చూచిన వెంటనే ఆమెకున్నటువంటి బలహీనత మటుమాయమై గర్భవతియై ఒక మంచి బహుమానాన్ని (ఆడబిడ్డ) పొందుకుంది. అయినా నాకేమీ పట్టలేదు. పైగా సొసైటీలో నా స్నేహితులు నా భార్య ప్రార్థనకెళ్తుందని హేళన చేసేవారు. అవి తట్టుకోలేక ఆమెపై చాలా ఆంక్షలు విధించాను. బొట్టు లేకుండా నా గడప తొక్కడానికి వీలులేదని శాసించిన కఠినాత్ముడను. నేను నా అలవాట్లలో మునిగితేలుతున్నాను.

ఏడు సం॥ల అనంతరం మరలా నా స్వగ్రామమైన మేడూరుకు బదిలీ అయ్యింది. ఆ సమయంలో మా మామగారు తరువాత మా అత్తగారు చనిపోయారు. నా భార్య మానసికంగా చాలా కృంగిన దశలో ఒక ప్రార్థనా పరురాలైన మామ్మగారిని నేనే ఆమెకు పరిచయం చేయగా దు:ఖ నివారణ కలగడం మాత్రమే కాక సంపూర్ణమైన రక్షణానందాన్ని పొందుకుంది. నేనింకా నా అలవాట్లు మానలేదు. ఒక్కోసారి తెల్లవారు జామున ఇంటికి వస్తే విసుక్కోకుండా ప్రేమతో నవ్వుతూ మీరు కూడా ప్రార్థన చేసుకొనండి అని ప్రాధేయపడుతూ వుండేది నా భార్య. నేను అంటీ ముట్టనట్లుగా వ్యవహరించేవాణ్ణి. అప్పటికే మరి ఇద్దరు మగబిడ్డలను దేవుడు మాకనుగ్రహించాడు. రాత్రిపూట మేమంతా పండుకొనిన తరువాత నాకు, నా ముగ్గురు బిడ్డలకు నూనెరాసి ప్రార్థించి భారహృదయంతో వేదనాభరితురాలై ప్రలాపించి అంగలార్చేది నా భార్య. అట్టి ప్రార్థన దేవునికి ప్రీతి పాత్రమైనది కదా! విరిగి నలిగిన మనస్సును అలక్ష్యం చేసే దేవుడు కాదు మన దేవుడు. ఈ ప్రార్థన అనే ధూపం దైవసింహాసనాన్ని కదిలించి కార్యరూపము దాల్చి నా ముక్కుకి తాడు కట్టి దేవుని దగ్గరకు ఆకర్షించడం మొదలైంది. నా భార్య చూపిన ప్రేమ, మాదిరి, దీర్ఘశాంతము, కన్నీటి ప్రార్థన నా జీవితంలో చెరగని ముద్రవేశాయి.

1975 జూన్ నెలలో నాతో కలిసి పనిచేసే మిత్రుని వివాహానికి తిరుపతిలో హాజరయ్యాను. అప్పటికే నాలో కొంత విశ్వాసం కలుగుతూ ఉంది. వివాహానంతరం ఒక ప్రైవేటు బస్సులో తిరుగు ప్రయాణం చేస్తుండగా, ఎస్.ఐ. ఆ బస్సును ఛేజ్ చేస్తున్నాడు. ఎందుకంటే ఆ బస్సుకు పర్మిట్ లేని సంగతి ఎవరికీ తెలియదు. డ్రైవర్ చాలా స్పీడ్‌గా నడుపుతున్నాడు. అరణ్య ప్రదేశాల్లో కొండలు, మెట్టలు దాటుకుంటూ వెళ్తుంది బస్సు. ఏమైపోతామో అర్థం కాని పరిస్థితిలో ఉన్నాము. అప్పుడే పసికూనగా విశ్వాసం చిగురించుచున్న వచ్చీరాని ప్రార్థన యేసయ్యకు చేయగా, ఆ ప్రార్థనకు జవాబుగా ఎటువంటి ప్రమాదము సంభవించకుండా దేవుడు కాపాడాడు. నా విశ్వాసం మరింత బలపడింది. ప్రతిరోజు బైబిలు చదవడం మొదలుపెట్టాను. 1 పేతురు 3:1,2లో స్త్రీలకు ఒక హితోక్తి, "అటువలె

స్త్రీలారా, మీరు మీ స్వపురుషులకు లోబడియుండుడి, అందువలన వారిలో ఎవరైనను వాక్యమునకు అవిధేయులైతే, వారు భయముతో కూడిన మీ పవిత్ర ప్రవర్తనచూచి, వాక్యము లేకుండనే తమ భార్యల నడవడి వలన రాబట్ట వచ్చును". ఇది ముమ్మారు నా పట్ల దేవుడు నిర్వర్తించాడు.

నా భార్య చిట్టెమ్మ రక్షింపబడి రెండు సం॥లు తిరగకముందే దేవుడు నన్ను దర్శించి, నా పాపము తెలుసుకొని ఆయనను అంగీకరించి పాపక్షమాపణ, ఆత్మ రక్షణ పొందుకొనునట్లు చేసాడు. హల్లెలూయ! నా గత జీవితాన్ని తలుచుకుంటే అసహ్యం వేస్తుంది, ఎప్పుడు ప్రజల మధ్యలోనికి వెళ్ళి సత్యాన్ని ప్రకటిద్దామనే ఆరాటం. బైబిల్ అనేక పర్యాయములు చదవడమే కాకుండా తత్సంబంధిత పుస్తకాలు చదవడం, నాలుగు కరస్పాండెన్స్ కోర్సులు చేయడానికి దేవుడు కృప చూపాడు. నేను రక్షింపబడిన సంఘములో కాపరిగా ఉండమని పెద్దలు ఒత్తిడి చేసినప్పటికీ బిజీ సేవలో నిమగ్నమైన మోజెస్ చౌదరి గారితో కలిసి పనిచేయాలని ఆత్మలో ప్రేరేపణ కలిగినవాడనై గత 30 సం॥లుగా మరనాత విశ్వాస సమాజంలో సేవకునిగా ఉంటూ పరిచర్యలో కొనసాగుటకు దేవుడు కృపచూపాడు.

దేవుని చేతిలో వాడబడే దైవసేకుణ్ణి సైతాను శోధిస్తుందనడానికి నేనే గొప్ప ఉదాహరణ. నా భార్యకు అస్వస్థతగా వున్నప్పుడు మా ఇల్లు ప్రార్ధనకు నిలయమై ఉండేది. ఆమె హాస్పటల్‌కు వెళ్ళినా అక్కడ డాక్టర్స్‌కు, పేషెంట్స్‌కు సువార్త ప్రకటించేది. ఆ సందర్భంలో నేను 40 రోజులు ఉపవసించి ఆమె నిమిత్తం ప్రార్ధించేటప్పుడు ఒక అర్ధరాత్రి పరిశుద్ధాత్ముడు నా పైకి దిగివచ్చాడు. నా భార్య మంచం మీద నుండి దిగే పరిస్థితి లేకపోయినప్పటికీ నా దగ్గరకు వచ్చి నన్ను ఆత్మపూర్ణుడుగా అయ్యే పర్యంతం ప్రార్ధనలో నడిపించింది.

ఆ సమయంలో ఒక గొప్ప ప్రవక్త ద్వారా మాట్లాడాడు. "నేను నా కుమార్తెను తీసుకుంటున్నాను. నా ఉద్యానవనంలో ఉన్న మంచి పుష్పాన్ని నేను ఏరుకోవడం నా చిత్తం. నా కుమారుడా! ఇప్పటి శ్రమల కంటే ముందున్న శ్రమలు అధికం. శ్రమలనే ఇబ్బందుల కొలిమిలో కాలవలసియున్నావు. వాటిల్లో నీవు నమ్మకస్థునిగా ఉంటే నిన్ను మరింతగా ఆశీర్వదిస్తాను" అని దేవుడు వాగ్దానమిచ్చాడు. ఆ వాగ్ధానాన్ని చేతపట్టుకొని ముందుకు సాగుతుంటే ఎన్నో ఆశీర్వాదాలు అనుగ్రహిస్తూ నడిపిస్తున్నాడు. ఆమెన్.

1 కొరింథి 7:16 " ఓ స్త్రీ నీ భర్తను రక్షించుకొందువేమో" అనే వాక్యము నా భార్య పట్ల నెరవేర్చిన ప్రభువు వందనీయుడు. ఆయనకే మహిమ కల్గును గాక. ఆమెన్.

-----------------

# 9. పబ్ నుండి ప్రభువు వద్దకు...

**– భరద్వాజ నాయుడు**



**1 పేతురు 4:3 "మనము పోకిరి చేష్టలు, దురాశలు, మద్యపానము అల్లరితో కూడిన ఆటపాటలు, త్రాగుబోతుల విందులు చేయదగని విగ్రహ పూజలు మొదలైన వాటియందు నడుచుకొనుచు అన్యజనుల ఇష్టము నెరవేర్చుచుండుటకు గతించిన కాలమే చాలును".**

"........గుడీవినింగ్ ఫ్రెండ్స్... ఇప్పుడు సమయం రాత్రి పది గంటలు. కాసేపట్లో ప్రపంచం నిద్రలోకి జారుకుంటుంది. కాని ఈ పబ్‌కు వచ్చిన మనకు ఇప్పుడే తెల్లారింది. ప్రతాప్ తన జన్మదినోత్సవం సందర్భంగా ఈ పబ్‌లో మనకు గ్రాండ్ పార్టీ ఇస్తున్నాడు. తినండి – త్రాగండి – ఆడండి – పాడండి – ఇంకా మీ ఇష్టం మీరు ఏంచేసినా ఇక్కడ ఎవరు మిమ్మల్ని ఏమి అనరు.

మన స్నేహ బృందంలో రాష్ట్ర హోంమంత్రి కొడుకు, కేంద్రమంత్రి కొడుకు వున్నారు. ఈ పబ్ దగ్గరకు వచ్చే ధైర్యం ఏ పోలీసుకు, ఏ మీడియాకు లేవు. సాధారణంగా పబ్‌లో ముగింపు సమయం ఇంత అని వుంటుంది. ఇక్కడ అదేమి లేదు. మీరు కూలబడే దాకా ఆడండి – పాడండి. మీ కోసం ఏర్పాట్లు అన్ని ఇక్కడ చేయబడ్డాయి.

ఇది డాన్స్ ఫ్లోర్ మీకు కుడి వైపు బార్ – ఎడమ వైపు రెస్టారెంట్, పై అంతస్థులో ప్రత్యేక గదులు వున్నాయి. ఇక మీదే ఆలస్యం. ఇక్కడ వున్న మనమంతా బ్యాడ్ బాయ్స్ & గర్ల్స్ కేరాఫ్ ప్రతాప్ బృందం. ప్రతి మనిషిలో ఎంతో కొంత చెడు వుంటుంది. ఈ నాగరిక ప్రపంచం దాన్ని బయట కనబడనీయకుండా లోలోపలే దాచిపెడుతుంది.

అయితే మనం వారిలా నాటకాలు ఆడటం లేదు, ముక్కుసూటిగా ఏ దాపరికం లేకుండా మన శరీరాలకు కావలసిన సరదాలను అందజేస్తున్నాము. ఎవరు సిగ్గుపడకండి – బిడియ పడకండి. పార్టీ మొదలు పెడుతున్నాము. మీకు మీరే రాజు, మీకు మీరే రాణి. మొదటి పాట నెమ్మదిగా మొదలుపెట్టి దిమ్మదిరిగే రాక్‌తో ముగద్దాం.

కమాన్ ఫ్రెండ్స్.... లెట్స్ స్టార్ట్
లైట్స్ ఆఫ్....

వన్, టు, త్రి.....
స్టార్ట్ మ్యూజిక్
అదీ లెక్క
గుడ్ మార్నింగ్ హైదరాబాద్....."

లక్ష వాట్ల ధ్వని అక్కడ పబ్‌లో ప్రతిధ్వనించింది. పొరపాటున తెలియని వారు అందులో ప్రవేశిస్తే అక్కడ ఏం జరుగుతుందో తెలియక ఆ ధ్వనికి అడ్డం పడటం ఖాయం. అలవాటైన వారైతే అక్కడి డాన్స్ ఫ్లోర్ ఎక్కి ఆలస్యం చేయకుండా డాన్సర్‌లతో కలసి ఆడతారు, పాడతారు. ఈ ఒక్క రాత్రి ఖ ర్చు ఎన్నో లక్షల రూపాయలు. ఇక్కడ వున్న వారంతా ప్రముఖుల కొడుకులు, కూతురులు. పబ్ యజమాని రాష్ట్ర హోంమంత్రి కాకపోతే బినామి పేరుతో నడుపుతున్నాడు. మనిషిలో వుండే రెండో వైపుకు ఈ పబ్ సజీవ సాక్ష్యం ఇక్కడ కొందరు బయటపడతారు, మరికొందరు మాటలు లేకుండా తమ విపరీత కార్యాలను ఈ చీకటిలో ముగించుకొని వెళ్ళిపోతారు.

కొందరు నాటు – మరికొందరు నీటు. అంతే తేడా.
వేకువ జాము రెండున్నర....

అక్కడ అంతా అయోమయంగా వుంది. ఇంకా ఓపిక వున్నవారు కొద్ది కొద్దిగా సంగీతానికి అణుగుణంగా డాన్స్ చేస్తున్నారు. మందు ఎక్కువైన వారు క్రిందపడి తమ తమ స్వర్గాలలో విహరిస్తున్నారు. పై అంతస్తుకి క్రింది అంతస్తుకు చెక్కర్లు కొడుతున్న కుర్రజంటలు నిదానంగా తగ్గుతున్నారు. ఇదే గనుక బయట ప్రపంచంలో జరిగితే ఆ జంటల పాడుపనిని వ్యభిచారం అంటారు. కాని ఇది హైక్లాస్ పబ్. డేటింగ్ అంటూ యువత మురిసిపోతుంది. ఎవడి పేర్లు వాడివి.

భరధ్వాజ నాయుడు... ఆంధ్రరాష్ట్రంలో అతి పెద్ద వ్యాపార సామ్రాజ్యానికి అధినేత. అతని వస్త్ర పరిశ్రమలో కొన్ని వేల మంది కార్మికులు పనిచేస్తుంటారు. ఆసియా ఖండంలోని పలుచోట్లకు విస్తరించిన కోట్లలో వ్యాపారం అతడిది. అందుకు తగినట్టే ఇతడు ఖద్దరు పంచలో హుందాగా కదులుతుంటాడు. బెంజ్‌కారులో తిరిగే ఇతడిని చూసి చాలా మంది తనకు జీవితంలో ఏ కష్టము లేదేమో అనుకుంటారు. అయితే అది నిజం కాదు.

భరధ్వాజ నాయుడుకి ఒక కొడుకు, ఒక కూతురు. కొడుకు ప్రతాప్, కూతురు నిహారిక. జన్యులోపం వల్ల కూతురు పుట్టుకతోనే మానసికంగా వికలాంగురాలిగా జన్మించింది. తన పనులు తాను చేసుకోవటం కూడా కష్టమే. రోజంతా తనలో తానే

నవ్వుకుంటూ ఆడుకుంటూ గడుపుతుంది నిహారిక. తనకు ఏమి కావాలన్నా అమ్మ అన్నపూర్ణ అన్నీ అమర్చిపెడుతుంది.

నిహారిక మానసిక వైకల్యాన్ని తొలగించాలని భరద్వాజ నాయుడు చేయని ప్రయత్నం లేదు. దేశ విదేశాలలో వున్న ఎందరో ప్రఖ్యాత వైద్యులకు నిహారికను చూపించాడు. అందరిది ఒక్కటే మాట. తను ఇక జీవితాంతం ఇలా పిచ్చిదానిలాగానే బ్రతకాలని. ఇది విన్న భరధ్వాజనాయుడు తట్టుకోలేక పోయాడు. మనస్సు దేవుడువైపు తిరిగింది. పుణ్యక్షేత్రాలలో భరధ్వాజనాయుడు అన్నపూర్ణ దంపతులు ఎన్నో పూజా పునరస్కారాలు చేసారు. మరెన్నో పుణ్యకార్యాలు తలపెట్టారు. కాని నిహారిక ఆరోగ్య పరిస్థితిలో మార్పులేదు.

అన్నపూర్ణ దిగులుతో మంచం పట్టింది. ఆ పిదప మరణించింది. భరధ్వాజ నాయుడు తన భార్య మరణాన్ని జీర్ణించుకోలేకపోయాడు. ఒక ప్రక్క కూతురు మానసిక అంగవైకల్యం. మరో ప్రక్క జీవిత భాగస్వామి మరణం. ఎన్నో రాత్రులు ఒంటరిగా తన గదిలో బిగ్గరగా ఏడ్చుకొనేవాడు. ఈ కడుదయనీయ పరిస్థితిలో కేరళలో నివసించే తన స్నేహితుడు మహ్మద్ ఫిరోజ్ తనని ఆదరించాడు. కొన్ని నెలలు స్నేహితుడిని తన దగ్గర వుంచుకొని అతడు కోలుకునేలా చేసాడు.

“నాయుడు మాటలతో నిన్ను ఓదార్చడం ఎవరి తరంకాదు. నీకు వున్న కష్టం అంత పెద్దది. అయితే ఒక్కటి గుర్తుంచుకో. కొన్ని సంవత్సరాల క్రితం జీవితంలో అన్ని విధాల నష్టపోయిన నన్ను నువ్వొక స్నేహితుడుగా ఆదరించావు. ఇక్కడ కేరళలో వైద్య విద్య అభ్యసించేలా చేసావు. నర్సింగ్ హోమ్ స్థాపించటానికి సహకరించావు. ఆ సమయంలో నువ్వు నాకు చేసిన సహాయం ఇంత అని చెప్పలేను. కాని నాయుడు ఇక్కడ కేరళకు వచ్చిన క్రొత్తలో నా పరిస్థితిని గమనించిన మా ప్రొఫెసర్ నన్ను క్రీస్తు ప్రభువులోకి నడిపించారు. ఏ.జి. చెర్చికి వెళ్ళడం ప్రారంభించాను. ఇక ఆనాటి నుండి నా దిగులు – చింత – బాధ ఎవరో చేతితో తొలగించినట్లుగా అనిపించింది. ఆ అనుభవాన్ని మాటలలో వివరించలేను.

ప్రతిరోజు కొన్ని గంటలు ఏకాంత ప్రార్ధనలో గడిపేవాడిని. చెప్పనశక్యము కాని మహిమాయుక్తమైన ఆనందం నన్ను ఆవరించేది. ఈరోజున ఎందరో రోగులకు వైద్యం చేస్తున్నాను. పేరు ప్రఖ్యాతులు గల ఎన్నో వైద్య విద్యాలయాలలో ప్రొఫెసర్‌గా బోధిస్తున్నాను. కారణం క్రీస్తే నాయుడు. నీకు చెప్పేటంత గొప్పవాడిని నేను కాదు. కాని నా జీవితాన్ని నిలబెట్టిన నీకు నా సలహా ఒక్కటే. క్రీస్తు ప్రభువుని నీ రక్షకుడిగా అంగీకరించు. మిగతాదంతా ఆయన చూసుకుంటాడు.”

"ఫిరోజ్ అందుకు నేను ఏమి చేయాలి?"

ఆ గదిలో ఇద్దరు మోకరించారు. ప్రార్థనలో రెండు గంటలు గడిపారు. ప్రార్థనలో సిలువ శక్తి నాయుడిని తాకింది. ఆ పిదప తన మనస్సులో ఎంతో నెమ్మదిని, నిశ్చయతను పొందాడు. బాప్తీస్మము సమయములో పాస్టరు గారు ఈ విధంగా నాయుడిని దీవించారు. నీ కోసం సిలువపై చనిపోయిన క్రీస్తు నామములో నీకు బాప్తీస్మము ఇస్తున్నాను. సర్వోన్నతుని శక్తితో నువ్వు నింపబడుదువు గాక!

భరద్వాజ నాయుడు క్రైస్తవుడుగా మారి తిరిగి ఆంధ్రప్రదేశ్‌కు చేరుకున్నాడు. తనను దగ్గరగా గమనిస్తున్న వారికి నాయుడు ఎంతో విచిత్రంగా అనిపించాడు. కేరళకు వెళ్ళక పూర్వం తనలో ఎంతో బాధ–దిగులు–చింత– కంగారు– ఆందోళన తన ముఖంలో తచ్చాడుతుండేవి. కాని ఇప్పుడు ఎంతో నెమ్మదిగా ప్రశాంతంగా కనిపిస్తున్నాడు.

ఇంట్లో ఒక గదిని ప్రార్థనా గదిగా ఏర్పాటు చేసుకున్నాడు. కూతురు నిహారికకు ఈ ఏర్పాట్లు ఎంతో నచ్చాయి. ఎంతో హాయిగా నాన్నతో కలిసి ప్రార్థనలో పాల్గొనేది. తోచకపోతే ఆ గదిలోకి వచ్చి నిద్రపోయేది. నిహారికను చూచుకోవడానికి ఇద్దరిని ప్రత్యేకంగా నియమించాడు నాయుడు. ఆ పిదప తన వ్యాపార కార్యకలాపాలను కొనసాగించాడు.

అంతా భాగానే ఉంది కాని భరద్వాజ నాయుడుకి ఒక్కటే దిగులు తన కొడుకు ప్రతాప్ ఆ చెడు తిరుగుళ్ళు మాని తనకు పరిశ్రమ పనులలో సహాయపడాలని. తల్లి మరణంతో ప్రతాప్ ఎంతో క్రుంగిపోయాడు. అప్పటి నుండి చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. నిధానంగా క్రీస్తు ప్రభువే ప్రతాప్‌ను మారుస్తాడనే నమ్మకంతో నాయుడు ప్రభు పాద సన్నిధిలో ప్రార్థించేవాడు.

ప్రతి దానికి సమయముంటుంది. నా కొడుకు ప్రతాప్ మారి క్రీస్తులోకి రావటానికి కూడా అని అనుకునేవాడు. నాయుడు యధావిధిగా తన వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించడం ప్రారంభించాడు. ప్రతాప్ అమ్మ కూచి కావడంతో తల్లి మరణంతో తనకు వైరాగ్య భావన ఆవరించింది. త్రాగుడు – పబ్ చిందుల మోతాదు పెంచాడు. నాన్న భరద్వాజ నాయుడు క్రీస్తులో బాప్తీస్మము తీసుకోవటం క్రమం తప్పకుండా ప్రతిరోజు చెల్లితో ప్రార్థనలో గడపటం ప్రతాప్‌ని అయోమయానికి గురిచేసింది. మానసిక వత్తిడిని తట్టుకోవడానికి ఈ ప్రపంచంలో వున్న ఎన్నో మార్గాలలో ఈ ప్రార్థన కూడా ఒక మార్గం కాబోలు అని తన మనస్సులో సర్ధిచెప్పుకున్నాడు. కాని ప్రతాప్‌కి ఒకటి బాగా నచ్చింది. క్రైస్తవత్వం తన ఇంటిలోకి వచ్చిన నాటి నుండి చెల్లి నిహారిక పిచ్చి చేష్టలు తగ్గాయి.

ముద్దు ముద్దుగా క్రైస్తవ పాటలు పాడుతుంది. నాన్నలాగే తను కూడా ఎంతో సంతోషంగా వుంటుంది. ప్రతాప్ నిహారికను ఎంతో గారాభంగా చూచుకునేవాడు. ఏ చెడు తిరుగుళ్ళలో వున్నా మరచిపోకుండా ఇంటికి వచ్చేటప్పుడు ఒక డైరీ మిల్క్ చాక్లెట్ తెచ్చి చెల్లికి ఇచ్చేవాడు. నిహారిక దాన్ని ఆనందంగా తీసుకుని పాటలు పాడుకుంటూ సన్నిధి గదిలోకి వెళ్ళేది. చాక్లెట్ తీసుకురావటం మర్చిపోయినప్పుడు కోపంతో అన్నయ్యా నా చెక్లెట్ ఏది అని నిలదీసేది. సమయంతో సంబంధం లేకుండా ప్రతాప్ కారు వేసుకువెళ్ళి డైరీ మిల్క్ తెచ్చి చెల్లికి ఇచ్చేవాడు.

శృతి ఆ కాలనీలో నివసించే అమ్మాయి. తన తల్లిదండ్రులు ఇద్దరు డాక్టర్లే. భరధ్వాజ నాయుడు కంటే ముందే వారు క్రీస్తులోకి మారిన విశ్వాసులు. ప్రతాప్ – శృతి ఇద్దరు చిన్నప్పటి నుండి ఆ కాలనీలోని స్కూల్లో చదువుకున్నారు. తరువాత ఇద్దరూ ఒకే కాలేజ్‌లో డిగ్రీ ముగించి ఇప్పుడు పీజీ చేస్తున్నారు. ఇద్దరూ చిన్ననాటి స్నేహితులే. కాని ఇద్దరివి వేరు వేరు అభిరుచులు. ప్రతాప్ సమాజంలో బ్యాడ్ బాయ్, శృతి గుడ్ గాల్. ఇద్దరివి ఉత్తర దక్షిణ అలవాట్లు.

కొంత కాలము నుండి ఇద్దరి మధ్య మాటలు లేవు. దానికి ఒక కారణముంది. ప్రతాప్ తల్లి చనిపోయిన నాటి నుండి శృతి ప్రతిరోజు నిహారికతో కబుర్లు చెప్పడానికి ఆ ఇంటికి వచ్చేది. నాయుడు నిహారికలతో కలిసి గంటల తరబడి ప్రార్ధనలో గడిపేది. ఆ ఇంట్లో ఎందరో పనివాళ్ళు వున్నా శృతి చనువుగా నాయుడు గారికి కూతురులా మసులుకునేది. కొన్ని సార్లు తనే స్వయముగా వంటచేసేది.

నిహారికను ఆ కాలనీలోని పార్కుకి తీసుకువెళ్ళేది. అనుకోకుండా ప్రతాప్ విషపు చూపు శృతి మీద పడింది. ఇంట్లో ఎవరు లేని సమయం చూచి శృతి వంట చేస్తుండగా తనకు ప్రపోజ్ చేసాడు. అంతే మరుక్షణం.... ప్రతాప్ చెంప ఎర్రగా కందిపోయింది. శృతి బలంగా ప్రతాప్‌ని చెంప మీద కొట్టింది. ఏడ్చుకుంటూ తన ఇంటికి కోపంగా వెళ్ళిపోయింది. కొన్ని నెలలు గడిచాయి. పరిస్థితి కుదుట పడింది. ప్రతాప్ తలచుకుంటే వెంటనే శృతి మీద పగతీర్చుకునేవాడే కాని శృతిలోని ఏదో తెలియని పద్ధతి తనని ఏమి చేయనీయకుండా కట్టిపడేసింది. పైగా ఈ మధ్య శృతి – నిహారిక – భరధ్వాజ నాయుడు ఒకే కుటుంబ సభ్యుల లాగా ప్రతిరోజు ప్రార్ధనలో పాల్గొనటం – నాన్న అవసరాలను దగ్గర వుండి శృతి చూచుకోవడం – చెల్లిని కనిపెట్టుకొని వుండటం చూచి ప్రతాప్ తన మనస్సు మార్చుకున్నాడు. ఎవరు లేనప్పుడు తనుచేసిన పిచ్చి పనికి సారీ చెప్పాడు. కొన్ని సంవత్సరాలు గడిచాయి.

"అయ్యా నా కొడుకు భవిష్యత్తు అంధకారం కాబోతుంది కాపాడండి".

బిగ్గరగా ఏడ్చుకుంటూ ఇంట్లోకి వచ్చాడు నతానియేలు. ఇతడు ఎన్నో సంవత్సరాలుగా భరధ్వాజ నాయుడు కారు డ్రైవర్

"ఏం జరిగింది నతానియేలు"

"అయ్యా రేపు ఈష్టరు పండుగ కాబట్టి నా కొడుకు జోసఫ్ రాత్రంగా చర్చ్‌ని అలంకరించే పనిలో అందరితోపాటు అక్కడే వుండిపోయాడు. మధ్య రాత్రి చర్చిలోని పని ముగించుకొని ఇంటికి వస్తుండగా పోలీసులు అతనిని పట్టుకున్నారు. త్రాగి బండి నడుపుతున్నాడు అనే నెపం మీద వాడిని అరెస్ట్ చేసారు. వాడు రాత్రంతా జైల్లోనే వున్నాడు. నేను పోలీస్ కమీషనర్ గారిని కలిసాను. ఈ రోజు, రేపు, ఎల్లుండి కోర్టు సెలవులు కాబట్టి తరువాత రోజు కోర్టులో హాజరు పరుస్తామని చెప్తున్నారు. అయ్యా ఎల్లుండి వాటికి ఇంజనీరింగ్ ఫైనల్ పరీక్ష వుంది. దానికి హాజరు కాకపోతే వాడు ఎంతో కష్టపడి ఈ నాలుగు సంవత్సరాలుగా మీ ఆర్థిక సహాయంతో చదువుకున్న చదువంతా బుగ్గి పాలౌతుంది. జీవితంలో వాడు ఎప్పుడు కూడా మద్యం జోలికి పోలేదయ్యా. పోలీసులు అబద్ధం చెప్తున్నారు. వాడు మెరిట్ స్టూడెంట్ అని మీరు కూడా ఎన్నోసార్లు మెచ్చుకున్నారు గదా".

"నతానియేలు చిన్న విషయానికి అంత రాద్ధాంతం ఎందుకు. నేను చూచుకుంటాను. ఆ పోలీస్ కమీషనర్‌కు ఫోన్ చేసి ఇవ్వు నేను మాట్లాడతాను".

"అలాగే అయ్యా ఇదిగో ఇప్పుడే చేస్తాను".

"కమీషనర్ గారు నేను భరధ్వాజ నాయుడుని మాట్లాడుతున్నాను. మా డ్రైవర్ కొడుకుని అరెస్టు చేశారట. వాడు త్రాగి డ్రైవ్ చేస్తున్నాడని జైల్లో పెట్టారట. వాడు త్రాగడండి. ఎన్నో సంవత్సరాలుగా వాడు మా అవుట్ హౌస్‌లో వుంటున్నాడు. ఎప్పుడు వాడు త్రాగడం నేను చూడలేదు."

"మంచిది నాయుడు గారు. మనుష్యులు మీముందే త్రాగాలని లేదుగా. సరే ఇక అసలు విషయంలోకి వస్తున్నాను. వాడి మీద ఇంకా చార్జ్‌షీట్ వ్రాయలేదు. పదిలక్షల రూపాయలు నా ఎకౌంట్‌లోకి ట్రాన్స్‌ఫర్ చేయండి ఎకౌంట్ నంబరు మెసేజ్ చేస్తాను. క్యాష్‌వద్దు – చెక్ వద్దు." "కమీషనర్ గారు మీ పద్ధతి ఏమీ బాగోలేదు. నా కొడుకుని పబ్‌లో త్రాగుతున్నందుకు వాడ్ని మీరు పట్టుకొని జైల్లో పెట్టి అప్పుడు నన్ను లంచం అడిగినా నేను బాధపడేవాడిని కాదు."

"నాయుడు గారు మీరు మరీ పాతకాలపు మనిషండి. మీ కొడుకు త్రాగుతున్నందుకు – తిరుగుతున్నందుకు పబ్ యజమానులు నాకు ఇవ్వాల్సింది ఇస్తున్నారు కదా. ఇక ప్రతాప్‌ని అరెస్ట్ చేస్తే ఏమి వస్తుంది".

"మీనా–సీతారామ్– సురేంద్రబాబు – లడ్డా – ఇలా ఎందరో పోలీస్ కమీషనరులు ఈ నగరానికి వచ్చారు. కానీ మీలా కేవలం డబ్బు కోసమే డ్యూటీ చేసే అధికారిని నేను చూడలేదు".

ఫోన్‌లోని సంభాషణ అంతా స్పీకర్ ఆన్ చేసి వుండడం వల్ల ఆ గదిలో స్పష్టంగా వినిపిస్తుంది. ప్రతాప్ నాన్న ప్రక్కన మరో సోఫాలో కూర్చుని సంభాషణ అంతా విన్నాడు.

"ప్రతాప్ నాకొక సహాయం చేస్తావా."

"తప్పకుండా అడగండి నాన్న."

"జోసఫ్ బాగా చదువుతాడు. మెరిట్ స్టూడెంట్. అనుకోకుండా వాడికి ఇలా జరిగింది. వాడిని ఆదుకోవడం యజమానిగా నా కర్తవ్యం. అయితే ఆ పోలీస్ కమీషనర్‌కు డబ్బులు ఇవ్వడానికి నా మనస్సాక్షి అంగీకరించడం లేదు. నీకు ఒక్క అవకాశం ఇస్తున్నాను జోసఫ్ చదువుకు ఏ అంతరాయం కలుగకూడదు. వాడు పరీక్షలు వ్రాయాలి. ఈ పని నీ వల్ల కాకపోతే వచ్చే సంవత్సరం జోసఫ్‌ని ప్రక్క రాష్ట్రంలో డొనేషన్ కట్టి యం.టెక్. లో చేర్పిస్తాను. దానికి ముందు నీకు ఈ అవకాశం ఇస్తున్నాను ఈ పనిని చేయగలుగుతావా ప్రతాప్."

"నాన్న లక్షల రూపాయలతో నువ్వు చేద్దామనుకునే ఈ మంచి పనిని కొన్ని వేల రూపాయలతో పూర్తి చేస్తాను. నాకు మూడు రోజుల వ్యవధి ఇవ్వండి".

"సరే ప్రతాప్ జాగ్రత్త".

ప్రతాప్‌కు విషయమంతా అర్థమైంది. పోలీస్ కమీషనర్ డబ్బు మనిషి అని అంతా అనుకుంటుంటే విన్నాడు కాని మరీ ఇంత అనుకోలేదు. తన కంపెనీ లాయర్లతో ప్రతాప్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌ని కలిసాడు. అతడు తనకు శ్రేయోభిలాషి.

"నువ్వు చెప్పింది నాకు అర్థమయ్యింది ప్రతాప్. అయితే ఫైనల్ పరీక్షలను వాయిదా వేయడానికి ఒక మార్గం ఉంది."

"ఏంటిసార్ అది."

"పరీక్షలు రాసే విద్యార్థుల హాజరు నలభైశాతం కంటే తక్కువ ఉంటే పరీక్షలను వాయిదా వేసే అధికారం యూనివర్సిటి వైస్‌చాన్స్‌లర్‌గా నాకు వుంటుంది".

"ఈ అవకాశం నాకు చాలు సార్. సద్వినియోగం చేసుకుంటాను".

"ఎలా ప్రతాప్".
"రేపు పేపర్‌లో చదవండి సార్".

ఇక అక్కడ నుండి ప్రతాప్ తన ప్లాన్‌ను అమలు పరిచాడు. ఎవరికి వెళ్ళాల్సిన డబ్బులు వాళ్ళకి వెళ్ళాయి. కొందరికి ప్రముఖుల ద్వారా ఫోన్‌లు చేయించాడు ప్రతాప్. విద్యార్థి సంఘాల నాయకులను కలిసి పరిస్థితిని వివరించాడు. త్రాగుబోతు – తిరుగుబోతు అన్న మాటే కాని ప్రతాప్ అంటే విద్యార్థి నాయకులందరికి అభిమానమే. ఖర్చు దగ్గర వెనకాడకుండా సహాయం చేయడానికి ముందుండే ప్రతాప్ అంటే ఎవరికి మాత్రం ఇష్టం వుండదు.

శత్రువులను సైతం కలుపుకుపోవటం ప్రతాప్‌కు మొదటి నుండి అలవాటు. అది ఈ పరిస్థితిలో భాగా ఉపయోగపడింది. కంటి ముందు జరుగుతున్న అన్యాయం అందరికి కనిపిస్తూనే వుంది. పైగా జోసఫ్ మెరిట్ స్టూడెంట్. అందరికి ఆదర్శ ప్రాయుడు. ఇక అంతే. విద్యార్థి సంఘాలు రెచ్చిపోయాయి. అన్యాయాన్ని చిత్రిస్తూ వేల వాల్ పోస్టర్లు ముద్రించబడ్డాయి. విద్యార్థుల ఆవేశం కట్టలు తెంచుకుంది.

ఏ.సి., జె.కె.సి., హిందూ, టి.జె.పి.ఎస్., ఆంధ్రాలయోలా, మేరీ స్టెల్లా కాలేజీల విద్యార్థులు రెచ్చిపోయారు. మూకుమ్మడిగా పరీక్షలను బహిష్కరించారు. నగరంలో విధ్యార్థుల ర్యాలీలు రాస్తారోకోలు మిన్నంటాయి. మధ్యాహ్నానికల్లా టి.వి.9., టి.వి.5., ఎ.బి.ఎన్., ఈటివి, మాటివి, జెమిని, జీ మొదలైన ప్రముఖ వార్తా ఛానళ్ళ విలేకర్లు అందరూ పోలీస్ కమీషనర్ ఆఫీస్‌లో వున్నారు. కమీషనర్‌ను జరిగిన దానికి వివరణ అడిగారు. పోలీస్ కమీషనర్ జరుగుతున్న తంతునంతా చూచి ఉక్కిరిబిక్కిరి అయ్యాడు. వెంటనే జోసఫ్‌ను విడుదల చేసాడు. పొరపాటయింది అంటూ సర్ది చెప్పుకున్నాడు.

జోసఫ్ పరీక్షలు వ్రాసాడు. పాసయ్యాడు.

"ఇదంతా గమనిస్తున్న భరధ్వాజ నాయుడు జోసఫ్ పరీక్షలు పాసయ్యాక తన ఇంటికి పాస్టర్ల నందరిని ఆహ్వానించి భారీ స్థాయిలో స్తుతి ప్రార్ధన ఏర్పాటు చేసాడు.

కొంత కాలానికి అనుకోకుండా భరధ్వాజ నాయుడు కంపెనీలో ఆర్డర్లు తగ్గాయి.

ఫలితంగా లాభాలు క్షీణించి పరిశ్రమ పీకలలోతు అప్పుల ఊబిలో కూరుకుపోయింది. ఇదంతా ప్రతాప్ గమనిస్తూనే వున్నాడు. కానీ నాన్నను అడగలేకపోయాడు. దాని వల్ల పెద్ద ప్రమాదం సమీప భవిష్యత్తులో జరగబోతుందని గమనించలేకపోయాడు.

"చిరంజీవి ప్రతాప్‌కు నాన్న వ్రాయునది....

ప్రతాప్ నేను చేస్తున్న పని తప్పు అని తెలుసురా. కాని తప్పక చేస్తున్నాను. గత కొద్ది మాసాల నుండి మన కంపెనీ లాభాలు తగ్గాయి. ఉత్పత్తి చాలా వుంది కాని కొనేవారు లేరు. దీనితో అప్పులు పెరిగిపోయాయి. నువ్వు ఈ ఉత్తరం చదివే సమయానికి అప్పు ఇచ్చిన బ్యాంకు వాళ్ళు నోటీసులతో నీ వద్దకు వస్తారు. ఈ సమస్యకు పరిష్కారం కనుగొనలేక నేను ఒక పిరికివాడిగా నిన్ను ఒంటరి వాడ్ని చేసి నిన్ను, నిహారికను వదలి ఇంట్లో నుండి వెళ్ళిపోతున్నాను. పూలు అమ్మిన చోట కట్టెలు అమ్మటం కష్టం రా ప్రతాప్. అందుకే నేను ఇలా అప్పుల వాళ్ళని ఎదుర్కోలేక వెళ్ళిపోతున్నాను.

నా మీద నీకు ఏమైనా గౌరవం వుంటే నేను వెళ్ళాక నన్ను వెదికే ప్రయత్నం చేయవద్దు. ఆత్మహత్య చేసుకోను అని మాత్రం నీకు మాట ఇస్తున్నాను. అంతమాత్రాన నేను తిరిగివస్తానని మాత్రం అనుకోవద్దు. నేను నిత్యం ప్రార్థించే నా యేసు క్రీస్తు నీకు తప్పక తోడుగా వుంటాడు. నేను ఎక్కడ వున్నా నీ గురించి, నిహారిక గురించి నిత్యం ప్రార్థిస్తూనే వుంటాను. ప్రతాప్ ఈ క్లిష్ట పరిస్థితులలో నీకు నా సలహా ఒక్కటేరా. ఎక్కువ ప్రార్ధనలో గడుపు. క్రీస్తే నీకు పరిష్కారాన్ని చూపిస్తాడు.

నిహారిక మానసిక పరిస్థితి – మీ అమ్మ మరణం... ఈ సమస్యలతో బాధ పడుతున్న నాకు ఇప్పుడు ఈ అప్పుల తాకిడిని ఎదుర్కొనే ఓపిక లేక పిరికివాడిలా పారిపోతున్నానురా. నన్ను మన్నించు. రెండు సంవత్సరాలు ఈ అప్పుల బాధను తట్టుకోగలిగితే చెల్లి పేరు మీద ఫిక్సిడ్ డిపాజిట్లు నిన్ను కొంతలో కొంత ఆదుకుంటాయి. అది కొంత మేరకే సుమా. ఇలా వ్రాస్తూపోతుంటే నా గుండెల్లో నుండి పెల్లుబికుతున్న బాధను అణుచుకోలేక పోతున్నానురా. ఇక ముగిస్తాను. చెల్లి జాగ్రత్త.

క్రీస్తును ఎట్టి పరిస్థితులలోను మరువవద్దు. మరోసారి చెబుతున్నాను – నన్ను వెదికే ప్రయత్నం చేయవద్దు. నా ఈ పిచ్చి పనిని క్షమిస్తావన్న నమ్మకంతో....

ఇక సెలవు.
నాన్న"

ఉదయం పది గంటలు అవుతున్నా నాన్న గదినుండి బయటకు రాకపోవడంతో ప్రతాప్‌కు ఏదో అనుమానం వచ్చి నాన్న గదిలోకి వచ్చాడు. వచ్చి చూస్తే ఇదిగో ఈ ఉత్తరం కంటపడింది. ఇల్లంతా వెదికాడు. నాన్న ఎక్కడా లేడు. ఇక వెదికినా ప్రయోజనం వుండదని అర్ధమయ్యింది. నాన్న ఒక నిర్ణయం తీసుకుంటే దాన్ని ఎంత పకడ్బందీగా అమలు చేస్తాడో తనకు అనుభవమే.

జరిగింది జరిగిపోయింది. జరగవలసింది ముఖ్యం. ఇప్పుడు చెల్లి బాధ్యత తనది అని అర్ధం చేసుకున్నాడు. గంటసేపు తన గదిలో బాగా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాడు. ఇదంతా ఏమీ తెలియని చెల్లి చిన్న పిల్లలా తోటలో ఆడుకుంటుంది. మౌనంగా నాన్న గదిలోని కాగితాలన్నీ ఒక ప్రక్కకు చేర్చాడు. అవి అప్పుల కాగితాలు.

"ప్రముఖ పారిశ్రామిక వేత్త భరధ్వాజ నాయుడు పరారి"
"అప్పుల బాధను తట్టులోలేక నాయుడు ఐ.పి. వైనం"
"వీధినపడ్డ పరిశ్రమ కార్మికులు"

ఇలా ఆ రోజు పేపర్లు నిండా ఇవే వార్తలు. చాలా మంది ఆ ఇంటికి వచ్చి తమ సానుభూతి తెలియజేసారు. ఫోన్లు చేసి వాకబ్ చేసారు. ఇక అంతకు మించి వారు చేయగలిగింది కూడా ఏమీలేదు. నాయుడు గారిని వెదికే ఏర్పాట్లు చేస్తాము అని ఎందరో అడిగినా ప్రతాప్ ఆ సహాయాన్ని సున్నితంగా తిరస్కరించాడు.

తండ్రి ఆఖరి కోరికను గుర్తు పెట్టుకున్నాడు. కొన్ని రోజులు గడిచాయి. ఆ ఇంట్లో నిశబ్ధం అలుముకుంది. శృతి బంధువుల ఊరు వెళ్ళి ఆ రోజే తిరిగి వచ్చింది. నాయుడు గారు కనిపించకుండా ఎక్కడికో వెళ్ళిపోవటం తనను ఎంతో బాధించింది. బోరున ఏడ్చింది. చాలా సేపు అలా ఏడుస్తూనే వుండిపోయింది. కాసేపటికి తేరుకొని నిహారికను చూడటానికి ఆ ఇంటికి వెళ్ళింది.

ఏం జరిగిందో తెలియక నిహారిక చిన్న పిల్లలా బొమ్మలతో ఆడుకోవటం గమనించింది. ప్రతాప్ తన గదిలో ఒంటరిగా నాన్న ఫొటోను చూస్తూ కూర్చున్నాడు. దిగులుతో బాగా సన్నబడ్డాడు. శృతిని చూసి చిన్నగా నవ్వాడు. ఏం చేయబోతున్నాడో అడిగి తెలుసుకుంది. ఇంతటి విషాదంలో కూడా ప్రతాప్ ధైర్యంగా నిలబడటం ఆమెకు సంతోష్నాన్ని ఇచ్చింది. "ప్రతాప్ మీ నాన్నగారు ఇల్లువదిలి వెళ్ళిపోయి ఇప్పటికి నెలరోజులు పూర్తయ్యింది. మా బ్యాంకులోని పై అధికారుల పోరు తట్టుకోలేక ఇలా వచ్చాను. నన్ను క్షమించు" "దానిదేముంది చెప్పండి సార్"

"ప్రతాప్ నీ ఆస్థి యావత్తును వేలం వేయాల్సిందిగా మా ఉన్నత అధికారులు నిర్ణయించారు. ఇవిగో అందుకు సంబంధించిన కాగితాలు".

"సార్ నాకు మీరు పర్సనల్‌గా ఒక సహాయం చేస్తారా"

"ఏంటది చెప్పు ప్రతాప్. నేను చేయగలిగిన పనయితే తప్పకుండా చేస్తాను".

"ఈ వేలం పాటను నెల రోజులు వాయిదా వేసి నాకు మీ బ్యాంకు అప్పుతీర్చే ఒక చివరి అవకాశం ఇవ్వండి సార్. అంతేకాదు ఇంటి కాగితాలు కూడా పెట్టుకొని మరో పదిహేను లక్షలు అప్పు ఇవ్వండి".

"ప్రతాప్ నీకేమైనా పిచ్చెక్కిందా. ఇంకా నువ్వు ఆ చెడు అలవాట్లు మానలేదా. ఇప్పుడు ఇంటి కాగితాలు పెడతావు ఇల్లు పోతుంది. ఫ్యాక్టరీ పోతుంది. ఆ తరువాత ఏం చేస్తావు".

"మా నాన్న స్వప్న సౌధమైన ఫ్యాక్టరీ వేలం వేయబడకుండా వుండటానికి నావంతు ప్రయత్నం చేయడానికి ఈ అప్పు సార్. నా అలవాట్లు పూర్తిగా మార్చుకుని ఎన్నో రోజులయింది. ప్లీజ్ సార్ ఒక్క అవకాశం ఇవ్వండి."

"సరే ప్రతాప్ భరద్వాజ నాయుడు గారి మీద నాకున్న అభిమానం కొద్ది బ్యాంక్ రూల్స్‌కు వ్యతిరేకమైనా నేను నీకు ఈ సహాయం చేస్తాను. ఆయనే గనుక నన్ను చదివించి వుండకపోతే నేను ఇప్పుడు మా ఊరిలో అనాగరికుడుగానే వుండిపోయేవాడిని. నీకు ఈ సహాయం చేసి మీ నాన్న ఋణం కొంతలో కొంతైనా తీర్చుకుంటాను. కాని నాదో చిన్న అనుమానం. నెల రోజుల్లో మా బ్యాంకు అప్పుతీర్చే అన్ని లక్షల రూపాయలు నీకు ఎక్కడ నుండి వస్తాయి".

"ప్రయత్నిస్తాను సార్ ఇన్నాళ్ళు నా సౌఖ్యంకోసం నేను బ్రతికాను. ఇక నుండి కార్మికులను బ్రతికించటం కోసం ముఖ్యంగా నా చెల్లికి ఏ లోటు లేకుండా వుండటం కోసం బ్రతుకుతాను.

"సరే ప్రతాప్ ఆల్ ద బెస్ట్. అయితే నేను నీకు నెల వ్యవధి ఇచ్చినట్టు అదనంగా మరో పదిహేను లక్షలు అప్పు ఇచ్చినట్టు నీకు నాకు మధ్యే వుండాలి. ఈ పనికోసం మా బ్యాంకు అధికారులతో పోరాడైనా సరే సాధిస్తాను. నువ్వు మాత్రం నెల రోజులు గడువు గుర్తుంచుకో. రేపు బ్యాంకుకు వచ్చి కాగితాలు మీద సంతకాలు పెట్టి డబ్బు తీసుకొని వెళ్ళు".

"చాలా థ్యాంక్స్ సార్".

ఇక అప్పటి నుండి ప్రతాప్ ఫ్యాక్టరీ పనిమీద విపరీతంగా కష్టపడసాగాడు. తనకు శృతి అన్ని విధాల సహకరించింది.

నిహారికకు ఇవేవి పట్టనట్టు ప్రార్థనా గదిలో గంటల సమయం అలాగే గడిపేది. సలహాలు, సూచనలు ఇస్తూ శృతి ప్రతాప్‌కు అండగా నిలబడింది. ఇప్పుడు సమస్య ఒక్కటే. నాయుడు హ్యాండ్ లూమ్స్ మూతపడటానికి కారణం అందులోని లక్షల రూపాయల సరుకు అమ్ముడుపోకపోవటం. దీనికి సంబంధించిన మెరుపులాంటి ఆలోచన శృతికి తట్టింది. అంతే ఇక ఆలస్యం చేయలేదు. ప్రతాప్ అంగీకారముతో ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో ప్రతాప్ స్నేహితులకు తన ఇప్పటి దయనీయ పరిస్థితిని వివరించింది.

అప్పుడు జరిగింది వింత. ప్రపంచమంతా నిన్ను వదిలేసినప్పుడు నీతోపాటు వుండేవాడు నీ స్నేహితుడు. ఇది సూక్తి. కాని అదే నిజమయ్యింది. ప్రతాప్ గురించి తెలుసుకున్న స్నేహబృందం అంతా కదిలిపోయింది. హోంమంత్రి కొడుకు – వర్ధమాన సినీ నటి – ప్రముఖ పారిశ్రామిక వేత్త కోడలు – యువతను ఉర్రూతలూగిస్తున్న సినీ దర్శకుడు వీళ్ళంతా శృతి పంపిన ప్రతాప్ గురించిన వార్తకు స్పందించారు. నీకు మేమంతా వున్నామంటూ భరోసా ఇచ్చారు.

భరధ్వాజ నాయుడు ఇల్లు వదిలి వెళ్ళాక ప్రతాప్ జీవన శైలిలో మార్పు వచ్చింది. తండ్రి లేఖలోని సలహా పాటించాడు. ప్రతి రోజు క్రమం తప్పకుండా ప్రార్థనలో గడిపేవాడు. ప్రార్థనను ఎలా చేయాలో తెలియక పోయినా ఆ క్లిష్ట సమయమే తనను క్రీస్తు వద్దకు దగ్గర చేసింది. నాన్న సన్నిధి గదిలోకి వెళ్ళి బోరున ఏడుస్తూ ప్రార్థించేవాడు. తన బాధ, దు:ఖం, దిగులు, చింత, వేదన, భయం ఆందోళన, ఆవేదన అన్నిటిని క్రీస్తు పాదాల వద్ద పెట్టి గోజాడాడు.

క్షమించు – పునరుద్ధరించు క్రీస్తు. ఇలా సాగిన ప్రతాప్ ప్రార్థన నిదానంగా తన జీవితంలో పెనుమార్పులను, నమ్మలేని అద్భుతాలను తీసుకువచ్చింది.

ప్రతాప్ స్నేహబృందం అందరూ ఒకరోజు తన ఇంట్లో కలుసుకున్నారు. సానుభూతి మాటలు, జరిగిన విషాదాన్ని గురించి తిరిగి తవ్వటాలు ఏమీలేవు. జరిగిందేదో జరిగిపోయింది. జరగాల్సిన ముఖ్యం. ఫ్యాక్టరీ పునరుద్ధరణకు ప్రతాప్ స్నేహబృందం ఒక బ్లూ ప్రింట్ తయారు చేసింది.

నాయుడు హ్యాండ్ లూమ్స్‌లో మూలుగుతున్న సరుకంతా బయటకు తీసారు. నగరం నడిబొడ్డులో వుండే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో వారం రోజుల పాటు సెలబ్రేషన్స్ ట్రేడ్ ఫేర్ నిర్వహించారు. ప్రస్తుత కాలపు యువతను ఉర్రూతలూగిస్తున్న కథానాయకుడు దీన్ని ప్రారంభించాడు. క్రేజీ స్టార్ నాయుడు హ్యాండ్ లూమ్స్‌లో పేరుకుపోయిన వస్త్రాలను వేసుకొని విలేకరులకు స్టిల్స్ ఇచ్చింది.

మధ్యలో ఒక రోజు బాలీవుడ్ తారామణులు ఆ ట్రేడ్‌ఫేర్‌లో తళుక్కుమన్నారు. ఇలా రకరకాల హంగులతో నడుస్తున్న ట్రేడ్‌ఫేర్ మీడియా దృష్టిని ఆకర్షించింది. ఇక ఆ తరువాత నగరంలో ఎవరిని కదిలించినా అదేమాట. వారం రోజులు నిర్వహించ తలపెట్టిన ట్రేడ్‌ఫేర్ ఇరవై రోజులపాటు విజయవంతంగా నడిచింది.

"స్నేహమేరా జీవితం – స్నేహమేరా శాశ్వతం.

ప్రముఖ పారిశ్రామిక వేత్త, చేనేత వస్త్రాలకు ప్రపంచ మార్కెట్‌లో మంచి గిరాకి వచ్చేలా చేసిన వ్యాపార దిగ్గజం భరధ్వాజ నాయుడు. నాయుడు హ్యాండ్ లూమ్స్ పరిశ్రమను నెలకొల్పి దశాబ్ద కాలంగా విజయపదంలో దూసుకువెళ్ళారు. ఓడలు బండ్లు, బండ్లు ఓడలు అవుతాయి అనే సామెత నాయుడు గారి జీవితంలో నిజమయ్యింది. తీవ్ర నష్టాలతో అప్పులలో కూరుకుపోయిన తన సంస్థను లాభాలలో నడపటానికి తీవ్రంగా కష్టపడి ఓడిపోయారు. పరువుగా బ్రతికిన ఈ మనిషి అప్పుల వాళ్ళకు ముఖం చూపించలేకపోయారు. రాత్రికి రాత్రి కట్టుబట్టలతో కుటుంబాన్ని వదలి ఎవరికి అందుబాటులో లేకుండా వెళ్ళిపోయారు. ప్రతిష్టాత్మక నాయుడు హ్యాండ్‌లూమ్స్ పరిశ్రమ మూసివేతే తరువాయి అని అంతా అనుకుంటున్న తరుణంలో ఒక అద్భుతం జరిగింది. సంస్థ బాధ్యలతను భరధ్వాజ నాయుడు కొడుకు ప్రతాప్ చేపట్టాడు. తన దయనీయ పరిస్థితిని ఫేస్‌బుక్, ట్విట్టర్‌ల ద్వారా తనతోపాటు చదువుకున్న తన స్నేహితులకు ,తన స్నేహితురాళ్ళకు తెలియజేవాడు.

ఎక్కడెక్కడో స్థిరపడ్డ స్నేహితులందరు ఈ వార్తకు కదిలిపోయారు. ఎలాగైనా సరే స్నేహితుడ్ని ఆదుకోవాలని అంతా కలిసి వచ్చారు. నాయుడు హ్యాండ్ లూమ్స్ పరిశ్రమను లాభాలలోకి త్రిప్పటానికి బ్లూ ప్రింట్ తయారు చేసుకొని నగరంలో ఇరవై రోజులపాటు సెలబ్రేషన్స్ పేరుతో ట్రేడ్ ఫేర్ నిర్వహించారు. ఈ స్నేహితుల ప్రయత్నానికి విధి తలవంచింది. లక్షల రూపాయల నష్టంతో మూతబడ్డ నాయుడు హ్యాండ్‌లూమ్స్ పరిశ్రమ ఈ స్నేహితుల ఉపాయముతో కోట్ల రూపాయల లాభాలతో గట్టెక్కింది.

ఈ రోజు ఆ సక్సెస్ స్టోరీని వివరించటానికి ప్రతాప్ మరియు అతని స్నేహబృందము మన టి.వి.9 స్టూడియోకి విచ్చేశారు. అసాధ్యాన్ని సాధ్యపరచిన ప్రతాప్‌కు మరియు అతని స్నేహితులకు టి.వి.9 శుభాకాంక్షలు. ఇప్పుడు ఆ సక్సెస్ స్టోరి గురించి ప్రతాప్ ఏం చెప్తాడో విందాము. ప్రతాప్ గారు నమస్కారమండి. ఎంతో సాహసం చేసి మీరు మీ స్నేహబృందం మా ప్రేక్షకులకు ఒక మాదిరిని ముందుంచారు. ఆ సమయంలో మీకెలా అనిపించింది. మీ అంతరంగాన్ని మా ప్రేక్షకులతో పంచుకోరూ...."

"నమస్కారమండి. ఈ క్లిష్ట సమయాన్ని గట్టెక్కేలా చేసిన నా స్నేహితులకు ధన్యవాదాలు. వాళ్ళ గురించి ఇప్పుడు మీతో ఎంత చెప్పినా తక్కువే అవుతుంది. ఫేస్‌బుక్‌లోని నా అభ్యర్ధనకు ఏ మాత్రము ఆలస్యము చేయకుండా వెంటనే స్పందించారు. ఇక్కడ వున్న వీరే నన్ను ఆదుకున్న నా స్నేహితులు. మొత్తం ఏడుగురు. ఒకరు మా ఇంట్లో నా చెల్లిని చూసుకుంటున్నారు. అందుచేత ఈ కార్యక్రమానికి రాలేకపోయారు.

థ్యాంక్స్ అనే మాట ప్రతి చిన్న దానికి రోజువారి జీవితంలో మనము వాడుతుంటాము. అయితే నా స్నేహితులకు ఆ థ్యాంక్స్ అనే మాట కాకవేరే మాటతో వారు నాకు చేసిన సహాయానికి కృతజ్ఞతలు చెప్పుకోవటానికి మరోపదం నాకు తెలియక ఆ మాటతోనే ఈ స్టూడియోలో మీ అందరి ముందు, లక్షలాది ప్రేక్షకుల ముందు నా కృతజ్ఞతలు చెప్పుకుంటున్నాను. ముఖ్యమైన ఒకమాట చెప్పి ముగిస్తాను. కొద్ది సంవత్సరాల క్రితం అమ్మను క్యాన్సర్ కారణంగా పోగొట్టుకున్నాను. ఇంట్లో మానసిక రోగంతో బాధపడుతున్న చెల్లి. ఇలాంటి సమయంలో నేను ఎంతో గౌరవించే నాన్నగారు నాకు దూరమయ్యారు. ఏం చేయాలో నాకు తోచలేదు.

నాన్న ప్రార్ధన చేసుకునే ప్రార్ధనా గదిలోకి వెళ్ళి బిగ్గరగా ఏడుస్తూ ప్రభువుతో నా గోడంతా చెప్పుకున్నాను. సరిగ్గా రెండు గంటల సమయం సన్నిధి గదిలో ఏడుస్తూ అలానే వుండిపోయాను. ఆ రాత్రి క్రీస్తు ప్రభువు నాకు ఒక ఆలోచన ఇచ్చారు. ఆలస్యం చేయకుండా ఆలోచన ప్రకారం నా స్నేహితులకు ఫేస్‌బుక్, ఇతర మార్గాలలో నా పరిస్థితిని వివరించాను. దాని ఫలితమే ఈ రోజున మీరు చూస్తున్న ఈ విజయం. ఈ ఆలోచనకు పునాది వేసింది శృతి".

"ప్రతాప్ గారు చివరి ప్రశ్న. నష్టాలతో కంపెనీ మూత పడింది. మీ స్నేహితుల సహకారంతో ఆ ఇరవై రోజుల ట్రేడ్‌ఫేర్‌కు ఎంతలాభం వచ్చిందో చెప్పగలరా మీకు అభ్యంతరం లేని పక్షములో".

"నష్టాల నుండి బయటపడ్డ పరిశ్రమ మాది. గనుక ప్రభుత్వం వారి పన్నులతో మాకు ఏ సంబంధము లేదు. ఇరవై రోజుల ట్రేడ్ ఫేర్‌లో పాత నిలువ సరుకంతా అమ్ముడు పోయింది. ఖర్చులు పోను లాభం మూడు కోట్లు".

అభినందనలతో మరో చరిత్రను సృష్టించిన ఈ స్నేహబృందం స్టూడియో బయటకు నవ్వుతూ వచ్చారు.

"ప్రతాప్ ఇక మేము బయలుదేరుతాము. మా పని అయిపోయింది కదా. వెళ్ళేముందు ఒక పాట పాడవూ. గతంలో నువ్వు పబ్‌లలో బలే పాడేవాడి వంటకదా". ప్రముఖ పారిశ్రామిక వేత్త కోడలు రాధ అడిగింది.

"ఇక ఆ పాటల జోలికి ఆ జీవితంలోకి నేను వెళ్ళదలచుకోలేదు రాధ. కాకపోతే నువ్వు అడిగావు కాబట్టి ఈ వీడ్కోలులో ఒక క్రైస్తవ పాట పాడతాను. అయితే నువ్వు సంగీత, సంహిత మీరు నాతో శృతి కలపాలి. కోరస్ అన్నమాట. ఓకేనా".

ముందు సందేహించినా ప్రతాప్ ఉత్సాహం చూసి ముగ్గురూ సరే అన్నారు. వెంటనే ప్రతాప్ అందుకున్నాడు. ఫ్రెండ్స్ ఇదిగోండి పాట....

"....గిద్యోను సైన్యముకు జయము నిచ్చినావుగా విజయశీలుడా స్తోత్రము... సంసోనుకు సింహబలము ఇచ్చినావుగా యూద సింహమా నీకే స్తోత్రము". అందరు చిరునవ్వులు చిందిస్తూ ఎవరి కారులో వారు తిరుగు ప్రయాణమయ్యారు.

**మనము పోకిరి చేష్టలు, దురాశలు, మధ్యపానము అల్లరితో కూడిన ఆటపాటలు, త్రాగుబోతుల విందులు చేయదగని విగ్రహపూజలు మొదలైన వాటియందు నడుచుకొనుచు అన్యజనుల ఇష్టము నెరవేర్చుచుండుటకు గతించిన కాలమే చాలును. 1 పేతురు 4:3.**

---------

# 10. క్రీస్తు అందరికీ ప్రభువు ఆయన సేవ చేయుటలో ఆనందమిచ్చారు

టి.పి. వరప్రసాద్ రెడ్డి (అనంతపురము/అమెరికా)



**యెషయ 41:10 భయపడకుము నేను నీ దేవుడనైయున్నాను. దిగులు పడకుము నేను నిన్ను బలపరతును. నీకు సహాయము చేయువాడను నేనే. నీతియను నా దక్షిణ హస్తముతో నిన్ను ఆదుకొందును.**

**పరిచయము:-** మేము హైందంవులము. మా పూర్వీకులంతా రాముని ఆరాధించేవారు. పేర్లు కూడా రాముడు వచ్చేరీతిగా పెట్టుకొనేవారు. మా నాన్నగారి పేరు వెంకటరామిరెడ్డి. పోస్టు మాస్టారుగా పనిచేసేవారు. అమ్మ యింటిపనులు చూచుకొనేది. నిష్టకల్గిన సాంప్రదాయాలు పాటించేన మధ్య తరగతి కుటుంబములో రెండవ కుమారునిగా నేను జన్మించాను. మా నానమ్మ చాలా ఆస్తిపరురాలు. పరపతిగల తోబుట్టువులుండేవారు. మా బంధు వర్గమంతా కర్నూలు జిల్లా బోర్డులో మంచి పరపతి కలిగినవారు.

**క్రీస్తుతో పరిచయము:-** నా తల్లిదండ్రులు నన్ను ఉన్నత విద్య చదివించాలని ఆశ కల్గియుండేవారు. ఇంగ్లీషు విద్యలో అంతగా ప్రావీణ్యత లేనందున ట్యూషన్ చెప్పించుటకు ఉపాధ్యాయున్ని నియమించారు. అతను మంచి క్రైస్తవుడు. విద్యతోపాటు క్రీస్తు ప్రేమను సువార్త ద్వారా తెల్పేవాడు. ఆ రోజుల్లో బైబిలు గ్రంథాలు నేడు దొరికిన రీతిగా విరివిగా లభించనందున చిన్న చిన్న సువార్త పుస్తకాలు కొందరు చదువుకొనేవారు.

మా మేనమామగారు క్రీస్తు బోధనల పట్ల ఆసక్తి చూపినందున అపొస్తలుకార్యాల పుస్తకాన్ని వారికి యిచ్చారట. ఆయన దానిని చదువుట కారంభించారు. అపొస్తలుల ఉజ్జీవము ఆరంభమయిన వివరణ మరియు రెండవ అధ్యాయములో నున్న పరిశుద్ధాత్మ శక్తి ప్రభావంతో వారంతా అన్యభాషలు మాట్లాడు అనుభవం ఆయనకు ఆకర్షణ కల్గించింది.

మనము ఒక్క యింగ్లీషుభాష నేర్చుకొనుటకు చాలా ప్రయాస పడుచున్నాము కదా! చేపలు పట్టే పామరులకు అన్నిభాషలు నేర్పించిన ఆ ప్రభువు ప్రభావం గొప్పది. ఆయన నిజముగా ఆరాధనా పాత్రుడని క్రీస్తును నమ్ముటకు ఆయనకు ఆ అనుభవము ఆధారమైనది. ఆ క్రీస్తుశక్తిని ఆశ్రయించదలచి రక్షణానుభవం కోరి ఆయనను స్వీకరించాడు.

ఆయనలో గొప్ప శాంతి నెమ్మది కల్గిందని సాక్ష్యమిచ్చారు. ప్రతివారి పాప శిక్షను తప్పించి పాపులను రక్షించు సమర్ధుడని నమ్మి బాప్తీస్మము పొందాడు. స్వకీయులంతా తక్కువ కులస్తుల దేవుడిని నమ్మాడని తిరస్కరించారు. క్రీస్తును నమ్మిన తర్వాత తన అనుభవ సాక్ష్యముతో క్రాస్తు పత్రికగా జీవించిన ఆయన జీవితమును గమనించి, ఆయనలో ప్రభువు కల్గించిన ముప్పు ద్వారా ప్రభావితమై యేసే దేవుడని తన బంధువులు కొందరు యేసును విశ్వసించారు.

మా నాన్న ఉద్యోగరీత్యా చాలా బిజీగా ఉండి అనేక వ్యసనములకు బానిసై క్లబ్బులలో కాలం గడిపేవారు. అమ్మ చిన్నపిల్లలమైన మా బాధ్యతలు స్వీకరించి, నాన్నతో గొడవపడి అశాంతితో నుండేది. ఆ రోజుల్లో నాన్నగారికి మంచి క్రైస్తవ స్నేహితుడు ఉండేవాడు. ఆయన ప్రభావము ద్వారా మా నాన్న ప్రవర్తనలో మార్పువచ్చింది. ఆత్మకు శాంతినిచ్చి, పాపశిక్షనుండి విడిపించే సమర్ధుడు క్రీస్తేనని చెప్పిన సువార్త బోధనలు నాన్న విన్నారు.

ఒకరోజు ఆయన మోకరించి "ప్రభూ నా పాపాలన్నీ క్షమించండి" అని ప్రార్ధించారు. ఆ తర్వాత క్లబ్బులకు మానివేసారు. సినిమా పిచ్చి పోయింది. క్రీస్తును రక్షకునిగా స్వీకరించారు. నాన్నలో వచ్చిన ఆ గొప్ప మార్పును బట్టి అమ్మకూడా క్రీస్తు విశ్వాసిగా మారింది. వారు క్రమంగా చర్చికి వెళ్ళి దేవుని వాక్యం వినుట, ప్రార్థించుట, కీర్తనలు పాడుచు భక్తిలో ఎదుగుచుండిరి. నాన్న అమ్మ కలిసి మంచి పాటలు పాడుకొని దేవునిని ఆరాధించేవారు. నేను కూడా క్రీస్తు కేవలం అవసరాలు తీర్చే దేవుడు కాదని తెలిసుకున్నాను. ఆయన జీవితాలను మార్చు దేవుడని గ్రహించాను.

నా స్నేహితులు మేము క్రీస్తును స్తుతిస్తూ పాడే పాటలు విని ఎగతాళి చేసేవారు. నేను బాధపడేవాడిని గానీ, మా నాన్న మారిన జీవితమును గమనించి, ఆయన సమాధానము, సంతోషముతో కుటుంబాన్ని ప్రేమిస్తున్న రీతినిబట్టి నాకు కూడా అట్టి మార్పు కావాలని కోరుకున్నాను. నేను ఇంటరు పూర్తి చేసాను. ఇంజనీరింగులో ఓపెన్ సీటు లభించుట చాలా కష్ట తరమయ్యిననూ దేవుడు తన దయవల్ల ఆఖరు సీటును నాకు అనుగ్రహించి ఇంజనీరింగు చదివే యోగ్యతనిచ్చారు.

**క్రీస్తును నమ్ముట:–** క్రీస్తు నిజదేవుడని తెలిసికూడా ఆయనను వెంబడించుటకు ఆలస్యము చేస్తున్నానని ప్రభువు నాకు తెలియజేసారు. ఇంటర్ వరకు అపజయమెరుగని నేను ఇంజనీరింగులో 2, 3 సబ్జక్టులు ఫెయిల్ అయ్యాను. ఆ తర్వాత నా జీవితాన్ని

ప్రభువునకప్పగించి, నా చదువు భారముతో పాటు నా యిష్టాలన్నీ నీకే అప్పగిస్తున్నాను ప్రభువా, నీవే నాతోవుండి నడిపించండి అని ప్రార్థించాను. అప్పుడు చెప్పనశక్యమైన నెమ్మది నాకు కల్గింది. నిజమైన ఆనందాన్ని అనుభవించాను. నా పాపాలను క్షమించుటకు ఆయనే నమ్మదగినవాడని పూర్తిగా నమ్మాను. ఇక యేసుకొరకే జీవించాలని మంచి తీర్మానము చేసుకున్నాను. నా జీవితము యేసుచేతికి అప్పగించిన తర్వాత నాకు ఇంజనీరింగు పరీక్షలన్నిటిలో అఖండ విజయాన్ని నా ప్రభువిచ్చారు.

దేవుడు నాకు తన దర్శనమిచ్చి ఆలోచన వివేచన నేర్పించారు. నీ దేవుడైన యెహోవా ఆజ్ఞలను శ్రద్ధతో పాటిస్తే తలగా వుంటావు గాని తోకగా నుండవు అన్న వాగ్దానమును నేను ఇంజనీరింగు పొందుట ద్వారా నెరవేర్చారు. డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణత నా డిగ్రీని చూచి వెంటనే ఉద్యోగము యివ్వాలని అనేకులు నన్ను ఆహ్వానించారు. 1970వ సంవత్సరము ఫిబ్రవరి నెలలో మంచి ఉద్యోగమును ప్రభువు నాకనుగ్రహించారు. ఆ తర్వాత వివాహము చేసుకొనుటకు క్రీస్తు నంగీకరించిన సాటియైన సహకారికై వేచియున్ననూ 6 సంవత్సరముల వరకు లభించలేదు. దానిపై ప్రత్యేకంగా కనిపెట్టి ప్రార్థించాలని ఆశించి, తమ్ముడు చెల్లిళ్ళకు వివాహాలు చేసెయ్యమని మా తల్లి దండ్రులకు చెప్పాను.

ఆ తదుపరి మా సంఘములోనే ఒక మంచి కుటుంబములోని అమ్మాయిని ప్రభువే చూపించారు. కులాంతర వివాహమయిననూ విశ్వాసములో ఏకత్వమున్నందున సాటియైన సహాయముగా మంచి వ్యక్తిని ప్రభువు నాకిచ్చారు. మా వివాహ జీవితము క్రీస్తుప్రేమలో దివ్యంగా కొనసాగింది. యిద్దరు మంచి కుమారులను ప్రభువు బహుమానంగా మాకిచ్చి సంతోషపెట్టారు. పెద్దబాబు యోహానువలె, రెండవ బాబు పౌలువలె సంఘాలు కట్టి సేవచేయాలని ఆశించి ప్రార్థించేవాడను.

ఏ స్థలములోనున్ననూ, ఆత్మల జాలరిగా నుండి సంఘములు స్థాపించాము. దేవుని మహాకృప సదా తోడుగా నుండేది. దేవుడే అభివృద్ధిచేసి ఆనందమిచ్చారు. పెద్దబాబు ఇంజనీరుగా అమెరికాలో భార్యా బిడ్డలతో స్థిరపడ్డాడు. స్థానిక సంఘంలో సేవచేస్తూ దేవున్ని సంతోషపెడ్తున్నాడు.

**చిన్నబాబు రక్షణ:-** చిన్నబాబు జీవితమును గూర్చి కాస్త కలవరము, కలత ఉండేది. దురలవాట్లకు బానిసైనందు వలన వాడి జీవితమును పాడుచేసుకుంటున్న విధానము నాకు సమస్యగా నుండి బాధపడేవాడిని. అందువల్ల నాకు రక్తపోటు వచ్చింది.

1996వ సంవత్సరంలో అనంతపూరులో ఉద్యోగం చేయవలసి వచ్చింది. అక్కడ నేను సువార్త ప్రకటిస్తూ దేవునిసేవ చేసేవాడిని. సంపూర్ణ సేవకు ప్రభువు నన్ను పిలుస్తున్నారని గ్రహించాను. నేను సేవ చేస్తున్న ప్రాంతములో మా మందిరములో కొందరు సాక్ష్యము చెప్పుటకు వస్తూ వుండేవారు. కొందరు సువార్తికులు జైలులోనున్న ఖైదీలకు సువార్త అందించుటను బట్టి వారి జీవితాలలో వచ్చిన మారుమనస్సును బట్టి మారిన ఖైదీలు పొలము పనులు చేయుటకు జైలు బయటకు పంపబడేవారు. అలాంటి వారు మా మందిరములో సాక్ష్యము చెప్పుట విని నా చిన్న కుమారుడి జీవితంలో ఆలోచన కల్గింది.

హంతకులను క్రీస్తు క్షమించిన తీరు అతనిని ఆశ్చర్యపర్చింది. నాలాటి వారిని దేవుడు క్షమించగలడని నిరీక్షణ అతనికి కల్గింది. ఆ విధంగా నా చిన్న కుమారుడు మారుమనస్సు పొంది పశ్చాత్తాప ఫలితంగా అందుకున్న నూతన జీవితాన్ని బట్టి నేను దేవుని స్తుతించి చాలా సంతోషించాను. దేవుడు నా ప్రార్థనలను ఆలకించారు. ఇక సంపూర్ణ సమర్పణ గల సేవను చేయుటకు ఆటంకమేమి అని ప్రభువు నన్ను ప్రశ్నించారు. వాలంటరీ రిటైర్‌మెంటు కావాలని అధికారులను కోరాను.

1999లో నేను నా భార్య సంపూర్ణ సేవలో చురుగ్గా పాల్గొనుటకు నా పదవీ విరమణ ద్వారా దేవుడు సహాయం చేసారు. మారుమూల గ్రామాలు దర్శించి ఆత్మ జాలరులుగా మారి అనేకులను రక్షించుటకు దేవుని హస్తము తోడుగా అందించారు. చిన్న బాబుకు వివాహము చేయదలచి ప్రార్థించగా భక్తిగల వనిత, కంప్యూటరు ఉద్యోగి భాగస్వామిగా లభించింది. ఆమె సండేస్కూలు నిర్వహణలో చురుగ్గా పాల్గొనేది. మా సేవకు చాలా సహకారాన్ని యిచ్చేది. మేము చేస్తున్న సేవకు చేయూతగా చిన్నబాబు అతని భార్య సహకరిస్తున్నారు.

**మార్కు 7:37 "ఈయన సమస్తమును బాగుగా చేసియున్నాడు"**

మా సేవా కార్యక్రమములలో గొప్ప అభివృద్ధిని, ఫలితాలను చూడగల్గాము. 15 సుదీర్ఘ సంవత్సరాల సేవలో మాలోనున్న లోటుపాటులు చూపి సరిచేసి దేవుడు ఎంతో దివ్యంగా నడిపించుకుంటున్నారు. అన్నిరంగాలలో, ఆర్థికంగా, ఆధ్యాత్మికంగా, సంఘపరంగా ఘనత గౌరవాల్ని అందించి దేవున్ని ఘనపరిచి, స్తుతించి, కృతజ్ఞత చూపు ధన్యతనిచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లోనే కాక, నేపాల్, బర్మాలో సేవను విస్తరింపజేసారు. అమెరికాలో కూడా పెద్ద కుమారుని దర్శించి సేవచేయగల్గాము. భూదిగంతాలలో సాక్షులుగా నిలిపారు. యజమాని వాడుకొను మంచి పాత్రలుగా దీవించారు. ఈ సాక్ష్యాన్ని ప్రభువు దీవించుగాక.

**ఆమెన్.....**

# 11. బుద్ధి జ్ఞాన వాక్య సంపద వరముగా నిచ్చిన ప్రభువు నా రక్షకుడు

**శ్రీమతి రూత్ జెర్మియ(హైదరాబాద్/న్యూయార్క్, అమెరికా)**



**యిర్మియా 1:5 "గర్భములో నేను నిన్ను రూపింపకమును పే నిన్నెరిగితిని. జనములకు ప్రవక్తగా నిన్ను నియమించితిని".**

ప్రభువు నామమునకే సదా మహిమ కల్గును గాక. నా సాక్ష్యమును వివరించు ధన్యత నిచ్చిన ప్రభువునకు నా కృతజ్ఞతలు. యేసయ్య ప్రార్ధనా సెల్ నిర్వహణలో నా సాక్ష్యము పంచుకొను అవకాశమిచ్చిన విశ్వాసులకు నా ధన్యవాదాలు. నేడు దేశ విదేశాలలో ప్రభువు సేవాభారంతో వాక్య పరిచర్యలో నన్ను విరివిగా వాడుకొనుచున్న దేవునికి ప్రార్ధనా గుంపుల వారికి నా కృతజ్ఞతలు. నా బాల్యము, నా పూర్వీకుల చరిత్రను వివరించు భాగ్యము ప్రభువు నాకిచ్చిన ధన్యత గనుక నా నోటిమాటలు విను బుద్ధి పుట్టించు గాక.

**పరిచయము:–** నా తల్లిదండ్రులు క్రైస్తవులుగా భక్తితో పెంచిన గొప్ప అనుభవం మా తాత నానమ్మ గారి నుండి లభించింది. మా తాత హిందువుగానే వుండేవారు. ఆయన పేరు రామయ్య గారు. నానమ్మ పేరు రాజ మలమ్మ గారు. పొలము పనిచేసేవారు. వారి పొలాలకు నీరు పెట్టు వేళలో యద్ధనపూడి బెంజమేను గారు ప్రభువు ప్రేమ వారిని బలవంతం పెట్టగా, ఆత్మజాలరిగా జీవిస్తూ మా తాతగారికి క్రీస్తు ప్రేమను సువార్త రూపాన వివరించగానే, వినుట ద్వారా విశ్వాసముంచిన పుణ్యదంపతులు. వారు నీటి బాప్తీస్మము తర్వాత వారి పేర్లు రామయ్య, రాజరత్నము గారనియు, నానమ్మ రాజమణిగా మారాయి.

వారు క్రీస్తును వెంబడించి, వారి సంతానమును బహునిష్ఠగల భక్తితో పెంచారు. వారు ఆంధ్రప్రదేశ్‌లో గొప్ప విశ్వాసులుగా గణనీయ సేవలందించిన భక్తులుగా మాకందరికీ అతిశయ కారణంగా నిలిచారు. కల్యాణపు సోదరులు కె.ఆర్. అబ్రహాము గారు, కె.ఆర్. దేవిడ్ గారు, కె.ఆర్. జాకబ్ గారు, మా తాతకు జన్మించిన వారు. మా మేనత్తలు మరియమ్మ, శారమ్మ, విమలమ్మల పేర్లు నాకు సుపరిచితాలు.

యిది 100 సంవత్సరాల చరిత్రకాలము. మా తాత నాయనమ్మలు తమ ఎనిమిది మంది సంతతిని క్రీస్తు ప్రేమలో పెంచారు. వారిని వారి మనుమ సంతతిని అత్యున్నతంగా దీవవించారు. అందరి గృహాల్లో పెద్ద ఉద్యోగస్తులుండగా, డాక్టర్లు, ఇంజనీర్లు కావాలని కోరేవారుండగా, దైవసేవ చేయు దైవ పరిచారకులుగా నుండాలని కోరేవారు. మా పెదనాన్న గారైన కె.ఆర్. డేవిడ్ గారు పెంతుకొస్తు ఉద్యమములో గణనీయమగు సేవలు చేసారు. పి.యం. సామ్యూలు గారు, పి.ఎల్. పరంజ్యోతి గార్లతో కలిసి అనేక ఆత్మలకు ఆకలిదప్పులు తీర్చిన దైవజనులు. ఎన్నో పుస్తకాలు రచించారు.

మా నాన్న కల్యాణపు జేకబ్ గారు, అమ్మ శారమ్మ గార్లకు ఎనిమిది మంది సంతానము కల్గారు. ముగ్గురు మగపిల్లలు, ఐదుమంది ఆడపిల్లలము జన్మించగా వారందరికీ బైబిలులోని పేర్లు పెట్టి దేవునిని బహుగా ప్రేమించారు. బెంజమెన్, జోసెఫ్, సొలోమెన్, రెబక్క, రూత్, గ్రేస్, కెజియ, మరియు తబిత. వీరితో నేను రూతు పేరున పెరిగాను.

మా నాన్నగారి ఉద్యోగరీత్యా వరంగల్‌లో చేరాము. టి.కె. ధామస్‌గారి సంఘములో ప్రముఖ సభ్యులుగా నుండిన నాన్నగారికి సంఘములో చాలా మంచిపేరు, పలుకుబడి ఉండేది. ఎక్కువ మందిని యింటిదగ్గర చదివించుటకు ఆర్థికంగా యిబ్బందిగా నుండుట వల్ల జనగామ్ ఎ.బి.యం. స్కూలు హాస్టలులో నాలుగు మంది తోబుట్టువులతో విద్యాభ్యాసము చేసాను. ఆ సంస్థలో దేవుని ప్రేమ నిలిచివుండేది. గొప్ప క్రమశిక్షణ గల సంస్థలో ఎందరో గొప్ప దైవజనులు దైవసేవలో ఆత్మలను సంపాదించిన చరిత్రగలదిగా పేరున్నది.

ఆర్థిక యిబ్బందులలో పేదస్థితి కల్గినను ఆత్మీయతలో చాలా ధనికులుగా నిలిచాము. మా గృహంలో ఉదయ సాయంకాలంలో కుటుంబ ప్రార్థనలు చాలా క్రమముగా జరిగేవి. బైబిలు వాక్యాలు చాలా కంఠస్థము చేసేవారం. బాల్యము నుండి నానోట దైవ వాక్యము నిలిచి వుండి దివారాత్రులు ధ్యానించే అనుభవం నాకుండేది. మా నాన్న ఇండియన్ పెంతుకొస్తు సంఘ పరిచర్యలో పూర్తిగా తీనమయ్యేవారు. తరచుగా మూడు రోజుల ఉజ్జీవ సభలు నిర్వహణలో ప్రతి పనినీ స్వయంగా దగ్గరుండి భోజన సదుపాయాలు, కుర్చీలు, వేదిక అమరికలన్నీ సమకూర్చేవారు.

మా అన్నయ్యలు కూడా నాన్నకు సహకరించేవారు. సంఘనిర్మాణ సమయంలో కాపలాకొరకు 21 రోజులు దగ్గరవుండి కాపాడేవారు. ఆయన క్రీస్తును నమ్మిన స్థితిలో పిల్లలకు వివాహాల సమయంలో ప్రార్థించి తగిన భక్తిగల కుటుంబాలను నిర్ణయించి వివాహాలు జరిగించారు.

మా అమ్మ పెంతుకొస్తు మతస్తురాలు కాకపోయినను, బాప్టిస్టు సంఘస్తురాలిగా నాన్నను పెండ్లాడి, చెవులకుగాని, మెడలోగాని నగలు పెట్టుకొని ఆడంబరలంకారాల పట్ల యిష్టత లేనిదై భక్తితో నాన్న ఆశయాలను గౌరవించింది. మా అందరికీ చెవులు కూడా కుట్టించలేదు. సినిమా ప్రభావాలకు దూరంగా వుండేవారము. యీ అలవాట్లను బట్టి అమ్మను కూడా చులకనగా చూచిననూ లక్ష్యపెట్టక ప్రభువును ప్రేమించిన గొప్ప సాధ్విగా పేరు పొందారు.

ఆ దినాల్లో వ్యతిరేఖతలన్నీ ఓర్పుతో ఎదుర్కొన్నారు. బిడ్డలను పెంచుటలో, వివాహాల బాధ్యతలన్నిటికి సంపూర్ణంగా దేవునిపైన ఆధారపడేవారు. రోజంతా సంఘపరిచర్యలో 21/2 గంటల సమయము వరకు గడిపి ఉద్యోగ ధర్మము నిర్వహణకై 3 గంటలకు చర్చి విడిచిపెట్టేవారు. అంకిత భావంతో దైవసేవ చేసిన భక్తుడు.

నా తల్లి మా ఆడపిల్లల జీవితాలన్నీ గొప్ప విలువలతో దైవవాక్యంతో ఉన్నత ఆశయాలతో పెంచింది. ఇంటిపని చేస్తూ ప్రార్థించేది. కృపగల ఉపదేశాలు చేసేది. మా నడతలన్నీ కనిపెట్టేది. అమ్మ, నాన్న మేమంతా అద్దె యింట్లోనే బాల్యం గడిపాము. నేను పుట్టిన రోజుల్లోనే స్వంతయిల్లు లభించింది. అక్క, అన్న జన్మించిన రోజుల్లో అమ్మ ఎన్నో అవమానాలు భరించింది. యింటిగలవారి పిల్లలు అల్లరిచేసేవారట. గద్దించిన ఫలితంగా మాయింటి పాత్రలు తీసుకొని యింటిబయట పెట్టారట. చిన్న పిల్లవాడు అమ్మను అవమానపర్చినందున మనస్సు గాయపడినప్పుడు దేవుని సన్నిధిలో ప్రార్థించిందట.

"అమ్మా, బాధపడకు. నీ బిడ్డలను దీవిస్తాను. వారందరికీ స్వంత యిండ్లు యిస్తానని అభయమిచ్చారట. ఆ రోజుల్లో 1955వ సంవత్సరము ఆగస్టు 25వ తేదీన నేను జన్మించాను. నేను నా బాల్యం నుండి స్వంతయింట్లోనే గడిపాను. మానాన్న చాలా ప్రేమతో చూచేవారు. మా నాన్న గార్కి డెయిరీవ్రాసే అలవాటుండేది. ఆయనకు గతంలో 80 రూపాయిల జీతంలో 8 రూపాయిలు పదవ వంతు దేవునికి చెల్లించి దేవున్ని ఘనపర్చేవారట.

మమ్ములను హాస్టలులో పెట్టి చదివించిననూ మా అవసరాలన్నీ తీర్చగల్గుటకు అహర్నిషలూ కష్టించి పనిచేసేవారు. మా జీవితాలను చూచి చాలా సంతోషించేవారు. అమ్మ తన 76వ యేట మరణించగా నాన్న 2010వ సంవత్సరములో 87వ యేట ప్రభువు చెంతకు చేరారు. నేడు మా తోబుట్టువులలో ముగ్గురు సంపూర్ణ దైవసేవకులుగా ప్రభువు పరిచర్యలో లీనమయ్యారు. మా అన్న కుమారునికి అక్క కూతురు అయిన మరియతో వివాహము జరిగింది. గుర్భాపురంలో సేవచేస్తున్నారు. అక్క కూతురితో ప్రభువు

మాట్లాడేవారు. మిగిలిన సభ్యులు పనులుచేస్తూ సేవకు సహకరిస్తున్నారు. నాకు మా నాన్న సోదరి కుమారునితో 1978వ సంవత్సరము జూన్ నెలలో వివాహము జరిగింది. నేను అప్పటిలో డిగ్రీ చదువుచూనే వున్నాను. పెండ్లి తర్వాత డిగ్రీ పూర్తిచేసాను. బి.యిడి. చేయాలని ఎంత ప్రయత్నించిననూ సాధ్యపడలేదు. ఉద్యోగము లేదని చాలా నిరుత్సాహ పడేదానను. వాక్యము చదివి నాకు అర్ధమయిన భావాలతో అందరికీ సందేశమిచ్చేదాన్ని. స్త్రీల కూడికలలో యిచ్చిన సందేశాలను బట్టి నీవు స్త్రీవేనా అని ప్రశ్నించేవారు. అందరికీ ఉద్యోగాలనిచ్చావు. నాకెందుకు లభించలేదని ప్రార్ధనలో గోజాడి అడిగేదానను.

బాల్యం నుండి బైబిలు చదువుట, వాక్యాలు నేర్చుకొనుటలో చాలా శ్రద్ధ వహించేదాన్ని. బాల్యంలోని సంఘటన నాకెంతో ఆనందం కల్గించేది. ఒకసారి మా తాతగారు మాయింటికి వచ్చి మమ్ములను దగ్గరకు తీసుకొని మాట్లాడే సమయంలో "నాకు 27వ కీర్తన అంతా కంఠస్థంగా వచ్చును. చెప్పనా? అని అడిగి మొత్తము చెప్పేసాను. ఎంతో ముచ్చటపడి ఆనందించారు. ఆకలయినా, దాహమయినా, నీరు కావాలన్నట్లు వాక్యమే మాట్లాడేదాన్ని.

నాకు వివాహమయిన తర్వాత నా భర్త ఆఫీసులో పనిచేసేవారు. నేను యింట్లోనే వుంటూ బాధతో పండుకొని "నాకు ఉద్యోగముంటే యిద్దరి సంపాదన వల్ల కుటుంబ అవసరాలు మెరుగుగా నుండేవి కదా అని విచారించేదాన్ని. నా బాధ ప్రార్ధనలో దేవునితో విన్నవించుకున్నప్పుడు రాత్రి సమయంలో నాకు స్వరం విన్పించింది. "ప్రియులు నిద్రించుచుండగా వారికిచ్చు చున్నాడు. కష్టార్జితమిస్తానన్న మాట విన్పించింది. వట్టి మాటలు లేమిడికి కారణము. సోమది వారంటే అయిష్టమని తెల్పారు. ప్రతి సమస్యకు తగిన వాక్యాన్ని, స్వరము ద్వారా నాకు బోధించి ఊరట కల్గించేవారు.

**రోమా 12లో 8వ వచనము** ద్వారా సూటిగా నాకు తెల్పిన దేమనగా **"బోధించువాడైతే బోధించుటలోను, హెచ్చరించువాడైతే హెచ్చరించుటలోను పని కలిగి యుందుము".**

నా భర్త కష్టించి పనిచేసే ఆఫీసు (సర్వే ఆఫీసరుగా) అబిడ్స్‌లో వుండేది. 1983వ సంవత్సరము నాటికి నాకు ముగ్గురు పిల్లలు కల్గారు. నాలో రక్తము లేనందువల్ల నా శరీరము చాలా నీర్సమయిపోయింది. రక్త పరీక్ష చేస్తే రక్తంకు బదులు నీరువచ్చేది. మా అన్నయ్య నిరంజన్ గారి భార్య ఆస్పత్రిలో నర్సుగా పనిచేసేది. నా రక్త పరీక్ష రిపోర్టు చూచి మా అన్నయ్యకు వదిన చెప్పినప్పుడు వెంటనే నా భర్తకు నా పరిస్థితి తెలియజేసాడు. ఆఫీసులో నున్న నా భర్త నేరుగా ఆస్పత్రికి చేరారు. నా ముగ్గురు బిడ్డలను అక్కకు అప్పజెప్పి ప్రార్ధించాను.

ఆస్పత్రికి చేరు సమయంలో ఆటోలో నుండి కళ్ళుమూసుకొని ప్రార్థించాను. కన్నీరు ధారలై కారుచుండగా బాధతో ఒక్కసారి కళ్ళు తెరిచిచూచాను. ఎదురుగా లారీపై మంచిమాట కన్పించింది. నిరీక్షణ లేనిదానిగా దు:ఖస్థితిలో నున్న నాతో ప్రభువు సూటిగా మాట్లాడారు. (Trust in the Lord) "ప్రభువుపై నమ్మిక ఉంచుము" గాంధీ ఆస్పత్రికి చేరినను కర్ఫ్యూ వల్ల అత్యవసర పరిస్థితులలో ప్రవేటు ఆస్పత్రిలో శ్రద్ధగా వైద్యం చేయగలరని యిబ్బందిలో ప్రయాణించాము.

డాక్టరు రానందున కనిపెట్టుసమయంలో ఒక ఆపిల్ తినేసాను. నాలో వింతశక్తి ఆవరించినట్లుగా భావించాను. ఒక నెల అనారోగ్యంతో నుండినను ప్రభువుపై నమ్మికం ఉంచి ప్రార్థించినందున నన్ను ఆయన కృపతో బ్రతికించారు. ప్రభువు వాక్యము ద్వారా మరలా మాట్లాడారు.

**యోబు 24:22 "ఆయన తన బలముచేతను బలవంతులను కాపాడుచున్నాడు. కొందరు ప్రాణమును గూర్చి ఆశ విడిచినను వారు మరలా బాగుపడుదురు. వారికి అభయమును దయచేయును గనుక వారు ఆధారము నొందుదురు".**

నా బలహీనస్థితిలో నా అనారోగ్యంలో మరణ భయము ఆవరించగా ప్రభువు అభయమిచ్చారు. 1983లో జరిగిన అద్భుత స్వస్థత తర్వాత 5 మంది బిడ్డల తల్లినయ్యాక 1997వ సంవత్సరములో మరలా అనారోగ్యము వాటిల్లింది. కనీసము నా చేతివ్రేలును కదిలించి చూచుకొని సజీవంగా నున్నానో లేదో పరీక్షించుకొనే స్థితికి చేరాను. మరొక రోజు బ్రతికే ధన్యత దేవుడిస్తాడో లేదో అనే భయం ఆవరించింది. ఆ సమయంలో పడకమీద నుండగా చాలా పాఠాలు నేర్పించారు.

నీ బిడ్డలను ఆశీర్వదిస్తాను అని అభయమిచ్చారు. సర్వ సమయాల్లో ప్రార్థన చేసుకొనేదాన్ని. ప్రభువు ఒకరోజు దర్శనమిచ్చారు. కలలు నిద్రించిన సమయంలో వస్తాయి. అయితే దర్శనాలు మనము మెళుకువగా నున్నప్పుడే వస్తాయి. నా కళ్ళముందు రైలు కన్పించింది. అందు రెండు భోగీలు క్రిందికి ఒరిగిపోయాయి. వాటిని ఎవరు నిలబెట్టగలరు? అని ఆలోచిస్తున్నాను. క్రేన్ నిలబెట్టగలదా? అని ఆలోచిస్తున్నప్పుడు నేనే నిన్ను నిలబెట్టగలను అని మాట వినిపించిది. యితరులకు సువార్త చెప్పాలనే బాధ్యత నాకందించారు. నేను ఉప్పుగా ఉండాలని కోరిన ప్రభువు "నీవు ఉప్పుగా నీటిలో కరిగిపోవాలి. ఉప్పు కరిగిపోయి రుచినిస్తుంది. నీవు యితరుల జీవితాలకు రుచిని అందించగలవు.

అన్ని దేశాలలోని వారికి, అమెరికా ప్రెసిడెంటుకు కూడా ఉప్పు అవసరమే. ఉప్పు విలువైనదిగా దాచిపెట్టరు. అందరికీ అందుబాటులోనే వుంటుంది. ఉప్పు పరిశుద్ధంగా, తెల్లగా ఉంటుంది. నవు అట్లే వుండాలి. కృపాసహితమైన మాటల్ని మాట్లాడు అని ప్రోత్సహించిన క్రీస్తు మాటల్ని శిరసావహిస్తున్నాను. ఉప్పువలె నిలకడగా స్థిరంగా ఉండాలని నిర్ణయించుకున్నాను. ఆ రోజుల్లో 5 మంది పిల్లలతో ఒక్క జీతముతో నా భర్త ఎమ్.ఆర్.ఓ.గా గుంటూరు ప్రాంతంలో అచ్చంపేటలో పనిచేసే రోజులవి.

1999వ సంవత్సరము నా జీవితాన్ని కదిలించిన కాలము. మా కుటుంబమంతా సమీప బంధువుల వివాహానికి కుటుంబముతో వెళ్ళాము. నా భర్త, బాబు బైక్‌మీద పనివుందని వెళ్ళగా ఘోర రోడ్డుప్రమాదంలో నా భర్త మాత్రమే రక్తసిక్తమై మరణించగా అవాక్కయ్యాను. ఆకస్మిక మరణము ఎదుర్కొన్న నేను దిగ్భ్రాంతి చెందాను.

5 మంది బిడ్డలు తండ్రిలేని వారిగానున్నారు. ఆధారమేమీ లేదు. ఏ రీతిగా బ్రతికించాలి? నాకు దిక్కెవరు? పోషించువారెవరు? అప్పట్లో పెద్దపాప షారోను ఎమ్.ఎస్.సి. మొదటి సంవత్సరము విద్యలోనున్నది. ప్రవేటు లేకుండా విలువైన మార్కులు తెచ్చుకొనేది. పిల్లలనెప్పుడు విహారయాత్రలకు పంపేదాన్ని కాదు. డబ్బులు చాలేవుకాదు.

బైబిలు దగ్గర పెట్టుకొని, కన్నీరు తుడుచుకొనుటకు చేతిరుమాలు చాలదని ఎంచి ఒక పెద్ద టవలు దగ్గరుంచుకొని కన్నీటితో ఏడ్చి ప్రార్థించుకొనేదాన్ని. ఆదాయము కన్న ఖర్చు ఎక్కువగా ఉండేది. బిడ్డల రిపోర్టు కార్డులు దేవుని ముందు పెట్టి వారి భవిష్యత్తుకై ప్రార్థించేదాన్ని. పెద్దబాబు ఇంటరు చదివే సమయము. మధ్యలో బిడ్డ 10వ తరగతి, చివరివాడు చిన్నవాడుగా ఉండేవాడు. నా ప్రార్థనలో “ప్రభువా నేను సహించగలనా యీ శోధన? నన్ను మర్చిపోయావా? నాకు నీవీ బాధ అనుమతించావా? ఈ రీతిగా రోధించేదాన్ని. పెద్దపాప టోఫిల్ పరీక్ష వ్రాయుసమయంలో చెట్టుక్రింద కూర్చుని తలవంచి ప్రార్థించే సమయంలో ప్రభువు నాతో వాక్యము ద్వారా మాట్లాడారు.

**యెషయా 44:3 “నీ సంతతి మీద నా ఆత్మను కుమ్మరించెదను. నీకు పుట్టిన వారిని నేనాశీర్వదించెదను. భయపడకుము, నీ పిల్లలను నేను రక్షించెదను. వారు ఉపదేశము పొందెదరు”.** అనే మాటలన్నీ నాకు బహు ఆదరణ, ధైర్యము కల్గించేవి. ప్రతి అనుభవములో నాకు ఊరటనిచ్చేది దేవుని వాక్యమే. దేవుడు నా ప్రక్కనే నిలిచి, నాతో సంభాషిస్తున్న అనుభూతి పొందేదాన్ని. భర్తను పోగొట్టుకొని అనాధగానున్న నాకు అండగా నిలిచి అనుదినం

క్షణం నాకు ధైర్యము పుట్టించి యోబులోనున్న వాక్యంతో మరలా మాట్లాడారు. ఆయన కట్టడలు నేర్చుకొనుటకు శ్రమలో కృపనిచ్చి దీవించారు.

**యోబు 22:28 "మరియు నీవు దేనినైన యోచన చేయగా అది నీకు స్థిరపరచబడును. నీ మార్గముల మీద వెలుగు ప్రకాశించును. ఏది ఆలోచించినను అది స్థిరపరచబడునని తెల్పారు.**

మరొక వాక్యము నన్ను ఆదరించి నూతన మార్గములో నడిపించింది.

**యెషయా 43:19 "ఇదిగో నేనొక నూతన క్రియ చేయుచున్నాను. ఇప్పుడే అది మొలుచును. మీరు దాని నాలోచింపరా? నేను అరణ్యములో త్రోవ కలుగజేయుచున్నాను. ఎడారిలో నదులు పారజేయుచున్నాను".**

నా బిడ్డల విద్యాభ్యాసము, వివాహముల బాధ్యత వహించవలసి వచ్చింది. నా బిడ్డలు నా మాటకు ఖచ్చితముగా లోబడేవారు. ప్రేమలు, నిర్లక్ష్య వైఖరి, ఎదిరింపు స్వభావము లేక సాత్వీకులుగా నాకు లోబడుటను బట్టి ప్రభువు నా పనులలో నాకు సహాయపడి విజయవంతంగా ముగించు ధన్యతనిచ్చారు. పెదబాబుకు 18 సంవత్సరాల వయస్సులో నాన్నగారి ఉద్యోగమిచ్చారు. మగపిల్లలు బాధ్యత వహించరేమోనని నన్ను ఉద్యోగం చేయమని అడిగారు. నేను సమ్మతించలేదు. నా బిడ్డలు సమర్ధులుగా నిలిచారు. పెద్దపాప షారోను, కుమారుడు జాన్ మోజెస్, అమ్మాయి జెరుషా, జాన్ ఫిలిప్పు, జాన్ ఓనెసీములను దేవుడు దీవించాడు.

2004వ సంవత్సరములో పెద్దపాప వివాహమై అమెరికాలోని న్యూయార్కులో స్థిరపడింది. ముగ్గురు బిడ్డలు కలిగారు. ఒకరు కమీషనర్ పి.ఎ.గా, మరొకరు స్కూల్లో ఉద్యోగము, ఒకరు సైంటిస్టుగా ఉన్నత ఉద్యోగములో నున్నారు. నా జీవితంలో దైవసేవకై ప్రభువు నన్ను పిలిచి అభిషేకించారు. భాషల వరము, ప్రత్యేక కృపా వరాలనిచ్చారు. బుద్ధి జ్ఞాన వాక్యాలనిచ్చి దీవించారు. జరిగిన సంఘటనలను వివేచించి చెప్పు వరమునిచ్చారు. ఏ సమయములోనైనా ప్రసంగించే నేర్పునిచ్చారు. నేడు వివిధ ప్రాంతాలలో సువార్త బోధించు రీతిని బట్టి దేవునికే మహిమ కల్గునట్లు నన్ను బైబిలు డిక్షనెరీ అనియు, ఎన్ సైక్లోపీడియా, ఎవర్ రెడీ బ్యాటరీ అని పిలిచి అభినందిస్తారు.

సొలోమోనుకు దేవుడు జ్ఞానమిచ్చి నిగూఢ ప్రశ్నలకు జవాబులిచ్చు నేర్పు కల్గినవాడుగా దేవుడు దీవించాడు. సొలోమోను కంటే గొప్ప వాడిని నేనే అని ప్రభువు

మాట్లాడారు. నా కొరకు ప్రార్థించిన ముగ్గురు దైవజనులు ప్రవచనాత్మకంగా "అమ్మా, నీవు దేశ విదేశాలలో సేవ కొనసాగిస్తావు. నిన్ను దేవుడు ఘనపరచనై యున్నాడని తెల్పారు. నా జీవితము ఎన్నికలేనిదైనను ఉద్యోగము చేసిన వారికున్న ఆనందం కన్న నేను అత్యానంద భరితురాలనై దేవునిలో ఉల్లసించి, స్తుతించి, ఆరాధించి ఘనపరిచి, దేవుని సేవను అవిరామంగా చేసే గొప్ప ధన్యతనిచ్చి ఆశీర్వదించారు.

నేడు రోజుకు 2 లేదా 3 ప్రసంగాలు చేయు పనినిచ్చారు. అరకలు దున్నే ఎలిషాను రెండింతల ఆత్మతో నింపలేదా? గిద్యోనును బలాఢ్యుడా అని పిలిచి వాడుకొనలేదా? గొర్రెల కాపరి దావీదును హెచ్చించలేదా? ఆమోసును దీవించి ప్రవక్తగా వాడుకొనలేదా? నాలాంటి మారుమూల ఒంటరిగానున్న నన్ను పిలిచి 2008వ సంవత్సరములో సంపూర్ణ సువార్త పనికై రమ్మన్నారు. ప్రభువా నేను చేయలేనని సాకులు చెప్పాను.

ఆ రోజు టి.వి.లో అవిధేయత తగదని బోధించారు. కొర్నెలు యింటిలో ముఖ్య స్నేహితులకు పిలుపులనిచ్చి దైవజనుడైన పేతురును ప్రసంగించుటకై ఆహ్వానించి దైవపరిచర్య జరిగించుటను జ్ఞాపకము చేసారు. ఉపవాసముండి కనిపెట్టాను. బెరాకా బిలీవర్స్ చర్చని పేరుపెట్టి పరిచర్య ఆరంభించమని ప్రభువే తెల్పారు.

పామరులు, విద్యావంతులు, ధనికులు వారి సమస్యలను పరిష్కరించుటకై నన్ను నా ప్రార్థన, మాటల్ని కోరేవారు. నా నోట దేవునిమాట నుంచి సమయోచితంగా, జ్ఞానయుక్తంగా దైవవాక్యమనె ఖడ్గమునుపయోగించి పరిష్కరించు ధన్యతనిస్తున్నారు. జోయ్ చారియన్ నేను కలిసి సంప్రదించి సేవచేసాము. ఆమె నా వాక్యము ప్రార్థన కోరేవారు. పెనూయేలు ప్రార్థనా సెల్ న్యూ జెర్సీ పౌండరుగా గణనీయ సేవరలందించే ఆమె కుటుంబము నా వాక్యము కోరి సందేశాలు అందించగా అమెరికాలో అనేక రాష్ట్రాలలో తెలుగువారు ఆత్మీయంగా బలపడునట్లు ప్రభువు నా పరిచర్యను విస్తరించి దీవిస్తున్నారు.

పెర్సిస్ గారి పరిచయంతో ఆరాధన టి.వి.లో అనేక ప్రసంగాలు అందించే అవకాశం కల్గింది. నేటికి 66 సందేశాలనిచ్చాను. నేనందించిన సందేశాలను బట్టి అతిపేద ప్రాంతంలోని ప్రజలు నన్ను ఆహ్వానించగా వారిమధ్య వాక్యపరిచర్య కొనసాగిస్తున్నాను. ఒక గ్రామంలో లంబాడీ తండా నుండి దానియేలు నాయక్ ఆహ్వానించాడు. మేము కొద్ది కుటుంబాలతో నిర్వహించే బెరాకా సంఘము వారు అందించే కానుకలతో గ్రామములోనున్న పేద పాస్టర్లు కొందరిని పోషించు కృప, ఔదార్యాన్ని దీనస్థితిలో సహాయపడు ప్రేమనిచ్చి దీవిస్తున్నారు.

నీ భారము నామీద వేయమని ప్రభువు చెప్పారు. నిద్ర, కోప భారాలు తీర్చబడ్డాయి. మా అమ్మ నాకు రూతు అని పేరు పెట్టినందుకు శ్రమలు తప్పలేదని తలంచేదానిని. మోడుబారిన రూతు జీవితాన్ని ఫలభరితము చేసిన రీతిగా నా బిడ్డలను మట్టిలోని మాణిక్యాలని అనేకులు ప్రశంసించి దీవించేస్థాయిలో నా సంతతిని నిశ్చయముగా దీవించి విస్తరింపజేసిన సాక్షులుగా నిలిపారు.

నా చిన్నబాబు నా సేవకు అండగా ఉండి నా తర్వాత కొనసాగించాలని పేరుపెట్టి పిలిచారు. గతంలో నేను బంధువునని చెప్పుకొనుటకు నాకే ఆధారము లేనప్పుడు నా స్థితిని, గతిని ప్రభువు మార్చిన వెంటనే మధురమైన నా ఆత్మీయ జీవిత ఫలాలను చూచి నేను బంధువునని ప్రేమించు ధన్యతనిచ్చారు. నీటిని ద్రాక్షారసంగా, రుచిగా చేసిన దేవుడు నా జీవితాన్ని మార్చాడు.

డబ్బులకు తక్కువ ప్రాధాన్యతనిస్తూ ఎక్కువ దేవుని సేవకు విలువనిచ్చి ఆకాను, నెహెజీ, అననీయ సెప్పీరా వంటి భ్రష్ట జీవితాలనుండి మారుమనస్సు పొందుట ఎంత అవసరమో నేర్పించే ఆత్మజాలరిగా నన్ను మార్చారు. ఉచితంగా గొప్పవరాలనిచ్చి వాక్య సంపద సమృద్ధిగా అందించారు. రాకడ సమయము కొరకు వేచియుండు ధన్యతనిచ్చారు. అనేక స్థలాలలో క్రీస్తు పరిచర్య కొనసాగాలని నా కొరకు ప్రార్థించండి. మీకు నా దీవెనలు. ఆమెన్. నా సేవకు ప్రోత్సాహాన్నిచ్చిన మీకందరికీ నా వందనాలు.

---------

## 12. విగ్రహాలు తయారుచేయు వంశములో నుండి నన్ను ఎన్నుకొన్న నా క్రీస్తు నా రక్షకుడు

– రిబ్కా జాన్సన్ (అమెరికా)

**పరమగీతములు 3:7 “నా ప్రియురాలా నీవు అధిక సుందరివి. నీ యందు కళంకమేమియు లేదు”.**



**పరిచయము :–** ప్రభుని దివ్యనామములో మీకు నా శుభములు. నా సాక్ష్యము వివరించు అవకాశము లభించినందులకై దేవుని స్తుతిస్తున్నాను. చీకటిలో, శాపములో, అంధకారములో, పాపములో పడియున్న నేను పూజారుల వంశంలోజన్మించాను. పాపపు సంకెళ్ళతో బంధీనైన నన్ను దేవుని సాక్షిగా నిలిపి కట్లను త్రెంపి విడిపించి రక్షణ నిచ్చారు.

గతంలో అబ్రహాము విశ్వాసులకు తండ్రిగా మారుటకు ముందు విగ్రహాలు తయారు చేసి అమ్ముకొనేవాడు. మేము బంగారపు పని చేసే కులములో విగ్రహాలు, ప్రతిమలను తయారుచేసి అమ్ముకొనేవారము. కాళీమాతను పూజించేవారము. అమావాస్య, పౌర్ణమికి విపరీతంగా పూజలు చేసేవారము. అమావాస్య, పూర్ణిమ రోజుల్లో కాళీమాతకు ప్రత్యేక పూజలు చేసేవారము. నేను ఉద్యోగరీత్యా ఒక క్రైస్తవ సంస్థలో పనిచేసేదాన్ని. అయిననూ క్రీస్తును గూర్చి అవగాహన నాకేమాత్రమూ లేదు.

ఒక మళయాళి భక్తుడు మా ఇంటికి వచ్చి క్రీస్తును గూర్చిన సందేశాలు తెల్పాడు. అదే మొదటిగా మా గృహములో నాటబడిన విత్తనముగా నిలిచింది. మతము మార్చుకొనుట కిష్టపడలేదు. మా గృహములో ఏడు మంది సంతానములో నాల్గవ సంతానమైన నేను మొదటిగా క్రీస్తును నమ్మాను. ఆనాటి విత్తనము మొలకెత్తి నాలో గొప్ప విశ్వాసము కలిగించుట ద్వారా దైవ సేవ చేయు భక్తురాలిగా ప్రభువు నేడు నన్ను నిలబెట్టారు. నా కుటుంబము అంతా యేసునే సేవిస్తున్నాము.

ప్రభువు గొప్ప అద్భుతము నాపట్ల చేసారు. పాపము తరతరాలుగా వెంటాడి బాధిస్తుందని అందరూ చెప్పుకొనేవారు. మా పితరులు నగలు తయారు చేయు వ్యాపారములో మోసము చేయుటను బట్టి నాల్గవ బిడ్డగా ఆ శాప దోషము నాపై పడిందన్నారు. నాకు వివాహ యోగ్యము లేదనియు, నా తండ్రి అనేక విద్వాంసుల ద్వారా జాతకము చెప్పించగా నేను కన్యక గానే మిగిలిపోతానని తెల్పారు.

నాకు మాత్రము ఆ విషయము చెప్పకుండా దాచి పెట్టారు. మహమ్మదీయులలో కొందరు ప్రవచనము చెప్పుటను బట్టి మా నాన్న వారితో సంప్రదించారు. నా జీవితము శాపగ్రస్తమని తెల్పి పితరుల శాపము కేవలము నాకే పరిమితమవ్వగా నేను మాత్రమే పెండ్లిలేకుండా మిగిలిపోగలనని స్పష్టంగా తెలిపారు. దానికి విరుగుడుగా శాపవిమోచనార్థము నాలుగు తరాలవారికి వారు చేసిన పాపక్రియలు ఫలితముగా బంగారము దానమివ్వాలని తెలిపారు. ముఖ్యంగా అమావాస్య పౌర్ణమి రోజుల్లో లలిత సహస్ర నామ పూజలు నేను చేసేదానిని. గొప్ప వైరాగ్యముతో ఎన్నో పూజలు చేస్తూ నాకాలాన్ని గడిపేదాన్ని. నేను పనిచేసే సంస్థలోనే జాన్సన్‌గారు పనిచేసేవారు. నా పరిస్థితిని తెలుసుకొని నన్ను ధైర్యపరిచి క్రీస్తును గూర్చి చెప్పుచూ ఉండేవారు. బైబిలు వాక్యాలు చదివి వినిపించేవారు.

కీర్తనలు 115 అధ్యాయములో అన్య విగ్రహాలు వ్యర్థమనియు నోరుండి పలుకవనియు, వాటిని పూజచేయు వారు అట్టివారేనని సూటిగా చదివి వివరించేవారు. నన్ను ప్రేమతో చూచే మానాన్న గారు 1994వ సంవత్సరములో మరణించారు. నా ముగ్గురు అక్కయ్యలకు వివాహాలు జరిగిపోయి వారిళ్లకు వారు వెళ్ళారు. నాకు ముగ్గురు చెల్లిళ్ళు వున్నారు. వారిలో నేనే పెద్దదాన్ని. వారి పోషణాభారం నాపై పడింది.

ఆ రోజుల్లో మా అక్కకు తెలిసిన క్రైస్తవుల ఇంటికి నన్ను ఒకరోజు తీసుకొని వెళ్ళింది. వారంతా నా పరిస్థితి గమనించి కన్నీటితో ప్రార్థించారు. జాన్సన్ గారు నాకు సువార్త బోధించి ప్రార్థించుకోవాలని సలహాయిచ్చేవారు. నాకు విగ్రహ పూజల పట్ల శ్రద్ధ వుండుటను బట్టి వాటితో పాటుగా క్రీస్తును కూడా పూజిస్తానని చెప్పేదాన్ని. క్రైస్తవులంతా నన్ను ప్రార్థన చేసిచూడు. కనీసం విగ్రహా పూజలను మానివేసి రోజుకు ఒక అరగంట ప్రార్థించి చూడు. బైబిలు చదువుకో, క్రమంగా ఆదివారం చర్చికి వెళ్ళు అని చెప్పేవారు.

నా శాపగ్రస్తమైన జీవితం మారిపోయి నాకు వివాహం కావాలని అందరూ కోరుకొని ప్రార్థించి, నాకు కూడా సలహాలిచ్చేవారు. వారంతా చూపిన ప్రేమ నా పట్ల వారికి గల శ్రద్ధను బట్టి ఆదివారాలు చర్చికి వెళ్ళేదాన్ని. ఈ రీతిగా 6 లేదా 7 వారాలు క్రమంగా ఆరాధనలలో పాల్గొన్నాను.

నేను చర్చికి వెళ్ళి భక్తితో మోకరించి, రెండు గంటలు గడిపేదాన్ని. వచ్చీరాని ప్రార్థన చేసేదాన్ని. ప్రభువా, నేను నిన్ను నమ్ముకుంటున్నాను. నా పట్ల దయచూపమని అడిగేదాన్ని. నా గూర్చి ప్రార్థించిన దైవజనులు ప్రవచనాత్మకంగా నేను దేవుని బిడ్డగా మారిపోగలననియు, దేవుడు నన్ను వాడుకుంటారని తెల్పారు.

నా బలహీనతలన్నీ దేవుని ఎదుట ఒప్పుకొని క్షమాపణ పొంది క్రీస్తును నమ్మట ద్వారా మారుమనస్సు పొందాను. గొప్ప శాంతి, ఆనందము నాలో నిలిచిపోయాయి. నేను మద్రాసులో ఉండేదాన్ని. స్టెల్లా దినకరన్ బోదించగా విని చాలా ఆనందించేదాన్ని. నేను కూడా ఆమెవలె ధైర్యంగా సువార్త బోధించాలని చాలా ఆశపడేదాన్ని. అనేక అన్యుల ముందు క్రీస్తు కొరకు సాక్షిగా నిలిచి బోధించాలని కోరుకునేదాన్ని. ఆడవారికి స్వేచ్ఛ తక్కువగా నున్న సమాజములో నేనెట్లు బోదించగలను? అని ఆలోచించి చాలా దు:ఖపడి ప్రార్థించుకొనేదాన్ని.

ఆశగల వాని ప్రాణము తృప్తిపర్చు దేవుడే మనము నమ్మిన దేవుడు కద! అడిగితే తప్పక ఇస్తారని ఆశించాను. నా జీవితము గూర్చి ప్రార్థించేదాన్ని. జాన్‌సన్‌గారు ఒకరోజు నన్ను వివాహము చేసుకుంటానని తెలియజేసారు. నా కుటుంబములో నా చెల్లిళ్ళు ముగ్గురకి రక్షణలేదు. నావల్ల నా చెల్లిళ్ళకు పెండ్లికాదని భయపడ్డాను. నాకయితే నా జీవితంలో నాకున్న శాపములన్నిటిలో విడుదల కలిగాయి. నాకు కలిగిన రక్షణ ద్వారా సమస్తము నూతన పర్చబడుట కేవలము నమ్మి బాప్తీస్మము పొందుట ద్వారా సమస్తము పొందగలిగాను.

నూతన వ్యక్తిగా మారిపోయాను. దేవుని చిత్తములోనే మా యిద్దరి వివాహము నిర్ణయము కావాలని యిద్దరమూ ప్రార్థించాము. దేవుని చిత్తమయితేనే వివాహము జరుగుతుందని యిద్దరమూ పూర్తిగా నమ్మాము. జాన్‌సన్‌గారు నాతో చెప్పినదేమనగా, మన వివాహము నిర్ణయము కావాలంటే మూడు విషయాల్లో స్పష్టమైన నడిపింపును దేవుడు ఋజువుల ద్వారా నిరూపించాలి.

అనగా మూడు సాక్ష్యాధారాలు అవసరము. మనము నమ్మిన దేవుడు మాట్లాడేదేవుడు. పేరుపెట్టి పిలుస్తాడు. ఋజువులన్నీ నెరవేర్చు సమర్థుడని స్పష్టంగా నాకు నచ్చజెప్పారు. నేను కూడా చాలా విశ్వాసంతో కనిపెట్టాను. నా పేరు బాప్తీస్మము తర్వాత రిబ్కాగా మారింది. నాకు కాబోయే భర్త జాన్‌సన్ గారు రోమన్ క్యాథలిక్ మతములో నుండే విశ్వాసము గలవారు. కానీ ప్రభువు వారికి రక్షణానుభవాన్ని ఇచ్చారు. వారి బంధువులలో ఒకామెకు జాన్‌సన్ అంటే చాలా యిష్టమట. ఆమెకు దేవుడొక దర్శనాన్ని చూపించగా వ్రాసిపెట్టారట. ఆమె జాన్‌సన్‌ను పెంచారట.

నా కుమారుడగు జాన్‌సన్ వివాహము రిబ్కా అనే పేరుగల అమ్మాయితోనే జరగాలి అని తెల్పిందట. ఆ ఉత్తరమును జాన్‌సన్‌గార్కి తెలుపలేదు. వారికి నా అసలు పేరు వేదవల్లిగానే తెలుసును. ఆ ఉత్తరము ఆమె ఎక్కడ దాచిపెట్టినదీ వాళ్ళ బంధువులకు

మరలా దర్శనము ద్వారా వివరించగా ఆమె చెప్పిన పేరుగల వ్యక్తిని నేనేనని తెలుసుకొని చాలా ఆశ్చర్యపడ్డారు. మొదటి షరతు పూర్తిగా అద్భుతంగా నెరవేరింది. రెండవదిగా బెంగుళూరులో ఉన్న పాష్టరుగారితో ప్రార్థన చేయించాలన్నారు. జాన్‌సన్ వివాహము దేవుని చిత్తములో జరుగును గానీ ఎక్కడ, ఎప్పుడు జరుగునో తెలియలేదు. మూడవ సాక్ష్యము కొరకు 5 వారాలు కనిపెట్టాము. మా యిద్దరి వివాహము జరుగునని సూటిగా చెప్పారు. అద్భుత రీతిగా 1999వ సంవత్సరము క్రైస్తవ వివాహము జరిగింది.

గతంలో నాపట్ల ప్రవచనాలన్నీ కొట్టివేయబడగా దీవెన కరమైన వివాహ జీవితాన్ని నేను నమ్మిన ప్రభువు ఇచ్చారు. ప్రతి ఆడదానికి తల్లి అవసరము ఎంతైనా వుంటుంది. నాకు తల్లిలేదు. నేను నా భర్తతో అమెరికా చేరాను.

మొదటిగా తల్లిని కాబోవుచున్న వార్త చెప్పుటకు గానీ, శ్రీమంతం చేయుటకు తల్లిగానీ నాకు లేరని చాలా దు:ఖపడ్డాను. నేను కాలిఫోర్నియాలో ఉద్యోగము చేసేదానిని. నా సన్నిహితులంతా నాకు చాలా స్థలాల్లో బేబీషావర్ చేసి నన్ను సంతోషపెట్టారు. మొదటి బిడ్డను పొంది ఆనందించాము.

1999 సెప్టెంబరులో మొదటిసారిగా ఇండియా వచ్చాము. నేను కన్నీటితో ప్రార్థించాను. దేవుని కొరకు నమ్మకమైన సాక్షిగా వుండాలని కోరాను. సింగపూర్ మరియు కొన్ని దేశాలు వెళ్ళాము. ఆ దేశాలలో దేవుని సేవ చేయాలని ఆశించాను.

నేనయితే నా బాల్యం యవ్వన మంతా ఆంధ్రలోనే గడిపాను. నా భర్త మద్రాసుకు చెందినవారు. నా బంధువులంతా హిందువులుగానే వున్నారు. క్రైస్తవులలో తెలుగు వారుంటారా? అనేది నాకు ప్రశ్నగా మిగిలింది. నాకు తమిళము మాట్లాడుట బాగా తెలిసినందున తమిళ ప్రాంతములో సువార్త బోధించగలిగాను. నేనేప్రాంతములో నున్నానో ఆ ప్రాంతాల్లో సాక్షిగా జీవించాలని దేవుని ప్రార్థించాను. స్త్రీగా సువార్త పరిచర్యలో అవకాశాలు రావాలని ఎక్కువగా ప్రార్థించేదాన్ని. ఒక సదస్సులో తెలుగు వారితో పరిచయము లభించింది. వారికి ఇంగ్లీషు రాదు. నన్ను తెలుగులో ప్రార్థనా కాన్ఫరెన్సు ఆరంభించ వలసినదిగా ప్రోత్సహించారు. కేవలము ఇద్దరు సభ్యులతో కాన్ఫరెన్సు ఆరంభించాను.

కేవలము ప్రార్థనా సెల్‌లో ఇద్దరముగా ఆరంభించిన పరిచర్య అభివృద్ధి చెందింది. 20 నుండి 25 మంది సభ్యులు కేవలము స్వరాలు కలుపుతూ ప్రార్థించుచూ వుంటాము. కేవలము నాలుగు గోడలమధ్య పరిచర్యతో ముగిసిపోతున్న ఈ పరిచర్య సంఘముగా బహిరంగంగా సేవచేయాలనే నా ప్రార్థన కోరికగా మిగిలిపోయింది. ఆ తర్వాత ఇండియా

వెళ్ళినప్పుడు ఒక్క మద్రాసులో 6 సంఘాలలో సాక్ష్యము చెప్పి సువార్త బోధించే అవకాశము కలిగినందున దేవుని స్తుతించాను. నా వివాహము చాలా నిరాడంబరముగా బైబిళ్ళు మార్చుకొని చేసుకున్నాము. గాని నాకు చెన్నాయి సభలలో కిరీటముంచి పూలదండలతో సేవ చేసినప్పుడు ఆయన ఘనపర్చగలరు అది నా జీవితపు సాక్ష్యము. ఆంధ్రలో మానాన్న గారు పనిచేసిన విభిన్న ప్రాంతాలలో రాజమండ్రి, ఆంధ్ర ప్రాంతాలన్నీ తిరిగిన రోజుల్లో అన్యురాలిగా విగ్రహారాధనతో గడిపాను. గాని ఆ తర్వాత క్రీస్తును నమ్మిన విశ్వాసిగా నా సాక్ష్యము వివరించి సువార్త చెప్పు అవకాశం కలిగినందున గతంలో ప్రార్ధించిన ప్రార్ధనలకు జవాబుగా నా హృదయ వాంఛను తీర్చారు.

ఎంతో మందికి సువార్త బోధించాలనే కోరిక రేడియో ప్రసంగాల ద్వారా నెరవేరింది. రేడియో మినిస్ట్రీ ద్వారా 89 దేశాలకు వెళ్ళు సువార్తను బట్టి దేవుని స్తుతిస్తున్నాను. వేలాది మంది మధ్య సేవచేసే ధన్యతనిచ్చారు. ఇక కనబడేవారి మధ్య సేవచేయాలని ప్రార్ధించుట కారంభించాను. దేవుని కొరకు ఏదైనా సేవ చేయాలనే కోరిక కలిగివుంటే తన ప్రణాళిక ప్రకారము ఆయనే ఎన్నుకొని వాడుకుంటారని గ్రహించాను.

నా తోబుట్టువులంతా ఆడపిల్లలే గనుక నాకు బాబు పుట్టిన బాగుంటుందని ప్రార్ధించాను. నాకు దర్శనములో ఒక బాబును చూపి డేవిడ్ అని పేరు చెప్పారు. ఆ దర్శన ఫలితంగా బాబును ఇచ్చారు. దావీదు అని పేరుపెట్టాను. ఆ బాబు మాకెంతో ఆనందాన్ని అందించాడు. దేవుని దయతో మనుష్యుల దయతో ఎదుగుచూనే ఉన్నాడు.

మ అత్తగారికి 2002లో స్ట్రోకు వచ్చినప్పుడు తలపై చేతిని ఉంచి ప్రార్ధించాము. 2015 వరకు 13 సంవత్సరాలు జీవించారు. "అమ్మా రిబ్కా, నీ ప్రార్ధన అగ్నివంటి అభిషేకము గలది అని నాగురించి సాక్ష్యమిచ్చి నన్ను అభిమానించి ప్రేమించుటను బట్టి నేను ఆనందిస్తున్నాను. నా ప్రార్ధనలలో శక్తి నుంచి అనేకుల కొరకు విజ్ఞాపన చేయు అవకాశాలను ఇచ్చారు.

ప్రతి అనుభవంలో దేవుని సన్నిధి ఆయన కృప నేను చవిచూస్తూనే వున్నాను. ఎన్నికలేని నా జీవితము శాపములతో నిండి నిరీక్షణకు దూరమయినప్పుడు ప్రభువు నన్ను ప్రేమించి, నా శాపము కొట్టివేసి ఆశీర్వాదించారు. సుఖప్రదమైన వివాహ జీవితము ఇచ్చి, మంచి బిడ్డలను ఇచ్చారు. ముఖ్యముగా మంచి సేవనిచ్చి అనేకుల ఆత్మలకు పోషణనిచ్చే వాక్యం నానోటనుంచారు. ఇంతగొప్పగా నన్ను ప్రేమించినందుకు ప్రతిఫలముగా నా జీవితమంతా ఆయననే సేవిస్తాను. ప్రభువునకే మహిమ కలుగును గాక. ఆమెన్.

---------

# 13 . క్రీస్తు సాక్షిగా నన్ను నిలిపి అనేకుల ఆత్మల పోషణార్థం జీవింపజేస్తున్న క్రీస్తుకే మహిమ.

**– పెర్సిస్ సుకుమారి (న్యూజెర్సీ /అమెరికా)**



**యెషయా 54:17 "నీకు విరోధముగా రూపింపబడిన యే ఆయుధమును వర్ధిల్లదు".**

**పరిచయము:–** నా పేరు పెర్సిస్ సుకుమారి. నా సాక్ష్యము బహిరంగంగా ప్రచురించు అవకాశమిచ్చిన ప్రభువునకే స్తుతి కల్గుగాక. అనేకుల ఆత్మీయ జీవితానికి మేలు కల్గునని ఆదరణ లభిస్తుందని నా ఆకాంక్ష. ఎన్నో ఒడుదుడుకులను సహించి అనేక సందర్భాలలో ఆత్మీయ పాఠాలు నేర్చుకుంటూ ఆధ్యాత్మికంగా ఎలా ఎదుగుతూ వచ్చానో నా గూర్చి వివరించాలని నాకోరిక.

ప్రతి జీవితంలో కొన్ని స్టేజీలు ఉంటాయి. బాల్యం, యవ్వనము, కౌమారము, వృద్ధాప్యము. యీ రీతిగా నా బాల్య జీవితము, విద్యార్థి దశనుండి అడ్మినిస్ట్రేటరుగా, ఒక ఆధ్యాత్మిక సంస్థకు వ్యవస్థాపకురాల్నిగా ప్రభువు దీవించిన రీతి అద్భుతముగా నుండి నాకే ఆశ్చర్యము కల్గిస్తుంది. ప్రభువు నమ్మదగిన దేవునిగా నా జీవితంలో నిలిచారు.

**బాల్యము–విద్య :–** మా తల్లిదండ్రులు విద్యావంతులు. కాజీపేట ప్రాంతంలో నా బాల్యము గడిపాను. నాన్నగారి పేరు అబ్రహాముగారు. ఇంజనీరింగు కాలేజీలో పనిచేసేవారు. అమ్మ ఉద్యోగిగా ఒక సంస్థ హెడ్‌మినిస్ట్రెస్‌గా ఉండేవారు. నేను ఏకైక పుత్రికను కాబట్టి చాలా ప్రేమగా పెంచారు. అదే సమయంలో క్రమశిక్షణ చాలా ఎక్కువగా నుండేది. పెద్దగా నవ్వుకోవడం, తలెత్తి నడుచుట కిష్టపడేవారు కాదు.

అమ్మ కంటే నాన్న దగ్గర చనువుగా మెసిలేదాన్ని. పెర్సిస్ అని నాకెందుకీ పేరు పెట్టారు. అది సరిగ్గా పిలువడం నా స్నేహితులకు తెలియుటలేదని బాధపడేదాన్ని. నాకు మూడు నెలల వయస్సులో గొప్ప దైవజనుడు అగస్టీను గారీపేరు పెట్టారని చెప్పారు. నాకు 78 సంవత్సరాలున్న అత్తమ్మ నాకీ పేరు ఎందుకు పెట్టారో వివరించింది.

**రోమా 16:12 " ప్రియురాలగు పెర్సిసుకు వందనములు. ఆమె ప్రభువు నందు బహుగా ప్రయాసపడెను."**

అమ్మా, ఈ పేరు చాలా అర్థవంతమైనది. పరిశుద్ధ పౌలుగారు పెర్సిస్ సేవలను అభినందించి ఆమెకు వందనాలు తెల్పారు. బహుగా ప్రయాసపడిన స్త్రీగా గుర్తింపు పొందిన మహిళగా తెల్పారు అని చెప్పింది. ఇంగ్లీషులో "**Labour**" లేబర్ అని వ్రాసిఉంది. నేను ఫాతిమా మహిళా స్కూల్లో 1969 నుండి 76 వరకు చదివాను. స్కూలు లీడరుగా నుండి సమర్థురాలిగా పేరు పొందాను. ఆటలలో ముందుండేదాన్ని. మగపిల్లలతో సమానంగా ఆటలలో పాల్గొనేదాన్ని. పాటలు పాడుట చాలా యిష్టంగా ఉండేది. పెద్ద గొంతుతో పాడితే చాలా ఆహ్లాదకరంగా భావించేదాన్ని. కొన్నిసార్లు టీచర్లతో దెబ్బలు తినేదాన్ని. అందరి తప్పులు నామీద మోపేవారు. అమ్మకు ఫిర్యాదు చేసేవారు. ప్రిన్సిపాలుగారు నాకు శిక్షవేసేవారు. చాలా విసిగిపోయి బాధపడేదాన్ని.

ఒకసారి చిన్నప్పుడు నా తరగతి పిల్లలు వారి రబ్బర్లు నా సంచిలో వేసి నన్ను దొంగగా చేసి టీచర్లకు రిపోర్టు యిచ్చారు. మా నాన్న నాకు "అమ్మా, అబద్ధాలు చెప్పవద్దు" అని చెప్పేవారు. నేను చేయని నేరానికి నిందపడినప్పుడు నాన్న స్కూలుకు వచ్చి, నా బిడ్డ తప్పుచేయదు. నేను రబ్బరు కొని యిస్తాను. అది ఆమెది కానిది ఎవరో వేసారని నిరూపించి నన్ను నిరపరాధిగా నిల్పారు. నాన్న పేరు ఎల్లప్పుడు నిలబెట్టాలని నాకు ఆశ ఉండేది. ఆయన కోసం ఏ సాహసమైనా చేయాలనే ఆకాంక్ష వుండేది. నా కొరకు పోరాడి నన్ను నిరపరాధిగా నిలిపిన కృతజ్ఞత నా హృదయంలో చెరగని ముద్ర వేసింది.

సామెతలు 30:17 "తండ్రిని అపహసించి తల్లిమాట విననొల్లని వాని కన్ను లోయకాకులు పీకును" మా అమ్మ ఎప్పుడూ ఆ వాక్యం ద్వారా హెచ్చరించేది. నా కుమారుడు బబ్లూకు కూడా చెప్పేది. చిన్న చిన్న హెచ్చరికలన్నీ శ్రద్ధగా విని మంచిని ఎంచుకొని పాటించేదాన్ని. మా యింటికి సమీపంలో ఆంజనేయ స్వామి గుడి వద్ద భజన కీర్తనలు వినిపిస్తూవుండేవి. ఆ పాటలు నేర్చుకొని స్కూల్లో పాటల పోటీలలో పాడేదాన్ని.

శ్రీరాముని చరితము విని రామయ్య అనేపాట, హరి కథలు, బుఱ్ఱకథలు విని నేర్చుకొనేదాన్ని. తెలియకుండా ఆ పాటల ప్రభావానికి లోనయ్యేదాన్ని. నాకు హిందువుల కుటుంబాలలో స్నేహితులుండేవారు.

మా తల్లి దండ్రులు స్వంత యిల్లు కట్టించుకోవాలని చాలా ప్రయత్నిం చేసారు. నాకు ఆర్థికంగా చాలా సమృద్ధితో నా అవసరాలన్నీ తీర్చేవారు. బ్యాలా చర్చిలో పెంకుటింట్లో వుండేవారము. నా వంతు యిటుకలను మోసి సహాయపడేదానిని. అలా ప్రయాస పడినప్పుడు

ప్రభువు నందు బహుగా ప్రయాసపడిన స్త్రీ పెర్సిస్ విలువ అర్ధమయింది. నా ఆత్మీయ జీవితానికి మేలు కల్గించే మాటలు మా అత్తమ్మ నాతో చెప్పేది.

**1 కొరింథి 15:57 "మీ ప్రయాస ప్రభువు నందు వ్యర్ధము కాదని ఎరిగి స్థిరులు కదలని వారుగా నుండి దేవుని కార్యాల పట్ల ఆసక్తి కల్గి యుండుడి"**

ప్రభువు ఆయన కోసం చేసిన పనుల ఫలాన్ని ఆయన ఎకౌంటులో వ్రాసుకొని రికార్డు చేసుకొని ప్రతిఫలమిస్తారని తెల్పింది. చర్చి ఆవరణమును శుభ్రపర్చుటకు ఒప్పుకొనేదాన్ని. ఆవరణము ఊడ్చుటకు ఉత్సాహ పడేదాన్ని. ప్రతి ఆదివారము ఉదయాన్నే 5 గంటలకే లేచి మందిరములో చెప్పుల స్టాండు అమర్చి, ఆవరణము ఊడ్చి, సండేస్కూలు పిల్లలను క్రమంగా కూర్చోబెట్టుటలో శ్రద్ధ వహించేదాన్ని. దూరంగా రైల్వే స్టేషన్ నుండి నీరు మోసుకువచ్చి కుండలను నింపేదాన్ని.

**యిర్మియా 47:10 "యెహోవా పనులు అశ్రద్ధగా చేయువాడు శాపగ్రస్తుడగును గాక".**

ఆ మాటలు నాకు చాలా భయాన్ని కల్గించగా దేవుని పనిని అతి జాగ్రత్తగా నిర్వహించేదాన్ని. నా బిడ్డలకు కూడా అదే బోధించేదాన్ని. ఏ పని చేసినా ప్రతిఫలాన్ని ఆశించక చిన్నపని పెద్దపనిని కూడా బాధ్యతకల్గి చేసేదాన్ని. అది నా జీవిత ధ్యేయంగా మారింది. నా డిగ్రీ పూర్తి చేశాక 1986వ సంవత్సరము వరకు ప్రయాసపడినాను. మహిళా కళాశాలలో పి.జి. కోర్సు చేసే ధన్యతను ప్రభువిచ్చారు.

నాకు ధనికులైన స్నేహితులుండేవారు. యూత్ కార్య క్రమాలలో చాలా శ్రద్ధ వహించేదాన్ని. రిట్రీటులలో చురుగ్గా పాల్గొనేదానిని. 1984లో డిగ్రీ పూర్తయింది. కొంతకాలము విశ్రాంతిగా ఉన్నప్పుడు బైబిలు బాగా చదువుకొనేదాన్ని. ప్రార్థనలో గడిపే అవకాశం లభించింది. యూత్ మీటింగ్సులో పాల్గొనాలనే నిబంధన చేసుకొని పరిచర్య చేయాలని, గిన్నెడు చన్నీళ్ళిచ్చినా ప్రతిఫలము యిచ్చే దేవుని నామకార్ధంగా సేవించరాదని పునాది తలంపులుగా నా హృదయములో నిలిచి పోయాయి. దేవుని కొరకు మన జీవితాన్ని ఎలా ప్రత్యేకించుకోవాలి అనే అంశముపై బోధనలు కొనసాగాయి.

**ప్రసంగీకులు 12:1 "దుర్ధినములు రాకముందే ఇప్పుడు వీటియందు నాకు సంతోషము లేదని నీవు చెప్పు సంవత్సరములు రాకముందే... నీ బాల్య దినములందే నీ సృష్టికర్తను స్మరణకు తెచ్చుకొనుము".**

నేను క్రైస్తవ విశ్వాసములో తల్లి దండ్రులు నన్ను పెంచినను నాకు సృష్టికర్తను గూర్చిన సరియగు అవగాహన రాలేదు. గానీ 1984 జూన్ 4వ తేదీన ఆ సృష్టికర్త నా

స్వంత రక్షకునిగా న్యాయాధి పతిగా నాకు కనువిప్పు కల్గింది. నిన్ను నిర్మించిన క్రీస్తును నీ జీవితంలో నీ రక్షకునిగా స్వీకరించావా అనే బోధకుని ప్రశ్నను త్రోసివేయలేక పోయాను.

**ప్రసంగీకు 12:14 "గూఢమైన ప్రతి అంశమును గూర్చి దేవుడు విమర్శ చేయునప్పుడు ఆయన ప్రతి క్రియను అది మంచిదే గాని చెడ్డదే గాని తీర్పులోనికి తెచ్చును".**

నా రక్షణానుభవ సంతోషం నన్ను ఉక్కిరి బిక్కిరి చేసింది. బాప్తీస్మము తీసుకోవాలని నిర్ణయించుకున్నాను. నా కివ్వబడిన వాగ్దానము నాటి నుండి నేటివరకు చాలా సజీవమై నన్ను ఆత్మీయంగా బలపర్చుచూనే ఉంది.

**యెషయా 54:17 "నీకు విరోధముగా రూపింపబడిన యే ఆయుధమును వర్ధిల్లదు. న్యాయ విమర్శలో నీ మీద దోషారోపణ చేయు ప్రతివానికి నీవు నేరస్థాపన చేసెదవు".**

నాకే ఆయుధాలు ఎదురవుతాయి? అని ప్రశ్నించుకున్నాను. నాకేమి అర్థం కాలేదు. ఆ తర్వాత 7వ వచనము చదువగా నిమిష మాత్రము నిను విడిచితిని గొప్ప వాత్సల్యముతో నిన్ను సమకూర్చితిని అనే మాట నా కెంతో ఆదరణ నిచ్చింది. నా పరిచర్యలో నోటిమాట వలన కల్గు బాధలు, బోధించే సంఘటనలు, యుద్ధాలు, పోరాటాలలో ప్రభువే జయము యిస్తారని నమ్మాను. ఆ వాక్యాన్ని చాలా ఆలోచించి అర్థం చేసుకొన్న కొలది చాలా ఆనందం కల్గింది. దేవుడు నాతోనే వున్నాడన్న ధైర్యము కల్గింది. ఆ తర్వాతనే మాస్టర్స్ కోర్స్‌లో చేరాను.

మొదటి సారిగా యిల్లు వదలి వెళ్ళుట సంభవించింది. స్వేచ్ఛ దొరుకుతుందని ఒక ప్రక్క ఆలోచనలో నుండగా రైలు ప్రయాణములో ప్రభువు ఒక దర్శనాన్ని చూపారు. ఫీచె అనే అమ్మాయితో పరిచయం కల్గింది. ఆమె మంచి విశ్వాసి గనుక ఆమెతో కలిసి ప్రార్థించే విలువైన తరుణాలు లభించాయి. ఆనాటి దర్శనములో కలిసి కరపత్రాలు పంచుట, లేచి ప్రసంగించుట నేను చేయబోవు పరిచర్య లీలగా కన్పించింది.

రాత్రి సమయంలో ఆధ్యాత్మిక పుస్తకాలు, నా చదువుకొనే పాఠ్య పుస్తకాలతో సహ చదివి నిద్రపోయేదాన్ని. పెందలకడ లేచేదాన్ని. ఉదయాన్నే సమీపంగా నున్న మసీదు దగ్గరగా చిన్న పిల్లలు శ్రద్ధగా ఖురాను నేర్చుకుంటూ, చెప్పులు, టోపీ లేకుండా పరుగిడిచు మసీదు చేరుట చూచేదాన్ని. సెలవుదినాల్లో వారి మత గ్రంధాన్ని చదువుకోవాలని, నేర్చుకోవాలని చూపే గొప్ప శ్రద్ధ నన్ను ముగ్ధురాల్ని చేసాయి. మన క్రైస్తవ సమాజములో కూడా బైబిలు జ్ఞానం బిడ్డలంతా నేర్చుకుంటే బాగుంటుందనే తలంపు నాకు కల్గింది.

మా అమ్మ బాల్యం నుండి నాకు బైబిలు నేర్పుటలో ప్రత్యేక శ్రద్ధ వహించేది. మంచి వంటకాలు చేసి పెట్టేది. పిల్లలు బైబిలు జ్ఞానం పొందుకోవాలన్న ఆశయం నాలో స్థిరంగా నిలిచింది. అలా బ్యూలా చర్చిలో పాఠాలు ఆరంభించాము. హిందీ కూడా నేర్చుకున్నాను. నేను విద్యాభ్యాసం చేసే స్థలంలో హాస్టలులో శోధనలు ఎదుర్కొనేదాన్ని. ఎన్నో విమర్శలవల్ల నోటిమాట వల్ల బాధకల్గేది.

ఓర్పుతో భరించేదాన్ని. నా వైరాగ్య జీవితాన్ని గమనించి సన్యాసమ్మ అని ఎగతాళి చేసేవారు. టీమ్ పనిలో సహకరించే వారు కారు. యిన్ని యిరుకులు ఇబ్బందులలో దేవుని అద్భుత కృపతోడుగా నుండుటవల్ల దేవుని యందలి భయభక్తులు జ్ఞానమునకు మూలమనే వాగ్దానమును బట్టి నాకు మాస్టర్స్‌లో యూనివర్సిటీలో ర్యాంకు పొందాను. అమ్మానాన్నలు నా ప్రగతిని బట్టి చాలా సంతోషించి అభినందించి నన్నుబట్టి దేవున్ని స్తుతించారు.

నేను మరింత అభివృద్ధి సాధించగలననే నమ్మకంతో డాక్టరేటు డిగ్రీ కొరకై పి.హెచ్.డి. చదివించాలని ఆశించారు. మా తల్లి దండ్రుల ఆశయమేమనగా నా విద్యను బట్టి నేను గొప్ప గౌరవం పొందాలని కోరారు. ఆ పౌరుషము నిలబెట్టుకోవాలని నేను కూడా కృషిచేసాను. పెద్ద ఉద్యోగిగా నుండి నాన్న అమ్మలకు అండగా నుండాలనిపించేది.

నా వివాహ సమయము ఆసన్నమైనదని తలంచి నన్ను కూడా మంచి సహకారిగా నుండే భర్తకై ప్రార్థించుకోమని తెల్పారు. నాకయితే అర్థం కాకపోయినా వారు చెప్పినందున ప్రార్థించుట కారంభించాను నేను రంగు తక్కువగానున్నానని కొందరు పెండ్లి చూపులలో నన్ను నిరాకరించారు. అందువల్ల నేను నా మనస్సులో తెల్లని రంగుగల భర్తను పొందాలని చాలా నిజాయితీగా ప్రార్థించి కనిపెట్టాను

బండారి క్రిష్టఫర్ ఇంజనీరుగా పనిచేసేవారు. వారిది మంచి రంగుగల ముఖం. నా ప్రార్థన ఫలించింది. మంచి వివాహము జరిగింది. ఆయన బాప్టిస్టు సంఘ సభ్యుడైనందున నేను హెబ్రోను ఆరాధనలలో బాల్యం నుండి పెరిగినందున కొన్ని అభిప్రాయాలు తేడా వచ్చేవి. అందువల్ల నేను నా భర్తతో ఏకీభవించి ముందుగా బాప్టిస్టు చర్చిలో ఆరాధనలలో పాల్గొని తర్వాత హెబ్రోను ఆరాధనలో బల్లారాధనలో పాల్గొనే వరకు శాంతి లభించేదికాదు. నా తల్లిదండ్రుల వద్ద కాదు, వద్దు అనే అభిప్రాయాలు రాలేదుగాని వివాహజీవితంలో ఎదుర్కొగల ఈ అనుభవాలు ఎలా సర్దుకోవాలో తెలుసుకొనుటకు కాస్త సమయము కావలసి వచ్చింది. ప్రభువే అద్భుతంగా నడిపించారు.

వివాహానుభవంలో ఎక్కువ ప్రార్థించుట నేర్చుకున్నాను. ప్రభుని ఆరాధించుటలో ఆనందించేదాన్ని. 1991లో ఒక పాపపుట్టి మరణించింది. ఆతర్వాత బబ్లూ బాబు పుట్టాడు. పాపను కోల్పోయిన సమయంలో చాలా దు:ఖంతో దేవుని దగ్గర కనిపెట్టగా ఆ సమయంలో నన్ను ధైర్యపర్చుటకై ఆ ఆదివారం సందేశంలో సృష్టికర్తయగు దేవుని ప్రశ్నించతగునా? దేవుని చిత్తముగా భావించి ధైర్యం తెచ్చుకున్నాను.

ఆ తర్వాత గర్భవతినయ్యాను. ఆ సమయంలో చాలా క్లిష్టపరిస్థితుల నెదుర్కొన్నాను. అద్భుతాన్ని చూచి సాక్షిగా ప్రభువు నమ్మకస్తుడని చాటు ధన్యత పొందాను. నిస్సీపాప గర్భములో నుండగా ఆమె గుండె సవ్వడి సరిగా తెలిసేది కాదు. డాక్టర్ల పరీక్షలు భయాన్ని కల్గించేవి. చాలా ప్రార్థించేదాన్ని. ఆ రోజుల్లో దర్శనాన్ని ప్రభువిచ్చారు. ఒక పాపను నాకిస్తున్నట్లు స్పష్టంగా చూచాను. నా గర్భములో కణిత ఉందని భావించి అది అబార్షన్‌గా తీసివేయదలిచారు. నేను నమ్మిన దేవుడు సజీవుడు. నాకు చూపిన పాపను నా కిస్తారని మొండి విశ్వాసంతో నిలిచాను.

కడుపులో పిండము బరువు పెరుగుటలేదు. డాక్టరు మంజుల గారు వైద్యంలో అదే ఆస్పత్రిలో నా భర్త సోదరి నర్సుగా పనిచేస్తూ నా పరిస్థితి గమనించేవారు. వారుకూడా డాక్టరు చెప్పినట్లే నీ కడుపులో బిడ్డలేదమ్మా అనేవారు. ఆ రోజుల్లో జూవాలజీ లెక్చరరుగా ఉద్యోగం చేసేదాన్ని. నా జ్ఞానంతో మాట్లాడుచున్నట్లు అందరూ భావించేవారు.స్కానింగులో బేబీ కదలిక లేదు, వినికిడి లేదు అని, గనుక వారి మాట నమ్మాలని మూర్ఖంగా వాదించ వద్దనేవారు.

ఒకరోజు నాకు నెప్పులు ఆరంభమయ్యాయి. మత్తుమందు యిస్తామన్నారు. వద్దని తెల్పి నొప్పిభరిస్తానన్నాను. అద్భుతంగా అందమైన పాపను దేవుడు యిప్పించగా డాక్టరు మంజుల ఆశ్చర్యపడ్డారు. అమ్మా పెర్సిస్ నీ నమ్మకము గొప్పది. నిన్ను బాధించినందుకు సారీ అన్నారు. చక్కని పాపని చూపించగా బహగా స్తుతించాను. 1993లో నా విశ్వాస పరీక్షలో ఘనవిజయాన్ని సాధించాను. నా జీవితంలో మరపురాని గొప్ప సంఘటనగా గుర్తుంచుకోగలను. 1996 వరకు ఇండియాలో గడిపాము. తర్వాత అందరము న్యూజిలాండ్ చేరాము. 1997 నుండి యు.ఎస్.ఎ.లో జీవితాన్ని గడిపే కృపనిచ్చారు. గతంలో 2008లో వీసాలేదు, ఉద్యోగం లేదు. ఇండియా వెళ్ళిపోవలసి వచ్చింది. నేను ఒంటరిగా ముందుగా అమెరికా చేరాను.

నాకు తెలిసినవారు లేరు. ప్రార్థించే తోడు అసలేలేరు. ఫ్రాంక్ సిటీలో అంతా వేరే జాతివారుండేవారు. డబ్బులేదు. ప్రోజెక్ట్ లేదు. అక్కడ కొందరు తెలుగు వారి సహవాసం లభించగా వారంతా చాలా ఆదరించి ధైర్యం చెప్పేవారు. కనకవళ్ళి ఆంటీ, కోమలాంటీ, మరొక యిద్దరు ఆంటీలు కలిసి ప్రార్థించేవారము.

నా భర్త క్రిస్టఫర్ గార్కి వీసా రావాలని చాలా ప్రార్థించాము. ఆ తర్వాత న్యూ జెర్సీ చేరాను. ఆ రోజుల్లో టి.సి.ఎఫ్.ఎన్.జె. ఆరంభమయింది. ఆ సహవాసంలో పసిపిల్లలతో పని ఆరంభించాలని ఆశ ఉండేది. ఒకసారి కలలో అమ్మా, నీకు 23వ కీర్తన వచ్చునా? అని ప్రభువు ప్రశ్నించారు. నేను పిల్లలకు నేర్పుతాను ప్రభువా అని వినయంగా జవాబిచ్చాను. అది నా సేవకు ఆరంభమయింది.

ఆ రోజుల్లో రీసర్చి స్కాలరుగా ఉంటూ పిల్లల పరిచర్య ఆరంభంచేసాను. 2008వ సంవత్సరంలో సులోచనాంటీతో కుటుంబము కోసం, ఉద్యోగం కోసం ఒక వారం ప్రార్థించాలని నిర్ణయించాము. ఆమె ఇండియా వెళ్ళవలసి వచ్చింది. ఆమెకు ఫోను కనక్షను అందించాము. మూడవ వ్యక్తిగా తిమోతి గారిని చేర్చి వాక్య పరిచర్య తర్వాత ప్రార్థన చేసుకొనేవారమ.

సోమవారం నుండి శుక్రవాము వరకు ప్రార్థన సెల్‌ఫోను ద్వారా ఆరంభమయింది. ముగ్గురు సభ్యులతో ఆరంభమయిన సేవ 30కి పైగా సభ్యులతో రాత్రి 9 గం॥ల నుండి దాదాపు 12 గం॥ల వరకు కొనసాగుట ప్రభువు కృపగా భావించి స్తుతిస్తున్నాను. 2011లో నా కుమారుడి డిగ్రీ పూర్తి చేసాడు. పరాయి ప్రాంతంలో క్రొత్త రూమ్ మేట్స్‌తో వంటరాక డిష్‌వాష్ చేస్తూ యిబ్బంది పడేవాడు. వారం చివర యిల్లుచేరేవడు.

బిడ్డలు తల్లిదండ్రులను శ్రద్ధగా గమనించి చూస్తారు. మనమే రోల్ మోడల్స్‌గా వుంటామని జాగ్రత్తగా జీవించాలి కద! మంచి అనుభవాల్ని డెమాన్‌స్ట్రేట్ చేసి చూపాలి. చాలా అనుభవాల్లో నేను విజయవంతంగా నా పాత్రను ప్రభువు సహాయంతో నిర్వహించగల్గాను. దేవుడు మనము ప్రార్థిస్తే చేయనిదేమీ లేదు. దేవుడిచ్చిన అవకాశాలన్నీ వినియోగించుకోవాలి కద! ఒక సందర్భములో నా 5వ తరగతిలో నాతో చదివిన స్నేహితురాలిని కలుసుకున్నప్పుడు వారమ్మాయి శీలాను చూచాము. కెనడాలో వుండేది. నా భర్త నేను సంప్రదించి ప్రార్థించి నాకుమారునికి శీలాతో వివాహాన్ని నిర్ణయించాము. ఇక వివాహము అమెరికాలో చెయ్యాలని నేను, బంధువులతో ఇండియాలో చెయ్యాలని ఆలోచన కల్గిననూ ప్రార్థించాలని ఆశించాను.

ఆ సమయంలో పాస్టరు డేవిడ్ బాబుగారి భార్య అబిగయేలు మేరీ ల్యాండులోనున్న లతతో కలిసి ముగ్గురము చాలా భారంతో ప్రార్ధించేవారము. 2001 అక్టోబరు ఒకటవ తేదీ ఉదయకాల ప్రార్ధన ఒక అరగంట చేయుట ద్వారా ఆరంభమయింది. ప్రార్ధనా ఫలితంగా డిసెంబరు 3వ తేదీ ఘనంగా రిసెప్షన్ జరిగింది. వివాహం కెనడాలో జరుగగా మేము రిసెప్షన్‌ను స్నేహితులు, కొందరి బంధువులతో కలిసి జరుపుకోగల్గాము.

2008వ సంవత్సరము రాత్రి ప్రార్ధనలు ఆరంభము కాగా 2011లో ఉదయకాల ప్రార్ధనలు ఆరంభించాము. మంచి విశ్వాసులు ప్రార్ధనాత్మగలవారు చేరగా ఎంతో ఉజ్జీవంతో మంచి సేవకుల సందేశాలు, విజ్ఞాపన ప్రార్ధనలతో కొనసాగుట దేవుని కృప.

నా భర్తకు అకస్మాత్తుగా అస్వస్థత కల్గినప్పుడు ప్రార్ధనాగుంపు వారు అవిరామంగా ప్రార్ధించి, ఎంతో ఆప్యాయత కనపర్చి ఆదరించారు. దేవునికి వారికి కృతజ్ఞత తెల్పాము. నా భర్త ప్రార్ధనానుభవంలో కూడా గొప్ప ఉజ్జీవము కల్గింది. అందరి ప్రార్ధనల ప్రభావము మా కుటుంబానికెంతో మేలు చేకూర్చాయి. ప్రతి వ్యక్తి బలమైన సాక్షిగా ఉండాలి. నా జీవితాన్ని ఎన్నో అనుభవాల గుండా నడిపించి మంచి సాక్షిగా మార్చి అనేకుల ఆత్మీయ జీవితాన్ని వెలిగించే ధన్యత నా కుటుంబానికి ప్రభువు అందించిన రీతిని బట్టి ఎంతో స్తుతించి ఆరాధిస్తున్నాను.

కొన్ని సంవత్సరాలుగా కిడ్స్ ఫర్ క్రైస్ట్ కార్యక్రమాల్ని ఆరంభించి కొనసాగించి, కొన్ని రాష్ట్రాల నుండి బాల బాలికలు వారి ప్రతిభను కనపర్చు ధన్యతనిస్తున్నారు. వాక్యము నేర్చుకొనుటలో గొప్ప నేర్పును కనపర్చుచున్నారు. దేవుడే దీవించి ఆదరిస్తున్నారు.

యిటీవల ప్రతి శనివారం పిల్లలకై ప్రార్ధనా సమయం ఆరంభించాము. ఎక్కడ అవమానాలు విమర్శల నెదుర్కొన్నానో అదే ప్రాంతంలో గొప్ప గుర్తించు ఘనతనిచ్చి ప్రభువు దీవిస్తున్నారు. ప్రభువు నా పట్ల, నా కుటుంము పట్ల చూపుచున్న ప్రేమ, కనికరం నిమిత్తము దేవునికే స్తుతి మహిమ చెందాలని నా దీన ప్రార్ధన.

యేసయ్య ప్రేయర్ సెల్ ద్వారా నా సాక్ష్యము ఆడియో చేయు మంచి అవకాశమును బట్టి వారికి నా కృతజ్ఞతలు. నన్ను నా కుటుంబాన్ని ప్రేమిస్తూ, గౌరవిస్తూ ప్రేయర్ సెల్‌లో పాల్గొనే వారికి నా వందనాలు. ప్రభువు దీవెన మనతో నిత్యమూ ఉండుగాక. ఆమెన్.

---------

# 14. చావునుండి తప్పించి పరలోకము చూపిన ప్రభువు స్తోత్రార్హుడు

**– రేతా** (అమెరికా)



ఎఫెస్సి 6:10 "ప్రభువు యొక్క మహాశక్తిని బట్టి ఆయన యందు బలవంతులై యుండుడి".

**పరిచయము :–** నాపేరు రేతా. ప్రభువునందు విశ్వాసములో జీవించే కుటుంబము మాది. నా కుమారుడు ఒక గొప్ప ప్రమాదానికి గురైనప్పుడు ప్రభువు అద్భుతం చేసారు. ఒకరాత్రి రోడ్డుమీద జరిగిన ప్రమాదములో హైవేలో క్రిందపడిఉన్నాడు. కారు దూరంగా కన్పించింది. నేను నిశ్చేష్టురాలిగా నిలిచిపోయాను. ఆ సమయంలో యేసు ప్రభువు హైవేకి ఎదురుగా నిలిచి వున్నట్లు నేను చూచాను.

"ప్రభువా నా బిడ్డను రక్షించు అని మౌనంగా ప్రార్థించాను. ఆ సమయంలో అగ్ని నా శరీరమంతా పాకింది. గొప్పశాంతి ఆవరించింది. అసంకల్పిత చర్యగా నా కోటు తీసి నా తలపైనుంచి మోకరించి మౌనంగా ప్రార్థిస్తూనే ఉన్నాను. దేవుని మెల్లని స్వరము విన్పించింది. నీవు నాకు నీ బిడ్డను సమర్పిస్తావా? ఆ ప్రశ్నకు, బాబు ప్రేమ నాకు విగ్రహమైనట్లు దేవుడు గ్రహించాడా? అని తలంచాను. జవాబుగా ఔను ప్రభువా అన్నాను.

యీ అనుభవం నాహృదయంలోనే ఉండిపోయింది. ఆ తర్వాత బాబును ఆస్పత్రిలో చేర్పించాము. కొన్ని నెలలు చికిత్స చేయవలసి వచ్చింది. నాలుగు నెలలు కోమాలోనున్నాడు. ఆ తర్వాత అతను ముందుగా ఒక కన్నుతెరిచాడు. కాగితము పెన్ను కావాలన్నాడు. మాటలేదు. అతను అనుభవించిన సంఘటనను కాగితముపై చిత్రాలు వేసి చూపాడు. రోజుకొక అనుభవాన్ని కాగితము మీద ఉంచేవాడు. అతని శరీరంలో అపెండిక్స్(ఉండూకము) పగిలి చాలా ప్రమాదస్థితిలో ఆపరేషన్ చేసారు. ఆ తర్వాత అతను చెప్పిన విషయాలు చాలా ఆశ్చర్యాన్ని కల్గించాయి.

అమ్మా, యేసయ్య నిన్ను నీ బిడ్డను సమర్పిస్తావా అని అడిగారట. నీవు సరే అన్నావు గనుక నేను బ్రతికాను అని చెప్పాడు. వెంటనే గతంలో నేను రోడ్డుపై కోటు తలపై వేసుకొని ప్రార్థించగా క్రీస్తు కన్పించిన దృశ్యం జ్ఞాపకము వచ్చింది. మాట్లాడలేదు, ఒక

కన్ను తెరిచి ఉంది. రెండవ కన్ను మూసుకొని పోయివుంది. నీవు యేసును చూచావా అని నేను ప్రశ్నించగా, చూచాను ఆయన నాకండ్లను స్పర్శించాడని చెప్పాడు. ఆ క్షణం రెండవ కన్ను కూడా అద్భుత రీతిలో తెరువబడుట చూచి దేవున్ని స్తుతించాను.

రెండు వారాల వ్యవధిలో అది మామూలు కన్నుగా మారిపోయింది. ఒకరోజు నాతో అమ్మా, ఒక పెద్ద తలుపును నేను చూచాను. అందరూ లోనికి వెళ్ళలేదు. లోపల పెద్ద విందు జరుగుటచూచాను. అది అద్భుతమైన అనుభవం. మత్తయి 25వ అధ్యాయము చూడు అని వ్రాసి చూపాడు. ఆ అధ్యాయములో 10 మంది బుద్ధిగల, బుద్ధిలేని కన్యకల వివరాలున్నాయి. దేవుడు మనతో అతిసన్నిహిత సంబంధము కోరేవాడని నాకర్ధమయింది. క్రీస్తు నాతో మాట్లాడుట జ్ఞాపకము వచ్చింది. నీ బాబుకు స్వస్థత వస్తుంది. సజీవ సాక్షిగా నిలుస్తాడని యేసు చెప్పారు. ఆయనే వాడికి దర్శనంలో పరలోకాన్ని చూపారు.

ఓ రోజు యేసు పెద్ద సింహాసనముపై ఆసీనుడైయున్నాడు. దూతలు బారులు దీరి నిల్చొని ఉన్నారు. చెప్పనశక్యమైన ఆనందం నిండుగా లోపలనున్న వారిలో చూచానన్నాడు. అంతేకాదు “బాబూ, నీవు యీ ప్రాంతానికి రావాలంటే చాలా కాలము పడ్తుంది. ఇది నీ సమయము కాదు అని చెప్పి నన్ను ఆప్యాయంగా ఆలింగనము చేసుకున్నారు. నాకు తిరిగి రావాలనిపించలేదు. యేసుతో చాలా ఆహ్లాదంగా కాలం గడిపాను అన్నాడు. దేవునికి దూరమైనప్పుడు చాలా విచారము కల్గింది అని కూడా తెల్పాడు. ఆ పరలోక దర్శనము వర్ణించే సమయంలో చాలా ఆనందంగా వున్నాడు. పెద్ద ఎర్రని తివాచీ పైనుండి క్రిందికి జారగా ఆహ్వానించిన యేసుతో తలుపుతెరుచుకొని వెళ్తునప్పుడు రెండు వైపులా దూతలు కన్పించారట. పరలోకంలో ప్రవేశించాక యిద్దరి చిన్నారులను చూపించారట. వారిద్దరూ చాలా ఆనందంగా వున్నారట. వారిపేర్లు, అడ్రసులు, వివరాలు కాగితంపై వ్రాసి చూపాడు. వారి యింటికి వెళ్ళి వాళ్ళ స్వకీయులతో బాబులిద్దరూ ఆనందంగా వున్నారని, వారిని తాను చూచానని యేసు వాడికి చూపిన దృశ్యాన్ని వివరించి చెప్పాలని తెల్పాడు. యీ వివరాలు చాలా వింతగా తోచి ఆశ్చర్యము కల్గించింది. వాడు కోరినట్లుగా ఆ అడ్రసు ప్రకారము వెళ్ళి వాడు చెప్పింది నిజమని గ్రహించి ఆశ్చర్యపోయి ఆ సంఘటన ద్వారా మా విశ్వాసమును బలపరచుకున్నాము.

నేను ఆత్మీయ జీవితంలో క్రీస్తుతో సన్నిహితంగా జీవించాలంటే క్షమకల్గి, అవిశ్వాసులుగా ఉండరాదు. చేసిన తప్పులన్నీ ఒప్పుకోవాలి. దేవునిని ఆహ్వానించాలి. మన చెదిరిన జీవితంలో తప్పులు చేసిన ముక్కలన్నీ సరిచేసి పరిశుద్ధాత్మ ద్వారా గొప్ప

కళాఖండంగా (Master Piece) గా రూపమిచ్చే దేవుడు మనకున్నాడు. నా జీవితాన్ని సరిచేస్తానన్నాడు. అందంగా ఉపయోగకరంగా మార్చగలనన్నాడు. నులివెచ్చని స్థితికి దూరంగా ఉండాలన్నాడు. మనలో ఆయన జీవం సమృద్ధిగా ఉండాలి. లేనిచో ఉమ్మివేస్తానన్నారు. ఎల్లప్పుడూ ప్రభుని ప్రేమిస్తూ సత్సంబంధం కల్గి క్రీస్తులో అందరము జీవించాలని నా కుమారుడు తెల్పాడు.

దేవుని వాక్యం జీవంగలది గనుక అది సత్సంబంధము కల్గిస్తుందని తెలుసుకున్నాను. నా బాబును రక్షించగలనని వాగ్దానమిచ్చి,దర్శనమిచ్చి, స్వస్థతనిచ్చిన దేవుడు నాతో సూటిగా మాట్లాడారు. ప్రభువా, నన్ను నా బిడ్డను ఎంతో ప్రేమించారు. దీనికి ప్రతిఫలంగా నేను నీకేమి యివ్వగలనయ్యా అని ప్రార్థిస్తూ. నా జీవితాన్ని ఆయనకు అర్పించుకున్నాను.

దేవుడు నాకు అద్భుత వివేకము, జ్ఞానమునిచ్చినందున నేనొక పుస్తకాన్ని రచించి ఆయన ప్రేమ మాధుర్యాన్ని లోకానికి పంచాలని తలంచాను. దర్శనములో ఒక పుస్తకము నా బల్లపై నుండగా ప్రభువు నా గదిలోనికి ప్రవేశించుట చూచాను. ఆ పుస్తకము ఆత్మతో నింపబడగా వింతైన కాంతి ఆ పుస్తకమునుండి చుట్టూ ప్రకాశవంతంగా వెలుగు ప్రసరించుట చూచాను. “అమ్మా, నీలో నా ఆత్మనుంచాను. అది ప్రతివ్యక్తిని తాకుతుందని తెల్పారు.

క్రీస్తునందలి జ్ఞానము ప్రతి వ్యక్తికి అత్యవసరవమని వివరించారు. ప్రభువిచ్చిన తలంపులతో ఆ పుస్తకాన్ని ప్రచురించాను. www.sidroth.org వెబ్‌సైట్‌లో 1126 సంఖ్యను సంప్రదించిన వెంటనే యీ రచనావివరాలు తెలుసుకోగలరు. వీడియోద్వారా బాబుదర్శనాలు చూడగలరు. క్రీస్తు సజీవుడను. ఉన్నవాడను, అనువాడనని తెల్పిన క్రీస్తు నిన్ను నన్ను ప్రేమించుట కిష్టపడుచున్నారు. నేడే ఆయన ప్రేమను స్వీకరించు. క్రీస్తే రక్షకుడని నమ్మి ఆశ్రయించు. ఎట్టి స్వస్థతనైనను యివ్వగల శక్తి మంతుడు. నా కుమారున్ని మరణము నుండి తప్పించి పరలోక దర్శనముననుగ్రహించి ఆయన సాక్షిగా వాడుకున్న దేవుడు నిన్ను కూడా ఘనమైన పాత్రగా చేయగలడు. క్రీస్తుతో సన్నిహిత అనుబంధము కల్గియుండగలవా? అట్టి దీవెన ప్రభువు నీకిచ్చుగాక. ఆమెన్.

----------

## 15. ఆశ్చర్యకార్యాలు అద్భుతాలు చేయు దేవుడు నా రక్షకుడు

**– జాన్‌వెస్లీ (ఎడ్లపాడు)**

**కీర్తనలు 78:4 "యెహోవా స్తోత్రార్హ క్రియలను, ఆయన బలమును, ఆయన చేసిన ఆశ్చర్య కార్యములను దాచకుండా వాటిని వారి పిల్లలకు మేము చెప్పెదము".**

**పరిచయము:–** ప్రభుని ఉన్నత నామములో మీకు శుభములు. క్రీస్తు మా కుటుంబముల పట్ల చూపిన ప్రేమ, ఆయన చేసిన అద్భుతాలన్నీ నా సాక్ష్యము ద్వారా వివరించి చెప్పాలని ఆశిస్తున్నాను. నా పేరు యోసేపు అని పెట్టగా నా తల్లితో ప్రభువు సూటిగా మాట్లాడగా జాన్ వెస్లీగా మార్చారు. మా పితరులు గతంలో అన్యులుగానే జీవించేవారు. నాన్నపేరు కోటిరెడ్డి. క్రీస్తు మా జీవితాలలో ప్రవేశించుటకు ప్రధమ కారణము ఏమనగా మా నానమ్మ గారి అనారోగ్యము.

మా నానమ్మ తన 30వ యేట భర్తను కోల్పోయింది. విధవరాలుగా నుండి ధనుర్వాతమును బట్టి కీళ్ళవాతము బారిన పడింది. ఆమె అన్యదేవతలందరినీ భక్తితో ఆరాధించేది. పాతాళగంగలో నీరు త్రాగింది. ఇత్తడి బల్లిని తాకింది. పుణ్యక్షేత్రాలు దర్శించేది. తనకు భయంకర వ్యాధి కల్గినపుడు అందరి దేవుళ్ళను ప్రశ్నించింది.

"నేను భక్తితో పూజించిన మీరంతా నా కష్ట సమయంలో ఆదుకోలేరా? నాతో మాట్లాడలేరా? అని ప్రశ్నించింది". ఆమె ప్రార్ధనలకు జవాబుగా ఒక దేవుడు ప్రత్యక్షమై వాస్తవాన్ని తెలియజేసాడు. "అమ్మా, నీవు ప్రశ్నించిన ప్రశ్నలకు మా వద్ద జవాబులేదు. మేము అసహాయులము. పైనున్న వాడే నిన్ను రక్షించగలడు. "అయ్యా, కనీసము నేను మరణిస్తే మోక్షాన్ని ప్రసాదిస్తారా? అన్న ప్రశ్నకు తిరిగి అదే జవాబునిచ్చాడు. పైనున్నవాడే అన్నింటికి సమర్ధుడు. సమస్తము చేయగలడు" యీ జవాబు చాలా నిరుత్సాహం కల్గించింది. ఎన్నో యాత్రలు చేసాను. పుణ్యక్షేత్రాలు దర్శించాను. నా ప్రశ్నలకు జవాబు ఏ రీతిగా తెలుసుకోగలను? నీవే చెప్పలేకపోతే నాకు తెలుసుకొనే అవకాశము ఏది? అని అడిగింది.

"అమ్మా, మీ యింటికి రేపు ఒక వ్యక్తి వస్తాడు. నిన్ను సర్వసత్యంలోనికి నడిపించే పైవాడిని గూర్చి వివరిస్తాడు కనిపెట్టుకో" అని చెప్పి వెళ్ళిపోయాడు. ఆ కలలో కన్పించి చెప్పిన మాటను నమ్మి, తర్వాత రోజు చాలా ఆశతో కనిపెట్టసాగింది. మా నానమ్మ

అన్నయ్య ఆమెను దర్శించాలని వచ్చినప్పుడు ఒక క్రైస్తవ విశ్వాసియైన పాస్టరు గారిని వెంటతీసుకొని వచ్చారు. ఆమె ఆయనను సూటిగా ప్రశ్నించింది. “అయ్యా, రాత్రి కలలో ఒక దేవుడు వచ్చి పైనున్నవాడిని గూర్చి ఒక వ్యక్తి వివరించి చెప్తాడన్నాడు. అది మీరే అయితే నాకు ఆ పైవాడిని గూర్చి చెప్తారా? అమ్మా, క్రీస్తుప్రభువే ఆపైవాడు. ఆయన గొప్ప దేవుడని నా దగ్గరున్న బైబిలు గ్రంథములో వ్రాసివుంది.

**ఫిలిప్పీ 2:10,11 “పరలోకమందున్న వారిలో గాని, భూమి మీద ఉన్నవారిలో గాని ప్రతివాని మోకాలును యేసునామమున వంగునట్లును, ప్రతివాని నాలుకయు తండ్రియైన దేవుని మహిమార్థమై యేసుక్రీస్తు ప్రభువని ఒప్పుకొనునట్లును దేవుడు ఆయనను అధికముగా హెచ్చించి ప్రతినామమునకు పైనామము ఆయనకు అనుగ్రహించెను”.**

మరొక వాక్య భాగములో కూడా క్రీస్తే పైవాడని ఋజువున్నదని తెల్పాడు.

**అపొస్తలు 4:12 “మరి ఎవని వలనను రక్షణ కలుగదు. ఈ నామముననే మనము రక్షణ పొందవలెను, కానీ ఆకాశము క్రింద మనుష్యులలో యివ్వబడిన యేసునామమున రక్షణ పొందుతాము” అనెను.**

ఆ సువార్త వివరాలు విన్నతర్వాత మా నానమ్మకు మరికొంత అనుమానము కల్గింది. ఎంతోకాలం నుండి సేవించిన మా దేవుళ్ళు, ముక్కోటి దేవతలు చేయలేని పనులు మీయేసు చేయగలడా? అని ప్రశ్నించింది. చాలా సహనంతో ఆ పాస్టరుగారు మరికొన్ని అనుభవాలు, క్రీస్తు సువార్తను తెల్పి, ఆయన అసాధ్యాలను సుసాధ్యం చేస్తాడు. నమ్మినయెడల ఆయన మహిమను చూస్తారు అన్నాడు.

అప్పటికే ఆమె రోగ తీవ్రతవల్ల క్షీణించి, అసహాయస్థితికి చేరినందున, పోనీ ఈ దేవుడిని నమ్మి చూస్తాను అనే నిర్ణయానికి వచ్చింది. ఆమెలో నున్న ప్రాణభీతిని బట్టి యేసును ఆశ్రయించాలని ఆశించింది. ఆరాత్రి “యేసయ్యా, పైవాడివి నీవేనని తెలుసుకున్నాను. నన్ను క్షమించి నారోగాన్ని తీసివేయండి” అంటూ దీనంగా ప్రార్థించింది. ప్రార్థనలు ఆలకించే దేవుడు మనకున్నాడు. ఆ రాత్రి ఆమెకు దర్శనములో క్రీస్తు కన్పించి సూటిగా మాట్లాడారు.

“అమ్మా, నేను నీ రోగాన్ని స్వస్థపర్చుచున్నాను” అని చెప్పి, ఆమెలో నున్న నల్లని పదార్థాన్ని బయటకు తీసివేస్తున్నట్లు చూపారట. మా నానమ్మ సంపూర్ణ ఆరోగ్యంతో జీవించింది. ఆమె తోబుట్టువులు ఏడుమందిలో ఆమె మాత్రమే దీర్ఘాయువులో 104 సంవత్సరాలు జీవించింది. ఆమె జీవించినంతకాలమూ, ప్రభువుతో జీవిస్తూ, ఆయన

మెల్లని స్వరాన్ని వినేది. ప్రతిపనికి సంప్రదించేది. ఆలోచనకర్తయగు దేవుడు ఆ యింటి అవసరాలను గూర్చి, యింటికి చేరు వస్తువులను గూర్చి ప్రతి విషయాన్ని స్పష్టంగా తెలిపి మా నాన్నను, యిరుగుపొరుగు వారిని, బాల్యంలో నన్ను కూడా చాలా ఆశ్చర్యము కల్గించే వివరాలు తెల్పేది. వినుట ద్వారా విశ్వాసము కల్గును గనుక మేమంతా క్రీస్తును నమ్మాము.

ఆమె రెండు సంవత్సరాలక్రితము ప్రభువునందు నిద్రించింది. ఆమె విశ్వాసాన్ని కాపాడుకొని అనేకులలో క్రీస్తుపట్ల ప్రేమను పెంచింది. మా నాన్న పూర్తిగా క్రీస్తును నమ్మాడు. అమ్మకూడా విశ్వాసియైనందున నేను బాల్యము నుండి దేవుని భయము కల్గి జీవించాను. యవ్వనంలోనికి వచ్చిన తర్వాత ఈ భక్తి ప్రార్థనల పట్ల చిరాకు కల్గింది. ఎప్పుడూ ప్రార్థన, వాక్యము, చర్చి కార్యకలాపాలుంటే జీవితంలో ఆనందం, సర్దాలు కోల్పోతున్నానని భ్రమపడ్డాను.

ఆ రోజుల్లో నేను ఇంజనీరింగు విద్యాభ్యాసం చేసే రోజుల్లో అనుకోని రీతిగా స్టూవర్టుపురంలో జరుగుచున్న ఉజ్జీవ కూటమునకు వెళ్ళాను. L.E.F, లేమెన్స్ ఇవాంజిలికల్ ఫెలోషిప్ వారు నిర్వహించిన మీటింగ్‌లో దైవజనుడు దానియేలుగారి పుత్రుడు జాషువా దానియేలుగారు గంభీర స్వరంతో సూటిగా మాట్లాడే మాటలన్నీ నా కొరకే చెప్తున్న అనుభూతి కల్గింది.

"ఓ యవ్వనస్తుడా, ప్రభువు నిన్ను ఈరోజూ పిలిస్తే ఎక్కడికి వెళ్తావు? భక్తి నీకు భారముగా నున్నదా? నీ తలంపుల వల్ల తలలో ముళ్ళ కిరీటాన్ని ధరించిన క్రీస్తుప్రేమను గుర్తించలేవా? నీ చేతులతో, కాళ్ళతో చేసిన పాపాలవల్ల క్రీస్తు సిలువలో మేకులు కొట్టబడి ఘోరశ్రమలు నీ కోసం భరించాడని నమ్మగలవా? యీ మాటలు నాలో భయము కల్గించాయి. నరకములో నిత్యాగ్నికి గురికాగలనేమోనన్న భయం ఆవరించింది. నా రక్షణకై నా తల్లిదండ్రులు నానమ్మ చేసిన ప్రార్థనల ఫలితంగా నాలో నిజమైన పరివర్తన కల్గింది.

నాకు రక్షణ నిచ్చిన దేవుడు వెంటనే నా సేవ చేయ్యమని సూటిగా మాట్లాడారు. నేను బాగా చదువుకున్నాను. నాకు వివాహమయింది. నా భార్యను పోషించాలి, అవసరాలన్నీ తీర్చుకోవాలంటే నాకు ఉద్యోగం అవసరము. యింటింటికి వెళ్ళి యాచించలేను కదా! అని సంశయించాను. ప్రభువు తిరిగి నన్ను వాక్యము ద్వారా ధైర్యపరిచారు. ఆయన పట్ల ప్రేమను బట్టి ఆయన పిలుపును నిరాకరించలేకపోయాను.

**కీర్తనలు 127:3 "తన ప్రియులు నిద్రించు చుండగా ఆయన వారికిచ్చుచున్నాడు"** ఆయనే ఇచ్చి పోషించేవాడని తెలుసుకోగల్గాను. నీ లోటులన్నీ తీర్చగల దేవుడను, నేను

నీ యాజకుడనని తెల్పారు. నేను నా భార్య వినయంతో దేవుని సన్నిధి వెదకి, కనిపెట్టి ప్రార్థించుట నేర్చుకొనగల్గాము. నీతిమంతుడు విశ్వాసము ఆధారంగా జీవించగలడని అద్భుతాల ద్వారా దేవుడు మాకు ఋజువు చేసారు.

## అద్భుతాలు ఆరంభము

**మొదటి అద్భుతము:–** ఒకరోజు మా యింటిలోనికి 5 కిలోల బియ్యము తెచ్చుకొని పచ్చడితో తిని జీవించేవారము. ఆ పాత్రలోని బియ్యము మాకు 40 రోజులుగా మూడు పూటలు తినగల్గునట్లు సమృద్ధితో మా కడుపులను నింపారు. సారెపతు విధవరాలికి జరిగిన అద్భుతాన్ని చూచాము. మేము ఆ రోజుల్లోనే ఎదురింటి కుటుంబమువారు అన్నము వండుకొని రెండురోజులయిందని తెలుసుకొని మా కున్న 5 కిలోల బియ్యంలో 3 కిలోలు వారికిచ్చాము. అదొక అద్భుతమే. కానాను విందులో నీటిని ద్రాక్షారసం చేయగల్గిన అద్భుతాలు నేడు జరుగుట చూడగలము. అవి విశ్వాసము, పరిశుద్ధత వల్ల సాధ్యమగునని గ్రహించాము.

**రెండవ అద్భుతము:–** ఒకసారి మా యింటిలో గ్యాస్ అయిపోయినందున చాలా యిబ్బంది పడ్డాము. గ్యాస్‌కొనే డబ్బులేదు. వెంటనే యిద్దరమూ ప్రార్థించాము. "గ్యాస్ నిండుగా వుంది, నీవు వెలిగించిచూడు అనే స్వరాన్ని నా భార్య విన్నది. నా కయితే దర్శనంలో గ్యాస్ నింపుట చూచాను. యిద్దరకూ ఒకే ఫలితము లభించింది. వెంటనే గ్యాస్ వెలిగించి చూడగా క్రొత్తగా గ్యాస్ నిండినట్లు దేదిప్యమానంగా వెలుగుట మాత్రమే కాదు మాకు సిలిండరు 3 నెలలు వచ్చే దానిని 7 నెలలు వాడాము. క్రీస్తు సజీవుడు. నిన్న, నేడు, రేపు ఒకేరీతిగా నుండువాడు. నమ్మట నీవలనైతే నమ్మువానికి సమస్తము సాధ్యమగునన్న వాగ్ధానము మాపట్ల నెరవేరింది.

మా సంఘస్తులతో యీ రెండు అనుభవాల్ని గూర్చి సాక్ష్యమిచ్చాము. ఒక వృద్ధురాలు చిన్న సిలిండరుతో వంటచేస్తూ వుండేది. అది అయిపోయినందున, మా సాక్ష్యము విని ప్రార్థించింది. ఆమెకు కూడా గ్యాస్ నిండుగా వుండేటట్లు చేసి సహాయము లభించినందున సాక్ష్యమిచ్చింది. ఈ కాలములో యివి సాధ్యమా? అని ఆశ్చర్యపడవద్దు. సాక్ష్యమనగ కనిన, వినిన సంగతులను తెల్పుటయే కదా!

**హెబ్రీ 13:5 "తనను నమ్మిన వారిని విడువడు, ఎడబాయడు."**

దేవునిపై పరిపూర్ణంగా ఆధారపడి పరిశుద్ధంగా జీవించుట విశ్వాసి కనీస కర్తవ్యము.

**మూడవ అద్భుతము:**

ఒకసారి వాక్యపఠనములో ఏలియా జీవితాన్ని గూర్చి అద్భుతాలను ధ్యానించినప్పుడు నాకొక ఆలోచన కల్గింది. కాకి మాంసపు రుచి నోటితో పట్టినను జాగ్రత్తగా దేవుని ఆదేశానుసారముగా ఏలియా ఆకలి తీర్చుట నిజమైన అద్భుతము. దీనిని నమ్మిన నేను దేవున్ని ప్రార్థించి నాకొక అద్భుతాన్ని చూపమన్నాను.

అదేమనగా నా యింట్లో టూత్‌పేస్టు లేదు. కాకిద్వారా నాకు పంపమన్నాను. మరుసటి రోజు ఉదయాన్నే యింటి ముందు 200 గ్రాముల పేస్టు పడివుంది. ఒక చివర కాకిముక్కు నొక్కివున్నట్లు గమనించి దేవున్ని స్తుతించాను. ఆయనను శోధించినందుకు క్షమించమని అడిగి దేవున్ని ఘనపర్చాను.

దేవుడు మనము అడిగితే యిచ్చేదేవుడు. మనలో విశ్వాసము చాలినంత వుండాలి. క్రీస్తుకొరకు నమ్మకంగా జీవించాలి. యెహోవా బలమును, ప్రభావమును గూర్చి దాచక యితరులకు సాక్ష్యము చెప్పాలి. ఆయన సమర్థుడు. ప్రేమించే దేవుడు. అయితే నమ్మకంగా ప్రేమించాలి. నీతిమంతుడు విశ్వాసంతో జీవిస్తాడు.

నా ఇమెయిల్ : PasterJohn Wesley@rediffmail.com
మా పరిచర్యల వెబ్‌సైట్ : www.jwem.org, Ph No: 8985902877

నా జీవితానుభవం చదివిన మీరు విశ్వాసంతో దేవుని వాగ్దానాలన్నీ నమ్మాలని తెలుపగలను. పేదలకు అండగా వుండండి. మీ ప్రార్థనా జీవితం ద్వారా, సాక్ష్యం ద్వారా పౌలు, సైఫను, ఎలియా, ఎలీషా, యెహోషువా, మోషెలను లేవనెత్తండి.

**ఫిలిప్పి 4:19 "దేవుడు తన ఐశ్వర్యము చొప్పున క్రీస్తుయేసు నందు మహిమలో మీ ప్రతి అవసరమును తీర్చును"**

ప్రభువు మీ ద్వారా గొప్ప కార్యాలు జరిగించగలరని నమ్మండి. కృంగిన వారిని లేవనెత్తండి. నిన్ను నమ్మినవారు వేదనలో, బాధలో, శ్రమలోనుంటే ఆదుకోండి. నా జీవితంలో దేవుడు గొప్ప కార్యాలు జరిగించుట, గతంలో మా నానమ్మలో ఆరంభమయిన విశ్వాస జీవితమే పునాదిగా నున్నదని నా విశ్వాసము. అన్య దేవతలను పూజించే వంశములోనుండి ప్రభువు మమ్ములను వెదకి రక్షించారు. క్రీస్తుప్రేమలో నడిపిస్తూ సాక్షిగా నిలిపారు. ఆయన ప్రేమ వర్ణించ వీలులేనిదని తెలుపగలను. నా కుటుంబముతో క్రీస్తును సేవించుచూ సాగిపోవు నావిశ్వాస జీవితం కొరకు దయతో ప్రార్థించండి. ప్రభువు దీవెన సదా మీతో ఉండుగాక. ఆమెన్.

-----------------

# 16. క్రీస్తు జవాబు ఇచ్చే దేవుడని రక్షకునిగా స్వీకరించాను

– జి.ఎస్. చంద్రమణి (హైదరాబాద్/అమెరికా)



**యెషయ 30:19 "ఆయన నీ మాట వినగానే నీకు ఉత్తరమిచ్చును".**

**పరిచయము :–** ప్రభువు నామములో మీకు శుభములు. క్రైస్తవ కుటుంబములో ఒంగోలులో జన్మించాను. నా తల్లిదండ్రులు శ్రీ ఎద్దు రాజ శిఖామణిగారు. పుష్పారజనిగార్లు యిద్దరూ గవర్నమెంటు స్కూల్లో ఉపాధ్యాయులుగా పనిచేసేవారు. వారికి కల్గిన ఏడుమంది సంతానములో 5వ బిడ్డగా చంద్రమణి పేరుతో మంచి బాల్యాన్ని గడిపాను.

ఇద్దరు సోదరులు, నలుగురు సోదరీమణులు గల కుటుంబంలో నేను ఎమ్.ఎ.ఎమ్.ఇడి చదివి ఉపాధ్యాయినిగా పనిచేసాను. ఇంటరు చదివే రోజుల్లో భక్తసింగ్ గారి సహవాసం హెబ్రోను విశ్వాసియైన దాసన్‌గారి బోధవిని రక్షణానుభవము, బాప్తీస్మము పొందాను. నా వివాహము 1973వ సంవత్సరములో రాజమన్నార్ సర్కిల్ ఇన్సెక్టరుగా పనిచేయు వారిని భర్తగా పొందాను. ముగ్గురు బిడ్డలను ప్రభువిచ్చారు. ఇద్దరమ్మాయిలు సింధియా, మేఘన అమెరికాలో స్థిరపడ్డారు. నేడు దైవ వాక్యబోధన వరంతో ప్రభువు వాడుకొనుట నా భాగ్యం.

బైబిలులో భక్తులకు ఆయా రీతులుగా బయలు పర్చుకొన్న దేవుడు ఎన్నికలేని నన్ను ఎన్నుకొన్నారు. నా సాక్ష్యాన్ని మూడు భాగాలుగా తెలుపగలను. నా ప్రశ్నల కాయన యిచ్చిన జవాబులు, ఆయన నేర్పిన పాఠాలు, ఆయన ఆయ శ్రయములలో యిచ్చిన ఆదరణ, చూపిన ప్రేమ గొప్పది.

1994వ సంవత్సరము ఫిబ్రవరి 8వ తేదీన స్కూలుకు వెళ్తూ ఒకచోట జారిపడ్డాను. చాలా భయంకరమైన బాధ కల్గింది. నాకుడి కాలులో రెండు ఎముకలు విరిగిపోయి పాదము ప్రక్కకు తిరిగిపోయి వ్రేలాడింది. అంత బాధలో ఆయన కృపననుగ్రహించాడు. నేను వెంటనే ప్రార్థించాను "ప్రభువా ఇది నీకు తెలియకుండా జరుగలేదు. నీ చిత్తానికి లోబడుచున్నాను. నేను ఉద్యోగము చేయు స్కూలులో చదువుకొనే విద్యార్థినులు నన్ను ఆస్పత్రిలో చేర్పించారు వారు నాకు యిష్టంగా చదివే బైబిలు కూడా తీసుకొని వచ్చి నా

కందించారు. ఒక్క వాక్యము నాకిచ్చి నాకు ధైర్యము ప్రసాదించమని అడిగాను. నా బాధలో నేను స్వతంత్రించుకొనిన మొదటి వాగ్ధానమేమనగా

**కీర్తనలు "ఆయన నా కాళ్ళను జింక కాళ్ళవలె చేయుచున్నాడు".**

నేను శారీరకంగా, మానసికంగా పడిన వేధనలో ఆ వాగ్దానము నెరవేరుటకు దాదాపు 9 నెలలు పట్టింది. అబ్రహాము జీవితంలో 25 సంవత్సరాలు కనిపెట్టాడు కద! అని ధైర్యము తెచ్చుకున్నాను. నా అనుదిన ప్రార్ధనలలో ప్రశ్నించేదానిని "దేవా, నేను నీ బిడ్డను కద! నాకీ శ్రమ నీవు కల్గించినదా? లేదా సైతాను పడవేశాడా? దైవవాక్యము ద్వారా జవాబు పొంది ఆదరణ లభించగా నెమ్మది కల్గింది.

**11దిన వృత్తాంతాలు 11:4 "ఈ కార్యము నా వలన జరుగుచున్నది".**

**యెషయ 48:10 "దేవుడు నన్ను పుటము వేసిన సువర్ణమువలె యిబ్బందుల కొలిమిలో నన్ను పరీక్షించినాడు".**

నేను పడకమీద నుండగా దర్శించుటకు వచ్చిన వారిలో కొందరి మాటలు ఆదరణ కల్గించేవి గాని కొందరు పుల్ల విరుపుగా విమర్శించేవారు. "మేము కూడా పడ్డాము గాని ఆయన కృపవల్ల హాని కలుగలేదు. నన్ను కూడా వారివలె ఎందుకు కాపాడలేదు? అని మౌనంగా బాధలో ప్రశ్నించేదానిని. ప్రభువు దయగల దేవుడు ప్రతి మానసిక బాధకు తగిన వాక్యాన్ని దేవుడిచ్చి నన్ను ప్రశాంతతతో నింపేవాడు.

**మత్తయి 16:23 "నీవు మనుష్యుల సంగతులనే తలంచుచున్నావు గాని దేవుని సంగతులు తలంపకయున్నావు".**

అనే మాట హెచ్చరించింది. నాకాలు గాయానికి ఆపరేషన్ చేసి స్టీలు కడ్డీలు అమర్చదలిచారు. దీని వల్ల కాలు పొట్టి పొడుగు కావచ్చు, ఇన్‌ఫెక్షను రావచ్చునని సూచనలు తెల్పారు. నేను వినయంగా ప్రార్ధించి నీ చిత్తమేమిటని దేవున్ని అడుగగా భయపడవద్దు కుమారీ, రెండవ కాలువలె సరియగునని అభయమిచ్చారు. మాటయిచ్చి నెరవేర్చు నా రక్షకుడు, ప్రార్ధనలు ఆలకించువాడు నాకాలు పూర్తిగా స్వస్థపరచి ఏ తేడా లేని రీతిలో నిలబెట్టారు.

**2 దినవృత్తాంతము 19:11 "ధైర్యము వహించుడి. మేలుచేయుటకై యెహోవా మీతో కూడా వుండును".**

ఈ మాట ద్వారా ధైర్యమిచ్చారు. నేను పడకపైనుండగా పైకి దేవుని చూస్తూధ్యానించే అవకాశాలు ఎన్నో వుండేవి. చిన్నచిన్న కథలు చదివగా నాలో ప్రశ్నలకు జవాబులభించేది. క్రీస్తు సందేశాలన్నీ చిన్న ఉపమానాల ద్వారా గొప్ప సత్యాలను బోధించేవారు అని వ్రాసి ఉంది కద! నా శ్రమలకు కారణమేమని తలంచినపుడు చిన్న సిలువల కథ నాకవసరమైన జవాబు లభించింది.

ఎవరికి ఎంత బరువుగల సిలువ ఇవ్వవలెనో ఎవరు ఎంత శ్రమ అనుభవించగలరో దేవునికే తెలుసని గ్రహించాను. నా ఒంటరి తనంలో దు:ఖ పడే సమయంలో దైవజనుడు నన్ను సమీపించి "తల్లి అయినా తన చంటి బిడ్డను మరచును గాని ప్రభువు నిన్ను మరువనని తెల్పారమ్మా అని ప్రవచనాత్మకంగా చెప్పారు. స్వస్థత గూర్చిన వాగ్దానాలకు బదులుగా ఈ వాక్యం చెప్పారు. ఏమిటని ప్రశ్నించాను. నేను ప్రార్థించుకొని దేవుడిచ్చిన మాట నీతో తెల్పానమ్మా అన్నారు.

నేను పడకపై నుండి చదువుచున్న ఒక పత్రికలో సందేశం మరొకసారి నన్ను ఆదరించింది. మంచి శుక్రవారము ఈస్టరు కాలంలో నేను ఒంటరిగా యింటిలో నుండగా 8మంది శిష్యులకు గెత్సెమనె వనంలో ఏపని చెప్పకనున్నట్లు నీవు పడక అనే గెత్సెమనె వనంలోనే ఉన్నావు. నీకు ఏ పని అప్పగించకపోయినా నేను క్రీస్తు శిష్యుడనని గ్రహించాను.

అన్నట్లుగా కొన్నిసార్లు నా జీవితం నిరర్థకంగా వుంది. ప్రభూ నన్ను నీ యింటికి పిలుచుకో అని ప్రార్థించిన సమయంలో సమాప్తమైనది అనే సందేశంలో దేవుడు నిర్దేశించిన సమయము వరకు మరణాపేక్ష వలదని గ్రహించాను. నాకాలు స్వస్థతకు చాలా కాలము పట్టుచున్నందున సైతాను నన్ను బెదిరిస్తూ నిరుత్సాహపరచదలచి నీకు స్వస్థత లేదని తెల్పగా ప్రభువు ఎదిరించాలని హెచ్చరించారు. దేనితో ఎదిరించగలము?

**యాకోబు 4:7 "అపవాదిని ఎదురించుడి"**

**ఎఫెసి 6:17 "వాక్యమనే ఖడ్గమనే ఆయుధంలో నీవు అబద్దికుడవు. నీ వాక్యమే సత్యము అని తెల్పి ధైర్యంగా నిలిచాను.**

ఆ తర్వాత ఉదయకాల ధ్యానంలో యేసు బోధించిన తర్వాతనే పరీక్షించును అని చదివాను. విశ్వాసమెల్లప్పుడూ శోధనల చేత పరీక్షకు నిలిచినదై మెప్పు, ఘనతనిస్తూ దేవున్ని మహిమ పర్చును కద! నిరాశ ఆవరించినపుడు క్రీస్తు సిలువత్యాగము అన్నింటిని మించినదైనప్పుడు యాత్రికుని ప్రయాణములో పెద్ద మంటలు కన్పించగా అదృశ్య హస్తం

నూనె పోయుట గమనించాను. సైతాను మన విశ్వాసాన్ని ఆర్పాలని చూస్తే ప్రభువు నూనెపోసి ఆరిపోకుండా సంరక్షించగలడు. మన బాధలలో ప్రభువు కూడా వారివాడై యుండును.

**యెషయా 63:9 "వారి యావత్ బాధలో ఆయన బాధనొందెను".**

స్తెఫను జీవితంలో ఆకాశము తెరువబడుట, దేవుని కుడి పార్శ్వమందు ప్రభువు నిలిచియుండుట శ్రమలో చూడగలము. నా శ్రమలో యెహోవా నా భాగమని తలంచి మన బిడ్డలలో వ్యాధిగ్రస్తులైన బిడ్డలపై ఎక్కువ మమకారం చూపించగలము. నా స్వస్థత ఆలస్యమైన నిరాకరించే ప్రార్థనలుండవని నమ్మాను. నాకు యిచ్చిన గొప్ప వాగ్ధానము బహు ధైర్యమిచ్చింది.

**యెషయా 57:18 "వారిని స్వస్థపరతును, వారిని నడిపింతును".**

నాలాటి అంగవైకల్యము ఆశీర్వాదాన్ని తెస్తుందనే సత్యము గ్రహించు విజ్ఞానావగాహనలనిచ్చారు. ఆ తర్వాత నాకు లభించిన సంపూర్ణ స్వస్థతనుబట్టి ఆయన నమ్మదగిన దేవుడని స్తుతించాను. తిరిగి ఉపాధ్యాయినిగా ఉద్యోగములో చేరి సెలవులన్నీ లెక్కించగా సరిగ్గా సరిపోయి ఒకరోజు అదనంగా మిగిలింది.

**2. ప్రభువు నేర్పిన విలువైన పాఠాలు :-**

ప్రభువు ప్రేమ ప్రేరేపించిన రీతిని బట్టి అవసరములో నున్న వారిని ఆదుకొను విధము నేర్పించి యిచ్చుట ధన్యతని తెల్పారు. ఒక అవసరతలో నున్న కుటుంబానికి ఆర్థికంగా డబ్బు అందించాలని తలంచాము. నా మరదలు వెయ్యి రూపాయిలు నేను 500ల రూ॥లు యిచ్చాము. డబ్బు లేదని చెప్పినా అక్క మాత్రం, ఎక్కడనైనా సర్ది తీసుకొని యిస్తాను. మన అవసరాలకు తెచ్చుకుంటాము కద! అని తెల్పింది.

ప్రభువు నాకొక పాఠం నేర్పారు. వీరిలో ఎవరు నన్ను ఎక్కువ ప్రేమించారు? అని అడుగగా నా అక్క అన్నాను. పేద విధవరాలు తనకున్నదంతా అనామకంగా యిచ్చి దేవున్ని ప్రేమించింది. అదే నాకు తెలిపారు.

మరొక పాఠముగా నేర్చుకొన్నది యోబు జీవితము. నాకు ఎప్పుడైనా గొప్పవ్యాధి ఎదురైతే ఎలా ఎదుర్కోగలను? యోబు రోజూ బలులు అర్పించి ప్రార్థించేవాడు. ఏది వచ్చునని బహుగా బయపడితినో అదే నాకు సంభవించుచున్నదని చెప్పాడు. నా సంశయాలలో "నీవు నా విశ్వాస్యతను, నా పరిశుద్ధతను ఆదారము చేసుకొనకపోతివే"

అన్నారు. "ప్రభువా నా అపనమ్మికను బట్టి క్షమించు. నా కెన్నడూ అపనమ్మికరాని రీతిగా చింతలేని జీవితమిమ్మని అడిగాను. నా ప్రభువు నమ్మకమైన హస్తములకే సమస్తము అప్పగించుకున్నాను.

నేను నేర్చుకొనిన మూడవ పాఠమేనగా శ్రమలోనున్న నన్ను చూచి కొందరు బంధువులు నిందించి అపహసిస్తూ మాట్లాడిన సందర్భాలలో చాలాసార్లు నిరాశతో దు:ఖపడేదాన్ని. ప్రభువు మూడు ప్రశ్నలనిచ్చారు. యితరులను ప్రశ్నించే ముందుగా ఆ ప్రశ్న నీకు మంచిని చేస్తుందా? ఆ ప్రశ్న యితరులకు మేలు చేకూరుస్తుందా? ఎవరిని గూర్చి చెప్పుచున్నావో వారికి మేలు చేకూర్చేదేనా?

**యిర్మీయా 9:5 "ఎదుటి వారి తప్పులు పట్టవలెనని ప్రయాసపడుదురు".**

మనమెట్లు మాట్లాడవలెనో వాక్యము తెల్పుతుంది. వినువారికి మేలు కలుగునట్లు క్షేమాభివృద్ధికరమైన అనుకూల వచనమే పలుకుడి". ఎవ్వరైనా పరామర్శించుటకు వచ్చినప్పుడు శుభమని వారితో చెప్పవద్దన్నారు. సువార్తనే బోధించాలని నేర్పారు.

**3. దేవుడు ఆదరణనందించుట :-**

ప్రభువు నాకు విలువైన ఆత్మీయ పాఠాలు నేర్పించుటకై శ్రమనొందుట మేలాయెను. నాకు కాలు విరిగిన ప్రమాదంలో పడకపై నుండగా ఏ కొరత లేకుండా ఆహారం, డబ్బు, మానవసహాయమునకేమీ కొరత రానీయక దీవించారు. ప్రతిక్షణము వాక్యము నన్ను బ్రతికించింది. బాధలో నెమ్మదినిచ్చింది. కృంగిపోనీయక వాక్యములోని వాగ్ధానాలపై నిలిచాను. ఒకసోదరి ద్వారా నేను మానసికంగా గాయపడగా దు:ఖ సమయంలో ప్రార్ధనా కూటాలకు వెళ్ళుట సంభవించింది.

**నిర్గమ కాం 17:8 ఇశ్రాయేలీయులు కానాను యాత్రలో ఎదుర్కొన్న విభిన్న అనుభవాలు వివరించారు.**

**నిర్గమాకాండము 13 నుండి 16 అధ్యాయములలో వివరణ ఉంది.**

ఐగుప్తునుండి పస్కాబలి సేవించి ఎఱ్ఱ సముద్రమనే బాప్తీస్మము నీటిద్వారా మేఘము ద్వారా నడుస్తూ మన్నా భుజిస్తూ బండలో నీరు త్రాగి సాగిపోయే రోజుల్లో అమాలేకీయుల నెదుర్కోవలసి వచ్చింది. మరుసటిరోజు స్కూల్లో ఖాళీ సమయంలో యుద్ధానికి ధరించవలసిన సర్వాంగ కవచం గూర్చి ధ్యానించగా పేతురు జీవితంలో సైతాను ప్రవేశించగా "సాతానా నా వెనుకకు పో" అన్నాడు. అననీయ సప్పీరాలతో సైతాను మీ హృదయాలను ఎందుకు

శోధించెను అని ప్రశ్నించిన దైవజనుడి మాటలను బట్టి విశ్వాసులపై కూడా సైతాను దాడి చేస్తాడని, నా శ్రమకూడా అదే అనుభవమని నమ్మాను. దావీదు సమస్తము సంపాదించుకొన్న రీతిగా నేను కోల్పోయిన ఆరోగ్యము, ఆనందం అన్నీ పొందాను. క్రీస్తు అందరికై మరణించాడు. ఒక వ్యక్తికోసం కూడా మరణించు ప్రేమ మూర్తని నమ్మాను.

**ద్వితియ 32:30 "ప్రార్ధనా బలము గొప్పది. ఒకడు వేయిమందిని తరుమును. ఇద్దరు పదివేలమందిని పారద్రోలుదురు".**

ప్రభువు నన్ను అనుదినము నడిపిస్తున్నారు

**యెషయా 30:21 "మీకు కుడితట్టైయినను ఎడమ తట్టైయినను తిరిగినచో ఇదే త్రోవ. దీనిలో నడువుడి అని నీ వెనుక నుండి శబ్ధము నీ చెవులకు వినబడును".**

యింత మంచి వాక్యాధారము నా జీవితంలో నెరవేరునట్లు ప్రభువే నన్ను నడిపించుచున్నారు. ఒకసారి మా యింటికి బంధువులు రాగా నేనెట్లు పరిచర్య చేయగలనోనని ప్రార్ధించగా మరలా వాక్యము లభించింది.

**హెబ్రీ 13:2 "ఆతిధ్యము చేయుట మరువకుడి దానివలన కొందరు ఎరుగకయే దేవదూతలకు ఆతిధ్యము చేసిరి".**

యీ మాటలాధారముగా ఓర్పుతో యితరులకు సహాయపడుట నేర్చుకున్నాను. అంతేకాదు. అవసరములోనున్న బంధువు ఆర్ధిక యిబ్బందిలో సహాయపడ్డాను. నీ రక్త సంబంధికి నీ ముఖము తప్పింపకుము. నిన్ను అప్పు అడుగగోరువాని నుండి నీ ముఖము తప్పింపకుము. ఈ వాక్యమునకు లోబడినాను.

నా ప్రార్ధనలన్నింటికి జవాబు దొరికిందని చెప్పలేనుగాని సమయోచితంగా ఆదరణ హెచ్చరిక పొందగా శాంతిలభించేది. ఒకసారి నేను చదివిన పుస్తకంలో ఒక ఓడ కెప్టెన్ వివరాలు నన్ను చాలా ధైర్యపర్చాయి. ఒక నౌక తుఫానులో చిక్కుకున్నప్పుడు అందరూ భయాక్రాంతులై యుండగా ఒక యువకుడు నేను కెప్టెన్‌ను కలుస్తాను అని వెళ్ళి వెంనే తిరిగి వచ్చాడు. కెప్టెను చిరునవ్వుతో ధైర్యగా నున్నాడంటే మనమంతా క్షేమముగా నుండగలమని అభయమిచ్చాడు, యీ కథను బట్టి మన జీవిత నౌకను నడిపించే నావికుడు క్రీస్తే. ఎలా తుఫనులలో తీసుకొని వెళ్ళాలో, ఎక్కడికి చేర్చాలో తెలుసు. చిరునవ్వుతో నడిపించగలడని నమ్మాలి. జవాబు రాని ప్రార్ధనా సమయాల్లో చిరునవ్వుతో నడిపే కెప్టెన్‌ను మనమునమ్మి ఊరకనిలిచి రక్షణను చూడాలి. అదేపాఠము నా జీవితంలో అవలంబిస్తూ నాటినేండి నేటివరకు జీవించగల్గుచున్నాను.

నా జీవితానుభవమును బట్టి చివరిగా శ్రమల మార్గములో పయనించే చదువరులందరికీ నేనిచ్చే సందేశమేమనగా

**2 కొరింథియు 4:18 "క్షణకాలముండు చులకన శ్రమలు"** అని నమ్మాలి. యివి మనకు మహిమభారాన్ని అధికం చేస్తున్నాయి. శ్రమలను ఎదుర్కొను సమయంలో ప్రభువు మనలో కార్యము చేస్తున్నాడని గ్రహించాలి. ఈ శ్రమలమార్గము మన ప్రభువు ఎన్నుకున్న మార్గము. అదే శిలువమార్గము. ప్రభువు మనకై నిర్ణయించిన మార్గము. శ్రమలద్వారానే మనలను పరిపూర్ణులుగా మార్చగలడు. సంపూర్ణముగా శుద్ధిచేసి ముత్యమువలె తండ్రి ఎదుట ప్రత్యక్షపరచి యోగ్యురాలైన కుమారి, లేదా కుమారుడని ప్రశంసించి సంతోషిస్తారు. ఆ దినం కోసమే ఎదురుచూడాలి.

ప్రియ చదువరీ, నీవు రక్షణస్థిరత కల్గిన క్రైస్తవుడివేనా? నీవు జీవముగల దేవునిప్రార్థనలకు జవాబులిచ్చి ఆదరించే దేవున్ని కలిగియుండవలసిన ఆవశ్యకత్వం ఎంతైనా వున్నది. ఈ చివరి దినములలో అందరును అంతటను మారుమనస్సు పొందవలెనని ఆజ్ఞాపించుచున్నారు.

**అపొస్తలు 17:30 "ఆయన అతి త్వరలో ఈ లోకానికి తీర్పుతీర్చుటకై రానైయున్నాడు. అప్పుడు ఏ శరీరియు తప్పించుకొనడు. నరకశిక్షను తప్పించు కొనుటకై నేడే మోకాళ్ళు వంచి "యేసుప్రభువా, నేను పాపిని, నన్ను దయతో క్షమించు. నన్ను నీ బిడ్డగా స్వీకరించు"**

అని ప్రార్ధించు. జవాబునిచ్చి గొప్ప చెప్పనశక్యమైన ఆనందము, శాంతినిచ్చి నిన్ను సంతోషపెట్టి నిత్యజీవాన్నిస్తారు. క్రీస్తుతో విశ్వాసయాత్ర కొనసాగించు.

దేవుడు నా కాలు విరిగిన రోజుల్లో గొప్ప విలువైన ఆధ్యాత్మిక పాఠాలను నేర్పించారు. ఈ చిన్న సాక్ష్యము ద్వారా అనేకులకు రక్షణ, విశ్వాసులకు శ్రమలో ఆదరణ, అన్నింటికిమించి దేవుని మహిమపర్చాలని నా ఆకాంక్ష. నేనొక నమ్మకమైన సాక్షిగా వాక్యపరిచర్యలోను, ప్రతిచోట నమ్మకమైన సాక్షిగా జీవించుటలో ప్రభువు నన్ను నడిపిస్తున్నారు. అంతము వరకు క్రీస్తు పరిచర్యలో కొనసాగునట్లు ప్రార్థించండి. మీ అందరి కొరకు కనేను ప్రార్థిస్తున్నాను. దేవుడు నా సాక్ష్యాన్ని దీవించునుగాక ఆమెన్.

నా సెల్‌ఫోన్ నంబరు 9398301745

శ్రీమతి G.S.Chandra mani (M.Z.Med), C/o Sri Gera Rajamannar

(Excise Circle Inspector) H.No: 116/C Sanjeeva Reddy Nagar, Hyderabad-38

----------------------------

# 17. క్రీస్తు తన సిలువను మోయుట ఎట్లో నేర్పించారు

**– దివ్య ప్రసాద్** (చెరుకువాడ/మణుగూరు)

కీర్తనలు 2:8 "నన్ను అడుగుము జనములను నీకు స్వాస్థ్యముగా ఇచ్చెదను."

**పరిచయము :–** క్రీస్తు ప్రేమగల నామములో మీకు వందనములు. నాపేరు పెరికం వెంకట సత్యవరప్రసాద్. ప్రభువును నమ్మిన తర్వాత దివ్య ప్రసాద్‌గా ప్రభువు యిచ్చిన పేరుగా వ్యవహరించబడుచున్నాను. నేను నా తల్లిదండ్రులకు ఏకైక కుమారుడను. ముగ్గురు సోదరీమణులున్నారు. ఒంగోలు జిల్లా కందుకూరులో జన్మించినను మా పూర్వీకులంతా పశ్చిమగోదావరి జిల్లా భీమవరం సమీపంగాగల చెరుకువాడ వాస్తవ్యులు. మా నాన్న ఉద్యోగరీత్యా చాలా ప్రాంతాలు తిరిగాము. 9వ తరగతి వరకు హైదరాబాద్‌లో చదివాను.

మా అమ్మ విగ్రహపూజలు విపరీతంగా చేసేది. చాలా విగ్రహాలుండేవి. రామాయణం వేదాలు చదివి చెప్పేది. దేవుడున్నాడనే నమ్మకము నాలో వున్నందున నేను కూడా విగ్రహాలముందు నిలిచి పూజలు చేసి, శ్లోకాలు చదివి, తలనీలాలు దేవునికిచ్చి భక్తిగా ఉండేవాడిని. శబరిమలై, కంచి, మధురమీనాక్షి, కాశి దర్శించాము. యజ్ఞాలలో పాల్గొనేవాడిని. సర్వము పరిపాలించే దేవుడు చూస్తున్నాడని తలంచేవాడిని. అమ్మకు షుగర్‌వ్యాధి వుండేది. మా నాన్నకు కోపం చాలా ఎక్కువగా ఉండేది. కారం, ఉప్పు తేడా వస్తే ప్లేటులు, గ్లాసులు విసిరివేసేవాడు. నాకు భయం ఎక్కువై ఒకసారి పరీక్షలలో జవాబు పత్రాన్ని యింటికి తెచ్చి ప్రశ్నాపత్రాన్ని ఉపాధ్యాయునికిచ్చాను. ఆరోజు పరీక్ష ఎలా వ్రాసావు అని అడిగి నేను తెచ్చిన పేపరుచూచి దిద్ది కోపడ్డారు.

ఒకసారి అన్నము తినేటప్పుడు ఎంగిలిపడింది. నాన్న నన్ను గట్టిగా కొట్టారు. 24 గంటలు మాటరాలేదు. ఆస్పత్రికి వెళ్ళాను. యీ రీతిగా భయంతో బాల్యం గడిపాను. నా కష్టాలన్నీ దేవుళ్ళతో చెప్పుకునేవాడిని. దేవుడు మనిషిని ఎందుకు పుట్టిస్తాడు? ఎందుకు మరణానికి అప్పగిస్తాడోనని తీవ్రంగా ఆలోచించేవాడిని. చనిపోయిన వ్యక్తి ఎక్కడికి వెళ్తాడు? కుంటి, గ్రుడ్డి వారిని ఎందుకు పుట్టించాలి? దేవుళ్ళు కూడా అవతారాలెత్తి మరణించుట ఎందుకు? ఎందువలనో భక్తి భావంతో పూజారులు యింటికివస్తే సాష్టాంగ నమాస్కారాలు చేసేవాడిని. పప్పు, ఉప్పు, దాన్యం దానం చేసేవాడిని. నాన్న కోపస్థితికి యిల్లంతా చాలా బాధతో, అశాంతితో నుండగా నాలో పిరికితనం ఏర్పడింది.

బాల్యంలో 5,6వ తరగతి చదివే రోజుల్లో దేవుళ్ళముందు కూర్చొని మాట్లాడేవాడిని. రాముడా నాకేమి చేసావు? శివుడా పామును మెడలో నుంచికుని ఫోజుతప్ప ఎప్పుడైనా మాట్లాడావా? ఆంజనేయడా తోకపెట్టుకొని పూజలు అందుకుంటున్నావు ఫలితము ఏది? ఆరోజు యీ దేవతలు ఉగ్రరూపంతో కనబడి నాకు హానిచేస్తారని భయపడ్డాను. ఏమీ జవాబులేదు. వినాయక చవితికి వినాయకుని బొమ్మకొని ఒక వారం వరకు పూజలు చేసి నిమజ్జనము చేసాము.

యీ విగ్రహం మట్టిగా మారుతుంది కదా! అని ఒక స్నేహితునితో అనగానే, అవునుగా మట్టి దేవుడు ఒకటేరా అన్నాడు. బంధువులంతా ఈ దేవునికే మ్రొక్కుతున్నారు గనుక నేను కూడా పూజించుట కొనసాగించాను. నా స్నేహితుని తల్లి చనిపోతే ఆమె స్థితి ఏమని చాలా బాధపడ్డాను. జనన మరణాల మధ్య నలిగే మనకు మమకారాలు ఎందుకు? యీ ప్రశ్నకు జవాబు నాకు దొరకలేదు.

ఒకరోజు క్రిస్మస్ కాలంలో క్రైస్తవులంతా క్యారెల్స్ పాటలు పాడుతూ వీధుల్లో కరపత్రాలు పంచుతూ రోడ్డుమీద వెళ్తూ కన్పించారు. వీరు క్రీస్తును పూజిస్తారని తెలుసుకున్నాను. నాకయితే వీరిపై మంచి అభిప్రాయం లేదు. బ్రిటిష్ వారి మతమనియు, మన దేశంలో వీరి మతమును ప్రచారము చేస్తూ బడులు, గుడులు కట్టించేవారనియు మనము అనుసరించరాదని తెలుసు.

ఆ తర్వాత మా నాన్న గుంటూరు, గుడివాడలో ఉద్యోగం చేసారు. నేనయితే భీమవరములో ఇంటరు చదివాను. ఒంటరితనంలో వింత అలవాట్లు అలవడ్డాయి. సిగరెట్లు, సినిమాలు, స్నేహితులు, నవలలు చదువుట అలవాటు చేసుకున్నాను. బావోద్రేకాలు వల్ల అశాంతి చెలరేగింది. నాలో శరీరాశ, నేత్రాశలు ఎక్కువై నైతికంగా దిగజారాను. కొంతకాలము మానివేయాలని తలస్తూనే మానలేకపోయాను. పూజలు అధికముగా చేసాను.

ఆ రోజుల్లో మా అత్తయ్య క్రీస్తును నమ్మికొని ప్రార్థనలు చేసేది. అక్కడనే ఒక పూజారుల వంశంలోని వ్యక్తి కూడా క్రీస్తును నమ్మి నిడదవోలులోని సిద్ధిపేటలో దేవుని సేవచేసేవాడు. మా అత్తయ్య ఆరాధనలలో పాల్గొనేది. యేసుమాత్రమే నిజమైన దేవుడనియు, హిందువులు, ముస్లింలు, క్రైస్తవులందరికీ సృష్టికర్త దేవుడు ఒక్కడే. క్రీస్తును నమ్మిన వారికి రక్షణ లభిస్తుంది. లేనిచో నరకము తప్పదు అని తెల్పారు.

**ప్రకటన 21:8 "పిరికివారు, నరహంతకులు, మాంత్రికులంతా అగ్ని గుండములో పాలుపొందుతారు. అది రెండవ మరణం అని తెల్పారు".**

అయితే చాలామందికి నరకము తప్పదా? అని బాధపడ్డాను. ఆ దైవజనుని ప్రార్ధనా ప్రభావముచే దయ్యాలు సైతాను శక్తులనుండి చాలా మంది విడుదల పొందారు. అనేక రోగాలు స్వస్థత ద్వారా తొలగింపబడ్డాయి. ప్రతి కులానికి, మతానికి వేర్వేరు దేవుళ్ళు వుండరు గానీ, ప్రపంచానికి ఒకే సూర్యుడు, చంద్రుడు సృష్టిలో వున్నాయి. అందరిలో ప్రవహించేది ఎఱ్ఱని రక్తమే. నీవు సృష్టికర్తయగు దేవునికి పేరు పెట్టవద్దు గాని ప్రార్థించు. సృష్టికర్తయగు దేవా, సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, సృష్టి అంతా నీవే చేసావు. నన్ను కూడా ఈ లోకంలో జీవించే ధన్యత నివ్వు. నీవు నాకు కనబడుము. ఆమెన్.

ఈ ప్రార్ధన ఏ మతానికి చెందినది కాదు. ఏ గుడిని ఆశ్రయించవద్దు. నేను నమ్మిన దేవుడు వెలుగైయున్నాడు. పాపులను రక్షించుటకై వచ్చారు. ప్రతియుగంలో మంచివారిని రక్షించి, పాపులను శిక్షించడు గాని వారిని ప్రేమిస్తాడు, రక్షిస్తాడు. ఎందుకో ఆయన మాటలన్నీ నమ్మాలని ఆశించాను గానీ, నమ్ముటవలన తోటివారు, బంధువులు ఆక్షేపించి, విమర్శించగలరని బిడియపడ్డాను. తల్లిదండ్రులు బాధపడతారు. నేను సినిమాలు మానివేయుట సాధ్యమా? ఈ ఆలోచనలతో శాంతి కరువయింది. డబ్బు, చదువు, మంచితనము అన్నీ వున్న నాలో నెమ్మదిలేదు. ఎందుకో జీవితమంటే చాలా అయిష్టత కల్గి మరణవాంఛ కల్గింది.

ఆ రోజు 1979వ సంవత్సరము నవంబరు నెలలో ఒకరాత్రి యేసయ్యను ప్రార్థించాను. ఉదయాన్నే లేచి యధాప్రకారము నా విగ్రహాలముందుండి పూజలు చేసుకోవాలని కూర్చుని యేసును కూడా ప్రార్థించాను. దేవుళ్ళను గూర్చి ఆలోచనలలో నున్న రోజుల్లో నా స్నేహితుడు యాత్రికుని ప్రయాణము జాన్ బన్యన్ రచన యిచ్చి మంచిమాటలున్నాయి చదువుకో అన్నాడు.

ఆరోజుల్లో బి.యస్సీ 2వ సంవత్సరంలోనున్నాను. ఆ పుస్తకములో వివరాలు చాలా ఆసక్తికరంగా నుండగా చదవసాగాను. ఒక యాత్రికుని వీపుపై బరువు వుంది. బైబిలులో క్రీస్తే వెలుగు అనే వాక్యం వ్రాసివుందని విన్నాను. అతను మరొక వ్యక్తిని కలుస్తాడు. అతను చాలా ఇరుకుగానున్న మార్గము దగ్గరకు నడిపిస్తాడు. అక్కడ సిలువ కన్పిస్తుంది. అది చూచిన వెంటనే వీపుపై నున్న బరువు మొత్తము క్రిందికి దొర్లిపోతుంది. వెంటనే "ప్రభూ నా పాపభారాన్ని తొలగించావు" అని స్తుతిస్తూ దేవున్ని ఆరాధించుట చూచాను. అప్పుడు నా ఆత్మీయ నేత్రాలు తెరువబడ్డాయి. నేను కూడా పాపభారం మోస్తున్నాను గనుక సిలువ చెంత నా భారము పోతుందని తెలిసి అప్రయత్నంగా పశ్చాత్తాపంతో నా పాపస్థితిని ఒప్పుకోవాలని ఆశించాను.

గతంలో ఏనాడూ నేను పాపినని గ్రహించలేదు, ఒప్పుకోలేదు. యీసారి నేనే దేవుని ముందు మోకరిల్లి వినయంతో నా పాపాలన్నీ ఒప్పుకొని, నా మోసాలు, పాపాలు మొత్తము ఆయన సిలువ రక్తంతో కడుగమని అడిగాను. నాలో గొప్పమార్పు కల్గింది. నా హృదయము యొక్క భారమంతా ఎవరో అందుకొని తీసివేసినంత తేలిగ్గా భావించడం కాదు గాని నిజంగా తొలిగిపోయింది. ఏదో తెలియని వింత శక్తి నాలో నిలిచింది. అప్రయత్నంగా నాకొక స్వరము వినిపించింది.

“ఈ రోజు మొదలుకొని నీవు పాపము చేయవు” ఆరోజు మొదలుకొని నాలో పాపపు తలంపులన్నీ సమసిపోయాయి. పాత అలవాట్లన్నీ మానివేసాను. క్రైస్తవులు ఆరాధించే మందిరము చేరి ఆ పాస్టరుగారితో మాట్లాడాను. నాకొక బైబిలు కావాలి, నాలో గొప్ప మారుమనస్సు కల్గింది. నా విగ్రహాల జోలికి వెళ్ళను. సజీవుడైన క్రీస్తు నన్ను మార్చారని చెప్పాను.

వాక్యము చదువుటకారంభించాను. ఎంతో యిష్టత ఏర్పడగా తేనె కంటే మధురమైన మాటలు నాకు గొప్ప సంతృప్తిని, శాంతిని, ఆనందాన్ని కల్గించాయి. వేషధారీ అనేమాట నాకోసమేననిపించింది. నా వస్త్రధారణ మార్చాను. నా తలక్రాఫ్ మార్చాను. నా పాత అలవాట్లన్నీ నాకు అసహ్యత కల్గించాయి. అనుకోనిరీతిగా స్వరంవిని నమ్మిన నాకు గొప్పగా దర్శన భాగ్యము లభించింది.

ఆ రాత్రి కలలో నీలాకాశములో మధ్య భాగము తెరువబడగా సిలువలో వ్రేలాడు క్రీస్తునకు పాదాలలో, చేతులలో రక్తధారలు కారుట కన్పించింది. నాకు చాలా అనుమానాలు కల్గాయి. క్రీస్తును చంపింది తన స్వకీయులేననియు, ఆయనే దిగిరావచ్చు కదా! చంపవలసిన నేరమేమి చేసాడని అంత భయంకరమైన బాధలు అనుభవించాలా అని ఆలోచించాను. “యేసే నిజమైన దేవుడు. మానవులందరి పాపాలను నేను పరిహారము చేసాను”. ఈ మాటల స్వరము స్పష్టంగా వినిపించింది. గత జీవితంలో నేను శ్రద్ధతో పూజించిన దేవుళ్ళెవరూ కన్పించలేదు, మాట్లాడలేదు. నేను యేసు అని పేరుచెప్పి ప్రార్థించలేదు. కాని ఆయనే దర్శనమిచ్చి నన్ను ఆశ్చర్యపర్చారు. నా పాపాలన్నీ స్పష్టంగా తెలియపర్చారు.

నా విద్యాభ్యాస కాలంలో ప్రయోగశాలలో దొంగతనం చేసిన విషయాలు, భోజనాల మెస్‌లో డబ్బులు చెల్లించుటలో మోసము చేసిన విధము, ఆటలు ఆడిన క్రికెట్ టీమ్‌ను నా స్వార్థం కొరకు వాడుకొన్నరీతిని బట్టి అన్ని స్థలాలలో తిరిగి డబ్బుచెల్లించి మనుష్యుల ఎదుట, దేవుని ఎదుట పరిహారము చేసుకొన్నాను. నా మనస్సులో ప్రశాంతత నెలకొన్నది.

కొన్ని విగ్రహాలు దాచాను. ఆ తప్పుకూడా చూపించగా అవన్నీ కాల్చివేయాలని వాక్యము ద్వారా తెలియజేయగా దూరముగా నున్న నీటికాలువలో పడవేసాను. ఇక ఎవరికీ తెలియకుండా రహస్య క్రైస్తవునిగా జీవించదలిచాను. మనుష్యుల ఎదుట క్రీస్తే రక్షకుడని ఒప్పుకోకపోతే అది తప్పని వాక్యము ద్వారా గ్రహించాను.

మత్తయి 10 :28 "ఆత్మను చంపనేరక దేహమునె చంపువారికి భయపడకుడి గాని, ఆత్మను దేహమును కూడా నరకములో నశింపజేయగలవానికి మిక్కిలి భయపడుడి".

దేవుని వాక్యము రెండంచుల ఖడ్గముగా నాలో పనిచేయగా పిరికిగా నుండుటను బట్టి ధైర్యము కొరకై ప్రార్ధించాను. బైబిలు అంటే భయం లేకుండా బహిరంగంగా అన్ని చోట్లకు తీసుకొని ప్రార్ధనా సమావేశాలకు వెళ్ళుటను బట్టి నా తల్లిదండ్రులు హిందూ మతాన్ని పోగొట్టుకున్నానని చాలా దు:ఖపడ్డారు. కారు మాట్లాడి తిరిగి విగ్రహాలను సేవించేరీతిగా నన్ను మార్చాలని తిరుపతి తీసుకొని వెళ్ళారు.

మా తల్లిదండ్రులకు భయపడి తలనీలాలు మ్రొక్కుబడిగా నిచ్చి విగ్రహాలదగ్గర నిలిచిననూ పూర్తిగా యేసునే ధ్యానించాను. కాళహస్తిలో కూడా అట్లే చేసాను. ఆ తర్వాత దైవజనుడైన డేవిడ్‌రాజు గారు నాకు పరిచయమయ్యారు. ఆయన బోధనలు నన్ను ఆకర్షించాయి.

అపొస్తులు 13:50 "పౌలు బర్నబాకు హింసకలుగజేసాడు".
ప్రకటనలు 7:14 "వీరు మహాశ్రమలనుండి వచ్చినవారు".

ఈ వాక్యాలలో క్రైస్తవ విశ్వాసులకు శ్రమలు తప్పవని గ్రహించాను. దైవజనులు కొన్నిసార్లు యింటివారే శ్రమలపాలు చేస్తారు, ఆత్మరక్షణను కాపాడుకోవాలి, ప్రభువునే తప్పక వెంబడించాలని నేర్పించారు. నా తల్లిదండ్రులతో సూటిగా ధైర్యంగా "నేను క్రీస్తునే నమ్ముతాను. విగ్రహాలకు మ్రొక్కను" అని చెప్పాను.

బైబిలు నేను చదువుట చూడకూడదని నా బైబిలు కాలేజికి వెళ్ళు దారిలో ఒక బార్బర్ షాపులో చాటుగా దాచిపెట్టుకొని రైలు ప్రయాణంలో శ్రద్ధగా చదివేవాడిని. నా పరిస్థితి చూచి నా స్నేహితులు, లెక్చరర్స్ నాకు మతపిచ్చి పట్టినదని దూషించేవారు. నాకు ఆ దేవుడే మనశ్శాంతినిచ్చాడని సాక్ష్యము తెల్పాను. నాకు కనబడి సూటిగా మాట్లాడారు. క్రీస్తు సజీవుడని చెప్పిననూ నమ్మలేదు. నేను నమ్మిన నా ప్రభువు బాప్తీస్మము తీసుకోవాలని హెచ్చరించారు. నాకు ఆలోచన చెప్పి ఆచరించుటకు ప్రోత్సహించాలని దైవజనునితో కూడా నా ప్రభువు కన్పించి చెప్పారట. నా పరిస్థితి నా తల్లిదండ్రులకు తెలిసి కోపంతో

మండిపడ్డారు. మనము భారతీయులము, స్వేచ్ఛాజీవులమని తెల్పాను.

1981వ సంవత్సరములో గుంటూరు సమీపాన సత్తెనపల్లి చేరాను. ఎమ్.ఎస్.సి.లో సీటు రానందున బ్యాంకు పరీక్షలు వ్రాయగా ఇంటర్వ్యూలో అపజయం ఎదురయ్యింది. సైతాను శక్తులతో పోరాడవలసి వచ్చేది. చిన్న ఉద్యోగిగా స్థిరపడాలని ఆశతో ప్రార్థించాను. చెరసాలలోనున్న భావం కల్గేది. ఆ రోజుల్లో హెబ్రోను సహవాసంలో పెద్దలైన అరవిందంగారు, బెంజమెన్‌గార్లతో ఆరాధన ప్రారంభించాము. భక్తసింగ్ గారిచే ఏర్పరచబడిన సంఘాలలో వాక్యపరిచర్య స్వచ్ఛమైనది. ఆత్మలకు ఊరట కల్గించేది గనుక నాకు ఆత్మీయంగా చాలా ఆనందంగా నుండేది. మా నాన్నగారికి గుండెజబ్బు వల్ల చాలా నీరసమయినందున నా గూర్చి పట్టించుకోని కారణంగా స్వేచ్ఛగా ఆరాధనలలో పాల్గొని ఆధ్యాత్మిక మేలు పొందగల్గాను.

ఒకసారి 1982వ సంవత్సరములో హెబ్రోను పత్రిక చదివాను. దేవుని చిత్తము కనుగొనుట గూర్చి అవగాహన కల్గింది. భక్తసింగ్ గారు ఎన్నో రోజులు ఉపవాసముండి దేవుని చిత్తాన్ని అతి స్పష్టంగా తెలుసుకొనేవారట. దేవుని చిత్తము తెలుసుకొనగానే ప్రజలయెదుట అద్భుతాలు చేస్తానన్నారట. నాతో ప్రభువు సూటిగా మాట్లాడారు. "బాబూ, నీపట్ల నా చిత్తమేమిటని ప్రార్థించావా?".

1979లో రక్షణానుభవము పొందగా 1982లో రక్షణలో స్థిరపడ్డాను. నన్ను ప్రత్యేకించి సేవకు పిలుస్తున్నారని ప్రభువు వాక్యం ద్వారా నమ్మాను. వెంటనే స్థానిక సంఘంలో సేవకు పిలుపువచ్చింది. ఆ రోజుల్లో మా నాన్నగార్కి మెట్టపల్లికి బదిలీ అయింది. ఆరోగ్యము కుదుట పడింది. ఒకరోజు నాన్న నన్ను పిలిచి తీవ్రంగా మందలించారు. "ఇదిగో చూడు, నీవు హిందువుగా జీవించాలి. క్రైస్తవుడనని చెప్పుట యిష్టపడను. రహస్య క్రైస్తవునిగా చర్చికి వెళ్ళరాదు. నా తలకొరివి పెట్టాలి" అన్నారు.

బైబిలులో లేని పనిని నేను చేయలేనన్నాను. కుమారుడు పున్నామ నరకం నుండి తప్పించేవాడు అని బెదిరించారు. నేను ధైర్యంగా వ్యతిరేఖించాను. నన్ను మా చిన్నాయన దగ్గరకు పంపారు. అక్కడ క్యాషియర్‌గా కొంతకాలము పనిచేస్తూ కరీమునగర్‌లో దైవారాధనలలో పాల్గొన్నాను. భక్తసింగు గారి రచనలంటే చాలా యిష్టంగా వుండేది. అవి నా జీవితంలో మంచి ప్రభావాన్ని కల్గించాయి.

ప్రతి చిన్న విషయానికి భక్తసింగు గారు దేవునిని ప్రార్థనలో సంప్రదించేవారట. తలజుట్టు, గడ్డం పెరిగింది ప్రభువా బార్బర్‌షాపుకు వెళ్ళనా అని అడిగితే 3 రోజుల వరకు

వెళ్ళవద్దని చెప్పి, ఒకరోజు నీవు వెళ్ళు అని తెల్పగా ఆ మంగలివానితో మాట్లాడి రక్షణ పొందావా అని ప్రశ్నించి సువార్త బోధించారట. యిద్దరూ అక్కడే నేలపై మోకరించి దేవున్ని స్తుతించారట.

1983 జూన్ నెలలో అర్ధరాత్రివేళ ఒకస్వరం విన్పించింది. "వెంటనే లేచి గలతి 1:15చదువుకో" అని స్వరంతో తెల్పారు.

గలతి 1:15 "తల్లి గర్భము నందు పడినది మొదలుకొని నన్ను ప్రత్యేకపరిచి తన కృపచేత నన్ను పిలిచిన దేవుడు నేను అన్యజనులలో తన కుమారుని ప్రకటింపవలెనని" యిదే దేవునికి నా పట్ల గల అభిలాష అని నమ్మాను.

ఆ రోజుల్లో నా జీవితంలో జరిగిన మరొక అద్భుత మేమనగా మాకు సమీపంలో ఒక డాక్టరుగారుండేవారు. గోదావరి ఖనిలో సేవకునికి, భక్తసింగ్ గారికి నేను వ్రాసిన ఉత్తరము, డాక్టరు గారు పెద్దలు మా నాన్న గార్కి తెలియజేయగా అప్పుడు నాకు ఉద్యోగము వచ్చిందని నాన్న తెలుసుకొని నాన్నతో నాకు సంబంధము లేదని, మరొకరిని దత్తత తీసుకుంటానని, ఆస్తిలో నాకు వాటా వద్దు, దత్తతకు సమ్మతమేనని నాతో కాగితంపై వ్రాయించారు.

"నేను హిందూ ఆచారాలు చేయలేను. క్రీస్తును నమ్మానని తెల్పాను. నేను చచ్చిన వానితో సమానమని ఎంచి వెళ్ళిపోయారు. మా అమ్మ చాలా ఏడ్చింది. నాకు దైవసేవకునికి సహాయపడే ఉద్యోగము ఏదనగా మందిరములో చెప్పుల స్టాండు నిర్వహించుట, సున్నము కొట్టుట మొదలగు పనులు నాకు అలవాటు యిష్టతగా మార్చుకున్నాను.

ఒక రాత్రి నాకొక కలవచ్చింది. "నీకు ఇన్సురెన్స్ కంపెనీలో ఉద్యోగము వస్తుంది. కాని అంగీకరించవద్దు. అది దేవుని చిత్తముకాదు". ఆ ఉదయాన్నే కవరు అందుకున్నాను. నాతోటి సేవకులంతా వెళ్ళి ఉద్యోగం చేస్తూ సేవ చేసుకోమన్నారు. ఇంటర్వ్యూకి వెళ్ళగా ఒకే ప్రశ్న వేసారు. ఒక్కడే కుమారుడివి కద! కుమారుని ప్రాముఖ్యత ఏమి? అది నా సాక్ష్యము చెప్పుటకు అవకాశం కల్గించింది. కేవలము కుమార్తెలున్న తల్లిదండ్రుల పరిస్థితి ఏమి? అని తెల్పాను.

ఉద్యోగం చేసి వారిని ఆదోకోవట్లేదన్న వేదనతో నున్న నా తల్లి కన్నీరు నన్ను కలతపెట్టింది. కనబడే దేవుళ్ళము మేమేకదా! అనగా తల్లికి లోబడితే దేవునిని దు:ఖపర్చాలి. ఆ సమయంలో మరొకసారి స్వరము వినిపించింది. తల్లి కన్నీరు గొప్పదా? నేను కార్చిన

కన్నీరు గొప్పదా? తల్లిని గౌరవిస్తూ నన్ను సృష్టించింది దేవుడు. ఆయన నా రక్షకుడు. నాపై రెట్టింపు అధికారము క్రీస్తుకే ఉంది అన్నాను.

1983 సెప్టెంబరు 24వ తేదీ నా యిల్లు విడిచి బస్సు ఎక్కి గోదావరి ఖని చేరాను. నా తండ్రి హృదయము ఫరోవలె కఠినము చేస్తున్నట్లు ప్రభువు చెప్పి ధైర్యపర్చారు. బాధ, ఆదరణ రెండు అనుభవించాను. మోషెకిచ్చిన వాగ్ధానాలన్నీ నీలో నెరవేరుతాయని అభయమిస్తూ స్వరంతో మాట్లాడిన క్రీస్తు నా ప్రభువు. సంపూర్ణ సేవకు నా జీవితాన్ని నా ప్రభువుకే అర్పించుకొని 8 నెలలు తర్ఫీదుపొందాను.

సైతాను శోధించుటకు మా చిన్నాననుపయోగించి, సేవ వదిలినచో తన ఆస్తిలో సగమిస్తానన్నాడు. నేను హెబ్రోనుకు వెళ్ళి సేవచేయాలని మరలా స్వరము విన్నాను. ఆ తర్వాత సి.టి. బెంజిమెన్‌గారు ఆగస్టు 15వ తేదీ యువకుల మధ్య నా సాక్ష్యము చెప్పమన్నారు. మీర్జాల గూడాలో, ఖమ్మం, భద్రాచలంలో సేవలో పాల్గొన్నాను. పల్లెటూరులో తిరిగి సేవచేసాను. 1 1/2 సంవత్సరము దొంగల మధ్య సేవచేసి మణుగూరు చేరాను.

దేవుని చిత్తం ద్వారా మలక్‌పేట దైవ సేవకుని కుమార్తె సంబంధము నాకు వచ్చింది. కాని నా తల్లిదండ్రి హిందూ పెండ్లి చేస్తామన్నారు. ఆస్తి యిస్తామన్నారు. అన్నీ వదులుకొని 1990 ఏప్రిల్ 4వ తేదీ హెబ్రోనులో భక్తసింగ్‌గారి ఆర్ధ్వర్యాన ఘనంగా పరిశుద్ధ వివాహము చేసుకున్నాను. మాకు దేవుడిచ్చిన ఇద్దరు కుమారులకు భక్తుల పేరు పెట్టుకున్నాము. జాన్‌బన్యను, డేవిడ్ బ్రయినార్డ్‌లు నా కుటుంబంతో కలసి ఆయా ప్రాంతాలలో ఆత్మల జాలరిగా ప్రభుని సేవలో ఆనందిస్తున్నాను.

యీ సాక్ష్యము చదివే మీరంతా పరలోకవారసులు కావాలి. రక్షణానందం పొందాలి. దేవుడు పరిశుద్ధుడు. ప్రేమా స్వరూపి. స్వరంతో మాట్లాడి ఆయన చిత్తం నాకు తెలిపినట్లు మీతో మాట్లాడగలరు. ఆయనను ఆశ్రయించి మేలు పొందండి ఆమెన్.

No Cross, no Gain

No Cross no Throne

Cross bearers are Church builders.

--------------------

## 18. సత్యము తెలుసుకొనే ఆశగలవారికి దేవుడు దగ్గరగా వుంటాడు అని తెలుసుకొన్నాను

నగేష్ – ఇనోష్ పాల్

కీర్తనలు 27:10 "నా తల్లిదండ్రులు నను విడిచినను, యెహోవా నన్ను చేరదీయును".

**పరిచయము :–** నా పేరు నగేష్. సనాతన హిందూ సాంప్రదాయం మా తల్లిదండ్రులు నిత్యము పూజలు చేస్తూ, వేదాలు నేర్చుకొనే వంశంలో బాల్యము గడిపాను. చదువుకొనే రోజుల్లో కూడా ఖాళీ సమయాల్లో మా మతగ్రంధాలన్నీ అతి భక్తితో చదువుకొనేవాడిని. జాతకాలను నమ్మిన మా నాన్న నా జాతకమును బట్టి నన్ను నష్ట జాతకుడవని బాధించేవారు.

మాది మధ్యతరగతి కుటుంబము. చిన్న ఆయుర్వేదమునకు సంబంధించిన వ్యాపారముచేసే నాన్న నిరాధరణ వల్ల నాలో ఆత్మసూన్యతాభావము పెరిగిపోయింది. అలా నేను పెద్దవాడనైన తరువాత యింట్లో నివసించుటకిష్టపడక నా ముగ్గురు సోదరీమణులకు, తల్లి దండ్రులకు దూరమై హైదరాబాదులో చిన్న ఉద్యోగాన్ని ఆరంభించాను. నా ఖర్చులకు సరిపోయేది గాని కాస్త అదనపు ఖర్చుకు ఇబ్బందిగా నుండేది. నా అతీగతీ పట్టించుకోని స్వంత తల్లిదండ్రులకు నా బాధలు చెప్పుకొనే అవకాశము లేనందున చాలా వంటరితనంతో దు:ఖపడేవాడిని.

నా స్నేహితులంతా నా పరిస్థితికి ఆశ్చర్యపడేవారు. కనీసం నా సోదరీల ప్రేమైనా లభిస్తుందని ఆశించగా నేనెంతో గొప్ప ఉద్యోగము చేస్తూ జల్సాగా జీవిస్తూ తల్లిదండ్రులకు డబ్బులు పంపక తప్పించుకొని నిర్లక్షంగా తిరుగుచున్నానని దూషించేవారు. నాలో దైవాన్వేషణ, తపన, పుస్తక పఠనము, ఒంటరి జీవితంలో నాకు ఆదరణనిచ్చేవి. ప్రతి మతగ్రంథమంటే మక్కువగా నుండి విరామ సమయాలలో వాటిని చదువుతూ గడిపేవాడిని.

నన్ను ఎవరూ అడిగేవారు లేనందున నా యిష్టము వచ్చినట్లు సినిమాలు చూస్తూ, వింత అలవాట్లతో గడిపేవాడిని. దేవుళ్ళను గూర్చిన కథలు, సినిమా కథలు నాతోటివారికి చెబుతూ వారు నాతో కబుర్లు చెప్పించుకొని ఆనందిస్తూ వుండుటవల్ల నాకు కాలము తేలిగ్గా గడిచిపోయేది. కాని నా వాళ్ళు నాకెవరూ దగ్గరగాలేరే నన్న బాధ నన్ను విపరీతంగా

బాధించిన సమయాల్లో దగ్గరగా నున్న ఏదో ఒక పుస్తకం తీసి చదివే అలవాటు వుండుటవల్ల, నా దగ్గరున్న క్రైస్తవులుపయోగించే మత గ్రంథమైన బైబిల్ తీసి చదవాలని తోచింది.

కీర్తనలు 139:2,3 "నాకు తలంపు పుట్టకమునుపే నీవు నా మనస్సు గ్రహించుచున్నావు. నా చర్యలన్నిటిని నీవు బాగుగా తెలుసుకొనియున్నావు."

కీర్తనలు వ్రాసిన భక్తుని మాట యదార్ధమని క్రీస్తును నమ్మిన తర్వాత గ్రహించాను. అకస్మాత్తుగా తెరచిన బైబిల్‌లోని మాట చూచి ఉలిక్కిపడ్డాను. ఆ తర్వాత ఆశ్చర్యపడి ఆసక్తితో పదే పదే చదివాను. ఆ మాటను అట్టపై వ్రాసుకొని నా గదిలో తగిలించి అలా నేను విపరీతంగా అభిమానించిన గొప్ప మాటల్ని ధ్యానించుట నా దినచర్యగా మారింది. నా ఆలోచన నా గతిని ఆలాగున మార్చింది. బైబిల్ గ్రంధకర్తను ప్రేమించి ఆరాధించి అనుసరించే ధన్యత నిచ్చింది. నాకు జన్మనిచ్చిన తల్లిదండ్రులైనను నాకు కావలసిన మానసికానందం కరువైన రోజుల్లో అనామకంగా ఒక వాక్యము నా జీవితాన్ని తారుమారు చేయుట నాకే వింతగా తోచింది.

అది నన్ను గర్భంలో పిండముగా నుండగా చూచిన సృష్టికర్త ఆలోచన కద! ఆశ్చర్యకరుడు, సమాధానకర్త చివరకు నా స్వంత రక్షకుడై నాకు మార్గము, జీవమై నన్ను నడిపించి తన ప్రేమతో నన్ను ముంచివేశాడు. హల్లెలూయ.

బైబిల్ వాగ్ధానాలన్నీ వరాలమూటలు. బైబిల్ వాక్యము రెండంచులు గల ఖడ్గము. అది తరగని ధననిధి. అమూల్య సంపద. దాగిన గని. వేలాది ఆశీర్వాదాలకు మూలమై, ఊటయై, తల్లిదండ్రియై యున్నదని గ్రహించాను. ఆ వాక్యమే నన్ను బ్రతికించి బాధలలో ఓదార్చి నెమ్మది నిచ్చింది.

కీర్తనలు 27:10 "నా తల్లిదండ్రులు నన్ను విడిచినను యెహోవా నన్ను చేరదీయును".

ఎవరీ అభయాన్నిచ్చే గొప్ప దేవుడు? అని ఆలోచించుట కారంభించాను. అది వాగ్ధానమని తెలియదు. ఆదరిస్తాడా? అని నమ్మి ధైర్యము తెచ్చుకున్నాను. ఒకసారి నా పుట్టినరోజు వచ్చిన సందర్భంగా మంచి బట్టలు కొనుక్కొని స్నేహితులతో పార్టీ చేసుకుని ఆనందించాలని చాలా ఆశించాను. నా దగ్గర తగినంత సొమ్ములేదు. ఎందుకో బైబిలు చదవాలనే ప్రేరేపణ కల్గింది. తెరిచి చూచిన వెంటనే నీవు అనేకులకు అప్పు యిస్తావు గాని, అప్పు చేయవు అనే వాగ్ధాన వాక్యము కన్పించింది. ఎంతో సంతోషించాను. ఆ మాటలన్నీ బాగా నమ్మాలనిపించేది.

దేవున్ని ఆరాధించు సంఘము, సహవాసమనగా నాకేమీ తెలియదు. ఎలాగైనా తెలుసుకోవాలనే తపనతో అన్వేషించాను. ఒకసారి మా అక్కయ్య ఆహ్వానించగా బొంబాయి వెళ్ళాను. వారి యింటి సమీపంలో పెంతుకొస్తు సంఘమున్నందున, లోనికి వెళ్ళి చూడగా అందరూ మళయాళీ సభ్యులు, పాస్టరు గారు కన్పించారు. ఆయన మాటలు ఎందుకో పరిశుద్ధాత్ముని సహాయము వల్ల అర్థమగుట ద్వారా దేవుడు ప్రతి వ్యక్తిని దర్శించగలడని బోధించినట్లు నాకు తెలిసి చాలా ఆనందించాను.

నా ఉద్యోగస్థలంలో నా అధికారితో, నాతోటివారితో గతంలో సినిమా కథలు, అన్యాచారంలో నేర్చుకున్న వేదాంతసత్యాలన్నీ ఆసక్తితో వివరించుట పరిపాటి. నా దగ్గర వారికి ఆహ్లాదకరంగా సమయము గడిచేదని తెల్పిన వారంతా ఇప్పుడు నేను నా రక్షకుడి గూర్చి, ఆయన ప్రేమగల వాగ్దానాలను గూర్చి బైబిల్ సత్యాలన్నీ బోధిస్తున్నానని చాలా విసుగుతో, చిరాకుపడసాగారు. అక్క, బావ, స్నేహితులు నా ఆలోచనలను వ్యతిరేకించి, విమర్శించి నిరాదరణ చూపుట నాకు చాలా బాధకల్గించేది.

నా పరిస్థితి గమనించిన నా అధికారి నన్ను పిలిచి నగేష్, గతంలో ఎవరికీ అర్థము కాని రామాయణము, భగవద్గీతలోని వివరణ చెప్పేవాడివి కదా! నేడు క్రీస్తు మంచి రక్షకుడు, ప్రేమామయుడు, అభయమిచ్చి ఆదరించే వాడన్న గొప్ప మాటలన్నీ బైబిలులోనున్నాయని చెప్పుచున్నావు. నీ నమ్మకాలన్నీ తారుమారైనవేమి? అని ప్రశ్నించారు.

"అయ్యగారండీ, మన దేవుళ్ళంతా పాపులను శిక్షించడానికే అవతరించారు గానీ, పాపులను ప్రేమించి రక్షించడానికి, పరలోకం ప్రసాదించడానికి క్రీస్తు ఈ లోకంలోనికి వచ్చి మంచి మాటలు చెప్పారు. నేనే మార్గం, సత్యం, జీవము అన్నారు. ప్రయాసపడి భారము మోసేవారంతా నా దగ్గరకు రమ్మని ఆప్యాయంగా ఆహ్వానిస్తూ విశ్రాంతినిస్తానని అభయమిచ్చారు. నాకా మాటలు నచ్చాయి. నాకు గొప్ప నమ్మిక కల్గించాయి.

నేను క్రీస్తునే నమ్ముతాను అని ధైర్యంగా తెల్పాను. మంచి విలువలున్న మంచి సుబోధలు తెల్పు సంఘము కోసం అన్వేషించాను. ఆయనపై అపారప్రేమ ఉప్పొంగగా వాక్యాన్ని చాలా ఆసక్తితో చదువుచు గొప్ప విశ్వాసముతో సాగిపోయాను. నమ్మినవారు బాప్తీస్మము నీటిద్వారా, అగ్ని ద్వారా పొందవలసిన ఆత్మాభిషేకము గూర్చి పాస్టర్లు వివరించగా లేఖనాలు పరిశోధించి స్థిరపడిన నమ్మికతో బాప్తీస్మము పొంది సంఘములో మంచి సభ్యునిగా జీవించాలని ఆశించాను.

నాకది సాధ్యమా? అని ఎలా సిద్ధపడాలో ప్రార్థించాను. వాక్యము ద్వారా క్రీస్తు నాతో మాట్లాడారు. “దత్తపుత్రాత్మనిచ్చాను కుమారుడా! సంశయించుట ఎందుకు? బాప్తీస్మం తీసుకో”మని హెచ్చరించారు. స్థానిక పాస్టరుగారిని సంప్రదించగా యేసునామములో రక్షింపబడిన  వ్యక్తులకు బాప్తీస్మం యిస్తాము గనుక నీవు సిద్దంగా వుంటే యిస్తాము అని చెప్పిరి. తద్వారా 2011వ సంవత్సరము జూన్ నెలలో బాప్తీస్మము పొందుట ద్వారా ఆయన ఆత్మను పొందాను. ఆత్మీయంగా బలపడుచున్న కొలది ఆత్మ ఫలాలు ఫలించాలి, అవి నిలిచి ఉండాలనే ఆకాంక్ష నిరంతరము నాలో నిలుపుకున్నాను.

లోతైన మర్మాలతో యిమిడిన దేవుని వాక్యాలు, వాగ్దానాలు గ్రహించే ఆధ్యాత్మిక వివేకాన్ని పొందుట ప్రభువే స్వయంగా నాకు నేర్పించారు. క్రీస్తు నా పట్ల చూపిన ప్రేమ అవధులు లేనిదని గ్రహించాను. నేను గతంలో నమ్మిన, పూజించిన విగ్రహాలన్నీ పడద్రోయబడినవేనని నమ్మిన నేను నా స్వకీయులంతా వాటిని యిష్ట దేవతలుగా ఆరాధించుటను బట్టి నొచ్చుకొని ఎంతో భారంతో వారందరికొరకై ప్రార్థిస్తున్నాను. ఎవ్వరూ నాకై ప్రయాసపడి రక్షణ కార్యం జరుగుటకు బోధించలేదు గాని బైబిల్ వాక్యమే నన్ను రక్షించింది. బాధలలో ఒంటరి తనంలో గొప్ప ఆదరణ, నెమ్మదిని అందించింది.

ఆయన నాపై చూపిన ప్రేమకు ప్రతిగా నేనేమి యివ్వగలను? రక్షణపాత్ర చేబూని దేవుని కృపకై వినయంతో వేడుకుంటున్నాను. నాకు క్రీస్తు అందించిన గొప్ప శాంతి చెప్పనశక్యమైన ఆనందము సంతృప్తి నా స్వకీయులంతా పొందాలని వారు లేకుండా నేనొక్కడినే పరలోకం సంపాదించినట్లైన నాకేమి లాభము? వారందరి రక్షణకై చదువరులంతా ప్రార్థించాలని సవినయంగా కోరుచున్నాను.

మనమీస్థితిలో నుండుటకు కారణము దేవుని ఉచితకృపయేనని నా నమ్మకము. ఎల్లప్పుడు దేవుని ధ్యానిస్తూ పరిశుద్ధుల సహవాసంలో నుండాలనే ఆశ ఎన్నటికీ దూరము కారాదు. ప్రతిచోట ప్రభువునకు సాక్షులముగా ఉందామా! ప్రభువు దీవెన సదాకాలం మనతో ఉండుగాక. ఆమెన్.

-------------

# 19. యేసులోనే నెమ్మది, మనశ్శాంతి లభిస్తుందని తెలుసుకొన్నాను

– కోన అబ్రహాము (ఉయ్యూరు)

**1యోహాను 1:7“యేసు రక్తము ప్రతిపాపము నుండి మనలను పవిత్రులుగా చేయును”**

**పరిచయము :–** భారత దేశంలో ఒరిస్సా రాష్ట్రములో కొరాపుట్ జిల్లాలో చిన్న గ్రామమైన ఒనుకి ఢిల్లీ ఉంది. ఆ ప్రాంతములో వివిద రకాల ప్రజలు నివసిస్తూ చాలా భాషలు మాట్లాడేవారు. ఆ ప్రదేశములోని అందమైన ప్రకృతిలో పలుజాతి పుష్పాలు ఉండి ఆహ్లాదం కల్గించేవి. అక్కడ వర్షము, చలి ఎక్కువగా నుండేది.

నా తల్లిదండ్రుల పేర్లు శ్రీ కోన పూర్ణచరంద్రరావు గారు, శ్రీమతి సుబ్బలక్ష్మి గారు. పూజారుల వంశములో జన్మించినవారు అన్యులైన వారి సాంప్రదాయాలు పాటించేవారు. నా అసలు పేరు కోన వెంకట రామ కోటేశ్వరరావు. మా ప్రాంతంలో కులం, జాతి, మతం తేడాలు తెలియకుండా అన్ని పండుగలు కలిసి చేసుకొనేవారము. మా నాన్నగారు మాఛ్ ఖండ్ జలవిద్యుత్ కేంద్రములో ఉద్యోగము చేసేవారు. నా బాల్యములో మా యింట్లో దయ్యాలుండేవని మాఅమ్మ నమ్మేది. ఎందుకనగా ఉయ్యాలలో నున్న నన్ను ఎవరూ ఊపకుండానే ఊగేవాడినట. ఒక్కొక్కసారి మంచం క్రింద పండుకొనుట చూచి ఆశ్చర్యపడేదట. ఆ యిల్లు మార్చేసారు.

నాకు 4 సంవత్సరాల వయస్సులో బల్బు గుండ్రంగా తిరిగేదని యింటిప్రక్కల వారికి చెప్పగా సాల్మన్ గారు బెబర్తా గారు, యిరుగు పొరుగు వారు, మా అమ్మ దగ్గి రమ్మని చెప్పిన గుర్తునుబట్టి ఆ స్థితిచూచి దయ్యమని పరుగెత్తారట. ఆ తర్వాత మా యింటి ఎదురుగా నున్న రాబర్టుగారు, మరియమ్మ గారు క్రీస్తును నమ్మిన విశ్వాసులైనందున వారువచ్చి “మా యేసుప్రభువు బలమైన దేవుడు. ఆయనను వేడుకుంటే దయ్యము వెంటనే పారిపోతుందని” చెప్పారు. వారు చెప్పుట మాత్రమేకాదు బైబిల్ యిచ్చి చదవాలని తెల్పారు.

మూడు రోజులు ప్రార్థించి చూడమనగా మేము వాక్యము చదివి ప్రార్థించాము. మంచముమీద తలదగ్గర బైబిల్ పెట్టుకున్నాము. భక్తిగల క్రైస్తవ బిడ్డల సలహా చాలా విలువైనది గనుక మా అమ్మకు కలలో దయ్యము కన్పించింది. అది ఎత్తైన నల్లని

దిగంబరాకారముగా నుండి గుమ్మము వద్ద నిలిచి "ఏమ్మా, నీ దేవతల వలన కాలేదని పరాయి దేవుడిని ఆశ్రయించి నన్ను బయటకు పంపుతావా? నీ సంగతి చెప్తాను. నేను యిక్కడే వుంటాను చూడు" అని సవాలు చేసింది. అయినను దేవుని శక్తి దయ్యాల శక్తికి మించినదైనందున బల్బు తిరుగుట ఆగింది. అనగా యేసుప్రభువు మా గృహాన్ని దర్శించాడని నమ్మాము. తర్వాత అపనమ్మకము వల్ల తిరిగి బైబిల్ మరియమ్మ గారికి యిచ్చేసాము. చిన్నప్పటినుండి అన్య దేవతలపై భక్తితో నన్ను అమ్మ పెంచినందున శ్లోకాలు, స్తోత్రాలు, మంత్రాలు దండకాలన్నీ నేర్చుకున్నాను.

దైవభక్తి పాపభీతి నాలో ఎక్కువగా నుండింది. భగవద్గీతలో నున్న శ్లోకము అర్థము చక్కగా అనుష్టింపబడిన పరధర్మము కన్న గుణహీనమైన దైనను స్వధర్మమే మేలు. పరధర్మము భయంకరమైనది. భయంకరమైనదని భయము కలుగగా నేనెందుకు భయపడాలి? అందువల్ల 10వ తరగతి చదవక మునుపే చర్చలకు, మసీదులకు వెళ్ళి వారేమి చేస్తున్నారో చూచేవాడిని.

**విద్యాభ్యాసము, ఉద్యోగము, వివాహము:–** నేను 10వ తరగతి పాసైన తరువాత కాలేజీ విద్యకై గరివిడి గ్రామము, ఆంధ్రప్రదేశ్‌లో చేరాను. ఇంటర్మీడియట్ చదివే రోజుల్లో మార్క్సిస్టు సిద్ధాంత ప్రభావము వల్ల, చదివే ఆలోచన, సంకేతం వంటి విప్లవసాహిత్యము చదివి మావోసిద్ధాంతాలు నమ్మను. 1982లో నక్సలైట్‌తో పరిచయమైంది. ఆయనతో కలిసి చాలా మీటింగ్స్‌కి వెళ్ళేవాడిని. 1983లో శ్రీకాకుళం వెళ్ళమని పట్టాభి చెప్పగా మా లెక్చరల్ శ్రీ త్రిలోకనాథ్ గారు వెళ్ళవద్దన్నారు.

**యిర్మియా 1:6 "తల్లి గర్భములో నుండగా నన్ను రూపించారని నమ్మిన స్థితిలో లేను గాని ఆయనే నన్ను భయంకర స్థితి నుండి తప్పించారు"**

డిగ్రీ పూర్తయిన వెంటనే నాన్నగారు మరణించారు. ఒక తమ్ముడు, చెల్లెళ్ళిద్దరి భారం నాపై పడింది. అరణ్యములో ప్రయాణము చేసిన బాధ మిగిలింది. మా ఉపాధ్యాయులలో షిరిడి సాయిని పూజచేసే మాష్టారిని ఆశ్రయించాను. జోస్యం చూపించుకున్నాను. ఒకరు నన్ను నిత్య దరిద్రులన్నారు, మరొకరు దివ్యంగా ఉందన్నారు. ఆ తర్వాత నాకు ఉద్యోగం లభించింది.

1986లో జోతిష్యంపై ఆశక్తి కల్గి ఆకోండి రామారావుగారి వద్ద ఆ విద్యను నేర్చుకొని 12 సంవత్సరాలుగా అనేకులకు జాతకాలు చెప్పేవాడిని. ముహూర్తాలు, వాస్తు తెల్పేవాడిని. నా తమ్ముడు 14 సం॥రాల వయస్సులో నున్నప్పుడు నాన్న మరణం ద్వారా

మతిచెడి యిల్లువదలి వెళ్ళిపోయాడు. ఆ తర్వాత నా మేనమామ కుమార్తె మాధవితో నా వివాహైనది.

1990లో కుమార్తె, 1992లో కుమారుడు జన్మించారు. విశాఖ బదిలీ చేయించుకొని స్థిరపడ్డాను. గొప్పవాడిని కావాలనే ఆశ ఉండేది. ఆ తర్వాత అత్తగారి ఊరు భువనేశ్వర్ వెళ్ళాను. ఆ ప్రాంతంలో నున్న రోజుల్లో ఒక కల వచ్చింది.

**క్రీస్తుతో పరిచయము:–** క్రీస్తు నాకు కలలో వ్రేలాడుచూ కన్పించారు. ఆ రోజుల్లో అతను క్రీస్తని తెలియదు. చేతులలో చీలలు, కాళ్ళలో చీలలు. శరీరమంతా రక్తసిక్తము, తలపై ముళ్ళకిరీటము, విప్పారిన నేత్రాలతో నాపై దీనంగా అతిప్రేమతో చూస్తున్న రక్తంతో నిండిన ముఖం చూచాను. ఆయన ఎవరని మా పెద్దమ్మను అడిగినప్పుడు యేసు ప్రభువు అని చెప్పింది.

2 నెలల తర్వాత మరలా అదే స్వప్నం కన్పించింది. మా పెద్దమ్మ అప్పటికి 15 సంవత్సరాలకు పూర్వమే ప్రభువును నమ్మింది. “పెద్దమ్మా, మా పరువు తీసి నీవా మతంలో చేరావు, మా ఆంజనేయుడు తోకతో కొడితే మీ యేసు సముద్రంలో పడిపోతాడు సుమా! అని వాదించాను. యోగి అయిన యేసును గూర్చి విన్నాను. మా తమ్ముడు గతంలో ఒక బైబిల్ యిచ్చినపుడు రెండు వాక్యాలు నేర్చుకున్నాను.

**మత్తయి 7:7 “ప్రయాసపడి భారము మోసుకొనుచున్న సమస్త జనులారా, నా యొద్దకు రండి మీకు విశ్రాంతిని కలుగజేతును**”

యేసు ఫారిన్ వాళ్ళ దేవుడని, మాకు వేరేవారెవ్వరూ చెప్పనవసరము లేదని తలంచేవాడిని. ధాన్యపు గింజ మొన పరిమాణములో నున్న తేజో సంబంధమైన దేవుడు నీతల మధ్యభాగంలో నివసిస్తాడనియు నీలోనున్న దేవుడిని నీవు చూడలేనప్పుడు పరలోకంలో నున్న దేవుడిని ఎలా చూపించగలరని వాదించేవాడిని. నాతో మాట్లాడే వారిని అల్పవిశ్వాసులుగా మార్చేవాడిని. పెద్దమ్మతో ప్రార్థన చేయించుకోవాలని వచ్చిన వారిని నా మాటలతో మార్చేసాను.

మా పెద్దమ్మ చాలా బాధపడి నాకోసం ప్రార్థించేది. పెద్దమ్మ ఒరిస్సా రాష్ట్రంలోని పూరీలో నుండేది. వాళ్ళ మనవడి పుట్టిన రోజున యింటిలో ప్రార్థన పెట్టుకున్నది. అదే రోజు నాకు కూడా పుట్టినరోజయినందున ఒక మూలకుర్చున్నాను. నా మంత్రాలు ధ్యానించుచుండగా ఒక దర్శనం చూచాను. ఒక కొండ క్రింద బండరాయి తలుపువలె, తెరచుకున్నది. దాని వెనుక గుహ ఉన్నది. ఒక తెల్లని వ్యక్తి తెల్లని వస్త్రాలతో నన్ను

సమీపించి నా తలను తాకాడు. ఆ ఆకారము గాలిలో నడుచుట ఆశ్చర్యం కల్గించింది. నేను సబ్ కాన్షస్ స్థితికి 45 నిమిషాలు చేరాను. అందరూ పాటలు పాడుచూ, వాయిద్యాలతో వాయిస్తూ వుండగా నాకు మెళుకువ వచ్చింది. మా పెద్దమ్మతో చెప్పగా, ఆ యేసుప్రభువు పునరుద్ధానుడైన ఆకారములో నిన్ను దర్శించాడు రా అని చెప్పి చాలా ఆనందించింది.

శంకరాచార్యులు చెప్పినట్లు సద్గురువు సాక్షాత్కారము వలన జన్మరాహిత్యం లభిస్తుందని నేను ఎదురుచూస్తుండగా యేసు కన్పించాడని మా పెద్దమ్మ ఆనందిస్తుందేమిటీ అని తలంచాను. ఆ తర్వాత నాకు నర్సీపట్నం బదిలీ అయింది. నా స్నేహితుడైన రమేష్ గుప్తను కలిసి ఆ తర్వాత ఆ ఊరు వెళ్ళాలని తలంచాను. అక్కడ మరొక స్నేహితుడు క్రీస్తును గూర్చి చెప్పాడు. నా దర్శనము గూర్చి అతనికి చెప్పగానే, యేసయ్య మా కంటే మీకే దగ్గరగా నున్నాడని తెల్పాడు.

మీరు 15 రోజులు యేసును ప్రార్థించిచూడండి. మీ సమస్యలు, కష్టాలన్నీ తీరిపోతాయని తెల్పాడు. నాలో గర్వమున్నందున వెంటనే “నా కష్టాలు తీరడానికి నాకు యేసుక్రీస్తు అవసము లేదు గాని యేసుతప్ప నా కెవరూ దిక్కులేరు అన్న రోజున నేను ఆశ్రయిస్తానులెండి” అన్నాను. యేసు నన్ను, నా మాటల్ని గమనించాడని నాకు తెలియదు.

నాకు యేసు అక్కరలేదు, ఆయన అవసరము కూడా రాదని నాభ్రమ గనుక నిర్లక్ష్యముగా జవాబు చెప్పేసాను. నేను ఉద్యోగములో చేరి, ఆఫీసరుతో కలిసి ఒక గదిలోనుండగా ఒక దయ్యము కూడా మాతో నివసించసాగింది. ఒకరోజు మెట్లు దిగుచుండగా పెద్ద కొబ్బరి బొండాము పైనుండి పడుచుండగా ఒక తెల్లని హస్తము నన్ను ప్రక్కకు లాగి రక్షించింది. నా ప్రక్కగా పడిన బొండాము నా కాలి దగ్గర నిలిచింది.

దయ్యము నన్ను బాధించింది గాని ప్రభువు నన్ను కాపాడారని నమ్మకము కల్గింది గాని లక్ష్యముంచలేదు. నా కుటుంబ సభ్యులందరినీ నర్సీపట్నము తీసుకొచ్చాను. అన్య దేవతలను పూజించుట, గజపతిరావు గురువు వద్ద హ్యామచారిణి విద్య సాధనం చేయసాగాను. అప్పుడు ఒక స్త్రీ దర్శనములో కనబడి నా దగ్గరనున్న దూతలతో రేపు ఈ భక్తునికి సిద్ధి ప్రసాదిస్తున్నానని తెల్పింది.

అనుకోని రీతిగా నాకు 105 డిగ్రీల జ్వరము వచ్చినందున పూజ కొనసాగించలేదు లేనిచో మాంత్రికుడనై నశించిపోయి వుండేవాడిని. నాకు తెలిసిన జ్యోతిష్యమునుబట్టి సాయిదుర్గ జ్యోతిషాలయమని పేరున్న బోర్డుపెట్టి, ఉదయ సాయంకాలాలు జాతకాలు, వాస్తు, ముహూర్తాలు చెప్పుట కారంభించాను. కొందరికి దుర్ముహూర్తము చెప్పగా వారికి

మేలు జరిగిందని చెప్పేవారు. నాకు స్వయంగా నమ్మకము పోయి దానికి దూరమయ్యాను. కొంత ఆలోచన ఆరంభమయింది. నేను మరణించిన తర్వాత ఏ జన్మ నెత్తుతాను? గతంలో మా అమ్మ కార్తీక పురాణము చదివేది. దానిలో ఒక భాగంగా "ఈ బ్రాహ్మణుడు గత జన్మలో పాపముచేసి ఈ జన్మలో కుక్కగా పుట్టెను". నేను యిట్టి జన్మను తప్పించుకోవాలని అన్వేషణ కొనసాగించాను.

అనేక గ్రంథాలు, పుస్తకాలు చదివాను. అనేక శ్లోకాలు ధ్యానించాను. సత్యము ద్వారా తప్ప మోక్షము చేరలేము. సత్యమే ఈశ్వరుడు. అతనెవరు? బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులలో బ్రహ్మ అబద్ధమాడాడు. విష్ణువు మాయాస్వరూపి. మాయను జయించలేక పోయాడు. ఆ తర్వాత దుర్గా ఉపాసనము చేస్తుండగా విభూతి బొట్లు, మెడలో మాలలు వేసుకొన్న నన్ను చూచి నవ్వేవారు.

ఒకసారి దేవి భాగవతం పుస్తకముకొని చదివాను. అయినను మనశ్శాంతి లేక ఆత్మహత్యాప్రయత్నం చేసాను. హిమాలయాలకు వెళ్ళాలని ప్రయత్నించాను. ఏదో ఒక స్వరం విన్పించి ఆపేది. ఈ సత్యాన్వేషణ సమయంలో నా తల్లికి గర్భసంచి క్యాన్సర్ వచ్చింది. డాక్టర్లు పరీక్షించి 10 రోజుల్లో మరణించగలరని తెల్పారు. చాలా దు:ఖం కల్గింది. నాన్న, మామయ్య మరణించారు. తమ్ముడు యిల్లువదలి వెళ్ళిపోయాడు. మా అమ్మస్థితి దిగజారిపోయింది. ఇక నాకు దిక్కెవరని ఏడుస్తూ నిలిచాను. నేను నమ్మిన దేవతలెవరూ ఆదుకోలేదు. మనశ్శాంతి లేదు. నాకు దిక్కెవరు? అని తలంచాను.

**ప్రభువు స్వరము వినబడుట:–** ఏ దిక్కు లేదని తలంచుచు నిలబడియున్న నాకు మధురమైన మెల్లని స్వరం నా చెవిన తాకింది. "నీవు యేసుప్రభువును ఆశ్రయించు నీకు మనశ్శాంతి లభిస్తుంది" నాకు తెలియకుండానే ఆ స్వరానికి విధేయుడనయ్యాను. ప్రభువా, "నీవు నిజముగా దేవుడవైయుండి, నాకు మనశ్శాంతినిస్తే ఈ లోక సంబంధమైన జీవితాన్ని విడిచిపెట్టి నీకోసము జీవిస్తాను" గతంలో నాకే దిక్కు లేనపుడు నిన్ను ఆశ్రయించగలనులె అని గర్వంగా చెప్పిన సందర్భము జ్ఞాపకము వచ్చింది. నాకాస్థితి కల్గి యేసుకావాలని వినయంగా కోరాను. అందువల్ల అదే స్నేహితుని యిల్లుచేరి వారి సలహా పాటించ దలిచాను. ఆ యింట్లో సహోదరిగారిని అడిగాను. పార్వతిగారు బైబిలు అందించారు. చనిపోవుటకు సిద్ధపడిన అమ్మ, పెద్దచెల్లి దిగాలుగా కన్పించారు. నేను ప్రార్థించుట కారంభించాను. "ఓ యేసుప్రభువా, అడుగుడి మీ కివ్వబడునన్నావు. ఏమి అడగాలో నాకు తెలియదు. నాకు మనశ్శాంతిని ప్రసాదించు. ప్రయాసపడి భారము మోయువారందరికీ విశ్రాంతినిస్తానని వాగ్దానము చేసావు. నేను నమ్మి ప్రార్థిస్తున్నాను.

నాపై దయచూపు అని ప్రార్థించగానే ఎవరో నా భారమంతా తొలగించినట్లు ప్రార్ధన పూర్తి చేయుకముందే గొప్ప శాంతి నా హృదయంలో నిలిచింది. ఆ తర్వాత మా అమ్మ మరణించింది. నా బొట్టు, విభూది, మాలలన్నీ తీసివేసాను. నా జంధ్యం తీసివేయు సందర్భములో అపచారము కద! అని నా భార్య హెచ్చరించిననూ లక్ష్యపెట్టలేదు. నేను యేసుప్రభువునే కొలుస్తాను అని నిర్భయంగా తెల్పాను.

నా భార్య గొడవచేస్తుందని తలంచాను గానీ ఆమె నా విశ్వాసాన్ని అనుసరించింది. ప్రభువు కార్యాలు చాలా ఆశ్చర్యము కల్గించేవిగా గ్రహించాను. మా పెద్దమ్మ నమ్మిన క్రీస్తునే నా భార్య గత 10సంవత్సరాలుగా నమ్మి సేవిస్తూ పూజలు మానివేసి ప్రార్ధన చేస్తున్నానని తెల్పింది. మా అమ్మచే చెంపదెబ్బలు తిన్నదట. ఆమె నాకోసం ప్రార్ధన చేసేదట. ప్రభువు నమ్మదగిన దేవుడని గ్రహించాను. ఏదైనా క్రైస్తవ మందిరానికి వెళ్ళి మరిఎక్కువగా క్రీస్తును గూర్చి తెలుసుకోవాలని ఆశించి నా స్నేహితుడైన రాజకుమార్‌ను సంప్రదించాము. మీరు కనిపెట్టి దేవునిసన్నిధిలో గడపండి. ఆయనే సర్వ సత్యములోనికి నడిపంచే వరకు ఎదురుచూడండని చెప్పగా మూడు నెలలు కలిసి ప్రార్ధించాము.

ప్రభువు కృపవల్ల 1999వ సంవత్సరములో సాల్మన్ రాజుగారు, వరప్రసాదం అన్న దంపతుల పరిచయము వల్ల నర్సీపట్నములో హెర్మోను ప్రార్ధనా మందిరానికి నడిపించారు. ఆనాటి నుండి భక్తసింగ్ గారనే దైవజనులు ఆరంభించిన ఆరాధనల ద్వారా, వాక్యపరిచర్యయు, ప్రార్ధన ద్వారా మా ఆత్మకు నూతన శక్తి లభించింది. ప్రత్యేకంగా 1999 ఫిబ్రవరి 16వ తేదీ సాయంకాలం బైబిలు పఠనములో నాకు మోక్షానికి సరియైన మార్గం తెలిసింది.

**యోహాను 3:3,5 "ఒకడు నీటి మూలముగాను, ఆత్మ మూలముగాను జన్మించితేనే గాని దేవుని రాజ్యంలో ప్రవేశింపలేడని తెలిసింది"**

మరొకసారి సూటిగా ప్రభువు నాతో మాట్లాడారు. "నీవు పాపివి గనుక మనశ్శాంతి కోల్పోయావు. నీవు నీ పాపములో చనిపోతే నరకము తప్పదు. నీ పాపములకొరకై నేను మరణించాను. రక్తం కార్చాను. సమాధి గెల్చి తిరిగి లేచాను. నీవు నీ పాపాలు ఒప్పుకుంటే నిన్ను క్షమించుటకు సిద్ధంగా వున్నాను". ఈ మాటలు నమ్మి పశ్చాత్తాపంతో కన్నీరు కార్చి నా పాపాలన్నీ ఒప్పుకున్నాను. ప్రభువు నా పాపాలు క్షమించారు. ఆయన కార్చిన పవిత్ర రక్తముతో నన్ను కడిగి పరిశుద్ధపరిచారు. బంగారు కాంతితోనున్న అద్భుత హస్తము నా హృదయములోనికి ప్రవేశించి నా హృదయాన్ని వెలుగుతో నింపింది. అప్పుడు సమయము రాత్రి 8 గంటల 45 నిమిషాలయింది. నా హృదయమంతా వెలుగు మయమైన తర్వాత

చెప్పనశక్యమైన, మహిమాయుక్తమైన సంతోషము, శాంతి నన్ను చేరాయి. అదే నా మారుమనస్సు అనుభవం గూర్చి నా భార్యతో చెప్పాను. నేను మరణిస్తే ప్రభువుతోనే వుంటాను. నీ సంగతేమి? అని ప్రశ్నించాను.

ఆ రాత్రి నా భార్య ఉపవాసంతో ప్రార్థించింది. తెల్లవారకముందే నన్ను నిద్రలేపించి. ఈ రాత్రి ప్రభువు నాతో కూడా మాట్లాడారు.

**2 కొరింథి 12:14 "ఇదిగో నేను మూడవసారి మీ యొద్దకు వచ్చుచున్నాను. నేను వచ్చినప్పుడు మీ సొత్తును కాదు. మిమ్మును కోరుకుంటున్నాను".**

నేనుకూడా మీతోకూడా ప్రభువుతో పరలోకంలో ఉంటానంది. అప్పటినుండి మాక్రైస్తవ యాత్ర ఆరంభమయింది.

**క్రైస్తవ జీవితము – వాగ్ధానముల నెరవేర్పు :-**

**అపొ 16:31 "ప్రభువైన యేసునందు విశ్వాసముంచుము. అప్పుడు నీవును నీ యింటివారును రక్షణ పొందుదురు".**

ఈ వాగ్ధానాన్ని చేపట్టి నా చెల్లెలు కొరకు ప్రార్థించాము. నెలరోజులలో ఆమెలో క్రీస్తును ప్రేమించే మనస్సునిచ్చారు.

**లూకా 15:7 "వాక్యాధారముగా మారుమనస్సు పొందు ఒక్క పాపి విషయమై పరలోకములో ఎక్కువ సంతోషము కల్గును"** అనే వాక్యము ఆమెను తాకింది. నా భార్య, నేను, నా చెల్లి ముగ్గరము 1999 ఏప్రిల్ 4వ తేదీ ఈస్టరు రోజు నీటి బాప్తీస్మము తీసుకున్నాము. నాపేరు అబ్రహాముగాను, నా భార్యపేరు శారాగాను, నా చెల్లిపేరు మెర్సిగా మార్చాలని ఆశించగా పాస్టరుగారు ఆపేరులేయిచ్చి ఆశ్చర్యం కల్గించారు. ఆమె వివాహము కూడా ఆశ్చర్యం కల్గించేదిగా పెండ్లినాటికి మత్తుపానీయాల బాసిసగా నున్న పెండ్లి కుమారుడు విషయమై వాగ్దానము యిచ్చారు.

**యెషయా 48:15 "నేనే అతడిని పిలిచితిని, నేనే అతడిని రప్పించితిని. అతడి మార్గము తేజరిల్లును".**

వాగ్ధానము చేసినవాడు నమ్మదగినవాడు. 1999 సెప్టెంబరు 12న వివాహమయిన నెలరోజులకే ఆమె భర్త మారుమనస్సు పొంది బాప్తీస్మము పొందాడు. చిన్న చెల్లెలు కూడా క్రీస్తును నమ్మింది. పేరు ప్రిస్కిల్లాగా మారింది. నా బిడ్డలు యిద్దరూ చిన్న వయస్సులో క్రీస్తును నమ్మారు. పాల్ మోజెస్, దెబొరాషారోన్‌గా పేర్లు పెట్టుకున్నాము. క్రమంగా ఆరాధనలలో పాల్గొని, ప్రార్థన, వాక్యము, సంఘ సహవాసంలో మేము అందరము

ఆత్మీయంగా బలపర్చబడుచు దేవునికి సాక్షులుగా జీవించుట కారంభించాము. నా జీవితములో దేవుని చిత్తము తెలుసుకోవాలని దైవజనులు హెచ్చరించేవారు.

**యెషయా 44:21** వాక్యాధారముగా ఆయన సేవ చేయాలని నా పట్ల దేవుని చిత్తమని తెలుసుకోగల్గాము. సేవ చేయాలంటే ఉద్యోగము మానుట నాకు ఆందోళన కల్గించింది.

**లూకా 12:47 "తన యజమానుని చిత్తమెరిగి అలాగున చేయని దాసునికి అనేకమైన దెబ్బలు తగులును".**

ఈ వాక్యము నాలో పనిచేయసాగింది. దైవజనుల వర్తమానాలతో పాటు భక్తసింగు గారి పుస్తకము యెహోవాయందలి ఆనందము అనే సందేశములో ఈ దినమే మీలో యెహోవాకు మన:పూర్వకముగా సమర్పించుకొనేవారెవరైన వున్నారా? అనే ప్రశ్న నన్ను వేధించింది. ప్రభువు నీ చెంతను నిలబడి నిన్ను పిలుచుచున్నాడు అనే మాటలు నాలో పనిచేసాయి. నేను తీర్మానము చేసుకొని 2001 నవంబరు 16వ తేదీ ఉద్యోగానికి రాజీనామా చేసేసాను.

**యెషయా 42:6,7** వచనాలు అలాగే

**యెషయా 49:6** వ వచనము వాగ్దానమిచ్చారు. నా బిడ్డలిద్దరూ రక్షణానుభవాన్ని పొందుట చాలా ఆనందం కల్గించింది. నా కుమార్తె వివాహము 2009 అక్టోబరు 14వ తేదీ దేవుని పరిచర్య చేస్తున్న జోనాదాన్ గారితో జరిగింది.

మా వారంతా దేవుని సేవ చేయుట నాకెంతో ఆనందము కల్గిస్తుంది. ప్రస్తుతము కృష్ణాజిల్లా ఉయ్యూరులో మా సేవ జరిగించు కృప ప్రభువిచ్చారు. ఎన్నో ఆశ్చర్యకార్యాలు జరుగు ధన్యత లభిస్తుంది. నేనును నా యింటివారును యెహోవాను సేవించెదము అనే కృపనిచ్చారు.

యీ సాక్ష్యము ద్వారా దేవుడు లేడని వాదించిన నన్నే క్రీస్తు సేవకునిగా నిలబెట్టి వేరే దేవుడు లేడు ఆయననే రక్షకుడు అని చెప్పు ధైర్యముతో ప్రకటించు సేవకునిగా ప్రభువే మార్చారు. పాపములు క్షమించే అధికారము గలవాడు. పరలోక ప్రాప్తినిచ్చే ఆయనే ఏకైక మార్గమని మీరు నమ్మండి. ప్రభువు తన రాజ్యము కొరకు సిద్ధపరచి దీవించును గాక. ఈ సాక్ష్యము ఆయన మహిమకొరకు అనేకుల రక్షణకై ఉపయోగించుకోవాలని నా దీన ప్రార్ధన ఆమెన్.

నా సెల్ : 9247908909

---------------

## ౨౦. అసాధ్యమైనవి సుసాధ్యము చేయగల్గిన నమ్మదగిన దేవుడు నా ప్రభువు

**–స్మిత (అమృతలూరు/ తెనాలి)**

**విలాప వాక్యములు 3:23 "అనుదినము నూతనముగా ఆయనకు వాత్సల్యము పుట్టుచున్నది. నీవు ఎంతైనా నమ్మదగిన వాడవు".**

**పరిచయము:–** ప్రభువు నామములో మీకు శుభములు. నా సాక్ష్యము ప్రభువు కొరకు ప్రచురించుటకు అవకాశము కలిగించిన నా రక్షకునికే స్తుతి మరియు మహిమ కలుగును గాక. ప్రభువు కృపలో నా జీవితమును అద్భుతముల నిలయముగా చేసి ప్రతి సంఘటననూ దేవుని ప్రత్యేక ప్రణాళిక ద్వారా సంకల్పించి నడిపించారని స్పష్టముగా గ్రహించి కృతజ్ఞత తెలుపుకొనుచున్నాను. మా తల్లిదండ్రులు ఆంధ్రప్రదేశ్‌లోని తెనాలి ప్రాంతము అమృతలూరుకు చెందినవారు. నాన్నగారు లెక్చరర్‌గా పనిచేసినందున ఉద్యోగ నిమిత్తము వివిధ ప్రాంతములలో నివసించాము.

అమ్మ ఇంటి ఇల్లాలుగా ఉండేది. నాకు అక్క ఉన్నది. ఆమె కూడా ఉపాధ్యాయినిగా విజయవాడలో స్థిరపడినది. అక్కకు నాకు మధ్య మరొక బిడ్డ పుట్టి మరణించింది. నేను కూడా అమ్మ గర్భములో ఉన్నప్పుడు బ్రతుకుట క్లిష్టమని డాక్టర్లు తెలిపారు. అమెరికా నుండి మిషనెరీలు వచ్చి సువార్తను ప్రకటించుట ద్వారా మా అమ్మమ్మ గారు దేవుని తెలుసుకోగలిగినారు. మా అమ్మమ్మకు బిడ్డలు పుట్టి చనిపోవుచ్చు పరిస్థితులలో యేసు ప్రభువును తన స్వంత రక్షకునిగా అంగీకరించిన తరువాత ఇద్దరు బిడ్డలు కలిగారు. అమ్మమ్మ మందిరమునకు వెళ్ళుటకు మా తాతగారు అనుమతించనందున ఒక పాస్టరుగారిని ఆహ్వానించి ఇంటిలోనే ఆరాధనలు జరిగించగా క్రీస్తు పట్ల ప్రగాఢ విశ్వాసముతో మా అమ్మకు కూడా యేసయ్య ప్రేమను పరిచయము చేశారు. అమ్మ గర్భములో ఉన్న నేను బ్రతుకుట కష్టమని డాక్టర్లు చెప్పినప్పటికినీ, ప్రభువును వేడుకొనవలెనని నా తల్లికి తెలియకపోయిననూ

**యిర్మియా 1:5 "గర్భములో నేను నిన్ను రూపింపక మునుపే నిన్నెరిగితిని, నీవు గర్భము నుండి బయలుపడక మునుపే నేను నిన్ను ప్రతిష్ఠించితిని".**

అను వాక్యము నా జీవితములో నెరవేర్చుట దేవుని సంకల్పమైయున్నందున ప్రభువే నా తల్లిని దర్శించి, ఆమె కడుపును ప్రేమతో ముట్టి ఇంజక్షను ఇచ్చారట. ఆమె సంపూర్ణ ఆరోగ్యవంతురాలైన తరువాత నేను జన్మించాను.

నా పేరు స్మిత. నా విద్యాభ్యాసము ఇంటరు మొదటి సంవత్సరము వరకు తెనాలిలో గడిచినది. ఆ తరువాత ఇంటరు రెండవ సంవత్సరము మరియు ఇంజనీరింగు విజయవాడలోనే ముగించుటకు దేవుడు కృప చూపించినారు. మా నాన్నగారు మందిరమునకు వెళ్ళుటకు అమ్మనైతే ఆటంకపరచలేదు కానీ, అక్క నేను క్రీస్తును వెంబడించుట ద్వారా వివాహములు నిర్ణయము చేయుట కష్టమగునని ఎంచి కాస్త జాగ్రత్తగా కనిపెట్టి ఎక్కడికీ పంపేవారు కాదు. ఈ ఆటంకములుండుట వలననూ, అమ్మ కూడా లోతైన భక్తి పరవశములో నుండక తన వరకు విశ్వాసమును కాపాడుకొనుట వలన నాలో క్రీస్తును గురించిన ఆలోచనలు లేవు.

మా అమ్మమ్మ గారింటికి సెలవు దినములలో వెళ్ళినపుడు యేసయ్యను గురించి ఎన్నడూ ఏమియూ గ్రహించలేకపోయే దానను. అయితే పరీక్షా సమయములలో అమ్మ నా కొరకు శ్రద్ధతో క్రీస్తును ప్రార్థించేవారు. అమ్మ ప్రార్థనల వలన లభించే నా విజయములను బట్టి అవసరతలో ఉన్నప్పుడు మాత్రమే క్రీస్తును ప్రార్థించేదానను. నిజానికి అమ్మ కూడా నేను పదవ తరగతి చదువుచున్న రోజులలో మా నాన్నగారు ఎక్కువ మొత్తములో డబ్బును వ్యాపారములో పెట్టి నష్టపడిన సమయములో ప్రభువు మీద ఆధారపడుట మరియు ఆయనను ఆశ్రయించి బాగుగా ప్రార్థించుట నాకు తెలుసు. శ్రమల వలన దేవుని సన్నిధికి దగ్గరగుటయను, విలువైన పాఠములను నేర్చుకొను ధన్యత లభిస్తుందని ప్రభువును తెలుసుకున్న తరువాత

కీర్తనలు 119:71లో “నీ కట్టడలను నేర్చుకొనుటకు శ్రమనొందుట మేలాయెను” అన్న వాక్యమును చూచి ఆశ్చర్యడ్డాను. సరిగ్గా ఇంజనీరింగు విద్యాభ్యాసము చేసే 3వ సంవత్సర కాలములో పరీక్షలు బాగా వ్రాయనందున 2 లేక 3 సబ్జెక్టులలో ఉత్తీర్ణత పొందగలనో లేదో అన్న ఆందోళనతో అమ్మతో ప్రార్థన చేయగా కాస్త నమ్మకముతో క్రీస్తును ఆశ్రయించాను. నా నమ్మకమును స్థిరపరచుటకు గాను దేవుడు 80 శాతము మార్కులను అనుగ్రహించారు. ప్రభువు నాకు చేసిన సహాయమునకు కృతజ్ఞతగా నేను టీ.వీ.లో చూచే సినిమాలు మానివేశాను.

క్రీస్తు ప్రేమను ధ్యానిస్తూ ఆయనకు ఇష్టమైన పనులు చేయుటకు ఆశించాను. ఆ తరువాత ఇంజనీరింగు చివరి సంవత్సరము చదువుచున్న దినములలో క్రీస్తును వెంబడించు ఒక స్నేహితురాలి ద్వారా ఒక సంఘమునకు వెళ్ళి అక్కడ ఆరాధనా క్రమము, వాక్య పరిచర్య మరియు ప్రార్ధన ఎట్లుండునో ప్రప్రథమముగా తెలుసుకొనగలిగాను. ఆ గొప్ప సహవాసములో నా ఆత్మ బహుగా ఆనందించి క్రీస్తును ప్రేమించే వారిలో ఎంతో శాంతి మరియు సమాధానము ఉంటుందని రుచి చూచి ఎరుగుట అదే ప్రథమానుభవము.

పాప క్షమాపణ మరియు మారుమనస్సు అనుభవము ఉంటుందని తెలుసు గాని నాకయితే అదే మారుమనస్సు అనుభవము కలిగినదని నా మనస్సే నాకు సాక్ష్యమిచ్చినది. నా రక్షణ దినము అదే అని నమ్మాను. యేసయ్య యొక్క జీవితానుభవాలు మరియు ఆయన నీతిని వివరించగా వినుట వలన విశ్వాసము కలుగునని ఆ క్షణములో గ్రహించుటకు పరిశుద్ధాత్మ దేవుడు సహాయము చేశారు. సంతోషముతో నా హృదయము ఉప్పొంగినది. చెప్పనాశక్యమైన ఆనందానుభూతితో తేలియాడాను. కృపచేత విశ్వాసము ద్వారా నేను పొందిన రక్షణ స్థిరతను నా మాటలలో మరియు నా ముఖములో కలిగిన మార్పు ద్వారా నా తల్లి గుర్తించి బహుగా ఆనందించింది.

నా చదువు పూర్తయిన తరువాత నాన్నగారు ఎందరినో వివాహము కొరకు పెండ్లి చూపులు సిద్ధపరచు పనిలో నిమగ్నమయ్యారు. నాకైతే క్రీస్తును నమ్మిన విశ్వాసిని మరియు అట్టి కుటుంబములో జీవించాలన్న ఆశయు నాలో ఆత్మ దేవుడు కలిగించారు. అదే కోరికతో ప్రార్థించుకొనేదానను. వివాహము జరుగుటకు సమయమున్నదని ఎమ్.టెక్. ప్రవేశము కొరకు ధరకాస్తులు పెట్టుకున్నాను. ఇంటర్వ్యూలకు వెళ్ళు సమయములో పెండ్లిచూపులు నిర్ణయించేవారు.

అనుకోని రీతిగా ఏ సంబంధమూ కుదిరేది కాదు. అది కేవలము ప్రభువు చిత్తములో విశ్వాసినే నా కొరకు దాచి ఉంచి, నా కోరికను నెరవేర్చు ప్రభువని నేను ప్రగాఢ విశ్వాసముతో కనిపెట్టేదానను. ప్రభువు సంకల్పముతో నేను ఆయనను గురించి ఎక్కువ తెలుసుకోవాలని ఆయన చిత్తము కనుక అద్భుత రీతిగా యేసు పిలుచుచున్నాడు, దినకరన్ గారు ఆరంభించిన కారుణ్య యూనివర్సిటీలో ఎమ్.టెక్‌లో ప్రవేశము లభించినది. పెండ్లి కుదరలేదని మా నాన్నగారు బాధపడిననూ, అక్కడ చదువుకొనుటకు అనుమతించారు. నాకు డిగ్రీ చదువుట కన్నా యేసయ్యను మరి ఎక్కువగా తెలసుకోవాలన్న ఆసక్తిని నాలో కలిగించిన దేవునికి స్తోత్రములు.

ఆ కాలేజీ ప్రత్యేకత నన్ను ఆకర్షించినది. ప్రతి దినము సాయంకాలము 7 గంటలకు ఆరాధన మరియు వాక్య బోధన జరిగేది. శని ఆదివారములలో విదేశాల నుండి అనేమక మంది గెస్ట్ స్పీకర్లు వచ్చి బోధ చెప్పేవారు. వాక్యమును వివరించే పద్ధతి ద్వారా క్రీస్తును గురించి తెలుసుకోగలిగాను. మధ్యలో పెండ్లి చూపులు నిర్వహణ ఉండేది. రెండవ సంవత్సరం విద్యాభ్యాస కాలములో జరిగిన సంఘటన నాకు మంచి విశ్వాసిగా గుర్తింపునిచ్చినది.

నేను ప్రాక్టికల్స్ చేయుచున్న సమయములో కఠినమైన ప్రశ్నకు జవాబు ఇచ్చే స్థితిలో లేనని ఇంటర్నల్ ఎగ్జామినర్ నా పరిస్థితి చూచి నాకు కంప్యూటరులో చేయడం రానప్పటికినీ నేనే చేసినట్లుగా ఆయన ప్రయత్నిస్తానని చెప్పారు. అందుకు నా మనస్సు అంగీకరింపక వద్దండీ, అలాగు చేయను అని చెప్పగా అయితే నిన్ను ఫెయిల్ చేస్తానని అన్నారు. నేను ఫెయిల్ అయినా పర్వాలేదు కానీ ఆ పని మాత్రము చేయనండి అని చెప్పిన వెంటనే నాలో చాలా సమాధానము కలిగినది. వెంటనే ఆత్మ దేవుడు

నిర్గమాకాండము 14:13లో "భయపడకుడి, యెహోవా మీకు నేడు కలుగచేయు రక్షణను మీరు ఊరక నిలుచుండి చూడుడి" అను వాక్యము పదే పదే నా చెవులలో మారుమ్రోగింది. బయటనుండి వచ్చిన ఎగ్జామినర్ ఏమి చేశావో చూపించు అని అడుగగా నాకు ఇది ఎలాగు చేయాలో తెలియలేదని సమాధానమిచ్చినపుడు నీకు సిగ్గులేదా అన్నారు. అట్టి పరిస్థితిలో నా దేవుడు ఆయన కొరకు నిలబడినందున ఆ శ్రమను దాటించి బి గ్రేడ్ అనుగ్రహించినందున నా ఇంటర్నల్ ఎగ్జామినరు మరియు నా తోటి విద్యార్థులందరూ ఆశ్చర్యపడ్డారు. ఈ సంఘటనతో నేను పడిపోకుండా నన్ను నిలబెట్టిన నా దేవునికి స్తోత్రములు.

**ప్రభువు తగిన భర్తను సమకూర్చుట:–** నా జీవితములో నేను కోరిన భక్తిగల కుటుంబములో రక్షణ పొందిన భర్తను నాకై చాలా ఆశ్చర్యముగా సిద్ధపరచిన విధమును బట్టి నాటి నుండి నేటి వరకు స్తుతింపక మానను. ఒకసారి అమ్మకు తెలిసిన విశ్వాసి ద్వారా మరియొక విశ్వాసితో పరిచయము ఏర్పడగా, ఆ పరిచయమైన విశ్వాసి ద్వారా మా అత్తగారి కుటుంబమును గురించి తెలుసుకొనగలిగాము. ఒక వివాహ సందర్భములో మా అత్తగారు, మామగారు, ఆయన అక్క మరియు వంశీ విజయవాడకు వచ్చినపుడు దేవుని ప్రణాళిక చొప్పున పెండ్లి చూపులు జరిగాయి. ఆయనను నమ్ముకున్న బిడ్డలను దేవుడు ఎన్నడునూ సిగ్గుపరచరు అను వాక్యము నా జీవితములో అక్షరాలా నెరవేర్చినందున చాలా ఆనందము కలిగినది. వివాహమునకు ముందే నీటి బాప్తీస్మమును పొందుకొనుటకు దేవుడు కృప చూపించి గ్రేస్ అనగా కృప అని పేరు ఇచ్చారు. ఆయన కృప ఆనాటి నుండి

ఈనాటి వరకు వెంటాడుచూనే ఉన్నందున దేవునికి వందనములు. రక్షణానుభవమే నాకు గొప్ప అర్హతగా, నిర్ణయించిన వివాహం పరిశుద్ధ క్రైస్తవ వివాహము జరిగినందుననూ మరియు ముఖ్యముగా నా పరలోకపు తండ్రి నా కొరకు తానే ఒక మంచి వ్యక్తిని నాకు జీవిత భాగస్వామిగా తీసుకువస్తారని విశ్వసించిన నన్ను ఆయన సిగ్గుపడనీయక మా బంధువులందరూ ఆశ్చర్యపోయే రీతిలో ఘనముగా నా పెండ్లి జరిగించిన నా దేవునికి కోట్లకొలది స్తోత్రములు.

అత్త మామలు మరియు భర్త వంశీతో కలసి హైదరాబాదలో జీవించాము. వారితో ఐక్యతతో మరియు ఆనందముతో గడపగల్గుటకు ప్రభువు కారుణ్యలో చదివే సమయములో క్రీస్తు సందేశముల ఫలితముగా నా జీవితములో నా కోపోద్రేక లక్షణములన్నీ సాత్వీకముగా మార్చుకొనగలుగుటకు పరిశుద్ధాత్మ దేవుడు సహాయము చేశారు. గతములో నాన్న గారితో ఎదిరించి, వాదించి మాట్లాడేదానను. ఆ ప్రవర్తన విషయమై నాన్నగారిని క్షమాపణ అడిగినపుడు ఆయనకు క్రీస్తు ప్రభువు ద్వారా కలిగెడి మారుమనస్సును గురించి తెలియనందున ఏమ్మా ఏదో మాట్లాడేస్తున్నావు గానీ నాకు ఏమీ అర్ధము కాలేదన్నారు. నాలో గొప్ప శాంతి ఉండేది. అదే సంతోషము మరియు సమాధానము రక్షణ పొందిన నాటి నుండి నేటి వరవరకు అంతరంగమునందు నిలిపిన నా దేవునికి స్తోత్రములు. ఎంతో సఖ్యతతో ప్రేమతో నా భర్త పరివారముతో గడుపు ధన్యత నా ప్రభువు నాకిచ్చిన గొప్ప అనుభవము.

దేవుడు విద్యార్హతలను అనుగ్రహించిననూ ఉద్యోగము చేయాలన్న మనస్సు ఉండేది కాదు. దాని విషయమై ఆలోచన చేసినప్పుడెల్లా సమాధానము ఉండేది కాదు. ఉద్యోగ విషయములో నా భర్త కూడా నన్నెన్నడూ బలవంతం పెట్టలేదు. ప్రవచన వరము కలిగిన ఒక సేవకురాలి ద్వారా నా భర్త భవిష్యత్తును గురించి వివరించిన రీతి నన్ను ఆశ్చర్యపరిచింది. విదేశాలు వెళ్ళే అవసరత లేకపోయినప్పటికినీ "ప్రభువు నా భర్తను అమెరికాకు తీసుకొని వెళ్తానని చెప్పి, ప్రయత్నములు కొనసాగించు" అని తెలిపారు. ఆ దినములలో ప్రభువు నాకు గర్భ ఫలమును అనుగ్రహించినారు. మా వివాహము కాకమునుపు నా భర్త అమెరికా వెళ్ళుటకు రెండుసార్లు ప్రయత్నము చేయగా వీసా అధికారులు కారణము ఏమీ లేకుండానే నిరాకరించినారు. తరువాత నేను 9వ నెల గర్భవతిగా నున్నప్పుడు అమెరికాలో ఉద్యోగ అవకాశము ఉందని తెలిసిన వారు పేపర్లు పంపగా వీసా ఇంర్వ్యూ కొరకు మద్రాసు వెళ్ళాము. అయితే వారు అన్ని ప్రశ్నలు అడిగిన తరువాత వీసా స్టాంపింగు చేయబోయే తరుణములో గతములో రెండు మార్లు నిరాకరించిన దానిని చూచి కొంత సమయము వేచి ఉండండి అని సమాధానము చెప్పారు.

రెండు గంటలు అయిన తరువాత ఇంటర్వ్యూ చేసే అధికారులు టెక్నికల్‌గా నా భర్తను ప్రశ్నలతో వేధించి, చివరకు “నాకు విద్యార్హతలున్ననూ సమర్థత లేనివాడను, ఆ ఉద్యోగమునకు పనికిరాను” అని తనతో వ్రాయించుకొని అవమానించారు. అయినప్పటికీ ఇప్పుడైనా దేవుడు ఏదైనా చేయగల సమర్థుడనే విశ్వాసము మరియు సమాధానము నన్ను వెంటాడుతూనే ఉన్నాయి.

ఒక గంట గడిచిన తరువాత మీ పేపర్లన్నీ ఇంకా ఎక్కువ పరిశీలించిన పిమ్మట చెప్తామని పాస్‌పోర్టులు మాకు ఇచ్చేశారు. ఆ తరువాత నేను వాక్యము చదువుకొనుచున్నప్పుడు యెషయా 22:22 లో “అతడు తీయగా ఎవడును మూయజాలడు, అతడు మూయగా ఎవడును తీయజాలడు” అను వాక్యము ద్వారా దేవుడు స్పష్టముగా నాతో మాట్లాడి, నా విశ్వాసమును మరింత దృఢపరిచినారు. ఆ వాక్యమునే నోటితో ఒప్పుకొనుట ప్రారంభించిన సరిగ్గా నెల రోజులకు యూ.స్. ఎంబసీ నుండి ఒక ఉత్తరము వచ్చినది. ఏమనంటే “మీ పాస్‌పోర్టులు పోస్టులో పంపించండి, స్టాంపింగ్ వేసి పంపిస్తాము” అని దేవునికే సమస్త మహిమ కలుగును గాక.

మేము వీసా ఇంటర్వ్యూకి హాజరై మద్రాసు నుండి కాన్పు నిమిత్తమై అమ్మగారింటికి వచ్చాము. ఆ శుక్రవారము డాక్టరు చెకప్‌కి వెళ్ళినపుడు స్కానింగు తీసి బేబి 2.26 కేజీలు మాత్రమే ఉన్నది. ఎదుగుదల ఎక్కువ లేనందున వెంటనే సిజేరియన్ ఆపరేషన్ చేయకపోతే కష్టమని చెప్పారు. ఆదివారము నేను సంఘమునకు వెళ్ళగా మా పాస్టరుగారు “ప్రభువు కార్యములను చూడకుండానే మీరు విశ్వసించగలరా?” అని ప్రశ్నించగా నా హృదయములో విశ్వసించాను. మరియు ఆ దినమున రొట్టె ద్రాక్షా రసము తీసుకుంటున్న సమయములో ఇలా ప్రార్థించాను, “ప్రభువా, నీ రొట్టెలో జీవమున్నది మరియు నీ రక్తములో కూడా జీవమున్నది కనుక నేను ఇప్పుడు వీటిని తింటూ ఉండగా నీ జీవమును నా కడుపులో ఉన్న బిడ్డ కూడా తింటూ ఉండగా బిడ్డ బరువును నీవే పెంచుతావని విశ్వసించి కృతజ్ఞతలు తెలుపుచున్నాను”. సోమవారము స్కానింగు తీయగా బిడ్డ మూడు రోజులలో అరకేజీ బరువు పెదిగినదని చెప్పగా ఎంతో దేవున్ని స్తుతించుకున్నాను. నెలలు నిండిన తరువాత చూడ చక్కని ఆరోగ్యవంతమైన, శ్రేష్టమైన పాపను దేవుడు అనుగ్రహించారు.

నా భర్త 2008వ సంవత్సరము మే నెలలో అమెరికా వెళ్ళగా సెప్టెంబరు నెలలో నేను మరియు పాప నా భర్తతో తిరిగి కలుసుకొనుటకు దేవుడు మార్గమును సరాళము చేశారు. అనుకొనని రీతిగా మేము వచ్చిన రెండవ నెలలో నా భర్తకు ప్రాజెక్టు పూర్తవబోవుచున్నదని తెలిసినపుడు దేవున్ని ప్రార్థించగా

యెషయా 59:1 లో "రక్షింపనేర కుండునట్లు యెహోవా హస్తము కురచకాలేదు, విననేరకుండు నట్లు ఆయన చెవులు మందము కాలేదు" అని స్వరము వినపడినది. తరువాత చాలా కాలము ఉద్యోగము లేకున్నను ధైర్యముగా అమెరికాలో ఉండుటకు దేవుడు కృప చూపించారు. నా భర్తను వదిలి ఒంటరిగా పాపతో ఇండియా రాదలంచలేదు. కానీ 2009 ఆగస్టు నెలలో రావలసి వచ్చినది. ఆ రోజులలో ప్రభువు నాతో ఉండి నా భర్తకు దూరమైనా నన్ను ఆదరించి ధైర్యపరచి సమర్పించుకొని నీ చిత్తము జరుగును గాక అని ప్రార్థించుట నేర్పించినారు. అద్భుత రీతిగా అసాధ్యమైన పరిస్థితులలో నా భర్తకు ఉద్యోగమును దయచేశారు. 2010వ సంవత్సరములో అమెరికాకు తిరిగి వచ్చాము.

మే నెల 14వ తేదీన దేవుడు తన వాక్యము ద్వారా రోమా 9:9 లో వ్రాయబడిన ప్రకారము, "వాగ్ధాన రూపమైన వాక్యమిదే – మీదటికి ఈ సమయమునకు వచ్చెదను; అప్పుడు శారాకు కుమారుడు కలుగును" అని నాతో మాట్లాడినారు. వాగ్ధానము చేసిన దేవుడు నమ్మదగినవాడు కనుక డాక్టర్లు 2 లేక 3 సంవత్సరముల వరకు పిల్లలు పుట్టుట అసాధ్యమని చెప్పినప్పటికినీ మే నెల 27వ తేదీ 2011వ సంవత్సరములో బాబును అనుగ్రహించినందుకు దేవునికి స్తోత్రములు.

మాకు అమెరికాలోనే న్యూ జెర్సీ ప్రాంతమునకు రావాలన్న ఆలోచన లేనప్పటికినీ మంచి తెలుగు వారి సహవాసములో సహకరించి సేవ చేయుట ప్రభువు సంకల్పము ఉండుటచే నా భర్త యొక్క స్నేహితుని ద్వారా ఒక కంపెనీలో అవకాశము ఉన్నదని తెలిసినది. అప్పుడు ఇరువురమూ, "ప్రభువా న్యూ జెర్సీ వెళ్ళుట నీ చిత్తమైతే అన్ని విషయములలో నీ కృపను మేము చూడగలుగునట్లు సహాయము చేయమని ప్రార్థించి ఆయన చిత్తమునకు సమర్పించుకున్నాము. "మేము ప్రార్థించిన రీతిగా ఇంటి లీజు, ఉద్యోగము మరియు సమస్త విషయములలో దేవుని కృపను మెండుగా చూడగలుగుటకు సహాయము చేశారు. అసాధ్యమమైన వీసా పరిస్థితులలో, స్థిరమైన ఉద్యోగమును అనుగ్రహించి కుటుంబమును దీవించారు.

నా కుటుంబము నిత్యమూ యేసయ్యను సేవించుచు, అనుదినము ఆయన స్వారూప్యములోనికి మార్చబడుచు, ఆయన రాకడ కొరకు సిద్ధపడి జీవించవలెనని నా ఆకాంక్ష. నా స్నేహితులు మీరు కూడా ఆ రాజ్య వారసులు కావాలని నా సాక్ష్యము ద్వారా ప్రోత్సహిస్తూ ప్రార్థిస్తున్నాను. దేవునికే సమస్త ఘనత, మహిమ ప్రభావములు చెల్లును గాక. ఆమెన్.

---------

# 21. శ్రమల కొలిమిలో స్వర్ణకాంతులను నా ప్రభువు నాకు చూపించారు

**– శ్రీమతి గోపాళం కోటేశ్వరమ్మ (ఎస్తేరుగారు)**

**మత్తయి 11:28 "ప్రయాసపడి భారము మోయు వారలారా నా యొద్దకు రండి. మీకు విశ్రాంతి కలుగజేతును".**



నా ప్రభువు యీ సాక్ష్యాన్ని దీవించుగాక. నేను జన్మించిన ప్రాంతము ఆంధ్రప్రదేశ్‌లో గుంటూరుజిల్లా, నరసరావు పేట తాలుకా చింతపల్లి గ్రామము. మా తల్లి దండ్రులకు ముగ్గురు ఆడపిల్లలు, ఒక కుమారుడు కల్గిన సంతానములో చెల్లి నేను లోకాశలకు లోనై గడిపేవారము. సినిమాలు చూచుట, నవల్స్ చదువుట, శరీరాన్ని అలంకరించుకొనుట యిష్టపడేదాన్ని.

మా ఊరిలో మా కుటుంబము చాలా పేరు ప్రఖ్యాతులు గలది. మా ఊరిలో హరిజన వాడలో క్రైస్తవ కూడికలలో ప్రసంగించుటకు దైవసేవకుడు డోల్ఫె దొరగారు వచ్చారు. దేవుని ప్రేమ బలవంతము చేయగా దూరప్రాంతానుండి, సౌకర్యాలు త్యాగంచేసి దేవుడు ప్రేమగలవాడు ఆయనే మార్గం, సత్యం జీవమని ఎంతో ఆసక్తితో ప్రసంగించుట ద్వారా మా పనివాడు మా యింటికి తీసుకొనివచ్చి మా నాన్నగార్కి పరిచయము చేసాడు. మా స్వకీయులంతా నిష్టకల అన్యులు గనుక మా నాన్న ఎదురై ఆగ్రహంతో కర్రతో కొట్టబోయి దూషించారు.

"మీ క్రీస్తు మా దేవుడు కాదు. రాముడు, కృష్ణుడు మాకున్నారు మీరు వెళ్ళండి అనగానే ఆ దొరగారు ఎంతో వినయంతో ప్రేమతో బైబిలు గ్రంధము చేతిలోపెట్టి అయ్యా, యీ బైబిలు చదవండి. ఆ తర్వాత నన్ను కొట్టండి అన్నారట. ఆయన వెంటనే "సరె, మీ దేవుడు నాతో మాట్లాడితే సరి లేనియెడల మీ సభలు జరిగించే డేరాలు నాశనము చేస్తాను" అన్నారట. ప్రభుని వాక్యము జీవముగల రెండంచుల ఖడ్గమైనందున, పరిశుద్ధాత్మ పని జరిగించగా మత్తయి సువార్తతో ఆరంభించి చదువుచుండగా

**మత్తయి 11:28 "ప్రయాసపడి భారము మోయు వారికి విశ్రాంతినిస్తానన్న ఆహ్వానము ఆకర్షించింది".**

ప్రభువు మా నాన్నతో మాట్లాడిన రీతినిబట్టి మీటింగు ప్రాంతాలకు వెళ్ళి "అయ్యా మీరిచ్చిన గ్రంధము గొప్పది. హృదయానికి నెమ్మదిచ్చి తెప్పరిల్లజేసింది. నేను క్రీస్తును

వెంబడిస్తానన్నారు. ఆ తర్వాత బైబిలు పూర్తిగా చదివి, సంపూర్ణంగా జీవితశైలి మార్చుకొని బాప్తీస్మము పొందారు. నాకు రెండునెలల వయస్సుండేది. మా నానమ్మ పూజలు చేసేది. నేను బొట్టుపెట్టుకొని పూజలలో పాల్గొనేదాన్ని. నన్ను ఆటంకపర్చి బైబిలు విషయాలు బోధించేవారు. ఆయన ద్వారా గ్రామంలో చాలామంది రక్షింపబడ్డారు. మంచి క్రైస్తవునిగా జీవించి సేవచేసారు.

నాన్నగారికి చాలా ఆస్తి ఉండేది. నేను చాలా గర్వంగా ఉండేదాన్ని, నాకు 18వ ఏట వివాహం చేసారు. నాకొక బాబు కల్గాడు. ఆ తర్వాత రెండు సంవత్సరములకు కుమార్తె కల్గింది. నేను పుట్టినప్పుడు మా యింట్లో ప్రార్థన కూడిక పెట్టారు. మంచి పాటలుపాడి దేవుని వాక్యం బోధించగా వాక్యం విన్నాను. నాన్న భక్తి నన్ను ప్రభావితం చేయలేదు. నాన్నముందు నటన చేసేదాన్ని.

**2. వ్యాధి సంభవించుట, దర్శనం చూచుట :-** నాకుమార్తెకు 6 నెలలున్నప్పుడు నాకు అతి ప్రమాదకరమైన నిమోనియా, టయిఫాయిడు జ్వరాలు వల్ల శరీరము చల్లబడిపోయి మాట పడిపోయింది. నా భర్త, నా స్వకీయకులంతా చాలా ఏడుస్తూ మంచంచుట్టూ చేరారు.

డాక్టరు వచ్చారు. నా కివన్నీ తెలియలేదు గానీ ఆరాత్రి ఒక దర్శనాన్ని చూచాను. ఎత్తైన శిఖరము చేరుటకు మెట్లుకెక్కుచూ స్తోత్రము, స్తోత్రమని నా నోటితో అప్రయత్నంగా పలుకుచునే వున్నాను. మార్గానికిరువైపులా అన్య దేవుళ్ళయిన రాముడు, సీత, కృష్ణుడు, రుక్మిణి కన్పించారు. నేనే మీ దేవుళ్ళము మిమ్ములను ఎక్కనీయమని బెదిరిస్తూండగా, మీరు మా దేవుళ్ళు కారు అంటూ స్తుతిచేస్తూనే వున్నాను.

అంతలో తెల్లని వస్త్రములు ధరించియున్న ప్రభువు దర్శించగా ఆయన పాదములపై పడి ఏడ్చుచుండగా ఆయన అద్భుతమైన, పరిశుద్ధమైన హస్తముచాపి నన్ను ఆశీర్వాదించారు. దేవునికే స్తుతి కల్గునుగాక. దైవచిత్తానుసారము మారుమనస్సు కల్గించగలరని నా పట్ల నెరవేరింది.

నా తల్లికి నా చెల్లి పుట్టిన 19 సంవత్సరముల తర్వాత గర్భము వచ్చినందున వ్యాధితోనున్న నాకు పరిచర్యచేయుటకై నా చెల్లి రూతు ఆస్పత్రిలో నా దగ్గరకు వచ్చింది. దైవసేవకులు భార్యా భర్తలు ఈ అమ్మకు సేవచేస్తామన్నారు. నెలరోజులు చాలా శ్రద్ధతో సేవచేసారు. యింటివద్ద నా కుమార్తెకు జ్వరముకురుపులు వచ్చాయని నాన్న నాకు తెల్పారు. నా పరిస్థితి ప్రాణాపాయమని డాక్టర్లు తెల్పారు గాని నాప్రాణము ఆగలేదు. డాక్టరుకు

తెలియకుండా రిక్షాలో యిల్లుచేరి బిడ్డను చూచుకున్నాను. పాప జ్వరము తగ్గింది గాని నాకు జ్వరం ఎక్కువయింది. నా జీవితంలో క్రీస్తును దూషించి ఎగతాళిచేసిన పాప ఫలితమని పశ్చాత్తాపపడ్డాను. మరణదశలో నన్ను ప్రభువు ఏర్పాటుచేసుకున్నారు. డాక్టరుకు తెలియకుండా యింటికి వచ్చినందున ఆ ప్రాంతంలో తెలుగురాని జాన్‌గారనే దైవజనుడు నా భారం భరిస్తానని మాటయిచ్చారు. అంటువ్యాధని అందరూ భయపడే వారిమధ్య నాకు ఆహారపదార్థాలిచ్చి చాలా ప్రేమించి సేవచేసారు.

నా చిన్ననాటి స్నేహితురాలి సహాయంతో ఒకచిన్న గదిలో కాపురము పెట్టి ఒంటరిగా నుండగా మా నాన్న నన్ను వెదుక్కుంటూ వచ్చి బలహీన స్థితిలోనున్న నన్నుచూచి చాలా దు:ఖపడ్డారు. నన్ను యింటికి తీసుకొని వెళ్ళి ఆదరించి ప్రేమతో క్రీస్తును నమ్మిన నన్నుబట్టి ఆనందించారు.

నశించిన వారిని వెదకి రక్షించిన వాడు నా ప్రభువు. ఆ క్షణం నుండి నా శరీరము, ఆత్మ సజీవయాగముగా ప్రభువుకు అంకితము చేసాను. అలంకరణలమీద, నగలపై మోజుతగ్గి విరక్తి కల్గింది. నా దగ్గర వున్న పెద్ద పట్టుచీరను 50 రూ॥లకు అమ్మి వేసాను. ఆస్పత్రిలో నున్న రోజుల్లో పినతండ్రి కుమార్తె కూడా ఆస్పత్రిలో నుండగా బంధువులంతా వచ్చి పరామర్శించేవారు. నా కొరకు ఎవరూ వచ్చేవారు కాదు.

ఒంటరిగా నుండగా ప్రభువు నాతో మాట్లాడారు. నేనే నీకు సర్వము కద! అనే తలంపుతో నీవు తప్ప నాకెవరూ లేరు. నీవు చాలు, నీప్రేమ చాలు అని తీర్మానము చేసుకున్నాను. నా శరీరము చాలా కృషించిపోయింది.

**3. బాప్తీస్మ అనుభవము :–** నేను ఆస్పత్రిలో బాధపడి, శ్రమలో దర్శనము ద్వారా క్రీస్తును స్వీకరించిన రోజుల్లో చెల్లెలు రూత్ రక్తస్రావ రోగంతో బాధపడినది. నేను చెల్లిని ఆదరించి క్రీస్తును ఆశ్రయించినచో 12 సంవత్సరాలు శ్రమపడిన రోగిని క్రీస్తుప్రభావము అందుకొని స్వస్థత, రక్షణ పొందిన అనుభవం తెల్పి మూడురోజులుగా ఉపవాసముండి యిద్దరము బాగా ప్రార్థించినందున చెల్లికి స్వస్థత, రక్షణ లభించింది.

మొదటిగా నా సాక్ష్యము చెల్లికందించి ఆమె రక్షణకు సహకరించే భాగ్యము పొందిన వెంటనే ఆ ప్రాంతంలో దైవసేవకులు ఉజ్జీవ సభలు నిర్వహించగా చాలా ఆత్మీయమేలు పొందాము. “ఇదే రక్షణ దినము రేపు నీదికాదు తడవు చేయక క్రీస్తును వెంబడించి బాప్తీస్మ అనుభవాన్ని పొందాలి” అని హెచ్చరిక నాలో క్రియ జరిగించింది.

వెను వెంటనే బాప్తీస్మం తీసుకున్నాను. చెల్లి కూడా త్వరపడమని హెచ్చరిక పాటించి అలమరలోనున్న సంచి తీయుచుండగా తేలుకుట్టింది. ఆ బాధను లెక్కచేయక ప్రార్ధన ద్వారా నిజామాబాదులో పరదేశిగారు ప్రమాణము చేయనైయుండగా వెంబడించింది. వెంటనే సమీపాన గల చెరువులో యేసునామములో బాప్తీస్మం పొంది దేవున్ని స్తుతించింది.

**4. శ్రమలు ఆరంభము :-** ఒక్కఆత్మ రక్షణ పొందగానే పరలోకంలో స్తుతి గానాలుంటా యని తెలుసు గాని సైతానుకు బాధకల్గి శ్రమలురానిచ్చి విశ్వాసిని నిరుత్సాహపర్చుట పనిగా పెట్టుకుంటూడు గనుక నా భర్త నా స్వకీయులంతా నన్ను మతంమార్చుకున్నావేమి అని నిందించి, హింసించి, ఉమ్మివేసి అవమానపర్చుట కారంభించారు. నాలో క్రీస్తుప్రేమ ఆరని జ్వాలగా నుండి తెగించి ఎక్కడ ప్రార్ధనలు జరుగుచున్నవో గమనించి, బోధన్, తిరుమారు, బెంగాల్, చింతకుంట, వర్ని ప్రాంతాలకు త్వరపడి వెళ్ళి ఆరాధించుకొనేదాన్ని.

నా యింటిలో ప్రార్ధించుటకు ఒక గదినుంచి దైవసేవకులకు ఆతిధ్యమిచ్చి వాక్యము నేర్చుకొనేదాన్ని. దేవుడే నా యింటిలో నివసించినంత ఆనందం కల్గేది. అట్టి ధైర్యసాహసాలతో నింద, దూషణ, యిరుకులలో ప్రభుని ప్రేమించుట కారంభించాను. ఆది క్రైస్తవులు క్రీస్తును ప్రేమించిన తీరు నన్ను ప్రోత్సహించేది. మొదటిసారిగా నా అనుభవ సాక్ష్యము చెప్పమని సమీపములోగల కిషన్‌పారంలో ప్రార్ధనా సమావేశమునకు రమ్మని ఆహ్వానించారు.

అప్పటికే ప్రతిచోట నీ సాక్షిగా నేనుండునట్లు ఆత్మాభిషేకానిమ్మని ఏకాంతంగా ప్రార్ధించిన ఫలితంగా నా ద్వారా రక్షింపబడిన నా ప్రక్కయింటిలోనున్న లక్ష్మి దేవమ్మను తోడుగా రమ్మని అడిగాను. ఆమె కాస్త సంశయించగా "రేపు నీదికాదని ప్రభువు చెప్తున్నారని తెల్పాను. నా యింటి ప్రక్కవారు నా భర్త బిడ్డిలకు భోజనము సిద్ధపర్చగలరనే నమ్మకంతో గొప్ప త్యాగముతో వారిని వదలి చెప్పకుండా వెళ్ళిపోయి రెండుదినములు ఆగ్రామములో అనేకులకు సాక్ష్యముచెప్పి దేవున్ని సంతోషపర్చగల్గాను.

మా అన్యుల కుటుంబాలలో స్త్రీలు వంటయింటికి పరిమితమైనట్లుగా జీవించే పరిస్థితులలో ధైర్యముగా క్రీస్తు కొరకు సాక్ష్యము చెప్పుట అనేకులను ఆకర్షించగా మారుమనస్సు పొందు భాగ్యము ఆ గ్రామస్తులకు దేవుడు అనుగ్రహమిచ్చారు. నేను ప్రార్ధన చేసుకొని యిల్లుచేరగానే ప్రక్కయింటి రామయ్యగారు, "ఏమ్మా నీ భర్తకు చెప్పకుండా భర్త, చిన్నపిల్లలిద్దరిని వదిలి క్రీస్తు పరిచర్య అని వెళ్ళిపోయావు కద! ఆయన చాలా కోపంగా ఉన్నారని చెప్పారు.

నాతో వచ్చిన లక్ష్మి దేవమ్మ నా కోసము ప్రార్థించి, నా భర్త నన్ను బాధించకూడదని విజ్ఞాపన చేసింది. తోటివారికై చేయు విజ్ఞాపన బహు బలముగలది గనుక నా భర్త నాపై కోపము చూపలేదు గాని, వంటచేసి సహాయము చేసిన స్త్రీకి బియ్యము యివ్వమని తెల్పారు.

నా బిడ్డలు పేచీపెట్టక ప్రశాంతంగా నుండగా దేవునికి కతజ్ఞతలు తెల్పాను. ప్రతిదినమ సమయము సద్వినియోగము చేస్తూ, వంటపని, యింటిపనులు చురుకుగా చేసుకొని దేవుని సన్నిధిలో వాక్యము ధ్యానిస్తూ ప్రార్థించుటలో చాలా ఆసక్తితోనుండేదానను. శ్రమలు, వేదనలు ఆరంభము కాగా నా భర్త రక్షణకొరకు ప్రార్థించుచూ, యాకోబు గారిచే వాక్యపరిచర్య ద్వారా ధర్మారం గ్రామంలో రూతమ్మ, లక్ష్మి దేవమ్మ, నేను ముగ్గురము రాత్రికూడికలు పెట్టుకొనుచు ఆత్మీయంగా బలపడసాగాము.

ఒకరాత్రి 11 గంటల సమయములో మా కుమార్తె రాణి నిద్రలేచి "అవిగో పాములు" అని కేకలు పెట్టింది. రోజూ ఏడ్చేది. నా భర్త దగ్గర పండుకొనబెట్టాను. నా భర్తకు కూడా పాములు కన్పిస్తున్నాయని చెప్పి మొదటిసారి నన్ను ప్రార్థించమని అడిగారు. రెండు సంవత్సరాలు నా బిడ్డ రాణి కొరకై ప్రార్థించుట, నేను రోగిగానుండగా దర్శనము చూచి రక్షింపబడుట గమనించిన నా భర్తలో నమ్మకము కల్గినది.

నా కుమారుడు విద్యాసాగర్ నాలుగు సంవత్సరములు వయస్సులో నుండగా ఇటుకల దగ్గిర ఆడుకొనుచుంగగా తేలుకుట్టి విషము వల్ల నోటిలో నురగలు వచ్చాయి. వెంటనే నిజామాబాదు ఆస్పత్రిలో చేర్చగా, మా ప్రార్ధనలు గమనించిన డాక్టరు "అమ్మా నీ ప్రభువే నీ ప్రార్ధనల వల్ల బ్రతికించాడని" సాక్ష్యమిచ్చాడు.

నా భర్త స్కూలు టీచరుగా పనిచేసేవారు. ఆ రోజుల్లో కరెంటులేదు. రాత్రివేళ మా బాబు అగ్గిపెట్టెకై గూట్లో చేయిపెట్టగా మండ్రగబ్బము కుట్టి ప్రమాదస్థితికి చేరాడు. రాత్రివేళ బస్సు సౌకర్యాలు, రిక్షా, ఆటోలు లేనందున మా నాన్న గారితో కలిసి ప్రార్థించాను. 2 గంటల సమయంలో అద్భుత స్వస్థత లభించింది. ఎందుకీ శ్రమలు కల్గుతున్నాయి? అని నా భర్త నాతో కోపంగా ఉండి మాట్లాడేవారు కారు. నా తండ్రి ధనవంతుడైనను స్నేహితులతో చెడు సహవాసంచేసి ఆస్తి కోల్పోయారు. నాకు ఏమీ ఆస్తి యివ్వలేదు. అత్తమామలకు ఆరుమంది సంతానము. వ్యాపారంలో నష్టము కల్గింది. ఎన్ని శోధనలు, వేదనలు ఎదురైనను ప్రభువు కృపనుబట్టి సాక్ష్యమిచ్చుటలో, రక్షణ మార్గము యితరులకు తెల్పుటలో చాలా ఆనందము కల్గేది.

నాకు మూడవ కాన్పులో చాలా బలహీనమయ్యాను. చిన్న యిల్లు, చిన్న జీతము. 60 రూపాయిలతో సర్దుకొనేవారము. వర్షాకాలము యిల్లుతడిచిపోయేది. నా ప్రసవకాలము వచ్చి కవల పిల్లలు పుట్టి యిద్దరూ మరణించారు. నా తల్లిదండ్రులకు తెలుపలేదు. నా భర్తకు నెమ్మదిలేదు. నాకు నాలుకపై కురుపువచ్చింది. నీ దేవుడు చనిపోయిన వారిని బ్రతికించలేదా? నీకు స్వస్థతయివ్వలేడా అని నిందించి నన్ను చాలా దెబ్బలుకొట్టారు. చాలా బాధపడి బిడ్డలతో ఎక్కడికైనా వెళ్ళాలని రిక్షా ఎక్కాను. ప్రభువు నా శ్రమలో సూటిగా మాట్లాడారు.

"అమ్మా, ఒక చెంపమీద కొట్టినచో రెండవ చెంప చూపించు. నా నిమిత్తము శ్రమలు, నిందలు, అవమానాలు వస్తాయి. ప్రజలు ద్వేషిస్తారు. అంతము వరకు సహించినవారు ధన్యులు" అన్నారు. అంతేకాదు "అమ్మా ఓర్పుతో వుండు. తిరిగి యింటికి వెళ్ళిపో తల్లీ" అన్నారు. నేను ఆ మాటలకు లోబడక బస్సుదగ్గర కనిపెట్టగా బస్సులేమీ రానందున తిరిగి యిల్లుచేరాను. పిల్లలు ఆకలికి ఏడుస్తున్నారు. నేను బయటకువెళ్ళిన సంగతి నా భర్తకు మాత్రమే తెలిసి ఆతృతతో వెదికారు.

నా ఒంటరి తనములో కన్నీటితో ప్రార్థించాను. "ప్రభువా నీచిత్తమైతే నన్ను నీ రాజ్యములో చేర్చుకో లేనిచో నెమ్మదినిచ్చి నాద్వారా మహిమతెచ్చుకో" ఆ తర్వాత ప్రశాంతంగా నా నాలుకపై కురుపు రక్తము కారి బాధించగా 10 రోజులు క్రమంగా ప్రార్థించగా స్వస్థత చేకూరింది.

నా భర్త నేను మందిరమునకు వెళ్ళాలి అని అడుగగా "వద్దు, యింటిలో ప్రార్థించుకో" అని నిర్భందించారు. నా భర్తతో నీ ప్రభువు బ్రతికించలేడా అన్నారుగ! ఆ ప్రభువే నన్ను బ్రతికించారు. నీకు చేయవలసిన పరిచర్య అంతయూ చేసేస్తాను. నేను ప్రార్ధనకు వెళ్ళాలి" అన్నాను. నీవు వెళ్ళితే తిరిగి యింటికి రావద్ద అన్నారు. నా మనస్సులో ప్రభుని వాగ్ధానాలు ధ్యానించాను.

**యెషయ "ఇత్తడి తలుపులు పగులగొట్టి, ఇనుప గడియలు విరుగగొట్టెదను"**

మనుష్యుల హృదయము కదిలించలేవా దేవా నీవే చూచుకో అని ప్రార్ధించి ప్రార్ధనకు ధైర్యంగా వెళ్ళిపోయాను. తిరిగి వచ్చేసరికి నా భర్త చాలా ప్రశాంతంగా యింటితాళాలు యిచ్చారు. నేను సాక్ష్యము చెప్పి దేవున్ని మహిమపర్చినందున నా భర్తలో మార్పుకల్గింది. నా జీవితాన్ని గమనించిన వారంతా దేవుడు నిన్ను చాలా దీవించారని సాక్ష్యమిచ్చారు.

కరువులో, వస్త్రహీనతలో, అవమానాల్లో నన్ను బలపరచి నాలో దిగులు, వేదన లేకుండా చేసారు. ఆయన కృప నాకు చాలును అనిపించేది. ఒకరోజు బిడ్డలు చిన్నవారిగా నుండగా యింట్లో పాపను ఉయ్యాలలో వేసి బయటపనులు చూచుచుండగా పెద్దపాము వాసము మీదగా పాకివస్తున్న రీతినిబట్టి 8 సంవత్సరముల నా బాబు పరుగున వెళ్ళి పాపనుఎత్తుకుని బయటకు తీసుకువచ్చి రక్షించాడు. దేవడే వాడికి ధైర్యమిచ్చాడు. ఆ రోజులో పూరిగుడిసెలో జరిగిన ప్రమాదాన్ని బట్టి యిల్లు మారి ప్రక్కగదికి సామానులు సర్ది పాములవాడిని పిలిపించాము. మేమున్న గదిలోనే పాము దాగివుందని చెప్పాడు. దేవుడే మమ్ములను రక్షించాడు.

మా అమ్మకు ప్రకాశరావు అనే కుమారుడు కల్గాడు. పసితనంలో లంబాడీ బాష మాట్లాడేవాడు. ప్రార్థించాము. నెమ్మది కల్గింది. ప్రకాశరావు ఇంటరులోనుండగా ఒకరోజు చాపతీయండని చెప్పాడు. మేము చూడగా రెండు తేళ్ళున్నాయి. అవి కుట్టాయి. శరీరము బండబారింది. ప్రార్థించగా స్వస్థతపొందాడు. చెల్లి, తమ్ముడు రక్షణపొంది బాప్తీస్మము పొందారు. నిజమాబాదులోనున్న పాస్టరు బి.యస్.పాల్‌గారు ఆత్మీయ సత్యాలు వివరిస్తూ ఆత్మీయంగా అందరినీ బలపర్చేవారు. మావాళ్ళు బాప్తీస్మము తీసుకొని ఆత్మీయంగా స్థిరపడ్డారు.

మా నాన్నకున్న పొలంలో నాట్లువేయించుటకై ప్రయాణంచేస్తూ రోడ్డు ప్రమాదంలో దెబ్బలు తగిలి రక్తంకారుచూ పడివుండగా ఎవరో మాకుచెప్పారు. ఆస్పత్రిలో చేర్పించాము. మెదడుకు దెబ్బతగిలింది. మాట సరిలేదు. ప్రార్థన చేయగా స్వస్థత లభించింది. థామస్ పాస్టరుగారి ప్రార్థన మాకెంతో ఆదరణ కల్గించింది. నాన్నపై ఆరాత్రి ఆత్మ పావురమువలె వ్రాలుట చూచారు. ఎందరో మా శ్రమలుచూచి దూషించి ఎగతాళిగా వీరి దేవుడు రక్షిస్తాడా? చూద్దాములె అన్నవారంతా ఆశ్చర్యపడ్డారు.

ఒకసారి పాము నా భర్త పాదాలమీదుగా దాటి వెళ్ళింది. హానిచేయలేదు. నాకు తేలుకుట్టినప్పుడు ప్రార్థించి స్వస్థత పొందగా తోటివారు ఆశ్చర్యపడ్డారు. దర్శనాల ద్వారా పాము అరుగులోనున్నదని చూపగా పాములవాడు త్రవ్వితీసి చంపాడు.

మరొకసారి కలలో మంటచూచాను. నా భర్త నీళ్ళుతోడుచుండగా ఎదురిల్లు కాలుచు మంటలు కనిపించగా ఆ నీళ్ళుపోసి వెంటనే ఆర్పివేసాము. ప్రభువు స్పష్టంగా ప్రమాదాల హెచ్చరికలు చేసి రక్షించేవారు. నేను చర్చ్ ఆఫ్ గాడ్ సహవాసంలో నుండేవారము. బోధన్, చింతగుంట, శెక్కర్, బేగర్ అంకాపూరు, వంటకుదురు, వర్ని హైదరాబాదులో, నిజామాబాదులో సంఘాలున్నాయి. నేను అంతగా చదువుకోలేదు. ఒకటవ తరగతిలో

గుణింతాలు చదివాను గాని బైబిలు చదువగలను. ఉర్దూ నేర్చుకున్నాను. కరువు, వస్త్రహీనత, అపాయములు, మరణకరమైన వ్యాధులు, శత్రువుల వలన బాధలు, దొంగల బారినుండి తప్పించుట పాములు, తేళ్ళ బాధల నుండి రక్షించారు. అన్యుల హేళనలు, ఆర్థిక బాధలు, శోధనలలో నుండి విజయమిచ్చారు. నేను సంతకము చేసేదాన్ని. సాక్ష్యము వ్రాయుటకు నా కుమార్తె ప్రోత్సాహమును బట్టి కొన్ని నెలలుగా శ్రమించి వ్రాసాను.

**5. పరిశుద్ధాత్మను కోరుట**

ఆ రోజుల్లో కాకినాడ నుండి కొందరు పాస్టర్లు నిజామాబాదు వచ్చి ప్రార్థనా కూటాలు పెట్టారు. వర్గీసుగారు ఆత్మతో నింపబడిన సందేశాలన్నీ మా హృదయాల్లో క్రొత్త ఆధ్యాత్మిక లోతుల్లో ఉజ్జీవాన్ని కల్గించాయి. “మీలో ఎవరైనా పరిశుద్ధాత్మను పొంది అన్య భాషలు మాట్లాడుచున్నారా” అని అడిగారు. మాకేమీ తెలియదు అని చెప్పాను. కేరళనుండి వచ్చిన కుంజమ్మ, దీనమ్మ గార్లు యింటింటికి వచ్చి సువార్త బోధించేవారు.

నా భర్త ఉద్యోగరీత్యా ట్రయినింగ్‌కై 6నెలలు బిక్కనూరు వెళ్ళారు. అది చలికాలము. ప్రతిరాత్రి స్త్రీలు రాత్రి 9 గంటలకు ప్రార్థనలకు కూడుకొనేవారము. ఊరిమధ్యనున్న హైదరాబాదు రోడ్డుపై మైలుదూరం నడిచేవారము. శాలువా కప్పుకొని లాంతరు చేతిలో పట్టుకొని చీకటిలో లారీలు, బస్సులు తప్పించుకొంటూ చేరి ఆత్మీయంగా పాటలుపాడి ఉజ్జీవంతో ప్రార్థించి పరిశుద్ధాత్మకై కనిపెట్టేవారము.

ప్రతిరాత్రి బిడ్డలిద్దరికీ భోజనము పెట్టి వారిని మంచాలపై నిద్రించాలని చెప్పి యిల్లు తాళంపెట్టి ఒంటరిగా ఆశతో పరిశుద్ధాత్మ పొందాలని దూరప్రయాణము చేసి కనిపెట్టాను. ఆత్మనింపుదల కావాలనే తపనతో నా బిడ్డలను సహితం వదిలి వెళ్ళుటను బట్టి ప్రభువుపట్ల నాలోనున్న ప్రేమ ఆత్మతో నింపబడాలన్న అత్యంత ఆసక్తి నన్ను భక్షించేది. సరిగ్గా 6 రోజులు గడిచాయి. 7వ రోజు ప్రభువు దర్శించారు. సముద్రంలో ఈదుచున్నట్లు చూచాను. 8వ రోజు సైతాను పిల్లలను బట్టి భయము కల్గించి వారు ఏడుస్తారు, భయపడగలరని కలత కల్గించాడు. అయినను ప్రార్థించి బిడ్డలకు వీడ్కోలు తెలుపగా సంతోషంగావెళ్ళు అమ్మా అన్నారు. ఆరోజు స్త్రీలమంతా గుండ్రంగా నిలిచి, ఆనందము ఆనందము అని స్తుతించాము. ఆ క్షణములో ఆత్మవశులమయ్యాము. బలమైన గాలివంటి ధ్వని ఆవాశం నుండి అకస్మాత్తుగా నాపై నిలిచింది. అన్య భాషలు మాట్లాడసాగాను. అందరిలో ప్రభువు నన్ను మాత్రమే తాకారు.

**లూకా 11:12 "కాబట్టి మీరు చెడ్డవారైయుండియు మీ పిల్లలకు మంచి ఈవులనియ్య ఎరిగి యుండగా పరలోకమందున్న మీ తండ్రి తన్ను అడుగువారికి పరిశుద్ధాత్మను ఎంతో నిశ్చయముగా అనుగ్రహించును"**

ఈ వాగ్ధానము నమ్మి ప్రార్ధించి ఆత్మను పొందాను. హల్లెలూయ. దేవునికే స్తుతికల్గును గాక.

**6. భర్తకు ఉద్యోగములో సమస్యలెదుర్కొనుట**

మా ఊరిలో నా భర్త, పనిచేయు ఊరిలో రెండు పార్టీలుండేవి. అందరితో సమాధానం కోరిన నా భర్త యిబ్బందులు, విమర్శలు, వ్యతిరేఖతలు నెదుర్కొన్నారు.

**కీర్తనలు 46:10 "ఊరకుండుడి నేను దేవుడనని తెలుసుకొనుడి. యెహోవా మనకు తోడై యున్నాడు"**

ఈ వాక్యము నా భర్తకు చూపించి ధైర్యం చెప్పాను. పంచాయితీ ఆఫీసరు "మాష్టారు గారూ నీ మీద నేరాలు మోపారు. నెమ్మదిగా ఉండండి" అని అభయమిచ్చారు. ఆయనను నమ్మినవారు సిగ్గుపడరు. మమ్ములను కృంగిపోకుండా, జారిపోకుండా ఆదరించి నడిపించారు.

నా భర్తకు అనుకోని రీతిగా నిమోనియా జ్వర తీవ్రతతో ప్రమాదస్థితికి చేరారు. నాకు ప్రార్ధన తప్ప ఏమీ తెలియదు. ముగ్గురు బిడ్డలను ఎలా బ్రతికిస్తానోనని నాపై జాలిపడేవారు. వళ్ళంతా చల్లబడిన నా భర్తను సమీపించి ఏమీ కదలికలేక చల్లబడిన శరీరాన్ని గమనిస్తూ కన్నీటితో ప్రార్ధించాను.

నా భర్తను రక్షించు ఆతర్వాత నీ రాజ్యం చేర్చుకో అని ప్రార్ధించాను. నాన్న ఆయనను ఆస్పత్రిలో చేర్పించారు. కొంత నెమ్మదికల్గింది. మా గ్రామస్తురాలు కూడ అదే ఆస్పత్రిలో కుమారుని చేర్పించింది. నా భర్తను వదలి మందిరమునకు వెళ్ళి ప్రార్ధించుటను చూచి చాలా విమర్శించింది. కానీ ప్రార్ధనద్వారా నా భర్త స్వస్థతను చూచి సిగ్గుపడి నా ప్రార్ధన ద్వారా నా భర్త బ్రతికాడని నమ్మింది.

మా అత్త మామలు 3 రోజుల తర్వాత వచ్చారు. నా భర్త వారి అమ్మతో సాక్ష్యము చెప్పారు. క్రీస్తు ప్రభువు నన్ను దర్శించారు. నేను బ్రతకాలి. నా భార్య బిడ్డలు ఒంటరివాళ్ళయి పోతారని అడిగాను. నేను ఆత్మలో అమ్మా అన్నాను. నీకు వినిపించిందా" అన్నారు.

నా భర్త నా ప్రవర్తన, నడవడిక, మాటలు, పనులు, చేస్తున్న ప్రార్ధనలు గమనిస్తూ, అనేక అపాయాలు తప్పించుట తరచిచూచారు. ప్రభువులో స్థిరంగా ఉంటే మనము

భయపడము. మనమే పత్రికలము కద! మేము విశ్వాసులముగా మంచికాపరికై ప్రార్ధించగా అపొస్తలుడు, సమూయేలు గారు, పరంజ్యోతి అయ్యగారు, దైవప్రేరణతో బి.ఎప్.పాల్ పాస్టరుగారిని నిజమాబాద్ పంపారు. మా నాన్నగారి పేరు జంపని వీరయ్యగారు. ప్రభువు మీ దగ్గరకు వెళ్ళమని పంపారని తెల్పారు. ఆ రోజుల్లో నాన్నగార్కి కలరా సోకగా ప్రార్ధించాము. స్వస్థపర్చారు. దొంగలు పడి సమీపంలో యిళ్ళను దోచుకున్నారు. మా యింటిలో ఏవస్తువూ పోలేదు.

**కీర్తనలు 91:10-11** ఏ అపాయము రాదన్న వాగ్ధానము నెరవేర్చారు.

**7. నా కుమార్తె రక్షణ**

నా కుమార్తె రాణి పుష్పావతి అయిన రోజుల్లో అంజమ్మ అనే స్త్రీకి చేతబడి అనగా బాణామతి చేయగా భూతవైద్యం చేయించారు. ఆమె మా యింటికి వచ్చి ఏడ్చింది. ఆమెతో మాంత్రికుడు స్పష్టంగా మాట్లాడాడు. ప్రార్ధనా శక్తికి సైతాను విలవిలలాడిపోతుంది కద! పాపయ్యఅనే వ్యక్తి భార్య అంజమ్మపై సైతాను ప్రయోగం చేయించాడని తెల్పారు.

ఆమెను మా యింటిలోనే ఉంచి ప్రార్ధించసాగాము. ఆ రాత్రి గంగారామనే మాంత్రికుడు మా పడకలచుట్టూ బొమ్మలను పంపాడు. ఆ రాత్రి చిన్నమ్మాయి కెవ్వున కేకవేసింది. నేను సైతానుతో మాట్లాడి ఎందుకు పిల్లలను బాధపెట్టావని అడుగగా, మీ అమ్మాయిని మ్రింగమని ఆదిశక్తిని పంపాడు. ఆమె దేవునిబిడ్డ గనుక ఆమెచుట్టూ దేవుడు కంచెనుంచి భద్రతనిచ్చాడని చెప్పింది. నా భర్త కూడా ప్రభువుని నమ్మారు. ఆత్మతోనింపి అందరినీ నడిపించారు. మాంత్రికుడు పెట్టిన బొమ్మలను యేసురక్తమునకు జయమని చెప్పి ప్రార్ధించి పగులగొట్టాము. మాంత్రికుని పండ్లు ఊడగొట్టానని ప్రభువు తెల్పారు. అంజమ్మకు పూర్తి స్వస్థత లభించింది. ఆ తర్వాత మాపాప రాణి కొరకు ప్రార్ధన పెట్టాము. బంధువులంతా వచ్చారు. అంజమ్మలో సైతాను ప్రవేశించి "ఎస్తేరమ్మా, నీవే నన్ను నశింపజేస్తున్నావు" అని బెదిరించింది.

నా పేరు కోటేశ్వరమ్మ అనే అందరికీ తెలుసు. "ఎస్తేరమ్మా, యోబును శోధించినట్లు నిన్ను నీ కుటుంబాన్ని శోధిస్తానని శపధము చేసింది. అంజమ్మ నల్లచీర కట్టుకొని గోడఎక్కి సినిమా పాటలు పాడి గోలచేయగా భారంతో ప్రార్ధించాము. సైతాను పారిపోయిన వెంటనే స్వస్థత పొందింది. బంధువులంతా దేవుని శక్తిని చూచారు. నగలు లేకుండా దేవదూతవలె ప్రకాశిస్తున్న రాణిని చూచి ఆశ్చర్యపడి దేవుని మహిమపర్చారు. వేడుకకు వచ్చిన 200 మంది మా పట్ల దేవుడు చేసిన అద్భుతాలను చూచి దేవున్ని ఘనపర్చారు.

**యాకోబు 5:7-8** వాక్యములో ప్రకారము నా భర్త రక్షణ నన్ను ఎంతో ఆనందపర్చింది. నా భర్త రక్షణపొందిన వెంటనే వాక్యపరిచర్య చేయు అద్భుత ధన్యత నిచ్చిన ప్రభువు సేవకురమ్మని పిలిచారు. అనేకచోట్ల వాక్యపరిచర్య చేసేవారు. నా కుటుంబము చిన్న పరలోకముగా మారింది. ఎన్ని శోధనలు, బాధలున్నను భార్య, భర్త, పిల్లలు దేవునిని కల్గి ఆయనలో ఆనందిస్తూ వుంటే ఎన్ని కష్టాలు వచ్చిననూ ఎన్నదగినవి కావు. రోజూ మేము ఏకీభవించి ప్రార్ధించేవారము.

నా పినతండ్రి నా విశ్వాస జీవితాన్ని అసహ్యించుకొని ఉమ్మివేసేవారు. ఒకనాడు ఆయన జబ్బుపడ్డారు. టి.బి. వ్యాధి బాధించగా నేనువెళ్ళి ప్రార్ధించనా అని అడిగాను. ప్రార్ధనచేయమని అంగీకరించగా ప్రార్ధించాను. చాలా నెమ్మదిగా ఉన్నదని తెల్పారు. నా భర్త దైవజనులతో సువార్త చెప్పించి ప్రార్ధించగా ఆయన రక్షణపొంది బాప్తీస్మం కోరారు. నవంబరు 30వ తేదీ తీవ్ర చలిలో బాప్తీస్మము పొందారు. ఆసక్తితో దేవున్ని వెంబడించారు. ఆ తర్వాత ప్రభుని సన్నిది చేరారు. నా భర్తకు రెడ్డిపేట బదిలీ అయింది.

ఒక కోమటి వారింట్లో మేము ఉండగా చిన్నపాపకు ఒళ్ళంతా బొబ్బలు వచ్చాయి. ప్రార్ధించగా స్వస్థత పొందింది. వాళ్ళ పూజలకు ఆటంకముగానున్నామని ఆ కోమటి కుంటుంబము ద్వేషించేవారు. మరొకస్త్రీ బీడీలు చేసేది. సైతాను ఆవరించగా కేకలువేసేది. నా భర్త ప్రార్ధించగా స్వస్థత పొందింది. నా భర్త శివాలయంలో నున్నవారికి సువార్త చెప్పగా క్రీస్తును నమ్మినందున కొందరు వ్యతిరేకులై నా భర్తను బదిలీచేయుటకు తలంచారు. శత్రువులలో ఒకని బిడ్డకు లెక్కలుచెప్పి పాస్ చేయించి మేలుచేయగా, ఈ మార్పుచూచి కోమటివారు కూడా మీ ప్రభువు గొప్పవాడు, మీ విశ్వాసము గొప్పదని తెల్పాడు. అతనికి ఒంటిలో పురుగులు ప్రాకిన భావం ప్రార్ధన ద్వారా తొలిగిపోయింది.

ఈ రీతిగా ఎందరికో స్వస్థతలు అద్భుతంగా జరుగుట చూచి రక్షణలోనికి వచ్చి దేవున్ని మహిమపర్చుట మాకెంతో ఆనందం కల్గించేది. నా భర్త అక్క కుమారున్ని పక్షవాతము నుండి ప్రార్ధన ద్వారా స్వస్థతపొందాడు. నా సమీపబంధువు మాట పడిపోగా ప్రార్ధించగా ఆమె మీదికి వెలుగుదిగింది. మృతులను లేపిన దేవుడు చేసిన ఆశ్చర్యకార్యాలను బట్టి స్తుతించారు.

నా మేనత్త చెల్లి నేను క్రీస్తును నమ్మినందులకు చాలా దూషించి హీనపర్చేది. ఆమె బి.పి.వల్ల చాలా బలహీనంగా నుండగా ప్రార్ధించాను. ఆమె స్వస్థత పొందగా క్రీస్తును నమ్మి బాప్తీస్మము పొంది సాక్షిగా మారింది. ఆమె సమీపబంధువులంతా ఆమె సాక్ష్యమును బట్టి రక్షణ పొందగా పాల్‌గారి ద్వారా బాప్తీస్మం పొందారు. నా కుమారుని

విద్యాభ్యాసము ఎం.ఎల్. ప్రవేశానికి డబ్బు చాలనందున భారంతో ప్రార్ధించగా సిద్దయ్య అనే యింటిప్రక్క అబ్బాయి 400రూ॥లు యిచ్చి ఆదుకున్నాడు. మరొకసారి పాలవాని ద్వారా అతని అవసరాలన్నీ ఆశ్చర్యంగా తీర్చారు. అది ప్రభవు చేసిన అద్భుతము.

నా భర్తను బీర్కూరు బదిలీచేసారు. నా భర్తకొక కుటుంబముతో పరిచయం కల్గింది. ప్రార్ధనా కూటము తర్వాత వారింట్లో నిద్రించారు. వారింట్లో ఆఖరు అమ్మాయి వివాహము చేయు ప్రయత్నంలోనుండగా మాఅబ్బాయితో సంబంధము చూడాలని పాస్టరుగారిని సంప్రదించారు. మేమంతా ప్రార్ధించగా మమ్ములనెంతగానో నమ్మినవారి కుమారుడు ప్రభాకర్‌గారు వారి అమ్మాయిని మా కుమారుడైన విద్యాసాగర్‌కిచ్చి వారిద్దరికి పరిశుద్ధ వివాహము జరిగించారు.

అమ్మాయిపేరు సునీత. ఆమెకు తలనొప్పి, రక్తస్రావముండగా ప్రార్ధన ద్వారా స్వస్థత లభించింది. మా కుటుంబము మంచి సంతోషముతో దేవున్ని స్తుతించాము. మా అబ్బాయి స్నేహితుల ప్రభావంతో ఉద్యోగము వదలి రాజకీయాలలో చేరుటకు ప్రయత్నించగా అతని భార్య అధికారులతో సంప్రదించి ఉద్యోగములో స్థిరపరచుకొనగల్గింది.

నాకు కూడా 8 సంవత్సరాలుగా పార్శ్వపునొప్పి , వాంతుల వల్ల బాధ కల్గింది. అదనంగా రక్తస్రావము వచ్చింది. ఎవరికీ చెప్పుకోలేదు. ఒంటరిగా ఏడ్చాను. నా భర్త నాకొరకు ప్రార్ధించగా స్వస్థత లభించింది. మరొకసారి కడుపునొప్పితో ఆస్పత్రిచేరాను. కిడ్నీలు పాడయ్యాయన్నారు. సకాలంలో చేర్చినందున బాగుపడ్డాను. మందిరములో ప్రార్ధన చేయించుకొన్న తర్వాత ఆస్పత్రిచేరాను. నా భర్త ఓర్పు, సహనము, శాంతం, ప్రేమ గలవారు. మంచి భర్తనిచ్చినందుకై దేవునికి కృతజ్ఞత తెల్పేదానను.

**8. కుమార్తె రాణి అనారోగ్యము – సేవకై సమర్పణ :-**

అది 1995 అక్టోబరు 13వ తేదీ రాత్రి 2 గంటల సమయంలో ఆమెకు వాంతులు నీరసంతో మాట పడిపోయింది. 6 మంది డాక్టర్లు పరీక్షించి ఏమీ చెప్పలేము 48 గంటలు గడవాలన్నారు. లాజరును లేపిన ప్రభువా నా బిడ్డను బ్రతికించండి. మీ సేవకు యివ్వమన్నారు కద అని ప్రార్ధించాము. ప్రభువు అద్భుత స్వస్థతనిచ్చి లేపారు. ఆమె వివాహము ఆశ్చర్యకరముగా పాల్ గారితో జరిగించుటలో ప్రార్ధన ద్వారా ప్రవచనాత్మకంగా జరిగింది. ఆయన సేవలో చిన్న వయస్సున్న రాణి సహకరించి ఆయన బిడ్డలకు తల్లిగా మంచి సేవచేయగల్గింది. రెండవ కుమార్తె శాంతి వివాహముకై ప్రార్ధించాము. సునీత మా కోడలు, తల్లి తులసమ్మగారు మెట్టపల్లి ప్రార్ధనలకు వచ్చింది. ఆమెకు దర్శనము

ద్వారా సిడ్నీగారి కుటుంబాన్ని చూపించారని తెల్పింది. వారు గన్నవరంలో ఉంటారు. దర్మారము వచ్చి చూడగా 1988 అక్టోబరు 12వ తేదీ వివాహం జరిగింది. శాంతికి కడుపునొప్పి వల్ల గడ్డ అన్నారు. ప్రార్థించాము.

నీ దేవుడైన యెహోవా నీకు తోడైయున్నాడు అనే వాగ్ధానం నెరవేరిన రీతిగా ఆమె గర్భవతి అని డాక్టర్లు తెల్పారు. బాబును పొందింది. ఒకసారి జఫరాజు సాధువుగారి మీటింగులకు వెళ్ళి సూటుకేసు పోగొట్టుకున్నాను. ప్రార్థించి బస్సువారి ద్వారా పొందాము.

**భర్త మరణము**

నా భర్త ఆరోగ్యముగానే కన్పించేవారు గాని ఒకరోజు స్కూలులో వ్రాస్తూ బల్లదగ్గర పడిపోయారు. ఆస్పత్రిలో చేర్పించగా పరీక్షలలో గుండెజబ్బు తీవ్రంగా ఉందన్నారు. అందరము ప్రార్థించాము. 10 రోజులలో బాగుపడ్డారు. ఆ రోజుల్లో యిల్లు కట్టుకున్నాము. సంఘంలో ఆత్మీయంగా బలపడుచూనే ఉన్నాము. చెల్లి, తమ్ముడు వివాహాలకు ముందే మా నాన్న మరణించారు.

నా భర్త వారి బాధ్యతలు తీసుకున్నారు. అన్ని బాధ్యతలు వహిస్తూ కన్నీరు, సంతోషము మిళితమైన ప్రసంగాలు చేసేవారు. నా కుమారుడు ఎ.వి.ఎం.ఫిల్, పి.హెచ్.డి చదివాడు. రాణి 10వ తరగతి వరకు చదివింది. ఆమె పాల్‌గారిని వివాహం చేసుకొన్నది. శాంతి బి.ఎ.బి.యిడి చదివి ఆశీష్ గారిని పెండ్లాడింది.

1996 ఫిబ్రవరి 25 నిజామాబాదు మీటింగులో నా భర్త, నేను పాల్గొన్నాము. భోజన సదుపాయాలన్నీ నా భర్త కనిపెట్టి చూచారు. ఆరోజు వారి ప్రసంగంలో ఎవరు పరలోకం వెళ్ళుటకు సిద్ధంగా ఉన్నారని ఆత్మావేశంతో ప్రసంగించారు. నా భర్త నరసింహారావు గారి పేరు యెహోషువాగా మార్చుకున్నారు. వెంటనే నా భర్త చేతులెత్తుట అందరమూ చూచాము.

మా రాణి కూతురు చిట్టి వివాహం జరిగిన తర్వాత వారిని సాగనంపి సంతోషంగా యిల్లుచేరి, ఉద్యోగమునకు వెళ్ళారు. ఆ తరువాత ఆదివారం మందిరములో ప్రసంగించి ప్రతి ఒక్కరికొరకూ ప్రార్థించారు. ఆ ఉదయాన్నే వాంతిచేసుకొనగా ఆస్పత్రిలో చేర్చాము. హార్టుఎటాక్ అన్నారు. అందరికీ కబుర్లు చేసాము. రాణి పెద్దమ్మాయి ఢిల్లీలో నున్నందున రాలేదు. చిన్నవారందరిని దీవించి దేవుని సేవచేయండి అని తెల్పారు.

అంతలో బి.పి.చాలా డౌన్ అయింది. నన్ను చూచి కన్నీరుపెట్టుకున్నారు. హల్లెలూయా స్తోత్రము అంటూ చేతులెత్తి స్తుతించారు. ఆ సాయంత్రం ప్రభుని సన్నిధి

చేరిన నా భర్తను ధర్మారం చేర్చాము. ప్రభువు నా కోరికను బట్టి రక్షించుకొని ఆయన సన్నిధి చేర్చుకున్నారు.

**10. నా ఒంటరి జీవితము :–** ఆ తర్వాత 2 సంవత్సరాలు ఆయింటిలో గడిపి యిల్లు అమ్మి హైదరాబాదులో కుమారుని వద్ద వుంటున్నాను. ఎన్నో బాధలలో కాపాడిన ప్రభువు నాకు తోడుగా ఉంటున్నారు. ఒకసారి వంటగదిలో గడపచేరిన నాకు ఆగు స్విచ్‌వేయి అనే స్వరం విన్పించింది. పొయ్యిముందు పాము పడగవిప్పి వుంది. ప్రక్కయింటి పంతులుగార్ని పిలిచాను. దాన్ని చంపేసారు. దేవుడు నన్నురక్షించాడు. ఎన్నోసార్లు నన్ను నా బిడ్డలను పాముల బారినుండి సంరక్షించాడు.

**కీర్తనలు 90:13,1 "నీవు సింహములను నాగుబాములను త్రొక్కెదవు. కొదమ సింహములను భుజంగములను అణగద్రొక్కెదవు. అతడు నన్ను ప్రేమించుచున్నాడు గనుక నేను అతనిని తప్పించెదను. అతడు నా నామమునెరిగిన వాడు గనుక నేనతన్ని ఘనపరిచెదను.** ఈ వాక్యము ప్రకారము నా కుటుంబాన్ని కాపాడినాడు. స్తోత్రము. నా ఆరోగ్యం చాలా క్షీణించసాగింది. నోటినుండి రక్తం గడ్డలుగా పడింది. సైతాను శోధించుట కారంభించాడు. చర్మవ్యాధి ద్వారా సైతాను శోధించాడు. చిన్నమ్మలు, శాంతి భర్త ఆశిష్ చాలా ప్రేమతో నన్ను ఆదరించారు. నా అత్తగారి కోసం, బంధువులకొరకు చాలా ప్రార్థించేదాన్ని. ఆ ప్రార్థన ఫలితంగా నా భర్త తల్లి నా దగ్గరకు వచ్చింది. పూజలుచేస్తూ అరటాకులోనే భోజనంచేసేది. ఒకరోజు "అమ్మా నీప్రేమ నన్ను కదిలించేసింది. ప్రార్థించు అని అడిగింది. కొబ్బరినూనె రాసి ప్రార్థించాను. స్వస్థత పొందింది. నా జీవితంలో పదవ వంతు సంపాదన క్రమంగా దేవునికిచ్చి ప్రభువును గౌరవించి ఘనపర్చాను. భాషలున్నా ప్రవచనాలున్నా ప్రేమకల్గి ఉండాలని నమ్మాను, ఆచరించాను. మనమే లోకం చదివే పత్రికలమని నా విశ్వాసము. నా అత్తగారు అందరినీ ఆమె ఆఖరి జీవితంలో ప్రేమించి ప్రేమపొందింది. నా భర్త బ్రతికిన రోజుల్లోనే మరణించింది. సమాధిచేయమని కోరింది. చాలాసార్లు దగ్గు, ఆయాసంతో బాధపడేదాన్ని. ప్రార్థన ద్వారా స్వస్థత పొందేదానను. ఒకరాత్రి నా భర్త తెల్లని వస్త్రాలతో కన్పించారు. నాకు నెమ్మది కల్గింది. నా జీవిత యాత్రలో ఎన్నో అద్భుతాలు ఎదుర్కొన్నాను. ఆయన మెల్లనిస్వరం నడిపింపులో నేడు 80 సంవత్సరాలకు పైగా వయస్సులోనున్నను ప్రభువు సన్నిధి నాతోఉంది. ప్రభువునకు నా సాక్ష్యం ద్వారా మహిమకల్గునుగాక. దేవుడు మమ్ములనెంతో దీవించాడు. ఆమెన్.

----------------

# 22. అగ్ని శ్రమలలో పరిశుద్ధాత్మ నన్ను నడిపించుట నా భాగ్యము

– ఆర్. పద్మామణి (పులిమేరు/ ఈస్ట్‌గోదావరి జిల్లా)

**అపొ 17:30 "అంతటను అందరు మారుమనస్సు పొందవలెనని మనుష్యులకు ఆజ్ఞాపించుచున్నాడు".**



**పరిచయము:–** నా పేరు పద్మామణి. నేను అన్య సాంప్రదాయంలో జన్మించాను. మాది పెద్దాపురము మండలము పులిమేరు గ్రామము. పెద్ద కుటుంబము. మా నాన్నగారికి ఎనమండుగురు అన్నదమ్ములు, ముగ్గురు సోదరీమణులున్నారు. ఆ ఊరిలో పలుకుబడి గల కుటుంబము గనుక పురాణాలు వినుట, సంతర్పణ చేయుట, శ్రీరామనవమికి మా యింట్లో నుండి తలంబ్రాల బియ్యము పంపేవారు. అట్టి భక్తిగల కుటుంబములో జూలై పదవ తేదీ 1952లో జన్మించాను. మా తల్లిదండ్రులకు 9 సంవత్సరాల వరకు సంతానము లేదు. ఆ తర్వాత 6 మంది సంతానము కల్గినారు. ముగ్గురు ఆడపిల్లలు, ముగ్గురు మగబిడ్డలలో నేను మొదటిగా జన్మించాను. నేను భవిష్యత్తులో గొప్ప విశ్వాసిగానుండగలనని దేవుని ఉద్దేశ్యములో నున్నానని సైతాను నాబాల్యం నుండి నన్ను చంపాలని ప్రయత్నించి చాలా క్లిష్టపరిస్థితులు కల్గించింది.

**మొదటి శ్రమ:–** నాకు 2 సంవత్సరముల వయస్సుండగా పొంగువ్యాధి మరణాపాయాన్ని కల్గించగా ఆస్పత్రిలో చేర్పించారు. అద్భుతంగా బ్రతికానట.

**రెండవ శ్రమ:–** నాకు 7 సంవత్సరాల వయస్సులో నా తల్లి యిల్లు శుభ్రము చేయు సమయంలో పాత ట్రంకుపెట్టి యింటిముందు పడవేసారు. ఎండలో ఆరబెట్టిన పెట్టెలో దూరి పండుకొనగానే మూత అకస్మాత్తుగా పడి గొళ్ళెం పడిపోగా లోన ఉండిపోయాను. గాలి ఆడక అరుస్తూ ఏడుస్తూ ఉండిపోయాను. అంతలో అమ్మ పిల్లికూతలు విన్పిస్తున్నాయని గమనించి వెంటనే పెట్టి గొళ్ళెం తీసింది.

నేను శవంవలె పడియుండట చూచి "నా కూతురు చనిపోయింది అని అరిచి గోలపెట్టిన తర్వాత నీళ్ళుజల్లగా మెల్లగా నేను కోలుకున్నానట. సైతాను నన్ను చంపాలని చూచింది. నేను మా అమ్మతోపాటు పూజలు, కార్తీక మాసాలు, పండుగలన్నీ చేసేదాన్ని. నేను ఆలస్యంగా పుట్టానని అతిగారాబంగా పెంచారు.

**వివాహ జీవితము – శ్రమలు ఆరంభము :–** నాకు 17 సంవత్సరాలు పూర్తవగానే నాకు రావుల వీరభద్రరావు గారనే ఇంజనీరుతో వివాహమయింది. మా అత్తగారిది కాకినాడలోని కూరాడ అనే గ్రామం. 1970లో ఏప్రిల్ 9వ తేదీ నుండి క్రొత్త వివాహ జీవితంలో అడుటగుపెట్టాను. పెండ్లి నాటికి మావారి జీతం తక్కువైన, బంగారము, భూమి, డబ్బులు కట్నమిచ్చారు. నా భర్తకు పనిపై ఆసక్తిలేదు. కులపిచ్చి వుండేది. ఆఫీసులో గొడవలు వల్ల సస్పెండుచేయగా జీతం వచ్చేది కాదు. కారణమడిగితే నన్ను కొట్టి బాధించేవారు. ప్రతి మూడు నెలలకు క్రొత్త ఊరు బదిలీ చేసేవారు.

నా భర్తతో ప్రతిమాట మాట్లాడాలంటే హడలిపోయేదాన్ని. 29 ఊర్లు తిరుగుట, అద్దె కట్టలేక యిబ్బంది పడేవారము. శ్రీకాకుళము తూర్పుగోదావరి జిల్లాలో ఎక్కువ కాలముండేవారము. మా నాన్న మాకు సహాయపడేవారు. రాజకీయంగా పలుకుబడి వున్న వ్యక్తిగా మా నాన్న మేనమామతో కలిసి పై ఉద్యోగులతో మాట్లాడి మేము కోరిన ఊరు బదిలీ చేయించి, పప్పు, బియ్యం యిచ్చి వెళ్ళేవారు.

నాకు సంతానం లేదు. తరచుగా కొట్టుట వల్ల చాలా దిగులుగా వుండేది. ఒకసారి నన్ను కొట్టుచుండగా మా నాన్నచూచి, అదేమిటి బాబూ అన్యాయంగా నా బిడ్డను బాధిస్తున్నావని ప్రశ్నించగా, మీ నాన్న నన్ను ప్రశ్నించేవాడా? అని నన్ను మరింత క్రూరంగా కొట్టాడు. మా నాన్న ఆఫీసులో ఎలా పనిచేస్తున్నారోనని ఎంక్వైరీ చేయగా "యిలాంటి వాడినా నీవు అల్లుడిగా చేసుకున్నది అని అందరూ నిందించారట.

నా శ్రమలకు అంతం లేనందున చనిపోవాలని చాలా ప్రయత్నించాను. ఇంటిలో సరిగ్గా గాలి రాకపోయినా కూడా అకారణంగా కోట్టుచున్నప్పుడు రాత్రంతా మెళకువతో నుండి విసినకర్రతో విసిరేదాన్ని. యిన్ని శ్రమలున్ననూ ప్రభువు నన్ను దర్శించి నడిపిస్తూ వచ్చారు. ఈ రోజు గతంలో శ్రమలు పెట్టిన భర్త లేకపోతే ప్రభువు నాకు దొరికేవాడు కాదని ఎంతో సంతోషిస్తాను. నాతోబుట్టువులు పరలోక వారసులు కాలేరు. ఈ లోకంలో మంచి భర్తలు, కార్లు సుఖాలు వున్న నా చెల్లెళ్ళు అనుభవించని శాంతి, సమాధానం ప్రభువు నాకిచ్చారు.

**ఆత్మహత్యనుండి ప్రభువు రక్షించుట:–** నా శ్రమలనుండి శాశ్వతంగా విడుదల పొందాలంటే మరణం శరణ్యమని ఎంచి నా తల్లిదండ్రులకు ఉత్తరము వ్రాసాను. "నా ప్రియమైన అమ్మ నాన్నా, నేను గత ఎనిమిది నెలలుగా సుఖంలేని సంసార జీవితంలో దెబ్బలుతిని అలసిపోయాను. ఫుట్‌బాలు లాగా నన్ను తంతున్న భర్త నాకు వద్దు. నేను చనిపోయిన

తర్వాత నా శవాన్ని కూడా నా భర్త ముట్టరాదు. మీ ప్రేమకు వందనాలు, ఇక సెలవు" అని వ్రాసిన తర్వాత మందుల షాపులో మందుకొని త్రాగి మరణించాలని దారిలో నుండగా అకస్మాత్తుగా నాకు వింతైన స్వరం విన్పించింది. అది 1978వ సంవత్సరము. క్రీస్తుప్రభువును గూర్చి విన్నాను గాని నాకు నమ్మకం లేదు. కాని ఆ స్వరం క్రీస్తు ప్రభువుదేనని గుర్తించాను.

"అమ్మా, నీ కొరకు నేను చనిపోయినాను. నీవు చనిపోవనవసరము లేదు. నీవు చనిపోవద్దు" చాలా ఆశ్చర్యపడ్డాను. ఎంతో శ్రద్ధగా పూజించిన దేవతలు నాతో ఎన్నడూ మాట్లాడలేదు. ఆ మాటలు నాలో పూర్తిగా విశ్వాసము కల్గించలేదు గాని మరణంనుండి తప్పించాయి. అమ్మ నాన్నలు బాధపడే పరిస్థితి దాటింది. నా పూజలు మానలేదు. 7 రోజులూ, 14 దేవుళ్ళను పూజిస్తూ 18 నోములు నోచాను. 5 కుంచాల కుంకుమ, 5 కుంచాల పసుపుతో కైలాస గౌరి నోము అమ్మతో కలిసి చేసాను.

భార్య అంటే కాలిక్రింద బానిసగా ఉండాలని నా భర్త యొక్క ఆశయము. రిక్షా కూడా ఎక్కించకుండా యాత్రలన్నీ కాలినడకతో నడిపించేవారు. భిక్షగాళ్ళకు 10 పైసలు భిక్ష వేస్తే కొట్టేసేవారు. నా భర్తలో మార్పురావాలని పూజలు ఎక్కువగా చేసాను, నా బాధలు చూడలేక నా తండ్రి 1979లోనే మరణించారు. నా తండ్రి నన్ను అమ్ములూ అని పిలిచి గారాబంగా పెంచారు గనుక మరణించక ముందు అన్నయ్యలను పిలిచి నన్ను కనిపెట్టి చూచుకోమని ప్రాధేయపడి ధనుర్వాతం వచ్చి మరణించగా నేను చాలా దు:ఖపడ్డాను.

**ప్రభువుతో పరిచయం:–** భర్త ద్వారా నేను బాధలు తట్టుకోలేక పుట్టింటికి వచ్చినప్పుడు మాఇంటికి వచ్చిన మా పెదనాన్న కోడలు రాజ్యం వదిన నా బాధలన్నీ గమనించింది. ఆమె యేసు ప్రభువును నమ్మిన విశ్వాసి. పద్మా, నీవు యేసును నమ్ముకో, నీ శ్రమలు తొలగిపోతాయని తెల్పింది.

ఒకసారి నా భర్త నన్ను బాగాకొట్టి పుట్టింటికి వెళ్ళిపోవాలని యింటి బయటకు త్రోసి తలుపులకు తాళంవేసుకుని ఆఫీసుకు వెళ్ళిపోయారు. ఆహారంలేదు. ఏడుస్తూ ఆరోజు సాయంత్రం 6 గం॥ల వరకు దిగులుతో నుండగా నన్ను చూచిన ప్రక్కింటివారు జాలిపడి నీ భర్త నిన్ను కొట్టుట సరికాదు, నిన్ను కొట్టకూడదని అడుగుతానన్నారు. ఎన్ని మాటలు హెచ్చరించి చెప్పిననూ నా భర్తలో మార్పురాలేదు. రాజ్యం వదిన చెప్పిన మాటలు జ్ఞాపకం వచ్చి ప్రార్ధన చేసుకోవాలని అనిపించింది. ఆసమయంలో కళ్ళు మూసుకుని "ప్రభువా కారణం లేకుండా కొడుతున్న నా భర్తను ఎలా క్షమించాలి? నేనెలా భరించాలి?"

అని ఏడ్చాను. ఆ క్షణం నాకు గట్టిగా కొట్టుచున్న కొరడాదెబ్బలు వినిపించాయి. ఆ క్షణము సిలువపై వ్రేలాడే క్రీస్తు, వీపుపై కొరడాదెబ్బలు చూపించి మాట్లాడుచున్న దర్శనం చూచాను. “నా రక్త ధారలు, నా దెబ్బలు చూడు బిడ్డా, ఈ దెబ్బలు నీ కొరకే భరిస్తున్నాను. నీ భర్తను నేను చూచుకుంటాను. నీ సాక్ష్యము ద్వారా అనేకులను పరలోకానికి తీసుకొని వెళ్తాను” అన్నారు.

ఆ దర్శనం నాకు చాలా ధైర్యమునిచ్చి ఆదరణ కల్గించగా, ప్రార్థన అధికము చేసాను. మరొక దర్శనములో నేను మా చుట్టుప్రక్కలున్న ప్రతియిల్లు తలుపుతట్టి క్రీస్తుప్రభువును గూర్చి సువార్త చెప్పుచూ, దేవని రాకడలో నేను ముందు నడుస్తున్నట్లుగా నన్ను నేను చూచుకున్నాను. నా సాక్ష్యం ద్వారా మారిన అనేకులు నన్ను వెంబడించుట ఆ దర్శనంలో నేను చూడగలిగాను. ఆ తర్వాత విడాకులు కోరుట చాలా తప్పుపనిగా ప్రభువు తెలిపారు.

ఒక పాస్టరుగారమ్మాయి నావలె జీవితం పట్ల విసుగుదలతో విడాకులు కోరగా నా సాక్ష్యము విని వెంటనే మనస్సు మార్చుకొని సహనముతో భర్తను క్షమించి ప్రేమించి విడాకుల దరఖాస్తును రద్దుచేసుకొనగల్గుట నేను గమనించాను.

మరొక అనుభవంలో భర్త త్రాగుబోతుగా బాధిస్తున్నాడని విరక్తితో చనిపోవాలని తలంచిన ఒక స్త్రీ ఆ సమయంలో పద్మాగారు అనే ధనవంతురాలి యొక్క సాక్ష్యం వినాలని, ప్రక్కన ఉన్నవారు సలహాయిచ్చారట. నా సాక్ష్యం విన్న వెంటనే ఆమె మారిపోయింది.

ఈ రీతిగా వేలాది స్త్రీలకు నా జీవితం స్ఫూర్తినిచ్చి విశ్వాసాన్ని కల్గించు ధన్యత ప్రభువు నాకు ఇచ్చారు. నా సాక్ష్యము ఆరంభమయింది. 1991 జూన్ నెలలో రాజ్యంవదిన గారి ప్రార్థన, సువార్త ద్వారా కనువిప్పు కల్గింది. మరణాంతరము పరలోకము ఉంది. విగ్రహాలేమీ చేయలేవు. వాటి ద్వారా పరలోకం కలుగదు అన్నమాట నాకు అభయాన్నిచ్చింది. ఆనాటి నుండి విగ్రహారాధన, ఆచారాలు పూర్తిగా విడిచిపెట్టేసాను.

ఆరాత్రి నాకొక దర్శనం కల్గింది. ప్రభువు అతి ఎత్తైన వ్యక్తిగా కన్పించారు. భూమిమీద కాళ్ళు, తల ఆకాశము మీద ఉంది. అతి తెల్లని వస్త్రాలు ధరించాడు. అతి మధుర స్వరంతో మాట్లాడారు. “బిడ్డా, నీవు నా ప్రణాళికలో ఉన్నావు, ధైర్యంగా వుండు” అని బైబిలు చదువుకొని ప్రార్థించాలని హెచ్చరించారు.

**మలాకి 3:1** చదవాలని చెప్పారు. దేవునికి దశమ భాగము యిచ్చి గౌరవించాలని తెల్పారు. అప్పటికే నా భర్త నన్ను వదిలిపెట్టేసారు. నా కాదాయమేమీ లేదు. నా పుట్టింటి ఆస్తి 2

ఎకరాల పొలము నుండి 4000రూ॥లు. సంవత్సరాదాయంలో 400రూ॥లు అమ్మను అడిగి యిచ్చేదానిని. మా పెద్దనాన్న గారింటికి పిఠాపురము నుండి పాస్టరు సాల్మన్ గారు వచ్చి ప్రార్థించి "ప్రభువు నీ కాపురము నిలబెడతారు బాధపడకమ్మా" అన్నారు. బైబిలు వాగ్దానాలు చదువుచున్నప్పుడు నా మనస్సు ఉప్పొంగిపోయేది. ప్రభువు యింత గొప్పవాడా! అని భావించేదాన్ని. అద్భుతాలన్నీ చదివి నా భర్తను మార్చు ప్రభువా అని ప్రార్థించేదాన్ని.

ఒకసారి ప్రభువు దర్శనము చూపారు. నరకములో అగ్నిగుండమును చూపించగా నేను నమ్మిన దేవుళ్ళు కాలిపోతున్నారు. నన్ను నమ్మకపోతే నీవు యీ రీతిగా కాలిపోయేదానివే నన్నారు. వీరిగతి అగ్ని ఆరదు, పురుగు చావదు గనుక నిత్యాగ్ని తప్పదు. ఆ తర్వాత పరలోక దర్శనము చూపారు. అందమైన చిన్న పిల్లలు తెల్లని వస్త్రాలతో గుంపులు గుంపులుగా గిటారు వాయిస్తూ స్తుతిచేస్తూ ప్రభువునకెదురుగా కూర్చున్నారు.

ఒకటేబులు దగ్గర రెండు కుర్చీలుండగా ఒకదానిలో ప్రభువు కూర్చుని నన్నుపిలిచి ప్రక్క కుర్చీలో కూర్చోమన్నారు. అరటి ఆకులలో భోజనం వడ్డించి వుండగా నాకు తినిపిస్తున్నారు. ఆ సమయంలో ప్రభుని స్వరం విన్నాను.

**ప్రకటన 3:20 "నా స్వరం విని తలుపు తీసిన యెడల నేను అతని యొద్దకు వచ్చి అతనితో నేనును, నాతో కూడా అతడును భోజనము చేయుదుము"**

ప్రభువు నాతో అతిసన్నిహితంగా నుంటూ అనేక విషయాలు బోధించి హెచ్చరించి ఆదరించేవారు. ఒకరాత్రి నిద్రపోతున్నప్పుడు వేకువనే నిద్రలేపి "లేమ్మా ప్రార్థన చేసే సమయమయింది అని లేపేవారు. నేను ప్రార్థన చేయుట ఆరంభించగానే భాషలతో స్తుతించసాగాను. అంతలో నా భర్త నిద్రలేచి నన్ను చూచారు. నా వీపుపై బెల్ట్‌తో కొట్టుచూ, ప్రభువా అని కలవరిస్తున్నావు ఆ ప్రభువు ఎవడే" అని ఇంకా కొట్టారు. పెంపుడు కుక్క వున్న చివరి గదిలో నన్ను బంధించారు. పనివానినిచ్చి పుట్టింటికి పంపించివేస్తానని బెదిరించి ఆఫీసుకు వెళ్ళారు. "ప్రభువా, నేను నీ బిడ్డనే కదా! అని అడిగాను. "అమ్మా, నీకు తగిలిన దెబ్బలలో సగం నేను అనుభవించాను. నా వీపు చూడు అని చూపించారు. ఆ వీపు చూడగా క్రీస్తు వీపుపై ఎర్రటి వాతలున్నాయి. చాలా ఆశ్చర్యపడ్డాను. అమ్మా, కళ్ళుమూసుకొని చూడు మరొక దర్శనం చూపిస్తానన్నారు. నా ఆత్మీయ నేత్రాలు తెరువబడగా నేను చూచాను.

**మత్తయి 5:11 "నా నిమిత్తము జనులు మిమ్మును నిందించి హింసించి మీ మీద చెడ్డమాటలు పలుకునపుడు మీరు ధన్యులు".**

బంగారు అక్షరాలతో స్పష్టంగా కన్పించింది. ఆ దర్శనం నాకు స్వస్థత కల్గించగా

ఆదరణ పొందాను. స్నానాల గదిలో కుళాయి వదలి ఆ శబ్ధంలో ప్రార్ధన కొనసాగించేదాన్ని.

**పరిశుద్ధాత్మ పొందు అనుభవం:–**

మా పెదనాన్న గారి కోడలు, కూతురు కూడా ప్రభువును నమ్మిన విశ్వాసులైనందున వారి గ్రామము పులిమేరు అయిననూ పరిశుద్ధాత్మ అభిషేక ప్రార్ధనా కూటాలు నిర్వహించుటకు పరమానందం గారు రాయవరం రావాలని నాకు తెలిపారు. ఆ కూటాలలో ప్రభువు నన్ను దర్శించారు. నూనెవేసి ప్రార్ధించిన వెంటనే పరిశుద్ధాత్మ నన్ను తాకింది. దర్శనము కూడా చూచాను. అది 1992వ సంవత్సరము నాకు మరపురాని సమయము.

**మలాకి 4:2 "నా నామమందు భయభక్తులు గలవారగు మీకు నీతిసూర్యుడు ఉదయించును. అతని రెక్కలు ఆరోగ్యము కలుగజేయును గనుక మీరు బయలుదేరి క్రొవ్విన దూడలు గంతులు వేయునట్లు గంతులు వేయుదురు".**

ఆ వాక్యము చూచిన వెంటనే క్రొవ్విన దూడ ఒకటి నా ఎదురుగా వచ్చి గంతులువేసి వెళ్ళిపోయింది.

**ప్రభువు పేరుపెట్టి పిలిచిన అనుభవం:–** తర్వాత 1995లో బాప్తీస్మం తీసుకున్నాను. 1992వ సంవత్సరములో వీపుమీద కణితి ఆపరేషన్ చేయించుకొను సమయంలో రాజమండ్రిలో దినకరన్ గారి మీటింగులు జరిగాయి. చివరి రోజైనా నా పేరు పిలవాలని దేవున్ని ప్రార్ధించాను. ఆ రాత్రి నాకు ప్రభువు కలలో దినకరన్‌గారి కూటాలను చూపించి "సుశీలా, నా ప్రియమైన సుశీలా" అని పిలిచారు. నా పేరు పద్మామణి కద! నా పేరు కాదని భావించగా ఎవరో నా వీపుమీద తట్టి, నీ పేరు పిలవాలనుకున్నావు కద! పిలుస్తుంటే లేవమేమి? అన్నారు. గదంతా సుశీల అనే పేరు ప్రతిధ్వనించింది.

ఉద్యోగము నిమిత్తము రాజమండ్రిలో వున్న రోజుల్లో మాయింటి ప్రక్కగా జార్జిగారి సంఘముండేది. నా భర్త ఆఫీసుకు వెళ్ళగానే నేను చర్చికి వెళ్ళి ప్రార్ధనలలో పాల్గొనేదాన్ని. ప్రార్ధన వాక్యములో ఆత్మీయంగా బలపడి 1995 డిసెంబరు 24వ తేదీన 15 మందితోపాటు బాప్తీసం తీసుకున్నాను.

నా బాప్తీసం సమయంలో ఒక పిచ్చివాడు వచ్చి "నాకు పూజలు చేసే బిడ్డను నీవు ఎక్కడకు తీసుకొని వెళుచున్నావని" కేకలు వేసాడు. పాస్టరు గారు "అగ్నితో నిన్ను కాల్చుచున్నాను సైతానా" అని గద్ధించారు. బాబోయ్ అగ్ని, కాలిపోతున్నాను అని చెప్పి వాడు పారిపోయాడు.

నేను నా భర్తకు భయపడి బొట్టు తీయలేదు. భక్తుల జీవితచరిత్రలు చదివేరోజుల్లో ఇచ్ఛాపురము హైమావతి గారి సాక్ష్యములో బొట్టు ప్రస్తావన వుంది. ప్రభువు నాతో సూటిగా మాట్లాడారు. "అమ్మా, నీవుకూడా బొట్టు సమర్పించుకో" దేవుని మాట వింటే సైతానుకు మంట గనుక కుమారి అనే స్నేహితురాలు ప్రార్థన ద్వారా ధైర్యపరిచింది.

**క్రీస్తు శ్రమలు నాకు ఆదర్శము:–**

ఒకసారి నాకు బంధువుల యింట్లో పెండి జరుగుచుండగా నా భర్త ముందుగా వెళ్ళారు. నేను బొట్టులేకుండా వెళ్ళాను. వేయిమంది బంధువుల సమక్షంలో నన్ను చూచారు. బొట్టు పెట్టుకోలేదేమి? అని కోపంతో చెప్పుతీసి కొట్టసాగారు. ప్రభువు నాకై సిలువపై శ్రమపడ్డారు. నాకు అవమానం జరిగినా పర్వాలేదని ఓర్పు వహించాను.

మరొకసారి మా ఆడపడుచుగారి అమ్మాయి పెండ్లిలో బట్టలు యివ్వాలంటే నేను బొట్టుపెట్టుకోవాలి గనుక మరొక తోడికోడలిని బట్టలు యివ్వమన్నాను. అనుకోని రీతిగా ప్రమాదము దేవుడు తప్పించారు. అక్షింతలు బదులు పూవులు వేసి తప్పించుకోగల్గాను. పూజారికి ధైర్యంగా బొట్టుపెట్టుకోనని చెప్పాను. నా భర్తకోపం నుండి నన్ను దేవుడే తప్పించారు. నా తల్లి రక్షణ కొరకు ప్రార్థించు సమయంలో నాకు రెండవరాకడ దర్శనం చూపారు. అమ్మ నరకప్రవేశం నాకు పరలోక ప్రవేశాన్ని చూపారు. అనుకోని రీతిగా అమ్మకు అనారోగ్యము కల్గినప్పుడు "నీవు ప్రార్థించుకోవాలి. అప్పుడే స్వస్థత లభిస్తుందని తెల్పాను. అమ్మ ప్రార్థించగా ఆమెకు దేవుడే రక్షణ యిస్తున్నట్లు చూపించగా ఆమె లోబడి వెంటనే బాప్తీసం తీసుకొని దేవునికి చేరువయింది.

**40 రోజులు ఉపవాసంలో ప్రభువు స్వరం వినుట:–** నా ఆత్మీయ స్నేహితురాలైన హన్నా (లక్ష్మిగారు) విజయ కుమార్‌గారి సహవాసంలో ఆత్మీయంగా బలపడగా "ఓ బిడ్డా నీవు నా చేతిలోనున్నావు భయపడకు" అనే ప్రసంగం ద్వారా దేవుడు ధైర్యపర్చారు. మలాకి లో దశమభాగం గూర్చి జ్ఞాపకము చేసారు. ఉపవాసం చేయు రోజుల్లో

**నిర్గమ 3:3 "అగ్ని పొదలో మోషేతో మాట్లాడినట్లు నీతో మాట్లాడుచున్నాను".**
**యోహాను 14:6 "నేనే మార్గం సత్యం జీవమునై యున్నాను".** యీ రీతిగా 25 సార్లు నాతో మాట్లాడారు.

**ప్రసంగీకులు 3:1 "కాలాలు సమయాలు నా చేతుల్లో ఉన్నాయి".** నీ భర్త ద్వారా శ్రమలు పడువారిని రక్షణ మార్గంలోనికి తెచ్చుటకై నీ ద్వారా నేను మాట్లాడనై యున్నానని ధైర్యం చెప్పారు.

1995లో నా కష్టాలు అధికమైనందున విసిగిపోయి విడాకులు తీసుకోదలచాను. నేను మా అన్నయ్యల సంరక్షణలో నున్నాను గనుక “మా చెల్లి ప్రాణానికి హామీ యిస్తేనే కాపురానికి పంపుతామన్నారు. నా భర్త కోర్టుకు వచ్చేవారు కారు. “నన్ను నమ్మిన బిడ్డ నా కనుగుడ్డుతో సమానము. న్యాయాధిపతి అయిన నేను ఉండగా ఈలోక న్యాయాధిపతులు ఏమిచేయగలరు? నీ భర్తను నిన్ను కలిపేవాడను నేనే అని సాల్మను పాస్టరు గారి ద్వారా ప్రవచనం తెల్పారు. అంతేకాదు నా సాక్ష్యము యితరులకు ఆదర్శకరంగా చేయగలను. గాయం చేయువాడను, కట్టువాడను నేనే నన్నారు. కోర్టు వద్దులే అన్నయ్యా అన్నందుకు నాకు పిచ్చి పట్టిందన్నారు. కోర్టు సమస్యలలో నుండే రోజుల్లో 1996లో నేను పుట్టింటిలో నుండగా నాకు బస్సు యాక్సిడెంట్ జరిగినట్లుగా నాకు దర్శనంలో చూపారు. అది ఎవరిని గూర్చి ప్రభువా? అని నేను ప్రశ్నించాను.

**సమూయేలు 25:3** లో నాబాలు కథ ఉంది. “నాబాలు వలె నీ భర్త నాకు వ్యతిరేకంగా నున్నాడు. నీ భర్తను తీసివేస్తున్నాను అన్నారు. ఆకాశం నుండి నా భర్త క్రిందకు పడి చనిపోయిన దర్శనం నాకు కన్పించింది. నా భర్తను బ్రతికించమని ఏడ్చి ప్రార్థించాను. ఆ తర్వాత నా భర్త కాకినాడ నుండి ఆఫీసు పనిమీద రాజమండ్రి వెళ్తున్నారట. వెనుక నుండి లాలా చెరువు దగ్గర బండి గుద్ది వెళ్ళగా తుప్పల్లో పడిపోయాడు. నా భర్త వయస్సు 55 సంవత్సరములు. ఆ దారిలో వెళ్ళు సేవకులిద్దరు నా భర్తను చూచి చనిపోయి వుంటారని తలంచారు. ఒక స్వరం ఆగండి బ్రతికించండి అని వినపడగా ఆస్పత్రికి తీసుకొని వెళ్ళారు. నా భర్తను లాజరును బ్రతికించినట్లు బ్రతికించారు. నా భర్త దగ్గరకు నా చెల్లి, పాస్టరమ్మగారు వెళ్ళి చూడగా, పనిమనిషితో అక్రమ సంబంధము కల్గిన స్థితి చూచి యింటినిండా సిలువ గుర్తులుంచి ప్రార్థించారట. ఆ స్త్రీ దైవశక్తి ప్రభావము తాకగా భయపడి యిల్లు మండిపోతుందని తెల్పి పారిపోయిందట. ప్రభువు చెప్పినట్లుగా పెద్దలు పులిమేరు నుండి నన్ను నా భర్త యొద్దకు చేర్చారు.

ఆ తర్వాత 1998లో రాజమండ్రిలో నా భర్త పదవీ విరమణ తర్వాత కాకినాడకు చేరాము. చెల్లి భర్త ద్వారా నా భర్తకు పెన్షను లభించింది. అపార్టుమెంటు లభించింది. అపార్టుమెంటులో ప్రభువు సిలువను పట్టుకొని తిరిగినట్లు నాకు దర్శనము లభించింది. గృహప్రవేశమునకు 4 రోజుల ముందే చర్చిలో మీటింగ్సు కొరకు వచ్చిన అమెరికా మిషనెరీలతో ప్రార్థన చేయించి బైబిలు పెట్టించాను. 3 రోజులు ఉపవాసముండి ప్రార్థించాను.

1999లో దర్శనమమిచ్చి "నిన్ను సజీవ సాక్షిగా ఎన్నుకున్నానని మర్మాలు వివరించి ప్రభువు నాతో మాట్లాడారు. ఎంతమంది పరలోక వారసులుకాగలరో చూపించారు. నేను బంధువుల యింటికి వెళ్తున్నానని తెల్పి ప్రతి పేదవారి యిల్లు దర్శించి సువార్త బోధించేదాన్ని. స్వంత ఖర్చుతో తిరిగి సేవ చేయుటలో ఆనందాన్ని పొందుచున్నాను. బంధువుల యింటికి వెళ్తున్నానని తెల్పి అనేక స్థలాలలో క్రీస్తు సజీవుడు, మాట్లాడు ప్రభువని సాక్ష్యము చెప్పు ధన్యతనిస్తున్నారు.

ప్రతి మంగళవారం వరుసగా 7 వారాలు ప్రార్థిస్తే నా భర్తకు నాకు మద్యగా నున్న సైతాను గుంపుతో దూతల గుంపు దిగి యుద్ధం చేయగా నా భర్తలో మార్పు కల్గినట్లు దర్శనం చూసారు. ప్రతినెల మండపేట నుండి పాస్టరు ప్రసాద్ పాల్‌గారు ప్రార్థనలు నడిపించేవారు. అవమానాలు, నిందలను, నామకార్ధ క్రైస్తవుల ద్వారా ఎదుర్కొన్నాను. క్రీస్తు అవన్నీ భరించాడు అని ఓర్పుతో భరించాను. క్రిస్మస్ కాలంలో ప్రభువు నాముందు నిలిచి వుండేవారు. రాత్రి కాలంలో ధైర్యంగా వచ్చి పోతూ ఉండు సమయంలో నా చుట్టూ వెలుగు నిలిచి వుండేది.

నా సాక్ష్యము వ్రాసి వుంచగా శ్రీ విజయ కుమార్ గారు అనే దైవజనులు కరపత్రము విడుదల చేసారు. నా గుండెల్లో నుండి స్వరం వినిపించింది. "అగ్ని శ్రమలలో ఆత్మ నడిపింపు" అని తెల్పాను. పరిశుద్ధాత్ముడే ఆపేరు పలికించిన ధన్యత కల్గింది.

ఒకసారి జ్వంర తీవ్రంగా బాధించగా ప్రభువు నన్ను స్వస్థపర్చారు. పగలే దర్శనమిచ్చారు. నల్లని దుష్టశక్తితో తెల్లని వ్యక్తి పోరాడారు. అది చూచాను. ప్రభువే నా పక్షంగా యుద్ధం చేసారు. యోబును దర్శనంలో చూపారు. "అమ్మా, సైతాను యోబును శోధించలేదా" అని మాట్లాడారు. నేను బైబిలు చదువుట చూచిన నా భర్త ఆ బైబిలును ముక్కలు చేసి, క్యాలెండర్లు చించి బాధించారు. నన్ను గాయాలతో గాయపర్చి బాత్‌రూములో బంధించారు. "ప్రార్థనకు తీసుకొని వెళ్ళు ప్రభువా అని ప్రార్థించాను. 5 నిమిషాలలో నన్ను వెలుపలికి తెచ్చారు. హన్నా గారింటిలో ప్రార్థనలో పాల్గొన్న నన్ను చూచి "మీకు యిన్ని శ్రమలా అని అంతా ఏడ్చారు. నా భర్తకు విరోచనాలు ఆరంభమయ్యాయి. నీరసించారు. హన్నాగారి భర్త నా భర్తను గద్దించి, నీ భార్యను గాయపర్చుట ధర్మమా? అని అడిగారు. నా భర్త పట్ల జాలిపడి ప్రార్థించాను. 40 రోజులు ఉపవాసంలో శక్తి పొందేదాన్ని. నాకు దర్శనాల్లో బిడ్డలు కల్గినట్లు చూపేవారు. సిలువ దర్శనం, శ్రమలు భరించినపుడు చూపి చాలా ఆదరించేవారు.

"నమ్ముట నీవంతు అయితే నమ్మువానికి సమస్తం సాధ్యమన్నారు. యెరుషలేము దర్శించు ధన్యతనిచ్చారు. ప్రభువును నమ్మిన తర్వాత 18 అన్యుల అలవాట్లు మానివేసాను. ఎదురు వచ్చి శకునాలు చూడు అలవాటు, బొట్టు మానివేయుట, కాలిమెట్లు తీసివేయుట, ముగ్గులు వేయుట, గోరింటాకు పెట్టుట, దినాల క్రమాలు, వ్రతాలు, కార్తీక భోజనాలు, తాంబులాలు తీసుకొనుట, సినిమాలు, సీరియల్స్ చూచుట మానివేసాను. సూర్య చంద్ర గ్రహణాలు, ప్రసాదాలు, తలకు పూలుపెట్టుకొనే అలంకారాలు, తలకు రంగువేయుట, ముహూర్తాలు పాటించుట యివన్నీ మానుకొనుట ద్వారా నామకార్ధ క్రైస్తవులు ఆశ్చర్యపడేవారు. యింత సమర్పణ సాధ్యమా అని విమర్శించేవారు.

విక్టోరియమ్మ గారు నన్ను గమనించి నా సాక్ష్యము వ్రాయమని ప్రోత్సహించారు. ఒకసారి 25 మంది తోటి వారితో సువార్త దండయాత్రకు వెళ్ళగా వీధి వీధిలో కంజరితో పాటలు పాడుచూ నడిచి పాటలతో ఆరాధించేవారము. కాళ్ళు నొప్పితో మంచము మీద బాధలో నుండగా ఒక లేడిపిల్ల గంతులు వేస్తూ కన్పించింది. ప్రభువు దర్శనమిచ్చి పచ్చని మందు రాసారు. దీవెనమ్మ అనే పేరుగల స్నేహితురాలు రోజూ వచ్చి ప్రార్ధించి ఆదరించేది. గతంలో నా భర్త బాధపెట్టిన రోజుల్లో ఏడుస్తూ ప్రార్ధించగా "నీ కొరకే కద అమ్మా కొరడాదెబ్బలు భరించానన్నారు. ప్రమాద సమయంలో డ్రైవింగు సీటులో దేవదూతను చూచేదాన్ని.

2012లో ఊపిరితిత్తులు పాడైపోగా దేవుడు స్వస్థపర్చారు. ఆ రోజుల్లో 400 మంది విశ్వాసులు ప్రార్ధించారు. రాము (పౌలు) గారు ప్రార్ధించి దేవుడు స్వస్థత యిస్తాడని తెల్పాడు. 15 రోజులు పడకమీద వుండగా బంధువులంతా మాటలతో బాధించేవారు. ప్రభువా, నన్ను నీ సన్నిధికి తీసుకో అని ప్రార్ధించాను. నన్ను దర్శించిడానికి వచ్చిన ఇందిర ప్రశాంతి గారు అవమాన పర్చగా ఆమె పౌలు గారి శ్రమలలో యిది ఒకటి అని చాలా తేలిగ్గా తీసుకొని భరించారు.

**1వ తిమోతి 3:12 "క్రీస్తునందు సద్భక్తితో మసలుకొనేవారు హింసపొందుదురు"**

అనే వాక్యం ధైర్యపరిచింది. బాధలో నన్ను పరలోకానికి తీసుకొని వెళ్ళండి ప్రభువా అని ప్రార్ధించగా దర్శనంలో 5 సంవత్సరాల పాపగా దేవుని ఒడిలో ఆనందంగా చూపించారు. లక్ష్మి, విక్టోరియాను చూచాను. ప్రభువులో మరణించిన వారికి యింత గొప్ప స్థానం వున్నదని గ్రహించాను. నీకు భూలోకంలో చాలా సేవవుంది. ఇది నీ

సమయం కాదన్నారు. అంతేకాదు నీ శ్రమలగూర్చి తీర్పులో కథలుగా పాఠాలు చెప్తాను అని నాకు ముద్దుపెట్టారు. వెంటనే మంచముపై నున్న నాలోకి ఆత్మ వచ్చింది. నాలో అస్వస్థత పూర్తిగా తగ్గిపోయింది. నన్ను నిందించి విసిగించేవారి కొరకై ప్రార్థించగా కీర్తన 1 ద్వారా దుష్టుల సహవాసం చేయకు అని తెల్పారు.

**కీర్తనలు 91:15 "జీవము గల దేవుడను నేను నీకు తోడుగా నున్నానన్నారు".**

ప్రభువు స్వరంతోనే మాట్లాడేవారు. బైబిలు వంటగదిలో డబ్బాలలో దాచుకొనేదానిని. నా భర్త చూడకుండా కాపాడమని ప్రభువుని అడుగగా దేవదూతలు కాపలాగా నున్నట్లు చూపారు. నా స్నేహితులంతా "పద్మామణి గారిది ప్రతికూల పరిస్థితులలో అనుకూల సేవ" అనేవారు. అత్తయింటి వారు పుట్టింటివారు యింకనూ అన్యులుగా నున్ననూ నన్ను రక్షించి సేవలో వాడుకుంటున్నారు. ఒకసారి యెజెబేలుని లయపర్చు అన్నారు. ఫరో హృదయం వలె నీ భర్త హృదయాన్ని కఠినము చేస్తున్నానన్న స్వరం విన్పించింది.

ఒకసారి నా భర్త అకారణంగా కొట్టి బయటకు త్రోసివేయగా క్రింద నివసిస్తున్న చెల్లి నాతో పైకి వచ్చి తలుపు తీయండి అని అడిగింది. తలుపు తీస్తే దాన్ని చంపుతానని బెదిరించారు. గుమ్మం దగ్గరున్న నన్ను బాగా కొట్టి బాధించారు. నాకు నొప్పి తెలియలేదు. రాత్రి నాకు నిద్రలేదు. "నీ యింటికి నీవు వెళ్తావు అని ప్రభువు స్వరంతో మాట్లాడారు. నా స్నేహితురాలితో ఫోనులో నా పరిస్థితి తెలుపగా యేసురక్తం అని చెప్పుకో అన్నారు. బీదవాని రూపంలో ప్రభువు వచ్చి పరీక్షించారు. 50 రూపాయలిచ్చావు, పరీక్షలో గెలిచావన్నారు. నేటికిని నా భర్తలో రక్షణానుభవం లేదు. ప్రార్థించండి.

**మార్కు 16:15** చివరిగా నా ప్రభువు నాకు తోడుగా నుండి సంరక్షిస్తున్న గొప్ప కృపనుబట్టి సర్వలోకానికి వెళ్ళి సర్వసృష్టికి సువార్త ప్రకటించాలి అనే ఆజ్ఞ అందరూ పాటించాలి. ఒకసారి నేను సాక్ష్యం చెప్పుచున్నపుడు దేవదూతలు ఆకాశంనుండి పూలవర్షం కురిపించుట చూచారట. లూదియా అనే సోదరికి పరలోక దర్శనమిచ్చి నా పేరున్న బంగారు భవనము చూపారట. విమల అనే సోదరికి నేను విత్తనాలు విత్తుట చూచిందట. నా సాక్షానికి సహకరించిన వారికి వందనాలు. మీకు కూడా నావలె దర్శనాలనిచ్చి దేవుడు ప్రేమించాలని మీ కోసం ప్రార్థిస్తున్నాను. ఆమెన్.

-------------------

## 23. క్రీస్తు సాక్షిగా నుండుటకు అంధుడనైన నన్ను ప్రభువు ఎన్నుకున్నారు

– రవి శంకర్ (విశాఖపట్నం)



**యెషయ 1:26** **"ఆదిలో నున్నట్లు నీకు ఆలోచన కర్తలను మరలా నియమించెదను".**

**పరిచయము:–** నా పేరు రవిశంకర్. పుట్టుకతోనే నేను అంధునిగా జన్మించాను. గర్భములో పిండముగా నుండగా ప్రభువు కన్నులు నన్ను చూచాయి. ఈ స్థితిలో నేను ఎవరికీ పనికిరాకుండా జీవిస్తూ యితరులపై ఆధారపడి జీవించాలా? అని ఆలోచించిన నాకు ఉత్తమమైన జీవితాన్ని దేవుడు నిర్దేశించారు. నేనొక హైందవ కుటుంబంలో జన్మించాను. అంధులకున్న ప్రత్యేక పాఠశాలలో నన్ను నా తల్లిదండ్రులు ప్రవేశము కల్గించారు. అనాధలకు ఆశ్రయమిచ్చుట, అభాగ్యులను ఆదరించుట, అంధులకు బ్రెయిలీ భాష నేర్పించి ఉన్నత విద్యాభ్యాసము నందించుట చేసేవారు.

క్రీస్తునునమ్మి వెంబడించి విశ్వాసులు నిర్వహించే విద్యాసంస్థలని అందరికీ స్పష్టంగా తెలుసు. నేను చేరిన సంస్థను క్రైస్తవులు నిర్వహించుట వల్ల క్రీస్తును గూర్చి పరిచయము చేసుకోగల్గాను. హిందూ దేవుళ్ళతో పాటే క్రీస్తు కూడా దేవుడని నమ్మాను. నా జీవితము సమాజానికి పనికిరాక పోయినను దేవుడు నన్ను ప్రేమించి మంచి విద్యాభ్యాస అవకాశాన్ని కల్గించాడు. క్రైస్తవ సంస్థలలో మంచి అర్ధవంతమైన ప్రార్ధనలు, ఆరాధనా గీతాలు ఆలపించేవారు. పాటలు పాడుట యందు అత్యాసక్తి కల్గిన నేను వారితోపాటు ఆ పాటలు పాడుకొనేవాడిని. నేర్చుకున్న పాటలు ఆదివారం ఆరాధనలలో పాల్గొని పాడేవాడిని. పదవ తరగతి పూర్తిచేసుకున్నాను. క్రీస్తును స్వంతరక్షకునిగా అంగీకరించలేదు. ఆ ఆలోచన కూడా నాలోలేదు. సండేస్కూలు నిర్వహించేవారు. బైబిలులోని వాక్యాలు మాతో వల్లింపజేసి నేర్పించేవారు. నాకు కూడా అవి నచ్చాయి.

**"యెహోవా యందు భయభక్తులు కలిగియుండుట జ్ఞానమునకు మూలము"**

**"అబద్ధమాడు పెదవులు యెహోవాకు హేయములు"**

బంగారు వాక్యాలు అని చెప్పగా అవన్నీ నేర్చుకోగల్గాను. 1996వ సంవత్సరములో ఇంటరులో చేరాను. హాస్టలులో వుండేవాడిని. నేను నా పాటలు రియాలిటీ షోలో పాడాలని ఆశ వుండేది. డిగ్రీ కూడా పూర్తిచేసాను. దేవుని దయవల్ల నాకు కొన్ని మంచి అవకాశాలు లభించగా ప్రార్ధనా గీతాలు, వేరే పాటలు కూడా పాడే అవకాశాలు లభించాయి.

సినీ సింగర్స్‌తో కలిసి పాటలు పాడాలని ఆశ వుండేది. చాలా రాజకీయాలుంటాయి గనుక చాలా క్లిష్ట పరిస్థితులెదుర్కోవాలని గ్రహించాను. తిరిగి విశాఖపట్నం చేరాను. విద్యాభ్యాసమునకు కొంత అంతరాయము కల్గింది. పాటలు పాడే అవకాశాలు మూసుకుపోయాయి. నిరాశ, వేదన ఆవరించాయి. నాతోటివారంతా దివ్యంగా తమ చదువులో నిమగ్నమయి విజేతలుగా నుండగా నేను అసహాయతతో మిగిలాను.

నా పరిస్థితి గమనించిన నా తల్లిదండ్రులు నన్ను చిన్నచూపు చూసేవారు. చులకనగా మాట్లాడుట నాకు బాధ కల్గించేది. ఆ తర్వాత 2002వ సంవత్సరములో ఒక దైవజనుడు మా యింటికి వచ్చి నా పరిస్థితిచూచి, నాలో ప్రతిభను గుర్తించి, మహా సభలలో పాటలు పాడే అవకాశాన్ని కల్గించారు. మొదటి రెండు రోజులు మామూలుగా జనరల్ పాటలు పాడాను. మూడవరోజు భక్తి గీతాలు పాడమన్నారు. అందరూ ప్రభువును ఆరాదిస్తూ వుండగా అకస్మాత్తుగా నా శరీరము కంపించుట ఆరంభించింది. నాకు గంభీరమైన స్వరము విన్పించింది.

**“నీవు నీ తల్లి గర్భములో పిండముగా నుండగా నా కన్నులు నిన్ను చూచాయి. నిన్ను ఎరుగుదును”** వెంటనే పాస్టరుగారితో నా అనుభవాన్ని తెల్పాను. “బాబూ రవీ, ప్రభువు నిన్ను దర్శిస్తున్నారు. నీవు దేవునికి సమర్పించుకో అని హెచ్చరించారు. సమీపములో నున్న దైవజనులంతా నా తలపై చేతులుంచి ప్రార్ధించారు. యేసే నాతో మాట్లాడారని పూర్తిగా నమ్మాను. నా పాపాలన్నీ ఒప్పుకున్నాను. నేను నా స్వంత ప్రయత్నాలు చేసి నిన్ను నిర్లక్ష్యము చేసాను. నన్ను క్షమించు ప్రభువా అని దీనంగా ప్రార్ధించాను. నాతో సూటిగా మాట్లాడినందుకు కృతజ్ఞతలు తెల్పాను.

నా చివరి ఊపిరి వున్నంత వరకు దేవునికి ఉపయోగపడే పనిముట్టుగా వాడుకోవాలని తీవ్ర వాంఛతో సంపూర్ణ సమర్పణ చేసుకున్నాను. ఆ తర్వాత నా విశ్వాసయాత్ర 2002 మార్చి 3వ తేదీనుండి నూతన మార్గంలో కొనసాగించాను. నాటినుండి నేటివరకు ఒక్కొక్క మెట్టు ప్రభువే చేయిపట్టి నడిపిస్తూ ఆయన సేవలో ఘనంగా వాడుకుంటున్నారు. నా జీవితంలో దేవున్ని మాత్రమే మహిమపర్చుచూ, నూతన అవకాశాలను వినియోగ

పర్చుకుంటూ సాగిపోవు కృపనిస్తున్నారు. గొప్ప దేవున్ని సేవించే భాగ్యమునిచ్చారు. నాలో ప్రతిభను గుర్తించి మంచిగా అంగవైకల్యము లేని స్త్రీ నాకు భార్యగా ప్రభువిచ్చారు. బాబు, పాపలకు తల్లి దండ్రులముగా దేవున్ని ప్రేమించి, సాక్షులుగా ఆయన్ని సేవిస్తూ జీవించగల్గుతున్నాము.

మొదటిగా రక్షణ టి.వి.లో పాటలు పాడుటకు, ప్రసంగించుటకు డబ్బులు చెల్లించాలి గాని, నా పాటలు పాడుటకు ఉచితంగా అవకాశమిచ్చి గౌరవించారు. ఎందరివో ప్రశంసలు అందుకొని దేవున్ని స్తుతిస్తున్నాను.

ఆరాధన టి.వి.లో కూడా సొమ్ము చెల్లించనవసరము రాకుండా అవకాశ మిచ్చారు. ప్రతి పాటకు 2,500 రూ॥లు కట్టాలి గాని నాకు దేవుడిచ్చిన అమూల్య అవకాశంలో మనస్ఫూరా ప్రభుని కీర్తించుట ప్రభువు మహాకృపగా భావిస్తున్నాను. నేటికి 12 సి.డి.లకు పైగా సిద్ధపర్చుటతో పాటు దైవసేవకుడైన జాన్ మోజెస్‌గారి పరిచయం ప్రభువిచ్చిన ధన్యతగా నమ్ముతాను.

జాన్ మోజెస్ అన్నయ్య సి.డి. తయారీలో సహకరించాను. అల్పుడను, అంధుడను, ఎన్నికలేని నన్ను పనికిమాలిన జీవితం జీవించతగిన నన్ను అనేకులు అత్యున్నత ప్రేమ వాత్సల్యముతో ఆదరించగా ఆనందకరమైన జీవితాన్ని దేవుడు సిద్ధపరచి అందించుచుండగా అన్ని అవయవాలనిచ్చి, మంచి కుటుంబ జీవితం, విద్య, సంపదలున్న మీ అందరికీ తప్పక తగినరీతిగా వాడుకొనుటకు సమర్థుడని మీరు నమ్మగలరా? సంగీతమును నేర్చుకోలేదు గాని అత్యున్నత రీతిగా పాటలుపాడే తలాంతు ద్వారా దేవున్ని ఘనపర్చే పాత్రగా నన్ను మంచి తలంపులతో దీవించిన క్రీస్తు కీర్తనీయుడు. 2010వ సంవత్సరములో దేవుడు గవర్నమెంటు ఉద్యోగమిచ్చి ఆనందాన్ని కల్గించారు. ఆయన నా చేయిపట్టి నడిపిస్తున్నారు.

**అమెరికా ప్రవేశం:–** పుట్టిన నాటినుండి గ్రుడ్డివాడిగా నున్న నేను విదేశాలను దర్శించే అనుగ్రహాన్నిచ్చిరు. నేనుచేసిన పాటల సి.డి.ని విన్నవారంతా అభినందించి మౌనంగా నుండగా కొందరు నాకు ఫోనుద్వారా ప్రశంసలనందించేవారు. వారిలో ఒక కుటుంబము చికాగో అమెరికా నుండి నన్ను సంప్రదించారు. నా ఫొటో, నా ఫోను నంబరును సేకరించి అమెరికా దర్శించాలని ఆహ్వానము పంపారు. అమెరికాలో నిర్వహించిన కన్వెన్షన్‌లో పాటలుపాడే అవకాశం కల్గించారు.

రెండవసారి కూడా అమెరికాకు ఆహ్వానించి వివిధ ప్రాంతాలలో సాక్ష్యము, నా పాటలు ద్వారా అనేకులమధ్య ప్రభువు నన్ను ఉపయోగించుకున్నారు. కళ్ళతో చూడలేకపోయిన వారి ప్రేమను గూర్చి విని అత్యధికంగా ఆనందించాను.

అమెరికాలో న్యూ జెర్సీలో నున్న తెలుగువారు నిర్వహించే సంఘములో నా సాక్ష్యము తెల్పి, పాటుల పాడే అవకాశం జాన్ మోజెస్ అన్నయ్య గారి ద్వారా లభించింది. www.uect.net వెబ్ సైట్‌లో వీడియోలో భద్రపరిచిన సాక్ష్యం అనేకులు విని మేలు పొందారని తెలుసుకొని ప్రభుని ఘనపర్చుచూ పిల్లి జాషువా ఫణి గారికై కృతజ్ఞతలు తెల్పుకుంటున్నాను.

నా హృదయంలో నిత్యము పాడే పాట “ఎందుకో నన్నింతగా నీవు ప్రేమించితివో దేవా।

అందుకో నా దీన స్తుతి పాత్ర - హల్లెలూయా యేసయ్యా ॥

గ్రుడ్డివాడినైన నాకు ప్రభువు గొప్ప జీవితాన్నందించి ఘనమైన పాత్రగా వాడుకున్న దేవుడు మిమ్ములను దీవించి సాక్షులుగా ప్రభువు ప్రేమను ప్రచురించు భాగ్యమిచ్చుగాక ఆమెన్.

-------------

## 24. ఉన్నత విద్యాభ్యాసము ద్వారా ధన సంపాదన కన్న ఆధ్యాత్మిక అత్యవసరమని తెలుసుకున్నాను

**– డాక్టరు జయశీల(అమెరికా)**

**ప్రసంగీకులు 12:2-14 "నీ బాల్య దినములందే నీ సృష్టికర్తను స్మరణకు తెచ్చుకొనుము. గూఢమైన ప్రతి అంశమును గూర్చి దేవుడు విమర్శచేయునపుడు ఆయన ప్రతి క్రియను అది మంచిదే గాని, చెడ్డదే గాని తీర్పులోనికి తెచ్చును".**

**పరిచయము:–** ప్రభువు నామములో మీకు శుభము కోరుతూ నా సాక్ష్యము ద్వారా ఆధ్యాత్మిక మేలు పొందాలని దేవున్ని ప్రార్థిస్తున్నాను. నాపేరు జయశీల. నేనొక నామకార్థ క్రైస్తవ కుటుంబములో జన్మించాను. క్రీస్తు బోధనలను గూర్చి ఏమాత్రము పట్టించుకోలేదు. నాకు 18వ సంవత్సరము పుట్టిన రోజు వరకు క్రీస్తును గూర్చిన సువార్తను వినిపించుకోలేని నిర్లక్ష్య జీవితాన్ని జీవించాను. నాకు ఆ తర్వాత మరణమును గూర్చిన ఆలోచనలు ఆరంభమై భయము కల్గించసాగాయి. అకస్మాత్తుగా మరణించినచో నా పరిస్థితి ఏమగునోనన్న బాధతో నా యవ్వనంలో కలత చెందేదాన్ని. క్రైస్తవ కుటుంబములో జన్మించినందున నా తల్లి ఆదివారాలు చర్చికి తీసుకొని వెళ్ళుట, వాక్యము చదువుట, ప్రార్థించుట నేర్పించింది. నాలో చింత, భయాన్ని తొలగించుకోవాలని ఉజ్జీవ కూటాలకు వెళ్ళాను. నాకెట్టి శాంతి లభించలేదు. ఆచార ప్రకారము నిర్ధారణ తరగతులకు హాజరయ్యాను. బైబిలు పద్ధతులను తెలుసుకొని నిర్ధారణ ద్వారా ప్రభురాత్రి భోజన ఆరాధనలలో పాల్గొని రొట్టె ద్రాక్షారసము తీసుకొన్ననూ, నాలో ఏ విధమైన మనశ్శాంతి లభించనందున నిరాశ చెందాను.

**కీర్తన 11:4** ప్రతి వ్యక్తిని సృష్టించిన సృష్టికర్త గర్భములో పిండముగా నుండగానే గుర్తించి గమనించు సమర్థుడు. నన్ను తన చిత్తములో ఉన్నత విద్యను అభ్యసించు ధన్యతనిచ్చారు. 1989వ సంవత్సరములో రంగరాయ మెడికల్ కాలేజీలో ప్రవేశమును బట్టి కాకినాడలో నున్న రోజుల్లో మా సీనియర్ విద్యార్థినులలో ఒక స్నేహితురాలు క్రీస్తును రక్షకునిగా స్వీకరించిన విశ్వాసిగా నన్ను కూడా తనతోపాటు ఉజ్జీవ సభలకు ఆహ్వానించింది. క్రీస్తు విశ్వాసులెన్నడూ స్వార్థముతో స్వరక్షణను కొనసాగించలేరు, గాని వారు పొందిన ఆత్మీయానుభవాల్ని యితరులతో పంచుకొని క్రీస్తు ప్రేమకు సాక్షులుగా నిలిచి ఆనందంగా జీవించగలరని తీరిగ్గా గ్రహించాను.

**రోమా 5:8** బోధకుని ప్రసంగ సారాంశమును బట్టి క్రీస్తు ప్రతి వ్యక్తిని రక్షించాలనే సంకల్పంతో సిలువను భరించి శత్రువులను క్షమించిన రీతిని వివరించారు.

క్రీస్తు మరణించింది సిలువపై నీకోసమే. నీకోసమే అనే మాట నాలో చలనము కల్గించింది. మొద్దుబారిన నా హృదయంలో స్పందన కల్గించిన ఆ కల్వరి ప్రేమ ప్రపంచంలో అందరినీ ప్రేమించి, అందరి కొరకు, ప్రత్యేకంగా నాలో క్రొత్త జీవితాన్ని ఆరంభించాలనే ఆశయాన్ని సంపూర్ణంగా గ్రహించు ధన్యతను పరిశుద్ధాత్ముడే కల్గించారు.

నేను నా పాపాలపై అనుభవించవలసిన శిక్షను ఆయనే భరించారన్న సత్యాన్ని గ్రహించాను. నేడే అనుకూల సమయము, నేడే రక్షణ దినము అన్న నినాదాన్ని అంగీకరిస్తూ క్రీస్తును నా హృదయంలోనికి ఆహ్వానించాను. ఆ క్షణమే నాలో సమాధానం, శాంతి, చెప్పనశక్యమైన ఆనందము నాలో ఉప్పొంగింది. ఇదే మారుమనస్సు అనుభవమని నాకు స్పష్టంగా తెలిసింది. పరలోకపు తండ్రి నా స్వంత రక్షకుడయ్యారు. హల్లెలూయ.

నా విద్యాభ్యాసమును డాక్టరుగా ముగించి ఉన్నత విద్యగా పోస్టుగ్రాడ్యుయేషన్ సైకాటరీ డాక్టరుగా డిప్లమోలో చేరాను. కాకినాడ నుండి హైదరాబాదులో ఉండి కోర్సు చేయు సమయంలో మంచి ఆదర్శాలతో సువార్త ప్రకటించు సంఘములో సభ్యురాలనై విశ్వాసమును కాపాడుకొనగల్గాను. నా విశ్వాస జీవితాన్ని గమనించిన స్థానిక పాస్టరుగారు నాకొక వివాహ సంబంధాన్ని తెలిపారు. అమెరికాలో ఉద్యోగము చేయదలచిన యువకునితో వివాహము నాకు సమ్మతిని కల్గించలేదు. నాకా ఉద్దేశ్యము లేనప్పటికిని, పెద్దలు ప్రోత్సహించి, అమ్మా, యిది నీ జీవిత సమస్య గనుక ప్రార్థించి దేవని చిత్తాన్ని కనిపెట్టి చెప్పవచ్చునని సలహాయిచ్చారు. ప్రత్యేకంగా ప్రార్థించి కనిపెట్టాను.

**యెషయ 55:8-9 "నా తలంపులు మీ తలంపుల వంటివి కావు. మీ త్రోవలు నాత్రోవల వంటివి కావు. యిదే యెహోవా వాక్కు. ఆకాశములు భూమికి పైన ఎంత ఎత్తుగా ఉన్నవో మీ మార్గముల కంటే నా మర్గములు, మీ తలంపుల కంటే నా తలంపులు అంత ఎత్తుగా నున్నవి".**

దేవుని చిత్తము స్పష్టంగా తెలుసుకొన్న తర్వాత 2000 సంవత్సరములో నా వివాహము జరిగింది. అమెరికాలో ప్రవేశించి మూడు స్టెప్స్ ముగించి, రెసిడెన్సీ చేయు అర్హత పొందాను. అప్పటికే నాకు ముగ్గురు బిడ్డలు. ప్రభువు దీవెన ద్వారా కలిగారు.

2001లో మొదటి బిడ్డను, 2003లో రెండవ పాపను, తర్వాత 2005లో బాబును పొందాను. నా భర్తకు నాకు నా ఉద్యోగము కన్న బిడ్డలను దైవిక జ్ఞానములో పెంచుకోవాలన్న

వివేకము కల్గింది. ధనార్జన కన్న ప్రభువును గూర్చిన జ్ఞానములో ముగ్గురు బిడ్డలను శ్రద్ధతో పెంచుకోవాలని ఆశించాము. 2010లో చిన్న బాబు స్కూలుకు వెళుటకారంభించగానే ఉద్యోగం చేయాలనే ఆశ కల్గింది.

స్థానిక క్లినిక్‌లో వాలంటీరుగా పనిచేసి డాక్టరుగా రెసిడెన్సీకై అప్లై చేయసాగాను. ఎన్ని ప్రయత్నాలు చేసిననూ తగిన జవాబు పొందలేకపోయాను. అన్ని ద్వారాలు మూసుకొని పోయాయని గ్రహించాను. ఎంతో శ్రమించి చదివిన డాక్టరు కోర్సు నష్టమై పోతుందని చాలాసార్లు నిరాశకు గురయ్యేదానను. ప్రభువు వాక్యము ద్వారా స్పష్టంగా మాట్లాడి ధైర్యమిచ్చి నెమ్మదినిచ్చారు.

**ఫిలిప్పీ 3:7-8 "ఏవేవి నాకు లాభకరములై యుండెనో వాటిని క్రీస్తు నిమిత్తము నష్టముగా ఎంచుకొంటిని. నిశ్చయముగా నా ప్రభువైన యేసుక్రీస్తును గూర్చిన అతిశ్రేష్టమైన జ్ఞానము నిమిత్తమై సమస్తమును నష్టముగా ఎంచుకొనుచున్నాను".**

గొప్ప భక్తుడైన పౌలు చెప్పిన రీతిగా సమస్తమును నష్టముగా ఎంచుకొన్నాడు గనుక నా జ్ఞానము, నా ధనము, నా విద్య కన్నా క్రీస్తుప్రేమలో, జ్ఞానములో ఎక్కువ సమయము వినియోగించి నాకున్న సమయాన్ని దేవుని వాక్యములు ధ్యానిస్తూ ప్రార్థించుచూ, నా బిడ్డలతో ప్రార్థించి వాక్యము బోధించి వారిని మనుష్యుల దయలో, క్రీస్తుదయ, ప్రేమలలో వర్ధిల్లులాగున నా సంపూర్ణ సమర్పణ గల జీవితము దేవుని చిత్తములో దేవునిని యిష్టపర్చే రీతిగా జీవించాలని సంతోషముగా నిర్ణయించుకొనగల్గాను. నిరాశ సంపూర్ణంగా దూరమయింది.

నా జీవితంలో ప్రధమ ఆశయము దేవుడు నాకిచ్చిన బిడ్డలను ప్రార్ధనా వాతావరణంలోనే పెంచాలి. సైతాను ఎవరిని మ్రింగాలోనని పొంచియుండి, బిడ్డలను అమెరికాలో సంపూర్ణంగా లోకమును ప్రేమించే పరిస్థితి నుండి దూరంగా నిలిచే రీతిగా పెంచుకోవాలని ఆశించి నేటికి నా ఆశయాన్ని కొనసాగిస్తున్నాను. భవిష్యత్తు దేవునిచేతికి అప్పగించాను.

**1 తిమోతి 6:6 "సంతుష్టి సహితమైన దైవభక్తి గొప్ప లాభ సాధనమైయున్నది".**

నా జీవితంలో కనుగొనిన గొప్ప సత్యమేమనగా దేవుని చిత్తమేదో పరిశీలించి తెలుసుకొనగల జీవిత స్థలము సురక్షితమైనది, అతి శ్రేష్టమైనది. బాల్యంలో గడిపిన కాకినాడ ప్రాంతము నుండి డాక్టరు చదివే వరకు అదే స్థలములో నుంచి కేవలము పెద్ద చదువు చదువుటకు హైదరాబాదు చేరింది గొప్ప ధనార్జన పొందగల డిగ్రీకోసం కాదు

గాని శ్రేష్టమైన రక్షణానుభవాన్ని సంపాదించుకొని, గొప్ప విశ్వాసుల సహవాసాన్ని, మంచి సుబోధనల ద్వారా ఆత్మీయ జ్ఞాన వివేకాలతో వివాహము నెదుర్కొని అమెరికాలో ప్రవేశించాను. అన్ని విధాలా నన్ను నా ఆశయాల్ని గ్రహించుకొని ప్రేమించే భర్తను పొందాను. అనుకూలంగా సహకారంతో ఆత్మీయ జ్ఞానంతో బిడ్డలను పెంచుకొనే అద్భుత అవకాశాలను ప్రభువందించారు.

నేనును నా యింటివారును యెహెూవానే సేవించెదమని ధైర్యంగా సాక్ష్యమిచ్చు ధన్యతనిచ్చారు. రక్షణ యిచ్చినంత మాత్రన యివ్వగల బహుమతుల జాబితా గాని, ప్రైయిజ్‌టాగ్ గాని అందించవు, గాని ప్రతి అడుగును స్థిరపరచి నడిపించగల మంచి కాపరిగా మాకు ప్రభువున్నారు.

ప్రతి వ్యక్తిని తన చిత్తానుసారంగా ఆయన మనయందు కల్గిన ప్రముఖ ఉద్దేశాలన్నీ సఫలపర్చుటకే నడిపించగలరని తెలుసుకొన్నాను. మనపట్ల చేయు ప్రతి కార్యము సమకూడి మన మేలుకొరకు జరిగించు గొప్ప దేవుడు మనకున్నారని మీరు తెలుసుకున్నారా? నాతో కూడా కలిసి దేవున్ని స్తుతించి ఘనపర్చండి. అమెరికాలో నాకిచ్చిన మంచి ప్రార్థనా సహవాసమును బట్టి దేవునికే వందనాలు. ఆమెన్.

----------------

# 25. మాట తప్పని సజీవుడైన క్రీస్తు నా రక్షకుడు (ఎ)

జీవరత్నం రెడ్డి (మియాపూర్/హైదరాబాద్)

**కీర్తనలు 146:6,7 "ఆయన ఆకాశమును, భూమిని, సముద్రమును దానిలోని సర్వమును సృజించిన వాడు. ఆయన ఎన్నడును మాటతప్పని వాడు. బాధపరచబడు వారికి ఆయన న్యాయము తీర్చును".**

**పరిచయము: –** ప్రభువు నామములో మీకు నా వందనాలు. నన్ను చీకటి నుండి ఆశ్చర్యకరమైన వెలుగులోనికి నడిపించిన నా రక్షకునికి స్తుతి కల్గునుగాక. నా పేరు జీవరత్నం రెడ్డి. అదిలాబాదు జిల్లా, తెలంగాణాలో రామకృష్ణ పురము వాస్తవ్యుడను. నేను అన్యుల కుటుంబములో బాల్యాన్ని గడిపాను. నా తల్లిదండ్రులు క్రీస్తును ఎరుగనివారు.

క్రీస్తును ఆయన అనుచరులెన్నడూ ద్వేషించలేదు. నిజదేవుని గూర్చిన అన్వేషణ నాలో వుండేది. మొదటిగా నా భార్య దేవున్ని నమ్మి మంచి విశ్వాసిగా బిడ్డలనిద్దరిని క్రీస్తు ప్రేమలో, క్రమశిక్షణలో పెంచుట గమనించేవాడిని. మొదటి రోజుల్లో నేను వ్యతిరేఖించాను. రాజకీయ కార్య కలాపాలతో నా బాధ్యతలను మరచాను. నా భార్య ప్రార్ధనల ఫలితంగా నాలో కల్గిన ఆసక్తినిబట్టి నా భార్యతో పాటుగా నేను చర్చికి వెళ్ళి వాళ్ళు చేస్తున్న ప్రార్ధనలలో పాల్గొనాలనే ఆసక్తి కల్గింది. వారి పాటలు, ఆరాధనలు నన్ను ఆకర్షించాయి. దైవసందేశాలలోని సారాంశము నా హృదయాన్ని తాకగా నాలో విశ్వాసము కల్గింది. మంచి జీవితము, భక్తిగల సమర్ధురాలైన భార్యను, మంచి వినయము గల బిడ్డలనిచ్చిన దేవునిని స్తుతించుట ఆరంభించాను. ప్రార్ధించుట నేర్చుకోగల్గాను. బైబిలు సత్యాలు నాలో ఆత్మీయతను, ఆధ్యాత్మిక భావాలను పెంచగా రక్షణ స్థిరతకల్గి మారుమనస్సును పొంది బాప్తీస్మము తీసుకొనుటకై నన్ను నేను సమర్పించుకొనగానే దేవుని మెల్లని స్వరము ద్వారా సంపూర్ణసేవ చేయాలన్న హెచ్చరిక విన్నాను. ప్రతి దినము ఏడు మారులు స్తుతించాలని చెప్పారు. అన్ని సార్లు చేయలేనని చెప్పగా, తప్పక స్తుతి చేసినచో గొప్ప దీవెనలు పొందగలవన్నారు. దేవుడిచ్చిన ఆర్ధిక స్థిరతను బట్టి విభిన్న స్థలాలలో ఏడు ఆరాధనలు జరిగించుట, భోజన సదుపాయాలు, అల్పాహారమందించుట, ఏడు పాటలు, ఏడు సందేశాలు వివిధ ప్రాంతాలలో నిర్వహించు ధన్యతనిస్తున్నారు.

సంఘ నిర్మాణం చేయు సమర్థతను యిచ్చారు. ఆసక్తితో ముస్లిము సోదరులు, సోదరీమణులను ప్రభువు ప్రేమతో ఆహ్వానించగా అందరము కలిసి ప్రతిదినము స్తుతి ఆరాధనలలో పాల్గొని గొప్పగా ఆనందిస్తున్నాము.

1992 ఆగస్టు 15వ తేదీన ఆరంభించిన విశ్వాస జీవితము అవిరామంగా సేవలో నిమగ్నమై క్రొత్త విశ్వాసులు చేరుచుండగా ప్రోత్సాహకరమైన సేవను కొనసాగిస్తున్నాము. పదవీ విరమణ కాలమునకు ముందుగా వాలంటరీ విరమణ ద్వారా మంచి ఆరోగ్యముతో దేవుని సేవలో నిమగ్నమగుట ధన్యతగా భావిస్తున్నాను. ఆ తర్వాత హైదరాబాదుకు తరలివచ్చి స్థిరపడ్డాము. ముస్లిము వారికి సేవచేయు భారాన్ని ప్రభువేయిచ్చారు.

సియోను ప్రార్థనా గోపురమును స్థాపించాము. ఉదయము 7 గంటలకు ఆరంభించి రాత్రి 9 గంటల వరకు విభిన్న ప్రాంతాలలో ఆరాధనకు ఎక్కువ సంఖ్యలో పాల్గొనుటను బట్టి సేవకు పిలిపించి నడిపించుచున్న దేవుడు నమ్మదగినవాడు. మా సేవను విస్తరింపజేసి హైదరాబాదు నుండి విజయవాడ వెళ్ళు మార్గంలో అంకిరెడ్డి గూడెంలో, సత్తుపల్లిలో కూడా సంఘాలు స్థాపించాము. 2013 నుండి దేవుని అభిషేకానుసారము పాటలు వ్రాసి దేవున్ని ఆరాధించే తలాంతునిచ్చి ప్రభువును స్తుతించే భాగ్యమిచ్చారు. టి.వి.లో ప్రసంగించే అవకాశము కల్గించి అనేకులు సువార్తవినే అవకాశము కల్గించారు. కీర్తన, ఆరాధన, రక్షణ టి.వి. ఛానల్‌లో నా సందేశాలు వినినవారు ఆత్మీయ మేలు పొందుచున్నామని తెలుపగా దేవునికి కృతజ్ఞత చెల్లిస్తున్నాను.

మాకు దేవుడిచ్చిన యిద్దరు బిడ్డలు అమెరికాలో కుటుంబములతో స్థిరపడు కృపనిచ్చారు. కుమారుడు సునీల్ రెడ్డి, శాంతి జీవన్‌లు ప్రభువు సేవలో ఆసక్తిచూపు బిడ్డలుగా తమ బిడ్డలను దైవభక్తిలో పెంచుకొనుట మాకానందము కల్గిస్తుంది. ఎన్నికలేని నన్ను, నా కుటుంబమును దేవుడు ఎన్నుకొని, ఆయన సేవ చేయించుకొని, దయ చూపుటను బట్టి ఎల్లప్పుడు దేవున్ని స్తుతించి ఘనపరుచుచూ, సాక్ష్యము చెప్పుచూ క్రీస్తు ప్రేమలో సాగిపోవుచున్నాము. దేవుని మహిమకొరకు మన జీవితాలను ఉపయోగించాలనే కోరిక ప్రార్థన చేస్తున్నాము. మీరు మా సేవకై ప్రార్థించండి. **మా అడ్రస్**

Seeyonu Prayer Tower
New Hafeez Pet, Miyapur, Hyderabad
Phone No: 040, 64522218, 9491306030

# ప్రతి వ్యక్తిని ప్రేమించుచు మేలుచేయు యేసు నా రక్షకుడు (బి)

**– దేవి రెడ్డి (రామకృష్ణాపురము)**

**యోహాను 14:6 "నేనే మార్గమును, సత్యమును, జీవమునై యున్నాను".**

**పరిచయము: –** ప్రభువునందు ప్రియులైన మీకు నా వందనములు. అన్యుల కుటుంబములో జన్మించి విగ్రహాలను ఆరాధించే నన్ను క్రీస్తు రక్షించి క్రీస్తును ఆరాధించే ధన్యతనిచ్చినందున మొదటిగా నా హృదయముతో కృతజ్ఞత చెల్లిస్తున్నాను. మా తల్లి దండ్రులకు సంతానము లేనందున ఎన్నో పూజలు చేసిననూ ఫలితము లేనందున చాలా వేదనతో గడిపారు.

వీరి దీనస్థితిని గమనించిన క్రీస్తు విశ్వాసులు మీరు క్రీస్తును నమ్మినట్లయితే ఆసాధ్యాలన్నీ సుసాధ్యము చేయునని సలహాయిచ్చారు. వారు ఆ మాటను నమ్మి గర్భఫలము దేవుడిచ్చు బహుమానము గనుక ముందుగా క్రీస్తును నమ్మి ప్రార్ధించినందున నేను, అక్క అన్నలను సంతానముగా ఉపవాస ప్రార్ధన ఫలితంగా జన్మించాము.

మంచి భక్తితో పూజలు చేసిన అనుభవంతో క్రీస్తును నమ్మిన తర్వాత నాతల్లి క్రీస్తుపట్ల మరింత అధిక భక్తిని పాటించి, మమ్ములను క్రీస్తు ప్రేమలో, ప్రార్ధన ద్వారా, వాక్యపఠనము ద్వారా శ్రద్ధతో పెంచింది. బాల్యము నుండి విగ్రహారాదనకు దూరంగా పెరిగాము. సామాన్యమైన విద్యాభ్యాసాన్ని ముగించిన తర్వాత, విద్యావంతుడై, మంచి ఉద్యోగిగానున్న రెడ్డిగారితో వివాహము జరిగింది.

నా భర్త సింగరేణి గనిలో పెద్ద ఆఫీసరుగా పనిచేసేవారు. నేను విగ్రహారాధన చేయక క్రీస్తును ప్రార్ధించి ఆరాధించేదాన్ని. నా భర్తగారికి నా విశ్వాస జీవితముపట్ల యిష్టత లేనందున కాస్త యిబ్బందుల నెదుర్కొన్నాను. ఆయన తనకాలమంతా రాజకీయ రంగంలో గడిపేవారు. యూనియన్ మెంబర్లతో కాలమంతా వ్యర్ధపరిచేవారు. నన్ను నా విశ్వాసాన్ని ఆటంకపర్చుటకు ప్రయత్నించిననూ, నాలోనున్న అచంచల విశ్వాసమును బట్టి పట్టుదలతో ప్రార్ధనలు చేయుటను బట్టి సైతాను శక్తులను ధైర్యంగా ఎదుర్కొని, నిబ్బరంగా క్రీస్తుప్రేమలో సాగిపోయాను.

శరీరాన్ని, లోకాన్ని జయించిన క్రీస్తువైపు చూచుచూ, నా ఆత్మను కాపాడు శక్తిని ఆశ్రయించాను. నన్ను దివారాత్రులు కాపాడి తన రెక్కల నీడలో ఆశ్రయాన్ని యిస్తూ మంచి కాపరిగా ఉండి నాకు పచ్చికగల చోట్లు చూపించి, నడిపించిన క్రీస్తు కీర్తనీయుడు.

**1 కొరింథి 7:16 “ఓ స్త్రీ, నీ భర్తను రక్షించెదవో లేదో నీకేమి తెలియును? అయితే ప్రతి వానిని ఏస్థితిలో పిలిచెనో, ఆ స్థితియందే నడుచుకొనవలెను”.**

పౌలు తెల్పిన వాక్యము నాపట్ల నెరవేరినందున దేవున్ని స్తుతించాను. నా భర్తకు బైబిలు చదివి మరిఎక్కువగా క్రీస్తును తెలుసుకోవాలని ఆశించి, దైవజనుల ద్వారా ఎన్నో సంశయాలను తీర్చుకొని వాక్యంలో బలపడి స్థిరపడి ప్రార్థించుట కొనసాగించారు. రక్షణపొంది బాప్తీస్మం పొందగానే దేవుని సేవచేయు తపన, సాక్ష్యము చెప్పాలన్న భారము కల్గింది.

ప్రభువు మెల్లని స్వరం విని రోజుకు ఏడుమార్లు స్తుతి ఆరాధనలు నిర్వహించాలన్న నిశ్చయతతో ఉద్యోగము విరమించి సేవచేయు సంకల్పం కల్గింది. మా బిడ్డలిద్దరికీ విశ్వాసుల కుటుంబములోని బిడ్డలను వివాహం చేయుట, వారిరువురు కుటుంబాలు అమెరికాలో స్థిరపడుట దేవుని ప్రత్యేక ఆశీర్వాదమని నమ్మి కృతజ్ఞత కల్గి యున్నాము.

మా ప్రాంతంలో నున్న అన్యులు ముస్లిం ప్రజలంతా మైకులో పాటలు, సందేశాలకు ఆకర్షితులై ఆరాధనలలో పాల్గొని క్రీస్తును అంగీకరించు రీతి మాకెంతో ప్రోత్సాహాన్ని కల్గిస్తుంది. క్రమము తప్పక చేయు ఆరాధనలు ద్వారా ఆత్మీయమేలు పొందుచున్నారు. ప్రార్ధనలలో పాల్గొన్న వారికి ఉచిత భోజనము, అల్పాహారము అందించుటలో ఆనందిస్తున్నాము.

యెహోవాను స్తుతించుట ఎంతో ఎంతో మంచిది అని గానం చేస్తూ ఎంతో తృప్తితో నిండిన జీవితాన్ని జీవిస్తూ క్రీస్తు అనుచరులుగా ఆయన ప్రేమకు సాక్షులముగా నున్నాము.

నేనును నా యింటివారును యెహోవాను సేవిస్తున్నామని ధైర్యంగా చెప్పుకోగల్గినందులకు మమ్ములను క్రీస్తుకు సాక్షులుగా ఎంచుకున్నందుకు ఆయనకే శతకోటి వందనాలు. ఈ సాక్ష్యము చదువుచున్న వారంతా ప్రభువే సజీవుడని గ్రహించాలి. ఆయన చిత్తాన్ని ప్రతి విషయములో ప్రార్థించి తెలుసుకొని ఆయన మహిమ కొరకు ప్రతి వ్యక్తిని, నిన్ను, నన్ను కూడా ఉపయోగించు కొనగలరని నమ్మండి. ప్రభువు కొరకు జీవించుటకు ఆసక్తితో ఉండండి. సత్యము, మార్గము, జీవమైన క్రీస్తును నమ్మకంగా వెంబడించండి. ప్రతివారికి మేలుచేసి దీవించే దేవుడు మనందరకు అత్యధిక ఆశీర్వాదాలనిస్తాడు.

యేసే సర్వాధికారి, సర్వ శక్తిమంతుడు. సృష్టికర్త గనుక సమస్తము సక్రమంగా నిర్వహించగలడు. ప్రభువు మహాకృప వల్ల అమెరికాను దర్శించి నా యిరువురి బిడ్డల కుటుంబాలతో కాలము గడిపి ఆనందించే ధన్యతనిచ్చారు. అమెరికాలో తెలుగు విశ్వాసుల సహవాసంలో నా బిడ్డలు ఆత్మీయంగా ఆనందించుట ద్వారా కొందరి తెలుగువారితో మా సాక్ష్యానుభవాలు పంచుకోగల్గాము. న్యూ జెర్సీలో ఉన్న యు.యి.సి.ఎఫ్. సహవాసంలో నా భర్త వాక్య పరిచర్యచేసి దేవున్ని మహిమపర్చారు. మా బిడ్డల పుట్టినరోజు వేడుక కూడా అందరితో కలిసి జరిపాము. వారందరి ఆప్యాయత అందుకొనుటకు బాబు కుటుంబము, కుమార్తె కుటుంబముతో కలిసి గొప్ప ఆనందాన్ని పొందాము. ప్రతిచోట ప్రభువుకు సాక్షులుగా జీవించుటలోనున్న శాంతి లోకమిచ్చే శాంతి కానేరదు.

మా సాక్ష్యాలను పుస్తకములో పొందుపరిచి అనేకమంది చదివి క్రీస్తును ఘనపర్చు ధన్యత లభించు చున్నందుకు దేవునికి వందనాలు చెల్లిస్తున్నాను.

**టి.వి. మినిస్ట్రీ సమయాలు**

ఆరాధన : ఆదివారము 7:30 AM

రక్షణ టి.వి : ఆదివారము 7:30 PM

కీర్తన టి.వి : ప్రతిరోజు 8 PM

http://www.seeyonu Prayer tower.com

Youtube:http://www.youtube/user/seeyonu Prayer Joun

# 26 . క్రీస్తే నిజదేవుడని తెలుసుకున్నాను

**– జీవరామచంద్రారెడ్డి (కడప)**

**యోహాను 3:16 "దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను".**

**పరిచయము:–** ప్రభువు నామములో మీకు శుభము కల్గునుగాక. నా పేరు రామచంద్రా రెడ్డి. నా బాల్యమంతా ఆంధ్రప్రదేశ్‌లో సత్తుపల్లి అనే గ్రామములో గడిపాను. సనాతన అన్యాచారము ఆచరించేవారము. నా తల్లికి దైవభక్తి అపారము. ఆ భక్తి పరవశములో అన్ని శతకాలలోని పద్యాలు కంఠస్థము చేసేవాడిని. భక్తితో ఆనందము కల్గినందున అవే ధ్యానము చేస్తూ వుండేవాడిని. ప్రహ్లాద చరిత్ర, గజేంద్ర మోక్షములో పద్యాలు నాకు ప్రీతిపాత్రాలు. ఆసక్తితో నేర్చుకొని ఆచంచల భక్తితో త్యాగరాజు కీర్తనలు, రామదాసు గీతాలు శ్రావ్యంగా పాడేవాడిని.

మా అమ్మతోపాటుగా పురాణకాలక్షేపం చేస్తూ చాలా రాత్రి వరకు గడిపేవాడిని. ప్రతి పండుగను వేడుకగా ఆచరించేవారము. నాగులచవితి రోజు దగ్గర గ్రామంలో పుట్టను చేరి కొబ్బరికాయ కొట్టి, పాలుపోసి పూజచేసి వచ్చేవారము. ప్రత్యేక పలహారాలు వండుకొని తినేవారము.

నేను 5వ తరగతి చదివేరోజుల్లో ఒక సంఘటన నా జీవితానికి ఒక ప్రత్యేకతనిచ్చింది. మేము మా తల్లిదండ్రులకు నలుగురము జన్మించగా, బాల్యంలోనే నాన్నను కోల్పోయాము. అమ్మ చెప్పింది చేస్తూ క్రమశిక్షణలో భక్తి భావాలతో పెరిగి అవసరమున్నప్పుడు ఉపవాసముతో గడిపేవారము.

ఒక నాగులచవితి వేడుకరోజు కూడా పూజ చేయాలని ప్రక్కఊరు వెళ్ళి పూజముగించి తిరిగివచ్చే సమయంలో మా బంధువులలో ఒక పెద్దాయన గంగరాజుగారు క్రీస్తు విశ్వాసిగా మారారు. ఆ రోజు గంగరాజుగారు గ్రామము సమీపములో ఎదురయి పలకరించి యోగక్షేమాలను తెలుసుకొని వెంటనే మా చేతిలో నున్న వస్తువులను చూచి "ఎక్కడికి వెళ్ళి వస్తున్నారయ్యా" అని ప్రశ్నించారు. పూజచేసి వస్తున్నామని తెల్పాము. "పాలుపోసే సమయములో మీ స్వామి కన్పించలేదా? ఉపవాసము కూడా ఉండి పూజచేసిన ఫలితము దక్కిందా? ఆ స్వామి నీకు శాంతినిచ్చాడా? నీకెన్నడైనా గొడుగు పట్టాడా? అని సరదాగా ప్రశ్నించారు.

ఆప్యాయంగా నా బుగ్గను తాకి, బాబూ, నీవు 5వ తరగతి చదువుచున్నావు కద, నీకు అయినా బుద్ధిలేదా? జీవములేని విగ్రహాలను, పురుగులు, పక్షులను నమ్మరాదు. అవికూడా సృష్టిలోని భాగాలే. సృష్టికర్త సజీవుడు గనుక ఆయననే నమ్మాలి. మనము ఏ శకములోనున్నాము? అని ప్రశ్నించగా క్రీస్తు శకము అని జవాబిచ్చాను. క్రీస్తు నిజమైన మార్గము చూపే రక్షకుడు. ఆయన పేరుననే అన్ని కాలాలు జరుగుచున్నాయి. ఆయన పేరుననే క్రీస్తు పూర్వము, క్రీస్తు శకమని వర్తిస్తుంది. ఆయన నామము ఘనమైనది. ఆయన శరీరధారిగా యీ లోకానికి వచ్చారు. ఆయనను గూర్చి ప్రవక్తలు ప్రవచించారు. ఆయన మానవునిగా జన్మించి జీవించి సువార్త బోధించి మరణించి తిరిగి లేచారు.

ఒక ప్రణాళిక బద్ధంగా పరిశుద్ధునిగా జీవించారు. దేవుని చిత్తానుసారంగా ఆదర్శ జీవితాన్ని జీవించిన మహనీయుడు. ఇది చరిత్రాత్మక సత్యము. ఆయన జీవించి నడిచిన ప్రాంతాలు, మరణించి లేచిన ప్రాంతాలను అన్ని ప్రాంతాల ప్రజలు కళ్ళార చూచి తరిస్తున్నారు. అన్ని జాతులవారు కులమత విబేధాలు లేక క్రీస్తు అనుచరులయ్యారు. నేడు నేను కూడా వీధులలో ఈ బూరతో ఆయనను కీర్తించి, పాడి సువార్త బోధిస్తున్నాను కదు! ఆయనను గూర్చిన సత్యాలు చెప్పాలనే పనిలో జీవిస్తున్నాను అని అన్నారు.

గంగరాజు గారి మాటల్లో సత్యమున్నదని మేమంతా స్పష్టంగా నమ్మాము. ఆయనను మా యింటికి ఆహ్వానించి మా యింట్లో వేడుకకై వండుకున్న ప్రత్యేక భోజనాన్ని పెట్టి గౌరవించి క్రీస్తును గూర్చి మరికొన్ని సత్యాలు విన్నాము. ఆ రాత్రి లాంతరుతో ప్రక్క యిళ్ళకు వెళ్ళి చుట్టుప్రక్కలలో నివసించు వారందరినీ పిలిచి మంచి సువార్త బోధించునట్లు గంగరాజు గారిని ప్రాధేయపడ్డాము. అంతా ఆసక్తితో విన్నాము.

ఆ తర్వాత గంగరాజు గారు తరచుగా మా గ్రామాన్ని దర్శించి సువార్తను బోధించగా అనేకులు క్రీస్తును రక్షకునిగా స్వీకరించారు. మా యింటివారంతా క్రీస్తునే వెంబడించసాగాము. గంగరాజు గారు జ్ఞానబోధిని అనే చిన్న పుస్తకమిచ్చారు. ఆ పుస్తకములో మోషేకు దేవుడందించిన పది ఆజ్ఞలు, పరలోక ప్రార్థన, విశ్వాస పరిమాణము అనే అంశాలు పదే పదే చదివి నేర్చుకున్నాము.

మా ఊరిలో ఎలిమెంటరీ స్కూలు వరకే విద్యను నేర్చుకొనే అవకాశముంది గాని హైస్కూలు లేదు. మా పరిస్థితి గమనించిన గంగరాజు గారు మా వూరి వారందరికీ ప్రత్యే సదుపాయము కల్పించి చిన్న వారంతా హైస్కూలు చదువుకొనే అవకాశం తిరుపతి దగ్గర రేణిగుంటలో ఉన్న మిషన్ స్కూలులో ఉచిత భోజనం అందించి ఎస్.ఎస్.ఎల్.సి (S.S.L.C) చదువుకోవయచ్చునని తెల్పారు. దాదాపు పాతికమంది విద్యార్థులు ఒకేసారిగా ఆ స్కూలులో

నాతోపాటు చదువుటకు వెళ్ళగల్గాము. క్రీస్తును గూర్చి తెలుసుకొనుటతో పాటు మంచి క్రమశిక్షణను, మంచి ఆదర్శాలతో జీవించే గొప్ప అవకాశాన్ని గంగరాజు గారు క్రీస్తు విశ్వాసిగా మాకందించారు. క్రీస్తును ప్రేమించే వారంతా యితరుల క్షేమాన్ని కాంక్షించగలరని నమ్మాను.మా వూరునుండి 20కి.మీ దూరంలో నున్న హైస్కూలులో చేరి చదువుటకు 116రూ డొనేషన్ చెల్లించలేక చదువుకోలేని వారెందరో నుండగా క్రీస్తు దయవల్ల గంగరాజు గారు మాకు రక్షణానుభవాన్ని, మంచి విద్యను కూడా పొందగల్గు ధన్యతనిచ్చారు. గంగరాజు గారి ఆద్వర్యంలోనే బాప్తీసము పొందాము. హైస్కూలు విద్యాభ్యాసం పూర్తికాగానే టీచరు ట్రయినింగులో చేరాను.

అది 1965వ సంవత్సరము. సంతోషంగా 21/2 సంవత్సరాలుగా ఉద్యోగం చేసాను. దూరమయినందున చివరకు మావూరిలోనే ఉద్యోగము పొందాను.

**నేనెదుర్కొన్న ముఖ్య సంఘటన:–** నేను రక్షణానుభవం పొందిన నాటినుండి యింటిలో కుటుంబ ప్రార్ధన చేసుకొని రోజూ నిద్రపోయేవారము. ఒకరోజు 5 గంటల వేళ స్కూలుపని ముగించి యిల్లుచేరాను. మా అక్క భర్త మాకు బంధువులే. మేనమామ వరస. కావున ఆయన మా యింట్లో మంచము మీద పరుండి బాధలోనున్నాడు. చాలా ఉబ్బసము వ్యాధివల్ల బాధలో ఊపిరి పీల్చుట గమనించాను. ఆహారము లోనికి వెళ్ళు స్థితిలేదు. ఊరిపెద్దలంతా వచ్చి పరామర్శిస్తున్నారు. నేను చూస్తూ వుండగానే లేచి కూర్చున్నారు. ఆయన క్రీస్తును నమ్మిన విశ్వాసి. ఆయన నోటినుండి పాట పాడుట చూచి ఆశ్చర్యపడ్డాను. ఎంతో అర్ధవంతమైన పాట పాడగా విన్నాను.

"దేవ తనయా క్రీస్తు నాధుండా – అయ్యా పాపులకై వచ్చినావా!
పాపులకై వచ్చినావా – ప్రాణదానము చేసినావా
పాపులను కరుణించినావా – అయ్యా పరలోకము తెరిచినావా

ఆ పాట పాడుచుండగా మా మామయ్య ముఖము చాలా ప్రకాశవంతంగా మారింది. వెలుగు, వెలుగు, వెలుగు అని కలవరిస్తూ వున్నాడు. మా బంధువులలో కొందరు అన్యులుగానే వున్నారు గనుక దయ్యము ఆవరించింది, వేపమండలు తెండి అని అరుచుట గమనించాను. నేను వెంటనే పరిస్థితి గమనించి దేవుని చెంతకు చేరుటకు ముందు తన పాట వినుట ద్వారా పరలోకము తెరువబడిందనియు అతని ఆత్మను ప్రభువు చేర్చుకొనుటకు సిద్ధంగా నున్నట్లు గమనించాను. వేపమండలు తెచ్చువారిని నివారించాను.

అంతలో నన్ను గమనించి తేరిచూస్తూ, బాబూ రెండవ చరణము కూడా పాడు అని నాతో చెప్పాడు. నేను మెల్లగా పాట అందుకుంటున్న వేళలో ఆయన ప్రయాణము

ముగిసి ప్రభువు చెంతచేరాడు. ప్రభువును ప్రేమించిన వ్యక్తులకు పరలోకము చేరుట ఎంత ఆనందమగునో గ్రహించాను. నిజమే, విశ్వాసికి అది శృంగార నగరమే. ఆత్మ మాత్రమే చూడగలదు. అక్కడ కన్నీరే ఉండదు. కష్టాలుండవు. ఆనంద గాన తరంగాలుంటాయి. స్తుతించుటకే సదా ఆశిస్తాడు.

మా గ్రామములో క్రైస్తవ సంప్రదాయంలో ప్రప్రధమంగా జరిగిన సమాధి కార్యక్రమము చూచిన వారంతా ఆశ్చర్యపడ్డారు. ఆ సంఘటన చూచిన అన్యులు కొందరు క్రీస్తే నిజమైన దైవమని నమ్మి రక్షణ స్వీకరించి బాప్తీసము తీసుకొన్నారు. గంగరాజు గారు మా గ్రామములోని చీకటిని తొలగించుటకై వెలుగు చూపిన గొప్ప సువార్తికుడు. సువార్త ప్రకటించు వారి పాదాలు సుందరములే కదా!

నా హృదయము క్రీస్తు ప్రేమ భావముతో నిండిపోయి నిద్రరాలేదు. మెల్లగా పాట పాడుకున్నాను. దేవుని ప్రేమ ఇదిగో జనులారా – భావంబునను తెలుపరే కేవలము నమ్ముకొనిన

పరలోక భాగ్యంబు మన కబ్బును–మానవుల రక్షింపను దేవుండు తన కుమారుని పంపెను
మానవ శరీరము దాల్చెను – ఆ ప్రభువు మన పాపముల కొరకే కద!
ఆయన ఆది అంతము లేనివాడు – అల్ఫా, ఓమెగా ఆయనే
ఆర్భాటముతో క్రీస్తు త్వరలో రానైయున్నాడు

దేవుడు తన చిత్తములో నశించువారి కొరకు తన సేవకులను మారుమూల గ్రామాలకు పంపి సువార్తను బూరతో చాటించు నేర్పుగలవాడు. క్రీస్తును గూర్చిన సత్యాలను అర్ధవంతంగా బోధించుట ప్రభువందించే తలాంతులని గ్రహించాను.

నేను క్రీస్తును నమ్మినందున కొన్ని సమస్యలనెదుర్కొన్నాను. విమర్శలను, వ్యతిరేఖతలను ప్రార్ధన ద్వారా జయించగల్గు ధైర్యము ప్రభువిచ్చారు. క్రీస్తును నమ్మిన భాగస్వామిని ప్రభువే నాకు సమకూర్చారు. ముగ్గురు పిల్లలను సంతానముగా నిచ్చారు. విదేశాలలో జీవించే ధన్యతనిచ్చారు.

**యోహాను 3:16 "దేవుని ప్రేమ వివరణ గొప్ప సత్యము".**

నా జీవితానికి క్రీస్తుప్రేమ గొప్ప నెమ్మదిగల విజయవంతమైన మలుపునిచ్చి క్రీస్తుకు గొప్పసాక్షిగా జీవించే ధన్యత నిచ్చింది. మీకు అట్టి శాంతి కావాలా? క్రీస్తును ఆశ్రయించండి ప్రభువు మిమ్ములను దీవించును గాక. ఆమెన్.

--------------

## 28. నటిగా రాణించిన నన్ను నమ్మదగిన క్రీస్తు నేడు నడిపిస్తున్నారు.

– నగ్మా (సినీనటి / మద్రాసు)



**యోహాను 14:6 "నేనే మార్గము సత్యము జీవమునై యున్నాను".**

ప్రభువు ప్రేమకు సాక్షిగా నుండుటకు భాష నిమిత్తము లేదు. నా జీవితంలో సంభవించిన ప్రతివిధమైన అద్భుతాన్ని బట్టి దేవునికి కృతజ్ఞతలు. తమిళము, హిందీ, తెలుగు సినిమా జీవితంలో 1993–97 వరకు గుర్తింపు పొందిన నేను జీసస్ రిడీమ్స్ మినిస్ట్రీస్‌లో మోహన్ లాజరస్ గారి సహకారంతో నా సాక్ష్యము సేకరించినందుకు వందనాలు సమర్పిస్తున్నాను. ప్రతిచోట సాక్షిగా జీవించాలని ఆశయముతో కొనసాగే జీవితమును బట్టి ఆనందిస్తున్నాను. క్రీస్తుతో పరిచయం చేసి రక్షణకు సహకరించిన నా ఆంటీగార్కి నా కృతజ్ఞతలు చెల్లిస్తున్నాను.

మొదటిగా ప్రార్థించి నా సాక్ష్యమును వివరిస్తాను.

"తండ్రీ నీకు వందనాలు. ప్రేమగల సహవాసానికై వందనాలు. ప్రతి అవసరము తీర్చు దేవుడవైనందున వందనాలు. చదువుచున్న అందరి అవసరాలు తీర్చమని ప్రార్థిస్తున్నాను. అద్భుతాలు చేయు దేవా వందనాలు. నీ సన్నిధి మాతో నున్నందున వందనాలు. ఆమెన్.

**పరిచయము:–** నేను బాల్యములోనున్నప్పుడు క్రీస్తు ప్రేమను గుర్తించలేకపోయాను. దేవుడు నన్ను తాకాడు. సైతాను బంధకములనుండి నన్ను విడిపించాడు. దేవుడు తన వాత్సల్యము చొప్పున నాపట్ల ప్రత్యేక ఉద్దేశము కల్గియున్నాడు. నా ఆంటీ నా ఆత్మ రక్షణకై 5 సంవత్సరాలుగా ప్రార్థించింది. 2000వ సంవత్సరములో ఆమెతో ప్రార్థించాను. క్రీస్తులో రక్షణ స్థిరతకు 5 సంవత్సరాలు పట్టింది. గతంలో నా స్వంత మార్గములోనే జీవించుచు వచ్చాను. యోనా వలె నినివే వెళ్ళమని ఆజ్ఞాపించిన దేవుని మాట ధిక్కరించాడు. 3 రాత్రులు 3 పగలు చేప ఉదరములో వుండవలసి వచ్చింది. పాప ఊబిలోనుండి నన్ను పైకితీసి స్వతంత్రురాల్ని చేసారు. ఇశ్రాయేలీయులు కానాను ప్రయాణము 11 రోజులు చేయవలసి యుండగా 40 సంవత్సరాలు పట్టింది. తిరుగుబాటు, సణుగుడుతో గడిపారు.

నేనయితే 2006వ సంవత్సరములో నా పూర్ణ హృదయము, మనస్సు, ఆత్మతో దేవున్ని అంగీకరించాను. ఆయన హస్తము నాపై ఉంచాడు. రక్షణ నిచ్చిన నాటినుండి 2006వ సంవత్సరము మొదలుకొని ఆయన రాజ్యామును గూర్చిన మర్మాలు తెలియజేయుట ఆరంభించాడు. దైవ వాక్యాన్ని వినుట ద్వారా ఆత్మతో ప్రభువు నడిపించాడు. డిసెంబరు 22 నుండి 2007 జనవరి 4వ తేదీ క్రొత్తనిబంధన చదువుట పూర్తిచేయ గల్గాను.

2007వ సంవత్సరము జనవరి 5వ తేదీ నీటి బాప్తీస్మము తీసుకోగలిగాను. మార్చి 5వ తేదీకి పూర్తిగా బైబిలు చదివాను. ఆ తర్వాత 2,3 సార్లు బైబిలు చదివేసాను. అప్పటి నుండి పరిశుద్ధాత్మ ద్వారా నడిపించబడుచున్నాను.

రెండు పూర్తి సంవత్సరాలు ఏకాంతంగా రోజుకు 14 లేదా 15 గంటలు వాక్యధ్యానంతో గడిపేదాన్ని అబ్రహాము ఇస్సాకును బలియిచ్చిన రీతిగా నా జీవితాన్ని సమర్పించాను. దూతలు అబ్రహాముతో సంభాషించిన రీతిగా నాకు బోధించగా ఆయన చిత్త ప్రకారము నన్ను వాడుకోవాలని దేవునితో చెప్పాను. నాలో ప్రభువే జీవిస్తున్నారు. సమస్తము నూతనంగా మారింది. ఆయన ఉపయోగించబడే పాత్రగా ఉండగోరుచున్నాను. నా గూర్చి దేవునికి గొప్ప ఆలోచనలున్నాయి. అందరికీ యేసే అధికారి. ప్రభువులకు ప్రభువు. ఆయనలోనే బలము పొందుచున్నాను.

లోకంలో ఉన్నవారి కంటే నాలో ఉన్న క్రీస్తు శక్తిగలవాడు ప్రభువు. నా పక్షముగా నున్నందున నాకు విరోధి ఎవరు? నాకోట ఆశ్రయము యేసే. ఆయన దయగలవాడు. ఆయన యెహోవా యీరే. సమస్త కార్యాలకు ప్రభువు ఆయన కృపనిత్యము నిలిచేది. శారీరక ఆలోచనలతో ఏమీ సాధించలేము. ఆయన అందించే ఆత్మీయ జ్ఞానముతో సమస్తము చేయగలము. నిత్యము ఆయన మనకు తోడుగా నుంటాడు.

ఆయన కునుకడు నిద్రపోడు గనుక ఎల్లప్పుడూ మనలను చూచుచూనే వుంటాడు. శత్రువు చేతినుండి ఎల్లప్పుడు కాపాడుచు వుంటాడు. మనము ఆయనతో ఎంతో ఎక్కువగా సహవాసము చేయగలమో అంతగా అన్ని సంగతులను తెలియజేయ సమర్థుడు. మనలను ఆయన బిడ్డలుగా చేసుకొని పరలోకములో ప్రత్యేక స్థానమిచ్చి సమస్తానికి హక్కుదారులముగా నుంచుతాడు.

శత్రు శక్తిని అణగద్రొక్కు శక్తిని మనకిచ్చాడు. అబ్రహాము సంతానముగా మనకు 7000 వాగ్ధానాలనిచ్చాడు. మనము ఆ వాగ్ధానాలు వెదకి వాటిని ఆశీర్వాదాలుగా

పొందుకోవాలి. నా జీవితంలో ప్రతి సందర్భములో బైబిలు లేఖనాలు అభయమునిచ్చాయి. ధైర్యము గూర్చి ప్రతి క్లిష్ట పరిస్థితులలో వాక్యాలు అన్వయించుకోగలను. దిగులుపడు పరిస్థితులలో నా దేవుడు అండగా నున్నాడు. శత్రు కుతంత్రాలు ఎన్ని వున్ననూ అపజయము మనదరికి రాదు. ఏమి తిందుమో ఏమి త్రాగుదుమో అని చింతించరాదు ప్రార్థించాలి. అందరినీ ప్రేమించినప్పుడే ఆయన శిష్యులమగుదుము. నీవు నన్ను ప్రేమిస్తున్నావా అని ముందుగా మనలను అడుగలేదు. ఆయనే మనలను ముందుగా ప్రేమిస్తున్నారు. మనలను ప్రేమించే వారిని ప్రేమించుట తేలికే గాని ప్రేమించలేని వారిని ప్రేమించాలి. ప్రేమను కల్గి ఇతరులను ప్రేమించుట చాలా ప్రాముఖ్యమైన విషయము. ప్రేమను అందరికీ పంచాలి. ప్రతికూల పరిస్థితులలో ఏ పరిస్థితిలోనైనా దేవుడు సహాయము చేస్తారు.

మన శరీరము మట్టితో చేయబడినదైనను జీవ వాయువు నుంచారు. ఆయన స్వరూపము నిచ్చారు. మనము జీవించుటకు రెండు పద్ధతులున్నాయి. మంటివారముగా జీవించవచ్చు లేక దైవత్యము కల్గి పరిశుద్ధముగా జీవించవచ్చును. మన శరీరము దేవుని ఆలయము. ఆయన మనలో నివసిస్తారు. మనకై మరణించారు. మనకై వెల చెల్లించారు. ఉచితముగా విలువైన రక్షణ నిచ్చి విమోచించడానికే రక్షించుకున్నారు. అందరము పరిశుద్ధాత్మ స్వరము వినాలి. మన నడతలన్నీ శద్ధిచేస్తాడు. విశ్వాసములో ఆయనను చేరి అది ఒక తాళము చెవిగా స్వీకరించాలి. విశ్వాసము ద్వారా వాగ్దానాలు స్వతంత్రించుకోవాలి. విశ్వాసంతో ప్రార్థించాలి.

మనకు ఏమి కావాలో అడగాలి, నమ్మాలి. అవన్నీ పొందుకోవాలి. పొందుకున్నామని నమ్మి కృతజ్ఞత చెల్లించాలి. మన సహజ నేత్రాలతో కనబడకపోయినా, వ్యతిరేఖ జవాబులు ఎదురైనా విశ్వసించుటలో నమ్మకంగా ఉండి ఎల్లప్పుడు కృతజ్ఞత చూపాలి. దేవుని వాక్యము రెండంచుల గల ఖడ్గము. ప్రాణమును, ఆత్మను వేరుచేయ గలదు. దేవుని ఉద్దేశము మనలో నెరవేరు వరకు సహనముతో కనిపెట్టాలని తెలుసుకున్నాను.

ప్రార్థన చేయునప్పుడు వాగ్దానాలు ఎత్తిపెట్టి చేయాలి. దేవునికి భయపడి జీవించాలి. ఆయనను ఘనపరచుచూ గౌరవించే పాఠము నేర్చుకోవాలి. మన జీవితాల్లో సమాధానం, ఐక్యత అనే బంధం పెంచుకోవాలి. దీనికి ఏదీ సాటిలేదు. పోటీలేదు. దైవ జ్ఞానం కావాలి. అప్పుడే వాక్యం గ్రహించగలము.

**సామెతలు 3:13-15 "వివేకము కల్గి జ్ఞానముతో జీవించాలి".**

**సామెతలు 19:20 "ఆలోచన విని ఉపదేశము అంగీకరించాలి".**

ప్రపంచములో అన్ని నిధులకన్నా దైవ వాక్కులు అమూల్యమైనవి, ప్రశస్తమైనవి. ఆయనను పూర్ణ మనస్సుతో, ఆత్మతో ప్రేమించాలి, సేవించాలి. క్రీస్తుకు తగిన మంచి శిష్యులముగా జీవించాలి. విశ్వాసంతో ప్రార్ధించాలి. విశ్వాసము లేని ప్రార్ధన వ్యర్ధము. దేవుడిచ్చు జవాబుకై వేచియుండాలి.

**ఫిలిప్పీ 4:19 "ఆయన తన ఐశ్వర్యము చొప్పున ప్రతి అవసరము తీర్చును. విశ్వాసము స్వస్థత నిస్తుంది".**

మన స్వబుద్ధితో కాక మన ప్రవర్తన యందు దేవుని అధికారానికి ఒప్పుకోవాలి. మనము వేసే ప్రతి అడుగును అభిషేకిస్తారు. మన క్రియలు అందరూ గమనించి చూస్తారు. మనలను ధనికులుగా నుండాలనే దేవుడు ఆశీర్వదిస్తారు. ద్వితియోపదేశ కాండము 28లో గల దీవెనలనిస్తాడు. సఫలతనిస్తాడు. ఆయనకు విధేయత చూపితే పరిశుద్ధులుగా తీర్చి దీవిస్తాడు.

నా జీవితంలో దేవుని ద్వారా ఎన్నో గొప్ప సత్యాలను తెలుసుకొని ఆయన కోరిన రీతిగా జీవించగల్గు చున్నాను. ఈ సాక్ష్యము చదివిన మీరంతా దేవున్ని ప్రేమించాలి, వెంబడించాలి. ఆయన చిత్తము ననుసరించి జీవిస్తూ గొప్ప దీవెనలు పొందాలని నా ఆశయము, నా ప్రార్ధన.

**ప్రార్ధన :–** ప్రభువా, నా పాపాలకై రిక్తునిగా చేసుకొని నాకై ఈ లోకములోనికి వచ్చినందులకై వందనాలు. నీ విలువైన రక్తము చిందించి నీ సొత్తుగా చేసుకొన్నావు. మేము నీ చేతి పనియైయున్నాము. నీ ఆత్మనిచ్చి సమస్త భయాలు తొలగించి గొప్పగా ఆశీర్వాదించండి. నోటిమాటలలో చిక్కుకొనకుండా దీవించండి. మా హృదయంలోనికి వచ్చి నివసించండి. ప్రతి పాపము నుండి విడుదల ప్రసాదించండి. నీవు మమ్ములను పరిశుద్ధపర్చి నందుకై వందనాలు. అందరికీ మీ దీవెనలు మెండుగా అందించండి. యేసునామములో ప్రార్ధిస్తున్నాను. ఆమెన్..

-----------------

# 29. క్రీస్తుతో అనుబంధమే స్థిరమైనదని నా జీవితంలో తెలుసుకొన్నాను

**– సత్యవాణి** (విశాఖపట్నము)

కీర్తనలు 91:15 "శ్రమలో నేనతనికి తోడై యుండెదను".



**పరిచయము :–** నేను బాల్యమునుండి అన్యాచారములలో పూజలు చేస్తే ఫలిత ముంటుందన్న ఆసక్తితో వారంలో 5 రోజులు క్రమంగా అన్ని దేవతలను పూజించేదాన్ని. ఆచారపరమైన భక్తి అలవాటయింది. నా దగ్గర రెండు పుస్తకాలుండేవి. పూజలు ఏ రీతిగా చేయాలో తెలియజేయునది, రెండవది వంటలు ఎలా వండాలో నేర్పే విధానమున్న పుస్తకాలతో కాలం గడిపేదాన్ని. నా గూర్చి కొన్ని విషయాలు చదువరులకు తెలియజేయాలని చాలా ఆశతో నాయీ సాక్ష్యాన్ని మీతో పంచుకొను భాగ్యమిచ్చిన దేవునికి వందనాలు సమర్పిస్తున్నాను.

ఎందుకో నా స్వకీయులెందరో నాకున్ననూ మంచి ఉద్యోగము, ధనము, భర్త బిడ్డలున్ననూ నా జీవితంలో తెలియని ఆవేదన, ఒంటరితనము, దిగులు, నిరాశ వెంటాడేవి. ఎవరి ప్రేమకూడా సరియైన తృప్తిని, ఆనందాన్ని కల్గించేది కాదు. చేదు అనుభవాలుండేవి. ఒక్కదాన్నే శూన్యములో వ్రేలాడేస్థితిలో నున్నానా? అని భావించేదాన్ని. ఎన్ని పూజలు చేసిన, భక్తి పాటించినను, శాంతి సమాధానము కరువయ్యాయి. చెప్పుకోలేని అసంతృప్తితో కోపము, అవిధేయత, అహంకారము, అసహనము, అశాంతి వల్ల తెలియని భయము ఆవరించగా మరణించాలనే తలంపు తరచుగా సంభవించేది. మరణము రాలేదన్న భావన నన్ను మరింత కోపోద్రేకానికి గురిచేసేది. మరెన్నో కర్మ, ముక్తి, జ్ఞానయోగము మొదలగు వేదాంత పరగ్రంథాలను ఆశ్రయించేదాన్ని.

క్రీస్తును గూర్చిన కరపత్రాలు భక్తుల జీవిత గాథలు అనుకోని విధంగా నాకు లభించగా ఆయనను గూర్చి తెలుసుకోవాలన్న కోర్కెతో అవన్నీ శ్రద్ధతో చదివినను, తాత్కాలికంగా నెమ్మది లభించింది. జగత్తు పునాది వేయబడకముందే నన్ను ఏర్పరచుకున్న సృష్టికర్తకు నా జీవితము పట్ల ప్రత్యేక ప్రణాళిక కల్గియున్నందున, ఎన్నో మలుపులు ఎదుర్కొని నిజదేవుని ఆశ్రయించి శాంతితో విశ్రమించే ధన్యత పొందాను.

యాత్రికుని ప్రయాణము, సాధు సుందర సింగ్, సత్యమునకై చిత్రహింస, భక్తసింగ్ గారి జీవితము, పాల్ యంగ్ చొ మొదలగు భక్తుల జీవితాలు నాకు క్రీస్తులోని ప్రత్యేకత, ఔనత్యాన్ని గుర్తించుటకు సహకరించాయి. క్రమంగా క్రీస్తు అడుగుజాడలను అనుసరించసాగాను. బైబిలు వాగ్ధానాలన్నీ నాకు బలమైన దుర్గంగా ఆశ్రయమిచ్చాయి.

ఆ రోజుల్లో క్రీస్తుప్రేమ బలవంతము చేయగా రండీ, రండీ యేసుని యొద్దకు రమ్మనుచున్నాడు అనే పాట పాడుచు క్రీస్తును నమ్మిన విశ్వాసులు మా యింటికి వచ్చేవారు. ప్రయాసపడి భారం మోసేవారికి విశ్రాంతినిచ్చే మార్గము, జీవము, సత్యమైన క్రీస్తు సువార్త యింటింటికి వచ్చి నేర్పించిన దైవ ధ్యానాలన్నీ నాకు ఆనందాన్ని, శాంతినందించాయి. ఈ అమూల్య సత్యాల సంపద, లోకము మధ్య నలిగిపోయాను. క్రొత్త విశ్వాసమును బట్టి స్నేహితులు, స్వకీయులతో బేదాభిప్రాయాలు, అశాంతి చెలరేగి కలత పెట్టాయి.

క్రొత్త సమస్యలు ఎదుర్కొనవలసిన సమయంలో ఒక దైవజనుని అనుభవసాక్ష్యము నాకు ధైర్యము కల్గించింది. ఆయన ప్రతి సమస్యను ఎదుర్కొన్నప్పుడు వాక్యము వెలుగులో తెలుసుకొన్న జ్ఞానావగాహన తనను అద్భుతంగా తప్పించిన అనుభవాలు నాకు ఆదర్శాలయ్యాయి. క్రీస్తు పలికిన మాటలు రెండంచుల ఖడ్గమై నన్ను ఆత్మీయంగా మంచి రక్షణానుభవమునకు మరలించి, నా పాపాలు పశ్చాత్తాపంతో ఒప్పుకొని మారుమనస్సు పొందిన తర్వాత బాప్తీస్మ అనుభవానికి నడిపించిన దైవజనులు వారి పరివారము యొక్క గొప్ప ఆధ్యాత్మిక అనుభవాలాధారంగా 1995వ సంవత్సరము ధైర్యంగా బహిరంగంగా క్రీస్తునామములో బాప్తీస్మము పొందాను.

యోహాను 1:1 "ఆదియందు వాక్యము శరీరాధారంగా మనమధ్య నివసించుటలో గూఢార్ధము గ్రహించాను. దైవజనుడిచ్చిన వాగ్ధానము నన్ను మరింత బలపర్చింది.

యెషయ 54:10 "పర్వతములు తొలిగిపోయినను, మెట్టలు తత్తరిల్లినను, నా కృప నిన్ను విడిచిపోదు. సమాధాన విషయమైన నా నిబంధన తొలిగిపోదు అని నీయందు జాలిపడు యెహోవా సెలవిచ్చుచున్నాడు.

క్రైస్తవులు పాడే అర్ధవంతమైన పాటల్లో గొప్ప జీవము, ఆదరణ లభిస్తాయని దైవజనుడు నేర్పిన పాట నేర్పింది. పదే పదే పాడుకోగల్గాను.

"యెహోవా యీరే, యెహోవాయె అన్ని చూచుకొనును
వ్యాధి బాధలు, నా హృది వెతలు ఆయనే తీసి వేయును
సమర్పించు నీ జీవితమూ ఆయన సన్నిధిలో
నీ సర్వము సమర్పించుము ఆయన సన్నిధిలో ॥

ఆ పాట నాకోసమే దేవుడు ఆయన ద్వారా నాకు తెలియజేసి నేర్పించారని నా దృఢ నమ్మకము. నాకున్న ఒక్కగానున్న కుమారుడు విద్యావంతుడుగా నుండేవాడు. అందగాడు, ధనార్జన చేసే సమయంలో అకస్మిక మరణానికి గురయ్యాడు. చాలా దు:ఖము, బాధ నాలో దాగిన గర్వము అనే చేదును ఆశ్చర్యంగా తొలగించి, వింతైన వివేకాన్ని నేర్పించాడు.

ప్రభువా, నిన్ను నమ్ముకున్న నేను ఎదుర్కొంటున్న యీ శ్రమ ఏమిటని అడిగే అవసరము లేకుండా ప్రభువే యోబు జీవితాన్ని చూపించారు. నా నోటిని ఆధీనములో ఉంచారు. దేవుడే యిచ్చాడు దేవుడే తీసుకున్నారని సరిపెట్టుకొనే మనస్సునిచ్చారు. వయస్సులోనున్న కోరికలు, ఒకబాబు మిగిలారు. బాధ కల్గిన అనుభవంతో దేవుడు నన్ను చాలా ఆదరించారు. నా స్వకీయులు, స్నేహితులు ప్రభువును నమ్మినందుకివే నా హృదయపూర్వక కృతజ్ఞతలు. విమర్శలన్నీ ఎదుర్కొని ఆయనవైపు మాత్రమే చూచే ధన్యతనిచ్చి నన్ను నిలబెట్టారు.

**యెషయా 9:6 "ఏలయనగా మనకు శిషువు పుట్టెను. మనకు కుమారుడు అనుగ్రహింపబడెను"**

**కీర్తనలు 2:12 "కుమారుని ముద్దు పెట్టుకొనుడి లేనియెడల ఆయన కోపించును"**

యోహాను 3:16 "దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను".

పురాణాల్లో పున్నామ నరకమునుండి తప్పించేది పుత్రుడే అనగా కుమారుడేనని నొక్కి వక్కాణిస్తాయి. అయితే పిల్లలు లేనివారి గతి ఏమి? ఒకవేళ వున్ననూ ప్రయోజకుడు కానప్పుడు మోక్షపాత్రులగుదురా? ఆ మాట కేవలము అద్వితీయ కుమారుడైన క్రీస్తు మాత్రమే నరకము నుండి తప్పించి పరలోక వారసుల్ని చేసి నిత్య జీవంలో ఆయనతో ఆనందించే ధన్యతనిస్తారని మనస్పూరా నమ్మాను. అంతేకాదు బైబిలులో అద్భుతమైన

వాగ్ధానాలన్నీ స్వతంత్రించుకోగల్గాను. నీ ధర్మశాస్త్రమునందు ఆశ్చర్యమైన సంగతులు గ్రహించు విధంగా నన్ను నా కన్నులు తెరిచారు.

కీర్తనలు 119:18

కీర్తనలు 27:10 "నా తల్లి దండ్రులు నన్ను విడిచినను యెహెూవా నన్ను చేరదీయును".

హెబ్రీ 13:5 "నిన్ను ఏమాత్రము విడువను, నిన్ను ఎన్నడూ ఎడబాయను అని ఆయనే చెప్పెను కద!

యెషయా 46:4 "ముదిమి వచ్చువరకు నిన్ను ఎత్తుకొనువాడను నేనే. తలవెంట్రుకలు నెరయు వరకు నిన్ను ఎత్తుకొనువాడను నేనే" అంతేకాదు, నీకు బిరుదులిచ్చి ప్రేమించే వాడను నేనే" అన్న మాటలు ఆదరణ, ధైర్యమునిచ్చాయి. ఆయన అరచేతిలో నన్ను చెక్కుకున్నారు. ఎంతో గొప్ప దేవుడు నాకున్నాడని నిబ్బరంగా జీవించుట గమనించిన నా భర్త కూడా నీ దేవుడే నా దేవుడని వెంటనే నమ్మారు. అనుకోని సంతోషకరమైన మారుమనస్సు పొందిన అనుభవంలో నా భర్తతో కలిసి దేవుని ప్రేమను పంచుకోవాలనీ, కలిసి దేవునికి సాక్షులుగా నుండి సేవచేయాలని చాలా ఆశించాను.

ఆయన ఉద్యోగరీత్యా దూరంగా వుండవలసి వచ్చినందున నాలో ఏదో తెలియని బాధ, భయము ఆవరించేది. ఈ భయం బాల్యములో బాధలో ఒంటరిగా నుండగా చచ్చిపో చచ్చిపో అని చెవులలో వినిపించేది కానీ బాబు మరణం పొందిన రోజుల్లో భయపడకు భయపడకు అని వినిపించేది.

యోబు చెప్పిన రీతిగా నేను భయపడినదే నాకు సంభవించింది. నా భర్తకు రోడ్డు ప్రమాదము వల్ల బలమైన గాయాలు తగిలాయి. కోలుకుంటారని చాలా ఆశపడ్డాను గాని నిరాశమిగిలింది. పసిబిడ్డవలె పరిచర్య చేసుకోవాలని రక్షించమని ప్రార్థించాను. ఒకవేళ ఆయన మరణము కోరుకొని యిహలోక బంధాలు, బాధలు, చింతలన్నీ దూరము చేసుకోదలచి మౌనంగా చేసిన ప్రార్థన దేవుడు విన్నారేమోనని నేను భావించాను.

యిహలోకంలో ఎదుర్కొనే శోధన, వేదనలనుండి సంపూర్ణంగా విడుదల పొందారు. నాకయితే నా రెండు కాళ్ళు పోగొట్టుకున్నంత బాధ కల్గింది. కుమారుని మరణం తర్వాత ఆధారపడిన ఊతకర్రగా నున్న భర్త దూరమయ్యారు. కుంటి గొర్రెలను యేసయ్య ఎత్తుకొని

మోస్తారు కద! నాకు నిజమైన అండ, ఆధారము యేసయ్య అని నమ్మాను. గతంలో మరణించాలన్నప్పుడు చచ్చిపో అని వినబడింది గానీ ప్రభువును నమ్మి ఆశ్రయించాక భయపడకు అనే మాట నాకు అభయమిచ్చింది.

నా కుమారుని మరణము గూర్చి నాకు ప్రభువు సరియైన అవగాహన కల్గే తలంపులనిచ్చి ఊరట కల్గించారు. నా కుమారుడు ధనవ్యామోహములో పాపాలుచేసి మరింత ఉగ్రత సంపాదించే స్థితిరాకుండా ఆయన తీసుకొన్న తర్వాత నాకు ఊరట కల్గించి ఆదరించుటకై నా భర్తకు రక్షణనిచ్చి, నాకు తోడుగా కొంతకాలం గడిపే అవకాశమిచ్చారా! అని తలంచి ప్రార్థించి మౌనినయ్యాను. నా బాధలలో దేవుని వాక్యాల్లోని వాగ్ధానాలకు ముడిపడిన రీతిగా మంచి ఆలోచనలతో నన్ను ఆదరించారు. నా భర్త ఈ లోకములో ఎదుర్కొనే బాధలనుండి విడుదలనిచ్చి నిత్య విశ్రాంతినిచ్చారని నెమ్మదితో నా విశ్వాసయాత్ర కొనసాగించాను. దేవుడు చేసినవి నేడు చేస్తున్న అద్భుతాలను గూర్చి ధ్యానించసాగాను.

ఒక కుంటివాడు ప్రార్ధన ద్వారా స్వస్థతపొందితే అది అద్భుతంకదా! గ్రుడ్డివాడు చూపుపొందుట, ఒక వ్యభిచారి జీవితాన్ని మార్చుకొనుట, ఒక మానసిక రోగి మందులేకుండా స్వస్థత యేసునామంలో పొందగల్గితే అది గొప్ప సాక్ష్యము కాదా! విగ్రహారాధనలో మునిగినవారు సత్య దేవుడైన క్రీస్తును నమ్మి వెంబడించుట సాక్ష్యమే కదా!.

పెద్ద, చిన్న బాధ ఎదురైనపుడు గోరింతలు కొండంతలు చేయక ధైర్యముగ జీవించుట కూడా సాక్ష్యమేనని నమ్మాను. బాధపడే బలహీనురాలిలైన నేను పెద్దశ్రమలో ధైర్యంగా నిలిచియుండుట కూడా సాక్ష్యమేనని భావిస్తూ గతంలో సమాధానం కోల్పోగా నేడు శాంతితో జీవిస్తున్నాను.

మరణపు అంచుల్ని తాకిన నన్ను వెదకి రక్షించారు. ఆయన నాపట్ల చేసిన అద్భుతాలను గూర్చి వివరించి సాక్ష్యము చెప్పకుండా మౌనంగా వుండగలనా? కోపము, ఈర్ష్య, అహంకారము నాలో తొలగించేసారు. నన్ను గాయపర్చిన వారిని క్షమించేశక్తినిచ్చారు. మోసం చేసిన వారిని కూడా క్షమించి ప్రేమించే పెద్ద మనసునిచ్చారు.

అశాంతినుండి నిజమైన శాంతితోనింపారు. అసత్యమునుండి సత్యములోనికి నడిపించారు. ఎందరో ఎన్నో విధాల కుటుంబ పరంగా, సమాజ పరంగా బాధలు,

శ్రమలు ఎదుర్కొంటూ శాంతిలేని వారిగా జీవిస్తూనే ఉన్నారు. అబద్ధాల్ని నమ్మి జీవిస్తూనే ఉన్నారు. నేను కనుగొన్న నిజదేవుడు మాత్రమే ఏకైక మార్గము, జీవము, సత్యమైన ప్రభువు. ఆయన కొరకు కనిపెట్టి వెదకండి దొరుకుతారు. ఆయన దగ్గరకు రండి.

నా స్వకీయులంతా మా ఆచారాలు మాకున్నాయి. నీవెందుకీ మతం తీసుకున్నావు అని నిందించారు. కానీ నా చిన్న జీవితంలో గొప్ప అంతులేని ఆనందమయమైన దేవుని ప్రేమ నాకు తోడుగా వుంది. నేను పోగొట్టుకున్న వారిని తిరిగి చూడగలనన్న గొప్ప నిరీక్షణ ఉంది. కష్టాలలో, ఇరుకులలో కూరుకొని పోవద్దు.

మీ చింతయావత్తు నాపై వేయండి. విశ్రాంతినిస్తానని క్రీస్తు అభయమిస్తున్నారు. నా అనుభవంతో చెప్తున్న నా సాక్ష్యాన్ని నమ్మండి. మన పాప శాపాలనుండి విముక్తినిచ్చి తోడుగా ఉండి శాంతిని, ఆనందాన్ని అందించే దేవుని విశ్వసించండి. ఆశ్రయించండి.

ఒకప్పుడు లోకంలో అన్నీ ఉన్నా ఒంటరిదాన్నని కృంగిపోయాను. నేనిప్పుడు ఏకాకిని గానీ గొప్ప దేవుడు సదాకాలము నాకు తోడుగానున్నాడనే గొప్ప ధైర్యముంది. ఇదే అనుకూల సమయము. రండి, రక్షణపొందుడి. యిదే నా విశ్వాసము. నా చిన్న జీవితం వెనుక అంతులేని గొప్ప జీవితముంది అది ప్రభువులోనే ఉంది. ఆ రాజ్య వారసురాల్నిగా ఆయనతోనే నడుస్తాను. నాతో నడిచేవాడు నా ప్రభువే. మీరు నాతో వస్తారా? ప్రభువు మీకు తోడుగా నుండాలని నా దీన ప్రార్ధన. ఆమెన్.

--------------

## 30. స్వస్థత నిచ్చిన రక్షకున్ని సదా స్తుతిస్తున్నాను

– సత్యవతి (హైదరాబాద్)

**కీర్తనలు 115:5-8 "వారి విగ్రహములు బంగారువి. వాటికి నోరుండియు పలుకవు. వాటిని చేయువారు, వాటియందు నమ్మిక యుంచువారు, వారందరును వాటి వంటివారై యున్నారు".**

**పరిచయము:-** ప్రభువునకే సదా స్తుతి మహిమ కల్గుగాక. నా పేరు సత్యవతి. నేను అన్యాచారములలో నుండి భయంకర పూజలు చేయు కుటుంబములో జన్మించాను. మా యింటిలో ప్రత్యేక పూజగది నిర్మించబడి ఎత్తైన స్థంభము నిర్మించి విగ్రహములనమర్చి నిత్య పూజలు చేసేవారము. మా తల్లి దండ్రులకు ఆరుమంది సంతానములో ముగ్గురు ఆడువారుగా నుండగా ప్రతి వారికి పుణ్యక్షేత్రాలలో వున్న ఆ దేవుళ్ళ పేర్లు పెట్టారు.

మా నాన్న ఉదయాన్నే గోవిందా గోవిందా అని అరిచి పూజచేసే సమయంలో ప్రక్కింటి నుండి హల్లెలూయా హల్లెలూయా అంటూ క్రైస్తవులు స్తుతిగానాలు చేసేవారు. ప్రక్కవారి క్రైస్తవ వేడుకలకు మమ్ములను ఆహ్వానించేవారు. ఒకసారి వారింట్లో 13వ పుట్టినరోజు పండుగ చాలా గొప్పగా జరిగించారు. వారి ఆరాధనలలో మత గురువైన పాస్టరుగారు బైబిలు నుండి కొన్ని వాక్యాలు ధ్యానించారు.

నేను మొదటిసారిగా దైవవాక్యం వినగా చాలా ఆశ్చర్యము కల్గింది. ఆ రోజు ప్రసంగ సారాంశంగా మరణము రెండు రకాలు శారీరక మరణము, ఆత్మ కూడా మరణిస్తుంది. ఆత్మ తాను దయచేసిన తండ్రిని చేరాలి అంటే విడుదలనిచ్చేది యేసు నందు రక్షణ భాగ్యము పొందుటయేనని తెల్పారు. మా అమ్మలో ఆలోచనలు చెలరేగాయి. మాకు ముక్కోటి దేవతలున్నారు అని పాస్టరును ప్రశ్నిస్తే ఎవరునూ ఆత్మరక్షణ చేయలేరని ఖచ్చితంగా వివరించగా ఆమెలో సంఘర్షణ ఆరంభమైనది.

ఆ తర్వాత ఆమె పాస్టరుగారిని మా యింటికి కూడా ఆహ్వానించింది. బైబిలు వివరించుట కారంభించారు. మా అమ్మకు విద్యాభ్యాసం చేసిన అనుభవం లేదు గాని, కాస్త అర్ధము చేసుకోగల తెలివితేటలున్నందున ఆమె మెల్లగా పూజలు చేయుట మానివేసింది. అందరి క్రైస్తవుల వలె బొట్టు కూడా తీసివేయుట వల్ల నాన్నగారితో పెద్ద గొడవలు ఆరంభమయ్యాయి.

మా నాన్న కోపంతో మండిపడి "ఏమి చేస్తున్నావో నీకు అర్ధం కావడం లేదా? నేను బ్రతికియుండగానే చచ్చిన వానితో సమానముగా చేయుచున్నావా? నన్ను హేళన చేసి అందరి ముందు సిగ్గు పర్చుచున్నావు అని తెల్పారు. అదే సమయంలో మా నాన్న కాంట్రాక్టు పనులలో గొప్ప నష్టాలు వాటిల్లాయి. వరదల వల్ల ఆనకట్ట కూలిపోగా తీవ్రనష్టం వాటిల్లింది. మాయింట్లోని కులదేవతలకు కూడా అమ్మ పూజలు చేయకపోవడం వల్ల కలిగిన శాప ఫలితమేనని అందరు నమ్మారు.

అమ్మ క్రీస్తును నమ్ముటయే దీనికి ప్రబల కారణంగా ఎంచారు. అమ్మను నిందించి, హింసించుట కారంభించారు. మా అమ్మకు బోధించే పాస్టరుగారిని అవమానించారు. ఆయనను మెడపట్టి గెంటివేసి మరలా మా అమ్మకు బోధనలు చేయరాదనియు, ఆ ప్రాంతాల్లో కన్పించవద్దని బెదిరించి పంపివేసారు.

ఆ రోజుల్లో మేమంతా చాలా చిన్న వారమే గనుక ఎదిరించలేకపోయాము. అమ్మకు వాక్యం చదువుటరాదు. చెప్పే పాస్టరు మానివేసారు. కాని అమ్మ ప్రార్ధించుట మాత్రము మానుకోలేదు. మా నాన్న చాలా నష్టాల ఊబిలో చిక్కుకుపోయి వ్యసనాల కలవాటు పడ్డారు. త్రాగి ఎక్కడ పడితే అక్కడ తూలిపడిపోయేవారు. యీ పరిస్థితుల్లో బంధువులంతా అమ్మ నమ్మకాన్ని నిరసిస్తూ నిందించుట కారంభించారు. అమ్మ విశ్వాసములో స్థిరపడినందున ధైర్యంగా నిలిచింది.

మా స్వకీయులంతా అమ్మను సూటి పోటి మాటలతో తీవ్రంగా బాధించగా అమ్మ మమ్ములను తీసుకొని పోయి కాలువలో పడుట మంచిదని ఎంచి మరణము తప్పదనుకొని వెళ్ళుచుండగా తెలిసిన వారది గ్రహించి మరణము తప్పించి యిల్లు చేర్చారట. అమ్మ చాలా దు:ఖ భారంతో ప్రార్ధించిందట. "అయ్యా, నాకు బైబిలు చదివే జ్ఞాన మియ్యండని" ప్రార్ధించగా అద్భుతంగా అక్షరాలు గుర్తించి చదువుట ప్రభువే నేర్పించారట.

ఆ రోజుల్లో భయంకర తుఫాను తాకిడికి, గాలి తీవ్రత వల్ల కరంటు తీగలు తెగిపడిపోయి ఊరంతా చీకటి మయమైపోయిందట. ఆ రాత్రి మా నాన్న మద్యం సేవించి ఎక్కడ పడిపోయారో తెలియదు గాని యిల్లు చేరలేదట. మధ్య రాత్రి 2 గంటల కాలంలో యిల్లు చేరారట. మా అమ్మ వేదనతో నాన్న రాకకై కనిపెట్టి తెల్లవారు వరకు దేవున్ని ప్రార్ధిస్తూనే గడిపిందట. ఆ సమయంలో ఆమెకొక కల కన్పించిందట. ఆ కలలో ఒక వృద్ధుడు తెల్లని వస్త్రములు ధరించి అమ్మను సమీపించి "అమ్మా, ఎందుకేడ్చుచున్నావు? నీ దు:ఖమును అతి త్వరలోనే తొలగించనై యున్నాను" అని మూడుసార్లు పలికారట.

ఆ మాటలెంతో ఊరట కల్గించగా ఎవరు మాట్లాడారో అర్థము కాలేదట. చుట్టూ పరికించి చూడగా కనుచూపు మేర ఎవరూ కనబడకపోయినప్పుడు నిజముగా నేను నమ్మిన నా ప్రభువు కన్పించి నన్ను ఆదరించారని తెలుసుకొని సంతోషించు సమయంలో మా నాన్న ఆ రాత్రి ఎక్కడో గడిపి, తెల్లవారింతర్వాత యిల్లు చేరారట.

అమ్మకు క్రీస్తు పట్ల నిరీక్షణ, భక్తి చాలా అధికమయ్యాయి. యింటి పరిస్థితులలో మార్పేమీలేదు. డబ్బు తెచ్చే నాన్న అప్పుచేసి త్రాగుచుండుట వల్ల మా యింటి ఆర్థిక పరిస్థితి మరింత క్షీణించగా కనీసము తినుటకు భోజనము లేక బాధపడే స్థితికి చేరాము. అమ్మ నిబ్బరంతో దేవున్ని ప్రార్థించుట గమనించిన మా నాన్న కూడా నెమ్మదిగా దేవునిని నమ్ముట కారంభించారట.

అదే రోజుల్లో మా అమ్మకు రెండవ కలలో మరలా ఆ వృద్ధుని రూపం కన్పించిందట. ఆయన చేతిలో మూడు తెల్లని కాగితాలు కన్పించాయట. “అమ్మా, ఈ మూడు కాగితాలతో నీ అప్పులన్నీ తీర్చుకో” అని సలహా యిచ్చారట. ఆమెకు వెంటనే మెళకువ రాగా లేచి ప్రార్థించింది. అమ్మ మేల్కొనిన తర్వాత “ప్రభువా, నా అప్పులు ఎలా తీరునయ్యా? మీరే మంచి దారిచూపి కనికరించండి” అని ప్రార్థించింది.

ఆ ప్రార్ధనకు ఫలితంగా మా నాన్న కొంచెము నెమ్మది పొంది ఆఫీసరును కలుసుకొన్నారు. మునిసిపల్ ఆఫీసరుగారు మా నాన్నను చూచి కనికరపడి “సరే, నీకొక చిన్న పనిని అప్పగించినచో చేస్తావా? అన్నారట. ఆపై అధికారులు అందించిన చిన్న కాంట్రాక్టు పనిని స్వీకరించి వారిచ్చిన 30 వేల రూపాయల పెట్టుబడితో ఆరంభించిన పనిలో మిగిలిన పనివారంతా చేయూతనిచ్చారట. యీ అనుభవాలన్నీ ప్రభువే మాటయిచ్చి నెరవేర్చారని అమ్మ నమ్మి స్తుతించి దేవునికి కృతజ్ఞతలు తెల్పింది. అన్నీ ముగించి పని అప్పగించగా చివరకు 3 వేల రూపాయలు లాభము పొందగల్గారు.

ప్రభువు మూడు కాగితాలు చూపారు గనుక సరిగ్గా 3 వేలు లాభము చాలా పెద్దసొమ్ముగా స్వీకరించారు. ఈ రీతిగా మానాన్న పై అధికారుల నమ్మకాన్ని సంపాదించుకొని కాంట్రాక్టు పనిని నిలబెట్టుకోగల్గారు. యీ రెండు కలలద్వారా దాని నెరవేర్పును చూచిన అమ్మలో విశ్వాసము మరింతగా దృఢపడింది.

మా అమ్మ రేయి మొదటి జామున బిడ్డలకై మొర్రపెట్టుట కారంభించి పాటలు పాడి ఆరాధించి స్తుతించుట ద్వారా నాన్నలో విశ్వాసము కల్గింది. ఆయన కూడా అమ్మతో ఏకీభవించి క్రీస్తును నమ్ముటకారంభించారు. ఈ నమ్మకము ద్వారా మా యింట్లో పూజగదిని

మార్చివేసారు. విగ్రహాలను దూరపర్చారు. మా బాల్యంలోనే క్రీస్తును ప్రేమించిన అమ్మ నాన్నల విశ్వాసమును బట్టి మాకు కూడా క్రీస్తునే ప్రేమించి, సేవించే ధన్యత లభించింది. మేము బాల్యమునుండి పాటలుపాడి కీర్తించుట, బైబిలు చదువుటలో చాలా శ్రద్ధ వహించేవారం గానీ నాన్న చిన్నగా ఉద్యోగము ఆరంభించిన రోజుల్లో ఆర్థిక యిబ్బందుల వల్ల చాలా బాధలు పడేవారం. ఆర్థిక సమృద్ధిలేక గవర్నమెంటు స్కూళ్ళలోనే ఉచితవిద్య ద్వారా చదువుకోగల్గాము. కాన్వెంటులో చదవాలన్నా అవకాశాలులేవు.

ఆ రోజుల్లో ఏలూరుకు విచ్చేసిన విశ్వాసి లేమెన్స్ ఇవాంజలికల్ ఫెలోషిఫ్‌కు చెందిన భక్తిగల దైవజనుడు మా యింటి పై భాగంలో ప్రార్థనా కూడికలు నిర్వహించేవారు. వారివల్ల మాలో దేవునిపట్ల ఆసక్తి పెరిగింది. ఆత్మీయ లోతైన దైవబోధన మాకెంతో ఆహ్లాదాన్ని కల్గించేది. మా కుటుంబమంతా ఆధ్యాత్మికంగా గొప్ప స్థాయికి చేరుకోగల్గాము. మంచి పరిచర్య ద్వారా, మంచి ప్రార్థనా జీవితము, విశ్వాస జీవితముతో పాటు మా అమ్మ స్వానుభవాలన్నీ నా ఆధ్యాత్మిక జీవితముపై గొప్ప ప్రభావాన్ని చూపించాయి.

నాలో యదార్థ జీవితము, నిజ పశ్చాత్తాపం ద్వారా మారుమనస్సుకు తగిన ఫలాలు ఫలించాలనే ఆకాంక్షవల్ల మంచి విశ్వాసిగా మారాను. సున్నితమైన మనస్సాక్షితో జీవించుట వల్ల ప్రభువా నీవుంటే నాకు చాలు. యేసయ్యా నీ మాట చాలు, నీ చూపు చాలు అని బయట ప్రపంచ ఆశలన్నిటికీ దూరమయ్యాను. సింహపు పిల్లలు లేమిగలవై ఆకలి గొనవచ్చును గాని, ప్రభుని ఎరిగిన వారికేమీ లోటుండదనియు, యెహోవా నా కాపరి. నాకు లేమి కలుగదన్న వాగ్ధానాలే ఆధారముగా జీవించసాగాను. ఆరోజుల్లో అన్నకు, అక్కకు వివాహాలు దివ్యంగా జరిగిపోయాయి.

**వివాహ జీవితము:–** నేను డిగ్రీలో చేరినప్పుడు మేమంతా హైదరాబాదు చేరాము. నా చదువు పూర్తిచేయక పూర్వమే నాకు మంచి సంబంధమని నమ్మి వివాహము జరిగించారు. నాకు ఉద్యోగము చేయు అవకాశంలేదు. నా భర్త ఒక ప్రవేటు సంస్థలో మెకానిక్‌గా పనిచేసేవారు. కేవలము 600 రూపాయలు జీతం వచ్చేది. మా యిద్దరికీ ఆ జీతం చాలేది కాదు. నా భర్త కోపంతో 'నీవీ జీతం డబ్బులతోనే సరిపెట్టుకోవాలా' అనేవారు. ఆ పరిస్థితిలో నేనే దేవున్ని ప్రార్థించుకొని సంతృప్తితో జీవించుట నేర్చుకున్నాను. పెద్దబాబు పుట్టిన తర్వాత అసంపూర్తిగా నున్న నా విద్యాభ్యాసాన్ని కొనసాగించాను. డిగ్రీ అందుకున్న తర్వాత మరి యిద్దరు బిడ్డలు వెంటనే జన్మించారు. అయినను రెండవ బాబును గర్భవతిగా నుండగానే టైపునేర్చుకున్నాను. మూడవ బాబు పుట్టిన వెంటనే ఉద్యోగ ప్రయత్నాలు

ఆరంభించాను. ఎంప్లాయి మెంటు ఆఫీసులో నమోదు చేసుకొన్న పేరును బట్టి చాలా ఉద్యోగ అవకాశాలు వచ్చినప్పటికీ నా ముగ్గురు పిల్లలను కనిపెట్టి చూచువారు లేనందున వెళ్ళి ఉద్యోగం పొందలేకపోయాను.

ఆఫీసరు గారు నన్ను పిలిచి "అమ్మా, నీవు కోటీశ్వరు రాలివా? ఉద్యోగము స్వీకరించలేదేమి? బెంగుళూరులో బి.యి.ఎల్.లో ఉద్యోగముందని తెల్పాడు. నా బిడ్డలు పసివారని చెప్పి, నా పేదస్థితి వివరించగా దగ్గరలో చిన్న ఉద్యోగాన్ని తాత్కాలికంగా నాకు సమీపంలో యిచ్చారు. నాకు ఎన్నో యిబ్బందులున్ననూ 350రూ జీతంలో దశమ భాగాన్ని దేవునికిచ్చి ప్రార్థించేదాన్ని. నాతో పనిచేసే స్నేహితురాలి కుటుంబంలో చాలా ఆపదలు సంభవించాయి. ఆమె నాన్నగారు ప్రమాదంలో చనిపోయారు. ఆర్థికంగా చాలా ఇబ్బంది సమయంలో నాకున్న కొన్ని వనరులలో బియ్యము, పప్పు వారికందించి తగిన ధైర్యంచెప్పి ప్రార్థించేదాన్ని.

నాకు కూడా 1 రూపాయి ఉండేది కాదు. 1 రూపాయి లభిస్తే మూడు గ్రుడ్లుకొని పిల్లలకు పెట్టేదాన్ని. ప్రార్థించిన వెంటనే అద్భుతంగా సొమ్ము లభించేది. అడగండీ మీ కిస్తానన్న వాగ్ధానాన్ని నమ్మాను. 10 రూపాయలు కావాలి ప్రభువా అని అడిగితే అంతే దొరికేది. 100 రూ॥లు కావాలంటే అదికూడా లభించేది. యీ రీతిగా అంచెలంచెలుగా వాగ్ధానాలను నమ్మి జీవించి అద్భుత సహాయాన్ని పొందే దానిని.

యీ సమస్యల వల్ల నాకు జ్ఞానము, వివేకము లభించాయి. దేవునియందలి భయభక్తుల వల్ల జ్ఞానము, వివేకము, తెలివి లభిస్తాయి గనుక ఉద్యోగములో నమ్మకత్వాన్ని బట్టి 14 వేలు అరియర్స్ యిస్తూ పర్మినెంటుగా ఉద్యోగము స్థిరపర్చారు.

**వ్యాధి బాధల నెదుర్కొనుట:-** నేను ఉద్యోగంలో స్థిరపడిన తర్వాత సెలవులలో ఏలూరు వెళ్ళినప్పుడు జ్వరం వచ్చింది. అది తీవ్రమై ఉద్యోగం చేయలేని స్థితికి చేరాను. ఒకరోజు నీరసంగా ఆఫీసులో బల్లపై పడియున్న సమయంలో కల వచ్చింది. అది ఉదయం 11 గంటల సమయం గనుక జ్ఞాపకముంది.

ఒక సమాధి పెట్టెపై తెల్లని వస్త్రము కప్పబడి యుండుట చూచాను. ఎవరో త్రాళ్ళుకట్టి పైనుండి క్రిందికి దింపుచున్న దృశ్యాన్ని చూచాను. దానిలో ఉన్నది నేనేనని గుర్తించి భయపడ్డాను. వెంటనే ప్రార్థించాను. ఆకాశము వైపు కన్నులెత్తి, రెండుచేతులు పైకిచాచి "ప్రభువా నేను మరణానికి సిద్ధమే గాని నా పిల్లలను నీవే సంరక్షించాలి. నన్ను క్షమించి మీ రాజ్యములోనికి తీసుకువెళ్ళండి. లేదంటే ఈ ముగ్గురి పిల్లల బాధ్యత నేనే

తీసుకోవాలని నీచిత్తమయితే నన్ను దయతో బ్రతికించండి” అని ప్రార్థించాను. ఆ ప్రార్థన నేను ముగించక పూర్వమే నేను చూస్తున్న సమాధిపెట్టె మాయమయింది. నాకు వెంటనే మెళుకువ వచ్చింది. లేచి తిరిగి ప్రార్థించాను.

ఆ తర్వాత నేను వణుకుచుండుట చూచిన మా అమ్మ, వదిన నన్ను ప్రశ్నించగా, నా కల వివరించాను. నాకర్థమయిన దేమనగా నేను మరణపు అంచు వరకు చేరగలను గాని మరణించను. యిదే వారితో చెప్పాను. అమ్మ నాకు ధైర్యం చెప్పి ప్రార్థించింది. ఆ తర్వాత అకస్మాత్తుగా నా ఆరోగ్యము క్షీణించి జ్వరం అధికమయింది. ఒళ్ళంతా వాపు వచ్చింది. కోడిని వేడినీళ్ళలో ముంచినట్లు నా ఆకారం మారింది. ఆస్పత్రిలో చేరాను. ప్రమాదస్థితిలో నున్నానని అందరూ గ్రహించారు. మందుల రియాక్షను వల్ల యీ రీతిగా జరిగిందన్నారు.

ప్రభువు నాకు చూపిన రీతిగా నా పరిస్థితి పూర్తిగా మారి జ్వరం తగ్గింది. గాని నా రూపం నల్లగా మారింది. కామెర్ల వ్యాధి అని చెప్పారు. ద్రవ పదార్థాలు తీసుకోమన్నారు. రక రకాల మందులు వాడాను. కొబ్బరి నూనె శరీరానికి రాసుకునేదాన్ని. ఆ తర్వాత హైదరాబాదు ఆస్పత్రిలో చేరాను.నా శరీరంలో సీము అనగా పస్ చేరిందన్నారు. వేరే ఆస్పత్రికి ఊపిరి తిత్తుల పరీక్షకై పంపారు. నా దీనస్థితిలో మెళుకుగా నుండగానే దర్శనము కల్గింది. నా లంగ్స్‌కు కుట్లు వేసిన వారెవరో తెలియదు అది చూచాను. ప్రభువే కుట్లు వేసారని నమ్మాను.

ఆ తర్వాత కోలుకున్నాను. నా దగ్గరనున్న పండ్లు, వస్తువులు దగ్గర వాళ్ళకు పంచుట వల్ల నాకు ప్రేమతో పరిచర్య చేసేవారు. నేను యేసయ్య ప్రేమకు సాక్షిని అని చెప్పేదాన్ని. దేవుడు గొప్పవాడు. నమ్ముకోవాలని తెల్పేదాన్ని. చివరకు నాకు ప్రభువిచ్చిన అద్భుత దర్శనాన్నిబట్టి స్వస్థత యిచ్చి ఆస్పత్రి నుండి డిస్చార్జి అయినప్పుడు అందరూ వీడ్కోలు తెల్పారు.

ఆ తర్వాత నా ఉద్యోగం చేయుటకు ఆఫీసుకు వెళ్ళినపుడు నన్నుచూచి చాలా భయపడ్డారు. ప్రత్యేకంగా కుర్చీ వేసారు. ఆ తర్వాత యిల్లు మారాము. జబ్బుపడిన తర్వాత ఏలూరు వెళ్ళి ఉజ్జీవ సభలో నా స్వస్థత సాక్ష్యం మొదటిగా తెల్పాను. రెండు వేల మంది సమక్షంలో నేను చెప్పిన సాక్ష్యము విని క్రీస్తు అద్భుతాలు చేయు దేవుడని చాలామంది ఆశ్చర్యముగా నన్ను ప్రశ్నించి ఆనందించారు. నాకు స్వంత యిల్లు కట్టుకోవాలని ప్రభువును అడిగాను. నా తోబుట్టువులు 10 వేలిచ్చారు. నా దగ్గర సొమ్ము ఏమీలేదు. ప్రార్థించి టాపీ

మేస్త్రికి నా ప్లాను వివరించాను. నా ప్లాను ప్రకారము చాలా ఖర్చు అవుతుంది గాని విశ్వాసంతో ప్రభువే చూచుకుంటారని ఆరంభించాను.

1995 మే 27న పునాది వేసాము. సర్వ సృష్టికి అధిపతి అయిన నా దేవుడు ఆదుకొని సహాయపడ్డారు. నా భర్తవల్ల చాలా వ్యతిరేఖత లననుభవించాను. బిడ్డలను భక్తిలో పెంచగా మంచి మార్కులతో 10వ తరగతిలో ముగ్గురకు ప్రథమ తరగతిలో ఉత్తీర్ణులగు ధన్యత ప్రభువిచ్చారు. ముగ్గురు బిడ్డలు ప్రథమశ్రేణిలో ఇంజనీరింగు పూర్తిచేసారు.

2008వ సంవత్సరములో అట్లాంటాలో ఉద్యోగిగా పెద్దబాబును దీవించారు. రెండవ బాబును కంపెనీ వారే అమెరికా పంపారు. వారి వివాహాల కొరకై చాలా ప్రార్థించాను. 2013లో జులై 25వ తేదీ విశ్వాసితో వివాహము ప్రభువే నడిపించి చేయించారు. చిన్న బాబుకు 2013లో పెండ్లి చేసాను. అతను కుటుంబంతో అట్లాంటా అమెరికాలోనే స్థిరపడు భాగ్యం ప్రభువిచ్చారు.

ఎన్నికలేని నన్ను, ఒక రూపాయి లేని స్థితినుండి ఆశ్చర్యంగా సమృద్ధితో నింపి బిడ్డలను ఉన్నత స్థానంలో నిలిపి దీవించిన నా ప్రభువు ప్రేమకు నేను సాక్షిని. ఆయన మనతో ఉంటే చాలు. అన్నీ జయించగలము. అది మరణమైనను, ఆర్థిక యిబ్బంది అయినను, దురాత్మ ప్రభావమైనను, మనశ్శాంతి కోల్పోయినను, స్వకీయుల వల్ల శోధన అయినను, స్నేహితుల వల్ల యిబ్బందులైనను రద్దుపరచి పటా పంచలు చేయు ప్రభువు మనకున్నారు. దేవునికే నా సాక్ష్యం సమర్పిస్తున్నాను. ఆమెన్.

------------

## 31. సర్వశక్తి మంతుడగు క్రీస్తు నా కుటుంబములో అద్భుతాలు చేసారు

**– శాలిని శీజు (కేరళ)**



**ఆది 18:14 "యెహోవాకు అసాధ్యమైన దేదైనా వున్నదా?". దేవునికి అసాధ్యమైన దేదైనా కలదా? యిదే నా జీవిత సాక్ష్యము.**

**పరిచయము:–** నా జీవితమంతా దేవుడు చేసిన అద్భుతాల నిలయమని ధైర్యంగా సాక్ష్యము యివ్వగలను. నేను నామకార్ధ క్రైస్తవ కుటుంబములో జన్మించాను. నా తల్లిదండ్రులకు ముగ్గురు కుమార్తెలు జన్మించగా నేను ప్రధమ పుత్రికగా శ్రద్ధగా చదివి ఆనందాన్ని కల్గించేదానను. 12వ తరగతి పూర్తి చేసుకొని కంప్యూటరు కోర్సు చదివే రోజుల్లో లింప్ నోట్స్‌లో అనారోగ్యము కల్గిందని గ్రహించి చాలా దు:ఖపడ్డాను. చివరకది కేన్సర్ అన్నారు.

క్రీస్తు నా నిజరక్షకునిగా స్వీకించిన అనుభవం నాకు లేదు. ఎవరైనా దేవున్ని గూర్చి వివరించిననూ నాకు యింకా వయస్సు రాలేదు అని తలంచేదాన్ని. 18 సంవత్సరాల వయస్సులో గుండె చెదరిపోయే వ్యాధి సంభవిస్తుందని ఎలా గ్రహించగలను? దేవున్ని గూర్చి ఆలోచించి ఆయన దగ్గర ఏడ్చి సహాయము పొందుటకై నాకు సంభవించిన వ్యాధి నాకు సహాయపడింది. కేన్సర్ వ్యాధికి సరియైన స్వస్థత వున్నదో లేదో నాకు తెలియదు. నాలుగు స్టేజీలలో, మూడవ స్టేజీలో ముదిరిన స్థితిలో నున్నదని డాక్టర్లు తెలిపిన వార్త నన్ను మరింత కృంగిపోయే స్థితి కల్గించింది.

ఇక కీమో ట్రీట్‌మెంట్ తప్పదు గనుక, అది నన్ను అనేక బాధలకు గురిచేయగా రేడియోషన్ ట్రీట్‌మెంట్లు 16 సార్లుగా నా శరీరముపై ప్రయోగించారు. కేరళ, తిరువేంద్రములో ఆస్పత్రిలో ట్రీట్‌మెంటు తీసుకొనే రోజుల్లో వివిధ రకాల బాధలు ఎదుర్కొన్నాను. ఆస్పత్రిలో పడకపై నుండగా క్రీస్తును నమ్మిన విశ్వాసులెందరో నన్ను పరామర్శించి క్రీస్తును గూర్చి, ఆయన ప్రేమను గూర్చి వివరిస్తూ, స్వస్థతను గూర్చి చెప్పి నన్ను ధైర్యపరిచేవారు.

కొందరు నన్నుతాకి అభయమిచ్చి ప్రార్థించిన ప్రార్థనవల్ల నాలో క్రీస్తు పట్ల మంచి నమ్మకము కల్గింది. పలువిధ పథములరసి ఫలితమేమి కానలేక సిలువయెదుట నిలిచాను. ప్రభువా అని ఏడ్చి ప్రార్థించేదాన్ని. చివరకు ప్రభువా నా శ్రమను బట్టి నీ చిత్తమేమైననూ అది జరిగించుకో ప్రభూ అని దేవునికే పూర్తిగా అప్పగించుకొన్నాను.

ప్రభువు నాతో మాట్లాడుచున్నాడని, నా శ్రమను గుర్తించుచున్న భావన కల్గి ఊరట చెందాను. ఆ స్థిర నమ్మకంతో పూర్తిగా దేవునిపై ఆనుకొన్న రోజుల్లో అద్భుతంగా నా వ్యాధి తగ్గుముఖం పట్టి నాకు స్వస్థత కల్గింది. అద్భుత స్వస్థత అని, నా స్వకీయులంతా అసాధ్యమైన మూడవ స్టేజీ కేన్సరు నుండి అతి స్వల్ప వ్యవధిలో పూర్తి ఆరోగ్య వంతురాల్ని కాగల ధన్యత లభించుటకు, క్రీస్తు నన్ను దర్శించారని అందరూ నమ్మారు.

నాలో క్రీస్తుపట్ల విశ్వాసము చాలా అభివృద్ధి చెందింది. నా విద్యాభ్యాసాన్ని ఆపివేసినందున తిరిగి చదవాలని నిర్ణయించుకొని తిరిగి కొనసాగించాను. యెహోవా యందలి భయభక్తులు జ్ఞానమునకు మూలము గనుక ఆయన నా చదువును సవ్యంగా కొనసాగించుటను బట్టి మాస్టర్స్ ముగించాను. నా కుటుంబము నన్ను ప్రేమించుటను బట్టి నాకు సంపూర్ణ ఆరోగ్యముతో పాటు మంచి విద్య కూడా లభించింది.

నాకు తెలిసిన వారందరికీ క్రీస్తే గొప్ప రక్షకుడనియు, మంచి దేవుడనియు తెలియజెప్పేదానిని. మనం దేవున్ని చేరాలంటే విశాల మార్గం కాదు గాని ఇరుకు మార్గమేనని గ్రహించాలి. నీవు గమ్యం చేరాలనే ఆసక్తి కల్గివుంటే క్రీస్తే మార్గమని నమ్మాలి. ఎమ్.బి.ఎ. మూడవ సంవత్సరము చదివే రోజుల్లో వివాహం చేసుకున్నాను. నాకేమీ స్వంత ఆలోచనలు లేవుగాని దేవుడు నా పట్ల కల్గిన గొప్ప ఆలోచనలు నా వ్యాధి బాధలకన్న అధిగమించిన ఉత్తమమైనవని నాకు తెలుసు. దేవుని వాక్యాన్ని పూర్తిగా నమ్మాను.

**యిర్మియా 29:11 "మిమ్ములను గూర్చి ఉద్దేశించిన సంగతులను నేనెరుగుదును. రాబోవు కాలమందు మీకు నిరీక్షణ కలుగునట్లుగా అవి సమాధానకరమైన ఉద్దేశములే గాని హానికరమైనవి కావు. యిదే యెహోవా వాక్కు".**

సరిగ్గా 2006వ సంవత్సరములో దేవున్ని బాగా ప్రేమించే మంచి కుటుంబాన్ని వివాహము ద్వారా సమకూర్చారు. నా విద్య కూడా 2007వ సంవత్సరంలో ముగించాను. అనుకోని రీతిగా అమెరికాలో ప్రవేశించే ధన్యతనిచ్చారు. ఆనందంగా ప్రవేశించాము.

కొంతకాలము వరకు నాకు బిడ్డలు కలుగలేదు. బిడ్డలు కావాలని ప్రార్థించాము. మీకు పిల్లలు లేరా? అని చాలామంది ప్రశ్నించేవారు. దేవునికి మనము కోరుకున్న జీవితము కన్న అధికముగా గ్రహించగలవాడు. చాలా కన్నీరు కార్చి ఓర్పుతో కనిపెట్టాము. హన్నావలె భారంతో ప్రార్థించాము.

2010వ సంవత్సరములో ముగ్గురు పిల్లలను గర్భము ధరించాను. చాలా భారంగా ఉండేది. యిద్దరు మగబిడ్డలు, ఒక ఆడపిల్ల వున్నట్లుగా స్కానింగు తెల్పింది. ఒకరోజు బి.పి. వల్ల చాలా నీర్సమయింది. పల్స్ కోల్పోయాను. ఐ.సి.యు.కి పంపారు. వెంటిలేటర్లు పెట్టారు. లోపల బిడ్డలకు ప్రమాదముంటుందన్నారు.

సరిగ్గా 9 రోజులు నేను అపస్మారక స్థితిలో మంచము మీదనే గడిపాను. చాలా ప్రమాదాన్ని ఎదుర్కొన్నాను. డాక్టర్లు చాలా ఖంగారు పడుట, నా తల్లిదండ్రులు, భర్త ఏడ్చుచున్నారని గ్రహించలేదు. పూర్తిగా మత్తులోనే వున్నాను. యీ శ్రమలో నా ముగ్గురు బిడ్డలను నేను కోల్పోయాను. నేను దేవున్ని నమ్మిననూ నాకీ ప్రమాదమెందుకు సంభవించిందో తెలియలేదు. దేవుని చిత్తానికే అప్పగించి మౌనినయ్యాను.

ఆ తర్వాత ఆరోగ్యము పొందాక మరొకసారి గర్భవతినయ్యాను. 2011వ సంవత్సరము అక్టోబరులో మరలా కవలలు కడుపులోనున్నట్లు గ్రహించాను. మరలా ప్రమాదంలో యిద్దరినీ కోల్పోతానేమోనని భయపడ్డాను. డాక్టర్లు నా గుండెను జాగ్రత్తగా కనిపెట్టి కాపాడారు. నాకు మూర్ఛలు కూడా వచ్చాయి. ఆ తర్వాత 24 వారాలలోనే బిడ్డలు ప్రీమెచూర్ బిడ్డలను కన్నాను. వారి ఆరోగ్యము గూర్చి ఆంధోళనతోనే వున్నాను. డాక్టర్లు చాలా ఖంగారుతో అతి శ్రద్ధగా గమనించి నన్ను, బిడ్డలను సంరక్షించారు. నా బిడ్డలను, నన్ను సజీవంగా ఉంచిన దేవుని కృపకై స్తుతించి కృతజ్ఞత చెల్లించాను.

అంజూరపు చెట్లు పూసినా పూయకపోయినా యెహోవాను బట్టి ఆనందిస్తానని నిర్ణయించుకున్నాను. ఆయన పట్ల నమ్మకంతోనే జీవించుటకు ఆరంభించాను. బ్రతకరని తలంచిన యిద్దరు బిడ్డలు చక్కని ఆరోగ్యంతో జీవించారు. ఆ తర్వాత క్రీస్తు కొరకు సాక్షిగానే జీవించాను. ప్రభువు తర్వాత కాన్పులో మరొక పాప జాస్మిన్‌ను ప్రసాదించారు. నాకు ప్రభువు కవలలో ఒక బాబు పాపతో పాటు మరొక పాపను కల్గించిన కృపకై సమాజములో గొప్ప సాక్షిగా నిలిచాను. అందరి ఎదుట ఆయన నన్ను రక్షించిన రీతిని

బట్టి, విద్య, వివాహము, ముగ్గురు సంతానము, అర్ధము చేసుకొని, ఆదరణతో, ఆప్యాయత చూపించే భక్తిగల భర్తనిచ్చి దీవించినందుకై నిత్యమూ స్తుతిస్తున్నాను.

గతములో కేన్సరు వ్యాధితో కృంగిపోయి వివాహమునకు సరిపడనని తలంచిన నాకు వివాహము, విద్యనిచ్చి మంచి భర్తను ప్రసాదించి, ముగ్గురు బిడ్డలనిచ్చారు. క్రీస్తు ప్రేమను పంచుకొని సాక్ష్యమివ్వగల మంచి క్రైస్తవ సహవాసాన్నందించారు. నామకార్ధ క్రైస్తవ జీవితంలో లోకాశలతో పరలోక చింత లేకుండా నిర్లక్ష్య జీవితాన్ని గడిపే నన్ను మంచి సాక్షిగా ప్రభువు ఎన్నుకొని గొప్ప వ్యాధి ద్వారా పైకిచూచి క్రీస్తు మాత్రమే నా జీవితాధారమని నమ్మకము కల్గించారు.

గాడాంధకారపు లోయలలోనుండి, మరణపు అంచుకు చేరిన నన్ను చేయిపట్టి లేపి గొప్ప భవిష్యత్తును బహుమతిగానిచ్చారు. శిక్షించినా, రక్షించినా, ప్రేమించినా క్రీస్తే నా సర్వాధికారి, గొప్పదేవుడిగా నాతోనుండి స్వస్థపర్చి రక్షించి నేడు అసాధ్యాలన్నీ సుసాధ్యము చేయు క్రీస్తును మాత్రమే ఆశ్రయించాలని నిశ్చయముగా మీతో చెప్పు సాహసము చేస్తున్నాను. ప్రియ చదువరీ మీరు క్రీస్తును ఆశ్రయించి వెంబడించగలరా? దేవుని కృప మీతోనుండుగాక. ఆమెన్.

---------

# 32. అజ్ఞానురాలనైన నన్ను క్రీస్తు తన అమూల్య సేవకై పిలిచారు

**– ఎస్తేరు (తులసి) (ఇరిపాక, తూర్పు గో॥జిల్లా)**

**కీర్తనలు 115:4,5 "వారి విగ్రహములు వెండి బంగారువి. అవి మనుష్యుల చేతిపనులు. వాటికి నోరుండియు పలుకవు".**

**పరిచయము:–** ప్రభువు పాదములకు నమస్కరించి వ్రాయుయీ సాక్ష్యము అందరికీ ఆశీర్వాదకరంగా నుండు గాక. నా అసలు పేరు తులసి. రక్షణ పొందిన తర్వాత ఎస్తేరుగా నా పేరు నిలిచింది. మాది తూర్పు గోదావరి జిల్లా, ఇరిపాక గ్రామము. విగ్రహాలను పూజించే కుటుంబములో జన్మించాను. కార్తీకనోములు బహు నిష్టగా చేస్తూ పూజకు అవసరమగు వంటకాలు రకరకాలు వండి విగ్రహాల కర్పించిన తర్వాత మేము తినేవారము.

పూజకు ముందుగా స్నానం చేసి, ఆ నీటిలో ఇసుక పోగుచేసి పువ్వులమర్చి, ముగ్గు, పసుపు, పండ్లు, అగరు వత్తులతో అలంకరించి మ్రొక్కి తర్వాత నీటిలో కలిపివేసేవారము. జీవములేని సృష్టిని పూజించిన అమాయకత్వముతో గడిపాము.

నేను గౌరీ పూజ కూడా చేసేదాన్ని. ఉపవాస వ్రతాన్ని పాటించేదాన్ని. తెల్లవారక ముందే 3 గంటలకు అన్నం తిని సాయంత్రము వరకు ఏమీ తినేవారం కాదు. ఎన్ని పూజలు చేసిననూ నా మనస్సులో నిజమైన శాంతి గాని, తృప్తి, ఆనందము గాని ఏమాత్రము వుండేది కాదు. అందరిని చూచినపుడు వారివలె ఖరీదయిన బట్టలు లేవని, నగలు లేవని అమ్మమీద చాలా కోపము వచ్చేది. ఆడంబరంగా జీవించాలనే తపన వల్ల యితరుల బట్టలు అడిగి ధరించి ఆనందించేదాన్ని. అలంకారాలు, వేషధారణపై ఆసక్తి వుండేది.

నా అక్కకు మాత్రమే కొత్త బట్టలు కొనేవారు. నాకు బాధగా ఉండేది. 12 సంవత్సరాల వరకు చెవులు కుట్టించలేదు. నన్ను చూచిన వారంతా, నేను చాలా దురదృష్ట వంతురాలిననియు, ధరిద్రమంతా నాతోనున్నదని అన్నారు. నాకు చాలా దు:ఖము కల్గేది. అందరూ నిద్రించిన తర్వాత నేను వెంకటేశ్వర స్వామి బొమ్మ దగ్గర చేతులు జోడించి "స్వామీ, నాకు క్రొత్త బట్టలు దయచేయవా" అని ఏడ్చేదానిని.

అదే రీతిగా పూర్తి సంవత్సరము పూజలు చేస్తూ నాకు మంచి జరగాలని ప్రార్థించిననూ ఏ జవాబు లభించేది కాదు. మా నాన్నగారికి రేషన్ వ్యాపారముండేది.

చిల్లర డబ్బులన్నీ లెక్కపెట్టమని నా కప్పగించేవారు. నేను కొంత దాచుకొనేదాన్ని. ఆ డబ్బులన్నీ పుస్తకాలలో దాచిపెట్టి వినాయకుని ముందు పెట్టేదాన్ని. ఈ రీతిగా దొంగడబ్బులు దేవుడికివ్వరాదని తెలియలేదు.

**నిజదేవునితో పరిచయము:–** నా అక్క సరస్వతికి క్రీస్తును నమ్ముకున్న స్నేహితులుండేవారు. ఆమె క్రీస్తే నిజమైన మార్గము, సత్యము, జీవమని నమ్మి క్రీస్తు నామములో క్రమంగా ప్రార్ధన చేసుకొనేది. మా అందరి రక్షణ కొరకై ప్రార్ధించేది. మా నాన్నగారికి తెలియకుండా క్రైస్తవ దేవాలయాలకు వెళ్ళి కన్నీటితో ప్రార్ధించుట నాకు వింతగాతోచేది. ఆమె యింట్లో బైబిలు ధ్యానిస్తూ ప్రార్ధించుచూ, విగ్రహ పూజలు చేయనందున మా కెవరికీ నచ్చేదికాదు. కాని విసుగక మా కొరకు రేడియో ప్రసారాలు వినే అవకాశాలు కల్గించి క్రీస్తు సువార్తను మేము అర్ధం చేసుకోవాలని చాలా శ్రమ పడేది. నాన్నగారు లేని సమయంలో ఆరాధన, స్తుతి కృతజ్ఞత కూటాలు ఏర్పాటి చేసి మంచి బోధకులను యింటికి ఆహ్వానించేది. మా అక్క అవిరామంగా, అకుంఠిత దీక్షతో మా జీవితాలు మారాలని చేసే ప్రయత్నాల ఫలితంగా నాలో మార్పు కల్గింది. క్రీస్తు ప్రేమ, దయ, కనికరం గల దేవుడని గ్రహించి యింకా ఎక్కువ తెలుసుకోవాలనే ఆసక్తి కల్గింది.

ఒకసారి మా అక్క ముఖర్జీ గారు వాక్య బోధన చేసిన క్యాసెట్టు కొన్నది. మా ఫ్యామిలీ డాక్టరుగారు జేసుబాబు అన్నయ్య మాకు వైద్యము చేసేవారు. ఆయనను దర్శించడానికి దైవజనుడు వచ్చేవారు. మాకు సందేశాలు వినిపించాలనే కోరికతో మా అక్క వాళ్ళింటి ప్రక్కగా నివసించే ఒక యవ్వనస్తుని సహాయంతో టేప్‌రికార్డరు తెప్పించి ఆ మంచి సువార్త యిష్టములేని ఆ అబ్బాయి వినాలని కోరకతో ప్రార్ధించి వినిపింపజేసింది.

అదే ఆత్మలభారం గల విశ్వాసి చేయు మంచి పని అని తర్వాత గ్రహించాను. అదేరాత్రి అక్కకు ఆ అబ్బాయి మారుమనస్సు పొందాలనే కోరికను బట్టి ప్రార్ధనా ఫలితంగా సజీవుడైన క్రీస్తు తన మెల్లని స్వరంతో సూటిగా మాట్లాడారట. “బాబూ, నా మాటలంటే నీకు నిర్లక్షమెందుకు? ఎందుకీరీతిగా హేళనగా మాట్లాడుచున్నావని గద్దించారట. ఆ ప్రభుని మాటను విన్న వెంటనే అతనిలో గణనీయమైన మార్పు కల్గిందట. వెంటనే మా అక్క అతనికి దేవున్ని గూర్చి వివరించి,

“తమ్ముడూ, నీవు దేవునికొరకే జీవించాలి. ఈ లోకంలో ఏమి సంపాదించిననూ, సర్వమూ వ్యర్ధమగును సుమా!” అని తెల్పిందట. ఆ మాటలన్నీ నమ్మి వెంటనే ప్రభువును రక్షకునిగా స్వీకరించి మారుమనస్సు పొందాడు. గొప్ప ఆదర్శవంతునిగా క్రీస్తుప్రేమ

ప్రభావితము చేయగా కట్నం తీసుకోకుండా వివాహము చేసుకొన్నాడు. మా అక్కకు క్రీస్తుపట్ల గల భక్తి విశ్వాస్యతను గమనించుచున్న నేను, యవ్వనస్తుని జీవితంలో కల్గిన మారుమనస్సును గుర్తించి విశ్వాసంతో నిలిచాను.

మాకు తెలిసిన జేసుబాబు అన్నయ్యకు దైవజనుడైన ముఖర్జీగారు మామగారయ్యారు. వారి కుమార్తె రూతు అక్కను వివాహము చేసుకొని మా ఊరిలో స్థిరపడుట దేవుని ఉచితకృపగా భావించి చాలా ఆనందించాము. వైద్యపరంగా ఆ అన్నయ్య మా నాన్నగారిని దర్శించి దేవుని గూర్చిన సంగతులన్నీ వివరించేవారు. స్వతహాగా మా నాన్నగారు నీతిగా జీవిస్తూ ప్రజల క్షేమము కాంక్షిస్తూ రాజకీయ రంగంలో కృషిచేస్తున్నందున తన స్వంత సొమ్ము కూడా ఖర్చుచేస్తూ ఆపదలో అవసరాల్లో నున్న వారికై శ్రమించేవారు. ఒకరోజు ఆ అన్నయ్యతో మాట్లాడిన మాటలు విన్నాను. "జేసుబాబూ, ఈ ఊరిలో భక్తిచేసే వారి ప్రవర్తన సరిగాలేదు. ఎవ్వరికీ నచ్చుటలేదు. నీవైనా పదిమంది వ్యక్తులను మంచి మార్గంలోనికి నడిపించి దైవభక్తి గలవారిగా మార్చు తేగల్గితే నేను కూడా అదే మార్గాన్ని అనుసరించగలను" అని తెల్పారు.

మా నాన్న మమ్ములను బయట జరిగే ప్రార్ధనలకు వెళ్ళనిచ్చేవారు కారు. మీకిష్టమయితే యింట్లోనే వుండి ప్రార్ధన చేసుకోవచ్చునని తెల్పారు. ఆ రోజుల్లో జేసుబాబు నాన్నగారు కూడా మా ఊరిలోనే నివసించసాగారు. ఆయన మా నాన్నగార్కి దేవుని మాటల్ని చెప్పేవారు. వారింట్లోనే ఆదివారాలు ఆరాధనను ఆరంభించారు. తరచుగా మా యింటికి వచ్చి ప్రార్ధించేవారు.

ఒకరోజు మా నాన్నగారిని గద్ధిస్తూ "మీరు చుట్టలు త్రాగుట మానివేయాలండీ" అన్నారు. వెంటనే దైవాత్మ పనిచేయగా ఆ త్రాగుట మానివేసారు. మా యింట్లో అప్పుడప్పుడు ప్రార్ధనా కూడికలను ఏర్పాటు చేసేవారు. మా అక్క నేర్పిన దేవుని భక్తి, దైవజనుల వర్తమానాల ప్రభావము వల్ల నేను ప్రార్ధన నేర్చుకొన్నాను. ప్రార్ధించుట వల్ల నా బలహీనతలన్నీ స్పష్టంగా తెలియసాగాయి.

గతంలో మా యింటి ఎదురుగా ఒక వృద్ధురాలికి ఒక కోడి రోజూవచ్చి గ్రుడ్డుపెట్టేది. ఒక కోతి వచ్చి పెరట్లో పెట్టిన గ్రుడ్డును తినివేసేది. అదే సమయంలో నేను ఆ గ్రుడ్డు రోజూ తెచ్చుకొని తినేదాన్ని. దేవుడా పాపాన్ని దొంగవని గుర్తుకు తెచ్చారు. పుల్లలు కూడా దొంగతనం చేసాను. మా అమ్మను విసిగించాను అందరికీ క్షమాపణ తెల్పాను. నా కొరకు సిలువ వేయబడిన క్రీస్తే నాలో పాపక్షమాపణ పొందిన అనుభవమిచ్చారన్న నెమ్మది పొందాను.

**1 యోహాను 1:7 "యేసు రక్తము మన ప్రతి పాపములనుండి మనలను పవిత్రులనుగా చేయును".** ఈ వాక్యము నాపట్ల నెరవేరింది. నాకు రక్తస్రావమనే వ్యాధి వుండేది. గతంలో ఎందరో దేవతలకు పూజలు చేసిననూ తగ్గలేదు. నా ఆత్మీయ స్వస్థతతో పాటు శారీరక స్వస్థత నాకు లభించగా నా శరీరములోని భారమంతా తొలగిపోయింది.

మా నాన్నగారు రాజకీయాల గొడవలలో చాలా గాయపడ్డారు. మరణము అంచుకు చేరగా ఆస్పత్రిలో చేర్చాము. దయగల యేసు దర్శనములో మా నాన్నగార్కి కన్పించారు. తెల్లని వస్త్రాలు ధరించి కాంతివంతమైన ముఖవర్చస్సుతో కన్పించి చేయిచాచి గాయాలను ముట్టినట్లుగా చూచారు. అంతేకాదు ఆయన గాయాలు స్వస్థపర్చుటకై ఇంజక్షన్ చేసి చేయిపట్టి నడిపించి వెళ్ళిపోయారు. మరణావస్థనుండి జీవముపొంది యింటికి క్షేమంగా చేరారు. దేవుని ప్రత్యేక ప్రణాళిక మా అందరిలో సమృద్ధిగా నెరవేరుట మాకు చాలా ఆశ్చర్యము, ఆనందము కల్గించింది. లెమ్ము తేజరిల్లుము, నీకు వెలుగు వచ్చిందన్న ఆదేశమును బట్టి ముఖర్జీ గారి హెచ్చరికలు పాటిస్తూ ఆయన క్రమాన్ని ప్రశంసిస్తూ క్రీస్తు ప్రేమను గ్రహించగల్గారు.

ఎంతటి మార్పు కల్గిననూ, మమ్ములను ప్రార్థనలకు బయటకు పంపుట కిష్టపడేవారు కారు. మా నాన్న లేని సమయంలో ధైర్యము చేసి మందిరానికి వెళ్ళిపోయాను. నేనింటిలో లేనందున నన్ను పేరుపెట్టి పిలిచి అడుగగా ఆమె ప్రార్థనకు వెళ్ళిందని తెల్పారు. ఎందుకామెను పంపావని అమ్మను చాలా కోపడ్డారు.

"ఆ మాట మీరు అనవద్దు నేను వినవద్దు" అని ధైర్యంగా చెప్పింది. మా నాన్నకు కనువిప్పు కల్గి మౌనంగా ఉండిపోయారు. ఎన్నడూ నా మాట ఎదురించలేని అమ్మ కూడా దేవుని సన్నిధి కొరకు ధైర్యముగా జవాబిచ్చినది గనుక మరలా ఆటంకము చేయక నేను ఆరాధనలకు వెళ్ళుటకు అనుమతి యిచ్చారు.

ఆ తర్వాత ముఖర్జీ గారు మాయిల్లు దర్శించి మా నాన్నతో దేవుని విషయాలను సంప్రదించారు. రక్షణ చాలా అవసరమనియు, యేసు ద్వారా మాత్రమే ఆత్మకు విమోచన లభిస్తుందనియు, చెప్పగా మా నాన్న చివరిగా క్రీస్తును అంగీకరించుటకు నిర్ణయించుకున్నారు. పాపాలన్నీ వినయముతో ఒప్పుకొని, తనకు విరోధముగా నున్న వారితో సమాధానపడ్డారు. క్రైస్తవ దేవాలయాలకు వెళ్ళుటకు అడ్డుపెట్టే వ్యక్తిగా నుండే వారు క్రమంగా మారి ఆయనే స్వయంగా ప్రార్థనలకు వచ్చి ఆరాధనలలో పాల్గొనేవారు. మంచితనము, ధర్మకార్యాలు, ఒకనిని పరలోకము చేర్చావు, గాని యేసే మోక్షానికి నిజమైన మార్గమని దృఢంగా నమ్మారు.

**అపొస్త 26:18 "యేసు నందలి విశ్వాసము ద్వారా పాపక్షమాపణ, పరిశుద్ధ పరచబడిన వారిలో స్వాస్థ్యము పొందగలము".**

అనే వాక్యాన్ని నమ్మారు. జన్మ, కర్మ పాపాలను తొలగించే ప్రభువు క్రీస్తేనని విశ్వసించారు. ఆ తర్వాత పరలోక ప్రవేశానికి పూర్తిగా సిద్ధపడిన తర్వాత ప్రభువునందు నిద్రించి పరలోకం చేరారు. అన్యాచారాలకు దూరంగా క్రైస్తవ పద్ధతిలో సమాధి చేసాము. మా బంధువులంతా ఆశ్చర్యపడే రీతిగా వింతగా చూచారు. నాన్న మరణించిన దిగులు లేకుండా పరలోక వాతావరణము మమ్ములను ఆనందపర్చింది. మా ఆత్మీయ జీవితాలకు బలాన్ని యిచ్చి స్థిరపర్చిన వ్యక్తి ముఖర్జీ గారిని బట్టి దేవునికి కృతజ్ఞత చెల్లిస్తూనే వున్నాము. మా అమ్మ కూడా పూజలు మానివేసి దేవున్ని నమ్ముకొని బాప్తీస్మము తీసుకొని సహవాసంలో ఆనందించు ధన్యత పొందింది. నా బ్రతుకులో క్రీస్తు చాలాసార్లు వాక్యం ద్వారా నడిపిస్తున్నారు.

**మీకా 7:19 "వారి పాపములన్నిటిని సముద్రపు అగాధములో పడవేతువు".**

ఆ వాక్యము ద్వారా నేను సంపూర్ణముగా నా జీవితాన్ని దేవునికి సమర్పించుకొని నీటి బాప్తీస్మము పొందాను. అప్పటి నుండి తులసిగా నున్న నాపేరు మారి ఎస్తేరు నయ్యాను. నేను దేవుని సేవ ఎట్లు చేయాలి? చదువురాని దానినని నా మనస్సులో దిగులుతో ప్రార్థించుచుండగా ముఖర్జీగారు ప్రసంగంలో ప్రవచనాత్మకంగా "చదువురాని దానినని, అజ్ఞానినని నిరుత్సాహము ఎందుకు? నీ చదువు, జ్ఞానము ప్రాముఖ్యము కాదు. నీవు అందుబాటులో నుండిన చాలునన్నారు.

**యిర్మీయా 1:4 "గర్భములో నుండగా నిన్నెరిగితిని".** నేను సేవకు సిద్ధపడగా ఆటంకాలు ఎదురయ్యాయి.

**యిర్మీయా 15:19 "వారు నీతట్టు తిరగవలెను గాని నీవు వారితట్టు తిరుగరాదు".**

యేసువైపు మాత్రమే చూచుచూ సాగిపోవాలని నిర్ణయించుకున్నాను. సేవకు సమర్పించుకొని వెనుకకు తిరగరాదని అందరూ బెదిరించారు. నా యింటివారే నాకు శత్రువులై వ్యతిరేఖించారు. మా తల్లి ఆ రోజుల్లో చాలా నీర్సమై లేవలేని స్థితికి చేరింది. యీ ఆటంకాలన్నీ ఏ రీతిగా ఎదుర్కొవాలో ప్రార్థించుకున్నాను. దేవుడు మరలా వాక్యము ద్వారా మాట్లాడారు.

**యిర్మీయా 1:17 "కాబట్టి నీవు నడుము కట్టుకొని నిలువబడి నేను నీ కాజ్ఞాపించినదంతయు వారికి ప్రకటన చేయుము. భయపడకుము. వారి యెదుట నీకు భయము పుట్టింతును".**

నా కొరకై యీ గొప్ప సత్యాలు ప్రభువు దాచివుంచారని దేవున్ని స్తుతించాను. గొప్ప సత్యాలను దాచిన బైబిలు మనకు అందుబాటులో నుంచి మంచి జీవితాన్ని జీవించు ధన్యతనిచ్చిన దేవునికి వేయినోళ్ళతో స్తుతించిననూ జీవితము చాలదన భావిస్తాను.

**యోబు 5:21 "నోటి మాటల చేత కలుగు నొప్పి నీకు తగులకుండా ఆయన నిన్ను చాటుచేయును".**

నా స్వకీయుల మాటలు బాధించగా ఈ వాక్యము ద్వారా దేవుడే చాటుచేసి ఆదరించారు. దైవ సేవకులు నాకు ఆత్మీయ తల్లిదండ్రులయ్యారు. మా నాన్న నేర్పిన క్రమము నాకు సేవలో జయ జీవితము జీవించే కృప నిచ్చింది. నేడు నాకు దేవుని పుస్తకాలు అమ్ము పరిచర్యను అప్పగించారు. ఒకప్పుడు అజ్ఞానం నుండి నన్ను తన ఉచితకృపతో రక్షించి తన అమూల్య పరిచర్యకై పిలిచారు. అంతము వరకు ప్రభుని బిడ్డగా జీవించాలని నా కొరకై ప్రార్థించండి. ప్రభుని కృప మీతోనుండు గాక. ఆమెన్.

---------

# 33. స్వస్థతనిచ్చి రక్షించిన దేవుడు దర్శనము ద్వారా ప్రేమను చూపారు

**–రాజేశ్వరి (రాజి) (అమెరికా)**



**నిర్గమ 15:25 "నిన్ను స్వస్థపర్చు యెహోవాను నేనే".**

**పరిచయము:–** నేను క్రీస్తును విశ్వసించిన విధము ఆశ్చర్యము కల్గించగా నేను నమ్మిన నా క్రీస్తును ప్రేమించి కృతజ్ఞత చెల్లిస్తున్నాను. నా పేరు రాజేశ్వరి. నేను విగ్రహారాధన చేయు కుటుంబములో జన్మించాను. నా తల్లిదండ్రులకు నేను, అక్క యిద్దరమూ ఆడ పిల్లలుగా జన్మించాము. నా అక్క నన్ను చాలా ప్రేమించేది. ఆమె తన స్నేహితుల ద్వారా క్రీస్తు నిజమైన దేవుడని నమ్మింది.

ఆయన స్వస్థపర్చే దేవుడని మంచి మాటలు చెప్పారని చెప్పింది. నా బాల్యములో నాకు కళ్ళు చాలా ఎఱ్ఱగా మారిపోయి బాధించేవి. నా అక్క నా పరిస్థితి గుర్తించి యేసు ప్రభువును ప్రార్థించి, నన్ను స్వస్థపర్చుమని అడగాలని నేర్పించింది. ఒకరాత్రి నిద్రపోయే ముందుగా "మంచి దేవుడవని మా అక్క చెప్పగా నిన్ను ప్రార్థిస్తున్నాను. నీవు నిజదేవుడవైతే నాకు కనబడి, నా కళ్ళు ముట్టి నన్ను స్వస్థపరచండి" అని వినయముగా ప్రార్థించాను.

నిజానికి క్రీస్తు సజీవుడు మాత్రమే కాదు, ప్రతి ప్రార్థనా ఆలకించే దేవుడుగా ఆ రాత్రి నాకు దర్శనమిచ్చారు. అతి తెల్లని వస్త్రాలు ధరించిన వ్యక్తి, వెలుగుతో నిండిన వాతావరణంలో నన్ను చేరి నా కళ్ళు ఆప్యాయంగా తాకారు. ఆ క్షణములో నా కళ్ళు పూర్తిగా స్వస్థత పొందిన అనుభవం పొందాను. ఆ దేవుని స్పర్శను అనుభవించాక ఆయన నన్ను తన బిడ్డగా రక్షించారని నమ్మి ప్రార్థించుట నేర్చుకున్నాను. దైవ వాక్యము నన్ను ఆకర్షించగా

**మత్తయి 7:7 "అడుగుడి మీ కివ్వబడును. వెదకుడి మీకు దొరుకును. తట్టుడి మీకు తీయబడును".** ఈ వాగ్దానము నాకు ఆదర్శమైనది. నా వివాహము గూర్చి ప్రార్థించు కొనేదాన్ని. మంచి సంబంధము తెచ్చి నాన్న నాకు వివాహము స్థిరపరిచారు. నాకు ఆ రాత్రి స్వరము వినిపించగా ఆశ్చర్యపడ్డాను. "అమ్మా, ఈ వివాహము నీకు జరగదు. మరొక సంబంధాన్ని స్థిరపరిచాను అని తెల్పారు. నన్ను స్వస్థపరిచిన దేవుడు నాకు తెల్పారని

కనిపెట్టాను. నా దేవుని మాటను స్థిరపర్చుటకు ఆ సంబంధము వ్యక్తులకు మా తల్లి దండ్రులతో కట్నం విషయంలో వాగ్వివాదములు వచ్చినందున మా తల్లిదండ్రులు ఆ సంబంధమును వదులుకున్నాను. ప్రభువు నాకు తెలియజేసినట్లే నెరవేరుటను బట్టి మరింత విశ్వాసంతో ప్రార్థించుటకారంభించాను.

నేను గతంలో స్వరం విన్ననూ, నాన్నగారు నిర్ణయించినట్లు నా స్వంత నిర్ణయానికి లోబడుట తప్పని గ్రహించాను. ప్రభువా, నీ స్వరమును గుర్తించుటకు, నీవు చెప్పినట్లు చేయుటకు నీ కృప దయచేయమని క్షమాపణ అడిగాను. ఆ తర్వాత మరొక సంబంధము వచ్చింది. ప్రభువు తిరిగి తన స్వరంతో నాతో మాట్లాడి "అమ్మా, యిప్పుడు వచ్చిన సంబంధమును నేను నీకు స్థిరపరుస్తాను". అని అభయమిచ్చారు. నీ స్వరానికి లోబడతానన్నాను. ప్రభువు తోడుండగా నా వివాహము జరిగిపోయింది.

**అమెరికా ప్రవేశము:-** దేవుడు నన్ను దీవించగా నేను నా భర్తతో అమెరికా చేరి స్థిరపడ్డాను. క్రీస్తును ప్రార్థించుట మరువలేదు. 2008వ సంవత్సరములో అమెరికా చేరాను. నా తల్లికిద్దరమూ అమ్మాయిలే జన్మించారని, నాకు మగబిడ్డ కావాలని ఉపవాసముండి ప్రార్థించాను. ఆ రోజుల్లో గర్భవతినయ్యాను. అది దేవుని కృపగా ఎంచి సంతోషించే సమయంలో నాకు రక్తస్రావమగుట బాధకల్గించింది. అకస్మాత్తుగా జరిగిన ఈ అనుభవం నన్ను కలవర పరిచింది.

ప్రభువా తిరిగి నాతో మాట్లాడి ఆదరించండని ప్రార్థించాను. కన్నీటి ప్రార్థన వల్ల జవాబు లభిస్తుందని నాకు తెలుసు గనుక నా ప్రార్థనలాలకించే ప్రభువు ఆ రాత్రి నన్ను దర్శించారు. గతంలో నా కళ్ళు ముట్టి స్వస్థపరిచిన ఆయన, గాయపడిన హస్తముతో ఒక బాబును పట్టుకొని యుండుట చూచాను. వెంటనే నా గర్భమును తెరిచి ఆ బాబును నా గర్భములో పదిలంగా పెట్టి దీవించి అంతర్ధానమయ్యారు. ఈ గొప్ప అనుభవాన్ని గూర్చి నా భర్తకు, బంధువులకు తెల్పాను. ఆ తర్వాత స్కానింగులో గమనించగా నా గర్భములో నున్నది అబ్బాయేనన్నారు. మాటతప్పని దేవుని మాట నమ్మాను. మంచి శక్తిని ప్రభువిచ్చారు. బాబును పొందాను. రోజులు సవ్యంగా సాగిపోయాయి. ప్రభువును మరింత ఆసక్తితో ప్రార్థించుచూనే వున్నాను.

బాబుకు తోడుగా ఒక పాప కావాలని ఆశించాను. బయట ఎక్కడ పాపలను చూచినా పాప కావాలని కోరి ప్రార్థించసాగాను. రెండవ సారి మరొక దర్శనంలో మొదటిసారి ప్రభువు గర్భము తెరిచి బాబును పెట్టినట్లే ఒక పాపను పెట్టుట స్పష్టంగా చూచాను.

పాపను దేవుడిస్తాడని నమ్మాను. 2012లో పాప నేను చూచిన ఆకృతిలోనే ఉండగా ప్రభువు ఎంత స్పష్టంగా ప్రార్ధనలను ఆలకించి జవాబునిస్తారని నమ్మి స్తుతించాను.

**నా భర్త వీసా పట్ల అద్భుతము:–** ఆ తర్వాత ఇండియాలో మా మామగారు మరణించినందున నా భర్త ఇండియా వెళ్లారు. 4 నెలలుగా ఒంటరిగా పిల్లలతో అమెరికాలో నుండవలసి వచ్చింది. ఎలా గడిపానో నాకే తెలియదు. ప్రభువే అనుక్షణము నాకు తోడుగా నుండి నడిపించారు. నేను మరలా కన్నీటితో నా భర్త తిరిగి వీసా స్టాంపింగు కొరకు అభ్యంతరాల నెదుర్కొంటున్నారని, దానికై ప్రార్ధించాను. సరిగ్గా మరొక అద్భుతంగా స్టాంపింగు జరుగుట దర్శనములో చూచాను.

నా భర్తకు అదే సమయంలో స్టాంపింగు జరిగిందని వెంటనే నాకు చెప్పలేదు. నన్ను ఆశ్చర్య పర్చాలనుకున్నారు. అయితే నా ప్రభువు నాకు చూపించిన దర్శనం చెప్పాను. నిజంగానే నాకు స్టాంపింగు లభించిందని తెల్పి ఆశ్చర్యం కల్గించారు. అడుగుడి నీకిస్తానన్న వాగ్ధానము నెరవేరుటను బట్టి ఆయన అమెరికా వచ్చారు.

ఈ రీతిగా మూడు దర్శనాల ద్వారా నాకు వాస్తవాన్ని తెలిపి జరగబోవు అద్భుతాలను స్వయంగా చెప్పి నెరవేర్చిన ప్రభువు నా రక్షకునిగా, కాపరిగా, సంరక్షకునిగా, స్వస్థత పర్చు దేవునిగా, నన్ను ప్రేమించి ఆదరించారు.

బైబిలులోని వాగ్ధానములన్నియు నెరవేర్చు వాడవు నీవే, అద్భుతమైన దేవా, నిన్ను పూజించి సేవింతును ప్రభువా, నిన్నే సదా కొనియాడెదనయ్యా అని నేను నా ప్రభువును నమ్మి ఆశ్రయించాను. ప్రియ నేస్తమా క్రీస్తే సర్వాధికారి. గొప్ప దేవుడని నమ్మి వెంబడించాలని నా ప్రార్ధన. ఆమెన్

---------

# 34. నిరాశ నుండి నిరీక్షణలోనికి నన్ను నడిపించిన రక్షకుడు నా యేసు

**–ప్రశాంతి (అమెరికా)**



**మత్తయి 9:22 "ధైర్యము తెచ్చుకొనుము నీ విశ్వాసము నిన్ను స్వస్థపరుచును".**

**పరిచయము:–** ప్రభువునకే సదా స్తుతి మహిమ కల్గుగాక. నేను క్రైస్తవ కుటుంబములో జన్మించాను. మంచి తల్లిదండ్రులు, తోబుట్టువులతో మంచి జీవితం జీవించాను. యవ్వన కాలములో మంచి భర్తను పొంది ఉన్నతంగా దీవించబడిన ఫలితంగా అమెరికా చేరి స్థిరపడ్డాను. యిద్దరు బిడ్డలను పొందాను. ప్రార్ధనా జీవితము సామాన్యంగా ఉండేది. కష్టాలు, బాధలు జీవితంలో విలువైన పాఠాలు నేర్పించగలవని నా అనుభవం సాక్ష్యమిస్తుంది. అంతేకాదు, ప్రతి విశ్వాసికి మంచి విశ్వాసుల సహవాసం అత్యవసరమని ఖచ్చితంగా చెప్పగలను.

నా బిడ్డలు ప్రభువు నాకిచ్చిన బహుమానాలుగా ఎంతో దేవున్ని స్తుతించు కొనేదాన్ని. అనుకోని రీతిగా నాలో వింతైన మానసిక మార్పు కల్గింది. ఏదో నిరాశ చోటుచేసుకొని నిద్రపట్టేది కాదు. తెలియని భయం ఆవరించేది. అమ్మ నాన్న, నాతోబుట్టువులంతా నా మంచము చుట్టూ చేరి ప్రార్థిస్తే ఆ తర్వాత నెమ్మది కల్గి నిద్రపోయేదాన్ని. నా తలంపులలో జయంలేదు. ఒక్క అడుగు కూడా వేయలేని నిస్సహాయస్థితి కల్గింది. నోటి మాటల వలన కల్గు గాయములు బహు తీవ్రమైనవని తెలిసింది.

నా బంధువులే నన్ను మాటలతో బాధించగా నేను మానసికంగా చాలా గాయపడ్డాను. అమెరికాలో నుండగా నాకు కల్గిన ఈ బాధవల్ల చాలా కృంగిపోయాను. నా యిద్దరు బిడ్డలను సరిగా ఆలనా పాలనా చూస్తూ ఆరోగ్యంగా ఉంచలేకపోయాననే బెంగతో మరింత కృంగిపోయాను. నా తలంపులపై జయము లేకపోయింది. ఇక చేసేది లేక ఇండియాలో నా తల్లిదండ్రులను ఆశ్రయించాను. అడుగులు వేసే ఓపికలేక బాధపడేదాన్ని. నిద్రపట్టేది కాదు. భయముతో వణుకు వచ్చేది.

నా పరిస్థితి చూచిన నా తల్లిదండ్రులు, తోబుట్టువులు నన్ను కనిపెట్టి చూచేవారు. రాత్రివేళ ప్రార్థించి ధైర్యపరిచేవారు. డాక్టరు దగ్గరకు తీసుకొని వెళ్ళగా ఏంగ్జయిటీగా తేల్చి మందులిచ్చారు. ఏదో దుష్టశక్తి ప్రభావము నాపై వున్నదని తోచేది. ఒకవైళ ఎవరినైనా మనము గాయపర్చిననూ, లేదు ఎవరైనా బాధించగా మనస్సు గాయపడిననూ సైతాను అవకాశంగా తీసుకొని మనపై దాడిచేయగలదని, దాని పరిణామం ఎంతైనా విపరీతము కాగలదని కొందరు తెల్పారు. డాక్టర్లు చేయలేని పని సైతానును జయించడం అనేది క్రీస్తు ద్వారానే సాధ్యము కాగలదు.

నా తల్లి దండ్రులకు తెలిసిన ప్రార్థనాత్మ కల్గి సైతాను శక్తులను విడిపించగల భక్తిగల దైవజనుని ఆశ్రయించి ప్రార్థన చేయించుకున్నాను. కొంతవరకు ఉపశమనము పొందాను. ఇక నా భర్త అమెరికాలో ఒంటరిగా నుండుటచే అమెరికా చేరాను. అమెరికాలో కొందరు తెలుగువారు వారి అనుకూలతను బట్టి ఖాళీగా వుండేవారు ప్రేయర్ సెల్ నిర్వహించుట వారికి ఆత్మీయంగా ఎంతో మేలు కల్గుట ఆశ్చర్యం కల్గించగా, ఒకరి నొకరు కళ్ళతో చూచుకొనకపోవచ్చు కేవలము స్వరము వినుట చాలు అని తలంచి మంచి సందేశాలు, మంచి పాటలు విని ప్రార్థనలు చేయుట వలన ఎంతో ఆత్మీయ మేలుపొందు విశ్వాసులు స్నేహితులైనందున నాకు వారి పరిచయం చాలా సంతోషము కల్గించింది. రాజీ అనే స్నేహితురాలి వల్ల యేసయ్య ప్రార్థనా సెల్‌ను శ్రీదేవి గారు నిర్వహించుట తెలుసుకున్నాను.

నిజానికి 20 మంది దాదాపు చేరి వాక్యము విని వారి అనుభవ సాక్ష్యాలు పంచుకొను రీతి నాకు ఆహ్లాదం కల్గించింది. వారందరూ నా కొరకు చేసిన ప్రార్థనలు నాకు చాలా ప్రోత్సాహము కల్గించింది. రాజీతో పాటు అందరి స్నేహం గొప్ప ఆదరణ కల్గించగా కొంత వరకు జయించే శక్తి పొందాను. పూర్తి స్వస్థతకై ప్రార్థించాను. అనుకోని రీతిగా యేసయ్య సెల్‌ఫోన్ నిర్వహించే శ్రీదేవి అక్కయ్యకు ప్రభువు ప్రేరణ నిచ్చారని తెల్పి నాకు ఫోనుచేసి "ప్రశాంతీ, నిన్ను బాధించే దురాత్మతో సూటిగా గద్దించి ఆ ఆత్మను వదిలించాలని ప్రభువు నాతో మాట్లాడారమ్మా" అని తెల్పి నాకొరకు శక్తితో ప్రార్థించింది.

"ప్రశాంతిని బాధించే దురాత్మా, తక్షణము యేసురక్త శక్తితో, పరిశుద్ధాత్మ శక్తితో ఆమెను వదిలిపెట్టి వెళ్ళిపో" అని గద్దించి ప్రార్థించింది. వెంటనే నాలోనున్న దురాత్మ శక్తి

నానుండి దూరమయిన భావం కల్గి నా మనస్సు ప్రశాంత తతో నిండింది. ఏదో దురాత్మ నిన్ను బాధిస్తుందని నాకు ప్రభువు తెల్పారు గనుక ఆయనే నీకు పూర్తి విడుదల యిచ్చేసారని నా విశ్వాసం అన్న శ్రీదేవి మాటలు అక్షరాల నిజమయ్యాయి.

నాలో వింత మార్పుతోపాటు ప్రభువు పౌలు తన పత్రికలలో తెల్పిన మాట నాకు తెల్పి సూటిగా నాలో ధైర్యం కల్గించారు. "క్రీస్తుయేసు నందు బలవంతుడవు కమ్ము" అనే వాక్యం నాకు సూటిగా తాకింది. అద్భుతంగా నాలో ధైర్యము కల్గి రాత్రి సమయాల్లో కలవరమంతా దూరమయింది. ప్రశాంతంగా నిద్రపోగల్గుచున్నాను. దేవుని కృప వలననే నా బలహీనతలో పూర్తి జయము కల్గింది. మరణమునకు చేరువయిన నా జీవితమును సంరక్షించారు. ఏ మందూ లేకుండా నేడు నిర్భయంగా, ఆరోగ్యంగా జీవిస్తున్నాను. నా జీవితంలో ముందుగా దేవునికి తదుపరి యేసయ్య ప్రార్థనా గుంపునకు కృతజ్ఞత చెల్లిస్తున్నాను. క్రీస్తు నా గొప్ప రక్షకుడు. హల్లెలూయ.

------------------

# 35. నమ్మదగిన నా రక్షకుడు నాకెన్నో మేలులు చేసారు

**– సోనియా (అమెరికా)**

**సామెతలు 28:20 "నమ్మకమైన వానికి దీవెనలు మెండుగా కలుగును".**

**పరిచయము:–** ప్రభువుని నామమునకు మహిమ కల్గును గాక. దేవునికే సదా వందనాలు చెల్లిస్తూ నా జీవితములో జరిగించిన అద్భుతాలను గూర్చి వివరించాలని ఆశిస్తున్నాను. నేను మంచి విలువలను పాటించే క్రైస్తవ కుటుంబములో జన్మించాను. ప్రార్ధనా జీవితము, కుటుంబ ఆరాధనా క్రమమును బట్టి బాల్యము నుండి మంచి క్రైస్తవ వ్యక్తిగా జీవించాను. నా తల్లి మంచి ప్రార్ధనాత్మ గలది. బిడ్డలమైన మా కొరకు నిరంతరమూ ప్రార్ధించేది. ఒక తల్లి ఎట్టి ప్రార్ధనా పరురాలిగా ఉండుట మంచిదో అట్టి ఆదర్శ మహిళగా మమ్ములను మంచి క్రమశిక్షణతో పెంచారు.

మధ్య రాత్రివేళలో గమనించగా నా దగ్గర గాని, అక్క తలదగ్గర గాని ప్రార్ధిస్తూ కన్పించేది. ప్రతి ఉదయము కుటుంబ ప్రార్ధనలో గొంతెత్తి పాట ఎత్తగానే మేమంతా చేరేవారము. ఆ రీతిగా పాటలు పాడుటలో ఆసక్తిని బట్టి మంచి తర్ఫీదును పొంది నేడు ప్రతిచోట నా పాటను కోరే స్థాయికి ప్రభువు నన్ను దీవించారు. శ్రావ్యంగా పాడగల తలాంతును ప్రభువిచ్చారని పలువురు ప్రశంసించుటను బట్టి నేను దేవున్ని స్తుతిస్తున్నాను.

నాకు అన్న, అక్క, తమ్ముడు. మేము నలుగురము మంచి ఆప్యాయతలతో పెరిగాము. మేము నలుగురము ఉదయము టిఫిన్ తినేముందు తప్పకుండా బైబిలు చదివి వ్యక్తిగత ప్రార్ధనలు ముగించుకోవాలి లేకపోతే అమ్మ ఊరుకోదనే భయంతో, భక్తితో కూడా అమ్మ మాటకు ఎదురు చెప్పకుండా పాటించేవారము.

అమ్మ స్థానికంగా జరిగే ఉజ్జీవ కూటాలకు మమ్ములను తీసుకొని వెళ్ళుట పరిపాటి. అక్కడ విశ్వాసులంతా ఎంతో శ్రద్ధగా చేతిలో బైబిలు, నోటుపుస్తకము ఉంచుకొని శ్రద్ధగా బోధకుడు చెప్పిన ప్రసంగాలన్నీ వ్రాసుకొనుట చూచి నేనుకూడా వారిని అనుకరించేదాన్ని. సరియైన బైబిలు జ్ఞానావగాహనలు లేవు. అప్పట్లో నా వయస్సు చిన్నది. నా తరగతి 5 లేక 6 మాత్రమే. ఆ ప్రసంగీకుడు వాక్యబోధనానంతరము రక్షణానుభవం పొందినవారు

ఎవరైనా ఉంటే చేతులు ఎత్తండి అని అడిగినప్పుడు నాకు అర్ధముకాలేదు. యిల్లుచేరాక రక్షణ అనగా ఏమిటి? అని అమ్మను ప్రశ్నించాను. పాపాలను ఒప్పుకొని పశ్చాత్తాపంతో ప్రార్ధించుకోవాలి అని తెల్పింది. అయితే నేనేమి పాపాలు చేసాను అని నన్ను నేను ప్రశ్నించుకున్నాను. అప్పుడు అమ్మ నాతో "అప్పుడప్పుడు అక్కను కొట్టడము, చెప్పిన పని వెంటనే చేయక విసిగించడం అవికూడా పాపాలే అని తెల్పింది". అంతేకాదు మోకరించి ప్రార్ధించుట కారంభిస్తే ప్రతి పాపము నీకే అర్ధమయిపోతుందిలే అని కూడా తెల్పింది. వెంటనే నాకు గుర్తున్న పాపాలన్నీ క్రమంగా ఒప్పుకొన్నాను.

నిజంగానే ఆ వయస్సులో రక్షణ పొందానన్న స్థిరత కల్గింది. అప్పటి నుండి చాల భక్తిగా నా జీవితాన్ని కొనసాగించసాగాను. నా విద్యాభ్యాసము సవ్యంగా కొనసాగింది. నేను ఇంజనీరింగు కోర్సు మంచి ప్రగతితో ముగించగల్గాను. నేను అడిగిన వన్నీ ప్రభువు వద్ద ప్రార్ధించి పొందుట అభ్యాసము చేసుకోగల్గాను.

నా కెన్నో ఆశీర్వాదాలనిచ్చి ఆనందింపజేసిన నా రక్షకున్ని ఎల్లప్పుడూ పాటలతో స్తుతిస్తూ కృతజ్ఞత కల్గి ఉంటాను. విద్యాభ్యాస కాలంలో నన్ను యిష్టపడి వివాహము చేసుకోవాలని కోరిన వ్యక్తిని గూర్చి నా తల్లిని సంప్రదించాను. ఆమె నాకు తెలియకనే ఒక దైవజనుడు లేటు డాక్టరు శాంత వర్ధన్ గుంటూరు నివాసికి ఉత్తరము వ్రాసి నాకు తగిన వరుడు కాదు లేదా ఔను అని తెల్పాలని అర్ధించారు. నేను కూడా నమ్మకంగా ప్రార్ధించాను. ప్రభువా నీ చిత్తమే నా జీవితములో జరగాలి అని అడిగేదాన్ని. నా మనస్సులో శాంతి లభించింది.

అదే కాలంలో అమ్మకు కూడా తగిన వరుడే, వివాహము జరిగించవచ్చునని సమ్మతి తెలియజేసారు. ప్రభువు చిత్తముతో నేను ఆశించిన రీతిగా, ప్రార్ధనా ఫలితంగా ఘన వివాహం జరిగింది. మా అత్తగారు, మామగారు ఒక చిన్న పల్లెటూరులో ఉండేవారు. మేము యిద్దరము హైదరాబాదులో క్రొత్త కాపురము పెట్టినాము. ఒక్కరి జీతముతోనే సర్దుకొనేవారము. నేను ఉద్యోగము చేయలేదు. ఆశ్చర్యంగా ప్రభువే పోషించారు. యిద్దరము కలిసి ప్రార్ధించుకొని సంతృప్తితోనే గడిపేవారము.

అద్భుత రీతిగా 2008వ సంవత్సరంలో అమెరికా ప్రవేశమునకు అనుకూలత లభించింది. అయితే వీసా స్టాంపింగు జరగవలసి ఉంది. అకస్మాత్తుగా సత్యం కంప్యూటర్ల

పరిస్థితి తారుమారయినందున మా ప్రయాణం ఆగిపోయింది. సరిగ్గా క్రొత్త ఉద్యోగం దొరికే అవకాశాలు లేని సమయంలో ప్రభుని అద్భుతాన్ని చూడగల్గాము. మా అమ్మ నాకిచ్చిన మంచి సలహాలలో ఒకటి ఏదనగా "అమ్మా, మనము ప్రార్థించిన అంశమును గూర్చి జవాబు వెంటనే రాకపోవచ్చు గాని చివరకు జీవితంలో మరణించక ముందయినా ప్రభువు జవాబిస్తారు, నమ్మాలి అని తెల్పింది. అదే మాటపై ఆధారపడి కనిపెట్టాను. ఉద్యోగము మారండని కొందరు సలహాయిచ్చిననూ నేను పాటించలేదు గాని ప్రార్థించాము.

అనుకోని రీతిగా అమెరికా నుండి మంచి జవాబు పొందగా ఒక్క వారంలో న్యూ జెర్సీ వెళ్ళే నిర్ణయము జరిగింది. అద్భుతరీతిగా ప్రతిపని సర్దుకొని 2010లో న్యూ జెర్సీ, అమెరికా చేరి క్రొత్త జీవితం ఆరంభించాము. ప్రశాంత జీవితం కొనసాగిస్తున్న రోజుల్లో మేము బిడ్డలు కావాలని కోరుకోనప్పటికీ నా నెలసరి క్రమంలో కొన్ని అవాంతరాలు కల్గాయి. డాక్టర్లు 2 లేదా 3 నెలలుగా పరీక్షించి గమనించి తగిన సలహాలనిచ్చారు. చివరకు సెప్టెంబరులో నెలసరి ఆగుట, ఆ తర్వాత గర్భవతిగా డాక్టర్లు తెలుపుట ద్వారా ఆనందించి కనిపెట్టసాగాను.

దేవుడే తన చిత్తంతో గుప్పిలి విప్పి ప్రతిజీవి కోర్కెలు తీర్చి సంతోషపెట్టు మంచి దేవుడని గ్రహించాము. క్రొత్త బహుమానంకై ఆశతో కనిపెట్టాము. నా ప్రసూతి సమయములో అమ్మ రావాలి గనుక ప్రభువు నా డెలివరీ సమయము సరిగ్గా మేలో నిర్ణయమగుట ఆయన ప్రత్యేక ప్రణాళికగా గుర్తించి చాలా స్తుతించాను. కేవలము అమ్మ రాకకోసం ప్రభువు సమయము నిర్ణయించుట నాకు ఆశ్చర్యము, ఆనందము కల్గించింది.

2008వ సంవత్సరములో బాబు పుట్టాడు. డాక్టరు అన్ని అవయవాలను తనిఖీ చేయగా కాళ్ళలో కాస్త లోపం కన్పించిందని పిలిచి చెప్పారు. అప్పటి వరకు ఆనందంతో స్తుతిస్తున్న నాకు కాస్త షాక్ కల్గింది. భవిష్యత్తులో కాలు వంకరగా నడుస్తాడని సంశయముందని తెల్పారు. యీ బలహీనత సరిచేయుటకు ఎముకల డాక్టరు చెప్పిన సలహా మేరకు హార్మోనులు ఎదుగుటకు మందులు వాడాలని తెల్పారు. బాబు పుట్టినది మే 28వ తేదీ తర్వాత ఒక నెలకు పాల్ దినకరన్ గారి సందేశాన్ని అమ్మ, నేను వినుట సంభవించింది.

జూన్ నెల 10వ తేదీ ఒక్క క్షణం విన్పించిన ఆ మాటల్ని వినగానే నాకు కన్నీరు ఆగలేదు. టి.వి. వీక్షిస్తున్న వారిలో ఒకరి బిడ్డకు కొన్ని హార్మోనుల లోపం వల్ల కలవరంగానున్నారు. యేసు ఆ బిడ్డను ముట్టుచున్నారు అని స్పష్టంగా తెలుపగా, ఆ సందేశము నాకోసమేనని సంపూర్ణంగా నమ్మి దేవున్ని స్తుతించాను. బాబు ఆరోగ్యంతో నుండి ఎంతో ఆనందం కల్గించాడు. ఆ తర్వాత 11వ నెలలో మరలా గర్భవతినయ్యాను. బాబు చాలా అందంగా మరింత రంగు కల్గి ఆరోగ్యంగా పుట్టాడు. అమ్మ ప్రసూతి సమయంలో రావాలని ప్రార్ధించాను. అమ్మ పనిచేసే ప్రిన్సిపాల్ గారు మంచి మనస్సుతో సెలవిస్తూ నాకు తోబుట్టువులున్నారు. కష్ట సుఖాలు గ్రహించగలను. సెలవు తీసుకోమన్నారు. అమ్మ రాగల్గారు. బాబుతో ఆనందించారు. 2 నెలల తర్వాత బాబు పాలు విపరీతంగా కక్కుట కారంభించాడు.

ఒకరోజు కక్కుట తీవ్రమైనందున ఎమర్జెన్సీలో ఎక్స్‌రేలు తీసి పేగులలో లోపం స్వల్పంగా నున్నదని చిన్న ఆపరేషన్ చేయాలన్నారు. లాప్రో స్కోపు సర్జరీ వల్ల 5 లేదా 6 గంటల వ్యవధిలో బాబు బాగయ్యాడు. ఈ రీతిగా రెండు అద్భుతాల నెదుర్కొని దేవుని మహిమను చూడగల్గాను. నా జీవితమంతా దేవుని స్తుతిగానం చేస్తూ సాక్షిగానుంటున్నాను. హల్లెలూయ.

---------

# 36 . ప్రత్యేక ప్రణాళిక ద్వారా నా జీవితాన్ని రక్షణ మార్గంలో నా క్రీస్తు నడిపించారు.

**– పూర్ణిమ (అమెరికా)**

**మత్తయి 14:27 "ధైర్యము తెచ్చుకొనుడి నేనే భయపడకుడని వారితో చెప్పెను".**

**పరిచయము:–** నా పేరు పూర్ణిమ. నేను మధ్య తరగతి కుటుంబంలో జన్మించాను. హిందూ ఆచారాలు సంప్రదాయాలు గల మా తల్లిదండ్రుల ప్రేమగల పెంపకంలో మా నాన్న వ్యవసాయం చేసినను నాకు ఉన్నత విద్యనివ్వాలని చాలా కృషిచేసారు. నాకు ఒక అన్నయ్య వుండేవాడు. ఒక తరగతి తేడా ఉన్నను, 7వ తరగతి తప్పినందున నేను అన్నయ్య 10వ తరగతి ఒకేసారి వ్రాసాము.

నా విద్యాభ్యాసమంతా కృష్ణా జిల్లాలో గుడ్లవల్లేరు అనే గ్రామములో గడిచింది. మానాన్న ఇంగ్లీషు మీడియంలో చదివించారు. మా కిద్దరు బాబాయిలుండేవారు. ఉమ్మడి ఆస్థి అయినను నా చదువుకొర్రకై కొంత అమ్మి కాలేజీలో హాస్టలులో నుంచి నన్ను అన్నయ్యను ఇంటరులో చేర్చారు. చాలా మంచి మార్కులు వచ్చేవి.

ఎంతో ఆరోగ్యముగా నున్న నాకు రెండవ సంవత్సరములో చలి జ్వరము వచ్చింది. మామూలు జ్వరంగా తలంచాను. తర్వాత కాళ్ళకు నీరు వచ్చింది. మానాన్నకు తెలిపాను. మలేరియా లేదా టయిఫాయిడ్ జ్వరమని అనుమానపడ్డారు. నా పరీక్షలయిన తదనంతరము సరిగ్గా వైద్య పరీక్షలు చేయించాలని తలంచారు. ఈలోగా ఎమ్.సెట్. పరీక్షలు వ్రాసి మంచి మార్కులు పొందాను. డబ్బుకట్టు సీటువచ్చింది.

ఈ లోగా కొంచెం ఆరోగ్యం క్షీణించగా దగ్గు ఆయాసముతో తీవ్రంగా బాధపడేదాన్ని. చివరకు క్షయగా తేల్చారు. ఆస్పత్రిలో చేరాను. గుండె బలము క్షీణించగా 4 లక్షల సొమ్ముతో ఆపరేషన్ చేయాలన్నారు. అంతడబ్బు లేనందున ఉచితముగా బెంగుళూరులో వైద్యముందని తెలుసుకున్నాము. మా నాన్నకు ఇంగ్లీషు మాట్లాడుటరాదు. బెంగుళూరు వెళ్ళి ఆపరేషన్ చేయించుకొని ఒక నెల గడిపాము. మందులు జీవితాంతము

వాడాలన్నారు. ఉమ్మడిగా నున్న పొలం అమ్మి లోన్‌కోసం ప్రయత్నించాము. నా బలహీనతలో నడక మారింది. కాలేజీలో చేరాను. బి.టెక్.లో చేరినాను. నాన్న సైకిల్‌మీద కాలేజీకి తీసుకొని వెళ్ళినందుకు నా తరగతివారంతా నన్ను వింతగా, జాలిగా చూచేవారు.

క్రీస్తు గురించి అంతవరకు నాకెవరూ చెప్పలేదు. 3వ సంవత్సరములో టూరు ఏర్పాటు చేయగా నా తరగతి వారంతా మానాన్నకు వాగ్ధానముచేసి బలహీనంగా నున్న నన్ను శ్రద్ధగా చూస్తామని అభయమిచ్చారు. నా తరగతిలోనున్న ఒక క్రైస్తవ యువకుడు నన్ను మంచి ఆప్యాయతతో ప్రతి విషయంలో శ్రద్ధతీసుకొని కనిపెట్టి చూచుకొనేవాడు. అతను క్రమంగా చర్చికి వెళ్ళి ఆరాధించేవాడని మంచి వ్యక్తిగా జీవించునని తోటివారు చెప్పారు.

ఆఖరు బెంచీలో కూర్చుని చదువులో వెనుకబడ్డాడు. రెండు సబ్జక్టులు ఫెయిల్ అయ్యాడు. నాకయితే ఆరోగ్యము సరిగ్గా ఉండేది కాదు. విరక్తిగా ఉండేది. కొన ఊపిరితో జీవించేదానిని. నాకు తెలియకుండగానే నన్ను పెండ్లి చేసుకుంటావా అని ప్రశ్నించాను. కుదరదు ముందు మా దేవుని చిత్తము తెలుసుకోకుండా నేను నిర్ణయించలేనన్నాడు. ఏడుస్తూ వెనక్కు వచ్చేసాను.

ఆ తర్వాత మనస్సు నిబ్బరము చేసుకొని ఇంజనీరింగు కోర్సు ముగించగల్గాను. వెంటనే ఉద్యోగం కొరకు ఆహ్వానం వచ్చింది. హైదరాబాదులోనే తాత్కాలికంగా వచ్చిన ఉద్యోగములో చేరాను. ఆ తర్వాత నా క్రైస్తవ స్నేహితుడిని నాతో వివాహానికి నిరాకరించావెందుకు? అని మరలా ప్రశ్నించాను. మేము నమ్మిన దేవుడు సూటిగా చూపించి చెప్తారు అన్నాడు.

ఆ దేవుడెవరో నేనే కనుక్కుంటానులే అని కోపంగా చెప్పాను. ఎప్పుడూ బాధపడుతూ ఏడ్చేదాన్ని. మా నాన్న నాకోసం పూజలు విపరీతంగా చేసేవారు. నా కెందుకో నిరాశతో చనిపోవాలనే కోరికతో పైకి వెళ్ళి దూకాలనిపించేది. భయపడి ఆగాను. నా గదిలోనున్న రూమ్‌మేట్స్ ఇద్దరూ క్రైస్తవులే. ఒకరు దైవజనుడైన ప్రసాద్‌గారి చెల్లెలు. నేను ఆయనను కలిసినప్పుడు నాలోనున్న భావాలన్నీ వివరించి చెప్పాను. సరేనమ్మా ప్రార్ధన చేద్దాం అన్నారు. దేవుడు ప్రతిదీ మన మంచికే చేస్తాడనే నమ్మకం కల్గింది. మా అన్నయ్య చదువు మానివేసి మాకు తెలిసిన అమ్మాయిని ప్రేమించి ఎవరికీ చెప్పకుండా పెండ్లి చేసుకొని ఆ

అమ్మాయిని మా యింటికి తెచ్చాడు. మా తల్లిదండ్రులెంతో బాధపడ్డారు. చాలా గొడవలు జరిగాయి. ఆ రోజుల్లో నాకు మనస్సు నెమ్మది లేనందున ప్రసాద్ గారితో ఎక్కువ ప్రార్ధనను గూర్చి ముచ్చటించేదాన్ని.

ఒకసారి విశ్వాసం గూర్చి వివరించారు. నా ఆరోగ్యము సరిగా లేకపోయినా విశ్వాసంతో మందులు మానివేయాలని ఆలోచించాను. డాక్టరు గారు నేను మందులు వాడుటలేదని గమనించి కోపపడ్డారు. నా విశ్వాసము మారింది. బొట్టు కూడా తీసివేసాను. యింటిలో అమ్మ నాన్న నాలో మార్పును గమనించారు. మానాన్న మాత్రము పూర్ణిమా, నీ కొరకు మ్రొక్కుబడి చెల్లించాలని తెల్పారు.

నా విశ్వాసం క్రీస్తులో స్థిరపడిన తర్వాత నా వదినతో చెప్పాను గాని నాన్నతో చెప్పే ధైర్యం లేకపోయింది. క్రమంగా చర్చికి వెళ్ళుటకారంభించాను. క్రీస్తును నమ్మి రక్షణానుభవం పొంది స్థిర విశ్వాసంతో కొనసాగుటను బట్టి నా కాలేజీలోని క్రైస్తవ యువకుడు అదే చర్చిలో నన్నుచూచి ఆశ్చర్యపడ్డాడు. అతని కోసం నా నమ్మకము మారిందని కాదుగాని, నిజంగా క్రీస్తును వెండిస్తున్నానని స్పష్టంగా గ్రహించాడు.

ఒకసారి నాకు ఫోనుచేసి మంచి ప్రార్ధనా కూటమునకు రాగలవా? అని అడిగాడు. సరేనని వెళ్లాను,. అక్కడ ఎక్కువ జనాలు లేరు గాని ఒక మంచి విశ్వాసి ప్రవచనాత్మకంగా మా జీవితాలను గూర్చి చెప్పుట నాకు వింతగా తోచింది. ఆమె నన్నెన్నడూ చూడలేదు గాని నీ పేరు ప్రసూన. మీ యిద్దరు జతపర్చబడుట దేవుని చిత్తమేనని తెల్పింది. అంతేకాదు నీకోరిక నెరవేర్చి నీ యిష్టము ప్రకారము చేయాలని దేవుడు ఆశిస్తున్నాడని తెల్పింది. నాతో వచ్చిన నా స్నేహితుడు చాలా ఏడ్చాడు. ''పూర్ణిమా, నీవంటే నాకు యిష్టమే. స్థిరమైన గుర్తు దేవుని నుండి కావాలని ఆశించాను. అని మనస్సు విప్పి మాట్లాడాడు. నా విద్యకోసం మానాన్న బ్యాంకులోను తీసుకొనగా అది చాలా ఒత్తిడిని కల్గించింది. నాకయితే సరియైన ఉద్యోగంలేదు. ఆ పరిస్థితుల్లో మా రూముమేటుకు మా నాన్నకు ఆరోగ్యం సరిగాలేదన్న వార్త తెలిసింది. నన్ను తీసుకొని యింటికి వెళ్ళాలన్న ఆదేశం ఉంది.

నాతో ఏమీ వివరాలు చెప్పలేదు. తండ్రి లేని వారికి, విధవరాళ్ళకు దేవుడు తోడుగా వుంటాడు అనే మాట లోలోపల స్వరంగా విన్పించింది. నేను బొట్టు పెట్టుకోలేదు. మా నాన్న మరణించారని అకస్మాత్తుగా చూచిన నేను షాకయ్యాను. ఎంతో ఆరోగ్యంతో

నున్న నాన్న నన్ను చాలా ప్రేమించిన నాన్న నాకికలేరన్న సత్యం నన్ను చాలా కృంగదీసింది. మా యింట్లో చిన్నాయనలంతా మిగిలిన ఆస్థి మాకే రావాలి. నీ చదువుకై కొంత వాడేసుకున్నారు అని పేచీపెట్టి చాలా మానసికంగా బాధించారు. నేను విపరీతమైన దు:ఖంతో కృంగిపోయాను.

నేను నమ్మిన క్రీస్తు ప్రేమ నన్ను చాలా ఆదరించింది. మా నాన్న స్నేహితుడు అమెరికాలో నున్నాడు. ఆయన ఇండియాలో నుండగా మా నాన్న నాకోసం అభ్యర్థించిన రీతిగా అమెరికాలో నా కుమార్తెకు ఇంజనీరుగా అవకాశాలుంటే సహాయపడాలని కోరుట మాకు తెలియదు. దేవుడు తన బిడ్డలకు దాచిన మేలు గొప్పదని తెలియజేసారు. నాకు ఈమెయిల్ చేస్తూ నా చదువు వివరాలు అమెరికా పంపు అని తెలియజేసారు. వినయంతో దేవున్ని ప్రార్థించి ఆయన చిత్తము కొరకు కనిపెట్టాను. 2007వ సంవత్సరము మార్చి ఒకటవ తారీకున నా ధరకాస్తు అమెరికాకు పంపాను. లాటరీ సిస్టంతో అప్లికేషన్లు సేకరించగా నా కొరకు సీటు లభించుట ఆశ్చర్యం కల్గించింది. దేవునికి యిష్టమయిన వ్యక్తులపట్ల దేవుని చిత్తము ఎంతో స్పష్టంగా బయలుపర్చగలరని తలంచి నాకు సిద్ధపరచిన సీటుకై స్తుతించాను. నా కొరకు కొంత సొమ్ము కావాలి గనుక దానికై ప్రార్థించాను.

గతంలో మా నానమ్మ నాకొరకు కొంత ఆస్థి ఉండాలని కొంత పొలము నాపేరున దాచివుంచింది. యిది కేవలము దేవుని ప్రణాళికగా భావించాను. ఆ స్థలము అమ్మిన సొమ్ముతో నా అమెరికా ప్రయాణమునకు అవసరమగు ఆర్థిక సహాయము లభించింది. మా నానమ్మకీ ఆలోచన కల్గుటకు కారణము ప్రభువు తెల్లని వస్త్రాలతో ఆమెను దర్శించి పూర్ణిమా కొరకు కొంత పొలము వ్రాయాలి. అది ఆమెకు ఉపయోగపడునని తెల్పారట.

ప్రభువు ప్రతి చిన్న అవసరాల పట్ల అతి జాగ్రత్త వహించే దేవుడని నమ్మాను. గొప్పరీతిగా నన్ను దీవించారు. ఆ తర్వాత నేను ఢిల్లీకి వీసాకై వెళ్ళాను. నా ప్రయాణ సమయంలో ఒక దైవజనుడు ప్రవచనాత్మకంగా “అమ్మా, నీకు దేవుడు స్వస్థతనిస్తున్నారు” అని తెల్పాడు. 2006లో మా నాన్న మరణము అక్టోబరులో సంభవించగా 2007లో మా తాతగారు అదే నెలలో మరణించారు. నేను క్రీస్తును నమ్ముకున్నాననియు, బొట్టు తీసివేసానని నా బంధువులతో చెప్పాను. చాలా విమర్శించి నిందించారు. అమ్మ మాత్రము ఏమీ అనలేదు. అమెరికా ప్రయాణ సమయమాసన్నమయింది. ఉపవాసముండి ప్రార్థించాను.

ఆ ఉపవాస కాలంలో ఒక దర్శనము చూచాను. తెల్లని వస్త్రాలతో ఒక వ్యక్తి నాతో మాట్లాడారు. "అమ్మా, ఎంత కాలము కనిపెడ్తావు. నేను నీ కోసము వేచియున్నాను" అని తెల్పారు. యిది కేవలము నీటి బాప్తీస్మముకై దేవుడు వేచియున్నాడని గ్రహించాను. ఆ తర్వాత అమెరికా ఒంటరిగా వెళ్ళాలంటే భయము కల్గింది.

ఆ రోజుల్లో దేవుని స్వరము మరలా వినిపించింది. "దేవుడు ఎల్లప్పుడు తోడుగానున్నాడు" ఆ మాట నాకు బహు ధైర్యము కల్గించింది. అమెరికా చేరి ట్రయినింగు పొందాను. ఆ రోజుల్లో దేవునికి మరింత సన్నిహితంగా జీవించుట కారంభించాను. మా రూమ్‌మేటు అన్నయ్య ప్రసాదుగారు ప్రతి సమయములో ప్రార్థించి ధైర్యం చెప్పేవారు.

మా అన్నయ్య భార్య నాతో చాలా సన్నిహితంగా వుండేది. వారికి పాప పుట్టింది. చాలా ఆనందించాను. అదే రోజుల్లో అక్టోబరు నెలలో యింటినుండి ఫోనువచ్చింది. అకస్మాత్తుగా మా వదిన చనిపోయిందన్న వార్త నన్ను చాలా బాధించింది. దు:ఖపడ్డాను. వరుసగా మూడు సంవత్సరాలుగా అక్టోబరు నెలలో 3 మరణాలు నన్ను కలవరపర్చాయి. చీకటిపట్ల భయం కల్గింది. నా స్వకీయులంతా నన్ను చాలా నిందించారు. క్రీస్తును నమ్మావు కద! ఈ కీడు ఎలా సంభవించింది? అని అడిగేవారు. నా క్లాసుమేటు క్రైస్తవుడు చైతన్య నన్ను పెండ్లి చేసుకోదలిచాడు. దేవుని సంపూర్ణ చిత్తమునకై కనిపెట్టాము. దైవజనుని ప్రవచనము ఆధారంగా సిద్ధపడ్డాము.

చైతన్య తన తల్లిదండ్రులతో సంప్రదించాడు. నేను అమ్మతో చెప్పాను. అమ్మ వ్యతిరేకించలేదు. నా పెండ్లికి నా బంధువులంతా వ్యతిరేఖించారు. యిష్టపడిన వారే పెండ్లికి రావచ్చునని తెల్పాను. నేను అమెరికా నుండి వచ్చాను. చైతన్యతో క్రైస్తవ వివాహము జరిగింది. ఆ తర్వాత హెచ్ 4 వీసాతో నా భర్త యు.ఎస్.ఎ. చేరాడు. ఎంతోకాలంగా ఆనందంగా వివాహము చేసుకొని ప్రభువు సంపూర్ణ చిత్తమునకై కనిపెట్టి చేసుకున్నా మా వివాహము జరిగిన కొంతకాలంలోనే నాకు తిరిగి జ్వరం ఆరంభమయింది. పెండ్లయిన ఒకటిన్నర నెలలో తీవ్ర రోగినయ్యాను. న్యుమోనియా, టి.బి. గతంలో వలె వ్యాధి తిరగబెట్టింది.

నా ఉద్యోగము విరమించుటకు వీలులేదు. జ్వర తీవ్రతతో ఉద్యోగము చేయవలసి వచ్చింది. నా గుండెకు రక్త ప్రసరణ అందుట లేదన్నారు. దేవుడు స్వస్థపరుస్తానని వాగ్ధానమిచ్చారు. నేను పూర్తిగా నమ్మాను. కానీ పెద్ద ఆస్పత్రిలో చేరాలని సలహాయిచ్చారు.

100% నా వ్యాధికి నివారణ లేదని డాక్టర్లు చెప్పారు. దేవునికి సమస్తము సాధ్యమేనని నేను నమ్మాను. మరలా ప్రార్థించు సమయంలో స్వరంతో ప్రభువు మాట్లాడారు.

"అమ్మా, నేనే కదా! నీ అవయవన్నీ నిర్మించాను" అని సూటిగా మాట్లాడారు. ఏది ఏమైనా సంపూర్ణంగా దేవునిపై ఆధారపడి నమ్మకంతో జీవించుట నేర్చుకున్నాను. గుండె ఆపరేషన్ చేయకపోతే ఒక్కొక్క భాగము పాడయిపోతుందని తెల్పారు. నా అంతము దగ్గరయిందా అని భావించాను కానీ, ఎవరో నా చేయిపట్టి లేవనెత్తుచున్నట్లు గమనించాను. ఆ సంఘటనతో నేను నా భర్త యిద్దరము కలిసి ప్రార్థించి సంపూర్ణ సమర్పణ చేసుకున్నాము.

ప్రార్థనా ఫలితంగా అంచెలంచెలుగా నాలో స్వస్థత చెందుచున్న మార్పును చూచాను. శారీరక స్వస్థతతో పాటు ఆత్మీయ స్వస్థతగా క్షమను నేర్పారు. సిలువచెంత నేను నా బాధల్ని పెట్టి నెమ్మది పొందాను. పూర్తిగా వాక్యంతో వాగ్దానాలపై ఆధారపడ్డాను. సంపూర్ణ స్వస్థత పొందానని చెప్పలేను గానీ అన్ని పదార్థాలు యిష్టంగా తినగల్గుచున్నాను.

ఆ తర్వాత 5 సంవత్సరాలు గడిచాయి. ఇండియా వెళ్తున్నాను. అక్కడ గొప్ప సాక్షిగా జీవించాలని నిర్ణయించుకున్నాను. నా నోరు తెరిచి అమ్మకు వాక్యం బోధించాను. అమ్మ విధేయతతో అంగీకరించింది. రక్షణపొంది బాప్తీస్మం తీసుకోగల్గింది. ఆత్మల రక్షణ భారం నాపై వున్నదని గ్రహించాను.

చైతన్య ఎంతో ప్రేమగలవాడిగా నా సంరక్షన భారం వహిస్తూ ఆదరణతో చూచుట దేవుని మహాకృపగా భావించి స్తుతిస్తాను. నేను నా భర్త చైతన్య అమెరికాలో స్థిరపడ్డాము. మంచి ప్రార్థనా సహవాసం లభించింది. యేసయ్య ప్రార్థనా సహవాసంలో నా సాక్ష్యము వివరించే భాగ్యం పొందుటను బట్టి దేవున్ని స్తుతించి కృతజ్ఞత సమర్పిస్తున్నాను. ప్రభువు నా సాక్ష్యమును దీవించునుగాక. ఆమెన్.

-------------

# 37. అమెరికా జీవితంలో కష్టాలను భరించే కృపనిచ్చి దీవించారు

– పరిమళ (అమెరికా)



**కీర్తనలు 91:4 "ఆయన తన రెక్కలతో నిన్ను కప్పును. ఆయన రెక్కల క్రింద నీకు ఆశ్రయము కట్టును".**

**పరిచయము:–** నా పేరు పరిమళ. ఆంధ్ర ప్రదేశ్‌లో ఏలూరు ప్రాంతంలో అమ్మ నాన్న టీచర్లుగా పని చేసేవారు. ఐజక్ గారు మేరీగారు నా తల్లిదండ్రులు. మంచి క్రమశిక్షణతో మమ్ములను పెంచారు. 6 మంది సంతానములో మధ్యగా పుట్టిన నేను గారాబంగా పెరిగాను. కష్టమంటే తెలియదు. అక్కలు యింటిపనులు చేసేవారు. మాకు ప్రత్యేకంగా ప్రార్ధనకు ఒక గది ఉండేది. టీచరు పనిచేస్తూ కూడా నాన్న దేవుని పరిచర్య చేసేవారు. అనుకోని రీతిగా అమెరికా సంబంధం వచ్చింది.

నా భర్తతో అమెరికా చేరాను. క్రొత్త వ్యక్తితో జీవితంతో పాటు క్రొత్త ప్రాంతములో జీవించాలంటే చాలా భయంగా ఉండేది. మా అమ్మకు కూడా మా ఊరివారు సహాయపడేవారు. నాకు అమెరికాలో ప్రతిపనిని స్వయంగా చేసుకోవాలంటే చాలా క్లిష్టంగా నుండేది. చాలా ఏడ్చేదాన్ని. పాస్టరుగారి సందేశాలు ఊరటనిచ్చేవి.

ప్రతి పనిలో నీ చిత్తం జరగాలి అని ప్రార్ధించుకోవాలి. ప్రతి అవసరంలో ప్రార్ధించాలి. కష్టాల్లో భయపడరాదు. ఎందుకీ కష్టం వచ్చింది. నాకు నిత్యము తోడుగా నుండు ప్రభువా అని ప్రార్ధించాలని నేర్పించారు. మా అమ్మ మాటలు చాలా ధైర్యం కల్గించేవి. దేవుని పై నమ్మకముంచాలి. నిత్య సన్నిధి అనుభవం కావాలి.

ఇశ్రాయేలీయులు కానాను యాత్రలో నిత్యము సన్నిధి, స్తుతి, ఆరాధనలతో గడిపారు. నేను కూడా నిత్యమూ ప్రార్ధించాలని నిర్ణయించుకున్నాను. అన్ని తలుపులు మూసుకుపోయినప్పుడు ఏదో ఒక ద్వారాన్ని తెరుస్తారు. నా భర్త ఆఫీసు పనికి వెళ్ళినప్పుడు నా ఒంటరి తనంలో దేవుని సన్నిధిని వెదకేదాన్ని. అమెరికా జీవితంలో యిద్దరు బిడ్డలు కల్గారు. సిజేరియన్ ఆపరేషన్లు జరిగాయి. ఒంటరిగా శ్రమను ఎదుర్కొన్నాను. $104^0$ జ్వరంలో బాధపడిన సమయాల్లో దేవునితోడు సన్నిధి ధైర్యమిచ్చింది. రకరకాల శోధనలు ఎదుర్కొన్నాము. ప్రభువే మాప్రక్క నుండి తప్పించారు.

**మొదటి శోధన :–** ఒక్క జీతంతో చిన్న కుటుంబము పోషిస్తూ గడిపే రోజుల్లో 700ల డాలర్లు టాక్స్ కట్టాలని నోటీసు అందింది. ఎందుకు కట్టాలో తెలియలేదు. తెలుగు వారంతా అమెరికా వారితో గొడవలు వద్దు మెల్లగా కట్టెయ్యాలి అన్నారు. మనుష్యుల సహాయము వ్యర్ధమని తలంచి యిద్దరము మోకరించి ప్రార్ధించాము. నా కయితే అమెరికా వారితో మాట్లాడే ఇంగ్లీషు రాదు. నా మాట వారికి అర్ధం కాదు. అయినను ధైర్యం తెచ్చుకొని ఫోనులో ఒక ఇంగ్లీషు మాట్లాడే స్త్రీని సంప్రదించాను. ఆమె చాలా ఓర్పుతో జవాబిచ్చింది. అమ్మా, ఇది గత సంవత్సరములో కట్టిన సొమ్ము. పొరపాటున పంపాము. మీరు తిరిగి కట్టనవసరము లేదని తెల్పింది. ప్రతి హృదయపు స్థితి దేవునికి తెలుసు. సమయోచిత సహాయం చేసి నన్ను ఆదరించి విడిపించారు.

**తెలుగు వారి పరిచయము:–** నాకయితే అమెరికా జీవితం అర్ధం కాలేదు. సరుకులు కొనుట తెలియదు. బట్టలు ఉతికే విధానము క్రొత్తగా ఉండేది. ఒక రెస్టారెంటులో మేము వున్నప్పుడు తెలుగుమాట విని ఒక ఆంటీ నన్ను సమీపించింది. నాతో నా యింటికి వచ్చింది. అమ్మా, నీకు ఈ అమెరికాలో పనులు తెలియదు కద! నేను సరుకులు కొనిపెట్టగలను అని అన్నీ తెచ్చి పెట్టేది. బట్టలు లాండ్రీ వేయుట నేర్పారు. చాలా మెళుకువలన్నీ నేర్పారు. రెస్ట్ రూము శుభ్రము చేయుట నేర్పారు. ఆ ప్రాంతములో నున్నవారు నన్ను అకారణంగా ద్వేషించి గొడవపెట్టుకొనేవారు. నాకు ఖంగారు కల్గేది.

మౌనంగా ప్రార్ధించుకొనేదాన్ని. పిల్లలు బయటకు వెళ్ళి ఆలస్యంగా వస్తే భయంతో ప్రార్ధించేదాన్ని. స్కూలులో సరిగ్గా ప్రవర్తిస్తున్నారో లేదో నన్న భయంతో ప్రార్ధించేదాన్ని. నిజము చెప్పుచున్నారో లేదోనని భయపడేదాన్ని. ఆలస్యంగా ఉద్యోగానికి వెళ్ళినందున ఉద్యోగంలో నుండి తీసివేసారు. ఎవరి ముందు చేయి చాపవద్దని ప్రభువు తెల్పారు. బంధువులు డబ్బులిస్తామని ముందుకు వచ్చారు. నిరాకరించేదాన్ని.

ప్రభువు నిత్యమూ నాకు తోడుగా నుండి ఆలోచన బోధించేవారు. నర్సింగ్ అనుభవం లేకపోయినా 5 సంవత్సరములు ఉద్యోగం లేని రోజుల్లో పిలిచి అద్భుతంగా ఉద్యోగాన్నిచ్చారు. మేము పని నేర్పించగలమన్నారు. అది దేవుని సంకల్పమని గ్రహించి స్తుతించాము. కొన్నిసార్లు బస్సులో ప్రయాణించవలసి వచ్చేది. రాత్రి 12 గం॥లు దాటినప్పుడు ప్రార్ధించగా సమయానికి బస్ పంపించి దేవుడే సమాయం చేసేవారు.

**1 పేతురు 5:6 "దేవుడు తగిన సమయమందు మిమ్మును హెచ్చించునట్లు ఆయన బలిష్టమైన చేతిక్రింద దీనమనస్కులై యుండుడి".**

దీన మనస్సు కల్గియుండుట నేర్పించారు. న్యూయార్క్‌లో యేసయ్య ప్రేయర్ సెల్‌కు పరిచయమయ్యాను. ఆ సహవాసంలో ఎన్నో సందేశాలను విని ఆత్మీయమేలు పొందాను. ప్రార్థించుట, సాక్ష్యమిచ్చుటలో క్రమము నేర్చుకున్నాను. మన మాట తీరు, మన ప్రవర్తననను బట్టి ప్రజలు మనల్ని గౌరవించగలరని గ్రహించాను. చెడ్డ మాటలందు లక్ష్యముంచక చిన్న పనులైనా శ్రద్ధగా చేయుట నేర్చుకున్నాను.

ఉద్యోగ సమయంలో భోజనానికి కొంత సమయముండేది. నేను ఒక్కదాన్నే దూరంగా నిలిచి బైబిలు చదువుకొనేదాన్ని. మిగిలిన వారంతా పిచ్చాపాటి గాసిప్పులు మాట్లాడుకొనేవారు. వారికి దూరంగా ఉండే ధన్యతనిచ్చారు. నన్ను చూస్తే మాటలన్నీ ఆపివేసేవారు. అవసరాల్లో ప్రార్థించమని అడిగేవారు. పనిచేసే స్థలములో ఘనపర్చేవారు. కేవలము దేవునిని గౌరవించి ఆయన ఆజ్ఞలను పాటించుటను బట్టి ప్రతి శోధనలో జయాన్నిచ్చారు. ఆత్మలో వర్థిల్లిన రీతినిబట్టి భర్తకు సంపూర్ణంగా లోబడాలని నేర్పించారు.

ఆస్పత్రిలో పనిచేయునప్పుడు ఆస్పత్రిలో మాస్కులు చిన్న చిన్న వస్తువులు యింటికి తెచ్చుకొనేదాన్ని. అందరూ చేస్తున్న పనే కద! అని సమర్థించుకొనేదాన్ని. ప్రభువు నేను చేస్తున్న పనులన్నీ తప్పు అని గద్దించారు. అది ఆస్పత్రి సొమ్మని తెలిపారు. అప్పటినుండి కొనుక్కొని తెచ్చుకుంటున్నాను. ఎన్నో విషయాలు బోధించేవారు. వాటిని సరిచేసుకొనుచూ యదార్ధ హృదయంతో దేవున్ని సేవించుట నేర్చుకుంటున్నాను. ఉద్యోగము పోయిన రోజుల్లో ఆయన సన్నిధిలో ఎన్నో ఆత్మీయ పాఠాలు నేర్చుకొనే తరుణాలు అందించి బలపర్చారు.

ప్రభువు నాపట్ల చేసిన మేలులను బట్టి కృతజ్ఞత కల్గియున్నాను. అంచెలంచెలుగా దీవించి కాపాడు నా ప్రభువునకేమి చెల్లించగలను? రక్షణ పాత్రను చేబూని నా హృదయాంతరంగాల్లో నుండి పెల్లుబికే కృతజ్ఞతతో స్తుతించి ఆరాధిస్తున్నాను. ఎన్నికలేని నా జీవితంలో మారుమూల గ్రామంలో అనామకంగా గడిపిన నన్ను అమెరికా దేశంలో జీవింపజేసారు. ఎన్నో మెళకువలను నేర్పించారు. లోకాశలకు, శోధనలకు లొంగకుండా క్రీస్తును అనుసరించే విశ్వాసిగా నన్ను నిలిపారు. మంచి ప్రార్థనా సహవాసాన్నిచ్చి దీవించారు. యేసును వెంబడించుటలో ఎన్నో దీవెనలు సంప్రాప్తించ గల విశ్వాసాన్నిచ్చారు.

ప్రియ చదువరీ, నా సాక్ష్యము అంత ప్రాముఖ్యత గలది కాకపోవచ్చును గాని యదార్థతతో జీవించుటలో విజయాన్ని సాధించిన నా అనుభవము యితరులకు ఆదర్శంగా నుంటుందని ఆ దేవున్ని ప్రార్థిస్తున్నాను. దేవుని దీవెనలు కల్గుగాక. ఆమెన్.

---------

# 38. మరణ పాత్రుడనైయున్న నన్ను రక్షించి క్రీస్తు రాయబారిగా మార్చారు

– సుధీర్ కొండ్రు (విజయవాడ/అమెరికా, న్యూజెర్సీ)



**లూకా 4:18,19 "ప్రభువు ఆత్మ నామీద వున్నది. బీదలకు సువార్త ప్రకటించుటకై ఆయన నన్ను అభిషేకించెను. చెరలోనున్న వారికి విడుదలను, గ్రుడ్డివారికి చూపును, నలిగిన వారిని విడిపించుటకును, ప్రభువు హితవత్సరము ప్రకటించుటకును ఆయన నన్ను పంపియున్నాడు".**

**పరిచయము:–** ప్రభువు నామములో మీకు నా శుభాకాంక్షలు. క్రీస్తు కొరకు సేవచేస్తూ సాక్షిగా జీవించే అద్భుత జీవితాన్ని ప్రభువిచ్చినందున కృతజ్ఞత కల్గియున్నాను. నేను మంచి క్రైస్తవ కుటుంబములో జన్మించాను. నా జీవితము మా నానమ్మ గారి భక్తి జీవితం వల్ల ప్రభావితమైనది. ఆమెది అచంచల భక్తి, ఆమె అవిరామంగా హిందువులు, ముస్లిము జనాంగాలలో గణనీయమైన సువార్త సేవ చేసేవారు.

నటభై సంవత్సరాలుగా మచిలీపట్నము కృష్ణాజిల్లాలో గుర్తింపు గల సేవచేసారు. క్రైస్తవ జీవితంలో అ ఆ లు మొదలు గొప్ప ఆత్మీయ జ్ఞానాన్ని ప్రసాదించిన ఆ పుణ్యమూర్తి దయవల్ల నాలో ఆధ్యాత్మికత నిలిచింది.

ఆమె నేర్పిన ఆత్మీయ పాఠాలు నన్ను నేడు అమెరికాలో వేదాంత విద్యనభ్యసించే స్థాయికి ఎదిగాను. మా నాన్నగారు గవర్నమెంటులో పబ్లిక్ రిలేషన్ ఆఫీసులో పనిచేస్తూ నేను మా నాన్నగారితో కలిసి క్రీస్తు సువార్త సేవను జరిగించగల్గుచున్నాము. నా తల్లి ప్రార్ధనల ఫలితంగా నేను భక్తిగల జీవితాన్ని గడిపే ధన్యత పొందగల్గాను. ఆమె యింటిపనులు చూచుకొనుచూ, మా సువార్త సేవతోపాటు అనేకుల మానసిక, ఆధ్యాత్మిక నిత్యవసరాలలో అనేక అభాగ్యులకు సహాయపడుటకు కృషిచేస్తూనే ఉంది. నాకున్న అన్నయ్య, తమ్ముడు కూడా దైవసేవలో పూర్తిగా నిమగ్నులయ్యారు. మేము యెహోషువా వలె యింటివారంతా దేవుని పరిచారకులము.

నా జీవితమంతా తల్లి దండ్రులు, పెద్దలకు లోబడి, అందరి దయచే చక్కగా చదువుకోగల్గాను. ఇంటరు రెండవ సంవత్సరము చదువుకొనే రోజుల్లో మచిలీపట్నంలో

నున్న మంగెనపూడి బీచ్‌లో సముద్ర స్నానం చేయుటకు వెళ్ళాను. నా స్నేహితులతో సర్దాగా సముద్రంలో స్నానం చేస్తున్న సమయంలో ఒక పెద్ద అల నన్ను తాకింది. నన్ను లోపల వున్న సుడిగుండంలోకి తీసుకొని వెళ్ళే ప్రమాదస్థితిలో ఉన్న నాకిక మరణము తప్పదని గ్రహించాను. మా నానమ్మ బోధనలన్నీ జ్ఞాపకం వచ్చాయి. ఆపత్కాలములో నమ్ముకొనదగిన దేవుడికి మొఱ్ఱపెట్టాలి.

**కీర్తనలు 91:16 "శ్రమలో నేనతనికి తోడైయుండెదను. అతనిని విడిపించి అతని గొప్ప చేసెదను. దీర్ఘాయువు చేత అతనిని తృప్తిపరచెదను. నా రక్షణ అతనికి చూపించెదను".**

బాల్యములో నా యింట్లో కీర్తనలు 1, 23, 91, 133 అధ్యాయాలలో నున్న వాక్యాలన్నీ కంఠస్థము చేయగా నాకు చాలా గుర్తుండి పోయాయి. సుడిగుండంలో చిక్కుకొని తీవ్రమైన మరణపు అంచులో నున్న నాకు జ్ఞాపకం వచ్చిన వాక్యాన్ని వల్లిస్తూ, ప్రభువా నన్ను రక్షించు, బ్రతికించు అని ఎలుగెత్తి ప్రార్థించాను.

మేము నమ్మిన ప్రభువు అద్భుత కార్యాలు చేయగలరని నా నమ్మిక వమ్ముకాలేదు. ఆ క్షణంలో అదృశ్య హస్తము నన్ను ఆ సముద్ర తీరాన్ని ఒడ్డుకు చేర్చింది. కేవలము మేము నమ్మిన దేవుడు నాకు ఆపత్కాలములో సహాయకుడై నన్ను మరణము నుండి తప్పించారు. ఆరోజే నా యవ్వన కాలంలో నేను దేవుని యెదుట తీర్మానము చేసుకొన్నదేమనగా, నా జీవితకాలమంతా నన్ను మరణములనుండి బ్రతికించిన నా రక్షకునిని నమ్మకంగా సేవించి బలమైన సాక్షిగా ఆయనను మహిమపర్చుటకే నా జీవితాన్ని అంకితము చేయదలచాను.

విజయవాడకు సమీప గ్రామలు గనుక అమాయక ప్రజలమధ్య సువార్త అందని ప్రాంతాల్లో, క్రీస్తు అంటే తెలియని హిందువులు, ముస్లిమ్ ప్రజల మధ్య, లోకస్తులైన నామకార్థ క్రైస్తవుల మధ్య

ఉజ్జీవము రప్పించునట్లు ప్రార్థన చేసి, పరిచర్యలను కొనసాగిస్తున్నాము.

నా విద్యాభ్యాసము నాగార్జున విశ్వవిద్యాలయంలో ఇంగ్లీషు లిటరేచర్ నందు ఎం.ఎ.డిగ్రీతో పాటు బి.టి.హెచ్. తర్వాత ఎమ్.టి.హెచ్. కోర్సు అమెరికాలో న్యూయార్కులో కొనసాగిస్తున్నాను. న్యూజెర్సీలో అభిషేకింపబడిన పాస్టరుగా సేవచేయగల్గుచున్నాను. 34 పాటలు వ్రాయుట, వాయిద్యాలు ఉపయోగిస్తూ దైవారాధన జరిగించుట, బైబిలు సందేశాలు బోధించుట, వ్యక్తిగత సువార్త సేవలో సాగిపోతున్నాను.

ఈ తరంలో  యువకుల మధ్య సేవచేయు ఆసక్తి కల్గియున్నాను. అయ్యో, సువార్త ప్రకటించనిచో నాకు శ్రమ అని పౌలు మాటలు నాకు స్ఫూర్తినిస్తున్నాయి.

అది 2003వ సంవత్సరములో 17 సంవత్సరాల వయస్సులో దేవుని సన్నిధి అనుభవించి ప్రమాదము నుండి విడుదల తర్వాత రక్షణ లేని అనేకుల మధ్య నా సాక్ష్యము చెప్పుట కారంభించాను. దేవుడిచ్చిన తలాంతులను బట్టి ఉన్నత విద్యను వేదాంతపరంగా చదువుటకు అమెరికాలో న్యూయార్కులో నుండుట ప్రభువు చిత్తమని భావించి స్తుతించుచున్నాను. స్థానిక అమెరికాలో విశ్వాసుల సహకారాన్ని బట్టి దేవున్ని స్తుతిస్తున్నాను.

గత 5 సంవత్సరాలుగా విజయవాడలో సేవను నా కుటుంబీకులతో ప్రారంభించిన సంస్థను చాలా విజయవంతంగా కొనసాగించుట ప్రభుని కృపగా భావిస్తున్నాను. బ్యూమ్స్ ద వర్షిప్ సెంటరు  (Booms the Worship Center) దేవుని కొరకీ సంస్థను స్థాపించాను. యీ పరిచర్యలు మూడు స్థలాలలో కొనసాగిస్తున్నాము. కంద్రిక, కామయ్యతోపు, వణుకూరు.

నేను నా కుటుంబము నిర్వహించుప బ్లూమ్స్ ఇంటర్ నేషనల్ మినిస్ట్రీ కార్యక్రమాల్లో 10 సంవత్సరాలుగా స్థానిక గ్రామాలలోనే కాక వెబ్‌సైట్ ద్వారా అనేక దేశాలలో మా పరిచర్య వివరాలన్నీ అందించగల్గి ప్రార్ధన సహవాసము కల్గియున్నాను. క్రైస్తవ సదస్సులలో, ఉజ్జీవకూటాలలో నావంతు ఆరాధన, పాటల ద్వారా, వాయిద్యముల ద్వారా, ప్రసంగాల ద్వారా దేవున్ని ఘనపర్చుటలో ఆనందిస్తున్నాను.

నేడు న్యూజెర్సీ సిటీలో వర్షిప్ లీడరుగా (Worship Leader) వ్యవహరిస్తున్నాను. మాస్టర్స్ డిగ్రీ వేదాంత పరంగా నాకోర్సు ముగించుటలో నిమగ్నమయ్యాను. నా బాల్యములో మంచి తల్లిదండ్రులు, తాతలు, నానమ్మ, అమ్మమ్మల క్రైస్తవ తర్ఫీదులో ప్రభువు దయలో పెరిగి నేడు అమెరికాలో చదువు భాగ్యాన్ని పొంది ఒక సంస్థను స్థాపించే స్థాయికి నా ప్రభువు నన్ను నిలుపుట, అనేక మందికి అన్ని అవసరాల్లో చేదోడుగా నుంటూ సువార్త ప్రకటిస్తూ నేను నా స్వకీయులలో చేయు సేవను ప్రభువు విజయవంతంగా కొనసాగిస్తున్నారు. మాసేవకై ప్రార్ధించండి. మీ కోసం ప్రార్ధించగలము. నా చిరునామా

సెల్ 917-924-6037 USA

ఇమెయిల్ : sudheer@bloomsglobal.org
Website : www.bloomsglobal.org

# 39. శూన్యంలో సృష్టిని చేసిన దేవుడే నన్ను లేమినుండి లేవనెత్తాడు

– శ్యామ్ (సత్యవేడు/చిత్తూరుజిల్లా)

**కీర్తనలు 91:15 "అతడు నాకు మొఱ్ఱపెట్టగా నేనతనికి ఉత్తరమిచ్చెదను. శ్రమలో నేనతనికి తోడై యుండెదను"**



**పరిచయము:–** అన్యులమైన మేము కన్యాకుమారి సమీపాన చిన్నగ్రామంలో జీవించేవారము. మా నాన్నగారికి చాలా పెద్ద వ్యాపారముండేది. ఆస్తిని బట్టి స్నేహాలు ఎక్కువయ్యాయి. దురలవాటులు చేరాయి. త్రాగుడు వల్ల హారతి కర్పూరమువలె మా ఆస్తిమొత్తము హరించుకుపోయింది. నాన్న వ్యసనాలకు బానిసైనందున మా కుటుంబమంతా బానిసలుగా పేదవారిగా మిగిలాము. సమస్తమూ కోల్పోయాము. మా తల్లి పిల్లలము ఒంటరిగా వేదనతో కుమిలిపోయేవారము. 24 గంటలూ త్రాగి యిల్లు విడిచి బాధ్యతలు విస్మరించిన నాన్నను బట్టి దు:ఖించేవారము.

మా తల్లి నగలన్నీ అమ్మివేసింది. మంగళసూత్రము మిగిలింది. యింట్లో శాంతి, సమాధానము కరువయింది. ఎడారి వలె మోడుబారిన వారిగా మిగిలాము. మా స్నేహితుల ముందు మా జీవితం అవమానము పాలయ్యేది. త్రాగుబోతు కుటుంబమనే హేళనలకు తట్టుకోలేక ఆ ఊరు వదిలి దూరంగా వెళ్ళిపోవాలని నిర్ణయించుకున్నాము. బంధువులంతా త్రాగుడు మానెయ్యమని చెప్పినప్పటికీ మానాన్న వినలేదు. తమిళనాడులో మారుమూలనున్న ఒక ప్రాంతం చేరాము. ప్రాంతము మారినా మా పరిస్థితులేమీ మారలేదు.

అమ్మ మంగళసూత్రాలు అమ్మిన డబ్బుతో వ్యాపారమారంభించినప్పటికీ నాన్న మారనందున మరలా మేము మొదటి పరిస్థితికి వచ్చాము. కనబడిన దేవాలయాలలో ప్రతి దేవుళ్ళనూ పూజించి కనికరించమని ఏడ్చేవారము. నవగ్రహాలను కూడా పూజించాము. అమ్మ నాన్న కూడా తినుటకు ఆహారము లేక, బాధలు పడలేక అందరం కలిసి మరణించాలని తీర్మానించాము. మేము ఐదుమంది కలిసి విషము తీసుకొని చనిపోవుటకు ముందు మా అన్నయ్య వెంటనే చెప్పినదేమనగా "మనము చనిపోవుట తగదు నా స్నేహితుడు చెప్పినదేమనగా క్రైస్తవుల దేవుడు చాలా మంచివాడు. కష్టాలలో ఆదుకొనేవాడు. వ్యాధులను స్వస్థపర్చి అద్భుతాలు చేస్తాడు. నేనే మార్గం, సత్యం, జీవమని చెప్పి ధైర్యమిస్తాడని తెల్పాడు.

అంతేకాదు ఎన్నో దేవతలను ఆరాధించి చూచాము. ఎవరూ మన కష్టాలలో ఆదుకోలేదు. ఇక నా స్నేహితుడు చెప్పిన దేవుడు యేసుక్రీస్తును నమ్మి చూద్దామన్నాడు. ఆ తర్వాత ఒక క్రైస్తవ సోదరుడు మా యింటికి వచ్చి, మా పరిస్థితిని గమనించి, మీకోసం ప్రార్థన చేస్తాము. యేసు ప్రభువును ఆశ్రయించండి. మీ జీవితములో అద్భుతాలు తప్పక చూస్తారని అభయమిచ్చి, సువార్త బోధించి బైబిలును ఇచ్చి వెళ్ళారు. మేము వదిలి వచ్చిన ప్రాంతము తిరిగి రండని కూడా చెప్పాడు. ఆ ప్రాంతంలో ఎవరూ మమ్ములను ఆదుకోలేదు. కాని క్రైస్తవుల సలహా మేరకు తిరిగి ఆ స్థలము చేరాము.

తినటానికి ఆహారము కూడా లేదని చెప్పాము. అనుకోనిరీతిగా క్రీస్తును అనుసరించాలన్న తలంపు కలిగిన వెంటనే గతంలో మేము చెల్లించిన చీటీకి సంబంధించిన వారు 2వేలు రూపాయిల చీటీలో 200 ఉంచుకొని 1800 రూపాయిలు యిస్తామన్నారు. క్రైస్తవ సోదరులు మా కొరకు ప్రార్థించి, చిన్న వ్యాపారము ఆరంభించండని చెప్పారు. వారు ప్రోత్సహించిన ఫలితంగా మొదటి అద్భుతము ఆరంభమయింది. 100రూాల అద్దెకు ఒకచిన్న యిల్లు తీసుకొన్నాము. 400ల రూ॥లతో సరుకులు కొన్నాము. 1400రూ॥లు మాకు మిగిలాయి. ప్రతివస్తువు అరకిలో చొప్పున కొని ప్రార్థనా పూర్వకంగా కొట్టు తెరిచాము. ఆనందకరమైన నూతన జీవితమును ప్రారంభించాము.

నీవు నిజమైన దేవునిగా మా కుటుంబాన్ని దీవించి, అనేకులకు ఆశీర్వాదకరంగా మార్చు అని ప్రార్థించాము. క్రీస్తును నమ్మి చేస్తున్న వ్యాపారము ఫలించింది. గతంలో పారిపోయి వచ్చిన స్థలములో బంధువులు మమ్ములను వారి వివాహ వేడుకలకు స్వయంగా చార్జీలు యిచ్చి రమ్మని ఆహ్వానించారు. మా అమ్మ నాన్న, మా ఏకైక చెల్లి ముగ్గురు ఆ ఊరు వెళ్ళి బస్సు దిగగానే గతంలో అప్పులవారు ఎదురయ్యారు. “మా అప్పు తీర్చకుండా పారిపోయారేమి? అని అపహాస్యము చేయగా మా చెల్లికున్న కమ్మెలు, ముక్కుపుడక తీసి యిచ్చివేసారట. సరేనని బంధువుల యింటికి వెళ్ళారు. అక్కడ మా నాన్న సోదరుడు కన్పించాడు.

“సిగ్గులేని త్రాగుబోతా, నీవు నీ బిడ్డకున్న కొంచెము బంగారము కాస్త ఇచ్చివేసి అప్పు తీర్చవా?” అని అవమానపర్చాడు. నీవు నీ బిడ్డ పెండ్లి ఎలా చేస్తావో చూస్తాము. నీవు మగవాడివైతే 5 నవర్సల బంగారమిచ్చి పెండ్లిచేయగలవా? మేమయితే 50 నవర్సలతో ఘనంగా మా బిడ్డల పెండ్లి చేయగలము. త్రాగుబోతుగా జీవించుటకు సిగ్గుపడవా” అన్నాడు.

యీ విషయాలన్నీ విన్న తర్వాత మా హృదయాలు అవమానంతో కృంగిపోయాయి. దేవుని ముందు మా జీవితాలు అప్పగించి వినయంతో ప్రార్థించి ధైర్యము తెచ్చుకున్నాము. ఆయన క్రమంగా మా జీవితాలను హెచ్చించి దీవించారు. ఆర్థికంగా మా జీవితాలు స్థిరపడ్డాయి. క్రీస్తును ప్రేమిస్తూ క్రమంగా ఆరాధనలలో పాల్గొంటూ విశ్వాసులుగా మారాము.

కేవలం 1400 రూపాయిలతో వ్యాపారం ఆరంభించిన మేము దేవుని కృపను బట్టి మా చెల్లికి 50 నవర్సల బంగారమిచ్చి మంచి విశ్వాసికి ఇచ్చి వివాహము చేసాము. మా చెల్లి మంచి సాక్షిగా ఆనందంగా జీవిస్తుంది. త్రాగుబోతు కుటుంబమని అవమానించిన వారి మధ్య మమ్ములను ప్రభువు దీవించారు. ఏ బలము, చదువు, జ్ఞానములేని మాకు దేవుడు ఆయన బలాన్ని, శక్తిని ప్రదర్శించి జ్ఞానంతో నింపి మమ్ములను ఆశీర్వదించి, ప్రతి అనుభవంలో చాలిన దేవుడుగా మంచి కాపరిగా పోషించుచున్నారు.

అవమానించిన చోట, మా బంధువుల మధ్య రెట్టింపు దీవెనలతో హెచ్చించి ఘనపర్చారు. ఎన్నికలేని అన్యుల వంశంలో నుండి వెదకి రక్షించి మాకు బ్రతుకు ప్రసాదించారు. ప్రభువునకు మతము, కులము, పేదా, గొప్ప అనే తేడాలేదు. ప్రతి వ్యక్తి కొరకు ప్రాణము పెట్టిన రక్షకుడు. నా సాక్ష్యము చదువు వారంతా వాస్తవమును గ్రహించి క్రీస్తే నిజదేవుడని నమ్మి సాక్షులుగా జీవించి ప్రభువును ఘనపర్చాలని నా ప్రార్థన.

"ప్రియ ప్రభువా, నజరేయుడయిన యేసయ్యా, మా జీవితాలను భయంకర బానిసత్యంలోనుండి, హేళనలనుండి సంరక్షించి దీవించావు. నీవే తరతరములకు దేవుడవు. అన్యులైన అనేకులు నిన్ను తెలుసుకొని నిన్ను సేవించు ధన్యతనీయండి. అందరినీ దీవించండి. మా జీవితాలను వెలిగించిన ప్రభువా నీ పాదాలకు వందనాలు సమర్పిస్తున్నాను. యేసునామంలో ప్రార్థిస్తున్నాను. ఆమెన్. వెదకి నన్ను రక్షించితివి. వెంబడించగ పిలిచితివి. రోత బ్రతుకును మార్చితివి. నీదు సుతునిగా చేసితివి. నా ప్రాణనాథుడా, నాకై ప్రాణమిచ్చితివి. నేను నీవాడనో యేసయ్యా.... ఏరీతి స్తుతియింతునో! ఏ రీతిగా సేవింతునో – ప్రభు

ప్రభువునందు మీ సహోదరుడు
శ్యామ్, సత్యవేడు, చిత్తూరు జిల్లా.
నా సెల్ 9948547279

-----------------

# ౪౦. బాధపడితే గాని బోధపడలేదు

నిరీక్షణ్‌పాల్ (మానిసెట్టి లక్ష్మణరావు) (కొవ్వూరు)
ఫోన్ : 9701167024

**యిర్మియా 33:3 "నాకు మొఱ్ఱపెట్టుము. నేను నీకు ఉత్తరమిచ్చెదను. నీవు గ్రహింపలేని గొప్ప సంగతులను, గూఢమైన సంగతులను నీకు తెలియజేతును.**



**పరిచయము:-** సర్వాధికారియైన నా ప్రభువు యీ సాక్ష్యాన్ని మీకందించే సదవకాశాన్ని యిచ్చినందున నా నిండు కృతజ్ఞతలు. చదువుచున్న మీకు నా వందనాలు. నా అసలు పేరు మానిసెట్టి లక్ష్మణరావు. ప్రభువును తెలిసుకొని బాప్తీస్మ అనుభవం తర్వాత నిరీక్షణ్ పాల్‌గా నిలిచాను. నేను పశ్చిమగోదావరి జిల్లాలో కొవ్వూరు సమీపానగల కుగ్రామమైన ఆరిక రేవులో జన్మించాను. నలుగురి సంతానంలో రెండవ వాడిని. గల గల పారే గోదావరి నది తీరమున అందమైన ప్రకృతి గల ప్రాంతంలో జన్మించాను.

కల్లుగీసే వంశంలో హైందవుడిగా జన్మించిన నేను క్రైస్తవునిగా ఎలా మారాను? ఎందుకు మారాను? క్రీస్తే రక్షకుడు, పాపవిమోచకుడు, పరలోకం అందించే గొప్ప దేవుడని చాటి సాక్ష్యము చెప్పు దైవసేవకునిగా ఎలా మారాను? యీ వివరాలన్నీ మీతో పంచుకొనుటకు ఇష్ట పడుచున్నాను. తింటేగానీ రుచితెలియదు. దిగితేగాని లోతు తెలియదు. నా బాల్యంలోనే అనగా 5 సంవత్సరముల వయస్సులో నాన్న మరణించగా మా అమ్మమ్మ తాతయ్యలైన రత్తమ్మ సూరయ్యల పెంపకంలో పెరిగాను. చదువుకొనే అవకాశము లేనందున నన్ను పశువుల కాపరిగా నియమించారు.

నా పరిస్థితి చూచి మా పెద్దమ్మ కుమారుడు నన్ను విజయవాడకు రమ్మని పిలిచాడు. ఒకచిన్న హొటలులో కప్పులుకడిగే పనికి అప్పగించాడు. ఉదయాన్నే లేచి సాయంత్రం వరకు పని చేయవలసి వచ్చేది. కాళ్ళు పాచిపట్టి బాధపెట్టే పసుపురాసుకొనేవాడిని. నిద్ర పట్టేదికాదు. రోడ్డుమీద పండుకొన్నప్పుడు పోలీసువారు బాధించేవారు. నాకు తండ్రిలేదు. అమ్మ పట్టించుకోలేదని బాగా ఏడ్చేవాడిని.

ఆ తర్వాత మా పితరుల ప్రాంతము ఔరంగబాదు చేరాను. పెండ్లి వయస్సు వచ్చినందున వివాహము చేసుకొనుటకు ప్రయత్నించినప్పుడు, కప్పులు కడుగుకొనే పేదవాడికి, చదువులేని వాడికి పిల్ల నివ్వమనేవారు. చాలా అవమానాలు ఎదుర్కొన్నాను. తిరిగి విజయవాడ చేరాను. శ్రద్ధగా పనిచేసి వంటనేర్చుకున్నాను. చివరికు అమలేశ్వరితో నాకు వివాహము జరిగింది. యిద్దరు బిడ్డలు కల్గారు.

మొదట పాప తర్వాత బాబు పుట్టారు. వంట మాష్టారినయ్యాను. చిన్న యిల్లు కొనుక్కున్నాను. విజయవాడ పూర్ణానందపేటలో స్థిరపడ్డాను. ప్రతిరోజూ ఒక్కొక్క దేవుని, దేవతను పూజించేవాడిని. శివుడు, సాయిబాబా, దుర్గ నా యిష్ట దైవాలు. నా పెండ్లయ్యాక మా అమ్మ నా దగ్గరకు రావడం ప్రారంభించింది.

ఆమెకు ఎవరో క్రీస్తుసువార్త బోధించగా ఆమె క్రీస్తును తన దేవునిగా అంగీకరించి ప్రార్థించుకొనేది. నాకు కూడా క్రీస్తు మంచి దేవుడనియు అవసరాల్లో ఆదుకుంటాడని చెప్పేది. ఆమె మాట లెక్కచేయక చాలా కోపముతో మండిపడేవాడిని. నాకోసం చీకటిగదిలో ఏడ్చి ప్రార్థించేది. నాకోసం ఏడుస్తుందేమిటి? అని ఆశ్చర్యపడేవాడిని. డబ్బు సంపాదించుటకు అదనంగా పార్టుటైము ఉద్యోగములో ఫోటో గ్రాఫరుగా పనిచేసేవాడిని. ఆ సమయంలో నాకు అకస్మాత్తుగా టయిఫాయిడ్ జ్వరంవచ్చి తీవ్రంగా బాధపడ్డాను.

నేను ఆస్పత్రిలో చేరాను. మా అమ్మ నాదగ్గరకు ప్రార్థన నూనెతెచ్చి ప్రార్థించింది. నేను చాలా బలహీన స్థితిలో నున్నాను. నమ్మితే దేవునిమహిమ చూస్తావు. నీ జ్వరం తగ్గుతుందని అమ్మ నాకు ధైర్యము చెప్పి యేసునుగూర్చి వివరించింది.

**ప్రభువుతో పరిచయము:–** మా అమ్మ ప్రార్థన నన్ను తాకింది. ఆమె విశ్వాస సహిత ప్రార్థన రోగినైన నన్ను తాకినందున గొప్ప వెలుగునని నేను చూచాను. అమ్మ ఆమెన్ అనేసరికి నాకు క్రీస్తునందు నమ్మకము కల్గింది. రూతు గ్రంథములో నున్న మాట నాకు తెలియకయె, “అమ్మా, ఇకనుండి నీ దేవుడే నా దేవుడు” అని తెల్పాను. మా అమ్మ చాలా సంతోషపడి దేవుని స్తుతించింది.

నేను అమ్మ క్రీస్తును నమ్ముట చూచిన నా భార్యకు మా విశ్వాసము నచ్చలేదు. అయినను నేను ధైర్యంగా నా పాపాలన్నీ దేవుని దగ్గర ఒప్పుకొని 2003లో బాప్తీస్మము తీసుకొని పేరుమార్చుకున్నాను. ఆ తర్వాత శోధనలు ఆవరించగా చాలా ఇబ్బందుల

పాలయ్యాను. మా సంఘ సహవాసంలో నున్న సిస్టరు శశికళగారు ఒకసారి నాతో చెప్పి హెచ్చరించిన దేమనగా నీ వద్దనున్న పెట్టెలో పాపం దాగివున్నట్లు ప్రభువు నాకు బయలుపర్చు చున్నారు. వెళ్ళి చూడు అని తెల్పింది. ఇంటికి వెళ్ళి చూచినప్పుడు మా ఇంటిలో నున్న పెట్టెలో కొన్ని విగ్రహాలు కనబడ్డాయి. వెంటనే వాటిని తీసి పారవేసాను. ఆపదలో నున్న వారికి సహాయము చేయుటకు వెనుకాడే వాడను కాను. అలా చాలా మందికి అప్పులు యిప్పించి మధ్యవర్తిగా సంతకాలు చేసాను. వారంతా మోసంచేసి అప్పు తీర్చనందువల్ల ఆ భారం నాపై పడింది. లక్షా పదివేలు నేను కట్టవలసి వచ్చింది. అప్పులు తీర్చుటకు నాయిల్లు అమ్మివేసాను

ఆ రోజుల్లో సంఘ సహవాసిగానున్న శశికళ సిస్టరు నన్నుచేరి, “నీవు కష్టాలలో నిబ్బరంగా నిలిస్తే దేవుని సేవకు ఆయన వాడుకుంటాడు. మంచి సాక్షిగా నుంటావని” ప్రవచనం చెప్పింది. ఆ రోజుల్లో  మా అత్తగారు పక్షవాతం బారిన పడినప్పుడు ఎవరో క్రీస్తు నామంలో ప్రార్థించగా స్వస్థతపొందింది. ఆ రక్షణ కార్యం, ఆమెలో నా భార్యలో జరిగి క్రీస్తు విశ్వాసిగా మారుట నా భాగ్యమైనది. యిద్దరము కలిసి ప్రార్థించుట కారంభించాము. “ప్రభువా, అవసరాల్లో ఎలియాను ఆహారంతో పోషించావు కదా! ఈ స్థితిలో మా కుటుంబాన్ని ఆదుకొని పోషించండి” అని ప్రార్థించిన వెంటనే, మాకు సహాయము చేయుటకు పైడమ్మ అనే విశ్వాసి ఆహారముతో మాకెదురుగా నిల్చింది.

ఆమె ఆ రోజునుండి నెల రోజులుగా మమ్ములను పోషించింది. దేవుడు మా దీన ప్రార్థనల నాలకించినందుకు స్తుతించి కృతజ్ఞత చెల్లించాము. నాకు గతంలోని ఒక అనుభవం జ్ఞాపకం వచ్చింది. దేవునిని తెలుసుకొనని రోజుల్లో అనుకోని రీతిగా పాస్టరు మార్కుగారి సాక్ష్యము విన్నాను. అది కట్టుకథ, మనుష్యులను మోసగిస్తున్నారని ఆయనను ఎగతాళి చేసినరోజు గుర్తుకు వచ్చింది.

ఆయన ఒకరోజు చాలా యిబ్బందిపడే రోజుల్లో కుమారుడు ఆకలితో యిడ్లీ కొనుక్కుంటాను అర్ధరూపాయి కావాలి నాన్నా అని అడిగితే యిచ్చే స్థితిలో లేక ఏడ్చి దేవునికి మొఱ్ఱపెట్టాడట. ప్రార్థించి కళ్ళు తెరిచిన వెంటనే పాలగ్లాసులో పాలు, యిడ్లీ పొట్లాము పట్టుకొని ఒకవ్యక్తి నిలిచి వున్నాడట. నేనారోజు నమ్మలేదు. నాకు పైడమ్మ తెచ్చిన ఆహారాన్ని చూచి గతంలో మార్కుగారిని నమ్మనందుకు సిగ్గుపడ్డాను. ఎవరైనా

సాక్ష్యము చెప్పినప్పుడు అబద్ధాలని తలంచక నమ్మాలి. వేదనలలో, శ్రమలలో, కష్టాలలో ప్రార్థించగానే జవాబు యిచ్చే దేవుని వాగ్దానాన్ని నమ్మాలి.

**యిర్మీయా 33:3** ను దేవునికిచ్చే టెలిగ్రాము ప్రార్థన అని అంటారు. నా స్నేహితులకివ్వవలసిన అప్పుతీర్చమని దేవున్ని ప్రార్థించాను. గతంలో నేను పెట్టుబడి పెట్టిన సొమ్ము అద్భుతరీతిగా చెక్కు రూపంలో చేరింది. అది తీర్చుట దేవుని దయగా గుర్తించాను.

**శ్రమలు అధికమగుట ఆత్మహత్యా ప్రయత్నము:–** నాకు అప్పులబాధ అధికమైనందున చాలా దు:ఖముతో ప్రార్థించుచున్నప్పుడు కన్నీరు ధారాపాతంగా కారేసమయంలో ఆమెన్ చెప్పి కన్ను మూయగానే పైన ఒక సిలువ ఆకారము కన్పించింది. వెంటనే మెల్లని స్వరం వినిపించింది. “నా కృప నీకు చాలును. నేను నిన్ను అప్పులు చేయమని చెప్పానా? చనిపోమని చెప్పనా? నీ ఉత్తరము నీ మాత్రలు తీసుకొని దైవజనుడైన సత్యానందం గారి దగ్గరకు వెళ్ళు” యీ మాటలు అతి స్పష్టంగా విన్పించాయి. యీ దర్శనమునకు ముందు జరిగినదేమనగా నా బంధువులలో ఒక అక్కను చేబదులుగా అప్పుయిమ్మన్నాను. ఆమె యిచ్చింది గాని కొంతకాలమయ్యాక నా అప్పు వెంటనే తీర్చు అని బలవంతం చేసింది”. నేను తీర్చలేనక్కా, చనిపోవాలనుకుంటున్నానని చెప్పాను.

“నీవు ఎలా చచ్చినా నాకవసరము లేదు గానీ, నా అప్పు తీర్చి చనిపో” అని చెప్పగా 10, 15 రోజులలో తీర్చుతాను అన్నాను. సరే, నా స్నేహితుని చేరి నా పరిస్థితి తెల్పి కొంత డబ్బు సర్ధగలవా అని ప్రాధేయపడ్డాను. అవమానకరంగా మాట్లాడాడు. “యేసును నమ్మారుకదా! ఆయననే అడుగు” అన్నాడు. చీటీవారు డబ్బు కట్టాలని ఒత్తిడిచేయగా, యీ బాధలు తట్టుకోలేక నిద్రమాత్రలు చేతిలోనుంచుకొని, ఒక ఉత్తరము వ్రాసిపెట్టి తలుపులు మూసి మరణించదలచినప్పుడు నాకు నా పిల్లలు జ్ఞాపకమునకు వచ్చారు.

ఆ సందర్భములోనే ప్రభుని దర్శనము, ఆయన స్వరాన్ని విన్నాను. ప్రభువు చెప్పిన రీతిగా తర్వాత రోజు ఉత్తరము చేతిలో పట్టుకొని సత్యానందం పాస్టరు గారిని ఆశ్రయించాను. నీవు సంతకము పెట్టి అప్పు యిప్పించిన వారిని పోలీసులకు అప్పగించు సురేంద్రబాబు కమీషనరు గారు సహాయపడగలరని సలహా యిచ్చారు. సరే నీకు యీ

ఆలోచన నచ్చునిచో నీకున్న బొంబాయి కాలనీలోనున్న యిల్లు అమ్మి అప్పులు తీర్చవచ్చు కద! అని మంచి సలహాయిచ్చారు.

**కీర్తనలు 1:1 "దుష్టుల ఆలోచన చొప్పున నడువక, పాపుల మార్గములో నిలువక యెహోవా ధర్మశాస్త్రమందు ఆనందించువాడు ధన్యుడు"**

యీ వాక్యము చాలా సత్యముగలది. నాకు చెడ్డ సలహాలిచ్చి మరణించమని చెప్పినది దుష్టుడే కదా! పెంటకుప్పనుండి పైకి లేవనెత్తి ఆదరించే దేవుడు నా కున్నాడని చాలా ధైర్యము కల్గింది. ప్రభువు మాట బంగారు బాట అయినందున ఆ మంచి సలహా పాటించాలని నిర్ణయించుకున్నాను. నా కుటుంబాన్ని ఆ పాస్టరుగారు సహృదయముతో పోషించారు.

ఒక నెలరోజులు మాకు ఆహారమందించుట సామాన్యమైన త్యాగము కాదు. క్రీస్తుప్రేమ బలవంతము చేయగా వారు నా పట్ల దయకలిగి పోషించారు. నన్నాదుకొన్న దేవునికి, ఆ కుటుంబానికి సదా కృతజ్ఞత కల్గియున్నాను.

**కీర్తనలు 119 : "నీ వాక్యమే నన్ను బ్రతికించెను. బాధలలో నెమ్మది నిచ్చెను".**

ఆ తర్వాత మరొక దర్శనాన్ని చూచాను. అందులో ఒక హోటలు కన్పించింది. పనిచేయుటకు నిశ్చయించుకున్నాను. ఆ తర్వాత శశికళ సిస్టరు నన్ను కలిసినప్పుడు నేను ఆమెను ప్రశ్నించాను. "అమ్మా, మీరంతా సురక్షితంగా జీవిస్తూ దేవునిలో ఆనందిస్తున్నారు గానీ, నాకే యీ శ్రమలెందుకు రావాలి?" అన్నాను. "నీవు నీ కష్టార్జితములో క్రమంగా దశమభాగాన్ని దేవునికిస్తున్నావా? అని ప్రశ్నించారు. లేదని చెప్పాను. నీవు యివ్వాలి అని ఆమె చెప్పారు.

శ్రమలో నిన్ను పరీక్షించి శుద్ధిచేసి నిన్ను తన సేవకునిగా వాడుకుంటారు గనుక ప్రార్థన చేసి కనిపెట్టు" అని సలహాయిచ్చారు. ఆ రోజునుండి 6వేల జీతంలో 600 రూపాయిలు దేవునికి ఇచ్చి ఆనందించాను. ఒకరోజు నా యజమాని నన్ను పనికిరమ్మన్నారు. "అయ్యా, నా యిల్లు అమ్ముకొని మా ఊరు తిరిగి వెళ్ళిపోదలిచానన్నాను. 10వేల జీతం వదులుకుంటావా? అన్నారు. నాకు 70వేలు అప్పు వున్నదండీ అని తెల్పాను. సరే నేను నీ కిస్తానన్నారు. నేను యేసుప్రభువును నమ్మాను. ఆదివారాలు ఆరాధన మానుకోలేను. ఆదివారం పనిచేయలేనని ధైర్యంగా చెప్పాను.

**కీర్తనలు 84:10 " నీ ఆవరణములో ఒక దినము గడుపుట వెయ్యి దినములకంటే శ్రేష్టము".**

మరొక దర్శనములో నేను కృతజ్ఞతా కూడిక పెట్టుకుని సాక్ష్యము చెప్పాలని ప్రభువు తెలియజేసారు. నేనారీతిగా నెరవేర్చాను. నా సాక్ష్యము విన్నవారంతా 200 కిలోల బియ్యము ప్రోగుచేసి యిచ్చారు. నా యజమాని ఆదివారం రావద్దులె అని తెల్పి 70వేలు నాకు ఇచ్చి అప్పుతీర్చుకొని పని కొనసాగించమని మంచి మనస్సు చూపించి దయతో మాట్లాడారు.

నన్ను సువార్త ప్రకటించమని ప్రభువు సెలవిచ్చారు. ఈ దర్శనము గూర్చి నా అక్కతో చెప్పాను. నా అక్క విశ్వాసముతో ప్రార్థించు వ్యక్తి గనుక, కనిపెట్టి ప్రార్థించుకోమని సలహాయిచ్చింది. ప్రభువు చూపిన ప్రాంతము కొవ్వూరులో శ్రీనివాసపురం గనుక అక్కడ ఎవరైనా దైవజనులు, సంఘము వున్నదా లేదా అని కనుగొన్నాను. అక్కడ హనోకు గారి మందిరమున్నదని తెలిసింది. వెంటనే ఔరంగబాదు వెళ్ళి సేవ చేయాలని తలంచాను.

నేను 70వేల రూపాయలతో పారిపోయానని పుకారు పుట్టించి నన్ను శోధించారు. యజమాని ఫోనుచేసి నా డబ్బులు తిరిగి యిమ్మాన్నారు. తిరిగివచ్చి పనిచేయసాగాను. నాకయితే దేవుని సేవ చేయాలని చాలా ఆశగా ఉండేది. నా భార్యతో చెప్పాను. ఆమెకు చాలా కోపం వచ్చింది. ప్రతి కొంపకు వెళ్ళి అడుక్కోలేము కదా! మనకొక ఆడపిల్ల వుంది. పెండ్లి చేయాలి. డబ్బులు ఎవరిస్తారు? అని నిరాశపర్చింది. నా దగ్గర డబ్బులు లేవు గనుక సేవకు వెళ్ళలేనని కోపంతో బైబిల్ చింపివేసాను. ఆత్మీయంగా దిగజారిపోయాను.

**యోబు 9:9 "మేలు అనుభవించాము. కీడు అనుభవించ తగమా"** నా పరిస్థితి అయోమయ స్థితికి చేరింది. ఆ రోజుల్లో భయంకరమైన డెంగ్యూ ఫీవరు వచ్చింది. నా జ్వరతీవ్రత హెచ్చింది.

గతంలో నేను నా భర్యను చాలా బాధించేవాడిని. టి.వి.లో ఒక భర్త భార్యను బాధిస్తూ కాలుచున్న నూనెను ఆమెపై పోసాడు. అది చూచిన నా బాబు "అమ్మా, నాన్న నిన్ను బాధిస్తున్నాడు కదా! టి.వి.లో మాదిరి, మనం నాన్నను నూనెపోసి కాల్చేద్దామా? అన్నాడు. నేను అంతగా బాధించిన నా భార్య నాకు జ్వరము వచ్చిన రోజుల్లో చాలా దయతో నన్ను సంరక్షించి ప్రేమ చూపింది. నా 10 సంవత్సరాల కుమార్తె తన దోసిట్లో నా వాంతిపట్టి శుభ్రపరిచి ఆదరించేది.

నా జ్వరం చివరకు టి.బి.గా మారింది. బంధువులంతా దూరమయ్యారు. 6 నెలలు ఆస్పత్రిలో ఉండవలసి వచ్చింది. చిక్కి శల్యమయ్యాను. నాతోటివారంతా నాకు మరణము తప్పదని తలంచేవారు. నేను కన్నీటితో ప్రార్థించి "ప్రభువా, నీవు నన్ను స్వస్థపరిస్తే, నీ సేవ చేస్తానన్నాను. నా భార్య రోజూ నాకు రెండుగ్రుడ్లు, రాగిజావ, బలమైన ఆహారముగా పండ్లు యిచ్చి బ్రతికించింది. పసిపిల్లను చూచినట్లుగా ఆదరించింది. యిద్దరము ప్రార్థించిన తర్వాత ఆస్పత్రికి వెళ్ళగా టి.బి. తగ్గిపోయిందని చెప్పారు. అసాధ్యాలన్నీ సుసాధ్యముచేయు దేవున్ని స్తుతించాము.

నా భార్యకు సేవ చేయుట యిష్టంలేదు. ఆమోసుగారనే దైవజనుడు ప్రార్థించి సేవయినా చేయి, హెూటలుపనైనా చేయి. రెండు పనులు చేయలేవన్నారు. ఆ తర్వాత విశాఖపట్నం చేరాను. నా కుమార్తెకు జ్వరం వచ్చింది. నా యజమాని డబ్బులు కట్టమని బాధించాడు. నా దగ్గర డబ్బులేదు. పాపకు వైద్యం చేయలేక అంబులెన్సు 108 ఫోనుద్వారా తెప్పించుకొని కె.జి.హెచ్ ఆస్పత్రి చేరాము. వారు ఒక ఇంజెక్షన్ యిచ్చారు. పరిస్థితి విషమించింది. నా భార్య దు:ఖంలో ఉండి పాపను సేవకు సమర్పిస్తాను అని ప్రార్థించింది. ఆరోగ్యంగా ఉన్నప్పుడు సమర్పించలేక పరిస్థితి దిగజారాక సేవకిస్తానంటావా? అని కోపపడ్డాను.

నిజానికి దేవుని పనిని అశ్రద్ధచేస్తే శాపము తప్పదని అనుభవంలో తెలిసికోగల్గాము. నిన్ను పిలిచినప్పుడు అంగీకరించనిచో మరొకరిని సేవకు సిద్ధపర్చగలరు. మోషే తర్వాత యెహెూషువాను ఎలియా తర్వాత ఎలీషాను సిద్ధపరచలేదా? నా పాపస్థితి ప్రమాదకరంగా మారింది. గొంతునుండి రక్తం స్రవిస్తుందని నాకు బాబు చెప్పగా యింటినుండి పరుగెత్తి వెళ్ళాను. నరకయాతన అనుభవిస్తున్న నా పాపను చూడలేక చాలా ఏడ్చాను.

నా యజమాని, పాస్టరుగారు వచ్చారు. శాంతరత్నం పాస్టరమ్మగారికి పరిస్థితి తెలిపాము. "మీరు పాపతో దేవుడు సేవచేయమన్న స్థలమునకు అర్జంటుగా రండని" చెప్పింది. పాపకు సీరియస్‌గా ఉంది. M.R.I స్కానింగుతీసారు. మెదడువాపు వ్యాధి అన్నారు. మా యజమానిగారే వైద్యమూ కగు ఖర్చు భరించారు. నాలో నిరాశ ఎక్కువయింది. ఈ దేవుడు ఎవరికోసం బ్రతికించడు? అని ప్రశ్నించాను.

**ద్వితియోప ॥28వ** అధ్యాయంలో ఆరంభములో దీవెనలు 16వ వచనం నుండి నీవు ఆజ్ఞలను మీరినచో గర్భఫలము శపింపబడునని వ్రాసిఉంది. దేవుని కంటే ఎవరినీ

ఎక్కువగా ప్రేమించరాదు. నా బిడ్డకోసం సేవకూడా వద్దని చెప్పిన భార్య నేడు సేవకిస్తానని ఏడుస్తుంది. చివరకు నా బిడ్డ అకాల మరణము పాలయ్యింది. క్రిందపడి దొర్లి ఏడ్చాము. తలలు బాదుకున్నాము. సముద్రములో దూకి మరణించాలని పరుగెత్తగా అందరూ ఆపివేసారు. దేవునిపనిని చేసుకో అన్నారు. ఆ దేవుడు తన పనిని చేయకపోతే మనిషిని చంపాలా? అని ఏడ్చాను. సమాధి కార్యక్రమము జరిగింది. ఆరాత్రి ప్రభువు నాతో సూటిగా మాట్లాడారు. నీకొక కుమారుడున్నాడు. నేను కాపాడుతాను. నా సేవ చెయ్యి అన్నారు. 5 మందిలో యిద్దరు చనిపోయారు. అత్తగారు, పాప మరణాలు, నాకు జ్వరము రావడము, అప్పుల బాధ యివన్నీ జరిగిన తర్వాత నా యజమాని నా అప్పులు తీర్చుతానని అభయమిచ్చి, సేవచేసుకో, నేనే మందిరము కట్టించి పెడ్తానని అన్నారు.

ముగ్గరము మరలా తిరిగి కొవ్వూరు చేరాము. ఆ తర్వాత సేవ ఎలా ప్రారంభించాలో అర్థంకాలేదు. ఆ సమయంలో గతంలో నేను ఎగతాళి చేసిన మార్కు పాస్టరుగారు ఆదరించి, ప్రార్థన, వాక్యబోధను గూర్చి వివరంగా నేర్పించారు. 2008వ సంవత్సరములో శ్రీనివాసపురంలో సేవ ఆరంభించాము.

ఒక యింటిలో అద్దెకున్నాము. వారు గొడవలవల్ల అశాంతితో నుండగా సమాధానపర్చదలంచగా మమ్ములను యింటినుండి ఖాళీ చేసివెళ్ళమన్నారు. శ్రమలు సహిస్తేనే నిత్యజీవానికి వారసులమవుతాము. మనలను ఉపేక్షించుకొని సిలువను ఎత్తుకొని వెంబడించుట అనగా శ్రమలు, శోధనలు భరించుట అని తెలుసుకోగల్గాము. దేవునిని నిందించుట తగదని గ్రహించాము. సహనముతో సేవలో సాగిపోయాము.

ఆ రోజుల్లో నా భార్య నడుమునొప్పి వల్ల బాధపడగా తెల్లకార్డు సహాయంతో రూపాయి ఖర్చు లేకుండా ఆపరేషన్ చేయించుకొని యిల్లుచేరాము. అదే అర్థరాత్రి యిల్లు ఖాళీ చేయమన్నారు. శ్రమలో ఆనందిస్తూ మరొక యిల్లు అద్దెకు తీసుకొని సేవను ఆరంభించాము. 10మంది భక్తులు చేరారు. వారిలో నలుగురు బాప్తీస్మము పొందారు.

ప్రభువు నాకు దర్శనము ద్వారా యేసయ్య సన్నిధి ప్రార్థనా మందిరము అని పేరు పెట్టి సేవ కొనసాగించమని తెల్పి, ఆ మందిర నిర్మాణ స్థలము, ఆకారము కూడా చూపించారు. నేడు అది ఒక బిల్డింగుగా మారి ఆరాధనా స్థలంగా నిలిచింది. నా కుమారుడు రక్షణ పొంది నేను ప్రభువును సేవిస్తానని తెల్పాడు. నేడు ఆత్మీయబిడ్డలు 30 మంది

ప్రార్థన, వాక్యము, సహవాసము, రొట్టె విరుచుటలో ఎడతెగక సాగిపోవు కృపనిచ్చారు. బాధ పడితేగాని బోధపడదని స్వయంగా నేర్చుకున్నాను. నమ్మదగిన దేవుడు నా యేసయ్య నడిపించు నా సేవ ఆయనకే మహిమ కల్గునట్లు దీవిస్తున్నారు. నా భార్య సలోమి నాకు సహకారిగా తోడుగా నిలుచుట నా భాగ్యము. పశువుల కాపరిగా ఎన్నికలేని నన్ను గిన్నెలు కడుగుకొనే స్థితినుండి నా గిన్నె నిండి పొర్లుచున్నదన్న ఆశీర్వాదాలతో ప్రభువు దీవించారు.

ప్రయాసపడి భారము మోయువారికి ఎన్నటికీ విశ్రాంతినిచ్చు గొప్ప దేవుడున్నాడు. ప్రియచదువరీ, యేసును నమ్ముకో. రక్షణ పొందు. సాక్షిగా జీవించు. మీరు ఎక్కడికయినా వెళ్ళండి గాని నరకానికి వెళ్ళవద్దు. దేనికోసమో ఎదురు చూడవద్దు గాని యేసయ్యకై ఎదురు చూడు. దేవుని మాట వినకపోతే నావలె నష్టపోతారు జాగ్రత్త. ఆయన మాట విన్నప్పుడే ఆశీర్వాదాలు మిగులుతాయి. కాఫీ హొటలు నుండి కరుణ గల దేవుడు ఉన్నత సేవకై పిలిచి నడిపిస్తున్నారు. జిగటగల ఊబినుండి నన్ను లేవనెత్తి బండపై నా అడుగులను స్థిరపరిచి క్రొత్త గీతాన్ని నా నోట నుంచి అనేకులు యెహోవాను స్తుతించే రీతిగా 700 స్థలాలలో సాక్ష్యము చెప్పు ధన్యతనిచ్చారు. శేఖరుగారు విశ్వాసిగా పరిచయమయిన తర్వాత అనేక స్థలాలలో నన్ను క్రీస్తు అనుచరునిగా నిలిపారు. నా సాక్ష్యపు పుస్తకాన్ని అచ్చువేయుటకు నా యజమాని రామకృష్ణగారు కృషి చేసారు. నా కుమారుడు నేడు బైబీలు తర్ఫీదులోనున్నాడు. నా సాక్ష్యము అనేకులకు ఆత్మీయ మేలునివ్వాలని నా ప్రార్థన. ఆమెన్.

రుచిచూచి ఎరిగితిని. యెహోవా ఉత్తముడని. రక్షకుడ నాశ్రయించి నే ధన్యుడనైతిని హల్లెలూయ".

---------------

# 41. కన్నీటి లోయలో కీర్తించి పాడి ప్రభుని స్తుతించు ధన్యత నిచ్చారు

దయామణి (నాగేశ్వరమ్మ)(చీరాల)

**యోహాను 14:6 "నేనే మార్గము, సత్యము, జీవమునై యున్నాను".**

**పరిచయము:–** దేవుని మహాకృపవల్ల అన్యుల కుటుంబములో పూజలు చేయునన్ను క్రీస్తును ఆశ్రయించు గొప్ప భాగ్యాన్నిచ్చిన ప్రభువునకే స్తుతి స్తోత్రము చెల్లించగలను. ఎంతో దు:ఖభారమైన గతము నుండి నన్ను లేవనెత్తి ఆశ్చర్యకరమైన వెలుగులోనికి ప్రభువు నన్ను నడిపించిన రీతి మీరు నా సాక్ష్యము ద్వారా తెలుసుకొనగలరు.

నేను ఆంధ్రప్రదేశ్‌లో కృష్ణాజిల్లా మంగళగిరిలో పుట్టినను, బాల్యములోనే 12వ ఏట తండ్రిని కోల్పోయినందున అవనిగడ్డలోనే పెరిగాను. నా తండ్రిపేరు ఏనుగుల సూర్యనారాయణగారు. అమ్మ రాజ్యము. పెద్దమ్మ దగ్గర పెరిగినందున యిద్దరము కలిసి అక్కడే ఉన్నాము. 19వ సంవత్సరములో చీరాల వాస్తవ్యులు అయిన విన్నకోట బాబురావుగారితో వివాహము జరిగించారు. నాకు ఒక చెల్లి యిద్దరు సోదరులున్నారు గాని అత్తగారింట్లో 6మంది ఆడపడుచులు, యిద్దరు మగ సంతానముండేవారు. 1973వ సంవత్సరంలో నాకు వివాహమయినది మొదలుకొని కట్నము యిచ్చి యింజనీరుతో వివాహమని ఆనందపడి అడుగుపెట్టిన అత్తగారింట్లో చాలా దు:ఖ కరమైన చేదు అనుభవాల నెదుర్కొన్నాను. సరిగ్గా ఒక్క సంవత్సరము వివాహ జీవితంలో నా భర్తను గూర్చిన సత్యం నన్ను కృంగిపోయేలా చేసింది. కట్నము కొరకు నా భర్త తల్లిదండ్రుల కొరకు నన్ను రెండవ వివాహము చేసుకొన్నారన్న నిజము నన్ను దు:ఖకర జీవితానికి బలిచేసింది.

మొదటిగా నా భర్త వివాహము చేసుకొనిన స్త్రీ క్రైస్తవురాలు, టీచరుగా ఉద్యోగము చేసేది. ఆమెకు యిద్దరు కుమారులు కల్గినారు. ఆ కుటుంబ బాధ్యతలున్నందున నాతో ప్రేమతో వ్యవహరించలేక పోయేవారు. సరిగ్గా యింటికి వచ్చేవారు కాదు. నిలదీసి అడిగితే చాలా చిరాకు, కోపంతో బాధపెట్టేవారు. స్వతహాగా మనసాక్షి గలవాడు. బాధ్యత గలవాడు గనుక నాతో పశ్చాత్తాపంతో అసలు సంగతి తెల్పారు. నా బాధను నాలోనే దిగమ్రింగుకొని సహనముతో జీవించుట నేర్చుకున్నాను.

నాలో నేనే కుమిలిపోవుచు ఏడ్చుకొనేదాన్ని గాని నా తల్లి విధవరాలు గనుక బాధపడుతుందని నా కష్టాలు చెప్పుకోలేకపోయాను. అత్తమామలకు ఈ వివరాలు తెలిసినను తెలియనట్లే నటించేవారు. నాకు విరక్తిగల నిరాశా జీవితంలో అందంగా అలంకరించుకొనే కోరిక ఉండేదికాదు. నిద్రపట్టేది కాదు.

నా భర్త పిల్లలను బాధ్యతతో చూస్తూ ఫీజుల కట్టి అవసరాలన్నీ గమనించేవారు. గుంటూరులో కొంతకాలము నా భర్త ఉద్యోగం చేస్తున్న రోజుల్లో ఆయన పనిచేసే ఆఫీసులో క్రైస్తవులు ఉండేవారు. నా భర్త క్రీస్తును గూర్చి వారిద్వారా వినేవారు. నేనయితే నా మనశ్శాంతి కొరకు, నెమ్మది కొరకు నిత్యమూ పూజలు చేసేదాన్ని. సోమవారాలు నాగదేవుడు, మంగళవారం సుబ్రమన్యుడు, గురవారము సాయిబాబా, సంతోషిమాత, వెంకటేశ్వర్లు, ఆదివారం శివుడు యీ రీతిగా పూజలు చేస్తూ, నైవేద్యాలు, దీపారాధన, పూజగది శుభ్రముచేస్తూ శుద్ధిచేస్తూ గడిపేదాన్ని గాని హృదయశుద్ధి గూర్చి అస్సలు పట్టించుకోలేకపోయాను.

**క్రీస్తును గూర్చి వినుట:–** వినుట ద్వారా విశ్వాసము కల్గుతుందని నేను గ్రహించగల్గాను. ఎట్లనగా నేను పుట్టింటిలో గడిపేరోజుల్లో క్రీస్తును గూర్చిన పాటలు పాడేవారు. బిక్ష గాళ్ళ,కుష్టువారు రోడ్డుపై వెళ్తూ ఎంతో అర్ధవంతంగా, గంభీరంగా, తాళము వేస్తూ ఆకర్షణీయంగా పాడుపాటలు శ్రద్ధగా వినేదాన్ని. క్రీస్తు చరిత్ర దానిలో యిమిడివుండేది. ఆ మాటలు వింతైన ఆనందాన్ని, ఆదరణ కల్గించేవి. వారిని పిలిచి బియ్యమిచ్చి, నా దగ్గరున్న చిల్లరయిచ్చి పంపేదాన్ని.

దేవుని ప్రేమ యిదిగో .. జనులారా
భావంబునను తెలియరే .. కేవలము నమ్ముకొనినా, పరలోక భాగ్యంబు మనకబ్బును.
యేసును స్వీకరించు .... క్రీస్తేసుని స్వీకరించూ...
నీ హృదయపు ద్వారము తెరువుము త్వరితము – తానే ప్రవేశించును.

ఆ పాటలో క్రీస్తు చేసిన అద్భుతాలన్నీ అంధులకు కండ్లు యిచ్చాడని, కుంటివారిని బాగుచేసాడు, సకల వ్యాధులు స్వస్థపర్చునని మానసిక రోగాలు బాగుచేయగలడని వినేదాన్ని.

**నడిపించు నా నావ – నడిసంద్రమున దేవా**

అనే పాట విన్నప్పుడు నా జీవితము జ్ఞాపకమొచ్చి నా అసహాయ స్థితిలో నా బ్రతుకును ఆదుకొని నా బిడ్డలకు మంచి భవిష్యత్తు కావాలని ఆ దేవుడు కూడా నేను పూజించే దేవుళ్ళతోపాటే ఒక దేవుడని నమ్మి తలంచేదానిని. క్రీస్తు పాటలంటే యిష్టత తప్ప దేవుడంటే

యిష్టమని, ప్రార్థించుకోవాలని ఎవరూ చెప్పలేదు, నాకు తెలియలేదు. రాముడు, కృష్ణుడు, వెంకటేశ్వర్లు హిందువులకు దేవుళ్ళయితే అల్లా ముస్లిములకు దేవుడనియు, క్రీస్తు క్రైస్తవుల దేవుడనియు పరిమిత జ్ఞానంతోనే జీవించసాగాను.

నన్ను అన్యాయము చేసారని గతములో నా భర్తనుగూర్చి బాధ కల్గిననూ, గొప్ప దేవుడైన క్రీస్తు నాకు రక్షకునిగా లభించి, నా బిడ్డలను ఉన్నత విద్యతో ఆదరించి బాబుకు అమెరికాలో ప్రవేశము కల్గించి, కోరిన గొప్ప అనుభవాల్ని కల్గించిన రీతి చాలా నెమ్మదికి కారణమయింది. అది ఎట్లనగా నా భర్త ఆఫీసులో పనిచేస్తున్న సత్యవర్ధన్‌గారు ఆఫీసులో క్లర్కుగా పనిచేసేవారు. గుంటూరు విజయవాడ మార్గంలో కాకాని అనే ప్రాంతంలో బైబిలు మిషను వారి మందిరంలో ప్రతి సోమవారము ప్రార్ధనలు జరిగేవి. తిరనాళ్ళవలె జనములు ఆయా ప్రాంతములనుండి తరలివచ్చేవారు. నిత్య ప్రార్ధనలు, పాటలు, భోజన సదుపాయాలన్నీ చాలా చక్కగా నిర్వహించేవారు.

సత్యవర్ధను గారు నా భర్తను తోడుగా తీసుకొని వెళ్ళేవారట. ఆ కాకానితోటలో క్రీస్తును గూర్చిన సందేశాలను నా భర్త వినేవారు. ఆ సందేశాలన్నీ నా భర్త హృదయంలో చెరగని ముద్ర వేసాయి. అసంకల్పితంగా కన్నీరు కార్చేవారట. గొప్ప సందేశాలన్నీ రెండంచుల గల ఖడ్గంగా హృదయాంతరంగాల్లో చొచ్చుకొనగా పశ్చాత్తాప హృదయంతో పరితపించి ఆయన హృదయాన్ని దేవునికి అర్పించారు. నా దగ్గరకు వచ్చినపుడు ఆ కాకానిలో జరిగిన వివరాలన్నీ తెల్పి నేనందించే ప్రసాదాన్ని పెట్టినప్పుడు నిరాకరించాను. నా పట్ల జాలి, బాధ కల్గించే స్థితినిబట్టి నాకు డబ్బులిచ్చి నీవు కూడా సోమవారాలు కాకానితోటకు వెళ్ళు, చాలా బాగుంటుందని నన్ను ప్రోత్సహించారు.

నేనయితే నాకు పూజలున్నాయి అని చెప్పగా పూజ తర్వాత అయినా నీవు వెళు ళ అని నన్ను బలవంతం పెట్టారు. ఆయన నాకుచెప్పి నన్ను కావాలని కాకాని పంపిన నాటినుండి నాలో గొప్ప సంచలనము ఆరంభమయింది. వరుసగా రెండు మూడు వారాలు వెళ్ళాను గానీ, ఆ సందేశాలు, మాటలు, పాటలు, ప్రార్ధనలు నాకు సరిగ్గా అర్ధము కాలేదు.

నేను బిక్షగాళ్ళకు క్రీస్తు పాటలు పాడేవారికి చందాలు యివ్వడము నా భర్త చూచారు గనుక నేను తప్పక యిష్టంగా క్రీస్తును నమ్ముతానని ఆశించారు. మొదటిగా కాకానీ ప్రార్ధనలో నేనువినిన, అర్ధమయిన ఒకేఒక మాట

**యోహాను 14:6 "నేనే మార్గమును, నేనే సత్యమును, నేనే జీవమునై యున్నాను".**

ఈ మాటలు నా నోటితో పలుకుట ఆపలేకపోయాను. నేను కూర్చున్ననూ, లేచిననూ ఆ మాటలు నా హృదయంలో మారుమ్రోగుట కారంభించాయి. నాలో కలవరం కల్గించగా, క్రమంగా 7 వారాలు వెళ్ళాను. నేను ఆరాధనలో పాల్గొని అయోమయస్థితిలో నున్న నన్ను గమనించినవారు నన్ను ప్రశ్నించారు.

"అమ్మా, నీవు కోరుకున్న కోరికలు నెరవేరాయా? యాజక కుటుంబంలో నుండి వచ్చినట్లు బొట్లు, పసుపు చూస్తే తెలుస్తుంది" అన్నారు. స్వస్థత, దైవకార్యాలు నెరవేరుట యీ మాటలు నాకు తెలియదు. నేను వారికి జవాబుగా "అయ్యా, నాకేమీ అవసరాలు లేవు. నా భర్త కోరిక ప్రకారము వెళ్ళమని ఆజ్ఞాపిస్తేనే వచ్చానండి అని అమాయకంగా జవాబిచ్చాను.

నేను క్రీస్తును అంగీకరించాలని నాకు తెలియనందున రోజూ తులసి మాలలు, పూలు విగ్రహాలపై నుంచి కాళ్ళకు మ్రొక్కి నా జీవితమును చక్కబెట్టమని కన్నీరు కార్చి ప్రార్థించుకొనేదాన్ని. తెల్లవారిన వెంటనే గుడికివెళ్ళి దేవాలయాల చుట్టూ తిరిగేదాన్ని. కాకాని వెళ్ళినప్పటినుండి నాకెందుకో అధికంగా పూజలు చేయాలనే యిష్టత కలుగలేదు. క్రమంగా ఈ మూఢభక్తి వ్యర్థమనిపించింది. ఒకసారి పూజారిగారిని ప్రశ్నించాను. నేను విన్న మాటలు అర్థం చెప్పగలరా? ఏ దేవుని మాటలో తెలుపండి

**"నేనే మార్గమును, నేనే సత్యమును, నేనే జీవము"** మన వేదాలలో, శ్లోకాలలో కూడా యివే మాటలు అర్థముందని తోచుచున్నదని తలంచాను. అసతోమ సర్గమయా, తమసోమా జ్యోతిర్గమయా, మృత్యోమా అమృతంగమయా, ఓం శాంతి, ఓం శాంతి, ఓం శాంతి.

ఈ శ్లోకాన్ని రోజూ పలుకుచూ పూజారి యిచ్చిన తులసి నీళ్ళు క్రిందపడకుండా నోట్లోవేసుకొని మిగిలినది తలకు రాసుకోవాలి. ఈ అర్థమేమనగా అసత్యము నుండి సత్యమునకు, చీకటి నుండి వెలుగునకు, మరణము నుండి జీవములోనికి నడిపించు భగవంతుడా అని తెల్పుట సంస్కృతంలో వున్నదని తెలుసు గానీ ఈ మాటలు నా మనస్సులో మెదిలి బాధించుటను బట్టి అనేకులను ప్రశ్నించగా తెలిసిన భావమొక్కటే, కేవలము క్రైస్తవులు నమ్మిన క్రీస్తు మాటలు క్రైస్తవ బోధకులు వాడు పదాలని తెలుసుకోగల్గాను. స్పష్టంగా క్రీస్తు మాటలుగా అర్థమయ్యాయి.

క్రీస్తు మహాశక్తి మంతుడనియు, ఎవరిని ఏ రీతిగా తన బిడ్డలుగా స్వీకరించాలో గ్రహించిన వాడైనందున తరువాత రోజుల్లో తెలియజేసారు. ఆ తర్వాత ఉద్యోగరిత్యా నరసరావు పేటలో కాపురము పెట్టాము.

**నిజమైన విశ్వాస జీవితారంభము:–** నా భర్త మొదటి భార్యను, బిడ్డలను నా దగ్గరకు తెచ్చి సఖ్యతతో జీవించాలనియు, ఆమెను నిరాదరణ చేయలేనని చెప్పారు. మానసిక వ్యధతో ప్రార్థన జీవితాన్ని అనుభవించక పూర్వమే ప్రభువు నా యదార్థతను గ్రహించి నా బిడ్డలు 10వ తరగతిలో నుండగా "నాన్నా, మేము మొదటి కుటుంబముతో కలిసి బ్రతకలేము, ప్రత్యేకంగా వుంటామని" చెప్పారు.

దేవుని మహాకృపతో మేము ప్రత్యేక కుటుంబముగా ఉన్నాము. అప్పుడప్పుడు మొదటి భార్యపట్ల బాధ్యత తీసుకొన్నను, నాకు నాబిడ్డలకు ఏ లోటూ రాకుండా చూసుకున్నారు. అంతేకాదు క్రీస్తును నమ్మిన తర్వాత మమ్ములను క్రీస్తు ప్రేమతో కుటుంబ ప్రార్థన బాధ్యతలు స్వీకరించే మంచి మనస్సుతో ఉండేవారు.

ప్రభువు చిత్తములో సమస్తము సమకూడి జరుగునన్న వాగ్దానమును బట్టి సరియైన ఆత్మీయ ఎదుగుదల లేని మాకు తెలిసి తెలియని రీతిగా ప్రార్థన చేసుకొను అనుభవంలో నుండగా ఎదురింట్లోనున్న కోమటి కులం నుండి క్రీస్తును నమ్మి హెబ్రోను సహవాసంలో మందిరములో క్రమం పాటించే విశ్వాసి మమ్ములను చేరి ప్రశ్నించింది.

"అమ్మా, మీకు ఆదివారము దేవుని మందిరానికి వెళ్ళే అలవాటు వుందా? బాప్తీసము తీసుకొన్నారా? మంచి క్రైస్తవులుగా జీవించాలంటే ఇంట్లో ప్రార్థనలు సరికావని స్పష్టంగా తెలిపింది. అది 1988వ సంవత్సరము. ప్రభుని ప్రేమ మాలోనిలిచి క్రమమైన ఆరాధనలలో పాల్గొని అత్యధికంగా ఆత్మీయ మేలులను కుటుంబమంతా పొందు కొనగల్గాము.

దేవుడు దయగలవాడు. భక్తసింగు గారి నడిపింపుతో నిర్వహించబడే మందిరాలన్నీటిలో వాక్యము స్వచ్ఛంగా బోధించుట, నిలకడగా నుండే విశ్వాసులుగా తీర్చి దిద్దుట పరిపాటి. ప్రభువు మమ్ములను తన గొప్ప కృపతో చక్కని క్రమంలో పోషించారు. నా భర్తా నేను రక్షణానుసారమైన మారు మనస్సుకు తగిన పశ్చాత్తాపంతో క్రొత్త జీవితాన్ని ఆరంభించాము. చెప్పనశక్యమైన సంతోషం మా కుటుంబంలో నలుగురము పొందాము.

**రోమా 10:9,10** అందరము పాపముచేసి దేవుడనుగ్రహించు మహిమను పొందలేదని

గ్రహించాము. నా బిడ్డలు చిన్నవారైననూ వారుకూడా మారుమనస్సును గూర్చి అవగాహన పొందగా, నలుగురము ఒకేసారి నీటిబాప్తీసము తీసుకొని సంఘ సభ్యులమయ్యాము.

**1 కొరింథి 6:9,10 "మనమే దేవుని ఆలయమని గ్రహించి పరిశుద్ధముగా జీవించుట ఆరంభించాము".** జి.డి.మాథ్యూస్ గారు మమ్ములను ఆత్మీయ లోతుల్లోకి నడిపించిన మంచి వ్యక్తి. కాంతయ్యగారు, పూర్ణచంద్రరావు గారు కూడా మాకు మంచి వాక్యానందించిన విశ్వాసులు. మా కులము వాడైన పూర్ణచంద్రరావు గారు మా కుటుంబమునకు అతి సన్నిహితులుగా ఉంటూ యోగక్షేమములు చూచేవారు.

మాకు మా బిడ్డలకు హిందూ పేర్లు ఉండరాదని తలంచి మా పాపకు అనంతలక్ష్మికి బదులుగా ఎస్తేరు రాణి అనియు, యువచంద్ర అనే మా కుమారునికి జాషువా అని పేర్లు మార్చి స్థానిక స్కూలు రికార్డులలో కూడా మార్పు చేయించారు.

**శ్రమానుభవాలు:-** నేను నా కుటుంబము విశ్వాసులుగా జీవిస్తూ క్రీస్తు పాటలు పాడుకుంటూ ఆనందంగా జీవించుట గమనించిన మా అత్తగారు, మామగారు, ఆడపడుచుల నుండి తీవ్రమైన వ్యతిరేఖత ఎదుర్కొన్నాము. తక్కువ జాతివారితో ఏకమయ్యామని నిందించారు. బరితెగించి నేను నా భర్తను మార్చి, దేవాలయాలకు తరచుగా వెళ్ళిపోతూ అందరితో కలిసిపోతున్నామని హీనంగా చూచేవారు.

నేను ధైర్యంగా దేవున్ని వెంబడిస్తూ బిడ్డలను భక్తితో పెంచుకోసాగాను. ప్రతి పరీక్షల సమయంలో ఆ రోజంతా సీయోను గీతాలు పాడుతూ, వారు బాగా పరీక్ష వ్రాసామని తెల్పేవరకూ దేవుని సన్నిధిలో గడిపేదాన్ని. మేమంతా సి.డి.లు సంపాదించి దైవ వాక్యాలు వింటూ, రేడియో ప్రసంగాలు వింటూ గడిపేవారము. పరవస్తు సూర్యనారాయణ గారి సాక్ష్యము ప్రసంగాలు గుంటూరులో గుంట గ్రౌండ్‌లో జరిగినప్పుడు వెళ్ళి విని ఆనందించి ప్రభువులో విశ్వాసం బలపర్చుకోగలిగాము. వారి సి.డి.లు కొని విన్నాము.

**బిడ్డలు అత్యున్నత భవిష్యత్తు - ప్రభువు దీవెనలందుకొనుట:-** నా బాబు ఇంజనీరింగు చదువుకోగలిగాడు. పాప డిగ్రీ పూర్తి చేసింది. నా పాపకు వివాహం చేయాలని తలంచగా, నా భర్త మొదటి భార్య బంధువులబ్బాయి బత్తుల మోజెస్, ఎల్.ఐ.సి.లో ఉద్యోగిగా నుండి వివాహము చేసుకోవాలని కోరాడు. ప్రభువు స్పష్టంగా ఆయన చిత్తాన్ని బయలు పరిచేవరకు ఒప్పుకోలేమని తెల్పాము.

మా అల్లుడికి నాన్నలేదు. మా వద్ద డబ్బు కూడా లేదు. నా భర్త లంచము తీసుకొనేవారు కాదు. నిజాయితీగా జీవించారు. సైతాను శోధనలవల్ల మొదటి భార్యతో అనుభవాలు తప్పలేదు గాని అన్యాయము చేయలేదు. అందరినీ నమ్మకంగా ప్రేమించారు.

మా అమ్మాయి తెలివిగా, అందరూ యిష్టపడినప్పుడే నా వివాహము దేవుని చిత్తమని నమ్ముతానని తెల్పి ఉపవాసముండి ప్రార్ధించుకొన్నది. నా అల్లుడు మోజెస్ కూడా ఉపవాసముండి ప్రార్ధించగా ఎస్తేరు వంటచేస్తున్న దర్శనాన్ని చూచాడు. నా కుమారుడు మొదటిగా వ్యతిరేఖించిననూ, ప్రార్ధన ద్వారా అంగీకారాన్ని తెల్పాడు.

ఆ తర్వాత జనవరి 17న వివాహం జరిగించాము. మా బాబుకు అల్లుడు వచ్చి కుర్చీలో కూర్చున్న దర్శనం తర్వాత ఒప్పుకున్నాడు. ప్రతి అనుభవం అనుకూలించినందున నేడు మోజెస్‌తో నా కుమార్తె దైవసేవలో సంపూర్ణ సమర్పణతో మందిరము నిర్వహిస్తూ దేవుని ఘనపర్చుట మా అందరికీ ఎంతో ఆనందము కలిగిస్తుంది. దేవుని పరిచర్య చేసేవారి పాదాలు సుందరములు అని నమ్మాము.

నా భర్త తన మొదటి భార్యను, బిడ్డలను పరామర్శించుట నాకు యిష్టమున్నా లేకపోయినా ఉపేక్షించి జీవించుట వలన నా బిడ్డలను అతి శ్రేష్టమైన రీతులతో మంచి ఉన్నత విద్యనిచ్చి అత్యున్నత స్థానాలలో ప్రభువు నిలబెట్టి దీవించుటను బట్టి నా బాధ, శ్రమలన్నీ మర్చిపోవుటకు ప్రభువు కృపనిచ్చారు. నా భర్త ఆర్ధికంగా మొదటి భార్యకే ఎక్కువ సహాయపడేవారు. ఆమె పేచీపెట్టి డబ్బుపొందుకొనేది. నా కయితే ఉన్నదానితో సంతృప్తి పొందు మనస్సు దేవుడే నాకిచ్చారు. నీవుంటే నాకు చాలు యేసయ్యా అని తలంచి మౌనంగా ప్రార్ధించుకొనేదాన్ని. బిడ్డలు ఆణిముత్యాలుగా తీర్చిదిద్దబడుటకు ప్రభువే సహాయం చేసారు.

**జాషువా అమెరికాలో స్థిరపడుట:–** బాబు చదువు ముగించుకొని సింగపూరులో ఉద్యోగము చేయుటకు వెళ్ళాడు. మంచి వ్యక్తిత్వంతో, మంచి ప్రేమతో అందరి అభిమానం పొందుచూ జీవించుట నాకెంతో ఆనందము కలిగించేది. మా బంధువులలో పూర్ణచంద్రరావు గారి బంధువైన ఇందిరాగారు నాతో మంచి సహవాసిగా ఉండేవారు. వారి సాక్ష్యము చిన్న పుస్తకముగా ప్రచురించారు. వారి అమ్మాయి కల్యాణి మంచి విద్యావంతురాలు, దైవభక్తి గలది గనుక బాబుకు వివాహం చేయమని తెల్పారు. నేను కూడా నా స్నేహితురాలి అమ్మాయిని ఎరుగుదును కావున కోడలుగా చేసుకోవాలని చాలా ఆశించి నా కుమారునితో చెప్పాను. నా కుమారునికి కొన్ని కోరికలున్నాయని తెల్పాడు.

1. నాకు కాబోయే భార్య తెల్లగా ఉండాలి.
2. బాగా విద్యావంతురాలై యుండాలి.
3. నా కన్నా 4 సంవత్సరాలు చిన్నదై యుండాలి.
4. మా కులస్తురాలై యుండాలి.

యీ శరతులన్నీ కాదు దేవుని చిత్తములో ఉన్నదో లేదో ప్రార్ధించి కనిపెట్టు అని మా అల్లుడు మోజెస్ తెల్పాడు. అందముండి బుద్ధి గర్వముతో కూడినదైతే బాధలో పడతావని కూడా తెల్పాడు. ఉపవాసం ఉండాలి అని చెప్పగా లోకంలో అమ్మాయిలే కరువయ్యారా? అని మా అబ్బాయి చెప్పాడు. మూడు సంవత్సరాలు గడిచాయి. ఒకసారి మాకు ఫోను చేసాడు. "అమ్మా, నలుగురు అమ్మాయిలను చూచాను. వారంతా బాధపడవచ్చు, నిరాకరించానని తెలిస్తే నాపై కోపం రావచ్చు. అని తీవ్రంగా బాధపడ్డాడు. సరె కల్యాణి బయోడేటా పంపమని తెలపండి అని తీరిగ్గా చెప్పాడు.

బాబు జాషువాకు 4 రోజులు నిద్రలేకుండా వుండగా కల్యాణితో వివాహానికి సమ్మతించిన తర్వాత మంచి నిద్రపట్టుట, నెమ్మది పొందుట ప్రభువు సూచనగా గ్రహించాడు. సౌందర్యము, అందము వ్యర్ధమే, ఆయన నిర్ణయంలోనున్న బిడ్డ మంచిదని అందరము చేసిన ప్రార్ధనలు ఫలించాయి.

2005వ సంవత్సరములో జూన్13వ తేదీన కల్యాణిని చూచి జూన్17వ తేదీన వారి వివాహం గొప్పగా ప్రభువే జరిగించాడు. నేడు వారి అన్యోన్య దాంపత్యమును బట్టి అనేకులు ఆనందించగా నా బిడ్డను బట్టి నేను, ఇందిరాగారు ఆమె కుమార్తెను బట్టి దేవున్ని స్తుతిస్తూ కలిసి వారిని ప్రేమించగల గొప్ప భాగ్యాన్నిచ్చిన ప్రభువు స్తుతిపాత్రుడు. ప్రార్ధనల ద్వారా నిర్ణయమయిన వివాహాలు జయకరమైనవని నమ్మాలి. నా బిడ్డ జాషువా తన భార్య కల్యాణిని బంగారము అని ప్రేమతో సంభోదించుట చూచి నేనెంతో ఆనందిస్తాను. యిద్దరు బిడ్డలను ప్రభువిచ్చారు.

**నా భర్త మరణము:-** నా భర్త క్రీస్తు ప్రేమలోనే జీవించి నా బిడ్డలను భక్తిలో పెంచుటలో సహకరించి వారిద్దరి వివాహాలు జయకరంగా జరిగి వారి బిడ్డలను చూడగల్గిన గొప్ప భాగ్యము పొందారు. ఆయన పదవీ విరమణ తర్వాత అనారోగ్యం పాలయ్యారు.

నా భర్తకు రావలసిన ఆస్థి రైసుమిల్లులో భాగము, చీరాలలో రెండంతస్తుల భవనము ఉండగా నేను క్రీస్తును నమ్మినందున నాకు అన్యాయము చేయదలంచినను, దేవుడు ఏలియాను పోషించలేదా అని ధైర్యంగా ఉందామని నా భర్త ఆదరించేవారు.

నాకు రావలసిన పెన్షన్‌ను మొదటి భార్యకే అప్పగించారు. రిటైర్డ్‌మెంటులో వచ్చిన సొమ్ములో సగము నాకిచ్చారు. నన్ను మొదటి భార్యకు లోబడాలని, సహనముతో ఉండాలని ఆయన కోరేవారు. ఆమెను, నన్ను ఒక యింట్లో కొంతకాలముంచినను దేవుడు నా కిచ్చిన ఓర్పు, సహనములను బట్టి నా బిడ్డలను గొప్పగా దీవించారని నేడు స్తుతించి కీర్తించగలను.

మొదటి భార్య బిడ్డలు సరిగా విద్యావంతులు కాలేదు. స్వార్ధంతో నన్ను తూలనాడి, నాపై ఆదిపత్యము వహించాలని ఆమె ప్రయత్నించినను, క్రీస్తుప్రేమను బట్టి నా భర్త నన్ను నా బిడ్డలను హత్తుకొని మరణపర్యంతము నన్ను నా బిడ్డలను కనిపెట్టి చూడగల్గిన ధన్యత ప్రభువే యిచ్చారు. నా భర్త, భక్తిగల విశ్వాసుల సలహామేరకు తల్లిదండ్రులు సిద్ధపరిచిన భార్యనైన నన్ను మన్నించి హత్తుకొని జీవించాలనియు, తనకిష్టమైతే మొదటి భార్యను పోషించవచ్చునన్న సలహా నమ్మకంగా పాటించుటను బట్టి సమాజములో నా భర్తకు మంచి గౌరవము, నాకు నాబిడ్డలకు సరియైన అండలభించి మేము ఎంతో ఆదర్శమైన కుటుంబీకులముగా సమాజంలో గౌరవ ఆదరణలు పొందగల్గుచున్నాము.

క్రీస్తును కల్గిన కోడలును, అల్లుడును పొందుట ప్రభువు ప్రణాళికయే. నా భర్త, నేను పొందిన రక్షణానుభవం, మంచి ప్రార్ధనా మందిర సహవాసం, నా బంధువులకు లేని ధన్యతగా ప్రభువు కానుకగా అందించారు.

**కీర్తనలు 91:13 "నా నామమెరిగిన వారిని నేను ఘనపరుస్తానన్న"** వాగ్ధానమును నా పట్ల నెరవేర్చిన ప్రభువు ప్రేమకు నేనేమివ్వగలను? రక్షణ పాత్రను చేబూని ఆయనకు నమ్మకమైన సాక్షిగా జీవిస్తున్నాను.

1995లో రిటైర్డ్ అయ్యాక 2010వ సంవత్సరంలో నా భర్త బలహీనుడై మెదడులో క్లాటులు చేరగా చేతిలో వస్తువులను తెలియక జారవిడుచుట గమనించి ఆస్పత్రిలో చూపించగా న్యూరాలజీ ట్రీటుమెంటుకై బాబు 5 లక్షల రూపాయలు అందించి తండ్రిపట్ల ప్రేమచూపి దగ్గరుండి చికిత్స చేయించగల్గాడు. చివరకు క్యాన్సరని తెల్పారు. రేడియేషన్ చేయవలసి వచ్చింది. వ్యాధితో బాధపడి 11 నెలలు జీవించారు.

తన బలహీనతలకై తీవ్రంగా పశ్చాత్తాప పడి నన్ను క్షమాపణ కోరారు. మంచి ప్రేమచూపి పరిచర్య చేయగలిగాను. ఎక్కువ ప్రార్ధనా వాతావరణాన్ని కల్గించి, ఆదరణ నిచ్చాను. చివరకు 2011 ఏప్రిల్‌లో ప్రభువు సన్నిధి చేరారు. బంధువులంతా ఆశ్చర్యపడు

రీతిగా సమాధిచేసాము. బాబు కుమారునికి యోసేబు అని పేరుపెట్టాము. పాపను చూడలేకపోయినను షోరోను అని పేరుపెట్టమన్నారు. నాకొరకు నాభర్త వాటా సొమ్ము కొంత లభించింది. నా బాబు నాకొక అపార్టుమెంటు కొనిచిచ్చాడు. చీరాలలో నివసిస్తూ దేవునికొరకు సాక్షిగా జీవిస్తున్నాను.

2012లో వియ్యపురాలు యిందిర గారితో కలిసి ఇశ్రాయేలు దేశం వెళ్ళి ఆనందించాము. 2015 ఫిబ్రవరిలో యిద్దరము అమెరికాలో డెట్రాయిడ్‌లో నున్న బాబు కుటుంబంను దర్శించుటకు అమెరికా ప్రయాణము చేయు గొప్ప అవకాశాన్ని ప్రభువిచ్చారు. అమెరికాలో హెబ్రోను సహవాసం లభించగా సహవిశ్వాసులతో, మా బిడ్డలతో ఆనందించే గొప్ప దీవెన లభించింది. విజయవాడ మరునాత సహవాసంలో విశ్వాసులతో సంప్రదించుకొనే సమయంలో న్యూజెర్సీలో నిర్వహించే పెనూయేలు ప్రార్ధనా సెల్‌ఫోన్ సహవాసంలో ప్రార్థించుకొని సాక్ష్యము పంచుకొనుచు 30మందికి పైగా కేవలము ఫోను ద్వారా పరిచయాలేర్పరచుకొని ప్రార్థించు ధన్యత పొందాము. సాయంత్రం కూడా ప్రార్ధనా ప్రేయర్ సెల్‌లో పాల్గొని ఆనందించాము. గొప్ప దైవసేవకుల సందేశాలు విని ఆత్మీయ మేలు పొందాము.

నా బాల్యంలో తండ్రి ప్రేమ లేక, వివాహ జీవితంలో భర్త సంపూర్ణప్రేమ లోటైన నాకు దేవుడు తన గొప్ప ప్రేమతో తన బిడ్డగా కౌగిలిలో చేర్చుకొని ఆదరించారు. యిద్దరు వినయ విధేయతలు గల బిడ్డలనిచ్చి వారికి ఉన్నత స్థానాలనిచ్చి నా భర్తను క్షమించి, ప్రేమించే గొప్ప మనస్సునిచ్చిన ప్రభువునకే స్తుతి మహిమ కలుగునుగాక.

నాలాంటి అనామకురాలిని ప్రభువు వెదకి రక్షించి మంచి జీవితాన్నిచ్చారు. నా యీ సాక్ష్యము అనేకులకు ప్రభువును ప్రేమించి, విశ్వాసంలో అభివృద్ధి పొంది, గొప్ప దీవెనలకు అర్హులు కావాలని నాదీన ప్రార్ధన. ప్రభువు కృప అందరితో ఉండునుగాక. ఆమెన్.

నా సెల్ నంబరు – 9951849278

---------------

## 42. తరతరాలనుండి క్రీస్తే నిజరక్షకుడని తెలుసుకొని వెంబడించు ధన్యతనిచ్చారు

**– విజయమ్మ (కాకినాడ)**



**యెషయా 2:5 యాకోబు వంశస్తులారా రండి మనము యెహోవా వెలుగులో నడుచుకొందము".**

**పరిచయము:–** ప్రభువు దివ్య మార్గములో నడుచు భాగ్యాన్నిచ్చి ఆయన నాకు చేసిన మేలులు సాక్ష్యముగా తెలియజేయు ధన్యతనిచ్చినందుకై దేవునికి వందనాలు చెల్లిస్తున్నాను. నాపేరు విజయలక్ష్మి. నన్ను విజయమ్మ అని పిలుస్తారు. మా నానమ్మ పేరు లక్ష్మీ నరసమ్మ. గత 60 యేళ్ళ క్రితమే మా నానమ్మ గార్కి క్రీస్తును గూర్చిన సువార్త ఎవరో దైవజనులు తెలియచేయగా నమ్మకము కల్గింది.

ఆ రోజుల్లో క్రీస్తును నమ్ముకొనిన వారికి భయంకరమైన బాధలు ఎదురయ్యేవి. మా తాతయ్య మా నానమ్మ నమ్మకమును బట్టి చాలా హింసించి బాధించేవారట. ఆమెతో మాట్లాడేవారు కారట. ఆమె చేతితోపెట్టిన ఆహారము తినేవారు కారట. ఆయనకు చాలా ఆస్థి వుండేది. నాలుగు కుటుంబాలు అన్నదమ్ములంతా కలిసి జీవించే ఉమ్మడి కుటుంబముగా నుండేవారు. నానమ్మ అమాయకంగా ఉండి చాలా భక్తితో క్రీస్తును ఆరాధించేవారు. పశువుల పాకలోనికి వెళ్ళి ఏకాతంగా ప్రార్థించేవారు. ఆమెను ప్రభువు కలల ద్వారా, దర్శనాల ద్వారా ఆత్మీయంగా బలపర్చి ఆదరించేవారట. వివేకము నేర్పించి కనిపెట్టి ప్రేమించిన క్రీస్తును జీవితాంతము సేవించి సాక్షిగా నుండేవారని తెలుసుకున్నాను.

ఒకరాత్రి సమయములో ఎవరో తలుపు తట్టారట. ఆమెకు స్వరము వినబడి, "అమ్మా, జాగ్రత్త. తలుపు తీయవద్దు అని తెల్పారట". ఆమె యింట్లో యినప పెట్టినిండా నగలు ఉండేవట. ఆ రాత్రి ప్రక్కయింటిలో దొంగలు వచ్చి తలుపు తట్టి లోనికి వచ్చి బంగారము దోచుకున్నారట. మా నానమ్మ ఎంటనే తనకు వివేకాన్ని బోధించి తలుపు తీయవద్దని క్రీస్తుచెప్పి దొంగల బారినుండి రక్షించారని చెప్పిందట.ఆమె జాలి, కనికరము కల్గిన స్త్రీగా జీవించి పేదవారికి, పిచ్చివారికి సహితము అన్నము పిలిచి పెట్టి ఆదరించేది.

ఆమె ప్రభువు చూపిన దర్శనములో జీవగ్రంథము చూడగా ఆమెపేరు లక్ష్మీ నరసమ్మ అని వ్రాయబడుట చూచి ఆనందించింది, గాని వెంటనే ప్రశ్నించిందట. నా భర్త బిడ్డల పేర్లు కూడా నేను చూడాలి ప్రభువా అని అడిగిందట.

పాతయింట్లో ఆమె పందుకొని ప్రార్ధించు కొన్నపుడు ఒకసారి ఎఱ్ఱ తేలు కుట్టిందట. కేవలము ప్రార్ధించి స్వస్థత పొందింది. మాతాత, మానాన్న మా మేనత్త లంతా నానమ్మ ప్రార్ధనాబలముతో రక్షణానుభవాన్ని పొందారు. మా బాల్యంలో మా నానమ్మ తాతయ్య జీవిత గాధలన్నీ మా నాన్న , మేనత్తలంతా మా తరము వారికి కథలుగా వివరించి భక్తి బీజాలు మా హృదయాలలో నాటారు.

ఈ తరంలో బిడ్డలు ఆస్తిపరులు కావాలి, విద్యావంతులు కావాలని ఆశిస్తున్నారు. క్రీస్తును కల్గిన బిడ్డలుగా జీవించాలని ఆశించే తల్లిదండ్రులుగా నుండాలని నాకు ఎంతో ఆసక్తిగా వుండి ఎక్కువగా ప్రార్ధించు భారము కల్గియున్నాను. ప్రభువే అట్టి వారిగా మార్చాలని నా ప్రార్ధన.

దేవుని రాజ్యాన్ని వెదికినట్లయినా సమస్తమూ పొందగలము. మనకున్న పరపతి, పలుకుబడి, డబ్బు, వైద్యుల అండ యివన్నీ వుంటే సమస్యలు తీరవు. దేవుని ద్వారానే సమస్తమును పొందగలము. నా బిడ్డలకు చదువు, డబ్బు వున్నా లేకపోయినా దేవుని యందు భయము భక్తి కల్గి వుంటే దేవుడే తోడుగా వుండి ఆదుకొని అభయమిస్తాడని నా దృఢనమ్మిక.

నా ప్రార్ధనలన్నిటికీ, నేను నమ్మిన నా ప్రభువు జవాబిచ్చి నన్ను ప్రేమించారు దేవునికే స్తుతి కల్గును గాక. మనము చేసే ప్రార్ధనలలో అవీ యివీ కావాలని అడుగుటయే ఎక్కువగా నుండుట మంచిచి కాదు. దేవుని కొరకు బ్రతకాలి. ఆయనవలె జీవించాలనే కోరిక కల్గిన వారిగా మనముండాలి. రక్షణానుభవాన్ని పొందిన వారంతా ఎన్నోమేళ్ళు పొంది, ప్రార్ధనా పూర్వకంగా అభివృద్ధి పథములోనికి సాగిపోవాలి. నా రక్షణానుభవం ద్వారా నాలో క్రీస్తు స్వభావాన్ని గుర్తించి అందరూ రక్షణ పొందాలనే కోరిక కల్గినవారై క్రీస్తు ప్రేమను రుచిచూడాలని నాకెంతో ఆశకల్గి వుంటుంది.

నా బంధువులలో ముఖ్యంగా నా తమ్ముడు, నాతోడికోడలు రక్షింపబడువరకు భారంతో ప్రార్థించి ప్రయాసపడ్డాను. అన్యుల కుటుంబములో నుండి మా యింటికి చేరిన

తోడికోడలు నా జీవితాన్ని గమనించి, పూజలు పూర్తిగా మానుకొని క్రీస్తును వెంబడించుట కాశించింది. గతంలో సినిమా పాటలు పాడేది. టి.వి.లో సీరియల్స్ చూచి కాలయాపన చేసేది.

క్రీస్తును వెంబడించుట అత్యవసరమని నేను నమ్ముటను బట్టి మా వారంతా క్రీస్తును వెంబడించు వరకు అవిరామంగా ప్రార్థించి, క్రీస్తు సువార్త వివరిస్తూ, అద్భుత సాక్ష్యాలను గూర్చి తరచుగా చెప్పుటను బట్టి వారంతా నామార్గములోకి వచ్చేసారు.

ఈ రీతిగా వారి జీవితాలలోనికి క్రీస్తును ఆహ్వానించే కృప ప్రభువే కల్గించారు. నాలో ఈ లక్షణాలన్నీ, మా నాన్న, మేనత్తలు, మా నానమ్మగారి నుండి తెలుసుకొన్న ఆత్మీయ పాఠాలు గనుక నేను కూడా వారివలె జీవించాను. వారు నా బాల్యంలో జీవించిన రీతిగా నేడు ఏ క్రైస్తవ వ్యక్తి జీవించలేరని నేను దృఢంగా చెప్పగలను.

ఎందుకనగా **యెహోషువా 1వ అధ్యాయములో 8వ వచనములో వివరించినట్లుగా "ఈ ధర్మ శాస్త్రమును బోధింపక తప్పిపోకూడదు. దానిని దివారాత్రమును ధ్యానించిన యెడల నీ మార్గమును వర్ధిల్లచేసుకొని చక్కగా ప్రవర్తించెదవు".**

**ద్వితియోప 6:6 "నేడు నేను నీకాజ్ఞాపించు ఈ మాటలు నీ హృదయములో నుండవలెను. నీ కుమారులకు వాటిని అభ్యసింప జేసి నీ యింట కూర్చుండునపుడు, త్రోవలో నడుచునపుడు, పండుకొనునపుడు, లేచునపుడు వాటిని గూర్చి మాటలాడవలెను. సూచనగా వాటిని నీ చేతికి కట్టుకొనవలెను. నీ కన్నులకు బాసికమువలె నుండవలెను. నీ యింట ద్వార బంధముల మీద నీ గవునుల మీద వాటిని వ్రాయవలెను".**

ఈ వాక్య భాగాల ననుసరించి మా నాన్న, మేనత్తలు నిరంతరము దేవుని మాటలు మాటలాడుట నా బాల్యములో గమనించాను. నా తండ్రి రోజూ వినబడునట్లుగా ప్రార్థించేవారు. మా తోబుట్టువులతో ప్రార్థనలు చేయించే వరకు నిద్రపోనిచేవారు కాదు. ఆ క్రమములో పెంచారు. నా బాల్యములో నేను 3వ తరగతిలో నుండగా నా చెవిరింగులు పోగొట్టుకున్నాను. అమ్మ, నాన్న కోప్పడతారని భయపడ్డాను. అమ్మ గమనించి అరిచింది. నేను మంచము క్రిందచేరి కన్నీటితో దేవున్ని ప్రార్థించాను. ఆ గదిలో యేసుప్రభువు ఫొటోలో నున్నట్లుగా నాకు దర్శనమిచ్చారు. ఆ రింగులు ఎక్కడ దాగివున్నాయో చూపించారు. అది నిజానికి అమ్మ బట్టలలోనే దొరికాయి. దేవునికే మహిమ కల్గుగాక.

నన్ను యింటి దగ్గరగా నున్న ప్రార్థించే మిషనెరీలున్న సమ్మర్ స్కూలులో చేర్పించారు. ఆ రోజుల్లో ఆడపిల్లలకు ప్రత్యేక స్కూలులేదు. మేము 25 మంది ఆడపిల్లలము కలిసి ప్రార్థించాము. మేము చేసిన ప్రార్థనా ఫలితంగా స్కూలురూలు మారిపోయి మాకు ప్రవేశము కల్గినందున యేసయ్య పాటలు, బోధలు నేర్చుకొనే ధన్యత పొందాము.

ఎంతో అమాయకంగా 9వ తరగతి చదివిన వెంటనే నాకు మా మేనత్త కుమారునితో వివాహము జరిగించారు. నా భర్త చాలా కోపముతో నుండేవారు. నన్ను ఎక్కడికీ వేడుకలలో పాల్గొనుటకు అనుమతి యిచ్చేవారు కాదు. బ్యాంకులో ఉద్యోగము చేసేవారు. ప్రతిరోజూ అర్థము లేని గొడవలు వస్తూ వుండేవి.

నాకు 15 సంవత్సరాలుండగా ఆయన 25 సంవత్సరాల వయస్సులో నుండి చాలా పెత్తనాలు చేసేవారు. వారిని మార్చమని, ప్రేమగా మాట్లాడే వ్యక్తిగా వుండాలని రోజూ ప్రార్థన చేసుకొనేదాన్ని. నాకీ పెండ్లి వల్ల దు:ఖము తప్ప ఆనందము లేదు. నాకెందుకు త్వరపడి పెండ్లి చేసారని నా తల్లిదండ్రులను నిందిచలేదు. నా కష్టాలు ఎవరితో చెప్పుకోలేదు. నన్ను బాధపెట్టే మాటలు విని మౌనంగా ఏడ్చుకొనేదానిని. నా భర్తకు బిడ్డల పట్ల ప్రేమ వుండేది కాదు. ఆర్థికపరంగా సరియైన ప్రణాళిక వుండేది కాదు.

**యోబు 5:21 "నోటిమాట వలన బాధ కలుగ కుండా నిన్ను చాటుచేయును"**

అనే వాగ్ధానమును నమ్మాను. మా నాన్నగారికి నేనంటే చాలా ప్రేమ. నాన్న నన్ను చూచి బాధపడేవారు. ప్రభువు నా గర్భాన్ని తెరిచి దీవించారు. నా స్వంత మాటలతో ప్రార్థించుట, వాక్యధ్యానము తప్ప దైవజనుల ప్రసంగాలు గానీ, దేవాలయము దర్శించుట నాకు తెలియదు. మా ఊరికి వచ్చిన ఒక దైవజనుని ప్రసంగాన్ని మొటదటి సారిగా విన్నాను. పాస్టరుగారితో ప్రార్థన చేయించుకొని వాక్యము శ్రద్ధగా వినేదాన్ని.

మనకొరకిచ్చిన ఉద్యోగాలు, గర్భఫలము కొరకు తగినరీతిగా ప్రార్థిస్తున్నామా? నీకిచ్చిన రక్షణను బట్టి స్తుతిస్తున్నావా? నీకు అనేక ఈవులనిచ్చి సంతోషము కల్గించు ప్రభువును ప్రేమించి కృతజ్ఞత చూపుచున్నావా? అని దైవజనుడు చెప్పి పరలోక రాజ్యం మనకిచ్చే మంచి దేవుడని తెల్పేవారు. నేను మంచి దానినని తలంచి మా పితరుల విశ్వాసం గూర్చి సాక్ష్యం చెప్పుకుంటూ వుంటున్నానని నాలో బలహీనతలన్నీ గ్రహింపుతో దేవుని దగ్గర పశ్చాత్తాపపడాలని దైవజనుడు సువార్తను బోధించినపుడు తెలుసుకోగల్గాను.

నా భర్తను బట్టి చిరాకు పడుట తప్పని గ్రహించాను. నవలలను చదివేదాన్ని. అది తప్పు అని తెలుసుకున్నాను. నన్ను పరిశుద్ధ పర్చుండని దీనంగా ప్రార్థించాను. నా భర్త బ్యాంకు పనిలోనున్నప్పుడు దైవజనుని ద్వారా వాక్యము వినేదాన్ని. నానోరు జారి ఎదిరింపుగా మాట్లాడినందుకు దేవుని సన్నిధిలో సరిచేసుకున్నాను. 19 సంవత్సరాల వయస్సులో దేవునితో మంచి సంబంధము కల్గి ఆరాధించేదాన్ని.

నాకు ఒక బాబు, యిద్దరు అమ్మాయిలు కల్గిన రీతిని బట్టి దేవున్ని స్తుతించి వారికి దేవుని గూర్చిన జ్ఞానము కల్గించుటకు చాలా ప్రయాసపడేదాన్ని. పిల్లలకు సినిమా ప్రభావము తాకకుండా ప్రార్థించుకొనుట నేర్పించాను. భర్త సకాలమునకు బిడ్డల ప్రవేటు డబ్బులు యివ్వకపోతే భర్తను నిలదీసి అడిగేదాన్ని. ఆ చిన్నతప్పు కూడా దేవుని ముందు ఒప్పుకొని ప్రార్థించుట ప్రభువు నాకు నేర్పించి సున్నితమైన మనస్సాక్షి కల్గి జీవించాలన్నారు.

నా అవసరాలన్నీ భర్తను అడుగక ముందే దేవునిని అడిగేదాన్ని. కలలో నాకు డబ్బు అందినట్లు చూపించేవారు. ఆ తర్వాత నా భర్త నాకు అవసరమైన డబ్బు యిచ్చేవారు. నా అవసరాలన్నీ ప్రభువే నాకు తీర్చి సంతోష పెట్టేవారు. నా యింటిప్రక్క వారికి క్రీస్తును గురించి చెప్పుట ద్వారా వారిని ప్రభువు చెంతకు నడిపించాను. ఆ తర్వాత నా జీవితాన్ని గమనించి నా భర్త కూడా రక్షణానుభవానికి వచ్చారు. తాళ్ళూరు అనే ఊరిలో ఉద్యోగము చేయు రోజుల్లో నేను ధైర్యంగా మైకునుపయోగించి వీధులలో సువార్త ప్రకటించుట ప్రభువే నాకు నేర్పించారు. నాతోటి వారికొరకు, బంధువుల అవసరాల కొరకు ప్రార్థించి అనేక అద్భుతాలు చూడగల్గాను. నాతోడికోడలు హన్నా రక్షణ తర్వాత ఆమె ముగ్గురు బిడ్డలు ఆడపిల్లలు కల్గినందున మగబిడ్డకై ఆశించి ప్రార్థించింది. ఆమె తమ్ముడి భార్య ద్వారా మగబిడ్డనిస్తానని ప్రభువు తెల్పారు.

నేనుకూడా "బాబు కావాలని ప్రార్థించాను. ప్రభువా, నాతో సూటిగా మాట్లాడండి అని ప్రార్థించాను. ఆ రోజు క్యాలండరు చూచినప్పుడు ఆ రోజు వాక్యము ద్వారా సూటిగా నాతో ప్రభువు మాట్లాడిన మాటగా గ్రహించాను

**సంఖ్యా 23:19 "మాటయిచ్చి నెరవేర్చుకుందును"** అనే మాట మాకు అభయాన్నిచ్చింది. ప్రభువు మాట ప్రకారము ఆమెకు బాబు కల్గాడు. నేడు వారి బిడ్డలను ప్రభువు బాగా దీవించారు. సునీత అమెరికా చేరుట, ఆమె ద్వారా ప్రార్థనా సెల్‌తో పరిచయాలు మా అందరి సాక్ష్యాలు అనేకులు వినగల్గు అవకాశాలు ప్రభువిచ్చారు.

హన్నా కుమారుడు మంచి యింజనీరుగా స్థిరపడగా, నా తమ్ముడి కుమార్తెతో వివాహం ప్రభువే ముందుగా బయలుపరచి ఘనంగా జరిగించారు. మా కులటుంబాలలో బిడ్డలంతా విశ్వాస జీవితంలో జీవించే గొప్ప ధన్యతనిచ్చారు. ఏది అడిగితే అది నాకిచ్చి ప్రార్థనలన్నిటికీ జవాబులిచ్చి నన్ను సంతోషపెట్టుచున్నారు.

నా భర్తకు కిడ్నీ బలహీనమై అపోలో ఆస్పత్రిలో చేరారు. ప్రభువా కాకినాడలో నేను నీ సేవ ఘనంగా చేయాలంటే నీవు నా భర్తను బ్రతికించాలని భారంతో ప్రార్థించాను. ప్రార్థనా సహవాసంలో కొందరు సమాధిపెట్టె కన్పిస్తుందని చెప్పి నిరుత్సాహం కల్గించేవారు. డాక్టర్లు "అమ్మా, నీ పిల్లలంతా సెటిల్ అయ్యారా?" అని అడిగేవారు. డయాల్సిస్ చేయనీయకుండా ఆరోగ్యమియ్యమని అడిగిన ప్రార్థనా ఫలితంగా ఆ స్థితి రానీయలేదు. వాక్యము ద్వారా మరలా మాట్లాడారు.

**2వ రాజులు 21 లో ఎలీషా చేసిన అద్భుతాలలో ఈ నీటిని బాగుచేయగలనని దేవుడు చేసిన అద్భుతమును బట్టి మరణము నీ దరి చేరదని సూటిగా తెల్పారు.**

**నిర్గమకాండము 12:13 లో** వాగ్దానము ఆధారంగా కన్నీటితో ప్రార్థించాను. రాయ వేలూరు వెళ్ళాలని ప్రయత్నాలు చేసారు. అంతదూరము వెళ్ళలేను ప్రభువా అని ప్రార్థించాను. పాస్టరుగారు చర్చిలో అందరికీ చెప్పి ప్రార్థనలు జరిగించారు. ఏ కీడు, హాని కలుగదు. ప్రభువు మనమధ్య అద్భుతము చేయగలరని చెప్పారు. అమెరికాలో కిడ్నీ స్పెషలిస్టు గారితో రిపోర్టుల ద్వారా సంప్రదించే అనుకూలత కల్పించారు. **నీ గుడారములో ఏ తెగులు సమీపించదని ప్రభువే తెల్పారు.**

నా భర్త బలహీనుడయినను సజీవంగా నిలిచి దేవున్ని స్తుతించారు. నా భర్త పెన్షను కొరకై ప్రార్థించగా అది శాంక్షన్ కాలేదు. నేను ప్రార్థించి ఎడారిలో సెలయేర్లు పుస్తకాన్ని చదువుచుండగా ఆ రోజు నాకిచ్చిన సందేశములో "పెన్షన్ రాలేదని తలంచవద్దు ఆలస్యమయినా బాధపడవద్దు అని తెల్పారు.

ప్రభుని మాటలు బంగారు మూటలు. మాకు పెన్షన్ వచ్చు రీతిగా ప్రభువు దీవించారు. నా భర్తను బ్రతికిస్తానన్నారు. నేటికి 6 సంవత్సరాలు నా భర్తను ఆరోగ్యముతో నుంచారు. పెన్షన్ లోటు లేకుండా దీవించారు. నా బిడ్డలకు మంచి సంబంధాలు స్థిరపరిచారు. మా యిద్దరికీ మంచి ఆరోగ్యమిచ్చి ఆశీర్వాదించారు. ఆయనను నమ్ముకొనుటలో సరిపోదు గాని ఆయన చిత్తప్రకారము జీవించుట ప్రతి విశ్వాసికి అవసరము.

ప్రతి విషయము గురించి నమ్మకంగా ప్రార్థించాలి. క్రీస్తుయేసుకు కల్గిన సాత్వీకమైన మనస్సు కల్గి ఆయనను పోలి జీవించాలి. ఆత్మ ఫలాలను ఫలించాలి.

బాల్యములో నానమ్మ విశ్వాసమును నమ్మిన నాకు నేటివరకు ఆ జీవితంలో జీవించే ధన్యతనిచ్చారు. మరణించిన మేలని వివాహ జీవితాన్ని యిష్టపడక దు:ఖించిన నన్ను ఆదరించి మంచి ఆత్మలను సంపాదించుకొనే జాలరిగా తీర్చిదిద్దారు.

నా స్వకీయులకు, నా భర్తకు రక్షణభాగ్యం లభించుటకు నన్ను ఒక సాధనముగా వాడుకొని నన్ను విజేతగా నిలిపారు. ఎన్నికలేని నన్ను ప్రభువు కొరకు బలమైన సాక్షిగా మార్చి నా సాక్ష్యము అనేకులకు అందునట్లుగా పరిచయము చేసిన అమెరికాలో పెనూయేలు ప్రేయర్ సెల్ పెర్సిస్ గార్కి, శ్రీదేవి ప్రేయర్ సెల్ సభ్యులకు నా కృతజ్ఞతలు. ప్రభువు మనలనందరినీ దీవించి వాడుకొనును గాక. ఆమెన్. హల్లెలూయ.

# ప్రభువునకు స్తుతి కృతజ్ఞతలు




ప్రభుని దర్శనమును బట్టి కొనసాగిస్తున్న

పుస్తక పరిచర్యలో మీ అందరి ఆదరాభిమానాలు,

ప్రోత్సాహము నన్ను ఆనందింపచేస్తున్నాయి.

మీకు నా నిండు కృతజ్ఞతలు, దైవాశీస్సులు...

మీకు నిత్యము ఉండుగాక...

మా కుటుంబము కొరకు ప్రార్థించమనవి...

సదా మీ సేవలో... గ్రేస్ విజయ



శ్రీమతి గ్రేస్ విజయ గారు దేవుని పిలుపుకు లోబడి ఆధ్యాత్మిక గ్రంథాలు ప్రచురణలో ముందుకు కొనసాగుతున్నారు. దేవుడు చేసిన అద్భుత రక్షణ, స్వస్థత, అద్భుత సాక్ష్యాలను మనముందుకు తీసుకవచ్చే ఈ పరిచర్య ఎంతో ప్రశస్తమైనది. బైబిలు గ్రంథంలోవున్న శక్తివంతమైన మాట 'యేసు క్రీస్తు అందరికి ప్రభువు'. సోదరి గ్రేస్ విజయగారి పుస్తకాలలోని సాక్ష్యాలు ఈ వాక్యాన్ని ఎంతగానో బలపరుస్తాయి. ప్రకటన గ్రంథంలో పరలోకము చిత్తరువు మన కళ్లకుకట్టినట్టు చూస్తాము. ప్రతి వంశంలోనుండి, ప్రతి ప్రజలోనుండి, ప్రతి జనంలోనుండి, ప్రతి బాషలో నుండి వచ్చిన ప్రజలను మనం చూస్తాము. ఈ సాక్ష్యాలు మీరు చదువుతూ వుండగా మీకు పరలోకపు అనుభూతి కలుగుతుంది. వయసు పైబడుతున్నా లెక్క చేయకుండా ప్రియులు శ్రీ సుందరరావు గారు, శ్రీమతి గ్రేస్ విజయగారు ద్వారా దేవుడు జరిగిస్తున్న ఈ పరిచర్యద్వారా సమస్తమైన మహిమ ఘనత ప్రభావాలు యేసయ్యకే సమర్పిస్తూ...

మీ సోదరుడు

దేవ దండల

స్పందన, విజయవాడ